శ్రీ విష్ణు సహస్రనామము


(పదవ భాగము 901-1043 నామ వివరణ)



మాస్టర్ కె. పార్వతీకుమార్

శ్రీ విష్ణు సహస్రనామము

(పదవ భాగము 901-1043 నామ వివరణ)



మాస్టర్ కె. పార్వతీకుమార్

ధనిష్ఠ

ధనిష్ఠ

స్వచ్ఛంద సేవా సంస్థ

"ధనిష్ఠ" అనగా ధనపూరిత దివ్యవాయువు. ధనమనగ దివ్య సంపద. అది కేవలము డబ్బుకాదు. డబ్బుతో సంపదను కొలువ లేము, కొనలేము. సంపద జీవన వైభవమునకు సంబంధించినది. మన శ్రుతులలో అగ్ని, వాయువు, ఇంద్రుడు, బృహస్పతి యిత్యాది దివ్య ప్రజ్ఞలను ధనమనిరి. ఆర్ష విజ్ఞానమే నిజమైన ధనము. అట్టి ధనమును కూర్పుచేసి వ్యాప్తి చేయుటకు "ధనిష్ఠ" 1992లో జన్మించినది.

"ధనిష్ఠ" మాస్టర్ పార్వతీకుమార్‌గారి వాక్కును సి.డి., ఆడియో, వీడియో క్యాసెట్ల రూపములోను, పుస్తకముల రూపము లోను భద్రపరచి సత్సాధకుల కందించునట్టి యజ్ఞార్థకర్మను చేపట్టినది.

"ధనిష్ఠ" ఒక చక్కని గ్రంథాలయమును, ధ్యాన మందిరమును సద్దోష్ఠికై వలసిన వాతావరణమును – "జగద్గురు మందిరము"గ ఏర్పరచి, ఆసక్తి కలవారికి ధ్యానము, స్వాధ్యాయము నేర్పుచున్నది.

ముందుగా ఒక మాట

శ్రీ గురుదేవులు, మాస్టర్ కంభంపాటి పార్వతీకుమారుగారు, 8-8-1992, ఏకాదశి, స్థిరవాసరము (శనివారము) శ్రీ విష్ణుసహస్రనామ వివరణ అనే జ్ఞానయజ్ఞాన్ని ప్రవచన రూపములో, విశాఖనగరములో రాధామాధవ ప్రాంగణమున ప్రారంభించి, కొన్ని సంవత్సరములు కొనసాగించిరి. వారు శ్రీ విష్ణుసహస్రనామము లో గల అన్ని నామములకు వివరణ ఇచ్చినప్పటికి, కొన్ని నామముల వివరణలు అందుబాటులో లేవు. అందుబాటులో ఉన్నవరకు ముద్రణ రూపము లో అందజేయవలెనన్న సదుద్దేశము శ్రీ గురుదేవులకు విన్నవించుట జరిగినది. వారు ముందుగా మన మాసపత్రిక 'నా వాణి' లో నామముల వివరణ ప్రచురించమనగా, శుభకృత్ ఉగాది సంచికతో ధారావాహికగా అవి ముద్రణ రూపము దాల్చుట మొదలైనది. వారి అనుమతి, ఆశీర్వచనములతో శ్రీ విష్ణుసహస్రనామముల వివరణ e-Books రూపముగా సాధకుల కొరకు తీసుకుని రావడము జరుగుచున్నది. ఈ ప్రయత్నములో భాగమే ఈ పదవ భాగము.

ఈ పుస్తకములలో శ్రీ గురుదేవుల ప్రవచనములు వినబడినంత, అతికొద్ది సవరణలతో అందజేయడమైనదని గమనించగలరు. ప్రతి శ్లోకములో నామముల విభజనకు మాస్టర్ EK గారు ఆంగ్లములో వ్రాసిన విష్ణు సహస్రనామమును ప్రాతిపదికగా తీసుకొనుట జరిగినది. 901 నుండి నామములను చివరిది అయిన 10వ భాగములో ప్రచురించడము జరిగినది.

ఈ వివరణలు పుస్తకరూపముగా వెలుగొందడానికి కృషి చేసినవారందరికీ అత్యంత మరపురాని, ఆనందకరమైన అనుభూతులు కలిగించినవి. ఈ యజ్ఞములో పాలుపంచుకున్న వారందరికి తమ ఆశీస్సులు అందించగలరని మాస్టరుగారికి మా ప్రార్థన. ఈ పుస్తకము చదివిన వారందరికి గురుదేవులు అందించిన అమూల్యమైన విషయములు అత్యంత సులభముగా హృదయస్థమై, స్ఫూర్తినిచ్చి, సాధనకు మరింత ఉన్ముఖులను జేయగలవని మా నమ్మకము.

శ్రీ పరాభవ నామసంవత్సరము 7-11-2026 స్థిరవాసరము, శ్రీ గురుదేవుల 82వ జన్మదిన సందర్భమున రాధామాధవము, జగద్గురు మందిరములో, శ్రీ విష్ణుసహస్రనామ వివరణ పదవభాగము విడుదల కావడము దైవనిర్ణయమే అని భావించుచున్నాము. శ్రీగురుదేవులు మనకు అందించిన ఈ వివరణయే మనందరి అక్షరాంజలిగా, హృదయాంజలిగా వారి పాదపద్మములకు సమర్పితము.

ధనిష్ట

ఉపోద్ఘాతము

విష్ణుసహస్రనామ స్తోత్రం చేసేటప్పుడు విష్ణుమూర్తి యొక్క అవతరణము మన దృష్టి యందు నిలబడాలి. నారాయణ మంత్రం చేసుకునేటప్పుడు ఆదిశేషుడు, దాని పడగ క్రింద వున్న నారాయణమూర్తి, నారాయణమూర్తి యొక్క వర్ణనము, ఆయన యొక్క రూపము, రంగు, శబ్దముల మీద దృష్టి ఉంచాలి. చూపుడు వేలంత రూపాన్ని మనసుకు తెచ్చుకోవాలి. అలా తెచ్చుకుంటే నీలమేఘశ్యామలమైన ఆయన శరీరము కనిపిస్తుంది. ఆయన ధరించిన ఆభరణములన్నీ బంగారు రంగులో వున్నట్లుగా కనిపిస్తాయి. క్రమముగా ఆయన ముఖము, బాహువులు, వక్షస్సు, పాదములు మనకి కనిపిస్తాయి. ఉత్తరీయంతో కప్పి ఉన్న భాగాలన్నీ మిసమిసలాడే మేలిమి బంగారంతో వున్న ఆభరణాలుగాను, వస్త్రములుగానూ దర్శించాలి. కప్పివుండని భాగము తేజోవంతమైన నీలమైన రంగుతో భావన చేసుకోవాలి. నారాయణమంత్రం చేసుకొనేటప్పుడు, మస్తకం నుండి పాదం వరకు, భగవంతుని దర్శనం చేయాలి. ఆ తరువాత విష్ణుసహస్రనామం చదువుకునేటప్పుడు విష్ణువు యొక్క రూపం మన హృదయం నందు నిలబడడానికి అవకాశం వుంటుంది. ఆ అవకాశం ఏర్పడిన తర్వాత, విష్ణువు తన విశాలమైన నేత్రాల నుండి మనను చూస్తున్నట్లుగా భావన చేస్తూ, ఎంత సేపు వుండగలిగితే అంతసేపు ఉండాలి. ఎక్కువ సేపు ఉండలేము. మహా అయితే 2-3 నామాల వరకు వుండవచ్చును. ఆ తరవాత ఉండలేము. మళ్ళీ తెచ్చుకొంటూ వుండాలి. ఇది ఒక సాధన! అప్పుడు లోపల నుండి వికాసం రావడానికి అవకాశం వుంటుంది. ఎందుకంటే మనలో వున్న నిజస్వరూపం అంటే మన అసలు స్వరూపం విష్ణు స్వరూపమే కనుక! మనల్ని అంగుష్ట మాత్రంగా (చూపుడు వేలంత) విష్ణుమూర్తి రూపాన్ని హృదయమునందు ధ్యానము చేయమని భాగవతం షష్ఠమస్కంధంలో చెప్తారు. మనకి హృదయమునందు సింహము అనే భాగము వున్నది. ఉదరవితానాన్ని సింహాసనమని కూడా చెప్తారు. ఆ సింహాసనం మీద విష్ణుమూర్తి ఉన్నట్లు ధ్యానం చేసుకుంటున్న కొద్దీ, పెరుగుతున్నట్లుగా భావన చేయాలి. ఆయన నుండి వచ్చే నీలము, హిరణ్మయము అయిన కాంతులు మన హృదయాన్ని అంతా నింపుతున్నట్లుగా ధ్యానం చేసుకోవాలి. మన దేహమంతా పూర్తిగా నిండిన తరువాత, అవే కిరణములు బహిః ప్రపంచంలో వ్యాపనం చెందుతున్నట్లుగా

ధ్యానం చేసుకోవాలి. ఇలా చేసుకోవాలంటే ముందు నారాయణ మంత్రం వుంటుంది.

నారాయణ మంత్రంలో మన శిరస్సు, నేత్రములు, శ్రవణేంద్రియములు, ప్రాణేంద్రియములు, గొంతు, భుజస్కంధములు, బాహువులు. హృదయము, ఊపిరితిత్తులు, రక్తనాళములు, గుండె, అలా దిగి వెడుతూ మొత్తం దేహమంతా నారాయణ మంత్రంతో ప్రతిష్టాపన చేసికోవాలి. దేహమంతా నారాయణ భావనలో నింపాలి. అలా నింపిన తరువాత విష్ణుసహస్రనామం చేసుకునేటప్పుడు, నారాయణతత్త్వంతో నిండిన ఈ దేహంలో కేంద్రము నందు ఆదిశేషువు వెనకాల పడగ పట్టి ఉన్నచూపుడు వేలంత భగవంతుని ప్రతిమను, చతుర్భుజుడై ఒక చేతిలో శంఖము, ఒక చేతిలో చక్రము, ఇంకొక చేతిలో కమలము, మరియొక చేతిలో గద ధరించి నిలబడిన భగవంతుని, వక్షస్థలము నందు కౌస్తుభమును ధరించిన వాడిని, చిరునవ్వు గలిగిన వాడిని ఆవాహన చేసుకోవాలి. ఈ విధంగా చదువుకున్నట్లయితే జరగవలసిన మార్పులు మనలో సవ్యంగా జరుగుతాయి. ఈ భావనలో విష్ణుసహస్రనామం చేసుకోవాలి. లేకపోతే tape వేస్తే వెళ్ళిపోయినట్లు 1008 నామాలు అయిపోతాయి. ఈలోగా మనసు ఎక్కడో తిరిగి వస్తుంది. తిరిగి రావడం మనకి అభ్యాసమైన విషయం కాబట్టి, విష్ణుసహస్రనామం చేసేటప్పుడు మళ్ళీ మనసును అక్కడికి తెచ్చుకోవడమనేది అభ్యాసంగా మొదలు పెట్టి మనం ఆ రూపాన్ని మళ్ళీ దర్శనం చేయడం మొదలు పెడితే, అప్పుడు మనలో భక్తి ఉద్భవించడానికి అవకాశం ఏర్పడుతుంది. అప్రమత్తత వస్తుంది. శ్రద్ధ కలుగుతుంది. విన్న విషయాలు మర్చిపోవడం వుండదు. చెప్పిన విషయాలు గ్రహించడంలో లోటు ఉండదు. సహస్రనామం అనే సంప్రదాయము మనకి ఋషులు ఏర్పరిచారు. ఈ సహస్రనామములలో ముఖ్యమైన విషయము, ఏ నామము అయినా భగవంతుడిదే అని తెలుసుకోవడము. నామము ఏదైనా భగవంతుడిదే!. 'సహస్ర' అనే సంఖ్య ఒకటి తరువాత మూడు సున్నాలుగా, 1000, మనకి కనిపిస్తుంది. భూః, భువః, సువః లోకాలుగా ఉన్న సృష్టి మూడు సున్నాలైతే, ఆ మూడింటిని వ్యాపించినది ఒకే ఒక తత్త్వం - 'ఒకటి'. ఒకటి లేకపోతే ఆ మూడు సున్నాలకి విలువ లేదు. ఒకటి ఉంటే ఆ సున్నాలకి విలువ ఉన్నది. అందుచేత ఎవరి వలన పదార్థమయము, శక్తిమయము, ప్రజ్ఞామయము అయిన లోకములు ఏర్పడ్డాయో, (Matter, Force, Consciousness అంటారు ఆంగ్లంలో) ఆ తత్త్వం ఆ మూడు లోకాలు వ్యాపించి ఉన్నది. మూడు లోకములలో వ్యాపించిన రకరకములైన రూపములకు నామములున్నాయి. ముందు రూపం ఏర్పరచి, తరువాత నామాన్ని అందించారు. రూపం లేకుండా నామం లేదు. ఒక నామం

ఉందంటే ఆ రూపం ఉందిట అని అర్థం. అందుచేత మూడు లోకములలో ఉన్న నామాలన్నీ భగవంతుని కీర్తించడమే! భగవంతుని సంబోధించడమే! ఎందుకంటే రూపాలన్నీ భగవంతుడివే! భగవంతుడు కాని రూపం ఏదీ లేదు. అదీ భారతీయ జ్ఞానమునకు సంబంధించిన సమన్వయము. ఋషులు సమగ్రమైన అవగాహన పొంది, భగవంతుడు కానిది ఏమీ లేదు అని మనకు తెలియజేసారు. దేనిని చూసినా భగవంతుడుగానే చూడడం. మూడు లోకాలలో ఉండే సమస్త రూపములు, వానికి ఏర్పరిచిన నామములుగా కనబడుతున్నదీ దైవమే! సృష్టి అంతా కూడా నామరూపాత్మకము అంటారు. అంటే రూపు ఏర్పడి, వాటిని గుర్తించడం కోసం ఒక నామం. పురుషసూక్తంలో ఏ విధంగా సృష్టి ఏర్పడింది, ఆ ఏర్పడిన సృష్టిలోని ప్రతి విషయానికి తరువాత ఎలా నామకరణం చేసారు, అనే విషయం తెలియపరుస్తారు. ఆరాధకులకు తెలియవలసిన ఒక ముఖ్య విషయము 'సమస్తమూ దైవమే! సమస్త రూపములు దైవమే! ఆ రూపమునకు ఉన్న నామం కూడా దైవమే!'. ఇది దీక్ష. ఈ దీక్ష పట్టి సహస్రనామాలు పారాయణ చేసుకోవాలి. ఏది చూసినా అందులో ఆ మొత్తం ఉంది అని తెలియాలి. నువ్వు కోరుకొని చూసిన దాంట్లోనే కాదు. కొన్ని రూపాల్లో దైవాన్ని చూస్తాం, కొన్ని రూపాల్లో దైవాన్ని చూడం. కొన్ని నామాల్లోనే దైవాన్ని చూస్తాం, కొన్ని నామాల్లో దైవాన్ని చూడం అనేది భారతీయ సమగ్ర జ్ఞానం కాదు. అటువంటి జ్ఞానాన్ని అందించిన ఏకైక భూమి భారత భూమి. అది మనం గుర్తించాలి.

జీవునకు రుచి ఉన్నది, జీవుని రుచి వెలుగు. కిరణం! అందుచేత భగవత్ ఆరాధన చేస్తున్నప్పుడు మనలో స్ఫూర్తి పెరిగి దైవం మీద రుచులు పెరుగుతూ ఉంటాయి. ఆ రుచులు పెరిగిన కొద్దీ వైవిధ్యంగా, వైభవోపేతంగా దైవాన్ని వర్ణన చేసాం, కీర్తనలు చేసాం, స్తోత్రం చేసాం. దైవము యందు ఆసక్తి వలన దైవం మీద రుచులు పెరిగి రకరకములుగా ఎన్నెన్నో ఆరాధనలు చేసాము. అవన్నీ మన పురాణాల్లో ఉన్నాయి. ఈ విధంగా ఇచ్చిన సహస్రాలు మనం రోజూ పారాయణము చేయాలనుకుంటే మనకు ఒక దీక్ష ఉన్నది. ఏంటంటే, కనపడుతున్నదంతా దైవముగా భావన చేయడము. అలా భావన చేస్తే సహస్రనామం సఫలీకృతం అవుతుంది. సిద్ధిని ఇస్తుంది. దైవానుభూతిని ఇస్తుంది. అలా కాక మన వంటింట్లో గూడులో పెట్టుకున్న చిన్న ప్రతిమ దేవుడనుకొని, అది కాక మిగతాదంతా వేరు అనుకునే వాళ్ళకి సహస్రనామం ఫలించదు. ఇది ముఖ్యమైన విషయం.

సహస్రం అనే పదం, అదొక మంత్రం. దీన్ని (శిరస్సుపైన) 'సహస్రారము' అంటారు. 'సహస్రదళ పద్మము' అంటారు. 'పరిపూర్ణ స్థితిని' సహస్రము అంటారు. అది ఒక మంత్ర శాస్త్రం. 'స' అనే అక్షరానికి; 'హ'అనే

అక్షరానికి; మళ్ళా 'స్ర' అనే అక్షరానికి చాల వివరణ ఉన్నది. అది అలా ఉండగా సహస్రము అంటే 1000 అనే పద్ధతి తీసుకుంటే, మూడు లోకములూ వ్యాపించిన ఒకే ఒక తత్వానికి సంబంధించినది అనేది ఒక భావన. కాబట్టి ఈ మూడు లోకములకు సంబంధించిన ఏ రూపము అయినా సరే అది దైవముదే ! దెయ్యము అయినా దైవము యొక్క రూపమే! అని తెలిస్తే దెయ్యం ఏమి చేయదు. పులైన, పామైన, తేలైన, నీ శత్రువైనాను. నువ్వు అనుకోవడం బట్టి శత్రువు! శత్రువులో కూడా దైవము ఉన్నాడు అనుకుంటే అంత బాధించదు. మహాత్ములు అట్లాగే జీవించారు. పులిలో కూడా దైవముందని తెలిసిన వారే పులిని పిల్లి వలే చక్కగా సాకారు. పాములో దైవము ఉందని తెలిసిన వారే పామును సాకారు. పిచ్చి ఏనుగులో దైవమును దర్శించిన బుద్ధునికి ఏనుగు చిన్న కుక్కపిల్లలాగ పక్కన వచ్చి కూర్చుంది. ఇలా సమస్తమును దైవాన్ని దర్శించే పద్ధతి కోసం సహస్రనామాలు ఇచ్చారు. ఆరాధన అలా చేసుకోవాలి.

విష్ణుసహస్రనామ స్తోత్రం చేసేటప్పుడు ఇలాగ కూడా భావన చేసుకోవచ్చు. నక్షత్రములు 27. ఒక్కొక్క నక్షత్రానికి 4 పాదములు. ఒక్కొక్క పాదం ఒక్కొక్క శ్లోకం చొప్పున మొత్తం 108 శ్లోకాలు. మనం 4వ శ్లోకం చదువుతున్నామంటే మొదటి నక్షత్రంలోని నాల్గవ పాదంలోనే ఇంకా వున్నామని అర్థం. ఉదాహరణకు అశ్విని నక్షత్రం వాళ్ళు, వాళ్ళ యొక్క పాదాన్ని బట్టి దాని అర్థం ఎక్కువగా ఆకళింపు చేసుకొనవచ్చును. కాలం సద్వినియోగం అవడములో భాగంగా విష్ణుసహస్రనామం చదవడం 20 నిముషాలు పడుతుంది. 20 నిముషాలు సద్వినియోగం అవకుండా, విష్ణుసహస్రనామం కొన్ని వందల సార్లు చదివి ఉండవచ్చును. ఎందుకంటే tape చదువుతుంది. మనమూ చదువుతాము, మనం చదువుతున్నాము అనుకున్నప్పుడు మనం వినాలి. మనం వినాలి అంటే ఒక పద్ధతి వుంది. ఆ పద్ధతి ప్రకారం వినకపోతే ఏమీ కాదు. విష్ణుసహస్రనామం మంత్రం అనుకుంటే, మంత్రం శబ్దానికి సంబంధించినది. దాని యొక్క యంత్రం విష్ణువు యొక్క రూపం! మనం చదివే ప్రక్రియ అంతా కూడా తంత్రం. కాబట్టి ఈ తంత్రమంతా ఆ యంత్రాన్ని లోపల ఆవాహన చేసుకొని, శబ్దాన్ని వింటూ చదవకపోతే, దాని యొక్క వినియోగమేమీ మనయందు జరగదు. అంటే విష్ణువు యొక్క సాన్నిధ్యము, దానికి సంబంధించిన వికాసము, మన యందు కలగడానికి అవకాశం వుండదు. అందుకనే భగవంతుడు లేడే అనే భావన కలుగుతుంది. అందుకే ఏళ్ళ తరబడి విష్ణుసహస్రనామం చదివిన వాళ్ళలోనూ మార్పు రాదు. వాళ్ళ ఆలోచనలలోనూ మార్పు రాదు. ఈ మొత్తం కార్యక్రమం మన మనస్సు, ఇంద్రియములు, శరీరములలో వుండే రుగ్మతలు, మాలిన్యములు అన్నీ క్షాళనమై, భగవంతుని అనుభూతి చెందే

అర్హత సంపాదించుకోడానికి చేస్తున్నాం. ఆటువంటి ధృఢనిశ్చయం, resolution ఉండాలి. లేకపోతే 20 నిముషాలు దండగ. విష్ణువు యొక్క రూపము యంత్రము, విష్ణువు యొక్క నామము మంత్రము, మనం ఉచ్చారణ చేసి వినడం తంత్రము. ఈ మంత్రము, యంత్రము, తంత్రము కలిసినప్పుడే అది ఒక త్రిభుజాకారమైన వలయంగా ఏర్పడి, ఒకదాని నుండి మరొక దానికి శక్తి ప్రసారం (energy supply) వుంటుంది. లేకపోతే దైవశక్తి యొక్క ప్రసారానికి ఒక circuit complete కాదు. ఆ circuit complete కావాలంటే, ఏది చదువుకున్నా అలాగే చదువుకోవాలి.

విష్ణు సాన్నిధ్యము కొరకు, విష్ణు సాయుజ్యము కొరకు, విష్ణు సామీప్యము కొరకు, విష్ణు సారూప్యము కొరకు విష్ణువును మనం లోకంలో దర్శనం చేస్తూ ఉండాలి. దర్శనం చేస్తూ ఈ సహస్రనామాలను అవగాన చేసుకుంటూ ఉండడం వల్ల మనకి ఆశయ సిద్ధి కలుగుతుంది. విష్ణు సహస్రనామము అధ్యయనం చేసే వారందరూ కూడా లోకాన్ని విష్ణువుగా చూడటం అనే సాధన మరవకుండా చేస్తూ ఉండాలి. ఎందుకంటే లోకం రూపంలోనే విష్ణువు ఉన్నాడని 'విశ్వం విష్ణుర్వషట్కారో' అని విష్ణు సహస్రనామ ప్రారంభము లోనూ, 'విష్ణుండు విశ్వంబు విష్ణుని కంటెను వేరేమియును లేదు' అని భాగవతంలోనూ చెప్పబడినది కదా! లోకాన్ని చూస్తున్నప్పుడు విష్ణువుని చూస్తూ ఉండడం వలన మాత్రమే మనం విష్ణు దర్శనానికి క్రమశః అర్హత సంపాదించుకుంటాం. అలా చూడకుండా విష్ణుసహస్రనామం యొక్క అవగాహన చేసుకుంటే అది విజ్ఞానంగా మిగిలిపోతుంది తప్ప మన యందు సత్యమై నిలవదు. మనయందు దాని యొక్క అనుభూతి పరిపూర్ణం కాదు. దివ్యమైన విషయములను తెలుసుకోవడం ద్వారా మనకు వికాసం వస్తుంది. అందులో ఏమీ సందేహము లేదు. వచ్చిన వికాసం నిలబడాలంటే దివ్య కార్యక్రమాలలో పాల్గొన్నప్పుడు, కార్యక్రమానికి కార్యక్రమానికి మధ్య ఉండే interval లో, ఎంత వరకు విష్ణువుని చూస్తే అంత continuity ఉంటుంది. ఆ interval లో మనం విష్ణువుని చూడకపోతే continuity ఉండదు. మళ్లీ విష్ణుసహస్రనామం class లో మాత్రమూ మనకు మళ్లీ విష్ణు అందరి రూపాల్లో ఉంటాడు, అన్ని రూపాల్లో ఉంటాడు అన్నది నామాల అర్థాలలో కనిపిస్తూ ఉంటాడు. మనం లోకంలో చూడడం మొదలు పెడితే నెమ్మదిగా అక్కడో point, ఇక్కడో point ఉన్న వాటి మధ్య continuity ఏర్పడి, ఎప్పుడూ విష్ణువు యొక్క సాన్నిధ్యాన్ని అనుభూతి చెందడానికి అవకాశం ఉంటుంది. అది సాధన! ఇది ఆ సాధనకు ఏర్పరచుకునే సాధన సంపత్తి. ఇక్కడ మనం implements పోగేసుకుంటున్నాం. అవి మన life లో workout చేసుకోవాలి. లేకపోతే ఇది కేవలం ఒక విజ్ఞానంగా

కొంతకాలమే ఉంటుంది. ఎందుకంటే ఇప్పుడు ఉండే వికాసం బయటకు వెళ్ళి పనులు చేసుకుంటూ ఉంటే, పనుల రూపంలో ఉన్న భగవంతుణ్ణి, ఎవరితో పనులు చేస్తున్నామో వారి రూపంలోని భగవంతుణ్ణి, ప్రదేశంలోని భగవంతుణ్ణి చూడకపోవడం వల్ల వికాసము తగ్గుతుంది. వికాసం తగ్గిన కొద్దీ ఇంకొంచెం తక్కువగా చూస్తాం. ఇంకొంచెం తక్కువ చూసిన కొలది ఇంకా వికాసం తగ్గుతుంది. మర్చిపోతాం. విష్ణువుని చూడడం మరిచిపోవడం తో విజ్ఞానం కూడా మాయమైపోతుంది. హరించుకుపోతుంది.

విష్ణుసాన్నిధ్య రూపంలో మనల్ని ప్రతి సన్నివేశంలోనూ ఉత్తీర్ణులను చేయాలంటే మనం లోకాన్ని విష్ణువుగా చూడాలి. విష్ణువుని కొంచెం చూడడం మొదలు పెట్టి, అక్కడి నుండి కొంచెం ఎక్కువగా చూడటం అయ్యి, ఇంకా కొంచెం ఎక్కువ చూడ్డం, ఇంకొంచెం ఎక్కువ చూడ్డం మొదలు పెట్టాలి. ఇంక వేరే పద్ధతి లేదు. విష్ణు రూపంగా సృష్టి అంతా చూడ్డం అనేది ఒక essential prerequisite for experiencing Vishnu. ఇది ఒక practical instruction క్రింద తీసుకుని మనం వీలున్నంతవరకు ఆచరణలో పెట్టడానికి ప్రయత్నం చేయాలి. ఆచరణలో పెడితే తప్ప మనలో మార్పు రాదు. లేకపోతే వినడం- మర్చిపోవడం, వినడం- మర్చిపోవడం అయ్యి, మనం అట్లాగే ఉంటాం. ఎన్నిసార్లు భగవత్ తత్వ విషయాలు విన్నా మనం మారక పోవడానికి కారణం ఏమిటో? చెప్పినవి వినడము, శ్రద్ధతో ఆచరించక పోవడమే! లోకంలా కనిపిస్తూ ఉండేదంతా విష్ణువే! లోకాన్ని చూస్తున్నప్పుడు దేవుడు గుర్తుకు రావాలి. మనం దేవుడిని చూడటం అంటే. లోకం కాక చూడడం అనే అభ్యాసం, పారపాటు వల్ల ఏర్పరచుకున్నాం. దానివలన కనబడ్డ వాటిల్లోనే చూడడు, కనబడని వాటిల్లో వీడేం చూస్తాడని భగవంతుడు నవ్వుకుంటాడు. ఎదురుగా ఉన్నదే కనపడదుట. ఎవ్వరికీ కనబడని వస్తువు వెతకడానికి బయలుదేరాడట అంటే అర్థం ఏమన్నా ఉందా? ఆయన ఇన్ని రూపాల్లో కనిపిస్తుంటే, ఇన్ని రూపాల్లోనూ ఉన్న ఆయన్ను చూడకుండా, వీళ్లందరినీ నిర్లక్ష్యం చేస్తూ ఆకాశంలో చూస్తే శూన్యం కనిపిస్తుంది. పూర్ణం కనిపించదు. ఇక్కడ నుండి చూస్తే అక్కడి వరకు మొత్తం అంతా పూర్ణంగా కనిపిస్తుంది అని భగవంతుడు చెబుతున్నాడు. కనుక సాధనలో మనం రోజూ ఎన్ని సంఘటనల్లో, ఎన్ని ప్రదేశాల్లో, ఎందరు వ్యక్తుల్లో, ఎన్ని ఆకారాల్లో విష్ణువును చూడగలిగాము? ఎన్ని ఆకారాల్లో చూడలేకపోయాం? చూడడం అనేది ఒక అభ్యాసంగా చేసుకొనడం వలన మాత్రమే మనలో మార్పు వస్తుంది తప్ప, లేకపోతే ఎంత పెద్ద విషయాలు తెలుసుకున్నా రెండు మూడు రోజులు అయ్యాక అవి ఆవిరైపోతాయి. అవి మిగలవు. మళ్లీ freshగా మొదలు పెట్టడమే! ఎప్పుడు

ఇమిడి ఉంటాయి అంటే ఈ చింతనలు ఉన్నప్పుడు ఇమిడి ఉంటాయి. అవసరమైనప్పుడు వాటంతటవే మనలోంచి వ్యక్తమవుతుంటాయి. అప్పుడు ఏదో చెప్పారండీ మీకు చెబుదామనుకున్నాను, అనే పరిస్థితి ఉండదు. ఎవరికన్నా చెప్పవలసి వచ్చిందనుకోండి 'పుష్కరాక్షః' గురించి, మనలో అంతా వికాసం చెంది మొత్తం బయటవాళ్ళకు అందుతుంది. ఎప్పుడూ? విష్ణు లోకంలో ఉండటానికి మనం ప్రయత్నం చేస్తే! లోకం విష్ణువే కనుక మనం విష్ణు లోకంలో ఉన్నాము అనుకోండి, అదే వైకుంఠంలో ఉండడం అంటే. వైకుంఠం అంటే ఎక్కడో అవతల ఉందనుకోవడం ఒక పద్ధతి. మనం ఎక్కడ భావన చేస్తే అక్కడ వైకుంఠం ఉంటుంది. మన భావన యందు భగవంతుడు స్థిరపడితే వైకుంఠం మనయందు, మన చుట్టూ ఏర్పడుతుంది. అది భగవంతుడు ఇచ్చిన పెద్ద రహస్యం. ఎప్పుడైతే భగవత్ చింతన మనలో ఉంటుందో మనకు రాగద్వేషాలురావు. ఇలా కూర్చొని మంచి విషయాలు చెప్పకుంటుంటే ఆ కాసేపు రాగద్వేషాలు ఎందుకు రావు అంటే భగవత్ చింతన చేసుకుంటున్నాం కాబట్టి. మామూలు సన్నివేశాలలో కూడా ఎదురుగుండా ఉండే వ్యక్తులు, సమయాలు, ప్రదేశాలు ఇవన్నీ కూడా భగవంతుడే అని గుర్తు పెట్టుకోవడం అనేది అత్యుత్తమ సాధన. అది చేసుకున్నంత సేపు భగవత్ సంబంధమైన భావన తెరవెనుక ఉంటే, అంటే మన మనసు వెనక ఉంటే, ఆ భావన ఉండటం వలన రాగద్వేషాలు, కామక్రోధాలు, ఈర్ష అసూయలు ఉత్పన్నం కాకుండా ఉంటాయి. ఆ భావన తప్పుకుంటే ఇవన్నీ కప్పేస్తూ ఉంటాయి. అందుకే లోకాన్ని విష్ణుపరంగా చూడాలి. అప్పుడు మనం ఉంటున్నది విష్ణులోకం. అలాగే శివుడుపరంగా చెప్పకుంటే అది శివలోకం. నారాయణుడు, వాసుదేవుడు, విష్ణువు. అలాగే సదాశివుడు, పరమ శివుడు, శివుడు. నారాయణుడు, వాసుదేవుడు, విష్ణువు, ప్రద్యుమ్నుడు అని ఒక వ్యూహం చెప్పకున్నాం కదా. అట్లాగే సదాశివుడు, పరమ శివుడు, శివుడు, ఈశ్వరుడు ఇట్లా చెప్పకుంటాం. అట్లాగే ఆదిశక్తి, ఇచ్ఛాశక్తి, జ్ఞానశక్తి, క్రియాశక్తి. ఎట్లా చెప్పకున్నా పేర్లే. అసలు విషయం ఏంటంటే ఉన్నది ఒక్కటే అని గుర్తు ఉండాలి. ఇన్ని రూపాలలో ఉన్నది ఒక్కటే అని గుర్తుండాలి. మనం అందరితో ప్రవర్తించినప్పుడు అది గుర్తు ఉండాలి. అలా ఉంటే మనలో మార్పు వస్తుంది. మనల్ని మనం బాగు చేసుకోవడానికి చేసుకునే కార్యక్రమమే కదా ఇది. అంతేగాని this is not a favour to God. ఇది దేవుడికి ఉపకారం కాదు. ఇలా చేయకపోతే పాపం భగవంతుడు ఏమైపోతాడో అని కాదు కదా, మనం చేస్తున్నది. చేస్తున్న కార్యక్రమములలో నుండి మనలో ఉద్ధారణ కలగాలి. మనలో ఉద్ధరింపు రావాలి. దేనికి? మన మనస్సు, ఇంద్రియములు, శరీరమునకు చక్కని అనుసంధానం ఏర్పడాలి. శమము

ఏర్పడాలి. దేహంలో ఉన్నంత కాలం మనకు పరిపూర్ణమైన ఆనందం కలగాలి. దేహంలో ఉండడమే ఒక బందిఖానాలో ఉన్నట్లు అన్న పరిస్థితి భగవంతుడు సృష్టించింది కాదు. మనం చేతకాక చేసుకున్నాం. కాబట్టి దాన్ని మనం తెలుసుకోవాలంటే మనలో మార్పు రావాలి. మనలో మార్పు రాకుండా మేము ఇలాగే ఉంటాము మీరు అలా చెప్పకు పోతూ ఉండండి అంటే అలా చెప్పకు పోయే వాళ్ళు చాలామంది ఉన్నారు. మార్చుకోని వారు అలాగే బందిఖానాలో ఉన్నట్లుగానే బాధలు పడుతూ ఉన్నారు. ఈ మార్పు తెచ్చుకోవడాన్నే 'వ్యవసాయం' అంటారు. విశిష్టమైన పర్యవసానం చెందే దాన్ని వ్యవసాయం అంటారు. విశిష్టమైన పర్యవసానం మన దేహాదుల యందు ఏర్పడాలి. ఏర్పడితే then we can see better, we can listen better, we can speak better, we can understand better. Everything is better in ourselves when we are in this practice. Suppose there is no betterment it means there is no practice. Betterment, time తీసుకొస్తుందని wait చేస్తే అవ్వదు. Time వచ్చి వెళ్లి పోతుంది. మంచిరోజు వచ్చినప్పుడే తెల్లవారుజామున లేస్తానండీ అనుకుంటే ఎప్పటికీ లేవలేం. మంచిరోజుగా మనం తయారు చేసుకోవాలి. దానికి మనకు భగవంతుడు బుద్ధిని ఇచ్చాడు. దాన్ని వినియోగం చేసుకోవాలి. ఈ విధంగా చేసుకుంటే వ్యవసాయం అంటే విశిష్టమైన పర్యవసానం అంటే, మార్పు తీసుకొస్తుంది. ఎటువంటి మార్పు తీసుకు వస్తుంది? చిన్న గింజ కొన్ని వేల విత్తనాలుగా తయారుచేసే ప్రపంచంలో కొన్ని వేల మందికి ఆహారంగా చేసే పద్ధతి ఉన్నది. దీనికి ఏం చేస్తారు? భూమిని దున్నుతారు. విత్తనం వేస్తారు. నీరు పోస్తారు. దాన్ని పెంచుకుంటారు. దాన్ని పెంచేటప్పుడు రక్షణ చేసు ంటారు. తర్వాత ఇంటికి పట్టుకొచ్చుకుంటారు. తినేట్టు గా తయారు చేసుకుంటారు. తింటారు. ఇంత జరుగుతుంది. వేసిన గింజ ఆర్నెల్లు అయినా వేసినట్లే ఉంటే? ఏం చేస్తున్నావ్ అంటే పాతిన గింజ తీసి తింటున్నా అన్నట్లుగా ఉంటే ఎలా? అంటే గింజ గింజ గానే ఉండి పోయి, మొక్క అవకుండా దాంట్లోంచి ధాన్యం అవ్వకుండా ఎంతకాలం? ఎక్కువ మందికి భగవంతుని సాధన ద్వారా ఈ వ్యవసాయం ఎందుకు జరగదు? లోకమునందు ఈ విధమైన దృష్టి ఉండదు కాబట్టి! లోకమును కొంచెం తక్కువ చూస్తూ ఉంటారు. నిజానికి లోకమే భగవంతుడు. కాబట్టి లోకాన్నే భగవంతుడు గా చూడాలి. లోకాన్ని భగవంతుడుగా చూసుకుంటూ, విష్ణు సహస్రనామం అభ్యాసం చేసుకుంటే ఫలశ్రుతి బాగా ఉంటుంది. 'ఇతీదం కీర్తనీయస్య కేశవస్య మహాత్మనః' విష్ణు సహస్రనామం తర్వాత ఫలశ్రుతి ఉన్నది. అందులో భయం వచ్చే వారికి భయం తప్పిస్తాడు. ఆపద వచ్చే వారికి ఆపద నుండి తప్పిస్తాడు. మృత్యువులో వెళ్లే వాడికి మృత్యువు నుండి

తప్పిస్తాడు-- ఇవన్నీ ఉన్నాయి. ఇవన్నీ ఎప్పుడు వస్తాయి? ఈ నామాల్లోని సత్యాలు మన జీవితాల్లో అనుభూతి చెందినప్పుడు కదా! ఈ సాధన, వేయి నామాలు జపించే లోపల పరిపూర్ణం కాకపోయినా కనీసం మొదలవ్వాలి.

విష్ణు సహస్రనామం గూర్చిన ప్రసంగములు వార, వారము ఏర్పాటు ఎందుకు చేసుకుంటున్నాము? ఈ వారం రోజులలో మనము అంతర్యామి యందు ఏ మాత్రం నిలబడి ఉన్నాము, అంతర్యామి పైన ఏర్పడుతున్న త్రిగుణముల యొక్క క్రీడ యందు ఎంత లోబడి జీవిస్తూ ఉన్నాము, అందరి జీవుల రూపంలోనూ ఉండే ఒకే ఒక అంతర్యామిని గుర్తు చేసుకొని సజీవమైన మూర్తులు అన్నీ కూడా మనము భగవంతుడుగా ధ్యానము చేసుకోగలుగుతున్నామా లేదా అని assess చేసుకోవడానికి, ఏర్పాటు చేసుకున్నాము. ఆ సాధన జరిగినప్పుడు మనకి భగవంతుని యొక్క సాన్నిధ్యము మనకు లభించినట్లు! అలా కాక జ్ఞానము, విజ్ఞానము దాని యొక్క సేకరణ యందు నిమగ్నమైనట్లయితే, ఎన్ని జన్మలు గడిచినప్పటికీ కూడా మనలో భగవంతుని యొక్క అనుభూతికి అవకాశము ఉండదు. నేర్చుకోవటం ముఖ్యం కాదు, గుర్తు తెచ్చుకొని గమనిస్తూ ఉండటం అనేది సాధన! నేర్చుకున్నవి మర్చిపోతాం. ఈ విధంగా చూడటం మొదలు పెట్టినప్పుడు మనము కూడా అంతర్యామిలో భాగంగా మనల్ని మనము అవగాహన చేసుకుని, శాశ్వతములమై, అక్షరములమై భగవంతుని అనుభూతిని ఎక్కువ పొందుతూ, సృష్టిని అంతా కూడా భగవంతుని క్రీడగా, వైభవంగా కొనియాడుతూ, దానియందు మనము అంటక జీవించడానికి అవకాశం ఉంది. భగవత్ భక్తులు అలా జీవిస్తూ ఉంటారు. అది వాళ్లకు ఎలా సాధ్యమైందంటే ఆ సాధనే! ఇది చేయక ఎంత ఆరాధన చేసినప్పటికీ ఆయన సాన్నిధ్యాన్ని పొందటానికి అవకాశం లేదు. ఈ సాధననే 'అనుష్ఠానం' అని కూడా అంటారు. శ్రీకృష్ణుడు 'నా మతము అంటే, అందరిలో ఉన్న నన్నే దర్శిస్తే నీకు గుణముల యొక్క ఆట అంటదు. నన్ను దర్శించకపోతే నీవు గుణములలో ఇరుక్కుపోతావు. నువ్వు బంధింప పడతావు, సుఖము కోరి దుఃఖ పడతావు, సౌకర్యములు కోరి అసౌకర్యములు అనుభవిస్తావు. లాభం కోరి నష్టం పొందుతావు. జయం కోరి అపజయం పొందుతావు' అని చెప్తాడు. అందుకని ఈ త్రిగుణములలో తేలేటటువంటి సృష్టికి ఏదైతే ఆధారమో దానిని దర్శనము చేయుట సాధన. అదీ అనుష్ఠానము! పుస్తకాలతో ఏమాత్రం సంబంధం లేదు. అది జీవితము అనే ఒకే ఒక పుస్తకముతో సంబంధం ఉన్న విషయము. ఆ జీవితము అనే పుస్తకములో మనకు ఒకొక్క రోజు ఒక్కొక్క పుట. సంవత్సరము ఒక chapter. ఒక chapter లో 365 pages ఉంటాయి. అటువంటి chapters ఒక్కొక్క సంవత్సరము ఒక్కొక్క chapter గా మనం చూసినట్లయితే మనమే ఒక పెద్ద

గ్రంథం.ఈ గ్రంథములో రాసింది అంతా భగవత్ తత్త్వం గూర్చి రాసామా, భగవత్ తత్వమే అనుభూతిగా ఉన్నామా? చూసుకోవాలి. మాస్టర్ గారు 'అయస్కాంతం గురించి ఎంత తెలిస్తే ఏమి లాభము అయస్కాంతీకరణము చెందాలి కదా! వెలుగు గురించి ఎంత తెలిస్తే ఏమి లాభం వెలుగై ఉండాలి కదా' అంటూ ఉండేవారు. ఆహారం గురించి ఎంత తెలిస్తే ఏమి లాభము? తింటేనే కదా దాని యొక్క అనుభూతి. అందుకని అనుభవైకమైన జ్ఞానము, అనుభూతిపరమైన జ్ఞానము ఎక్కడి నుంచి వస్తుంది అంటే కనబడుతున్న దానికి ఆధారముగా ఉన్న దానిని గమనిస్తూ ఉండటం అనేది చేయగలిగిన నాడు. అది మాటిమాటికి గుర్తు తెచ్చుకోవడానికి ఇటువంటి క్లాసులు పెట్టుకుంటాము తప్ప విష్ణు సహస్రనామంలో ఎంత చెప్పారు, ఒక్కొక్క నామానికి ఎంతెంత వివరణ వచ్చింది, ఆ వివరణలో జ్యోతిష్యం ఎంత వచ్చింది, శబ్దాల గురించి ఎంత వచ్చింది, తంత్రం గురించి ఎంత వచ్చింది, మంత్రం గురించి ఎంత వచ్చింది అని కాదు. అంతర్యామిని దర్శనం చేయడం అంటే ఉదాహరణకి ఒక ఆయన మాట్లాడుతున్నాడు అనుకోండి ఆయనలోంచి మాట్లాడే వానిగా ఉన్న భగవంతుని దర్శనము చేయాలి. మాట యొక్క అర్థము అనేది పైన తేలేది. లోపల ప్రవాహముగా సరస్వతి ఉన్నది కదా! ఎవరైనా మాట్లాడుతూ ఉంటే ఆ సరస్వతీ ప్రవాహము ఎలా ఉందో గమనించామా? అంతర్యామిగా ఉన్నది అక్కడ సరస్వతి ప్రవాహం under-current అంటాం. బహిర్గతంగా నదీ ప్రవాహం పై బోలెడన్ని పడవలు, బోల్డు దూలాలు, కర్రలు ఉంటాయి అలా అన్నీ తేలుతూ ఉంటాయి. తేలుతూ ఉన్న వాటిని చూస్తున్నామా, ప్రవాహమును చూస్తున్నామా? ప్రవాహం ఉండకపోతే ఈ తేలేవన్నీ ఏమీ లేవు కదా! అట్లాగే జీవితంలో మనము వస్తువు, పశువు, వృక్షాలు మొదలైన కనబడే అన్నిటి యందు అంతర్యామిగా ఉండే వాడిని గుర్తు తెచ్చుకొని ఆ మూర్తులతో ప్రవర్తించడము అనేది సాధన. అలా కానప్పుడు మనము ఎన్ని విషయాలు తెలుసుకున్నా మళ్లీ మర్చిపోతూ ఉంటాము. తెలియటం ముఖ్యం కాదు ఇక్కడ నేర్చుకోవడం ముఖ్యం కాదు. ఈ విధమైన అనుష్టానము ముఖ్యము. అన్నింట్లోనూ నన్ను ఈ విధముగా దర్శనము చేయటం అనేది నా మతము అని చెప్పాడు శ్రీకృష్ణుడు. ఆ సాధన మాత్రమే మనల్ని లోతుల్లోకి తీసుకు వెళుతుంది. లేకపోతే జీవితము కాసేపు మునుగుతూ ఉంటుంది, కాసేపు తేలుతూ ఉంటుంది, కాసేపు ఢీ కొట్టుకుంటూ ఉంటుంది, కాసేపు కిందకు పడుతూ ఉంటుంది, కాసేపు పైకి ఎగురుతూ ఉంటుంది, ఏవేవో అట్లా తమాషాలు జరుగుతూ ఉంటాయి. సాక్షీభూతుడిగా ఉండవలసిన జీవుడు, తన యొక్క చిత్త ప్రవృత్తులలో ఇరుక్కుని తనే బోల్తాలు కొట్టేస్తూ ఉంటాడు. ఈ చిత్త ప్రవర్తనాన్ని త్రిగుణాత్మకమైన వంటి రజస్సు, తమస్సు కారణముగా, వాటి

యొక్క సమతూకము లేకపోవటము కారణముగా రకరకాల బాధలు అనుభవిస్తూ ఉంటాడు. అలా కాకుండా సమస్తము లో నిండి ఉన్న అంతర్యామిని దర్శించడానికి చేసే సాధనలే ఈ సహస్రనామ వివరణ కార్యక్రమము.

కంభంపాటి పార్వతీ కుమార్

విషయ సూచిక

౧౦౧, ౧౦౨, ౧౦౩ అభిప్రాయః, ప్రియార్హః, అర్హః..... 1

౧౦౪ ప్రియకృత్..... ౯

౧౦౫ ప్రీతివర్ధనః.....16

౧౦౬, ౧౦౭ విహాయసగతిః, జ్యోతిః 18

౧౦౮ సురుచిః..... 21

౧౦౯ హుతభుక్ 22

౧౧౦ విభుః 23

౧౧౧ రవిః.....24

౧౧౨ విరోచనః.....26

౧౧౩ సూర్యః 27

౧౧౪ సవితః.....29

౧౧౫ రవిలోచనః.....32

౧౧౬, ౧౧౭, ౧౧౮ అనంతః, హుతభుక్, భోక్తా 33

౧౧౯ సుఖదః.....39

౧౨౦, ౧౨౧ నైకజః, అగ్రజః.....44

౧౨౨, ౧౨౩ అనిర్విణ్ణః, సదా 45

౧౨౪ అమర్షిః 48

౧౨౫ లోకాధిష్ఠాన.....51

౧౨౬ అద్భుతః 52

౧౨౭, ౧౨౮ సనత్, సనాతనతమః..... 58

929 కపిలః 61
930, 931 కపిః, అవ్యయః 64
932, 933, 934 స్వస్తిదః, స్వస్తికృత్, స్వస్తిః 65
935 స్వస్తిభుక్ 71
936 స్వస్తిదక్షిణః 72
937 అరౌద్రః 73
938 కుండలీ 75
939 చక్రీ 76
940 విక్రమీ 81
941 ఊర్జితశాసనః 83
942 శబ్దాతిగః 85
943 శబ్దసహః 86
944 శిశిరః 86
945 శర్వరీకరః 87
946 అక్రూరః 89
947 పేశలః 95
948 దక్షః 96
949 దక్షిణః 105
950 క్షమిణాంవరః 110
951 విద్వత్తమః 115
952 వీతభయః 120

153 పుణ్యశ్రవణకీర్తనః 121
154 ఉత్తారణః..... 122
155, 156 దుష్కృతిహా, పుణ్యః 123
158, 159, 160, 161 వీరహా, రక్షణః, సంతః, జీవనః 128
162 పర్యవస్థితః.....133
163 అనంతరూపః.....135
164 అనంతశ్రీః 136
165 జితమన్యుః 137
166 భయాపహాః 140
167 చతురశ్రో 141
168 గభీరాత్మా..... 144
169 విదిశః 145
170 వ్యాదిశః 146
171 దిశః 148
172, 173 అనాదిః, భూర్భువః..... 149
174 లక్ష్మీః 152
175 సువీరః.....153
176 రుచిరాంగదః 154
177, 178, 179 జననః, జనః, జన్మాదిః 155
180 భీమః.....157
181 భీమపరాక్రమః.....160

982 ఆధారనిలయః.....161
983 ధాతా..... 162
984 పుష్పహాసః 163
985 ప్రజాగరః.....165
986 ఊర్ధ్వగః 166
987 సత్పథాచారః 169
988 ప్రాణదః 173
989 ప్రణవః.....173
990 పణః 174
991 ప్రమాణం 175
992 ప్రాణనిలయః 185
993 ప్రాణభృత్.....186
994 ప్రాణజీవనః 188
995, 996 తత్త్వం, తత్త్వ-విత్ 189
997 ఏకాత్మా 194
998 జన్మమృత్యుజరాతిగః..... 195
999 భూః భువః సువః..... 199
1000 తరుః..... 200
1001 తారః..... 207
1002, 1003 సవితః, ప్రపితామహః..... 209
1004 యజ్ఞః..... 212

1005 యజ్ఞపతిః 214

1006 యజ్వా 214

1007 యజ్ఞాంగః 215

1008 యజ్ఞవాహనః 215

1009, 1010, 1011, 1012, 1013, 1014, 1015 యజ్ఞభుక్,
యజ్ఞకృత్, యజ్ఞీ, యజ్ఞభుక్, యజ్ఞసాధనః, యజ్ఞాంతకృత్ ,
యజ్ఞగుహ్యం 216

1016, 1017 అన్నం, అన్నాదః ఏవచ 217

1018, 1019 ఆత్మయోనిః, స్వయంజాతః 228

1020 వైఖానః 234

1021 సామగాయనః 245

1022 దేవకీ నందనః 248

1023 స్రష్టా 248

1024 క్షితీశః 252

1025 పాపనాశనః 257

1026 శంఖభృత్ 261

1027 నందకి 270

1028, 1029, 1030, 1031 చక్రి, శార్ఙ్గధన్వా, గదాధరః,
రథాంగపాణిః 272

1032 అక్షోభ్యః 276

1033 సర్వప్రహరణాయుధః 281

1034 వనమాలి 290

1035 గదీ..... 300

1036 శార్ఙ్గము..... 309

1037, 1038 శంఖీ, చక్రీ.....310

1039 నందకము.....311

1040, 1041, 1042, 1043 శ్రీమన్నారాయణః, విష్ణుః, వాసుదేవః, అభిరక్షతు.....313

శ్రీ రామ రామ రామేతి 316

నమోస్త్వనంతాయ సహస్రమూర్తయే..... 341

ఫలశ్రుతి..... 367

౨౦౧, ౨౦౨, ౨౦౩ అభిప్రాయః, ప్రియార్హః, అర్హః

అభిప్రాయః ప్రియార్హః అర్హః ఈ మూడు నామాలు కలిపి ఒక అవగాహన.

అర్హః అంటే పూజ అని అర్థం. ప్రార్ధన అని అర్ధం. ప్రార్ధన రూపంలో, పూజ రూపంలో, భగవంతుడే వున్నాడని గుర్తు పెట్టుకోవాలి. దేంట్లోనూ ఇందులో లేడు, అందులో ఉన్నాడు అని ఏం లేదు కదా. 'ఇందుగలడందులేడని సందేహము వలదు' office లో కూడా వున్నాడు, files లో కూడా వున్నాడు. కాబట్టి, ఏదీ 'అది' కాకుండా చూడబోకండి, అని చెప్పడానికి ఈ నామములు మనకి ఇట్లా బాగా రుద్దారు. మనకి సానబడితే బాగా ఆయన సాన్నిధ్యంలో జీవిస్తామని, పూజ వాడేరా, అన్నారు. పూజ రూపంలో ఆయనే ఉన్నాడు.

ప్రియార్హః అంటే పూజ వలన ప్రీతి చెందుతాడుట.

అభిప్రాయః అంటే మనకి తెలుగు అవగాహన ఒకటి ఉంది. సంస్కృతంలో కూడా ఆ అవగాహన ఉండగా దానికి ఇంకొక అవగాహన ఉంది. అభిప్రాయుడు అంటే 'దగ్గరకు వచ్చేవాడుట'. అంటే ఈ మూడు నామములు మనం తరచి చూసుకుంటే, పూజ చేయడం వలన ప్రీతి చెంది, మనకు దగ్గరగా వస్తాడు. షోడశోపచార పూజ రోజూ చేసుకోండని, చేసుకుంటే బాగుంటుందని పూజా విధానం మనకి మాస్టారుగారు ఇచ్చారు. అది మగవాళ్ళైనా చేసుకుంటే బాగుంటుంది అదేదో ఆడవాళ్ళకి సంబంధించినది అని వదిలేయబోకండని మరీ చెప్పారు. షోడశోపచారపూజ 16 కళలలోనూ భగవంతుని యొక్క ఆరాధన చేసుకోవడం వలన మనలో భగవంతుడున్నాడు కాబట్టి, అతడు మనయందు ఉండడం వలన మనం ఉన్నాం అని మాటిమాటికీ చెప్పుకుంటూ ఉండాలి. అతను ఉండడం వల్ల మనం ఉన్నాం. అతను మనకి దగ్గరగా ఉన్నాడు. మనకు తెలియడం లేదు. మనం ఎంత దూరంగా చూద్దాం అనుకుంటే, అంత దూరంగా వున్నాడు. ఎక్కడో సూర్యుడి అవతల సవితృ మండలం ఉందిట, ఆ పైన ఇంకోటేదో ఉందిట, ఆ పైన ఎక్కడో ఉందిట వైకుంఠం అంటే, నీ భావం ప్రకారం అక్కడే ఉంటుంది. ఇక్కడే ఉందిట అంటే

ఇక్కడే ఉంది. అదిగో అల్లదిగో అంటే అక్కడ ఉంటుంది. ఇదిగో ఇల్లిదిగో అంటే ఇక్కడే ఉంటుంది. నీ భావం బట్టి వుంటుంది. కాబట్టి నీలో, నీతో సన్నిహితుడుగా, ఎప్పుడూ నిన్ను విడవకుండా ఉన్న భగవంతుని దగ్గరకు నువ్వు చేరతావు, అది అతను చేరినట్లుగా వుంటుంది. వచ్చేసింది విశాఖపట్నం అనుకుంటాం అనకాపల్లి ముందు. మనం వెళ్తూ అది వచ్చింది అనుకుంటాం అంతేనా? ఇంకాసేపట్లో విశాఖపట్నం వచ్చేస్తుంది అంటాం కదా. విశాఖపట్నం వస్తుందా, మనం వెళ్తున్నామా విశాఖపట్నం దగ్గరకి. అలాగే దేవుడి దగ్గరకు వెళ్ళడం అంటూ ఏమీ లేదు. దేవుడు మన దగ్గరకు రావడం అంటే, మనం దేవుడి దగ్గరకు వెళ్ళడం ట. అందుకని ఈ పూజ, నిత్యం చేసుకునే వాడియందు ప్రీతి ఆయన చెందడం వలన నువ్వు ఆయనకు దగ్గరవుతావు. అందుకే భాగవతంలో, ఏకాదశ స్కంధంలో భగవంతుడు శ్రీకృష్ణుని ఉద్ధవుడు, నిన్ను పొందడానికి ధ్యానం ఎలా చేయాలి అని అడిగితే, ధ్యానం ఏమి చేస్తావులే నీ మొహం, కలియుగంలో ధ్యానం ఏమిటి? అది చాలా సాధన జరిగిన తరువాత నిలబడే విషయం. ఈ లోపల నిత్య షోడశోపచారపూజ చేసుకుంటూ ఉండండి. దివ్యమైన కళలతో, మనోహరమైన మూర్తిగా నన్ను భావన చేసుకుని నా పూజ నిత్యం చేసుకుంటూ ఉంటే, నీలో వినయం పెరిగి, శ్రద్ధ పెరిగి, భక్తి పెరిగి, జ్ఞానం పెరిగి, ఇవన్నీ పెరగడం వల్ల, నువ్వు నాకు దగ్గరవుతావు. కారణం ఏమిటంటే నేను నీ యందు ప్రీతి చెందుతాను. ఇవన్నీ ఏమీ అక్కర్లేదండీ, గుడికి కూడా వెళ్లక్కర్లేదండీ, మేము ధ్యానం చేసుకుంటాం అండి అని అనుకునేవారు కొంచెం పాగరుమోతుతనంగా వుంటారు. ఈ మెట్లన్నీ ఎక్కి చేసేవారు వేరు. ఇవన్నీ వదిలేసి, ఏదో glamour, అదొక వ్యామోహం, అదొక fashion అనుకుని ఏదో మూసుకునేవాడు వేరు/ ధ్యానం అనే వారు వేరు. త్యాగరాజు అంతటి వారు దేహత్యాగం చేసే చివరి రోజు కూడా షోడశోపచారపూజ చేసుకుని దేహాన్ని వదిలారు. అలాగే మహాత్ములు అన్నమాచార్యులవారు ఏ రోజూ దేవతార్చన చేయకుండా ఏ పనీ చేసేవారు కాదు చివరి రోజు వరకు. అలాగే పోతనామాత్యుడు. భక్తి వలన సులభంగా ఉంటుంది. భక్తి అంటే ఏం లేదు, మనలో అహంకారం పెరగకుండా, వాడు పెరిగి మనం తగ్గాలంటే కొన్ని పద్ధతులున్నాయి. మామూలుగా ఉత్త జ్ఞానం సంపాదించుకుంటూంటే

అహంకారం పెరుగుతుంది. జ్ఞాన సముపార్జనతో పాటు, వినయము, శ్రద్ధ, భక్తి, పెరగడానికి కొన్ని కార్యక్రమములు పెద్దవాళ్ళు మనకి పెట్టారు. అందుకే మాస్టరుగారు మనకి పూజ పెట్టారు. పెట్టకపోతే ఊరికే స్నానం చేయకుండా ఒకసారి CVV అని, ప్రపంచాన్ని ఉద్ధరించేశామనుకుని, ఇంక మనకన్నా ఎవరూ లేరు మొనగాళ్లు అనుకుని, ఏ మాత్రం సంస్కారములు పొందక, అదే maximum అంటూ మిగతా వాళ్ళకి కూడా ఇవన్నీ waste అని చెప్పే పద్ధతిలోకి వచ్చేస్తాం. ఎంత ఆత్మజ్ఞాని అయినప్పటికీ 'నాకేం అక్కర్లేదు' అని అనడానికి వీలు లేదు. అది పరిపూర్ణమైన యోగం. మాస్టరుగారు పరిపూర్ణమైన ఆత్మజ్ఞాని అయినప్పటికీ రోజూ పూజ చేసేవారు. అవకాశాన్ని బట్టి దేవాలయములకు వెళ్లేవారు. నేను దేవుడ్ని చూడక్కర్లేదు, ఏం వెళ్ళక్కర్లేదు, ఇక్కడే వున్నాడు కదా! ఇదంతా మెట్ట వేదాంతం. ఆచరణ పూర్వకంగా కనిపించదు. అందుకని భక్తి పెరగాలంటే పూజ best. ఇక్కడేమవుతుందంటే, వినయంతో కూడిన జ్ఞానం మనిషికి ఒక వరంలాగా పరిణమిస్తుంది. వినయం లేని జ్ఞానం అహంకారంగా తయారవుతుంది. అందుకని ఇదేదో ఆడవాళ్లు చేసుకోనీ మనం చేస్తే ఏం బావుంటుంది అన్నట్టుగా ఉంటే ఏమీకాదు. విభూతి పెట్టుకోవాలన్నా, బొట్టు పెట్టుకోవాలన్నా ఊళ్ళో వాళ్ళేమన్నా అనుకుంటారేమో అనే పరిస్థితిలో వున్నాం కదా! ఆర్యుడు అనేవాడు ప్రతివాడూ భ్రూమధ్యంలో, ప్రతిరోజూ అతని ఆజ్ఞయే నా సంకల్పంగా నేను పని చేస్తాను అని చెప్పడానికి, ఈ సూర్యాత్మకమైన ప్రజ్ఞ కలిగినటువంటి ఉంగరం వేలుతో భ్రూమధ్యంలో ముట్టుకుని,Father Thy will be done అంటారే, భగవంతుడా నీ ఆజ్ఞయే ఇక్కడ నుండి నిర్వర్తింపబడుగాక, దానికి బద్ధుడనై ఈ సమస్తమైన తత్త్వము ప్రవర్తించు గాక. నీకు తిరుగులేదు కాబట్టి, నీ సంకల్పంలో నడచుకు వెళ్తుండే వాడినైన నాకు ఏమీ తిరుగులేకుండా ఉండుగాక. 'రాజముఖి వశ్యముఖి రాజవశ్యముఖిస్వాహాః' అని బొట్టు పెట్టుకుంటారు. అంటే ఏమవుతుంది, నీ ముఖంలో ఒక మహారాజు ముఖంలో వుండే తేజస్సు వస్తుంది. రాజు ఎవరు? అందరికీ సూర్యుడే! ఆజ్ఞా చక్రం నుండి అటువంటి తేజస్సు వ్యక్తం అవడానికి, రాజముఖి. వశ్యముఖి. మరి అంత తేజస్సు అక్కడ నుండి వస్తుంటే, ఎదుటి వాళ్ళు మనని చూడగానే మన పని చేయాలనిపిస్తుంది

వాళ్ళకి. కొంతమంది ముఖం చూడంగానే అసలేమీ చేయబుద్ధి కాదు, కొంతమంది పనిమీద వెళితే కాదనలేరు. వాళ్ళు మాట్లాడితే వీరు వశం అయిపోతారు వాళ్ళకి. అంటే వశంకరి మంత్రాలు తాంత్రికంగా చేసి వశపరచుకోవడం రాజసం అవుతుంది. 'భగవంతుని సంకల్పం మేరకు ఈ రోజు లేచిన దగ్గర్నుంచి, సాయంత్రం వరకు ఆయన సంకల్పం మేరకు నేను జీవిస్తాను. ఆయన యందే జీవిస్తాను. ఆయన దీనిని ఆధారంగా నిర్వర్తించుకుంటూ ఉంటాడు, నేను చూసి ఆనందిస్తాను. సమస్తమూ ఆయనే నిర్వర్తిస్తున్నాడు' అనే భావన ప్రాద్దున్నే ఏర్పరచుకోవడానికి, స్నానం చేసిన తరువాత ముఖం మీద ఆ భ్రూమధ్యంలో తాకుతూ అట్లా బొట్టు పెట్టుకోమన్నారు. ఎందుకని, నువ్వు పెట్టుకుంటే ఏమవుతుంది అంటే, చూసేవాడు కూడా, వాడియొక్క చూపు అక్కడికి ఆకర్షింపబడుతుంది. ఒక వృత్తమును పెట్టి అందులో బిందువు పెట్టామనుకోండి, ఏమవుతోంది? చూసేవాడి చూపు దాని వరకు కేంద్రీకృతం అవుతుంది. మనం ఆకాశం లో ఇట్లా చూశామనుకోండీ, అక్కడ చంద్రుడు, సూర్యుడు, నక్షత్రం ఉంటే దాని వైపు, సరాసరి వెళ్ళిపోతుందిగా చూపు! ఏమీ లేదనుకోండి, అలా vague గా చూస్తాం తప్ప, దేనియందు focus అవదు. కేంద్రీకృతం అవదు, convergence వుండదు. ఇంతటివాడూ మనని చూసేవాడు, అక్కడకి వచ్చేస్తాడు. అక్కడకు వస్తే ఏమైంది? అక్కడ భగవంతుడి సంకల్పం వున్నది. ఆ సంకల్పం మేరకు వాడు బద్ధుడవుతాడు. Magic కాదు ఇది. వాడు తన్మయత్వం చెందుతాడు. ఇదంతా ఎవరికి? తాను ఆచరిస్తూ, ఆ సంకల్పం మేరకు జీవిస్తూ ఉన్నవాడికి. అలా కాకుండా పూనకం వచ్చినవాడి లాగా, వేప మండలు పట్టుకుని తిరిగేవారిలాగా ఊరికే పెద్ద పెద్ద బొట్లు పెట్టుకుంటే ఏమీ ఉపయోగం లేదు. వాడి సంకల్పం నా నుండి నిర్వర్తింపబడాలి, అందుకూ ఇది/ ఈ దేహం లేచింది. ఇంకొకందుకు లేస్తే అది గాడిదే! పాద్దున లేవడం కూడా 'కర్తవ్యం దైవమాహ్నికం' కదా! వాడి సంకల్పం కోసం వాడు మనల్ని లేపితే, అది మర్చిపోయి మనం పనిచేసుకుంటున్నాం. మనం నిద్ర లేవట్లేదు, గుర్తుపెట్టుకోండి. నిద్ర మనం లేస్తున్నాం, నిద్ర మనం పోతున్నాం అని అనుకుంటున్నాం కానీ నిద్రలోంచి ఒక్కోసారి లేవలేం కదా! రోజూ సూర్యుడు ఉదయించడానికి ౨ గంటల ముందే ధ్యానంలో కూర్చుంటే

బావుంటుందని ధనుర్మాసం వచ్చినపుడు అనుకుంటాం. ఒక్క ధనుర్మాసం వచ్చినప్పుడే కాదు ఎప్పుడూ లేవాలి. లేవగలుగుతున్నామా, మన చేతుల్లో ఉన్నదా? లేదు. నిద్రపోదామనుకుంటే నిద్ర పడుతోందా, పట్టట్లేదు కదా! నిద్ర పోవడం మన చేతుల్లో లేదు. నిద్ర లోంచి రావడం మన చేతుల్లో లేదు. వాడు ఎందుకు లేపాడో అందుకు నువ్వు పని చేసేట్లయితే, అప్పుడు ఆయన ఆజ్ఞగా నిద్రరావడం, నిద్రపోవడం, వుంటుంది. మనం ఇంకో రకంగా వుంటాం కాబట్టి వీలుపడదు. కనీసం పూజకు కూర్చున్నపుడన్నా బ్రాహ్మణుడు ఏం చేస్తాడంటే కాస్త కుంకుమ పెట్టుకోరా అని ఇంత ఇస్తాడు. ఆ కాసేపటికే ఏదో కుంకుమ పెట్టుకుని, ఒంటిమీద కండువా వేసుకుని వేషం వేసుకున్నామనుకోండి. ఎప్పుడూ లేనిది అప్పుడు ఏదో చేస్తే అది వెగటుగాను, వెకిలిగాను, వికారంగాను వుంటుంది. మనవాళ్ళు చూడండి, దట్టించి పట్టు పంచె జరీ ఉన్నది కట్టేసి, పైన ఎడం పక్క ఉత్తరీయం వేసుకుని, బొట్టు పెట్టుకుని ఉంటారు ఆ కాసేపూ ఉండి, తరువాత మళ్ళీ వెంటనే వేరే విధంగా ఉంటే ఎంత వికారంగా ఉంటుందీ? ఇవన్నీ మనిషిలో శ్రద్ధ లేకపోవడం వలన, వినయం లేకపోవడం వలన వస్తాయి. అవన్నీ రావాలంటే పూజ చేయాలి. అందుకని ఈ నామంలో ఏం చెప్పారంటే, పూజ నేనే, పూజ వలన నేను ప్రీతి చెందుతాను, ప్రీతి చెందడం వలన నీకు దగ్గరవుతాను. దేవతారాధన చేసుకునేవాడికి అంతర్యామియైన భగవంతుడు, తను ఏ రూపంలో దేవతను ఆరాధన చేస్తున్నాడో, ఆ రూపంలో తనకి ఆ మొత్తం తత్త్వం ఒక mediumగా వస్తుంది. దానితో మాట్లాడుకోవచ్చు. దాంతో ఆటలాడుకోవచ్చు, దాంతో హాస్యమాడుకోవచ్చు. దాంతో పాచికలు ఆడిన ఆయన ఒకరున్నారు వెంకటేశ్వరస్వామి భక్తుడు. తనలోంచి సృష్టించినదే, ఆరాధన చేత. తనలోంచి సృష్టించడం ఏమిటి, తను సృష్టికర్త కాదు. తనలో ఉన్నాడు. తనలో ఉన్నదే తను భావన చేయడం వలన ఆ రూపంలో వస్తాడు. ఆయనతో మాట్లాడుకోవచ్చు. రామకృష్ణుడు అలా మాట్లాడుకునేవారు, రోజూ వాళ్ళమ్మతో. భవతారిణితో ఎంత హాయిగా కబుర్లు చెప్పుకునేవాడో. ఇంకొక తోడు అక్కరలేదు, ఇంకొక నీడ అక్కరలేదు. జోకులే జోకులు ఆయనకి అమ్మవారితో. అమ్మవారికి కూడా ఆయన కనపడితే ఆనందం. అలా తయారయ్యి ఇద్దరూ కలసి ఆ వివేకానందుడ్ని బోలెడు ఏడిపిస్తారు.

సినిమాలో చూపిస్తాడు కదా! రామకృష్ణ పరమహంస బయట దేవాలయం దగ్గర కూర్చుంటే, వివేకానందుడు వచ్చి దణ్ణం పెట్టుకుని లోపలికెళ్ళి 'అమ్మవార్ని చూసి వస్తా'నంటాడు. రామకృష్ణులు 'వెళ్ళు వెళ్ళు' అంటాడు. లోపలకి వివేకానందుడు వెళ్ళగానే 'అమ్మా' అని పిలుస్తాడు ఆయన. ఆవిడ బయటకు వస్తుంది. వచ్చేసరికి, 'బావుంది, ఇప్పుడు వాడు లోపల ఏం చూస్తున్నాడు' అని అంటారు. తిరిగొస్తాడు 'కనిపించిందా అమ్మ' అంటే లేదంటాడు వివేకానందుడు.' 'ఇక్కడ నాతో ఉంది, అక్కడ నీకు ఎలా కనిపిస్తుంది?' అంటాడు. అలాగ ఒక దేవతో, ఒక దేవుడో నీకు తోడైపోతే నీకు ఇహ ఈ ప్రపంచంలో ఏం కావాలి? ఏమక్కరలేదు. అందుకనే ఆ భగవదనుభూతితో ఒక రకమైన ఉన్మత్తమైన ఆనందంలో ఉంటారు వాళ్ళు. అది ఈ ఆరాధన వల్ల మాత్రమే సాధ్యం. మిగతా మాధ్యమాలలో కాదు. 'అహం బ్రహ్మాస్మి' అనుకుంటే, దానియందు నిలబడగలిగితే అదృష్టవంతుడివే. కలియుగంలో కష్టం. కాబట్టి ఆరాధన! ఆరాధన చేత ప్రీతి చెందుతాడట. తాపత్రయపడుతున్నాడు పిల్లవాడు మన గురించి అని దగ్గరకు వస్తాడు. అభిప్రాయం అంటే అది అర్ధం. దగ్గరగా చేరతాడుట. అంటే ఇందాక విశాఖపట్నం దగ్గరగా చేరినట్టు. మనం దగ్గరగా చేరుతాం. అక్కడే ఉంది అది. ఉన్నదానికి మనం దగ్గరగా చేరతాం, మనకి అది దగ్గర అయినట్టుగా తోస్తుంది. ఆ విధంగా మనకి దగ్గర చేరతాడు. కాబట్టి పూజాది కార్యక్రమాలు మాష్టరుగారు ఇచ్చారు. పూజ ఇచ్చారు. ఇంకా ఓపిక ఉంటే అభిషేకం ఇచ్చారు, మరికొంత ఓపిక ఉంటే లలితాసహస్రనామం ఇచ్చారు, ఇంకా కొంచెం ఓపికుంటే విష్ణుసహస్రనామం ఇచ్చారు, మరీ ఓపికుంటే పెద్ద పెద్ద పూజలు చేసుకోమన్నారు. పెద్ద పెద్దపూజలు అప్పుడప్పుడు కక్కినట్టు చేస్తూ రోజూ చేయకుండా ఉంటాం కదా! అందుకని ఆయనిచ్చిన పూజ as it isగా చేయాలంటే 45 నిమిషముల కన్నా పట్టదు. అది చేసుకోవడానికి మనం సర్దుకోవాలి కదా! సర్దుకోవాలంటే బద్ధకం. ఎవరు సర్దుతారు? అని ఉంటుంది కదా. ఈ సర్దుకోవటాలు, కిందకి దిగటాలు, పైకి ఎక్కటాలు, ఇవన్నీ కష్టంగా ఉంటే లోపలన్నా పిలుచుకుని, కూర్చోపెట్టుకుని, కళ్లు మూసుకుని హాయిగా ఆవాహనం చేసి 'నాయనా! ఏదో ఇంతకన్నా చేత కాదు నాకు, క్షమించు, ఇదే ఆరాధన, మానసిక ఆరాధన. కూర్చోబెట్టి, కాళ్ళు

కడిగి, చేతులు కడిగి, చక్కటి మంచి నీళ్ళు ఇచ్చి, మంచి వెండి చెంబుతో ఇవ్వచ్చు. కాళ్ళకు గంధంపూసి, ఆయన చేతులకి మొహానికి మనం ఏమీ పూయక్కర్లేదు. ఎప్పుడూ పాదాలకే చేయాలి పూజ. ఆ తర్వాత స్తోత్రం చేసేటప్పుడు పాదాల నుండి శిరస్సు వరకు ప్రతి అంగాన్నీ దర్శనం చేయడానికి ప్రయత్నించాలి. కుంకుమ పాదాలకి పెట్టాలి, పసుపు పాదాలకి రాయాలి, పారాణి పెట్టండి, కుంకుమ బొట్టు పెట్టండి, పువ్వులు వేయండి, పూజ చేయండి, వస్త్రాలు సమర్పించేటప్పుడు పాదాలు చూస్తూనే, అట్లా పైకి అందిస్తే, అక్కడ నుండి ఏవో చేతులు వచ్చి చేతుల్లోకి తీసుకున్నట్లు చూడండి. మొత్తం ఒకసారి ఆబగా చూసేద్దాం అనుకోవద్దు. కనబడదు. కనబడితే పేలిపోతాం. మనం కనబడితే పోతామని చెప్పి వాళ్ళు కనబడరు, మహాత్ములే కనపడరు, ఇక దైవం ఎక్కడ నుండి కనబడతాడు? అందుకని కాసేపు పాదాలు, ఆ తరువాత కొంచెం సేపు చేతులు, అట్లా ఒక్కొక్కటి, ఒక్కొక్కటి. గభాలున వాళ్ళు కూడా కనిపించేటప్పుడు ఒక్కొక్కటి కొంచెం కొంచెం చూపిస్తారట అన్నీ ఒకసారి చూపించరుట. అట్లా అందించడం, వస్త్రం సమర్పయామి అన్నప్పుడు వాళ్ళకేమీ బట్టలు మనం తొడగక్కరలేదు. చేతికి ఇచ్చేయడమే! గంధం పాదాలకి రాయడం. అన్నీ పాదాలకే! అట్లా పూజ చేసుకుని ఆ తరువాత స్తోత్రం చేస్తూ, మాస్టరుగారు కృష్ణాష్టకం తర్వాత, ఇక పైన మీకు ఓపిక ఉన్నంత వరకు, మీ శ్రద్ధా భక్తులను అనుసరించి, మీ ఆసక్తిని బట్టి, ఇక్కడ ఇంకేమన్నా చదువుకోవచ్చు అని రాశారు. అంటే అక్కడ అభిషేకం చేయడం, అక్కడ విష్ణుసహస్రనామం చదువుకోవడం, అక్కడ లలిత సహస్రనామం చదువుకోవడం, మనకు ఉండే ఓపిక కొద్దీ. ఎందుకంటే ఆయనకు తెలుసు, మరీ పెద్దది పెడితే, మూడు రోజులు చేసి మానేస్తారని. అందుకని 40 నిమిషాలు కూడా పట్టకుండా అమర్చారు. ఆయన 'పూజ చేస్తున్నారా ఇంట్లో' అని అడుగుతూ ఉండేవారు. ఎందుకంటే పై మెట్లకి, ముందు పునాదులు గట్టిగా ఉండాలి. పునాదులు గట్టిగా లేకుండా ఊరికే అంతస్తులు వేసేద్దామంటే అవ్వదు. మనకి ఈ నామాల ద్వారా fundamentals గుర్తొస్తాయన్నమాట. మాస్టరుగారు చాలా సమగ్రమైన అవగాహన మనకి ఇవ్వడానికి ప్రయత్నం చేశారు. ఏదో ఒకటి పట్టుకుని, ఇదే అంతా, ఇంక మిగతాదేం లేదనే పద్ధతి కాదు. భారతీయమైన

సత్సంప్రదాయాలన్నిటినీ నిలబెట్టడానికి వచ్చిన వారు మాస్టరుగారు. అందుకని మనకి ఆయన గురువుగారైన CVV గారి కన్నా ఎక్కువ విశదీకరించి ఇచ్చారు. ఎందుకంటే ఆ తత్త్వం అందాలంటే ఇవన్నీ ప్రాతిపదికగా ఉండాలి. ఆయన పూజలు చేశారు, అభిషేకాలు చేశారు, హోమాలు చేశారు, అవసరమా? మనకోసం చేశారు. కాబట్టి ఈ నామంలో మనకి భగవంతుడే పూజ. భగవంతుని ప్రీతి కొరకు. ఆయన ప్రీతి కొరకు చేస్తే ఏమవుతుంది? మనకి ప్రీతి కలిగిస్తాడు. అదీ ప్రియకృత్. తరువాత నామం అదే.

౨౦4 ప్రియకృత్

ప్రీతి కలిగిస్తాడు.మనం దేవతలకి ఏం చేసినా మళ్ళీ returned with thanks and returned in a multiplied fashion. అంతేగాని మన దగ్గర నుండి పుచ్చుకునే స్థితిలో వాళ్ళు లేరు. నువ్వు, ఇంత చేస్తే, అంత చేసి ఇస్తారు. ఒక్క వరిగింజ నాటితే వరి కంకి లో నుండి ఎన్ని వరిగింజలు వస్తాయీ? అదే proportion దేవతలకి, మనకీ. మనకిక్కడ ఒక సంవత్సరం, అక్కడ సూర్యుడికి ఒక రోజు. అందుకని మనం ఏం చేసినా 365 రెట్లు తిరిగి వస్తుందని చెప్పి రాస్తారు. చంద్రుడికి ఒక రోజు మనకి ఇక్కడ 30 రోజులు. అందుకే దేవతలకు యజ్ఞం చేయడంలో ఉద్దేశం ఏమిటంటే, commission కొట్టెయ్యరు, తినేసి మర్చిపోరు. మనం ఎట్లా ఉంటాం అంటే, ఉపకారం చేసినంతకాలం చేయించుకుంటూ, ఇక చేయట్లేదు కదాని వదిలేస్తాం, ఇంకో ఉపకారం వచ్చే చోటుకి పోతూ ఉంటాం. మొట్టమొదటి గుణం, భక్తుడికి ఏమిటంటే, 'కృతజ్ఞశ్చ'. కృతజ్ఞుడై ఉండాలి. దేవతలు అలా కృతజ్ఞులై ఉంటారు. అందుచేత నీవేం చేస్తే అదంతా నీకే తిరిగి ఇస్తారు. ఎక్కడన్నా మనం ఎక్కువ వడ్డీ వస్తుందని దాచుకుంటే పోవచ్చు డబ్బు. కానీ ఇక్కడ దాచుకుంటే multiply అవుతుంది. అది ఇందులో రహస్యం. అందుకని భగవంతునికి ప్రీతి కలిగించే కార్యములు కూడా పూజ అనుకోండి. భగవంతునికి ప్రీతి కలిగించే ఆరాధన అంటే డాంబికంగాను, నలుగురి చూడడం కోసం అన్నట్లుకాదు. ఇట్లా ఏవేవో రకరకాలుగా ఉన్నాయి కదా మనకి, ప్రతివారూ హోమాలు చేస్తున్నారు, ప్రతివారూ యజ్ఞం చేస్తున్నారు. కానీ విధానం కూడా తెలియకుండా, శ్రద్ధ లేకుండా, భక్తి లేకుండా చేయడం వల్ల ఉపయోగం ఉండదు. శ్రద్ధాభక్తులు పెరగాలి. పెరుగుతూ చేస్తూ ఉంటే, అక్కడ ప్రీతి చెందడం వలన, ఆ ప్రీతి తిరిగి మనకి వస్తుంది. అక్కడ దేవత కళలు పెరుగుతున్నాయిటా అంటే ఇక్కడ పూజ చేసే వాడిలో వెలుగు పెరుగుతుంది. అంటే కొంచెం రాచ్చిప్ప మొహం పోయి, మనిషికి కొంత వెలుగు వస్తుంది. మొహం చూడగానే తెలుస్తుంది, ఏం చేస్తున్నాడో. వీడు ఆజ్ కల్ అంటె ఇవాళ, రేపు ఏం చేస్తున్నాడో మనిషి తెలియాలంటే మొహం చూస్తే తెలిసిపోతుంది. వేళ్ళాడుతూ ఉంటాయి మొహం మీద. చీకట్లు కమ్మి

ఉంటుంది. ఎందుకనయ్యా అంటే పూజ అంతర్ముఖంగానూ లేదు, బహిర్ముఖంగానూ లేదు. ఏంటో నల్లబడిపోయాను అనుకుంటాడు. ఏమిటో నల్లబడడం కాదు, కాంతి తగ్గిపోతోంది లోపల. ఇక అక్కడ నుండి సబ్బులేసి రుద్ది, beauty clinic లకి వెళ్లి; చర్మంలోంచి ఆ కాంతి వస్తుంటే వీడు చాలా వెలుగుగా కనిపిస్తూంటాడు. రుద్దితే వస్తుందా, సబ్బేసి? కాంతులు తగ్గిపోతాయి. కాంతులు నీలో పెరుగుతాయి పూజలు చేస్తుంటే. వినయం పెరుగుతుంది ముందు. శ్రద్ధ పెరుగుతుంది. అక్కడ నుండి నీకు ప్రీతికరమైన సన్నివేశాలు జరుగుతూ వుంటాయి. ఎంత పూజ చేసుకుంటే అంత బలం. మూల బలం. ఇంట్లో పూజ గది మన వెన్నెముక లాంటిదండి. అది ఎంత కళగా ఉంచుకున్నాం, ఎంత ఆరాధన చేసుకుంటున్నాం. డంబాచారం, గొప్పగా, డబ్బుంది కాబట్టి విపరీతంగా చేయడం, చూపించడానికి కాదు. అక్కడ దేవత వచ్చి కూర్చుంటుంది నువ్వు నమ్మిన ఆకారంలో. అందుకని అక్కడ దణ్ణం పెట్టుకుని బయటికి వెళ్ళడం. అక్కడ చెప్పుకుని వెళ్ళడం, ఇటువంటివి అన్నీ వుంటాయి. పెద్దవాళ్ళ ఇంటికి వెళితే వాళ్ల పూజ గదిలో, వాళ్ళు ఇంత కుంకుమ తీసి మొహాన పెట్టి, ఇంత తీర్థం ఇచ్చి, ఒక ప్రసాదం ఇచ్చి చేస్తూంటారు. ఉద్దేశ్యం ఏంటి? అక్కడ తత్త్వం ప్రతిష్ఠితమై ఉన్నదన్నమాట. మరి అందుకని వాళ్ళు ఇచ్చినా, ఏమన్నా చేసినా బావుంటుంది. మాస్టరు గారు తీర్థం ఇస్తే ఎన్నో రకాలుగా బావుండేది. అంతేకాదు ఆ ప్రీతి అలా వర్ధిల్లుతూ ఉంటుంది. నువ్వు ఎంత చేస్తే అంత వర్ధిల్లుతూ ఉంటుంది, ఎంత మానేస్తే అంత సన్నగిల్లుతూ ఉంటుంది. ఎందుకంటే, సహజంగా నువ్వు అదయ్యేంత వరకూ కూడా దాన్ని మనం ఆవాహనం చేసుకోవాలి. ఇనుపముక్క అయస్కాంతం చేసేంతవరకూ, ఈ అయస్కాంతీకరణం బాగా జరుగుతూ ఉండాలి అంటారు. దేవతార్చన పూర్వకాలంలో ఎట్లా ఉండేదో తెలుసా? దేవతార్చన పెట్టె అని ఉండేది. ఏ ఊరు వెళ్ళినా అది కూడా వాళ్ళతో తీసుకువెళ్ళేవారు. ఎక్కడుంటే అక్కడ పొద్దున దాన్ని తెరుచుకోవడం, ఆ విగ్రహాలకి, అక్కడ దొరికిన పూలు, వాటితో పూజ చేసుకోవడం మళ్ళీ సాయంత్రం పూజ చేసుకోవడం. ఉభయ సంధ్యలు అంటారే, ఉభయ సంధ్యల్లోనూ అలా దేవతార్చన చేసుకునేవారు. మనం briefcase పట్టుకెళతామే! అట్లా ఇది దేవతార్చన పెట్టె. మూత

వేసేసుకోవచ్చు. అట్లా తెరిస్తే, లోపల సింహాసనం, లోపల సీతా, రామ లక్ష్మణ హనుమత్సమేత విగ్రహాలు. అట్లా పెట్టుకున్న వాళ్ళు ఉన్నారు. అట్లాగే విష్ణుమూర్తి, లక్ష్మీ దేవి పెట్టుకు తిరిగిన వాళ్ళు ఉన్నారు. అట్లాగే శివలింగాలు ఎప్పుడూ తమతో తీసుకెళ్లి ఎక్కడున్నా అక్కడ పూజ చేసుకుంటారు. ఇవాళ ఇంట్లో లేము luckyగా హాయిగా పూజ అక్కర్లేదనిపిస్తుంది. హాయిగా ఉంది ఇవాళ పని, దేవుడిని ఇంట్లో వదిలేసి వచ్చాం అన్నట్టుగా ఉంటుంది కదా! అదీ మన పరిస్థితి! ఇంట్లో ఉంటే గూడు చూస్తే, కొంచెం లోపల కలుక్కుమంటుంది. పూజ చేయకపోతివి కదా అన్నట్టుగా అవి చూస్తూ ఉంటాయి మన పక్క. అసలు ఇంట్లోనే లేమనుకొండే, గొడవ లేదు. మూడు రోజులు camp వెళితే, దేవుడు లేడు, ఏం లేదు, హాయిగా ఏదో బంధం నుండి బయట పడ్డట్టుగా ఉంటుంది. అది మన పరిస్థితి. కానీ భగవద్భక్తుని పరిస్థితి ఏంటయ్యా అంటే, ఎక్కడికి వెళ్ళినా అది carry చేస్తారు. ఇలా బయట చేయడంలో ఉద్దేశ్యం ఏమిటంటే, ఒళ్ళు వంగుతుందని. లేకపోతే ఒళ్ళు వంగదు. ఇప్పుడు చూడండీ బాగా కుర్చీలలో కూర్చుని, అన్నం తినడానికి కూడా table మీద కూర్చుని, కాసేపు పూజ చేయడానికి కింద కూర్చోవాలంటే చిరాకు వచ్చేసింది కదా! మీరంతా అదృష్టవంతులు, కింద కూర్చుని వింటున్నారు. ఎందుకిలా అయిపోయింది? శరీరం చెప్పినట్లు మనం వినే పరిస్థితిలోకి వచ్చేశాం, తప్ప మనం చెప్పినట్టు శరీరం వినే పరిస్థితి పోయింది కదా. ఏది దేని మీద స్వామిత్వం వహిస్తోందో చూస్తే ఆశ్చర్యం వేస్తుంది. మరి అది జరగాలంటే చేయాలి. 10 రోజులు దుర్గా పూజలు చేసినప్పుడు continue చేద్దాం అనిపిస్తుంది. 10వ రోజు రాగానే నెమ్మదిగా ఇంకొకడు వస్తాడు లోపల నుండి. ఇంత ఏం చేస్తాంలే, కొంత తగ్గిద్దాం అనిపిస్తుంది. ఇలా తగ్గించడం, మంచం మీద పడుకోవడంగా అయిపోతుంది. అందుకని ఒళ్ళు వంగాలి. ఒళ్ళు వంగాలంటే, ఎట్లా ఉండాలంటే, ఎవరో పూజ కోసం సర్దక్కర్లేదు. మనమే పూలు కోసుకొచ్చుకోవచ్చు. అందులో ఆనందం ఉంది. గోదాదేవి తండ్రి విష్ణుచిత్తుడు తోట కూడా పెంచుకున్నాట్ట. పూలు లేవు కదా, పూజ ఏం చేస్తాం అనుకోకుండా, తులసి తోట, అందులో తులసీ దళాలు. తనే కట్టుకుంటూ ఉంటే కూతురు కూడా కడతానంటే, సరే కట్టమన్నాడు.

ఆరాధనకి ఇంకొకరి మీద ఆధారపడడం ఏమిటి? అంటే బద్ధకమే కదా! మా ఆవిడ సర్దట్లేదు అందుకనే నేను పూజ చేయట్లేదు అన్నట్టుగా ఉంటుంది. ఇవన్నీ తామస లక్షణాలు. చేసుకోండి. 10, 12 ఏళ్లు పూజ చేయండి. ఆ తర్వాత జీవితం, అంతకు ముందు జీవితంతో పోల్చి చూసుకోండి, మీకు తెలుస్తుంది. పూజకి సమయాలున్నాయి. సంధ్యా సమయం ఉత్తమమైనది. సంధ్యకి గంటన్నర తర్వాత, గంటన్నర ముందు, కూడా ఫరవాలేదు. 9 గంటలకి, 10 గంటలకి, 11 గంటలకి, ఇంక ఈ time లో చేయలేకపోతే చేసుకోవచ్చు కానీ, చేసుకుంటే అప్పుడు చేసుకోవాలి. అలాగే సాయం సంధ్యలో చేసుకోండి. ప్రదోష కాలం అంటాం. శివుడికి చాలా ఇష్టంట. సాయంత్రం పూట పూజ చేస్తే. అందుకనే గుళ్ళల్లో, ఉదయ సంధ్య, సాయం సంధ్య, మధ్యాహ్నం. మొత్తం 8 సార్లు వాళ్ళు పూజ చేస్తారు, సరైన దేవాలయమైతే. ప్రతి మూడు గంటలకి. అంత అక్కరలేదు కానీ కుదర్లేదనుకుంటే, కనీసం అంతర్ముఖంగా అన్నా ఆరాధన జరగాలి. అంతర్ముఖంగా జరగడానికి కూడా శరీరాన్ని పవిత్రీకరించుకుని చేయాలి. మనం అంతర్ముఖంగా అనగానే convenient అని వదిలేస్తాం. వదిలేస్తే కొన్నాళ్ళకి అంతర్ముఖం అదృశ్యమైపోతుంది. ఏది ఏమైనప్పటికీ ఇవాళ మనకి ఒక reminder. ఇది ఒకటి ఉంది మనకి, సాధనలో భాగంగా. పూజ వల్ల తర్వాత మనకి ప్రీతి పెరుగుతుంది, ప్రీతి కలిగిస్తాడు, ప్రీతి వృద్ధి చేస్తాడు. దేనిమీదా? దైవకార్యంలోనూ, దివ్య సంకల్పాలలో పనిచేయడంలోను. ఒకదానికి ఒకటి అట్లా అల్లుకుపోతాయిట కార్యక్రమాలు, ఇందులో ఉంటే! ఇంకా ప్రీతి పెంచుకుంటాడుట, ఇంకా ప్రీతి పెంచుకుంటాడుట. ఎట్లా ఉంటుందంటే, మామూలుగా గాయత్రీ మంత్రం చేసుకుంటే చాలు అనుకున్న మాస్టరు గారు, ఎన్ని వేల రకాలుగా దైవప్రీతి కార్యక్రమాలు చేశారూ? మానవసేవతో సహా సమస్తమూ దైవప్రీతికే! ప్రణాళిక అంతా కూడా అట్లా దిగి వచ్చేసింది కదా. ఎక్కడ నుండి వచ్చింది? 'Start with one, with great sincerity' త్రికరణ శుద్ధిగా ఒక్కటి చేస్తూ ఉంటే, అందులో మనకి ప్రీతి కలగడం వలన ఇంకొకటి చేద్దాం అనిపిస్తుంది. అందులోంచి ప్రీతి కలగడం వలన ఇంకోటి చేద్దాం అనిపిస్తుంది. అట్లా ఒక్క మనిషి వంద పనులు చేస్తూ ఉంటాడు. ఒకదానికి ఒకటి నీకు చేరుతూ ఉంటుంది. నది

ప్రవహిస్తుంటే పిల్లకాలువలు అన్నీ చేరి పెద్దపెద్దవైపోయి చివరికి సముద్రంలో కలిసే ముందు ఎంతది అవుతుంది? ఉన్నది మానెయ్యడం గొప్ప కాదు. ఉన్నది మానేయకుండా వాటికి ఇంకా అవీ, ఇవీ చేర్చడం గొప్ప. గొప్ప కాదది. గొప్పకి చెస్తే బరువెక్కివదిలేస్తాడు. ప్రీతి కలగడం వల్ల చేస్తాడు. ప్రీతికే ఇవన్నీ పెరుగుతూ ఉంటాయి. గ్రంథ పఠనం చేస్తూ ఉంటాడు. గ్రంథం యొక్క సారం వినిపిస్తూ ఉంటాడు. తను పూజ చేస్తూ ఉంటాడు. పూజ నేర్పుతూ ఉంటాడు. వేదం చదువుతూ ఉంటాడు, వేదం నేర్పుతూ ఉంటాడు. ఇతరులకు సేవ చేస్తూ ఉంటాడు, సేవ చేయడం ఎట్లాగో ఇతరులకి చూపిస్తూ ఉంటాడు. విద్య నేర్పుతాడు. వైద్యం చేస్తాడు. గ్రంథాలు రాస్తాడు, గ్రంథాలు చదువుతాడు. సహాయం చేస్తాడు. ఎన్ని రకాలుగా పెంచుకుంటాడో! Multi-dimensional గా భగవంతుని యొక్క ప్రీతి కొరకు పని చేయడం అనే స్ఫూర్తి ఎట్లా వస్తుంది అసలేదో ఒక కేంద్రం లేకుండా? అందులోంచి అంతకంతకీ అంతకంతకీ పెరుగుతుంది తప్ప, అట్లా ఉండిపోదు. అదే అంతంత మాత్రంగా చేస్తున్నాంట అంటే మనం ఏమీ చేయట్లేదని అర్థం. గింజ వేస్తే అది ఎన్నిరకాలుగా విచ్చుకుంటోంది? ఓ మర్రిచెట్టు, ఓ రావి చెట్టు, ఓ వేపచెట్టు శాఖోపశాఖలుగా విచ్చుకోవడం అనేది సృష్టిలో ఒక సహజమైన లక్షణం. మనం అట్లా తాటి చెట్టల్లే ఏ ఉపశాఖలు లేకుండా, ఏ నీడా ఇవ్వదు తాటి చెట్టు. పండుకూడా చాలా పైన ఉంటుంది, కోసుకోవడానికి వీలు లేకుండా. అది పడితే తినాల్సిందే. అందుకే అంటారు 'ఎందుకురా పెరిగావు తాటి చెట్టల్లే' అంటారు. అందుకని ఒకదాంట్లోంచి ఒకటి, పెరగడం ఎప్పుడు జరుగుతుంది అంటే ప్రీతి పెరగడంవల్ల జరుగుతుంది. పెంచుకున్నది ఏదీ మానడు. ఎందుకు మానడు అంటే దానియందు ప్రీతి ఉండడం చేత. మనం చూడండి, TVలో చూస్తుంటే programme మీద programme, programme మీద programme ఎట్లా పెరిగిపోతున్నాయీ? మొదట్లో ఒకటో రెండో ఉండేవి మనకి channels. అక్కడ నుండి ఏడు అయినాయి, ఎనిమిది అయినాయి, ఇప్పుడు 39 అయినాయి. 68 కూడా ఉన్నాయి నాన్నా, 80 ఉన్నాయి ఇంకొకటి పెట్టుకుంటే, అంటే ఓహో అని అవి కూడా తెచ్చి పెట్టేసుకుని ఎన్ని చూసేస్తున్నావూ? ఎక్కడా తీరిక ఉండడంలేదు. తీరిక ఉండకపోవడం వల్ల అక్కడే అన్నం తినడం, అక్కడే tiffin చేయడం వరకు

వచ్చేశాం కదా. ఏమిటి కారణం? ప్రీతే! అట్లాగే భగవంతుని ఆరాధన చేస్తే కూడా ప్రీతి పెరిగిపోతూ ఉంటుంది. ఓ రామాయణం చదువుదాం అనిపిస్తుంది. అనిపించట్లేదు అనుకోండి, basic లేదు, గింజ పడలేదు! ఓ భాగవతం తెరుద్దామనిపిస్తుంది, ఓ భగవద్గీత చదువుదామనిపిస్తుంది. ఓ దేవాలయానికి వెళ్దామనిపిస్తుంది. ఏం వెళ్తాంలే, ఎప్పుడూ ఇదేగోల! అనిపిస్తోంది అనుకోండి అంటే గింజ లేదన్నమాట, ఇంకా పాతలేదు. అలా పిడకలో పెట్టి ఉంచాం. మాస్టరుగారు 'విత్తనాలన్నీ పిడకలో పెట్టి ఉంచితే ఏం లాభమోయ్! భూమిలో వేయాలి, అది మొలకెత్తాలి. పిడకలో విత్తనాలు పెట్టుకుంటే ఏం ఉపయోగం లేదు కదా!' అనేవారు. ఆచరణలోకి రావాలి. ప్రీతి పెరగాలి. ఒకదానికొకటి ఇంక పెరగాలి తప్ప ఏదీ తగ్గించుకుందాం అని చూడకండి ఆ మార్గంలో. తొందరగా ఇది అయిపోతే బాగుండు, ఇహ మనం శెలవు తీసుకోవచ్చు అన్నట్టుగా ఉంటే కాదు. విష్ణు సహస్రనామం అయిపోతే హాయిగా ఉంటుంది. అట్లా ఉండదు నిజమైన భక్తుడికి. ఇంకోటేదో పెట్టుకుంటాడట. జన్మాంతం చెప్పుకుంటూ ఉంటాడు. 30 సంవత్సరాలు చెప్పారండీ మాస్టరుగారు! భారత, భాగవత, రామాయణాదులు, ఇదీ అదీ ఇంక ఇదేంటంటే జ్యోతిషం అన్నారు. అయితే ఇంకేంటంటే శకునం అన్నారు. అయితే ఇంకేంటంటే హోమియో అన్నారు. ఇంక అంటే ఏం ఉంది చెప్పడానికి, వాఙ్మయంకి ఏమన్నా తక్కువ ఉందా? నారద భక్తిసూత్రాలన్నారు. పతంజలి యోగసూత్రాలన్నారు. భగవద్గీత అన్నారు. ఎన్నిలేవు? 'పిచ్చిగా ఊరికే అట్లా చెప్పుకుంటూ ఉంటాడు' అనుకునేవారు. ఒక్కొక్కసారి కేవలం ముగ్గురు వితంతువులు కూర్చునేవారు మాస్టరుగారు పాఠం చెప్తూంటే, అంతే ఎవరూ ఉండేవారు కాదు. ఒకావిడకి 80 ఏళ్లు, ఇంకొకావిడకి 70 ఏళ్లు, ఇంకొకళ్ళకి, ఒక 50 ఏళ్లు. అదీ ఎందుకయ్యా అంటే మందు కావాలి తరువాత! అయినప్పటికీ 30 సంవత్సరములు మహానుభావుడు, ఎందుకు చెప్పారు? ఆయన ప్రీతి కోసం చెప్పుకున్నారు. ఏమిటి మాస్టరుగారూ అంటే 'నీ కోసం కాదురా, నాకు ఆనందం కోసం చెప్పుకుంటున్నాను' అనేవారు. 'మీరు వినకపోతే ఏంటిరా బోలెడు మంది అదృశ్య లోకాల్లోంచి వస్తారు, నేను చెప్తుంటే వినడానికి' అనేవారు. వాళ్లకోసం చెప్తున్నాను, మీ కోసం కాదు అనేవారు. మహాభారతం చెప్తుంటే

ద్రౌపది అట్లా వచ్చి మూల కూర్చోని వినేదిట. ఓ రోజు మాస్టరుగారు ద్రౌపది గురించి చెప్తుంటే, ఎంత అద్భుతంగా చెప్పారంటే అందరూ time మర్చిపోయారుట. 'ఏంటి మాష్టారూ ద్రౌపది గురించి ఇంత అద్భుతంగా ఎవ్వరూ చెప్పలేదు అంటే, అవును ఇవాళ ద్రౌపది వచ్చింది మన సభకు' అని చెప్పారు. మనకి చాలా busy గా తిరిగేశాం కదా. అట్లా ఉంటుంది, వాళ్ళు చెప్పుకుంటున్నారుట అంటే వాళ్ళకి వేరే ప్రీతి ఉంది. మనుషులు రాకపోతే పాఠం చెప్పం అనేది ఏమీ ఉండదు. ఒక్కడున్నా చెప్పుకుంటారుటండీ. లేకపోతే తనే చదువుకుంటాడు. ఏమిటది ఆ ప్రీతి? ఎన్ని పెట్టారు మాస్టరుగారు? బాబోయ్ అనిపించే అన్ని పెట్టారు. ఆయనలాగ మనం కూడా చేద్దామని అన్నీ మీద వేసేసుకుని, కిందపడి మీదపడి, చతికిల పడిపోయిన వాళ్ళు బోలెడు మంది ఉన్నారు. ఆయనలాగే మనం కూడా పునాది రాయివేసి, దానిమీద ఇంకొక ఇటుక పెట్టి cement చేసి, దానిమీద ఇంకో ఇటుక పెట్టి cement చేసి, అట్లా కట్టుకురావాలి. ఊరికే ఆబగా అన్నీ చేద్దామంటే అవ్వవు. పద్ధతి ఉంది. ఆయన గాయత్రితో మొదలు పెడితే, CVV గారు వచ్చారు. CVV ధ్యానం చేస్తుంటే ఇంకోటి వచ్చింది, అది చేస్తుంటే మరొకటి వచ్చింది, అది చేస్తుంటే ఇంకొకటి వచ్చింది. అట్లా అట్లా అట్లా, ఒక పెద్ద మర్రిచెట్టు అయిపోయింది. ముందే మనం మర్రిచెట్టు తెచ్చి పాతితే ఉంటుందండీ? మర్రిగింజ మర్రిచెట్టు అవ్వాలి. అట్లా పెరుగుతుంది,

౨౦౬ ప్రీతివర్ధనః

ప్రీతివర్ధనం అన్న దాని కోసం చెప్తున్నా. అంతకంతకీ అంతకంతకీ కళ పెరుగుతుంది. మాస్టరుగారు తలంటిపోసుకుని ధోవతి కట్టుకుని కనిపిస్తే ఎంత అద్భుతంగా ఉండేవారో! అప్పుడప్పుడు ఆయన్ని పోరేవాళ్ళం, మీరు కొంచెం క్షవరం చేయించుకోబోకండి అని. ఎందుకంటే వాడు సరిగ్గా చేసేవాడు కాదు. అంటే 'నీ మొహం, క్షవరం బట్టి బాగుంటుందేమిటి?' అనేవారు. మనబట్టి మనం బావుండాలి గానీ క్షవరం బట్టి, బట్టల బట్టా, అని. అందుకని పెంచాలి మనం. అంతకంతకీ అంతకంతకీ నాసి కాకూడదు. నాసి అవుతున్న కొద్దీ ఎట్లా ఉంటుంది అంటే ముప్పై ఏళ్ళు చేశాం, ఏం లాభం అనిపిస్తుంది. ఏం లాభం లేదు ఎందుకంటే చేయాల్సిన పద్ధతిలో చేయలేదు. ఇల్లు కట్టడం పేకల్లాగా కట్టడం కాదు కదండీ. ఇటుక ఒకదానిమీద ఒకటి పేర్చేస్తే అయిపోతుందా? గాలివేస్తే పడిపోతుందండి. అదే కదా మనకి చిన్న కష్టం. గాలి! అది వస్తే అన్నీ మానేస్తాం. ఈ దేవుడూ, ఈ గురువులూ ఎందుకు అనిపిస్తూ ఉంటుంది. ఇంతకన్నా better గురువున్నాడేమో పట్టుకుందాం అనిపిస్తుంది. ఇంతకన్నా మంచి దేవుడున్నాడేమో పట్టుకుందాం అనిపిస్తుంది. మాష్టరుగారు బాగా రాశారు శంఖారావంలో. హనుమంతుడితో మొదలు పెడతారుట. అది తీసేసి వినాయకుడ్ని పెడతాడట, అది అంత పెద్ద force గా లేదని చలిమిడి సుద్దగా ఉందని బాల సుబ్రహ్మణ్యాన్ని పెడతాడుట. అదీ తీసేసి వెంకటేశ్వర స్వామి అంటాడుట. అదీ తీసేసి డబ్బులు రావట్లేదని అమ్మవారి బొమ్మ పెడతాడట. ఏమిటేమిటో తంటాలు పడతాడుట. ఇందులో వీడి బొంద వీడి బతుక్కి ఏ ఒక్కడైనా చాలు అన్నారు. ఇవన్నీ cosmic intelligences. వీడికి కావలసినదెంతా? వాళ్ళు చేయలేనిది ఏమున్నదీ? ఎందుకిలా మనం పక్కదారులు పడతామంటే అసలు కుదురుగా ఒక చోట, కుదుళ్ళు ఏర్పడవు. ఆ విత్తనం, అక్కడేదో వేళ్ళు పెరిగేలోపల దాన్ని పీకి ఇంకోచోట వేస్తూంటాం. దానికి చచ్చే చావు, మళ్ళీ అక్కడ పెరిగేది. అక్కడ నుండి పీకి ఇంకొక చోట వేస్తూ ఉంటాం. పెంచుకుందాం అని పెంచుకోవద్దు. ప్రీతిగా ఉంటే పెంచుకోండి. ప్రీతి కలగట్లేదు అంటే కనీసం మన గురించి తప్పుడు అంచనాలు ఎక్కువగా వద్దు. మనం చాలా గొప్పవాళ్ళం, మనం మంచి భక్తులం, మాస్టరుగారి శిష్యులం,

చాలా పొరపాటు, మాస్టరుగారి శిష్యుడిని నేను అని ఎవడన్నా అంటే note చేసుకోండి. ఆయన చెప్పాలి వీడు నా శిష్యుడని. 'నేను EK గారి శిష్యుడ్ని అండి' అని చెప్తే అది చాలా అపచారం. Master EK must say 'This is my disciple'. లెక్క అటు నుండి ఇటు, ఇటు నుండి అటు కాదు. You can't appoint your Guru, This is my Guru అంటే this is my driver అన్నట్టుగా కాదు. He should be pleased. When will He be pleased? When we do things as He said or as He did. అట్లా ఉండాలి.

౨౦౬, ౨౦౭ విహాయసగతిః, జ్యోతిః

విహాయ సగతిర్జ్యోతిః అంటే చక్కని వాయుమార్గాన ఆకాశంలో సంచరించే జ్యోతి. ఆ వాయుమార్గాన్ని పట్టుకుంటే మనలో కూడా ఆ జ్యోతిని అంతర్ముఖంగా దర్శనం చేయవచ్చు. అందుకనే మనకి ప్రాణయామం ఆధారంగా హృదయాన్ని చేరుకోవడం, హృదయ స్పందన యందు సింహాసనాసీనుడైన తత్త్వాన్ని వెలుగుగా దర్శించడం జరిగితే, అనాహత చక్రం వాయుతత్త్వానికి ప్రతీక కనుక అక్కడ వాయువు చోటులో భగవంతుడు మనకు వెలుగు గా దర్శనం ఇస్తాడు. వెలుగు దర్శనం అయితే ఆ వెలుగుకి కిరణం తప్పదు కదా! జ్యోతి ఉండగానే కిరణములు, కిరణముల ప్రసారము ఆ చుట్టూ ఉండే పరిసరాలను వెలుగుగా మార్చటం ఇవన్నీ ఉంటాయి. సాధకుడు ఎప్పుడైతే అంతర్ముఖంగా, ప్రాణ వాయువు/ శ్వాసను ఆధారంగా చేసుకుని అంతర్ముఖుడై హృదయంలో ఉండే వెలుగును దర్శిస్తాడో అప్పుడు ఆ వెలుగులోంచి కిరణముల ప్రసారం తనయందు పరిపూర్ణంగా జరుగుతుంది. అది కారణం చేత 'హుతభుక్' సమస్తాన్ని భుజిస్తాడు. మనలో వుండే undesirables /ఉండకూడనివి/ కల్మషములన్నీ కూడా ఆ వెలుగు హృదయంలో ధ్యానం చేస్తూ ఉండడం చేత —— ఆ సమస్తాన్ని 'క్షుత్పిపాసామలాం జ్యేష్టాం అలక్ష్మీర్నాశయాం' అని శ్రీసూక్తంలో చెప్పినట్లు--, అంతర్ముఖంగా ఆ వెలుగు దర్శనం చేస్తూ వుంటే, దానొంచి వచ్చే కిరణములు మనలోని కల్మషాలని నిర్మూలిస్తూంటాయి. ఆ నిర్మూలనము జరిగితే 'విభుః' అంటే extra brilliance అయిన వెలుగు. ఆ మొదట కనిపించిన వెలుగు మనకి మసకబారిన చిమ్నీ లోంచి దీపంచూసినట్లు గా ఉంటే, ఆ తర్వాత కల్మషాలన్నీ బాగా తొలగింపబడడం వలన లోపల విశిష్టమైన 'భా' అంటే వెలుగుతో కూడిన తత్త్వం మనకి గోచరిస్తుంది. అప్పుడింక పూర్ణ దర్శనం / సమగ్ర దర్శనానికి దగ్గరవుతాం. ఆ విధంగా 'విహాయ సగతిర్జ్యోతిః సురుచిః హుతభుక్ విభుః' అయ్యింది. అంత అద్భుతమైన వెలుగు దర్శనం జరగగానే, రవము అనే శబ్దము నుండి పుట్టినది రవి. కనుక రవము/శబ్దము నుండి వెలుగు పుట్టింది కనుక తర్వాత మెట్టుగా శబ్దము వినిపిస్తుంది. అదే మనలో ఉండే నాదం/ అనాహతమైన

శబ్దము. ఆ రవాన్ని వింటూ ఇంకొంచెం లోతుల్లోకి వెళ్ళితే ఆ రవం కారణంగా ఈ వెలుగు మనలో ప్రజ్వలించి ఉన్నదనే భావన మనలో బాగా స్థిరపడుతుంది. అంతర్ముఖంగా బాగా ముందుకు పోతుంటే సాక్షీభూతుడైన భగవంతుడిగా 'విరోచనుడు' అంటే All seeing Eye. మనలో ఉన్నాడు, మనగా ఉన్నాడు, అన్ని స్థితులలోనూ మనకు అతడు వెన్నుదన్నుగా ఉన్నాడు. సాక్షీభూతుడుగా, భగవంతుడు తనయందే ఉండి సర్వకాలసర్వావస్థలయందు తనను నిర్వర్తిస్తున్నాడన్న భావం సాధకుడికి సత్యమై తెలుస్తుంది. అక్కడ నుండి మనలో 'విరోచనుడి' ఆవిర్భావం జరుగుతుంది. ఆ తరువాత 'సూర్యః' అంటే అన్నిటినీ తాను ధరించి వ్యక్తం చేసేవాడు. గర్భధారణ చేస్తుంటాడు. పై వెలుగులోకాల నుండి తానందుకుని తన నుండి గోళాలను, గోళాల మీద జీవులను, తన నుండి వ్యక్తం చేస్తాడు. సూర్యుడు ఏ విధంగా గోళాదులను, గోళాల మీద జీవులను వ్యక్తం చేస్తున్నాడో అలాగే ఆ స్థితిలో సాధకుని నుండి కూడా దివ్యమైన ప్రణాళిక దిగి వ్యక్తం అవుతూంటుంది. అద్భుతమైన కార్యాలు జరుగుతూంటాయి. చాలా చిత్రవిచిత్రాలు అతని నుండి అన్నీ వ్యక్తం అవుతాయి, ఎందుకంటే, సాక్షీభూతుడైన భగవంతునితో తాను అనుసంధానం చెందడం వలన, విరోచనుడు సూర్యతత్త్వాన్ని అందుకుంటాడు. సూర్యః అంటే అట్లా అల్లిక చేసుకుంటూ వ్యక్తం చేస్తూ వుండేవాడు. ముందు 'హుతభుక్' అంటే ఉన్న కల్మాషాలన్నీ హరించిపోవడం వలన ఆ తరువాత 'రవిః', 'విరోచనః', 'సూర్యః' అప్పుడు మనకి మనం కాక, మనలోపల ఉండే వెలుగుకి అసలు కారణభూతమైన వెలుగుగా, సమస్తమైన విశ్వాత్మచైతన్యంగా ఉన్న వెలుగు దర్శనమిస్తుంది. అది సవితృదర్శనం. రవిర్విరోచనః అంటే మనలో ఉండే కుడికన్ను. ఈ సమస్తమైన అవ్యక్తమైన తత్త్వం, ఈ సూర్యతత్త్వాన్ని ఆధారముగా/కన్నుగా చేసుకుని ఈ సమస్త సృష్టిని కూడా సంరక్షిస్తోందనే భావనలోకి మనం పెరుగుతాం. ఈ నామాన్ని ఆరోహణాక్రమం లో సృష్టిపరంగా, సాధనపరంగా అవగాహన చేసుకున్నాం. శ్వాసతో మొదలు పెట్టి అంతర్ముఖుడై వెలుగు ధ్యానం చేసుకుంటూ (అందుకే హృదయంలో బంగారు కాంతులను ధ్యానం చేసుకోమని శ్రీసూక్తం చెప్తుంది). ఆ వెలుగులు బాగా పెరుగుతూ ఉంటే మలినాలన్నీ హరింపబడడం చేత, మరింత వెలుగు

అక్కడ అవతరించడం చేత, రవము/శబ్దము తెలిసి అక్కడ నుండి ఈ సమస్తానికీ మనయందు ఆధారభూతుడుగా వున్నాడు, సాక్షీభూతుడుగా ఉన్న విరోచన దర్శనం జరిగి, ఆయనయే ఈ సమస్తాన్నీ అల్లిక చేస్తున్నాడు కనుక ఆయనతో మనం అనుసంధానం చెందడం చేత, మన నుండి కూడా ఆ ప్రణాళిక అద్భుతంగా దిగి వస్తూంటే తాను సాక్షీభూతుడుగా సమస్తాన్నీ అనుభూతి చెందుతాడు. ఈ విధంగా సాధనాపరంగా కూడా ఈ నామాలన్నీ గోచరిస్తాయి.

సగతి అంటే మంచి మార్గం. విహాయ సగతి అంటే వాయువులో ఉన్న మార్గంట అది. అంటే చుట్టూ చోటులో ఉండే ఆకాశమార్గం. ఆకాశమార్గంలో తిరుగుతున్న జ్యోతి. కౌన్ హై, సూర్యుడు. విహాయ సగతిర్ జ్యోతిః —— మనకి ఆయన అట్లా ఆకాశంలో చక్కగా ఇటు ఉదయించి అటు వెళ్తున్నట్టుగా, ఏదో రథం ఉన్నట్టు, రథానికి ఏడుగుర్రాలు ఉన్నట్టు, కవి సమయంగా చాలా చెప్పుకున్నాం, వర్ణించుకున్నాం. అట్లా ఆకాశ మార్గంలో తిరుగుతున్న జ్యోతిగా దర్శనం చెయ్. అసలు సూర్యుడిని చూస్తున్నావా? తెల్లారిపోయింది, time ఎంతో అయిపోయింది, tiffin ఎప్పుడు చేసుకోవాలి, పిల్లల్ని school కు ఎప్పుడు పంపించాలి, మధ్యాహ్నంకి ఏమి వండుకోవాలి, ఆ తరువాత ఎన్నింటికి లేచి కాఫీ తాగాలి, ఆహా- చీకటి అయిపోయిందా అని ఇట్లా అయిపోతుంది. మనకొక సాంప్రదాయం ఉంది భారత దేశంలో. కొంతమంది సూర్యుడిని చూడనిదే పచ్చి మంచినీళ్ళు కూడా పుచ్చుకోరు. ఆ రోజు మబ్బేసి సూర్యుడు కనపడకపోతే ఇంకేం తినరుట. మా మేనమామ భార్య ఒకావిడ అట్లా ఉండేది. మబ్బేయంగానే అత్తయ్యా మరి ఇవాళ ఇంతే సంగతులు నీకు అని చెప్పేవాళ్ళం. పోనీలేరా, ఆయన కనపడకపోతే మనం తినేదే ఏంటి, ఇచ్చేది ఆయన కదా, అనేది. మనము అన్నీ multi storied చుట్టూ పెట్టుకుంటామేమో, అసలు సూర్యోదయం అనేది ఒకటి ఉంటుందని కూడా తెలియదు, ఊరి బయటికి వెళితే తప్ప. అట్లా ఆకాశంలో చక్కని మార్గంలో అదే విధంగా ఎప్పుడూ పయనిస్తున్న జ్యోతి సూర్యుడు.

౨౦౪ సురుచిః

అదిట మంచి రుచి. ఏది? దాన్నించి వచ్చే కిరణాలు. జ్యోతి ఎక్కడ ఉంటే అక్కడ కిరణాలు ఉంటాయి కదా. దీపం దాని యొక్క కాంతి ప్రసరించకుండా ఉండదుగా. ఆ రెండూ విడతీయరాని సంబంధం. దీపం నుండి కాంతులు వెదజల్లబడుతూ ఉంటాయి. జ్యోతి యొక్క వెలుగు కిరణములుగా ప్రసరించి మనకి అందుతున్నాయి కదా! అట్లా అక్కడే ఉండి పై నుండి కిరణం రాకపోతే మనం దాన్ని చూసేది ఏమీ లేదు. కిరణ రూపంగా మన దగ్గరకి వచ్చి, మనకి కూడా చూడడానికి అవకాశం కల్పిస్తోంది. కన్ను చీకట్లో కనిపించదుగా! వెలుగుంటేనే కనిపించేది. కాబట్టి ఈ కన్ను ఏం చూడగలదు అంటారు. చీకట్లో చూడలేని కన్ను, అదేం కన్ను? లోపల సూర్యుడు ఉన్నాడు కదా మరి? మరి అక్కడ నుండి కిరణాలు వస్తే కనిపిస్తాయి. పగలు, రాత్రి, సంబంధం లేకుండా కనిపించే స్థితి ఒకటి ఉంది. వెలుగుంటే కన్ను కనిపిస్తుంది, లేకపోతే కనిపించదు. అందుకనే సురుచి ట. ఆయన కిరణాలు మన వరకు ప్రసరించడం చేత, మన కళ్ళకి కనిపిస్తోంది, అన్నీ చూస్తున్నాం, ఆనందిస్తున్నాం. గుడ్డివాడైతే? మాస్టరుగారు ఎప్పుడూ ఒకటి చెప్తుండేవారు. సంజయుడు ధృతరాష్ట్రుడికి చెప్తాడు 'వేయి సూర్యుల కాంతితో ఉన్నాడు అక్కడ శ్రీకృష్ణుడు' అని. అది ధృతరాష్ట్రుడికి చెప్పడం ఎంత అన్యాయం? అసలు సూర్యుడి కాంతి తెలియదు కదా! గుడ్డివాడికి సూర్యోదయం ఎట్లా తెలుస్తుంది? పుట్టు గుడ్డి. వెయ్యి సూర్యుల కాంతితో మెరిసిపోతున్నాడు అంటే దుఃఖ పడతాడట ధృతరాష్ట్రుడు. ఒక సూర్యుడినే చూడకపోతిమే, వెయ్యి సూర్యుల కాంతి అంటే ఏం తెలుస్తుంది? అని. అట్లాగే మనకి సూర్య కాంతి సురుచి! దాన్నుండే సమస్తమైన ప్రాణము, ఆత్మతత్త్వము దిగి వస్తుంది. జీవులు దిగి రావడం సూర్య కిరణాల ద్వారానే! ప్రాణం దిగి రావడం సూర్య కిరణాల ద్వారానే!

౨౦౨ హుతభుక్

సూర్య కిరణం అటు నుండి ప్రాణాల్ని పట్టుకొస్తుంది, జీవులను పట్టుకొస్తుంది, ఇటు నుండి అటు పట్టుకెళ్ళిపోతూ ఉంటుంది. తినేస్తుంది కదా. వేసవి కాలం వస్తే తినేయడం లేదూ? అన్నీ ఎండిపోతాయి కదా. సమస్తమూ తినేయగలదుట. అక్కడ నుండి ఉన్నదానికన్నా ఎక్కువ కాంతి (ఇప్పుడు అదే కదా మనవాళ్ళు sunspots అంటున్నారు) ఇక్కడకి వచ్చిందంటే ఇక్కడ ఉండేవన్నీ మళ్ళీ అటు వెళ్ళిపోతాయి హోమం చేసినట్టు. హోమం ముందు చిన్న గిన్నె పెట్టుకుంటాం. పెద్ద పళ్ళెం నిండా బోలెడు పెట్టుకుంటాం. ఇవతల ఇన్ని సమిధలు పెట్టుకుంటాం. అవన్నీ మామూలుగా హోమం గిన్నెలో పడతాయా, అట్లా వేస్తే? కాని ఎన్ని వేసినా వెళ్లిపోతున్నాయి కదా. అట్లాగే సూర్యుడి చుట్టూ ఉన్న ఇంత గ్రహగోళాదులు, వాటిలో ఉండే జీవరాశులు, అంటే వృక్షాలు, జంతువులు, మనుషులు, ఆ గోళ పదార్థం, అందులో ఉండే ఖనిజాలు, అన్నీ కూడా మన భాషలో చెప్పాలంటే 'హోం ఫట్' చేసేయగలడు. అదీ హుతభుక్! పీలిస్తే వచ్చేస్తుంది మొత్తం అంతా కూడా. మనం ఊరికే అట్లా straw పెట్టి లాగేస్తాం చూడండి కొబ్బరినీళ్ళు. అట్లా లాగేస్తాడట. అదీ హుతభుక్!

౨౧౦ విభుః

విభుః అంటే విశిష్టమైన వెలుగు అని అర్థం. ఎక్కువ voltage వస్తే పేలిపోవూ అన్నీ? TVలు పేలిపోతాయి, Fridgeలు కాలిపోతాయి, Tubelights పగిలిపోతాయి. ఏమిటండీ అంటే కొంచెం High voltage వచ్చిందండీ అంటాడు Electric station వాడు. అన్నీ కాలిపోయాయి కదయ్యా అంటే, మేమేమి చేస్తాం సార్, అంటాడు. అట్లాగే ఈ సూర్య మండలానికి సంబంధించినంత వరకు సమస్తానికి జీవనాధారం, ప్రాణమూ అతనే, జీవుడూ అతనే. ఇక్కడకి దిగి వచ్చినవాడు, ఈ సమస్తమూ ఇటు నుండి అటు తీసుకుపోవాలంటే, భుః (భా అనే శబ్దం వెలుగు) అంటే విశిష్టమైన వెలుగుగా అతడు పరిధవిల్లు నప్పడు, ఈ మొత్తం గోళాలన్నీ అందులోకి వెళ్ళిపోతాయండీ. అదీ ఇంకొక దాంట్లో నుండి వచ్చింది. అక్కడి నుండి వచ్చి అదీ వెళ్ళిపోతుంది. అందుకని ఆయనకి తెలుసు, ఏ విధంగా మొత్తం అంతా తనలోకి తెచ్చేసుకోవాలో. సాలె పురుగు ఎక్కడ నుండి తీస్తుంది సాలెగూడు? తన లోపల నుండి అన్నీ అట్లా స్రవించి, వచ్చేస్తుంది. మళ్లీ ఒక్కొక్కటి ఒక్కొక్కటి తనే మింగేస్తూ ఉంటుంది. అంతే ఆయన విభువుగా వస్తే! 'విభో విశ్వనాథం' అంటాం, విశ్వనాథుడు అట్లా వచ్చాడనుకోండి, శివతత్త్వంగా. ఒక్కసారి అన్నీ తనలోకి తీసుకుపోగలడు. అదీ విభుః. విశిష్టమైన వెలుగుగా. ఈ ౨౪వ శ్లోకమంతా కూడా సూర్యపరంగా, వెలుగుపరంగా ఉంటుంది.

2111 రవిః

రవి అంటే మనకి సూర్యుడు అని తెలుసు. సూర్యుడు అంటున్నాం, మళ్ళీ రవి అంటున్నాం. రవి అంటున్నాం అంటే ఇంకొకటి ఏదో ఉద్దేశించి చెప్తున్నారు అని మనకి తెలియాలి. ఇంకొక లక్షణం ఏదో ఉందని తెలియాలి. రవి అన్న పదం 'రవః' అనే పదం లోంచి వచ్చింది. రవము అంటే శబ్దము. శబ్దం లోంచి వెలుగు పుట్టుకొస్తుంది. అందుకని అట్లా 'శబ్దంలోంచి పుట్టుకొచ్చిన వాడివి నువ్వు' అని చెప్పటానికి రవి అని చెప్తారు. రవితేజ అంటాం కదా. ఈ వెలుగు యొక్క తేజస్సు ఎక్కడ నుండి వచ్చిందంటే, ఆ రవం లోంచి వచ్చింది. రవమే లేకపోతే ఏమీ లేదు. అందుకనే ఆ భాషని 'అరవము' అన్నారు. అరవము అంటే రవము లేనిది అని అర్థం. అగస్త్యుడికి, పోన్లేవయ్యా రవం లేకుండానే వాఙ్మయం సృష్టిస్తాను అని మొదలుపెట్టి చేశాడు ఆయన. అయినప్పటికీ ఉద్ధరింపబడేట్టుగా. కానీ ఎక్కడా రవం ఉండదు. అంటే, వేదంలో ఉండే రవము, శబ్దము, తద్వారా వ్యక్తం అయ్యే వెలుగు. అందుకని చదువుకోవాలి వేదసూక్తాలు. అదృష్టం మనకి మాస్టరుగారు బోలెడు సూక్తాలు మన అందరి చేత పలింప చేశారు. బాగా రోజూ శ్రీసూక్తం, పురుష సూక్తం, సరస్వతీ సూక్తం, విష్ణు సూక్తం, రుద్ర సూక్తం ఉన్నాయి కదా, అవి ఎంత చదివితే అంత వెలుగు పుడుతుంది లోపల. వెలుగు పుట్టాలంటే 'సుశబ్దంబుల్ పలుకుము నాదు వాక్కునన్ సంప్రీతిన్ జగన్మోహిని', ఉంది కదా పద్యం. సుశబ్దాలని చక్కగా ఉచ్ఛరిస్తూ ఎలుగెత్తి చదవాలి. అందుకనే మొట్ట మొదట ఆశ్రమంలో చేరిన విద్యార్థులకు గంటసేపు గొంతు బాగా సాన పట్టేట్టుగా అభ్యాసం చేయిస్తారు. మనం విష్ణు సహస్రనామం చదువుతుంటే కిందకి వినపడదు, రెండు గొంతులు తప్ప. గొణుక్కోవడమే! ఎందుకని? రవం లేదు. రవం లేకపోతే వెలుగు లేదు. There is no sound, there is no light. భగవంతుడి మొదటి శరీరం శబ్దము. రెండవ శరీరం వెలుగు. అందుకని శబ్దాన్ని చదివితే ఏం జరుగుతుంది? వెలుగు పుడుతుంది. ఊరికే అరవడం కాదు. తెగ అరుస్తాం వాళ్ళ మీద, వీళ్ళ మీద. అప్పుడు కూడా వచ్చేది వెలుగే కానీ, రావాల్సిన పద్ధతుల్లో రాక, నిన్ను కాల్చేస్తుంది. అప్పుడూ పుట్టేది శక్తే శబ్దం లోంచి.

వెలుగు పుట్టేట్టుగా ఉచ్ఛరింపబడ్డాడు. రవి అంటే 'ఓస్ నువ్వు కాదోయ్, నిన్ను పుట్టించింది ఒకటి ఉంది' అని చెప్పడం. అందుకనే గాయత్రి చదువుకోవడం. గాయత్రి బాగా చదివామనుకోండీ, అన్నీ ఎందుకండీ అనిపిస్తుంది. బాగా గాయత్రి చదివితే వెలుగు పుడుతుంది. అందులో ఒక రహస్యం ఉన్నది. మనం పది సార్లు చదివేసరికి హమ్మయ్య అయిపోయింది కదా ఇక 'శంనో మిత్రః' అన్నట్టుగా ఉంటుంది మనకి. శ్రద్ధా భక్తులతో చేయాలి. మనకి ఒకే వెలుగు మూడుగా ఉన్నాయి. 'ఆదిత్యః సవితః సూర్యః'! నారాయణ లోకం, వాసుదేవ లోకం, విష్ణు లోకం! పరమ శివుడు, శివుడు, సదా శివుడు! ఇట్లా మూడు మూడు. కాబట్టి మూడు లోకాల్లోంచి మన దగ్గరకి వెలుగొచ్చి, మన ఈ రాచ్చిప్పను (బుర్రను) వెలిగించే మొత్తం కథ అంతా కూడా గాయత్రిలో ఇచ్చి, మగ లేదు, ఆడ లేదు అందరూ చేసుకోండి అని చెప్పారు మాస్టరుగారు. శబ్దం చక్కగా ఉచ్ఛరించటం చేత వెలుగు పెరుగుతుంది. మాస్టరుగారిలో ఉండే ఆ తేజస్సు గాయత్రి తేజస్సే! మనం నిర్వచించడం, నిర్ణయం చేయడం కాదు, ఆయన చెప్పినది. గాయత్రి చేయడానికి కూడా తీరిక లేదు, అంటే ఆయన ఒప్పుకునేవారు కాదు. దేనికీ తీరిక లేదు, పాడు పనులకి తప్ప. రవిః అంటే అర్థం ఏమిటంటే, రవము నుండి ఏర్పడిన వాడివి. రవ్వ పెట్టుకుంటూ ఉంటాం కదా. రవ్వ శబ్దం కూడా అక్కడ నుంచే వచ్చింది. సూర్య తత్త్వం రవ్వకి. రవ్వల ముక్కుపుడకలు, రవ్వల దుద్దులు, ఓపిక ఉంటే రవ్వల గాజులు, అసలు నువ్వే రవ్వ. దాని చుట్టూ బాగా మసి పట్టిపోయింది. బాగా ఉచ్చారణ చేయాలి. ఇవన్నీ మాస్టరుగారు ఊరికే మనకి explanation సమాధానాలు చెప్పకునే పద్ధతుల్లో కాకుండా, చేసుకోండిరా అన్నారు. గాయత్రి ఇచ్చారు, పురుషసూక్తం ఇచ్చారు, శ్రీసూక్తం ఇచ్చారు, విష్ణుసూక్తం ఇచ్చారు. సరస్వతీ సూక్తం ఇచ్చారు, సుపర్ణ సూక్తం ఇచ్చారు. తైత్తిరీయ ఉపనిషత్తు అందరిచేత పఠింప చేయటం, అది best. ఇచ్చారు. విష్ణు సహస్రనామం ఇచ్చారు, లలితా సహస్రనామం ఇచ్చారు. ఏవైతే తలమానికమైన, శబ్ద పరంపరతో కూడినవి ఉన్నాయో అవన్నీ మనకి ఇచ్చారు ఆయన. పూజా విధానంలో కూడా అట్లా ఆయన చక్కగా సమస్త జ్ఞానమూ తనయందు ఆకళింపు చేసుకుని, ఆ పద్ధతి ప్రకారం వాటిని ఇచ్చారు. చక్కగా చదువుకోవడం వల్ల లోపల వెలుగు పెరుగుతుంది. వెలుగు

నుండే మిగతా మూడు శక్తులు వచ్చినాయి. ఇచ్ఛా జ్ఞాన క్రియా శక్తులు. కదా. అందుకనే సూర్యోపాసనగా గాయత్రి పెట్టారు.

౨12 విరోచనః

విరోచనుడు అంటే అట్లా చూస్తూ ఉంటాడట, లోక చక్షువు! అట్లా మొత్తం సూర్యమండలంలో, ఎక్కడెక్కడ, ఏమిటేమిటి జరుగుతున్నాయో తాను కన్నుగా చూసేవాడు. The all Seeing Eye. అంటారు. లోక సాక్షి. అన్నీ చూస్తూనే ఉంటాడు. అందుకనే సూర్యుడు ప్రమాణంగా అంటారు. సూర్య చంద్రులు ప్రమాణంగా వివాహం చేసుకుంటున్నాను, అని తరువాత వదిలేస్తూ ఉంటారు! సాక్షి ఏది అని! సాక్షి ఉంది. వస్తుంది ఎప్పుడో నిన్ను, నీ మెడకు ఉచ్చు లాగా. నువ్వు ఏదన్నా కప్పిపుచ్చచ్చు కానీ, ఆ రెండిటినీ కప్పి పుచ్చలేవు. పంచ భూతాలనీ కప్పి పుచ్చలేవు. అవి సాక్షిగా ఎప్పుడూ సమస్తాన్నీ చూస్తూనే ఉంటాయి. కాబట్టి ఎవరైనా చూస్తే చేసే పనులు మాత్రమే చేయాలి. ఎవరైనా చూస్తే చేయని పనులు, చేయకూడదు. కొన్ని కొన్ని పనులు ఎవరికైనా తెలిస్తే బాగుండనివి ఉంటాయి కదా, అటువంటివి చేయకూడదు అంతే. ఎందుకంటే చూసేవాడు ఒకడు ఉన్నాడు, సమస్తాన్ని చూస్తూ ఉంటాడు. లోక చక్షువు అని అర్థం విరోచనుడు.

013 సూర్యుఁ

సూర్యుడు అంటే, అంతా అల్లేవాడు అని అర్థం. అంతకుముందు తినేసేవాడు. హుతభుక్. ఇక్కడేమో అల్లుతాడట. సమస్తాన్నీ తను ధరించి, తన నుండి వ్యక్తం చేస్తాడు. ఆ పైలోకాల నుండి తనకి వస్తూ ఉంటుందండీ. తరువాత నామం అదే, తమాషాగా. సవితఁ. ముందుది వెనక, వెనకది ముందు, చూసుకుంటే, చక్కటి ఆత్మతత్త్వమే సూర్యుడి తత్త్వం. ఎన్ని స్థితులలో ఉన్నదో చూపిస్తున్నాడు చక్కగా. అప్పటికి అప్పుడు వెతుక్కుని రాయడం, అన్నీ వెతుక్కుని అక్కడ పోగు వేయడం కాదు అలా వచ్చేస్తుంది. పై నుండి తను అందుకున్న తత్త్వం తన నుండి వ్యక్తం అయ్యేసరికి గోళాలుగా వచ్చేస్తుంది. ఏడు గోళాలు ఏడు రకాల వెలుగు ముద్దలు. అన్నీ ఒకటే కాదు. ఏడు వివిధమైన స్థితులలో ఉన్న వెలుగులవి. ఏడు కిరణాలు, ఏడు రంగులు, అట్లా దిగి వచ్చేసింది. వాటి మీదకి మళ్ళీ తన నుండే జీవులు దిగి వచ్చారు. తన నుండే వృక్షాలు దిగి వచ్చేశాయి, తన నుండే జంతువులు. అన్నీ తన నుండి ఇట్లా దింపుకుంటూ వచ్చాడు కదా. అంటే ఏమిటి? తల్లిగా కూడా ఉన్నాడని అర్థం. తల్లి కడుపులోంచి ఎట్లా పిల్లలు వస్తారో, అట్లా ఆయన కడుపులోంచి ఇన్ని వచ్చాయి. అట్లా తీసిన కొద్దీ వస్తూనే ఉంటాయి. ఎంత తీసినా వస్తూనే ఉంటుంది. ఆ పై నుండి వస్తూ ఉంటుంది, అది కిందకి వచ్చేస్తూ ఉంటుంది, మళ్ళీ ఒక పక్క నుండి తినేస్తూ ఉంటాడు. మళ్ళీ వెళ్ళిపోతూ ఉంటాయి, అట్లా చక్ర భ్రమణంగా జరుగుతూ ఉంటుంది. ఈ వెళ్ళిన జీవుడు మళ్ళీ సూర్యుడి కిరణం ద్వారా దిగి వస్తాడని కదా చెప్తారు. 12 నెలలు మన లెక్క ప్రకారం. చంద్ర లోకంలో ఉండి అక్కడ నుండి జీవప్రజ్ఞ సూర్యలోకం లోకి వెళ్ళి, మళ్ళీ సూర్యుడి కిరణంగా దిగి వస్తుంది. కాబట్టి అన్నీ మళ్ళీ అక్కడ నుండి అట్లా దింపుతూ ఉంటాడు. చాలా పెద్ద సంసారి సూర్యుడు. ఐతే ఇవేవీ తన స్వామిత్వంలోనే నడుస్తున్నాయి తప్ప, తనని అధిగమించి లేవు. ఎందుకంటే విభుఃఁ అనే తత్త్వం ద్వారా మొత్తం అంతా పాట్టన పెట్టుకోవచ్చు. పెట్టుకున్నాడు కదా కృష్ణుడు. వంద మందినీ పాట్టన పెట్టుకున్నావు కదా, అంటుంది గాంధారి. వంద మంది ఏమిటి? 18 అక్షౌహిణులలో పదిమంది మిగిలారుట. ఎంత మందిని తినేశాడూ? 'వీళ్ళందరూ నాలోకి

వచ్చేస్తున్నారు, నువ్వు ఊరికే బాణాలు వేయడమే ఆలస్యం' అని చెప్పాడు. విశ్వరూపం చూపిస్తే, ఏం జరిగింది అంటే వీళ్ళందరూ అట్లా ఏమిటో గబగబగబా రైలు దాటిపోతుందేమో అన్నట్టుగా పరిగెత్తుకుంటూ వెళ్ళిపోతున్నారు. ఆయన నాలుక చాపి ఉంచాడట పెద్ద అగ్నిజ్వాల లాగా. త్వరపడి అందులోకి వెళ్ళిపోతున్నారటండీ మళ్ళీ సీటు దొరకదేమో అన్నట్టు. ఇదేమిటి వీళ్ళంతా వెళ్ళిపోయారే అంటే, 'వాళ్ళందరి పని అయిపోయింది, ఊరికే ఆ డబ్బాలు నువ్వు కొట్టుకో' అని చెప్పాడు. మళ్ళీ ఇటు పక్క నుండి దిగివస్తున్నారు. అందుకనే అయిపోవడం లేదు సృష్టిలో. అనంత! ఏదీ అయిపోదు. అయిపోతుంది అనుకునేవాడు అజ్ఞాని. సృష్టే అయిపోదు. అయిపోతున్నట్టు ఉంటుంది. నట్టే! ఒక పక్క అయిపోతూ ఉంటే ఒక పక్కన వస్తూ ఉంటుంది. కత్తిరిస్తే జుట్టే అయిపోవట్లేదు, మళ్ళీ వస్తోంది కదా! గీకితే మీసమూ అయిపోవట్లేదు. ఏదీ అయిపోదు. అయిపోకపోవడం అనేది అద్భుతమైన విషయం. కాకపోతే కాసేపు కనపించినట్టు ఉంటుంది, కాసేపు కనపడకుండా ఉంటుంది. సృష్టి అయిపోలేదు, ఆయనలో గింజ లాగా ఉంటుంది. అదే కదా బ్రహ్మ చూసి ఆశ్చర్యపోతాడు. ఆయన 'ఏదో చాలా పెద్ద పని చేయాలి' అనుకుంటాడు. 'ఓయమ్మో ఇంత పనా! నేనెక్కడ చావను' అనుకున్నాడు. 'నువ్వేమీ చేయక్కర్లేదు, ఒకసారి ఇటు చూడు' అని నోరు తెరిచి చూపిస్తే, బ్యారుమన్నాడు. అంతా అక్కడే ఉంది. ఊరికే మనం మూత తెరిస్తే వచ్చేసింది. దివ్య ప్రణాళిక కూడా అంతే! ప్రపంచానికి ఉంటుంది, ఆయన దున్నేశాడు, పాడిచేశాడు, అదరగొట్టేశాడు అని. ఏమీ లేదు. వాహికగా ఉంటాడు, అది వెళ్ళిపోతూ ఉంటుంది బయటికి ఝుమ్మని. ప్రవాహమే! గంగా ఝరల్లే వెళ్ళిపోతూ ఉంటుంది. అట్లా నీళ్లన్నీ సముద్రంలోకి వెళ్ళిపోతే గంగ ఎండిపోవద్దండీ? అట్లా ఈ సూర్యుడు, ఇంకా అట్లా పుట్టిస్తూనే ఉన్నాడు. ఎప్పటి నుండి? మన భూమికే ముప్ఫై కోట్ల సంవత్సరాలట. మన భూమి పుట్టక ముందు నుండి ఉన్నాడు. ముందు గోళాలు పుట్టించాడు. దాని మీద జీవులను పుట్టించాడు, అదేమిటో, అన్ని గర్భాలు! The greatest conceiver! Conception అంటాం కదా. గర్భధారణ! ఆయన పొట్ట నిండా ఎంత మంది జీవులున్నారో చెప్పలేమని చెప్పడానికి, సూర్యః అన్నారు. అది సూర్యుడు అంటే. రవిః అంటే రవము

లోంచి పుట్టినవాడా అని. సూర్యః, అట్లా పుట్టించుకుంటూ వస్తున్నాడు. పిల్లల కోడి అన్నమాట. ఎంత మంది సంతానం భయంకరంగా! లెక్కపెట్టలేము, అంత సంతానం.

014 సవితః

సవిత అంటే మనకి కనిపించే గోళం కాదు అని చెప్పడానికి సవితః అని చెప్తారు. ఇవన్నీ మనం ఎవరి గురించి చెప్పామో, అదంతా ఏ గోళం నుండి వస్తోందో ఆ గోళం కాక, ఆ గోళాన్ని ఆవరించి ఉన్నది అని అర్థం. ఇప్పుడు మీరు అంటే మీ శరీరం కాదు అన్నట్టు. కలలో కనిపించారనుకోండి శరీరంతో వచ్చినట్టు కాదుగా! అయినా మనకి కనిపించాడుగా, అంటే ఏంటి? శరీరం కాదనేగా. మనం ఏదో ఊళ్లో ఉంటే గుర్తొచ్చారనుకొండీ, శరీరంతో వచ్చారా? సాన్నిధ్యం అనేది భౌతికం కాదు. Presence is never physical అన్నారు మాస్టరుగారు. అందులోంచి మాత్రమే కాకుండా 'కూడా' అని. మనం కూడా మన శరీరంలో బద్ధమై లేక శరీరం నుండి వ్యక్తమవుతూ ఉంటాం. మనకి మన శరీరం ఎట్లాగో ఈ వెలుగు తత్త్వానికి ఒక శరీరం ఒక సూర్యుడు. అది అందులోంచి రావడం వల్ల అట్లా వెలిగిపోతోంది ఆకాశంలో. ఏదైతే సూర్యగోళం లోంచి వ్యక్తమవుతోందో, దాన్ని 'సవితః' అంటారు. 'తత్సవితుర్వరేణ్యం'. ఆ సూర్యుడిని కౌగలించుకున్నట్లే, మనని కూడా కౌగలించుకోమని. Embrace చేయమని అడుగుతున్నాం. వరేణ్యం అంటే, ఆలింగనం చేసుకో వచ్చి నన్ను అని. భావం కావాలి. గాయత్రి చేస్తున్నప్పుడు అలా ఒక్కొక్క అక్షరం పలుకుతుంటే, వెలుగు పుట్టి, ఆ వెలుగు మనని ఆవరించి, మనం పెద్ద కాంతిపుంజం అయిపోయినట్టుగా కనీసం భావన చేయండి. 'యధ్భావం తద్భవతి' కాబట్టి. ఇన్ని మనం ఆయన్ని విహాయ సగతి జ్యోతి, హాయిగా చక్కటి మార్గంలో ఆకాశంలో అట్లా జ్యోతల్లే తిరుగుతున్నాడు అని చెప్పాం. సురుచి — వాడి నుండే కాంతి వస్తుంది అన్నాం. వాడే విభుడు అన్నాం, వాడే సమస్తాన్నీ తీసుకుంటాడు అన్నాం, వాడే సమస్తాన్నీ ఏర్పరుస్తున్నాడు అన్నాం. వాడే లోక చక్షువు అన్నాం, ఇవన్నీ గోళాన్ని ఉద్దేశించి చెప్తున్నా. కానీ గోళాన్ని ఆవరించి దానివల్ల ఇదంతా.

గోళం మనలాంటిదే. ఈ భూమి ఎటువంటి గోళమో అదీ అటువంటి పదార్థమైన గోళమే! కాకపోతే పదార్థం చాలా సూక్ష్మం అక్కడ. కాబట్టి వెలుగు ఎక్కువ అందులోంచి వస్తుంది bulb లోంచి వస్తున్నట్టు. Bulb లోంచి వచ్చే వెలుగు bulb ది కాదు కదా! కొన్ని bulb లు ఎక్కువ వెలుగుతాయి అంటే ఎక్కువ తనయందు ఆకళింపు చేసుకోగలదు, అందుకోగలదు, అందివ్వగలదు. 1000 watt bulb, 0 watt bulb రెండున్నాయి కదా. సూర్యుడు 1000 watt bulb ఐతే, మనం 0 watt bulb. మనం కూడా ఒక బల్బే! 0 watt అయినా, 1000 watt రెండిట్లో నుండి వెలుగుతున్నది ఒకే విద్యుత్తు. కాబట్టి ఇంత గోళం కూడా దాని వెనకాల దాన్ని కూడా గుర్తు చేసుకుంటుంది. ఎందుకంటే సూర్యుడు తను అనుకోవట్లేదు. తను, అటువంటి సూక్ష్మమైన పదార్థంగా తయారవడం వల్ల తన నుండి అంత వెలుగు దిగి వస్తుంది. ఆయన ఇంకా బాగా దింపాడు అనుకోండి అంటే ఏమిటి సూర్యుడికి కూడా పరిణామం ఉన్నది. అది మన ఋషులు చెప్పినది. భూమికి పరిణామం ఉన్నది. సూర్యుడు పరిణామం చెందుతుంటే ఏమవుతుంది? సూర్యగోళంలో ఇంకా ఎక్కువ కాంతి పెరుగుతుంది. మనలో కాస్త పూజలు చేస్తేనే మొహంలో కాంతి వచ్చినప్పుడు రాదా? అక్కడ కోట్లాది సంవత్సరాలు అదే వెలుగుని సరఫరా చేస్తుంటే మరి? పాల చెంబు వంటిది ఎప్పుడూ అందులో పాలు పిండితే ఇంక దాంట్లో మురికి ఉండదు. పాలల్లో ఆ గుణం ఉంది. పవిత్రీకరించడం. ఎప్పుడూ వెలుగు స్నానంలో ఉండేవాడు, అది అయిపోడూ? అది అయిపోతుంటే ఆయన నుండి ఎక్కువ వెలుగు దిగితే, ఎండలు మండిపోతాయి. అంటే ఏంటి? తనలో తను పెరగడం వల్ల, తన నుండి ఎక్కువ వెలుగు దిగి మిగతా గోళాలకి కూడా ఎక్కువ వెలుగు అందుతూ ఉంటుంది. అంటే ఏంటి? వీటి పరిణామానికి కూడా పనికి వస్తుంది. అందుకని ఆయన అట్లా వెలుగుకి వాహికగా ఉన్నాడు, అది సవితః! గాయత్రీ మంత్రంలో మనం ఏం చెప్పాం అంటే, ఈ వెలుగు ఎక్కడ నుండి వస్తోందో, ఈ సూర్యుడు నుండి వెలుగు వస్తుంది. కాబట్టి సూర్యుడికన్నా పైకి వెళ్ళాం. ఇంకో మెట్టు. అసలు ఆ వెలుగు ఎక్కడ నుండి వస్తోంది? ఏమో! ఎందుకంటే ఈ వెలుగులుగా ఉన్నవాళ్లందరికీ ఎవరో ఒకరు ఉండాలి. లేకపోతే వెలుగు ఎక్కడ నుండి

వచ్చింది? వాడు, ఈ భర్గః అస్య దేవః. భర్గో దేవః! వాడినే 'సత్' అంటారు. సత్ తో మొదలవుతుంది గాయత్రి. అక్కడకి వెళ్లిపోతున్నామండీ మనం! గాయత్రీ మంత్రం ద్వారా అక్కడకి వెళ్ళిపోతున్నామంటే ఏమిటి, ఎక్కడో దూరంగా ఉందని కూడా అనుకోవద్దు. మనలో అష్టదళ పద్మంలో నారాయణ లోకం ఉన్నది. అది భర్గో దేవుడు. అక్కడ నుండి సవితః, ఆజ్ఞ దగ్గర ఉండు. సూర్యః, హృదయంలో. ఆ తరువాత, మిగతా అంతా గోళం. తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి. శబ్దం ద్వారా దాన్ని ధ్యానం చేస్తుంటే వెలుగు పుడుతుంది. ఆ వెలుగే సవిత! అది మనని ఆవరిస్తుంది. మనని ఆలింగనం చేసుకుంటుంది. మనని వెలుగుగా తయారు చేసుకుంటుంది. అందుకని అదేదో ఉందే, దీనికంతటికీ పుట్టుక స్థానం. దానిని ధ్యానం చేస్తున్నాం, ధీమహి, we meditate it. We meditate అన్నప్పుడు, అర్థం ఏమిటి? బృందంగా చేసుకోమని. గాయత్రీ మంత్రం పాడుతున్న కొద్దీ వెలుగు పెరుగుతుందిట అంటే, బృందగానం అక్కడ. గొణుక్కోవడం కాదు. గొణుక్కునేట్టయితే గాయత్రి అని పెట్టరు. లోపల చేసుకోవాలి అనుకునేట్టయితే గాయత్రి అని పెట్టరు. పాడిన కొద్దీ రక్షిస్తుంది అని అర్థం. పాట అంటే ఏమిటండీ? ధోవతి లో వేళ్ళు పెట్టుకుని, దానికి జంధ్యం ముడి వేసి, లోపల గొణుక్కోవడమా? ధీమహి అంటే ఏంటి? We mediate it. అన్నీ కూడా collective working చూపిస్తోంది. Group function. నాలుగు వేల మంది మనం కూర్చుని పొద్దున, సాయంత్రం గాయత్రి చదువుతుంటే ఆ గురుపూజల్లో ఎంత అద్భుతంగా ఉంటుంది! అసలు ఆ చుట్టుపక్కల వాతావరణం ఏమవుతోంది, ఏమన్నా మనకి అవగాహన ఉంటే, వివశులైపోతాం. అంత అద్భుతంగా ఉంటుంది. ప్రాతః సంధ్యలో అందరం కలిసి ఎలుగెత్తి గాయత్రి ధ్యానం చేసేవాళ్ళు నా మార్గానికి సంబంధించిన వాళ్ళు అని చెప్పారు మాస్టరుగారు. జిడ్డు మొహాలు కాదని. వెలుగు రవ్వలైపోతారురా చేసుకోండి అని చెప్పారు. అట్లా మనం దాన్ని అందుకోవాలి. ధియో యోనః ప్రచోదయాత్ అన్నప్పుడు కూడా, మా బుద్ధులని కూడా ప్రచోదనం చేయి అని అడుగుతోంది. నా బుద్ధిని ప్రచోదనం చేయి, నేను ధ్యానం చేస్తున్నాను, ఇట్లా selfish కాదు ఋషులు ఇచ్చిన మంత్రం. బయట పండితులు ఒప్పుకోరు ఇట్లా చెప్తే. మాస్టరుగారు నేను

ప్రమాణం మీరు కానీయండి, అని చెప్పారు. ఎవరన్నా మిమ్మల్ని అడిగితే నన్ను అడగమని చెప్పండి, అని చెప్పారు. ఆయన్ని అడిగే దమ్ము ఎవరికీ లేకపోయింది మరి. ముప్పై ఏళ్ళు ఆయన రెచ్చిపోయి మరీ ప్రపంచంలో అందరిచేతా చేయించారు.

215 రవిలోచనః

ఆయనకి ఒక కన్ను సూర్యుడు, ఇంకొక కన్ను చంద్రుడు. కుడి కన్ను ద్వారా నువ్వే సాన్నిధ్యాన్ని ఇస్తున్నావు 'తత్త్వం', నీ ఎడమ కన్ను ద్వారా పదార్థమైన లోకాలు ఏర్పరుస్తున్నావు. కుడి కన్ను ద్వారా తేజోమయమైన లోకాలు ఏర్పరుస్తున్నావు. మూడవ కన్ను ఈ తేజో లోకాలకి, పదార్థ లోకాలకి, రెండిటికీ ఆధారభూతంగా ఉంది. అందుకని రవిలోచనుడు అని పెట్టాడు. సూర్యుడు కన్నుగా కలవాడు. అని అర్థం. అది ఈ సూర్య పరంగా కొన్ని లక్షణాలు కృష్ణుడి పరంగా భీష్ముడు అందించాడు. విహాయ సగతిర్ జ్యోతిః, ఆకాశంలో తిరిగే జ్యోతి. సురుచిః, అక్కడ నుండి దిగివచ్చే కాంతివి నువే . హుతభుక్, ఈ సమస్తాన్నీ మింగేసేది నువ్వే. విభుః, ఎట్లా మింగుతాడు అంటే, వెలుగు పెంచి మింగుతాడు. Excessive brilliance of light అని అర్థం, ఆంగ్లం లో చెప్పాలంటే. మరీ కాంతి వస్తే ఎట్లా ఉంటుంది? Flash light అట్లా మొహం మీద పడేస్తే గంటలతరబడి, కళ్ళు పోతాయి. బాగా వేడి పెంచితే కాల్చేస్తుంది. కాల్చుకుపోతూ ఉంటుంది ఒక పక్క నుండి. రవిః శబ్దం ద్వారా వచ్చావు నువ్వు. విరోచనః అంతా చూస్తూ ఉంటావు. సూర్యః ఇదంతా నువ్వే అల్లావు. సవితః, కనిపించే గోళంలో కాక దాన్ని ఉపాధిగా ఉంచుకుని వ్యక్తమవుతున్నవాడు. రవిలోచనః —— సూర్యుడు అనే గోళం కన్నుగా ఉన్నవాడు అని అర్థం.

216, 217, 218 అనంతః, హుతభుక్, భోక్తా

హుతభుక్ అంటే సమస్తాన్నీ తనలోకి ఆహుతి చేసుకునేవాడు. అంటే అగ్ని చేత సమస్తాన్నీ పచనం చేస్తుంటాడు. అది అనంతంగా జరుగుతుందని మళ్ళీ ఈ నామంలో చెప్తున్నాడు. అనంతం అంటే విరామం లేకుండా అలా తింటూ ఉంటాడు. మరో పక్క వ్యక్తం చేస్తుంటాడు. ఇలా అహర్నిశలు చేస్తుంటాడు. ఇలాగ ఒక పక్క భక్షించడం, మరొక పక్క వ్యక్తం చేయడం అనేవి రెండూ సమపాళ్ళలో ఉండడం వలన సృష్టి ఎప్పుడూ అలాగే ఉన్నట్టు మనకు గోచరిస్తుంది. క్షణక్షణం తినబడుతూ మళ్ళీ వ్యక్తం అవుతూ అలా ఉంటుంది. అంటే నదీ ప్రవాహంలాగా ఉంటుంది. నదీ ప్రవాహంలో నది అక్కడ ఉన్నట్లు గోచరిస్తుంది కానీ, మనం చూసిన నీరు మరుక్షణంలో అక్కడ లేవు, కొన్ని నీళ్ళు వెళ్తుంటే కొన్ని నీళ్ళు వస్తుంటే నది శాశ్వతంగా ఉన్నట్లుగా అనిపిస్తుంది. శాశ్వతంగా ఉన్నట్లు కనిపించడానికి కారణం చైతన్యం యొక్క ప్రవాహం అంత అద్భుతంగా ఉండడం చేత, హెచ్చు తగ్గులు లేకుండా ఒకటి వెళ్ళిపోతుంటే దాని స్థానంలోకి మళ్ళీ ఒకటి వస్తుండడం చేత అలాగ గోచరిస్తుంది. ఇది ఒక అద్భుతమైన అనుభూతి. అందుకనే నదీ ప్రవాహం వద్దకు వెళ్ళి చూడాలి. మన శరీరంలో కూడా రజోగుణకారణంగా ఒక ప్రక్క అణువుల నిర్మాణం జరుగుతుంటే, తమోగుణకారణంగా కొన్ని అణువులు హరించిపోతుంటే, ఈ రెంటి మధ్య ఒక చక్కటి సమన్వయం ఉండడం చేత మనం ఉన్నట్లు గోచరిస్తున్నాం. ఇదొక పెద్ద రహస్యం. దీన్నే దేవాపి మహర్షి Madam Blavetsky కి Secret Doctrine లో వివరిస్తారు. నువ్వు కూడా నదీ ప్రవాహం లాంటి వాడివే. సృష్టిలో ఏ రూపైనా సరే నదీప్రవాహం లాంటిదే. క్షణక్షణం కొన్ని అణువులు కట్టుకుంటూంటే మరికొన్ని అణువులు లయం అయిపోతుంటే, ఈ కట్టుకోవడం, లయమైపోవడం మధ్య సమన్వయం ఉండడం చేత నువ్వు ఉన్నట్లుగా గోచరిస్తుంది తప్పా, నువ్వు అంతకు ముందున్నది మనిషి వేరు, తర్వాతి మనిషి వేరు. క్షణక్షణానికీ నీలో ఉన్న పదార్ధం మారుతుంది. ఎలా మారుతుందంటే ఆ నదిలో నీరు మారుతున్నా అదే నీరు అని మనం ఎలా అనుకుంటున్నామో అలా. కాలమునకు వుండే వేగము చేత దేశము నందు/పదార్ధము నందు ఈ

మార్పులు వస్తుంటాయి. అందుకే ప్రతిక్షణం 'అపూర్వము' అని చెప్పారు. అంటే అంతకు ముందు అటువంటి క్షణం లేదు. అదే మంగళవారం మళ్ళీ రాదు. పేరుకే మంగళవారం కానీ తిథి, మాసం, సంవత్సరంలో ఏదో ఒక మార్పు ఉంటుంది కదా. ఈ విధంగా ఒక్క క్షణం వచ్చింది మళ్ళీ రాదు. అదీ భగవంతుడి సృష్టిలో అపూర్వమైన విషయం. అద్భుతః అంటే Never before ఒకసారి వచ్చినట్లుగా మళ్ళీ ఏదీ రాదు. కొంత దాదాపుగా అలా ఉంటే అదే మళ్ళీ వచ్చిందని మనం అనుకుంటాం. మైత్రేయులంటారూ 'ఎప్పుడూ కూడా అదే వచ్చే ప్రశ్నే లేదు' అని. రాముడే, కృష్ణుడని మనం అంటాం కదా, రాముని లక్షణములతో బాగా సరిపోలిన లక్షణాలు ఉండడం చేత, అవే దైవీ లక్షణాలు ఉండడం చేత, కృష్ణుడూ రాముడూ ఒకటే అని అనుకుంటున్నాం. Tubelight వున్న చోట అది తీసి ఇంకో tubelight పెడితే చూసేవారికి ఇంకో tubelight అని తెలీదు. కానీ అది మారింది, దాని వాహిక మారింది. కాలము, దేశము అనే graph లో ఒక event జరిగితే మళ్ళీ అదే event జరగదు అనేది ఒక సత్యం. అల సముద్రంలో నుండి వచ్చినప్పుడు మళ్ళీ అదే అల వచ్చింది అని ఎలా చెప్పగలవు. ఇది వెళ్ళి మొత్తంలో కలిసింది, ఆ మొత్తం నుండి మళ్ళీ అలగా వ్యక్తమై వచ్చింది, వస్తే మళ్ళీ అదే వచ్చిందా? అదే వచ్చిందనడంలో ఉద్దేశ్యం ఏమంటే ఆ సముద్రమే అలగా వచ్చింది. రాముడు పరతత్త్వం. పరతత్త్వమే దిగి వచ్చింది. అల గా దిగి వచ్చింది. కృష్ణుడు పరతత్త్వం. పరతత్త్వమే మళ్ళీ అల గా దిగి వచ్చింది. అంతకుముందు అల గా దిగి వచ్చినదే మళ్ళీ దిగి వచ్చిందనడానికి వీలులేదు. కుండలో వున్న నీటిని glass తో తీసి, మళ్ళీ కుండలో వున్న నీటిలో పోసి, మళ్ళీ కుండలో నుండి తీస్తే, కుండలో నీళ్ళు అవుతాయి కానీ అంతకుముందు glass లోని నీళ్ళేనా అవి? కాకపోతే అవే లక్షణం కలిగి ఉండడం వలన అవే నీళ్ళు అనుకుంటాం, కానీ అవే నీళ్ళు కావు. మనం కూడా మళ్ళీ పుట్టినా ఇలా ఉండం. కనుక అదే తిరిగి వచ్చింది అనడానికి లేదు. ఎందుకంటే అది అపూర్వము, ఇదివరకటి లాగా ఉండదు. ప్రతిరోజు సూర్యోదయమూ ఒకలాగే ఉండదు. రోజూ కొత్తదే! అలాగే ప్రతి చంద్రోదయమూనూ. మహాత్ములను చూసినా కూడా ఒకళ్ళ లాగా ఒకళ్ళు ఉండరు. అదే అవతారం అని చెప్పినా రామునికీ, కృష్ణునికీ ఎంత తేడా ఉన్నది? షిరిడీ సాయికీ, సత్యసాయికీ ఎంత తేడా

ఉన్నది? తత్త్వం చూసి మనం ఒకటి అంటాం. ఆయనే వచ్చాడు అనడంలో ఉద్దేశ్యం ఆ తత్త్వం వచ్చిందని చెప్పడం తప్ప ఇంకేమీ కాదు. భగవంతుని అవతారాలు అని చెప్పడం ఉద్దేశ్యం కూడా. పరతత్త్వం పరిపూర్ణంగా దిగివస్తే అవతారం అన్నారు. పరిపూర్ణంగా రాకపోతే హరిఅంశలు /హరికళలు అన్నారు. అంతకన్న కొంత తక్కువ స్థాయి అయితే మహాత్ములు అన్నారు. అంటే తత్త్వం అదే అయినా దిగి వచ్చిన దాన్ని బట్టే చెప్తుంటారు. కనుక ఒక పక్క నుండి ఇలా తినేస్తుంటే ఇంకోపక్క నుండి పుట్టుకొస్తుంటే ఈ మధ్యలో మనం ఉన్నాం. నిన్నటి మనం, ఇవాళ మనం ఒకటి కాదు. ఎందుకని అదే అనుకుంటాం అంటే అసలు మనం ఉన్నామే 'అది అదే' కాబట్టి. అదొక పెద్ద రహస్యం. చిన్నపిల్లల నుండి యుక్తవయస్సుకూ, అక్కడ నుండి మధ్యవయస్సుకూ అలా వస్తుంటే మనం మనలోని మార్పుని గమనించం, మార్పులు వచ్చాయని వారూ వీరూ అంటారు. అంటే మనం నమ్ముతాం. దేనికి వచ్చింది? రోజూ నిన్ను నీవు అద్దంలో చూసుకుంటున్నావే, అదే మొహం కనిపిస్తోంది కదా! ఎప్పుడు తెలుస్తుంది తేడా? క్రిందటి సంవత్సరం ఫోటో, ఈ సంవత్సరం ఫోటో తీసి చూస్తే తెలుస్తుంది. రోజూ అదే మొహం చూసుకుంటూ 50 సంవత్సరాలైనా మారాం అనుకోం. ఎందుకంటే మనం మారని వాళ్ళం కాబట్టి. సహజంగా మారని వాళ్ళం కాబట్టే మారుతున్నాం అనుకోం. అందుకనే మనం చచ్చిపోతాం అని కూడా అనుకోం. 'చావక మానెడు వారి భంగి, ఈ చచ్చిన వాడి కేడ్చదరు' అని భాగవతంలో చెప్తారు. ఎవరన్నా పోతే మనం కూడా అంతే అని కాసేపే ఉంటుంది. ఓ పక్క తుండుతోనూ, కొంగుతోనూ కళ్ళు తుడుచుకుంటూ మరొక పక్క, ఏమీ తినలేదు కాఫీ ఐనా తాగు అని ఇస్తే కాఫీ తాగుతూ ఉంటాము. రెండవ రోజు తిండి తినడం మొదలు పెడతారు, మూడో రోజు నుండి మర్చిపోతాం. మహాకాకపోతే మూడునెలలకి మర్చిపోతాం అంతే కదా! ఏముంది ఈ వెధవ శరీరం, ఎప్పుడో ఒకప్పుడు రాలిపోతుందని ఆ కాసేపూ అనుకుంటాం. వెళ్ళిపోయినవాడి ఆత్మీయతని బట్టే ఆ అనిపించడం, కాలం యొక్క హ్రాస్వత్వమో, దీర్ఘత్వమో ఉంటుంది. కానీ మనం పోతాం అని రోజూ గుర్తు ఉంటుందా! ఉండదు. ఎందుకు? మనం పోయే వాళ్ళం కాదు, శరీరం పోతుంది, మనం ఎప్పుడూ ఉంటాం. పోతాం కదా అని గుర్తు ఉంటే ఈ

పనులన్నీ చేస్తామా? ఆ పోయేకాడికి ఇవన్నీ ఎందుకు అన్నట్లుండమా? అందుకనీ మనకి మనం శాశ్వతులము అని తెలిసి, అశాశ్వతమైన విషయములయందు ఆసక్తి కలిగి ఉంటాం. బుద్ధిమంతులు ఏమి చేస్తారంటే కాలప్రవాహంలో వెళ్ళిపోయేవాటిలో శాశ్వతమైన విషయాలతో యోగం చెంది, తాత్కాలిక విషయములందు నిరాకరించకుండా నిర్లిప్తంగా ఉంటారు. ఒకటి శాశ్వతం, ఒకటి తాత్కాలికం మొత్తం సృష్టిలో రెండూ వుంటాయి తిరగలి లాగా. ఒకటి కదులుతు వుంటుంది ఒకటి కదలదు. మనం కదలని దానిని పట్టుకు కూర్చుంటే, కదిలేవి ఎన్ని కదిలినా ఫర్వాలేదు. మనమీద నుండి ఎన్నిపోయినా ప్రవాహంలో మనం కొట్టుకుపోకుండా ఉంటాం. కనుక ఈ విధంగా సమస్తాన్నీ ఓ ప్రక్క నుండి మింగుతుంటే, మరో పక్క నుండి పుట్టుకొస్తూంటాయి. ఇవన్నీ దేనికి జరుగుతున్నాయి. ఆత్మకూ కాదు జీవాత్మకూ కాదు, అతని చుట్టూ ఏర్పడే త్రిగుణాత్మకమైన సృష్టికి. అందుకే తను శాశ్వతుడని, తాను నిత్యుడని, తాను అక్షరుడని, తాను చిరంజీవి అని తెలిసినవాడు తను తినబడుతున్నాడనే ప్రశ్న లేదు, సృష్టి ఉన్నంతకాలం తాను ఉంటాడు, సృష్టి ప్రళయం లోకి వెళ్ళినప్పుడు ఆయనలో బీజప్రాయంగా ఉంటాడు, మళ్ళీ వస్తాడు. అది మన ఋషులకున్న అద్భుతమైన అవగాహన. అందుకనే కల్పాంతం తర్వాత నారదుడు బయటికి వస్తే అంతకు ముందు కల్పంలో ఆయన, వాళ్ళ అమ్మ, చాతుర్మాస్యదీక్ష, గురువులు గుర్తున్నారు. ఇది క్రిందటి జన్మ కథ కాదు, పూర్వజన్మ వృత్తాంతం అంటే, ఆ కల్పం అయిపోయిందిట, మళ్ళీ కల్పంట, మళ్ళీ కల్పంలో నారదుడికి బ్రహ్మ మానసంలోంచి రాగానే అంతా తెలిసిందిట. అంటే వాడిలోకి సృష్టి లయమైనప్పుడు ఏ స్థితిలో వెళ్తామో ఆ స్థితిలోనే బయటికి వస్తాం అన్నమాట. అలాగే ధృవుడు తపస్సు చేస్తే, ఎప్పుడు ఇచ్చారు ధృవపథం? కొన్నివేల సంవత్సరాల తర్వాత ఇచ్చారు. అజామీళుడు వాళ్ళబ్బాయిని

'నారాయణయనుచు ఆత్మనందునుం బిలువగన్ ఏ రీతి నేలుకొంటివి'

ఏరీ నీ సాటి వేల్పులెందును కృష్ణా! అంటాం కదా! అంటే మాస్టర్ ఇ.కె గారు దానికి చాలా చక్కటి వివరణ యిచ్చారు. నారాయణ అనడం చేత ఆ సంస్కారం కూడా వాడి యందు బీజప్రాయంగా ఉండి, వచ్చే జన్మలో

పవిత్రమైన నదీ తీరంలో పుట్టి, ఇది వరకు వదిలేసిన శూద్ర స్త్రీ సంపర్కం, మళ్ళీ చివరలో వెళ్ళినప్పుడు గుర్తుకురావడం వల్ల, ఈ సంపర్కం కలిగినవారి వద్ద పుట్టి నదీ తీరంలో యోగసాధన చేసుకుని, తర్వాత సిద్ధి పొందాడు. అంతేగాని అన్నీ చేసి అడ్డగోలుగా బతికి అలా ఆఖరులో మోక్షం పొందాడు అనగలమా? అనలేం! అప్పుడిది గుర్తురాదు. కొంత యోగసాధన చేసి ఏదో కొంత భ్రష్టత్వం చెందడం వలన, చిట్ట చివరలో అది గుర్తుకు రావడం వలన, మరుజన్మలో యోగసాధన అంతకు ముందు వదిలేసిన సూత్రం మళ్ళీ దొరికింది. ఆ సూత్రం పట్టుకుని ముందుకు సాగాడు. అంటే సృష్టి లోపలికి ఎలా వెళ్తే అలా బయటకి వస్తాం. వృక్షాలుగా ఉన్నప్పుడు మింగేసాడనుకోండి? మళ్ళీ వృక్షాలుగా వస్తాం. జంతువులుగా ఉన్నప్పుడు మింగేశాడనుకోండి మళ్ళీ జంతువులుగా వస్తాం. ఈ రోజు రాత్రి నిద్రలోకి వెళ్తే పొద్దుట ఎలా లేస్తామో అలాగే, అదే రోజూ కథ. ఈ రాత్రి నువ్వు ఏ భావంతో పడుకుంటే రేపు మొట్టమొదట వచ్చే భావం అదే. అందుకని దైవాన్ని తలుచుకుని వెళ్తే దైవంతో మేలుకుంటావు అని చెప్తారు. రాత్రి పెద్ద సమస్య గురించి విపరీతంగా ఆలోచించి, ఏ ఒంటిగంటకో పడుకుని, ఏ నాలుగుగంటలకో మెలుకువ వస్తే మొట్టమొదట గుర్తుకు వచ్చే భావం అదే. ఇంతకు ముందు సతాయించిందే అదే సతాయిస్తుంది. దేనితో లోపలికి వెళ్తామో దానితోనే బయటకు వస్తాం. అది రోజూ జరిగేదే. రోజంతా చేసిన పనుల సముదాయాన్ని బట్టి కదా, ఆ రోజు రాత్రి మనం పడుకోబోయే ముందు మనకుండే ఆలోచనలు. అందుకని మన పెద్దలు 'రోజంతా ఎలా గడిచినా రాత్రి పడుకోబోయే ముందు భాగవతం తెరచి అరగంట చదువుకుని పడుకో' అని చెప్పారు. 'త్రిజగన్మోహన నీలకాంతిన్ దను వుద్దీపింప' లాంటి పద్యం రోజూ చదువుకోవాలి. కనులు మూసినప్పుడూ కనులు తెరచినప్పుడూ కూడా 'మా విజయుడి వన్నెకాడు' కనిపించాలి. కనీసం కలలోనైనా రావాలి, అనుభూతిగానైనా కావాలి. కనులు మూసినా, తెరిచినా వాడే కనిపించాలి అనుకుంటే పొద్దున్న కళ్ళు తెరవగానే కృష్ణా అనో, గోవిందా అనో లేవడం ఉంటుంది. లేకపోతే అయ్యో, అమ్మో, అబ్బా అనుకుంటూ లేవడం ఉంటుంది. పొద్దున్న లేవగానే ఏమి గుర్తుచేసుకోవాలి అనుకున్నాం 'నీ పాదకమల సేవయు, నీ పాదార్చకుల తోడి నెయ్యమును,

నితాంత అపార భూతదయ' ఈ మూడు సాయంత్రం లోగా ఇవ్వవయ్యా, మిగతా దరిద్రాలన్నీ ఎప్పుడూ చుట్టూ వ్రేలాడుతూనే ఉంటాయి. పాదకమల సేవ అంటే, పాదములు అంటే భగవంతుని యొక్క సృష్టి! దానికి సేవా పరంగా జీవించడం. అట్లా చేసుకునే వాళ్ళతో మిత్రత్వం. 'అపార భూతదయ, తాపసమందార నాకు దయసేయ గదే!' అనుకుని లేవమని చెప్పారు పెద్దలు. పొద్దుట పూట పనిలోకి వెళ్ళినప్పుడు భగవద్గీత చదువుకోండి, ఏది ఎట్లా చెయ్యాలో తెలుస్తుంది. రాత్రి నిద్రలోకి వెళ్ళినప్పుడు భాగవత పద్యాలు చదువుకుంటూ వెళ్ళండి, ఎందుకంటే చాలా ఆకర్షణీయంగా, రమణీయంగా, హృద్యంగా, మనోహరంగా ఉంటాయి కాబట్టి ఆ విభూతితో నిద్రలోకి వెళ్తారు. నిద్రకూడా హాయిగా పడుతుంది. కనుక రోజూ రాత్రి నిద్రలోకి వెళ్ళినప్పుడు మొత్తం అంతా హరించినట్లే కదండీ! ఏం గుర్తు ఉంటుంది? మర్నాడు లేచేవరకూ మనకి ఏదీ గుర్తుకు రాదు. మరీ గట్టిగా నిద్రపోతే, లేచినప్పుడు ఇప్పుడు ఎక్కడ ఉన్నాం? ఏం చేస్తున్నాం? ఏ వారం అని కూడా గుర్తుకు రాదు. బాగా ఒళ్ళు మరచి నిద్రపోతే, అంటే జీవుడుగా వుండిపోయాం అనుకోండి, లేచాకా ఎక్కడున్నాం, ఏమిటని ఏమీ గుర్తుకురాదు ఇది తమోగుణం లక్షణం. 'అనంతహుత భుక్' సమస్తాన్నీ అలా అందుకుని, మళ్ళీ ఇచ్చేస్తూ ఉంటాడు. అంటే మళ్ళీ 'నైకదో' అన్నాడు పక్కనే.

೨೭೨ సుఖదః

ఉన్నప్పుడు సుఖాన్నిస్తాడు. ఇవన్నీ లేనప్పుడు కూడా సుఖాన్నిస్తాడట. సమాధి అంటే అదే కదా! ఇక్కడ రుచి తగ్గి, అటు పెరిగి అటు వెళ్తే అక్కడ సుఖం, ఇటు వస్తే ఇక్కడ సుఖం. జీవులు కూడా ఇక్కడే సుఖం అనేవాళ్ళు ఉంటారు. అనుకోకపోతే అందులో ఎందుకుంటారు? ఎవరు ఎక్కడ వుంటే అక్కడ సుఖంగా ఉండడాన్ని బట్టే ఉంటున్నారు తప్పా లేకపోతే ఉండరు కదా! ఉదాహరణకి పందికి బాగా షాంపూ వేసి బాగా స్నానం చేయించారనుకోండి, దానికేమో చిరాగ్గా ఉండి వెళ్ళి గభాల్న మురికిగుంటలో పడి పొర్లితే దానికది familiar environment. తన స్వభావానికి సంబంధించిన ఆ కంపు దానికి బాగా ఉంటుంది, దానికక్కడ బావుండడం వల్ల అక్కడ ఉంటోంది తప్ప బావుండకపోతే అక్కడ ఉంటుందా? కొంతమంది ఇల్లూ, ఒళ్ళూ మురికిగా ఉంచుకునే వారు కనపడరూ? వాళ్ళకలా మురికిగా అనిపించదు కాబట్టే అలా ఉంటారు, అనిపిస్తే అలా ఉంటారా? ఉండరు. అందుకని ఇటుపక్కకి వస్తే భౌతికపరమైన సుఖం, ఇంద్రియపరమైన సుఖం, మానసికపరమైన సుఖం, విజ్ఞానపరమైన సుఖం అంటే కొంతమంది ఆ గ్రంథం, ఈ గ్రంథం చదివి ఆ గ్రంధాల గురించి చర్చిస్తూ, తర్కించుకుంటూ వుంటారు, వారికి అందులో సుఖం. వేదవ్యాసుడు గొప్పవాడా? కాళిదాసు గొప్పవాడా? వాల్మీకికి వేదవ్యాసుడికి ఏమిటి తేడా? ఇలాంటి విషయాలు కొందరికి ఆనందం కలిగిస్తాయి. ఆ శ్లోకంలో ఏముంది? ఉపనిషత్తులో ఏముంది? భగవద్గీతలో ఏముంది? భగవద్గీత అన్నీ కలిపి కూర్చినదా? ఎందుకంటే ఉపనిషత్తులలో అవే శ్లోకాలు కనిపిస్తాయి, లేకపోతే కృష్ణుడు ఉపనిషత్తులలో తాను బట్టే పట్టినవి అప్పజెప్పాడా? మాట్లాడుకుంటూంటే వారికి ఆనందం. ఒక్కక్కడికే ఒక్కక్క ఆనందం, ఎవడి ఆనందం వాడికి, చివరికి బ్రహ్మానందం వరకూ ఉందిట, తైత్తరీయోపనిషత్తులో చెప్పారు. భూమి ఆనందం, శివుడి ఆనందం, అన్నిటికీ చివర బ్రహ్మానందం, అంటే సృష్టిలో ఎవరి స్థితిలో వారికి ఆ సుఖాన్నిస్తూంటాడట. ఇలా వాడికెప్పుడు ఆ మెట్టుమీద బావుండదో ఇంకొంచెం పై మెట్టు ఎక్కుతాడు. వాడికక్కడ

ఆనందం. ఆ మెట్టుకి వచ్చాకా ఇందాక మెట్టులో మిగిలినవాళ్ళని చూసి నవ్వుకుంటూ వీడు ఆనందపడతాడు. వీడికన్నా పైవాడు వీణ్ణి చూసి ఇలాగే నవ్వుకుంటూ ఆనందపడతాడు. ఇలా మెట్లెక్కుతూ ఎక్కడికక్కడ ఆనంద పడతారు. 'జీవి' అన్న పదానికి 'ఆనందమును అన్వేషించువాడు' అని అద్భుతంగా మాస్టారు చెప్పారు. ఇంతకన్నా గొప్ప విషయం ఏముందండీ? అదీ మాస్టరుగారంటే, అలా వెళ్ళి రామ బాణం లా మనకు గుచ్చుకుపోతుంది. జన్మజన్మలకీ మర్చిపోం, అలా రాస్తారాయన. 'జీవి' అనగా 'ఆనందమును అన్వేషించువాడు' కుక్క, పంది, చెట్లు, మనం. అన్నీ చేసేది అదే కదండీ మరి? ఎవరి ఆనందంలో వారు ఉంటూ జీవిస్తూ ఉంటే వాటిని అందించేవాడు సుఖదః. పుండలీకుడు, వేమన, అజామిళుడు ఉన్నారు, కొన్నాళ్ళు సంధ్యావందనం, గాయత్రి అన్నీ చేశారు, ఏంటో అనిపించింది. అటు వెళ్ళొద్దామని అటు వెళ్ళారు. అవన్నీ చూశారు. అవి చూస్తూండడంలో ఆనందం ఉండడం వల్ల కదా అందులో ఉన్నారు. ఆ తర్వాత ఏం చేశారు? ముందున్న ఆనందం ఇందులో లేదు, అదే అసలు శాశ్వత ఆనందం అని తెలిసి మళ్ళీ ఇటు వచ్చారు. శాశ్వతానందంలోనే మొదట దిగిపోతే దాని విలువ తెలియదు. దీనికి ఒక కథ ఉంది. ఒక కుర్రాడు 5 సం ల వాడు. వాడు బడికి వెళ్ళరా అంటే వెళ్ళక కాలువ ఒడ్డుకి వెళ్ళి చేపలు పడుతున్నాడు. ఒక 65సం.ల retired army general వచ్చి సరదాగా చేపలు పడుతున్నారు. ఆయన కుర్రాడ్ని, కుర్రాడాయన్ని చూశారు. 'ఎందుకురా చేపలు పడుతున్నావు, ఏం పని లేదా?' అని అడిగారు. 'ఏం పని చేయాలి' అన్నాడు పిల్లాడు, ఆయన 'చదువుకోవాలి' అన్నారు. 'ఆ తర్వాత ఏం చేయాలి?' అన్నాడు పిల్లాడు, 'ఉద్యోగం సంపాదించాలి.' 'ఆ తర్వాత?' 'పెళ్ళి చేసుకుని, పిల్లల్ని కని పెంచాలి.'ఆ తర్వాత?' పిల్లలకి పెళ్ళిళ్ళు చేసి చివరకు నీవు, నీ పెళ్ళాం ఉంటారు. ఆ తర్వాత ఏదో రోజు నీ పెళ్ళాం పోతుంది.' 'మరి అప్పుడేం చెయ్యాలి' అంటే 'అప్పుడు నాలాగే వచ్చి ఇక్కడ చేపలు పట్టాలి' అన్నారు. 'ఆ పని మరి నేను ఇప్పుడే చేస్తున్నాను కదా!' అన్నాడు పిల్లాడు, అంటే ఆయన అన్నాడు ' నువ్వూ చేపలు పడుతున్నావు, నేనూ చేపలు పడుతున్నా. కానీ నేను చేపలు పట్టే అనుభూతి, నువ్వు చేపలు పట్టే అనుభూతి ఒకటి కాదు' అని చెప్తాడు. ఆ కీలక సూత్రమే అజామిళుడు

కాస్త అట్లా వెళ్ళి మళ్ళీ ఇటు రావడం. పుండలీకుడికి చిన్నప్పటి నుండే వాళ్ళమ్మా, నాన్న భక్తి బాగా నూరారు, సంధ్యావందనం లేకుండా బయటికి వెళ్ళేవాడు కాదు, అలాంటిది అటు వెళ్ళాడు. అటు వెళ్ళి వచ్చాక ఎక్కువ కాలం పట్టింది. ఎందువలననంటే సంస్కారాలలో కొన్ని మిగిలిపోవడం వలన ఇందులో పూర్తిగా ముందుకు వెళ్ళకపోవడం వలన, కొన్ని ఏవో పెట్టుకుని ముందుకు వెళ్ళడం వీలుకాదు కాబట్టే, భగవంతుడే ఆ సంకల్పంగా వీణ్ణి బాగు చేసుకోవడానికి ఆ కాస్తా పూర్తి చేయిస్తాడు. ఒక యోగి ఆత్మకథలో లాహిరి మహాశయునికి ఒక కోరిక మిగిలిపోయి ఉన్నట్లు రాస్తారు కదా! జన్మాంతరాలనుండి వస్తున్న కోరిక అది. ఆయనకి ఇంటినిండా పుట్టెడు బంగారం ఉండాలనేది కోరిక సంస్కారంలో ఉన్నది. అట్లాగే కొందరికి పదవీ కాంక్ష, కొందరికి డబ్బు కాంక్ష, కొందరికి స్త్రీ కాంక్ష ఉంటాయి. అవి అలా ఉండగానే వీరు మిగతా మంచి సంస్కారాలు పెంచుకుంటూ వెళ్ళిపోవడంతో, ఆ ఒక్క సంస్కారం అలా ఉండిపోయి ముందుకు వెళ్ళిన దగ్గర నుండి దీని నుండి అపాయం ఎక్కువ. విశ్వామిత్రుడికి ఏం జరిగింది? వశిష్ఠుడి లాగా బ్రహ్మర్షి అయిపోవాలనే ఆయన కోరిక. మరి అలా అవ్వాలంటే తెమలవలసినవి చాలా ఉన్నాయి, దానికన్నా వేరే programe నీకు ఉందని పంపారు. అంతే తపస్సూ లేదు ఏం లేదు. అటు హాయిగా వెళ్ళిపోయాడు. వశిష్ఠుడు అలా వెళ్ళడు కదా! మేనక వచ్చిందని కదిలే type కాదు వశిష్ఠుడు. ఈయన ఎందుకు కదిలాడు అంటే లోపల అ సంస్కారం వున్నది, అది రెండు రకాలుగా clear కావాలి. సహజంగా దానిని అధిగమించగలగాలి లేదా ఈ విధంగ అన్నా అవ్వాలి. అజామీళుడి పరిస్థితి అంతే , వేమన పరిస్థితి అంతే, పుండలీకుడి పరిస్థితి అంతే, విశ్వామి పరిస్థితి అంతే! అలాగే ఈ కుర్రాడు ఏమీ తెలియకుండా చేపలు పడుతుంటే, వయస్సు వచ్చాక, శరీరం కోరిన కోరికల కారణంగా ఎవరినో పెళ్ళి చేసుకోవాలి, పిల్లలు పుడతారు వాళ్ళని పోషించాలి, వీటికి ముందు సమర్థత ఉండద్దూ? అన్నీ అయిన తర్వాత దాని నుండి జీవితానుభూతి పొందితే గానీ యోగంలోకి రాడు. అందుకనే 'కామి కానివాడు మోక్షగామి కాడు' అన్నారు. బలమైన కోరిక కలిగి దానిని నిర్వహించుకోగలిగిన శక్తిసామర్థ్యాలు కలిగినవాడు, అదే బలమైన కోరికను యోగము మీద కూడా

చూపించగలడు. ఎండిపోయిన వడియంలాగా ఉంటే ఎక్కడ అతికించినా అతుక్కోడు. ఎండని వడియం గోడకైనా, నేలకైనా ఎక్కడైనా అతుక్కుంటుంది. మనస్సుకు ఆ మృదుత్వం రావాలి. అందుకని భగవంతుడు తన సృష్టిలో ఎవరు, ఎక్కడ ఆనందం పొందుతున్నా ఆయనకి దానిమీద పెద్ద ఆక్షేపణ వుండదు. ఈ ఆక్షేపణలన్నీ పై మెట్టువాడికి క్రిందమెట్టువాడి మీద, ఆ మెట్టువాడికి వాడి క్రిందమెట్టువాడి మీద. కానీ అన్ని మెట్లు ఎక్కి కూర్చున్నవాడికి ఏ ఆక్షేపణ ఉండదు. వాళ్ళూ మహాత్ములు. వాళ్ళు 'వాడు వెధవ, వీడు మంచి వాడు' అని చూడరు. వాడు ఏ మెట్టు మీద ఉన్నాడో చూస్తారు, తన వద్దకు వచ్చి పరిష్కారం అడిగితే దాని పై మెట్టు మీదకు వచ్చే ఉపాయం చెప్తాడు. అలా కాకుండా తిన్నగా పై మెట్టు మీద కూర్చో పెడితే వాడు జర్రున జారి ఉన్న మెట్టు మీదకే వచ్చేస్తాడు. Goal- అది అయినా గురువు వాడిని, వాడున్న దానికన్నా పై మెట్టుకు తీసుకుపోయి కూర్చోపెడతాడు. ఒక్కొక్కటికీ తర్వాత మెట్టు ఏదో ఉంటుంది. లాహిరీ మహాశయులకి ఆ సంస్కారం ఉండిపోతే మైత్రేయ మహర్షిని వారు బాబాజీ అంటారు, ఆయన హిమాలయాలలోని తన గుహ అంతా బంగారంతో నింపివేసి ఈయనని 'కావాలంటే తీసుకో' అని చెప్తారు. ఆయనకలా కోరిక ఉండిపోయింది. ఆయన కూర్చుని మ్రింగుతాడా ఏమైనా! ఏదైనా సరే మనకైనా దొరికే వరకే. దొరికాకా దానిమీద value ఉండదు కదా. ఏదో ౭౨ inches TV కావాలనిపించిందనుకోండి! అది వచ్చాకా ఇంకో దాని మీదకి పోతాం ఇక దాని మీద ఉండదు. అంటే మనం దేనికోసం ఎదురుచూసి దాన్ని సంపాదించుకుంటామో అది పొందగానే ఇంకోదానిమీద మనసు పోతుంది అంటే అది శాశ్వతమైన ఆనందం ఇవ్వడంలేదు కదా! అందుకని శాశ్వతమైన ఆనందం దొరికే వరకూ, బ్రహ్మానందం దొరికే వరకూ చిన్న రకాల ఆనందాలు పెట్టాడు. బొద్దింకకు దాని ఆనందం, దోమకు దాని ఆనందం పెట్టాడు. మనం fan వేస్తే గాలి అలలు అలలుగా మన వద్దకు వస్తుంది. దోమ ఆ గాలి వృత్తాలను తప్పించుకుని వచ్చి, మనల్ని కుడితే దానికి ఎంత ఆనందం? అలా ఎవరి ఆనందం వారిది. ఒక్క బ్రహ్మానందమే ఆనందం, సమాధిస్థితే ఆనందం అనుకోవడానికి వీలు లేదు. సృష్టిలో ఎవరు ఏ స్థితిలో ఉన్నా వాళ్ళకా స్థితిలో ఆనందం. Jailలో ఉన్నవాళ్ళు కూడా ఒకటి

రెండురోజులు అల్లాడి, ఆ తర్వాత అలవాటు పడిపోతారు. వాళ్ళిచ్చే ఆ చపాతీనే ఆనందంగా తింటారు. మహాత్ములు చాలామంది jailకి వెళ్ళినవాళ్లే. అత్యంత భయంకరమైన సన్నివేశాల్లో కూడా మనస్సు చాలా అద్భుతమైనది. నెమ్మదిగా Blotting paper లాగా అంతా ఆకళింపుచేసుకుని ఆ కాసేపట్లో ఆనందం వెతుక్కుంటుంది. ధర్మరాజు అట్లా అరణ్యంలో ఆనందంగా బతికాడు. రామలక్ష్మణులు, జానకి ఉన్నంతవరకూ అరణ్యంలో ఆనందంగా బతికారు. సుగ్రీవుడు ఋష్యమూక పర్వతం మీద ఉన్నా ఆనందంగా గడిపాడు. మనకి కష్టం బయటివారి కష్టం విన్నప్పుడు చాలా కష్టంగా అనిపిస్తుంది, కానీ మనం ఆ కష్టంలో ఉన్నప్పుడు అందులోనే ఏదో ఆనందం వెతుక్కుంటుంది జీవి ఆ కాస్తలో కూడా. ఎవరికో ఒంట్లో బాగా లేక ఆసుపత్రిలో రోజూ రాత్రి duty పడ్డదనుకోండి! ఎవరో వచ్చి అక్కడ మంచి టీ ఇస్తున్నాడు అని చెప్తే, సరే రోజూ అది తాగడం ఒక ఆనందం, ఇంత కష్టం లో కూడా. జీవుడి విషయంలో భలే తమాషాగా ఉంటుంది, అందులోనే ఆనందం వెతుక్కుంటాడు. ఇట్లా ఆనందాన్ని ఇస్తాడు. 'నైకజో' ఇన్ని రకాలుగా దిగి వస్తాడు. 'అగ్రజః' అంటే పుట్టే వాటికన్నా ముందుగా ఉండేవాడు. ఆయన వచ్చిన తర్వాత కదా అన్నీ వస్తాయి! ఆయన ఎక్కడ నుండి వచ్చాడు? ఇక్కడ 'అగ్రజః' ఉంది, తర్వాత 'సదా' నామం ఉంది. అగ్రజ వేరు, సదా వేరు. అగ్రజః అంటే తాను విశ్వాత్మ చైతన్యంగా దిగి రావడం. అక్కడ నుండి మిగతావారంతా దిగిరావడం. అదే 'విరాజో అధి పూరుషః'. పురుషుడు అండం లోంచి వచ్చాకా వాడిని వండుకుంటే అబధ్నన్, పురుషం పశుమ్, మిగతా జీవులన్నీ అందులోంచి వచ్చారు. అంటే సృష్టిలో దేవుడని అర్థం. లేకపోతే పుట్టనివాడిని పుట్టినవాడిగా ఎలా చెప్తాం? అగ్రజా అంటే ముందు పుట్టినవాడని కదా! అంటే సృష్టిలో దేవుడు అని అర్థం. మనలో ముందు పుట్టినవాడు ఎవరు? నిద్రలేవగానే ముందు తెలివి/ చైతన్యం వస్తుంది. ఇక తరువాత ఆలోచనలు, పనులు వస్తాయి. అలాగే సృష్టి మొదట వెలుగుగా వ్యక్తం అవుతుంది. Let there be Light అన్నాడు Hebrew లో God. అంటే వెలుగు వచ్చింది. అదే మనవారు 'అదితి' అన్నారు. ఆ వెలుగులోంచి మిగతావన్నీ వచ్చినాయి. అసలు అదే రాకపోతే అందులోంచి వచ్చేవేమీ లేవు. నిద్రలేవకపోతే ఆలోచనలేమీ ఉండవు, పనులూ ఉండవు.

అందుకని సృష్టిలో పుట్టింది, మొదట ఉన్నవాడూ అంటే వాడిలోకి అన్నీ వెళ్ళిపోయి వాడూ అందులోకి వెళ్ళిపోతాడు. ఆ అనిర్వచనీయతత్త్వం లోకి. ఆయనలోంచి ప్రణాళిక, కాలం, జీవులు అన్నీ సమస్తమూ వచ్చాయి కాబట్టి 'అనిర్విణ్ణః' ఆయన.

౯౨౦, ౯౨౧ నైకజః, అగ్రజః

మ్రింగేసి ఒక్కడవుతాడు, ఒక్కడై మళ్ళీ అనేకంగా జన్మిస్తాడు. మనమే పాద్దున్న లేచిన తరువాత లక్ష రకాలుగా తయారవుతాము, ఏ ఆలోచన బట్టి ఆ కాసేపూ అలా ఉంటుంది. ఇలాంటివాళ్ళని కోట్లానుకోట్లని పుట్టించాడు. ఒక పక్క అందరినీ మ్రింగేస్తూ వుంటాడు, ఇంకోపక్క అందరినీ వ్యక్తం చేస్తూ వుంటాడు, ఆయన మాత్రం అలా ఉంటాడు. అందుకని 'అగ్రజః'.

౨౨౨, ౨౨౩ అనిర్విణ్ణః, సదా

అనిర్విణ్ణః అంటే ఆయనకి ఆశ్చర్యం కలిగించేది ఏదీ ఉండదట. నటన తప్ప. ఆహా! అలా అయ్యిందా అంటాడు. అభిమన్యుడు పోతాడని తెలుసు, ఎప్పుడెప్పుడు ఎక్కడెక్కడ ఏం జరుగుతుందో సమస్తం తెలిసీ, తెలియనట్లుగా వున్నాడు కృష్ణుడుగా. అట్లాగే తన నుండి సమస్తమూ వచ్చీ, ప్రణాళిక దిగివచ్చిన వాడికి ఆశ్చర్యపోయే/ నిర్విణ్ణుడయ్యే/ నివ్వెరపోయే పరిస్థితి లేదుట ఆయనకి. ఇంత సృష్టి చేసిన బ్రహ్మాకి వుంటుంది, ఇంద్రుడికి వుంటుంది, త్రిమూర్తులకీ, వారి సతీమణులు లక్ష్మి, పార్వతి, సరస్వతి లకు కూడా వుంటుంది. కానీ దుర్గకు ఉండదు. ఎందుకంటే ఇదే తత్త్వం స్త్రీ పరంగా చెప్పుకోవడం కనుక. ఆదిత్యులకు, రుద్రులకు, వసువులకు, గోళాలకు ఆశ్చర్యపడడం, నెవ్వరపోవడం వుంటుంది. మిగతవారందరికి కాలం యొక్క సమగ్ర రూపం తెలియదు. తను పుట్టినప్పడే తనతో పాటూ కాలం పుట్టింది, కాలాన్ని ఆధారం చేసుకుని సమస్తాన్నీ వ్యక్తం చేస్తాడు కాబట్టే కాలం మడతల్లో ఏముందో అతనికి తెలిసి ఉంటుంది. అందుకని భగవంతునికి తెలియంది ఏం ఉంటుంది అంటారు. అగ్రజుడు అతని తర్వాతే అన్నీ పుట్టాయి. అందుకనే అతనికి ఆశ్చర్యపడాల్సినదేమీ లేదు. సదా అంటే Eternal/ శాశ్వతుడు అని అర్థం. అంటే పుట్టుక రానప్పడు కూడా ఉన్నాడు, ఉండకపోతే ఎక్కడి నుండి వస్తాడు? ఏదీ లేనిదాంట్లో నుండి ఏదో ఒకటి పుట్టుకురాదు కదా, ఏదో వుండబట్టే అందులో నుండి పుట్టుకొస్తున్నాయి. అదీ ఋషుల అవగాహన. శాస్త్రజ్ఞుల అవగాహన ఏమిటంటే మనకి తెలియనదంతా ఏమీ లేదంటారు. లేనిదాంట్లోంచి ఉన్నది ఎలా పుట్టుకువచ్చింది? గింజ లేకుండా చెట్టు రాదు కదా! ఇది మన అవగాహన. అజ్ఞానం లోంచి జ్ఞానం పుట్టిందంటారు వీళ్ళు. కాదు ముందునుండే జ్ఞానం ఉన్నది, అజ్ఞానం కప్పబడిందని ఋషులు చెప్తారు. అజ్ఞానం లోంచి జ్ఞానం ఎలా పుడుతుంది? జ్ఞానవంతులు అవ్వడం వల్ల అజ్ఞానం అనే పొర తొలగించుకుంటె జ్ఞానం కనిపిస్తోంది. అంటే వేరుశనగ పాట్టులోంచి వేరుశనగకాయ పుట్టునట్లు, బియ్యపు పాట్టులోంచి బియ్యం వచ్చినట్లుగా చెప్తారు. బియ్యపు పాట్టులోంచి బియ్యం రాదు. బియ్యం వస్తుంటే దాన్ని

రక్షించుకోవడానికి దాని పైన పొట్టు ఏర్పడుతుంది. పొట్టు తీసి బియ్యం తీసుకుంటుంటాం. ముందు తొక్క ఏర్పడి, తర్వాత ఫలాలు ఏర్పడతాయా? ముందు బీజంగా టెంక ఏర్పడి తరువాత కొంత flesh వచ్చాక కదా తొక్క ఏర్పడుతుంది. అలాగ ఎప్పుడూ శాశ్వతుడైన వాడి నుండి చైతన్యం మేల్కాంచితే, ఆ చైతన్యం నుండి త్రిగుణములు పుడితే, వాటి నుండి త్రిమూర్తులూ వారి శక్తులూ పుడితే, అక్కడి నుండి సమస్తమైన దేవతలూ, రాక్షసులు, సిద్ధులు, సాధ్యులు, గంధర్వులు ఇలా అంతా దిగి వచ్చారు. అగ్రజుడు ఎక్కడి నుండి దిగి వచ్చాడో వాడు సదా! సదా అంటే Eternal. అసలు ఒక్క బుడగ వస్తే అందులోంచి ఒక సృష్టి వస్తుంది. ఒక సృష్టిలో ఎన్ని నక్షత్రమండలాలు ఉన్నాయో. ఈ బుడగ ఉండగానే ఇంకో బుడగ కూడా రావచ్చు. అలా ఎన్ని బుడగలున్నాయో తెలీదు అని చెప్తారు. అది లలితా సహస్రనామంలో కోటానుకోట్లున్నాయి అని చెప్పడం. విష్ణు సహస్రనామంలో కూడా 'సహస్రకోటీ యుగధారిణే నమః'. అదే మనకి అమ్మవారి కథలలో బ్రహ్మ మొదలగువారు లలితా దేవిని చూడడానికని బయలుదేరితే ఇంకో బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు అలా 5,6 sets కనిపించేసరికి ఎందుకొచ్చింది గొడవ అని వారి వారి స్థానాల్లోకి వచ్చి వారు కూర్చున్నారని చెప్తారు. అనంతమైన సృష్టివున్నదని మనవారి దర్శనం. ఇట్లా పుట్టుకొచ్చేవన్నీ ఎక్కడ నుండి పుట్టుకువస్తున్నాయో అదీ పరతత్త్వం అంటే. దానికి 'సదా' అని పేరు. సదా అన్నిట్లోనూ అలా ఉంటుందంతే. దానికి దేనితోనూ సంబంధం లేదు. అది ఉండబట్టే అన్నీ అల్లుకుంటుంటాము. అది ఉండబట్టే చైతన్యం ఉద్భవిస్తూ ఉంటుంది, అందులో లయం అవుతూ ఉంటుంది. అదే లేకపోతే చైతన్యం ఉద్భవించడానికి ఏమీ లేదు. దాన్నే 'సత్యము' అని, 'ఉండడము' అని అన్నారు. మనం ఉండబట్టే కదా నిద్రలేస్తున్నాం, ఉండకపోతే? ఆ చైతన్యం ఈ దేహంలో లేవకపోతే ఇది లేవదు. లేక అది లేకపోయినా అందులోంచి లేచేదేమీ లేదు. అదీ పరతత్త్వం! దాని గురించి వేదాలూ ఉపనిషత్తులూ ఘోషించాయి. మనవాళ్ళు ఏవో చిన్న చిన్న అభిప్రాయాలు తెచ్చి, ఇదే దేముడు దీనికి దండం పెట్టకపోతే పాపి, ఇలా Kindergarten, play-school గా చూడలేదు దేముడిని. దైవం అంటే అవ్యక్తమైన తత్ లేక అది! ఆ తత్ గురించి చెప్పడం వల్ల తత్త్వం అయ్యింది.

దాని నుండి ఒకడు వచ్చాడు, అందులోంచి ఇవన్నీ వచ్చాయి, అది చైతన్యం, దాన్నే అమ్మవారనుకో, దాన్నే విష్ణువనుకో ఏమన్నా అనుకో, చైతన్యం అనుకో, అది రావడం బట్టే అందులో నుండి త్రిగుణాత్మకంగా భావాలు వస్తాయి, ఆ భావాలలోంచి అన్నీ వచ్చాయి. ఇట్లా నిచ్చెనలు వేసి దాన్ని అందించడానికి, ఇది అందింపబడే విషయం కాకపోయినప్పటికీ అదంత అద్భుతమైన విషయం కాబట్టే దాన్నే మీకందించడానికి రకరకాలుగా మాట్లాడతాం తప్ప, అంతమాత్రం చేత మీకది అందదని చెప్పి ప్రతి పుస్తకమునూ మూసేశారు. అదే నువ్వు అని కూడా చెప్తారు. కనుక 'నిన్ను నువ్వు తెలుసుకో.' ఆ విధంగా వాడ్ని అనుభూతి పొందు. ఇంకోరకంగా వీలులేదు.

2124 అమర్షిః

అస్సలు బొత్తిగా ఇంత సృష్టిలోనూ దేనిమీదా అసూయగానీ, ద్వేషంగానీ లేదు, ఎలా ఉంటుంది? ఆయనే యిన్నిగా దిగి వచ్చాడు, అందులోనూ ఆయనే ఉన్నాడు. సృష్టిలో రాక్షసులు గానూ, దేవతలగానూ ఆయనే వచ్చాడు. కథ నడపాలి కదా! రాక్షసులను సంహరించడు అంటే ద్వేషం ఉండదు, అసూయ ఉండదు. మొత్తం కథ రాస్తున్న వారు తమనుండి అనేక పాత్రలు సృష్టింస్తారు. కధా నాయకుడు, కధా నాయకి, ఖల్నాయకుడ్ని కూడా సృష్టిస్తాడు వాడు లేకపోతే కథ లేదు. ఈ ఖల్నాయకుడు కూడా నీ చేతులో ఉన్నవాడే కదా! ఏ రోజు నువ్వు వాణ్ణి తీసేద్దామనుకుంటే, నీ కలంతో వాడికీ వీడికీ పోట్లాట పెట్టి తీసేయచ్చు. కథ పెంచుతూ ఉంటే కొన్ని సినిమాల్లో మనకే విసుగ్గా అనిపిస్తుంది. ఎప్పుడు కావలిస్తే అప్పుడు తీసివేయవచ్చు కదా అని. అలాగ అందరూ తనలోంచి వచ్చినవారే కదా! అందుకని ఎవరిమీద ఉంటుంది అసూయ, ద్వేషం? అట్లా ఉన్నాడు కృష్ణుడు కూడా, వీరెవరి మీదా ఆయనకు ద్వేషం లేదు. కథలో భాగంగా వెళ్ళిపోవల్సిన వాళ్ళు వెళ్తూ ఉంటారు. వచ్చిన వాళ్ళు వస్తూ ఉంటారు. పుట్టాల్సిన వాళ్ళు పుడుతూ ఉంటారు. నిర్వర్తిస్తుంటాడు. కానీ playground లో దిగాకా ఆ game నియమాలను అనుసరించి నర్తిస్తూంటాడు. 'నర్తకుని భంగి'! అంతమాత్రం చేత దుర్యోధనుడంటే ద్వేషం, ధర్మరాజంటే మమకారం ఉండదు. మమకారం ఉంటే పాండవులకు పుట్టిన పిల్లలందరినీ వెళ్ళనిచ్చేవాడా? ఎంత ద్రౌపది అయినా ఆమెకు పుట్టిన అయిదుగురూ వెళ్ళిపోయారు కదా! అంటే ద్రౌపది అంటే ఇష్టం లేదనా? ఇదేంటి ఇలా జరిగింది అంటే, నవ్వుతాడు. భీష్ముడి మీద ఎంత కోపం ఉండాలి? అసలు యుద్ధానికి కారణం ఆయనే! సత్యవతి తండ్రి వద్ద ఆ శపథం చేయకపోయి ఉంటే ఇంత కథ లేదుగా? నీ మూలంగా కదా అని తిట్టాడా? ఏమీ అనలేదుగా! ఆయన అర్జునుడికి చెప్పేదదే. అదొక్కటి పెట్టుకోక అని. అది లేకపోతే చాలా అదృష్టం, అది ఉంటే చాలా దురదృష్టం. అసూయ! మనుషులను భయంకరంగా వారి చైతన్యాన్ని సడలింప చేస్తుంది. దుర్యోధనుడు అలాగే పాడైపోయాడు. తన అన్న తనకన్నా బుద్ధిమంతుడు,

బలవంతుడు, తేజోవంతుడు, భక్తుడూ, ధర్మాత్ముడూ అని సంతోషిస్తే అదృష్టం. అతణ్ణి ఎలాగైనా తొక్కాలను కోవడం దురదృష్టం. అతణ్ణి తొక్కాలనుకుని వీడికి వీడే తొక్కించుకున్నాడు. భగవంతుడి దృష్టిలో వాడూ, వీడూ కూడా ఆయన కలం లోంచి వచ్చినవారే. అందుకే ద్వేషం ఉండదు. అదే మాస్టారు అనేవారు 'వెంకటేశ్వరస్వామి గుడికి పరమ భక్తుడు, పరమ కిరాతకుడు వెళ్తే ఈ కిరాతకుడు వచ్చాడని గుడి తలుపులు మూసుకుపోతున్నాయా?' అని అడిగేవారు. మూసుకుపోవు కదా! భగవంతుడు అందరికీ భగవంతుడేగా! శివపురాణంలో ఇలాంటి కథలెన్నో. 'స్వామీ నా సంపదంతా కాపాడమని' దణ్ణం పెట్టుకుని పడుకుంటాడు ఒకడు. ఒక దొంగ 'నాకేరోజు ఏమన్నా దొరికేటట్లు చూడమని' దణ్ణం పెట్టుకుంటాడు. వీణ్ణి, వాణ్ణి కూడా ఈయనే చూడాలి మరి. అందుకని, సృష్టిలో ఎవడు దొంగతనం చేసి దాచుకున్నాడో వాడింటికి వీడిని guide చేస్తాడు. వాడికి మనస్సులో ఇక్కడ కన్నం వేస్తే బావుంటుందనిపిస్తుంది. మరక్కడ కన్నం వేస్తే ఆ రోజు police కూడా పట్టుకోలేడు. అలా ఉంటుంది. ఎందుకూ? వాడికీ, వీడికీ కూడా ఈయనే తిండి పెట్టాలి కదా మరి. ఇంద్రుడు విశ్వరూపుడని ఓ గురువుగారిని నమ్ముకున్నాడు. ఆయన వద్ద బాగా favouritism సంపాదించాలని ప్రయత్నించాడు. ఎంతో ప్రేమగా చూశాడాయన్ని. ఈయన్ని నేనే ఇంత బాగా చూసుకుంటున్నాను, అనుకునేంతగా సేవలు చేశాడు. అయితే ఓ రోజున ఆయన వద్దకు వచ్చేసరికి రాక్షసులు కూడా వచ్చి ఆశీర్వచనం పట్టుకుపోతున్నారట. అమ్మ గురువా! అనుకున్నాడట ఇంద్రుడు, నా శత్రువుకి కూడా ఆశీర్వచనం ఇస్తున్నాడు ఇతడేం గురువని తలనరికి పారేశాడట, ద్వేషమేగా! అది కారణంగానే వృత్రాసురుడు పుట్టి నానా బాధలు పెడతాడు. మన అసూయలోంచే మనకు సమస్తమైన దురదృష్టం పుడుతుంది. అందుకనే రాజవిద్య నీకు కావాలంటే నీకు అసూయ లేకపోవడం కావాలంటాడు కృష్ణుడు. If you want kingly wisdom, don't have this అంటాడు. నీకన్నా బావుండేవాడు ఎప్పుడూ ఉంటాడు. ఒక్కో విషయంలో ఒక్కోడు నీకన్నా బావుండేవాడు ఉంటాడు. ఆయన అట్లా చూపించాడు. అంతటి భగవంతుడు వచ్చినపుడు నాసిగా కనిపించాడు అందరికీ. అనుకోనే అనుకోలేదు. అందరికన్నా ఎక్కువ

అందం, కండలు, ఆభరణాలు ఉండాలిగా! మరి ఈయన ఆభరణాలు ఏమిటి? తల చుట్టూ పువ్వులూ, చెవులకి పువ్వులూ, ఒంటిమీద పువ్వులమాల, ముత్యాలదండ లేక పువ్వుల దండ వేసుకున్నా అన్నట్లు ఉండేవాడు. మనకుంటే చూపించమూ? ఆయన ఎవరికీ చూపించలే! కానీ ఎవరినీ ద్వేషించలేదు. రాముడు అట్లా ఉన్నాడు, కృష్ణుడు అట్లా ఉన్నాడు, ఏసుక్రీస్తు అట్లా ఉన్నాడు, బుద్ధుడు అట్లా ఉన్నాడు. మన జీవితం తెమలాలన్నా, 50 percent పై మార్కులు రావాలన్నా ఈ ఒక్కటే తీసేస్తే చాలు. అమర్షణము! సదా అమర్షిః, అసూయ లేనివాడివి నీవు. నీకు ఎవరు కావాలి. అందరూ నీ వాళ్ళే. ఎవరు నా వాళ్ళు కాదు? అంటాడు. అందరూ ఆయన వాళ్ళే! అందుకే కాలయవనుడు ప్రత్యేకించి ఈయనతో పెట్టుకోవాలని ఎక్కడి నుండో వస్తాడు, కృష్ణునితో పోరాడడానికి ఒక special tournament arrange చెయ్యమని అడుగుతాడు. ఏం పోట్లాడతాడు? నవ్వుతూ, హాయిగా తీసేస్తాడు. కృష్ణుడి జీవితంలో ఎక్కడా అసూయ కనిపించదు, క్రౌర్యం నటించడమే. రాముడయినా క్రౌర్యం నటించడమే! అసూయ లేనివాళ్ళు.

225 లోకాధిష్టాన

సమస్త లోకాలనూ అధిష్ఠించి ఉన్నాడు. సప్తలోకాలకీ తానే ఆలయము. ఆయనలోనే ఉన్నాయి సప్తలోకాలూ. మనలో కూడా సప్తలోకాలున్నాయి, మనల్నే వాటికి అధిష్ఠానదేవతగా ఉండమని ఇచ్చాడు. మనం ఎక్కడో మూడో అంతస్తులో ఉండిపోయాం మిగతా నాలుగు అంతస్తులూ బూజు పట్టిపోయాయి. ఏడు లోకాలు మనకి, మనం బొడ్డులో/మణిపూరకంలో ఇక్కడే సులభంగా ఉంది ఇహ పై విషయాలు అక్కరలేదని, అక్కడ కూర్చుంటాం. ఆయన ఏడు లోకాలూ సృష్టించి, ఏడు లోకాలనూ అధిష్ఠించి, అన్నీ లోకాలనూ సంరక్షించి, అన్ని లోకాలలోనూ తాను వ్యాపించి, అన్ని లోకాలనూ తనలో ఉంచుకుని ఇలా ఇన్ని అర్థాలు వున్నాయి, ఆలయం అంటే వీటన్నిటికీ ఆయనే ఆధారం. మనకి ఏడు లోకాలూ ఈ శరీరంలో ఉన్నాయి, మనం లేకుండా లోపల చక్రాలేమీ పని చేయవుగా! మనం ఉంటేనే అవి ఉంటాయి. అలాగే ఆయన ఉంటే ఆ ఏడు లోకాలూనూ, ఆయన అగ్రజుడులా వెళ్ళి ఆ పై వాటితో కలిసిపోతే ఇవేమీ లేవు. సమస్తాన్నీ అధిష్ఠించి ఉన్నాడు. మనలో కూడా అంతే. ఆయన ఉండబట్టే ఇవన్నీ పనిచేస్తున్నాయి. అధ్యక్షుడు అంటే అధిష్ఠానదేవతన్న మాట.

అధిదైవము, ఆధ్యాత్మము, ఆధిభౌతికము అంటే ఏమిటో మాస్టారు అక్షరపరబ్రహ్మ యోగంలో యిచ్చారు. ఎనిమిదవ అధ్యాయంలో, కృష్ణుణ్ణి అర్జునుడు అడుగుతాడీ ప్రశ్న.

౨౭౬ అద్భుతః

అద్భుతం అంటే భీష్ముడే చెప్పాలి. భీష్ముడు అదే చూద్దామనుకున్నాడు. మొత్తం అంతా ఎంత అద్భుతంగా నడిపించాడో కృష్ణుడు. ఇంతింత మంది వరప్రసాదులున్నారు ఇక్కడా? అశ్వత్థామ వరప్రసాది, ద్రోణుడు వరప్రసాది, కర్ణుడు వరప్రసాది, తాను వరప్రసాది, కృతవర్మ వరప్రసాది. దుర్యోధనుడి తొడ తప్ప మిగిలిందంతా వజ్రమే. సైంధవుడికి ఉన్న వరం కూడా తెలిసిందే కదా! మరి ఇలాంటి వరప్రసాదులని ఈయన ఎలా కొడతాడు? అటు పక్క కూర్చున్నాడు, పైగా యుద్ధం చెయ్యనన్నాడు ఎంత అద్భుతం! నారదుడికి అద్భుతం చూపించాడు. ఈయన ఎనిమిది పెళ్ళిళ్ళు చేసుకున్నాడు ఎలా సంసారం చేస్తున్నాడో చూద్దాం అని వస్తాడు నారదుడు. ఎందుకంటే నారదుడికి పూర్వజన్మలో సంసార బాధలు కొన్ని ఉన్నాయి. 60 మంది పిల్లలు అంటే 60 సంవత్సరాలు అన్నమాట. ఆయనకి రెండు పూర్వ జన్మవృత్తాంతాలున్నాయని చెప్తారు. ఓ జన్మలో స్త్రీగా పుడతాడు. అవన్నీ ఆయనకు గుర్తు ఉంటాయి కదా! అంతకు ముందు కల్పం లోనిదే గుర్తు ఉన్నవాడికి ఇన్ని జన్మలలో ఎన్ని రకాలుగా సంసార బాధలు పడ్డాడో గుర్తు ఉంటుంది కదా! రాముడైతే 'ఏకో నారాయణో హరి' అని 'ఒకరే' అన్నాడు. 'ఇంతమందిని పెట్టుకోను, నాకీసారి చాలా పెద్ద పని ఉంది. అందుకే ఈసారి 'only one wife' అన్నాడు. కృష్ణావతారంలో limit పెట్టుకోకుండా వచ్చాడు. అందుకని ఈయన ఎనిమిది మందితో ఎలా ఉన్నాడో చూద్దామని వచ్చాడుటండీ నారదుడు. ఎనిమిదేనా? ఎనిమిది + పదహారువేలతో ఎట్లా ఉన్నాడో చూపించాడట. అంతే నారదుడికి నోట మాట రాలేదు. అద్భుతం కాదా! అద్భుతం అంటే 'అంతకుముందు ఎవరూ చెయ్యలేనిది'. వసుదేవుడికే ఎనిమిది మంది భార్యలు ఉన్నారు. ద్వాపరయుగంలో ఒక్కోడికే చాలా మంది ఉన్నారు. ధర్మరాజుకి కూడా ద్రౌపది కాక భార్యలు ఉన్నారు. ఎందుకిలా ఉన్నారండీ మాస్టారూ? అంటే 'మగవాళ్ళు తక్కువ, ఆడవాళ్ళు ఎక్కువ ఉంటే ఏం చేస్తారూ' అన్నారు. అదేంటండీ అంటే 'సృష్టిలో నువ్వు చెప్పినట్లుగా one is to one ratio ఉండాలని rule ఏమీ లేదు.' ఏమైపోతారు ఆడవాళ్ళంతా? అందుకని ఓపిక కొద్దీ భార్యలని పెట్టుకున్నారు

అని మాస్టారుగారు చెప్పారు. అంతకుముందు పరశురాముడొచ్చి మగవారినందరినీ (రాజులని) ఏరేశాడు కదా! సాంఘిక విలువలు అలా మారుతుంటాయి. Ratio బట్టే పోతుంటారు. మనకి ఎందుకిష్టడు దాని గురించి? అని explain చేశారు. అలాగే గోపికలు. ప్రతి గోపికా ఆయన తనతో నృత్యం చేయాలని కోరుకుంది కదా! కనుక ఒక్కళ్ళతో ఈయన రాసక్రీడ నృత్యం చేస్తే ఇంకోళ్ళు ఆత్మహత్య చేసుకోవచ్చు. అప్పుడేం చేయాలి? అసలు వాళ్ళకెవరికీ కనిపించకపోతే వారంతా చచ్చిపోదాం అనుకుంటున్నారు. ఈ dimension చూడం. రావణాసురుడు దొరక్కపోతే తలతెగ్గోసుకుంటానన్నాడు ఒకడు, ఇంకొకతను కొండ మీంచి దూకేస్తానన్నాడు. బాబాజీ తన బృందంతో హిమాలయాలలో తిరుగుతుంటే, ఎవరో ఇలాంటి మహాత్ముడున్నాడు చూడాలని, చూడకపోతే జన్మ వృథా అనుకున్నాడు. అనుకుని అలా తిరుగుతూ ఉంటే ఒకరోజు బాబాజీ తన బృందంతో కనబడ్డారు, 'నన్ను మీ బృందంలో చేర్చుకోండి' అని అడిగాడు ఇతను.' 'వీలుపడదు' అన్నారాయన. 'మీరు వీలుపడదంటే ఈ శరీరత్యాగం చెయ్యాల్సిందే నేను, ఈ కొండ మీద నుండి దూకి చచ్చిపోతాను' అంటే 'చచ్చిపో' అన్నాడాయన. వాడు నిజంగానే దూకేశాడు. వాడు దూకి చావడం వలన బాబాజీ వెళ్ళి వాణ్ణి సజీవుడిగా చేసుకుని తన బృందంలో కలుపుకున్నారు. తప్పలేదు. అంత సంసిద్ధత ఉన్నచోట కూడా నీవు ప్రతిస్పందించకుండా ఉండడానికి వీలులేదుగా! గోపికల పరిస్థితి అంతే. 'వీని చూడని జన్మలు వృథా' అన్న పద్యాలు భాగవతంలో బోలెడు ఉంటాయి. రాత్రి పూట అంతా వీరికి జాగరణ, ఒక్కరికే కనిపించినా problem ఒక్కరికీ కనిపించకపోయినా problem, ఇంతమందికీ కనిపించినా problem. అందుకనే అందరికీ ఒక్కొక్కరికి ఒక్కొక్కడు అయిపోయాడు. ఆత్మారాముడై ప్రతివారికీ ఒక కృష్ణుడుగా గోచరించి వారితో రాత్రంతా గడిపాడు, Krishna consciousness లో ఉండిపోయారన్నమాట. పొద్దున్నయ్యక, ప్రతివారూ నాతో నృత్యం చేశాడు అంటే నాతో నృత్యం చేశాడని అందరూ పరితృప్తి చెందారు, అద్భుతం కదండీ! పోయినవాళ్లని తీసుకొచ్చాడు. గురువుకి కొడుకుని పట్టుకొచ్చాడు, ఓ బ్రాహ్మణుడికే పోయిన కొడుకులని పట్టుకొచ్చాడు. ద్రౌపది అడగనూ లేదు తీసుకురానూ లేదు. అద్భుతం కాదూ!

అపాండవం కావాలని బ్రహ్మాస్త్రం ప్రయోగిస్తే అయిపోవద్దా! అశ్వత్థామ పాండవ సంతతి ఏదీ ఉండకూడదని సంకల్పించి బ్రహ్మాస్త్రం వేశాడు, మరి బ్రహ్మ వాక్కును కూడా పక్కన పెట్టి పరీక్షిత్తును రక్షించాడు. అద్భుతం కాదా! అసలు బ్రహ్మాస్త్రాన్ని మించిన అస్త్రం లేదు, ఆ అస్త్రం సంధిస్తే ఆ బ్రహ్మ సృష్టి అంతా అదృశ్యం అయిపోవాలి. అలాంటి బ్రహ్మాస్త్రాన్ని అర్జునుడి చేత వేయించి అశ్వత్థామ వేసిన దానికి ఉపశమనం కలిగించి, ఇద్దరికీ వ్యాస మహర్షి సంధి చేస్తే, అప్పుడు ఇద్దరూ విరమించుకున్నాక, అశ్వత్థామ రోషంతో అపాండవం కావాలని తన అస్త్రాన్ని వదులుతాడు. రోషంతో ప్రయోగించిన బ్రహ్మాస్త్రం కావడంతో దాన్ని ఉపశమనం చేసుకునే శక్తి తక్కువ ఉంటుంది. ఉదంకోపాఖ్యానం భారతంలో ఉంటుంది. ఉదంకుడు గురువుగారికి గురుదక్షిణ ఇస్తానంటే నాకు ఏమి కావాలి, గురుపత్నికి ఏమన్నా కావాలంటే ఇమ్మన్నారట. ఆమెను అడిగితే ఆమె చెవులకి పెట్టుకునే దుద్దులు అడుగుతుంది. అవీ మహారాజు భార్యవి. ఏదో పేరంటంలో చూసినట్లుంది. గురువుగారు ఆత్మజ్ఞాని! అడిగినా లాభంలేదు. ఆమె శిష్యుడిని రాజుగారి పట్టమహిషి పెట్టుకున్న దుద్దులు కావాలని తెచ్చియిమ్మన్నది. బ్రాహ్మడు వెళ్ళి అడిగితే రాజుగారికి యివ్వక తప్పదు. ఉదంకుడు వెళ్ళి రాజ్యసభలో తన పాండిత్యం చేత రాజుగారిని మెప్పిస్తాడు. ఆయన సంతోషించి ఏం కావాలని అడిగితే, పట్టపురాణి దుద్దులు కావాలని అడిగితే, రాజు అలాగే వెళ్ళి తీసుకోమంటాడు. సరే అని లోపలకి వెళితే ఆమె అంతఃపురంలో కనబడదు. ఇతనికి కోపం వచ్చి బయటకి వచ్చి రాజుగారితో అంతఃపురంలో ఆమె లేకుండా దుద్దులు ఎక్కడి నుండి తీసుకోనూ? అని అడిగితే రాజు అంటాడు. 'పవిత్రులకే నా భార్య కనిపిస్తుంది. అక్కడే ఉంటుంది. నీలో ఏదో లోపం ఉంది. అది పవిత్రీకరించుకుని వెళ్ళు' అంటాడు. కాళ్ళు కడుగుకుని వెళ్తాడు. అప్పుడు ఆమె కనిపిస్తుంది. తన గురుపత్ని గురుదక్షిణగాఆమె దుద్దులు అడిగిందని చెప్తాడు. ఆమె సంతోషంగా ఇస్తుంది. తిరిగి వచ్చేప్పుడు రాజును కలుస్తాడు. 'ఉండు భోంచేద్దాం, చేశాకా వెళ్దువుగానీ' అంటాడు. ఈ ఉదంకుడికి భోజనంలో వెంట్రుక కనిపిస్తుంది. 'సద్బ్రాహ్మణి భోజనానికి పిలిచి అవమానం చేశావు. వెంట్రుకతో పెట్టావు', అని కోపం వచ్చి శాపం పెడతాడు. ఆశ్చర్యపోయి తను వండించిన భోజనంలో వెంట్రుక రాకూడదే

అని చూస్తే వెంట్రుకలాగా ఉన్న ఆహార పదార్థానికి సంబంధించిన పీచు. 'ఇది వెంట్రుక కాదు' అని చూపిస్తే 'ఆహా'! అని అంటాడు. 'నీకు తొందరపాటు ఎక్కువ. ఇందాకా అలాగే అన్నావు. ఇప్పుడూ పీచు చూసి వెంట్రుక అన్నావు. నీ పరిస్థితి బాగాలేదు. నువ్వు నాకు శాపం ఇస్తావా? నీ శాపం సరైన ప్రమాణం ఏదీ లేకుండా ఇచ్చావు కాబట్టి అది పనిచేయదని నేను శాపం ఇస్తానని' ఇచ్చేస్తాడు. అప్పుడు బ్రాహ్మడంటాడు, 'పొరపాటయ్యింది కనుక నా శాపాన్ని నేను ఉపశమనం చేసుకుంటున్నాను. క్షమించు, తప్పయిపోయింది. నేను తప్పు ఒప్పుకున్నాను కనుక నీవు కూడా నీ శాపాన్ని ఉపశమనం చేయమంటాడు'. రాజు అంటాడు 'బ్రాహ్మడికి ప్రథమకోపం ఉంటుంది. తొందరగా పోతుంది. హృదయం పవిత్రంగా ఉంటుంది. కనుక నీవు నీ శాపాన్ని ఉపశమనం చేసుకోగలిగావు. రాజులు/క్షత్రియులు పైకి మర్యాదగా ఉన్నా లోపల హృదయం కఠినం. ఈ శాపానికి ఉపశమనం చేసుకోవాలంటే నా హృదయం నీ హృదయం అంత మార్దవం కాదు కనుక, నాకు ఉపశమనం చేసుకోవాలన్న భావన ఉన్నా నేను చేయలేను' అంటాడు. పోతేపోనీలే నేను చూసుకుంటాను, అంటాడు ఉదంకుడు. హృదయం నిర్మలంగా లేనివారు. తాము వేసిన అస్త్రములు కానీ, శాపములు గానీ ఉపశమనం చేయలేరు. అశ్వత్థామ అపాండవం కావాలని అస్త్రం వేశాడు కనుక, ఉత్తరగర్భంలో పరీక్షిత్తు ఎగిరిపోయే పరిస్థితి వస్తుంది. బ్రహ్మాస్త్రాన్ని నిరోధించగలిగే అద్భుతం కృష్ణుడక్కడ చూపిస్తాడు. అన్నీ అద్భుతాలే! ఇన్ని అన్ని అని చెప్పడానికి వీలులేదు. సృష్టిలో భగవంతుడు అద్భుతం అని చెప్పడం విషయమే కాదు. ఎప్పుడు ఎక్కడ ఏం జరుగుతుందో తెలియదు. భారతీయులు ఆటంబాంబు పేల్చడం అద్భుతమే. పోలీసుల్లాగా భూగోళం అంతా కాపలా కాసే అమెరికా వాళ్ళు కూడా కనిపెట్టలేకపోయారు. అద్భుతం అప్పటికప్పుడు పుడుతుంది. ఎవరూ ఊహించనట్లుగా జరుగుతుంది. ముందెవరికీ తెలియదు. అందరినీ సముద్రం ఒడ్డుకు విహారయాత్రకు తీసుకుపోయాడు. అంతా వెళ్ళిపోయారు. ఇంటికి వచ్చాక రుక్మిణి అడుగుతుంది. నీకంతా తెలుసుకదా, తెలిసే తీసుకెళ్ళావా? అని అంటే 'ఇప్పుడు నాకు తెలిసే తీసుకువెళ్ళానంటే ఏం లాభం? తెలీక తీసుకెళ్ళానంటే ఏం లాభం? ఏమైనా పోయారు కదా!' అంటాడు. తెలిసే తీసుకువెళ్ళానంటే

అదేమన్నా గుండెకాయా అని అడగదూ రుక్మిణి? అది ఎంత వెన్నో అంత బండరాయి కూడా! అందుకే నాకు తెలుసు అన్నా, తెలియదు అన్నా మార్పు వస్తుందా! అని అడుగుతాడు. అద్భుతమైన సమాధానం కదా! యుద్ధంలో సహకారం కోరడానికి ఈయన వద్దకు దుర్యోధనుడు, అర్జునుడూ వచ్చారు. 'నేను ముందు వచ్చాను కనుక నాకు ముందు వరం యివ్వాలంటాడు' దుర్యోధనుడు. 'నువ్వు ముందు వచ్చి ఉండవచ్చు. నేను ముందువాడిని చూశాను కదా!' అని చెప్తాడు అద్భుతంగా కృష్ణుడు. మనకే కాదు. ఎవరికీ అలా తట్టే ప్రశ్నే లేదు. అంతా అద్భుతమే! సృష్టిలో భగవత్ తత్త్వం అద్భుతం అని చెప్పడానికి కారణం కాలం మడతల్లో ఏముందో ఎవరూ చెప్పలేరు. మనం ఎన్ని అంచనాలన్నా వేసుకోవచ్చు. రేపు ఈ విధంగా జరుగుతుందని చెప్పగల మగవాడెవ్వడూ లేడు. ఏ భూమి నీళ్ళల్లోకి వెళ్ళిపోతుంది. ఏ భూమి మిగులుతుందో ఎవ్వరూ చెప్పలేరు. ప్రతివారూ అడుగుతుంటారు. అంటే నీళ్ళల్లోకి ఈ భూమి వెళ్తుందని చెప్తే బలవంతులైన వారు బలహీనులందరినీ ఇవతల పారేసి అది ఆక్రమించుకుంటారు కదా! ఏది ఎప్పుడు ఎక్కడ ఎట్లా జరుగుతుందో ఎవరికీ తెలియకుండా కాలం మడతల్లోంచి అలా భళ్ళున చూపించే తత్త్వం అద్భుతం, అనూహ్యం. కృష్ణుని అద్భుతాలు చెప్పాలంటే చాలా చాలా ఉన్నాయి. భగవంతుడి అద్భుతాలైతే ఇక చెప్పనే అక్కరలేదు. 'మీ లీలలు తెలియగా మా తరమా!' అని ప్రతి భక్తుడూ భగవద్దర్శనం అయినప్పుడు పొగిడి, పొగిడి, 'ఏం పొగడను? నాకేం తెలుసు? నువ్వెంత పొగిడించుకుంటే అంత పొగుడుతాం అంతే కదా!' అంటాడు. పొగిడేవాడు వీడైతే పొగడలేడు, వాడే వీడుగా ఉండి పొగుడుతాడు అయిపోయాక 'ఇంకెంతని పొగుడుతానూ? ఎంత పొగిడినా ఏం సరిపోతుంది? ఇంతే కాదు, ఇంతకన్నా చెప్పలేను' అంటాడు ఎంత అద్భుతం? కృష్ణుడు కూడా అంత అద్భుతం, రాముడి విషయంలో కొన్ని సందర్భాలలో ఇలాంటి సన్నివేశాలలో ఇలా ప్రవర్తిస్తాడని చెప్పవచ్చు. కానీ కృష్ణుడి విషయంలో అలా చెప్పలేం. It can be anytime, any moment, anything అట్లా చూపించాడు. కృష్ణుడు పుట్టిన దగ్గర నుండి తను వెళ్ళిపోయేవరకూ భీష్ముడు కృష్ణుణ్ణి చూశాడలా! కృష్ణుడి యొక్క కార్యాలన్నీ చూసి అత్యానందం పొందాడు. ఈ చెప్పినవన్నీ ఆయనకు సంబంధించిన గుణాలు. శాశ్వతుడై

దిగి వచ్చాడంటున్నాడు, అందరిలోకీ పెద్దవాడివి నువ్వే అంటున్నాడు, సమస్తాన్నీ భోంచేసేశావు కదా! అన్నాడు, మరి యుద్ధం అయ్యాక కదా తన వద్దకు వచ్చింది, 'అనంతః హుతభుక్ భోక్త', సుఖాన్నిచ్చాడు. అనేకంగా తానే ఉన్నాడు, అందరిలోకీ పెద్దవాడు 'అగ్రజుడు', అతనికి నివ్వెరపోవలసిన విషయంలేదు, శాశ్వతుడు సదా, ఎవరిమీదా ద్వేషం లేదు, అసూయ అంతకన్నా లేదు. లోకాలన్నీ అధిష్ఠించి ఉన్నాడు. అది కృష్ణావతారంలో చాలా పెద్ద విషయం. బ్రహ్మకు పాఠాలు నేర్పాడు. ఇంద్రుడికి పాఠాలు నేర్పాడు. వరుణుడికి పాఠాలు నేర్పాడు. అన్ని లోకాలూ సవరించాడు. ఇటు పాతాళాన్ని ముట్టుకుని సవరించాడు. అటు బ్రహ్మలోకం ముట్టుకుని సవరించాడు. సమస్తం ముట్టుకుని సవరించాడు. కనుక లోకాధిష్ఠానః అద్భుతః .

౨౭, ౨౮ సనత్, సనాతనతమఃు

సనత్సనాతమఃు అంటే సనత్కుమారుని కన్నా సనాతనుడు అని చెప్తున్నాడు. సనత్కుమారుడు ఈ భూమికి ప్రభువు, ఈ భూమికి ఆత్మ. ఈ శరీరానికి మనం ఏవిధంగా ఆధారమో, అలాగే ఈ భూమికి సనత్కుమారుడు ఆధారం. ఆయన శంబళ గ్రామంలో వుంటాడు. అందుకే మన పురాణాలలో విష్ణు అవతారం శంబళ గ్రామం నుండి దిగివస్తుందని చెప్తారు. విష్ణ్వాంశగా ఎప్పుడు భూమి మీదకి దిగివచ్చినా, సనత్కుమారుని సహకారంతోనే దిగి వస్తుంది. అంటే దైవము, జీవుని యందు ఆవరించి వున్నపుడు జీవుడు మహత్కార్యములు నిర్వహిస్తాడు. మహాత్ములంతా అంతే కదా! విష్ణ్వాంశగా భూమికి ధర్మోద్ధారణము, జగత్ కళ్యాణము చేయడానికి దిగి వచ్చినపుడల్లా సనత్కుమార ప్రజ్ఞని ఆవరించుకుని భగవంతుడు దిగివస్తాడు. ఇది ఒక సత్యం. అందుకని ప్రభువు సనత్కుమారుడు గోబీ ఎడారిలో, శంబళ గ్రామంలో సూక్ష్మప్రదేశంలో నివసిస్తూ ఈ భూమిని నిర్వర్తిస్తున్నవాడు. మనం ఆజ్ఞ నుండి ఏవిధంగా స్వామిత్వం చెంది ఈశరీరాన్ని నిర్వర్తించుకోగలమో, అదే విధంగా సనత్కుమారుని కేంద్రము భూమి మీద ఎక్కడున్నదో అది భూమికి ఆజ్ఞా కేంద్రము. మనం సిద్ధులైనప్పుడు ఏవిధంగా పరమాత్మ తత్త్వం ఆకళింపుచేసుకుని, ఆ ప్రణాళికను మననుండి నిర్వర్తింపచేస్తామో అదేవిధంగా భూమండలానికి ఆత్మతత్త్వమైన సనత్కుమారుడు అంతకన్నా ఊర్ధ్వలోకముల నుండి దిగి వచ్చిన తత్త్వానికి వాహికగా నిలబడి పని చేస్తాడు. అందుకని భూమికి ప్రభువు సనత్కుమారుడు, భూమికి గురువు జగద్గురువు మైత్రేయుడు అని ఒక అవగాహన. భూమండలమునకు కేంద్రం సనత్కుమారుడు. సనత్కుమారుని వలె మనకి నలుగురు కుమారులున్నారు. సనత్కుమారునికన్నా నువ్వు ముందువాడివి, సనాతనుడివి అని చెప్తున్నారు. ఎవరి గురించి చెప్పారు? ఒకటి పరతత్త్వం గురించి, రెండవది శ్రీకృష్ణుడి గురించి. శ్రీకృష్ణుడు సనత్కుమారుని కూడా మించినవాడు. కృష్ణావతారం భూమి మీదకు దిగివచ్చినపుడు సనత్కుమారుడు ప్రద్యుమ్నుడిగా దిగివచ్చాడు. అందుకే మహాభారతము చదువుకుంటే ప్రద్యుమ్నుడు సనత్కుమారుడుగా ఆ తర్వాత

అవతారం ధరించినట్లుంటుంది. ముందు కూడా అదే, తర్వాత కూడా అదే! ఎందుకని అంటే ఆత్మతత్త్వం ఆధారంగానే భూమి పరిపాలింపబడుతోంది. కనుక The Lord of the planet, The Lord of our body is the idividual soul అని ఎలా చెప్తామో, The Lord of the planet is Sanathkumara. అంతకు మించి పైన సనందనుడు అనే ప్రజ్ఞ. భూమండలానికి సనత్కుమారుడు ఏ విధంగా జీవాత్మగా వున్నాడో, అలాగే మొత్తం సూర్యమండలాన్ని ఒక తత్త్వంగా తీసుకుంటే, దానికి కేంద్రంగా, ప్రభువుగా పరిపాలించేవాడ్ని సనందనుడు అంటారు. అంతకు పైన సవితృమండలంలో ప్రభువుగా పని చేసే ప్రజ్ఞ సనకుడు. ఒకేతత్త్వం నాలుగు విధాలుగా దిగివస్తుందని చెప్పకుంటున్నాంకదా! Cosmic centre, Solar centre, Sun centre, Planetary centre ఇలా 4 centres అంటాం. దాన్నే భర్గోదేవమండలం, సవితృమండలం, సూర్యమండలం, భూమండలం అని చెప్పకోవచ్చు. అదే చతుర్వర్గఫలంజ్ఞానం, చతురాత్మ, చతుర్భావ, చతుర్వ్యూహ, చతుర్గతిః అని చతుర్ చతుర్ గా చెప్పకుంటాం. ఈ నాలుగుగా ఏర్పడిన సృష్టిలో ఒకదానిలో ఒకటి ఇమిడి వుంటుంది. మొత్తం వాసుదేవతత్త్వంలో భర్గోమండలం మొదట ఇమిడి వుంటే, అందులో సవితృమండలం ఇమిడి వుంటే, అందులో సూర్యమండలం ఇమిడివుంటే, అందులో భూమండలం ఇమిడి వున్నది, ఇలా ఒక పరంపర/ hierarchy వున్నది. ఈ పరంపరలో సనత్కుమారుడు భూమండలానికైతే, సనందనుడు సూర్యమండలానికైతే, సనకుడు సవితృమండలానికైతే, సనత్సుజాతుడు అంతకన్నా పైమండలాని కైతే ఇలా ఆ బ్రహ్మ దగ్గర నుండి దిగి వచ్చిన నలుగురు కుమారులు, నాలుగు మండలాలకు ఆధిపత్యం వహించి వుంటారని చెప్తారు. వీరందరికన్నా ముందువాడని చెప్పడానికి సనాతనః. సనత్ సనాతన తమః అంటే నీవు ఈ సనక, సనందన, సనత్కుమార, సనత్సుజాతుడు అయిన ఈ బ్రహ్మ మానసపుత్రులకన్నా, ఆ బ్రహ్మ కన్నా ముందువాడివి అని చెప్తున్నాడు. అంటే ఆ బ్రహ్మ ఎక్కడ నుండి దిగి వచ్చాడూ? అతడే నీవు అని చెప్పడానికి భీష్ముడు శ్రీకృష్ణుడుని ఏమని సంబోధిస్తున్నాడూ అంటే, సనకసనందనాదుల కంటే, బ్రహ్మకంటే కూడా సనాతుడవని చెప్తున్నాడు. పరతత్త్వం ఎలాగూ అన్నింటి కన్నాముందు

వుండేదే! అయితే ఇక్కడ కృష్ణతత్త్వం కూడా అలాగే అని చెప్తున్నాడు భీష్ముడు. నీవు వాళ్ళందరి కన్నా ముందు నుండి వున్నవాడివి. మనకి భూమి మీద అంతకు ముందు కూడా మహానుభావులు, పూజనీయులు, మార్గదర్శకులు వున్నారుగా, వారికన్నా కూడా నీవు ముందటివాడివి అని చెప్పడానికి సనత్ సనాతనతమః. ఎంత వెనకటి వాడవో చెప్పలేం. The Ancient Most One అంటారు. పురాతనుడు, సనాతనుడు. అందుకే భగవంతునికి 'సనాతన' అనే ఒక పేరు కూడా ఉంది. కృష్ణుడిగా వున్న ఆ పరతత్త్వం ఈ నలుగురు కుమారులకు కూడా ఆరాధనీయుడు.

౨౭౧ కపిలుఁ

ఈ భూమి ఏర్పడిన తర్వాత భగవంతుని మొట్టమొదటి అవతారం కపిలుడు. ఈ నామం ఒకసారి వచ్చింది. మళ్ళీ చెప్పడానికి కారణం ఏమిటే? మొట్టమొదటి గురువువి నువ్వే అని చెప్పడం కోసం. ఈ భూమి అంతకు ముందు కర్దమ ప్రజాపతి కాలంలో అటు నీళ్ళూ కాదు, ఇటు ఘనీభవించిన పదార్థమూ కాదు. బురద బురదగా వున్నది. ఉండ గట్టిపడలేదు, అప్పుడే వేడివేడిగా తయారై వచ్చింది, ఇంకా గట్టిపడాలి. జీవులున్నారుగానీ, జీవుల శరీరాలు చాలా మృదువుగా, మార్దవంగా ఎలాబడితే అలా మలచబడేటట్లుగా లేతగా వున్నాయి. ఇంకా బండ బార లేదు. ఆ సమయం నుండే తర్వాత సమయంలోనికి కపిలుడి కథ వస్తుంది. భూమి పుట్టుక, జీవుల పుట్టుకా రెండూ సమాంతరంగా నడుస్తుంటాయి. భూమి మార్దవంగా వున్నప్పుడు జీవుడు మార్దవంగా వున్నాడు. భూమి గట్టి పడేసరికి, భూమి నుండి వీడి శరీరం కూడా వస్తుంది, కాబట్టి వీడూ గట్టిపడ్డాడు. పూర్తిగా తన వెలుగు శరీరాన్ని మరచిపోయేంతగా మరీ గట్టిబడిపోయాడు. ఇక వెలుగు స్వరూపం పూర్తిగా మర్చిపోయే సమయంలోనే భగవంతుడు కపిలుడుగా వచ్చాడు. అంతవరకు ఈ విద్య చాలా సులభంగా అందరికీ అవగాహన అయ్యి వుండి వున్నది. ఈ విద్య ముందు ముందు ఇహ మర్చిపోతారనే వేదవ్యాసుడు కలియుగం రాగానే, వస్తుందని తెలిసి తాపత్రయం పడి ఇంత వాఙ్మయం ఇచ్చాడు. వేదవ్యాసుడే లేకపోతే ఈ రోజున భూమికి చీకటే! భూమికంటే భూమి జీవులకి! ఎంత వాఙ్మయం ఇచ్చాడంటే, 'ఆ తరువాత వీళ్ళందరూ పశుప్రాయులు అవుతారు, మ్లేచ్ఛులు కూడా అయిపోతారు, సాంప్రదాయం ఎక్కడా నిలవదు' అన్న ఉద్దేశ్యంతో, తాను భవిష్యత్తు అంతా గమనించి, 'అయ్యో ఇంత జ్ఞానం వీళ్ళకి కనీసం ఏదో ఒక రూపంలో అందుబాటులో ఉండకపోతే, మళ్ళీ వీళ్ళు తిరిగి ఈ మార్గంలోకి వచ్చేదెట్లా?' అనే అపారమైన కరుణతో ఇచ్చాడు. తాను కూడా భగవంతుని యొక్క అంశావతారమే. వ్రాసి ఇచ్చాడు. అలాగే ఈ భూమి గట్టిపడడం అనేది 30 కోట్ల సంవత్సరాల క్రితం కథ. ఆ సమయంలో కపిలుడు భక్తి అంటే, జ్ఞానం అంటే, యోగం అంటే, వైరాగ్యం అంటే ఏమిటి అని చెప్పాడు.

ఈ నాలుగూ ప్రతివాడు ఏవిధంగా పెంపొందించుకొనడం వలన మళ్ళీ తనకి తాను పరిపూర్ణుడుగా తెలిసే జ్ఞానం లభిస్తుందో ఆ విద్య ఇచ్చివెళ్ళాడు. అందుకే కపిలుని సాంఖ్యశాస్త్రము అంటే భక్తి, జ్ఞాన, యోగ, వైరాగ్యములు. ఈ నాలుగు వున్నచోట సాంఖ్యమున్నట్లు, ఇది మాస్టారు గారు కపిలుని యొక్క జ్ఞానానికి ఇచ్చిన నిర్వచనం. ఈనాలుగూ ఎవరి యందు పరిపూర్ణంగా, సరి సమానంగా వృద్ధి చెందుతాయో, వారికి పురోభివృద్ధి వుంటుందని మాస్టరుగారి వ్యాఖ్య. అందుకే భక్తి స్వాధ్యాయం లేకపోతే మూఢవిశ్వాసంగా వుండిపోతుంది. స్వాధ్యాయం భక్తితో కూడకపోతే అహంకారంగా పరిణమించి ముందుకు వెళ్ళడానికి వీలుండదు. జ్ఞానం భక్తితో మేళవించి, ఒక సద్గురువు వద్ద యోగమార్గం అందుకుని దానిని నిర్వర్తించుకుంటూంటే వైరాగ్యం సహజంగా వస్తుంది. ఈకాలంలో భక్తి ఎంత పెరుగుతోందో మమకారం దానితో సమానంగా పెరుగుతోంది. ఎందుకంటే, తనకోసం, తనవారికోసం ప్రార్థన చేయడమే భక్తి అని భావన కదా ఈరోజుల్లో! వైరాగ్యానికి జ్ఞానం కావాలి. జ్ఞానం కావాలంటే మహాత్ములు రచించిన గ్రంథములు, వారి జీవితచరిత్రలు బాగా చదువుకోవాలి. జ్ఞానం పవిత్రీకరించినట్లుగా ఏదీ పవిత్రీకరించదు. అందుకే భగవద్గీతలో 'నహి జ్ఞానేన సదృశం పవిత్రమిహ విద్యతే'! జ్ఞానంతో సరిపోల్చదగినది, పవిత్రీకరించడంలో జ్ఞానం కంటే ఇంకేదీలేదు అని చెప్తాడు శ్రీకృష్ణుడు. జ్ఞానం మనకి బుద్ధివికాసం కలిగిస్తుంది. అది కలగడం చేత మనకి యోగానికి అవరోధాలు తగ్గుతాయి. శ్రద్ధా, భక్తులు ఇంకా పెరుగుతాయి. ఇవన్నీ ఒకదానికొకటి అనుపానంగా పనిచేసేవి. ఇందులో ఏ ఒక్కటి అందుకోకపోయినా ఊర్ధ్వముఖంగా ముందుకువెళ్ళడానికి మనకి అవకాశం తక్కువ. అందుకని ఈ నాలుగూ మేళవించి ఇచ్చి, తానే ఇవన్నీ నేర్పడానికి లోపల మన వెన్నెముకలో సుషుమ్నలో ఒక సంఖ్యాపరమైన శక్తిగా వున్నాడు కపిలుడు. ఎందుకు ఇక్కడ కపిలుడు చెప్పారంటే, అసలు కపిలుడు లేకపోతే సృష్టి లేదు. మనందరిలో కపిలుడు వుండబట్టి, అదీ అంకెల జ్ఞానంగా వుండబట్టి, అందులోంచే శబ్దాలు, అందులోంచే వర్ణాలు, రూపాలుగా పుట్టుకొస్తున్నాయి. కనుక మనలో కపిలుడిగానూ, సృష్టిలో కపిలుడిగానూ మొట్టమొదటనుండీ వున్న తత్త్వము నీవే అని చెప్పడం. How

ancient you are అని చెప్పడానికి చెప్తున్నారు. Number consciousness అంటారు. అలాగే విశ్వకర్మని Shape consciousness అని అంటారు. విశ్వకర్మ ప్రజ్ఞగా అవే రూపాలు, మళ్ళీ రూపాల్లోంచి పుట్టుకొచ్చే తత్త్వం వున్నది. అవే రూపాలు పుట్టుకు రావడం అవే రంగులు పుట్టుకురావడం, అవే శబ్దాలు పుట్టుకురావడం, వీటన్నిటికీ మూలంగా ఆధారంగా వున్నది అంకె. ఆ అంకెగా వున్నది కపిలప్రజ్ఞ. ఆ తత్త్వమే భూమికి దిగివచ్చి మొట్టమొదటి ఆచార్యుడిగా ఈ భూమి మీద జ్ఞానాన్ని ఇచ్చింది. భూమి జీవులు భౌతికమైన శరీరాలు దాల్చే సమయానికి జ్ఞానం మరుగున పడిపోతుందేమో అనే ఉద్దేశ్యంతో, తల్లిని నిమిత్తకారణంగా శిష్యురాలిగా పెట్టుకొని సమస్తజ్ఞానాన్ని భూమికి అందించాడు, అందుకే కపిలుడిచి న జ్ఞానం సమగ్రమైన జ్ఞానం అంటారు. ఒక pyramid కి నాలుగు పక్కలా పైకి ఎక్కేటట్లుగా యోగము, వైరాగ్యము, భక్తి, జ్ఞానము నాలుగూ కలిపి ఇచ్చారు. సరే ఇక్కడ మళ్ళీ కపిలుడు వచ్చాడంటే, How ancient అనే concept లో, భావం కోసం. సనత్కుమారుని కన్నాముందు వాడంటే భూమికన్నా ముందువాడనే. కపిలుని కన్నా ముందువాడంటే అసలు సృష్టి వెన్నెముక వున్నది కదా, దాని కన్నా ముందువాడని. సృష్టి వెన్నెముక నువ్వే. కనుక ఇవన్నీ ఏర్పడుతున్నాయి. వెన్నెముక లాంటివాడివి అనిచెప్పడం.

౨౩౦, ౨౩౧ కపిః, అవ్యయః

కిరణముల ద్వారా సమస్తాన్నీ తనలోకి అందుకునే వాడని అర్థం. అందుకనే 'కపి' అనేది భగవంతుని నామంగా వచ్చింది. గ్రీష్మఋతువు కారణంగా సమస్తజలాలనూ కిరణముల ద్వారా మళ్ళీ తనలోనికి అందుకుంటాడు. మళ్ళీ సమస్తమూ తనలోంచి బయటకు వస్తూంటుంది. అవ్యయంగా ఇది జరుగుతూంటుంది. అందుకనే 'కపి' అనివచ్చింది. 'వృషః' అంటే అట్నుంచి జలముల రూపంలో వర్షించేవాడు. కపి అంటే ఇట్నుంచి జలాలను కిరణాల రూపంలో మళ్ళీ తన లోనికి అందుకొనేవాడు. మనలో కూడా కపి పనిచేయడం మొదలెడితే జలములు అందుకోబడతాయి. భూమి జలములు అంటే కామముతో కూడిన జీవచైతన్యము! దాన్ని తను అందుకోవడం వలన, అట్నుంచి వచ్చేటపుడు మురికికాలవలోని నీళ్ళయినాసరే, మేఘాల్లోకి వెళ్ళిపోతే మళ్ళీ తిరిగివచ్చేటపుడు నిర్మలమైన జలంగా తిరిగి వస్తుంది. ఈ కార్యాన్ని నిర్వర్తించే వారెవరయ్యా అంటే గురువు! అందుకే ఆయన కపీశ్వరుడు, భగవంతుడు. అలాగే హనుమంతుడు. అందుకే కపి. గురువుగా మార్గాన్నిచూపించి, కల్మషమైన జీవప్రజ్ఞను కల్మషముల నుండి ఉద్ధరించి సూర్యకిరణముల ద్వారా, మళ్ళీ తిరిగి వర్షరూపంలో అందించే వాడు కపీశ్వరుడు. ఈ జీవులను ఉద్ధరించే కార్యక్రమం అలా అవ్యయంగా నిర్వర్తిస్తుంటాడు. ఇక్కడ 'అవ్యయం' దేనికి జత కలిపి చెప్పకోవాలంటే, జీవులను ఉద్ధరించే కార్యక్రమము అనుస్యూతముగా జరగడాన్ని చెప్పకోవాలి. అందుకని అవ్యయంగా ఈ కపితత్త్వాన్ని నీవు నిర్వర్తిస్తున్నావు, జీవులను నీలో అందుకుంటున్నావు, నీ తత్త్వంలోనికి ఇముడ్చుకుంటున్నావు, జీవులనుద్ధరించుకుంటున్నావు అని చెప్పడానికి. కపి, అవ్యయః రెండూ వేరువేరు నామాలుగా తీసుకోవచ్చు. అవ్యయమైన కపితత్త్వం నీలోవున్నదనీ చెప్పకోవచ్చు. తర్వాతి నామాలను చూస్తే అవ్యయమైన కపితత్త్వం వున్నదని చెప్పకోవడమే ఎక్కువ సబబుగా వున్నట్లు గోచరిస్తుంది.

೨೩೭, ೨೩೩, ೨೩೪ స్వస్తిదః, స్వస్తికృత్, స్వస్తిః

స్వస్థత ఇవ్వాలంటే ఈ కపితత్త్వంలోనే మనల్ని అనాహతచక్రంలోకి ఉద్ధరించాలి. మనం బొడ్డులోనో, స్వాధిష్టానంలోనో, మూలాధారం లోనో ఎక్కడో పడివుంటాము. పదార్థమయమైన ప్రపంచంలో చైతన్యం బాగా గింగిరాలు కొట్టుకుంటూ కొంతమందికుంటే, ఆవేశకావేశాది లోకాల్లో జీవప్రజ్ఞ బాగా బందీకృతమై కొంతమందికుంటే, ఆలోచనాది లోకాలలో బందీకృతమైన జీవ ప్రజ్ఞ కొంతమందికుంటుంది. ఇట్లా మూడు చోట్ల మనకు బంధనాలు. ఈ మూడింటి నుండీ మనల్ని జుట్టు పట్టుకుని పైకి లాగాలి. అట్లా పైకి లాగడం అనే కార్యక్రమం ఓ పక్క అనుస్యూతంగా జరుగుతూనే వుంది. జీవులు ఎప్పుడూ ఓ పక్క ఉద్ధరింపబడుతూనే వున్నారు, ఓ ప్రక్క నుండి మళ్ళీ సృష్టి లోనికి దిగివస్తూనే వున్నారు. కనుక అవ్యయంగా, నిరంతరంగా ఇలా జీవులను ఉద్ధరిస్తూండే కార్యక్రమం నీవు నిర్వర్తిస్తున్నావని శ్రీకృష్ణుని గురించి భీష్ముడు చెప్పినట్లుగా మనం భావన చేయవచ్చు. అలాగే భగవత్తత్త్వము లేదా పరతత్త్వము తను పొందిన వారి ద్వారా ఇది ఇతర జీవులకు పొందిపచేసే కార్యక్రమం ఒకటి నడిపిస్తూంటాడు భూమిమీద. వారినే గురువులని అంటాం. గురువుగా జీవులను ఉద్ధరిస్తాడు. ఉద్ధరింపబడడాన్ని నిరాకరించినవారిని ప్రభువుగా శిక్షించి ఉద్ధరిస్తాడు. ముందు గురువు, తరువాత ప్రభువు. నయాన, భయాన ముందు నేర్పుతాడు. నయాన నేర్చుకోకపోతే భయం. ప్రభువుగా, గురువుగా తానువచ్చి, కృష్ణావతారంలో ఎంతోమందిని ఉద్ధరించుకున్నాడు. అలాగే మహాత్ములు భూమి మీద ఎప్పుడూ ఉంటూనే వుంటారు. అప్పుడున్నారు, ఇప్పుడు లేరనే భావం ఏమీలేదు. ఎవరికైతే మనల్ని మనం ఉద్ధరించుకుందాం, మనల్ని మనం తెలుసుకుందాం, అసలు మనం చేస్తున్న పనులు ఇవేనా, ఇందుకేనా వచ్చాం, అసలు మనం ఎందుకు వచ్చాం? మనం ఎవరు? ఇటువంటి ప్రశ్నలు జీవుడికి ఏదో ఒక time లో పుడుతాయి. ఎప్పుడూ ఇదే పనేనా? ఇంత కన్నా వేరే ఏమీ లేదా? అని అనుకునేవారికి వారు ఎప్పుడూ వుంటూంటారు. 'తందనాలతో/బంధనాలతో పొద్దుపోవలెనా, తాళజాలరా, జాల మేలరా ఓరాఘువా' అని త్యాగరాజు పాడుతుంటారుగా!

ఎంతోసత్యం. వారికి విసుగుపుడుతుంది. అదే పనులా? తిరగలిలాగ, రంగులరాట్నంలాగ ఇలా తిరగడమేనా ఏదన్నాసారమున్నదా, అసలు ఉద్దేశింపబడినది ఏదన్నా వున్నదా? అదేమిటో తెలియాలంటే, ముందు నేనేమిటో తెలియాలి. ఇదంతా తెలియాలి అంటే ఇందులో మనపాత్ర ఏమిటో తెలియాలి, దాని ప్రకారం ప్రవర్తిస్తూండాలి, అప్పుడు ఆనందం. అలాంటి భావన లేకుండా అదే లేవడం, అదే తిరగడం, అదే తినడం, అదే పడుకోవడం, పక్క వాడు ఏం చేస్తుంటే అదే చేయడం గా అలా జరిగిపోతుంటే ఏంటండీ! వీరందరినీ ఉద్ధరించే వాడు వున్నాడు. అవ్యయంగా ఈ కార్యం నిర్వర్తిస్తూనే వున్నాడు. 'కపి' అంటే జలములను గ్రోలేవాడు అని అర్థం. భూజలములను సూర్యకిరణముల ద్వారా గ్రోలేవాడు. సూర్యకిరణం అంటే ఆత్మతత్త్వం నుండి ప్రసరించే వెలుగు కిరణం. అందుకని ఆత్మతత్త్వం నుండి మరోసారి వెలుగు ప్రసారం జరిగి, కామ లోకాలలో బంధింపబడ్డ ప్రజ్ఞను ఊర్ధ్వముఖంగా తీసుకుని వచ్చి, క్షాళనం చేసి మళ్ళీ నిర్మలమైన జలాలుగా మనకి అందించి, ధర్మయుక్తమైన కామంతోనే జీవించేటట్లుగాను చేశాడు. అప్పుడు సృష్టి అనుభూతిగా వుంటుంది. అదే సృష్టి కొంతమందికి సమస్య, కొంతమందికి వైభవము. ఆ విధంగా స్వస్థత ఇస్తాడు. స్వస్తిదః అంటే స్వ, అస్తి 'అది ఇచ్చేవాడు' అని అర్థం. 'స్వ' అంటే తాను, 'అస్తి' వున్నాను. 'నేనున్నాను' 'అహమస్మి'. తాను తానుగా వుంటే అది స్వస్థత. జలుబు చేసింది, తగ్గింది స్వస్థత చేకూరింది అనుకుంటాం కదా! మళ్ళీ ఆ స్వస్థత పోతుంది. మర్నాడు చెవినొప్పి, ఆ మర్నాడు జ్వరం, ఆమర్నాడు ఇంకోటి ఇలా వస్తూనే వుంటాయి కదా! శరీరం స్వస్థత గురించి మనం తాపత్రయపడుతుంటాం. భగవంతుడు జీవుల యొక్క స్వస్థత గూర్చి తాపత్రయపడతాడు. తానుకు ఈమొత్తం శరీరంలో, తనదైన ఒక ప్రదేశం వున్నది. మీ ఇంట్లోనే మీకుర్చీ, మీగది అని వుంటాయికదా! అక్కడ కూర్చుంటేనే మీకు బావుంటుంది. రాజుకి సింహాసనం మీద కూర్చుంటే రాజ్యాన్నంతా పరిపాలించే స్థితి వుంటుంది. అలాగే జీవుడు కూడా ఆజ్ఞ యందు కూర్చోగలిగితే తన జీవితాన్ని పరిపాలించుకోగలడు భగవంతుని ఆజ్ఞగా. స్వస్థత చేకూరడం అంటే స్వామిత్వాన్ని పొందడం, దేనిమీద అంటే మనసు, ఇంద్రియములు, శరీరం మీద స్వామిత్వం. ఇది ఇచ్చేవాడు స్వఅస్తి. స్వస్తి తాను తానుగా వుండటం.

పరిస్థితులను బట్టి తాను ఏదో అవుతూవుంటాడు, అయినా కూడా తాను అదే అని తెలియాలి. తల్లిదండ్రులు కనబడితే కుమారుడు అవుతాడు. పిల్లలు కనబడితే తండ్రి/తల్లి అవుతాడు. బంధువులకి బంధువవుతాడు, స్నేహితులు కనిపిస్తే స్నేహితుడవుతాడు. ఇవన్నీ తాత్కాలికంగా మారడమే తప్ప, అలా వుండి పోవడం లేదు. మళ్ళీ తాను అవుతూండాలి. తానే ఇవన్నీ అవుతున్నానని తెలియాలి. 'నర్తకుని భంగి పెక్కగుమూర్తుల ఎవ్వడాడు' మనకు కూడా అన్వయించుకోవచ్చు. మనం ఎప్పటికప్పుడు అవుతూంటాం, మళ్ళీ మనంగా వుంటూ,అవుతూంటూ, మళ్ళీ మనంగా వుంటూండాలి. ఎప్పుడు అవుతూంటూంటే మనంగా వుండడం మర్చిపోతాం. మాస్టరుగారు అందుకే ఎంతో అద్భుతంగా 'Becoming and Being' అన్నారు Saturn chaptersలో There is being and There is becoming అంటారు. అంటే నేనుండడం, నేను మారుతూండడం, మళ్ళీ నేనుగా వుండడం. ముందు లేచి ప్రార్థన చేసుకొనేటప్పుడు, 'నేను, నేనైనటువంటి నేను అతడి యొక్క వ్యక్తస్వరూపాన్ని' అనేది మనకు ఖచ్చితంగా వుండాలి, అసలు అవగాహన. అక్కడ నుండి మన పేరు, మన సంబంధాలూను, దుర్బంధాలూను. ఇవన్నీ అవతలి మనిషిని బట్టి కదా! ఇవన్నీ లేకపోతే నువ్వొకడివి వున్నావు కదా! నువ్వు నువ్వుగా వుంటూ, వీటిని నిర్వర్తిస్తూ, అదయిపోగానే మళ్ళీ నువ్వుగా వుంటూండాలి. నేనుగా ఉంటుండాలి. ఎప్పుడూ నేనుగా వుంటూ, పని అయిపోగానే మళ్ళీ ఎప్పుడూ నేనుగా మిగిలి పోతూండాలి. పనికి వేషమన్నమాట. ఇలాంటివాడికే క్రమశః ఏం జరుగుటుందంటే మారుతున్నపుడు నేనుగా వున్నాను, కొంతభాగం నాలోది ఇదిగా మారుతోందని తెలుస్తుంది. మారనివాడుగా తానుండి, కొంతభాగం తన నుండి మారి ప్రవర్తిస్తుంటే, చూస్తుంటే అది అద్భుతం. అదీ అమ్మవారు ఎట్లా పనిచేస్తోందో తెలియడం. అటు కూర్చొని, ఇటు కదలేది చూడడం. నదిలో కొట్టుకుపోయేవాడికి ఏ అద్భుతం తెలియదు. తాను అందులో నిశ్చలంగా వుండి చూస్తే ప్రవాహం, ప్రవాహం మీద తేలే అద్భుతంగా గోచరిస్తుంటాయి. అందుకని మారుతున్న దాంట్లో, మారనివాడిగా తానెప్పుడూ వుండడం అనేది 'స్వస్థత'. జీవునికి స్వస్థత అప్పుడు. సమస్య రాగానే కుంగిపోడు. మంచివార్త రాగానే పొంగిపోడు. మంచివార్త మీద

ఎంతసేపు బతుకుతాం? ఎప్పుడో pass అయ్యాం. అప్పుడు నాలుగు sweets తింటాం, అటు తిరుగుతాం, ఇటు తిరుగుతాం, కాసేపు ఆనందంగా వుంటాం. అయిపోయింది. మరిప్పుడు, అప్పుడు pass అయ్యాంకదా ఇప్పుడు ఆనందంగా వున్నావా అని ఓ ఏడాది తర్వాత అడిగాం అనుకోండి అప్పుడున్న ఆ ఆనందం ఇప్పుడుంటుందా? పెళ్ళిచేసుకున్నపుడున్నంత ఆనందం ఇప్పుడుందా? ఇవన్నీ మారుతుంటే, తను ఎన్ని సంఘటనలకు అనుభూతి చెందుతున్నాడో చూస్తుంటే, శాశ్వతమైన ఆనందం వుంటుంది. అది స్వస్థతలో వున్న వాడికి వుంటుంది. అదీ మనకి భగవద్గీత 2వ అధ్యాయంలో 'స్థితప్రజ్ఞత్వం' అని ఇస్తాడు. నీవు నీ ప్రజ్ఞకి స్థిరత్వం కలిగించాలి. ఒక గుంజలాగ నువ్వు పాతుకుని వుండు, నీచుట్టూ ఎన్నయినా జరగనీ, ఎన్ని రకాలుగానైనా తిరుగుతూండు కానీ గుంజ దగ్గరకు వచ్చెయ్యి. అదే పశువును గుంజకు కట్టడం అంటే. ఒక మహాత్ముని పాదాలు ఆశ్రయించి ఒక యోగమార్గంలో ప్రవేశించాడుట అంటే, ఆయన స్థితప్రజ్ఞుడు కాబట్టి ఆయన స్థితప్రజ్ఞ అనే గుంజకి శిష్యుడు అనే పశువును బంధించడం అవుతుంది. వీడు ఎక్కడన్నా మేయని, ఎక్కడన్నా తిరగనీ ఆయనింక వదలడు. ఏదో కాస్తోకూస్తో గడ్డితింటున్నా, సాయంత్రం అయ్యేసరికి మళ్ళీ పశువు గుంజ దగ్గరకి వచ్చేసి పడుకుంటుందికదా! అట్లా గుంజకు కట్టేసుకుంటే అది కలిగించేవాడు స్వస్తిదః. ఇచ్చేవాడు. గురువు రూపంలోనూ, కాలం రూపంలోనూ, జీవిత సన్నివేశాల రూపంలోనూ, నయానభయాన ఇస్తూంటాడు. కామాన్నిస్తాడు. చాలారకాలుగా ఇస్తాడు.

కామోత్కంఠత గోపికల్, భయమునన్ కంసుడు,
ప్రేమను మీరను, భక్తిమేము

కొంతమంది భక్తి, కొంతమంది ప్రేమ, కొంతమంది కామం, కొంతమంది భయం ఇలా రకరకాలుగా మొత్తానికి తెచ్చుకుంటాడు, స్వస్థత కలిగిస్తాడు. స్వస్థత కలగడం అంటే శరీరానికి స్వస్థత అనుకోవద్దు. అదెప్పుడూ మారేది. మనస్సు, శరీరము, ఇంద్రియములు మనలో మారేదానికి సంభందించిన భాగంలో వున్నాయి. మారనివాడిగా అందులో మనం, మన వెలుగు మాత్రమే. ఇవి మారవు. ఎప్పుడూ మారిపోయి ఇంట్లో బతుకుతుంటే ఎలా వుంటుందీ? అంటే రోజూ repairs. రోజూ ఏవో ఒకటి

మారుస్తున్నారనుకోండి, ఎక్కడా కూర్చోనివ్వరు, నిల్చోనివ్వరు, ఎక్కడా తిననివ్వరు, ఎక్కడా పడుకోనివ్వరు. రైళ్ళల్లో ప్రయాణం చేసినపుడు ఏమాత్రం నిద్రపడుతుంది? అలాగ కదిలే దానిలో మనం కదలకుండా ఉందామని, settle అయిపోదామని చూస్తాం. కానీ అలా అవ్వదు. సృష్టిలోనే లేదది. కనుక ఎక్కడ కదలకుండా వుంటే వీలుంటుందో అక్కడ కూర్చో. అదీ స్వస్థత! జీవునికి స్వస్థత తప్పశరీరానికి స్వస్థత వుంటే బాగుంటుందని అనుకోవద్దు. ఒకరోజు బావుంటుంది, ఒకరోజు బాగుండదు శరీరానికి, అనారోగ్యంగా వుంటుంది. రోజూ ఏదో ఒకటి వుస్తూంటుంది. చివరికోరోజు వెళ్ళిపోతుంది కూడా. ఇది వచ్చింది. ఇక వెళ్ళిపోవడమే అని తెలిసిందనుకోండి, మనం పోతాం అనుకోము, అది పోతుందనుకుంటాం. ఇలాంటి అవగాహనలుంటే చెదరం. ఎందుకూ ఇంత తెలిసీ కూడా చెదరక వుండలేం. అందుకే మళ్ళీ గుర్తు చేసుకుంటూంటే వుండడానికి అవకాశం వున్నది. ఉండిపోతాం అనేది ఎక్కడా అణాబిళ్ళ మీద రాసి సంతకం పెట్టలేముగాని, ఎవరో అదృష్టవంతుడికి, ఆభావనలో స్థిరత్వం దొరికితే వాడికది మిగులుతుంది. ఇదంతా అయ్యేపని కాదనుకుంటే, 'యద్భావంతద్భవతి.' అవుతుంది అనే సంకల్పం చేసుకుని అలా వుండటానికి ప్రయత్నం చేస్తుంటే, అప్పుడూ 'దీర్ఘకాల నైరంతర్య సత్కార సేవితః ధృఢ భూమిః'! ఇలా ఏదైనా అభ్యాసం నిరంతరంగా, దీర్ఘకాలం సాగినపుడు అది మనయందు స్థిరత్వం చెందుతుంది. దీర్ఘకాలం సిగిరెట్లు తాగేవాడు అందులోంచి బయటకు రాలేడు. ఎందుకంటే అది వాడిలో స్థిరత్వం చెందింది. పేకాటాడేవాడూ, తాగేవాడూ, అబద్దాలాడేవాడు ఈకోవలోని వారే. అందులోంచి బయటకు రాలేరు. ఎందుకంటే దీర్ఘకాలం అదే అభ్యాసం చేయడం వలన అలా బయటకు రాలేరు. మనచుట్టూ ఎంత భావన చేస్తే అంత అవుతుంది. భావనకి అతీతంగా నువ్వున్నావు. అక్కడ నువ్వు కూర్చుంటే నీకు స్వస్థత వుంది. లేచిన తర్వాతే గదా ఈ దరిద్రాలన్నీ. ఏ సంపదయినా, దరిద్రం అయినా లేచింతర్వాతే. నిద్రలో దరిద్రం లేదు, సంపదా లేదు. 'రాజూ, పేద ఇద్దరికీ నిద్ర ఒక్కటే' అని చెప్పారు అన్నమయ్య. ఇద్దరూ లేస్తే ఇద్దరికీ ఎవరి లోకం వారికుంది. అదే లోకాలోకాపర్వములంటారు. చీమలోకం చీమకి, దోమలోకం దోమకి, బొద్దింక లోకం బొద్దింకకు, పశులోకం పశువులకి,

మనిషి లోకం మనుషులకు, దేవతల లోకం దేవతలకూ వున్నాయి. ఇన్నిలోకాలూ దాటి వుంటాడు యోగి. ఉండి, కాలాన్నిబట్టి, కర్తవ్యాన్నిబట్టి వీటన్నిటిలో ప్రవర్తిస్తుంటాడు. వాడు స్థితప్రజ్ఞుడై వుంటాడు. అట్లా స్వస్థత చేకూర్చుకోవడం అనేది నీవిస్తావు అని చెప్తున్నాడు.'స్వస్తికృత్' కలుగ చేస్తావు. ఇవ్వడం అంటే దానికి సంబంధించిన మార్గం ఏర్పరుస్తావని చెప్పడం 'కృత్'. తను చేరడానికి మార్గమే లేకపోతే, ఎలా చేరుకుంటాడు? అందుకని అరవిందులు చాలా అద్భుతంగా చెప్తారు. 'ఈ మానవజాతి భారతీయం అయిన ఋషులకి, ఎప్పటికీ కృతజ్ఞత తెల్పుతుండాలి. కారణం ఏమంటే భగవంతుడ్ని చేరే దారిని, అలా స్పష్టంగా, చక్కగా నిర్మాణంచేసి, వాటికి సంబంధించిన station లు తెలిపి వుంచారు. అదే యోగము!' అని చెప్పారు. యోగమొక్కటే మార్గం దైవాన్ని చేరడానికి. దైవాన్ని ప్రశంసించవచ్చు, కీర్తించవచ్చు, ఆరాధన చేయవచ్చు. కానీ దైవాన్ని చేరాలంటే మార్గం లో ప్రయాణం చేయాలిగా. కాశీ బాగుంటుందని, తిరుపతి అలా వుంటుందని చెప్పకుంటే ఎలా వుంటుందీ! నువ్వక్కడకు వెళ్ళగలిగితే, వెళ్ళడానికి దారి వుండాలిగా, ఆ దారి ఎవరన్నా ఏర్పర్చాలి కదా! అలా దైవాన్ని చేరడానికి రూఢియైన దారి భారతీయ ఋషులు ఏర్పరచారు. అదే యోగమార్గము, అనిచెప్తారు అరవిందులు. ఆ యోగమార్గమే మనకు ఉపనిషద్ మార్గంగా వున్నది. దాని ద్వారా ఆయన్ని చేరుకుంటూండవచ్చు. ఆ మార్గాన్ని ఋషుల ద్వారా వేసిందెవరు? ప్రేరణ ఇచ్చినదెవరు? ఆ ఋషులెవ్వరూ? ఆయనే! తన వద్ద నుండి దూరం అయిన సంతానాన్ని దగ్గరకు చేర్చుకోవడానికి తండ్రి చేస్తున్న కృషిగా 'స్వస్తికృత్'. 'స్వస్తి' ఆయనే! 'నేనున్నాను' అనే స్థితిలో వుండేది అతడే! జీవుడికి స్వస్థత చేకూరిందిటా అంటే భగవంతుడి ఒళ్ళో వున్నాడని అర్థం. అనుసంధానం చెంది వున్నాడుట. ఆయనతో కలసి వున్నాడుట అని అర్థం. ఆయన పాదాల వద్ద వున్నాడుట, ఆయన హృదయంలో వున్నాడుట, ఆయనగానే వున్నాడుట, ఆయనే ఈయనగా వున్నాడుట, అక్కడ ఎన్నిరకాలుగానైనా వుంటుంది. హనుమంతుడు పాదాల వద్ద వున్నాడుట. కొంతమంది భగవంతుని హృదయంలో వున్నారు, కొంతమంది పాదాల వద్ద వున్నారు. కొంతమందిలో ఆయనే వున్నాడు. సిద్ధుడుట అంటే సిద్ధుని రూపంలో

వున్నదీ భగవంతుడే! మహాత్ముడున్నాడుట అంటే మహాత్ముని రూపంలో పూర్ణంగా భగవంతుడే పలుకుతాడు. అందుకని భగవంతునితో మాట్లాడుకోవడానికే గురువు వద్దకు వెళ్ళాలి. ఏ గురువైనా అందులో నుండి పలికే వాడొక్కడే అని తెలిస్తే, ఎక్కువ అవగాహన, లోతులో తెలుసుకోవడం వుంటుంది. వేరనుకుంటే వేరు. స్వస్థతా నువ్వే, నువ్వే స్వస్థత చేకూర్చేవాడివి. నువ్వే స్వస్థత ఇచ్చేవాడివి, నువ్వే స్వస్థత ఆనందించేవాడివి.

235 స్వస్తిభుక్

స్వస్థతలో వుండడం వలన ఆనందం మనకుంటుంది. మనం ఆనందిస్తుంటే చూసి ఆయన ఆనందిస్తుంటాడుట. ఆయనెప్పుడూ ఆనందంలోనే వుంటాడు. అందుకని స్వస్థతను ఆనందించువాడు అని నామం. 'భుక్' అంటే అది చేయడంవల్ల ఆనందం కలుగుతుందని. బొక్కడం అనేది భుక్ నుండే వచ్చింది. ఆనందాన్ని భుక్ అంటారు. ఎప్పుడూ ఆయన స్వస్థత లోనే వుంటాడు. శ్రీకృష్ణుడికి, స్వస్థతకి ఎట్టి పరిస్థితులోనూ తేడా లేదు. ఇక పరతత్త్వానికి తేడాపడే అవకాశమే లేదు. కృష్ణతత్త్వం ఎప్పుడూ స్వస్థతలోనే వుంది. ఎక్కడైనా అలానే వుంది. యుద్ధంలోనూ అలానే వుంది, కాళీయమర్దనంలోనూ అలానే వుంది. పుట్టినపుడూ అలానే వుంది. వెళ్ళిపోయేటపుడు కూడా అలానే వుంది. వెళ్ళేటపుడు కావాలని బొటనవేలు కదుపుతూ తేలిగ్గా కొట్టించుకుంటాడు. ఎవరండీ అలా చేసేది? ఆ బాణం ఎలా వెళ్ళిందో తెలుసా? ఆ బాణం బొటనవేలులోంచి, చీలమండల్లోంచి, పిక్కలవరకూ వెళ్ళింది. మనకలా గుచ్చుకుంటే ఎలా వుంటుందనేది ఊహించుకోండి! ఎట్లా ఎక్కుతుందో కూడా ఆయనకి తెలుసు. తెలియనిది ఏమీ లేదు ఆయనకు. అదే పరిపూర్ణ ఆనందం. కృష్ణుడిలో భగవంతుని యొక్క సమస్తమైన గుణాలన్నీ చూడవచ్చు. అందుకే కృష్ణుడు పరిపూర్ణ అవతారం. అసలు అవతారాల లెక్కలో వేయరు. దశావతారాలలో కృష్ణుడు లేడు. ఇవన్నీ కలిపి, మించి కూడా ఆయనే!

೨೩೬ స్వస్తిదక్షిణః

అందరికీ పంచి ఇచ్చేది అదే! ఇంకో అర్థం దక్షిణంలో స్వస్థత వున్నదని. దక్షిణం మరి యమస్థానం అనుకుంటాం కదా! CVV గారు అటు తిరగండిరా, అంటారు. ఎందుకంటే, 'యమస్థానం నీకు యమము నిస్తుంది. నియమమునిస్తుంది. తద్వారా స్థిరత్వాన్నిస్తుంది. క్రమశిక్షణ నివ్వడం ద్వారా నువ్వు స్వస్థత చేరుకుంటూంటావు'. అందుకే భగవంతునికి 'దక్షిణామూర్తి' అని ఒక పేరు. దక్షిణముననే మన సూర్యమండలాన్ని కాపాడుతున్న హృదయానికి సంబంధించిన మండలంవున్నది. మనక్కూడా దాక్షిణ్యం అనేది, మనలో దక్షిణంగా వున్న హృదయమందున్నది. హృదయం దక్షిణం, ఆజ్ఞ తూర్పు, మూలాధారం పశ్చిమం, సహస్రారం ఉత్తరం. ఇవి మన శరీరంలోని దిక్కులు. నైఋతి మలమూత్రాదులు విసర్జించే ద్వారం, ఆగ్నేయం స్వాధిష్టానం, (మూలాధారం పైకి బొడ్డు క్రిందకి వున్న భాగం) వాయవ్యం ముక్కుపుటాలు, ఈశాన్యం ఆజ్ఞ పైన నుదురుపైన వుండే భాగం. అందుకని స్వస్థత ఎక్కడ నుండి ఇస్తాడంటే దక్షిణం నుండి ఇస్తాడని భావం. అంటే ముందు అది హృదయం నుండి అంది, అక్కడ నుండి సమస్తమునకూ అంది, ఆజ్ఞ వరకూ, సహస్రారం వరకూ వెళ్ళివచ్చి, మళ్ళీ హృదయంలో కూర్చుని స్వస్థతను అనుభవిస్తుంటాడు. ఆవిధంగా దక్షిణం నుండి స్వస్థతను అందిస్తాడు. తను చేసే హృదయగతములైన కార్యక్రమముల ద్వారా దక్షిణగా అందిస్తాడు. హృదయగతములైన కార్యక్రమములంటే ఇతరుల శ్రేయస్సును కోరి చేసేవి. హృదయముతో చేసే కార్యక్రమములుగా నిర్వచించారు. తన శ్రేయస్సు కోరిచేసే కార్యక్రమములన్నీ బొడ్డు ద్వారా చేస్తారు. ఇతరుల శ్రేయస్సు కోసం చేసే కార్యక్రమములన్నీ కూడా హృదయం. కనుక అది బాగా చేస్తుంటే, అక్కడ నుండి మనకి దాక్షిణ్యం పెరిగి స్వస్థత పెరుగుతుంది. హృదయంలో కలినంగా వున్నామనుకోండి, స్వస్థత దొరకడానికి అవకాశం వుండదు.

౨౩౭ అరౌద్రః

అరౌద్రము దారిలో పెడుతుంది, నియమిస్తుంది. కానీ అతనివరకు ఏమీ చేయదు. స్పందనలో తేడా ఉండదు, రక్తప్రసారంలో తేడా ఉండదు. కోపగించడంవల్ల ఒంట్లో ఎమీ తేడా పడదు. మామూలుగా వాడిని కోప్పడి వీడు ఏడ్చే పరిస్థితి వస్తుంది. అటువంటివి ఉండవు, ఎందుకంటే మొత్తం సృష్టి అంతా కూడా శబ్ద తరంగముల వలనే ఏర్పడుతోంది. తరంగములుగా నీవు దిగి వస్తున్నప్పటికీ నీవు, నీవుగానే ఉన్నావు. నీ యందు రుద్రత్వము లేదు. అప్పడప్పుడు కృష్ణుడు భయంకరంగా కనిపించేవాడు, బయటవాళ్ళకి. భయమేసిన వాళ్ళకి మరంతేగా, తప్ప చేసిన వాళ్ళకి భయంకరుడు. కంసుడు నిద్రపోలేదు. ఏం చేశాడని నిద్రపోలేదు? నవ్వుతూనే ఉన్నాడు. వాడిలో భయం పెరుగుతూనే ఉంది. ఏమీ ఒక్కమాట అనలేదు, ఒక లెంపకాయ ఇవ్వలేదు, ఎక్కడా పరోక్షంగా కూడా తిట్టలేదు, ఏమీ చేయలేదు. ఎందుకింత భయం? శకునికి ఎందుకు భయం? దుర్యోధనునికి ఎందుకు భయం? ధృతరాష్ట్రునికి ఎందుకు భయం? అందరికీ భయమే. ఎవరందరికీ భయం? అధర్మాన్ని ఆచరిస్తున్న వాళ్లందరికీ భయమే. ఏం చేశాడని భయం? ఏం చేయలేదు. భయం. అక్రూరుడికి భయం. అక్రూరుడు శమంతకమణిని తీసుకుపోతాడు. గట్టిగా చెప్పాలంటే దొంగతనం చేస్తాడు. కృష్ణుడు చూస్తూ ఉంటాడు. ఏం చెప్పడు. చూసి నవ్వుతాడు. ఎవరిని చూసినా నవ్వుతాడు. అక్రూరుడిని చూసి నవ్వగానే అక్రూరునికి లోపల కలుక్కుమంటూ ఉండేది. ఏంటంటే, శ్యమంతకమణి నీ దగ్గర ఉంది కదా, అన్నట్టుగా అనిపించిందిట అతడికి. ఎప్పుడు చూసినా అదే నవ్వు. ఆ నవ్వులోంచి ఎమీ ఉండదు. అతడి భావన అది. ఇక అతడు భరించలేక ఒక రోజు తెచ్చిచ్చేస్తాడు. ఎంత భయపెట్టాడు? ఈయనకి తెలుసుగానీ అనడం లేదు అంటే, మనకి భయంగా ఉండదూ? తెలియదు అనుకుని కదా మనం బోలెడు చేస్తూ ఉంటాం. మనం గురువుగారికి ఎమీ తెలియదు అనుకుని, ఏదో మనం చేస్తూ ఉంటాం. ఆయనకి తెలిసి కూడా, తెలియనట్లుగా ఉండి ఊరికే అట్లా నవ్వుతూ ఉంటాడు. కానీ చేసిన వాడికి తప్ప లోపల ఉంటుంది కాబట్టి వాడి లోపల నుండి భయం. అదే సత్యం ఎప్పుడూ చావదు అంటే

అర్థం! 'వాచః సత్యమసీమహి' అని మనకి శ్రీ సూక్తంలో వస్తుంది. దొంగకి మాత్రమే police ని చూస్తే భయం వేస్తుంది, అందరికీ భయమేయదుగా! పన్ను ఎగవేసేవాడికే tax officer ని చూస్తే భయమేస్తుంది. ఓ రైతు కి నేను income tax officer ని అని చెప్తే, అయితే ఏమిటిట అన్నట్టుగా ఉంటాడు. ఆ రైతుకి ఎరువులిచ్చేవాడు వీడికన్నా ముఖ్యమైనవాడు. ఉన్నస్థితి బట్టి కదా. ఈయనకేమో మందహాసమే! వాళ్లకందరికీ ప్రకంపనలు! కాబట్టి చచ్చే భయం. ప్రళయకాల రుద్రుని వలె కనిపిస్తూ ఉండేవాడు కొంతమందికి. కానీ ముఖం అట్లాగే ఉంటుంది. నవ్వుతూనే ఉంటుంది. అది అరౌద్రః

238 కుండలీ

కుండలీ అంతా వలయాకారంగా సృష్టి నిర్మాణం చేశాడండీ. అంటే మనం spiralic అంటాం చూడండీ, అట్లా పాము చుట్టలు లాగా, లేక శంఖం మీద ఉండే ఒరలు లాగా, అలా దిగివచ్చి దిగివచ్చి తల నుండి తోక వరకు, అనంతుడుగా, చుట్టలు చుట్టలుగా, అవ్యక్తం నుండి ఈ భూమి వరకు తాను దిగివచ్చిన మార్గం ఒకటి ఉన్నది, అదృశ్యమైన మార్గం. మనలో కూడా ఉన్నదది. వచ్చి, ఎవరెవరి స్థితులను బట్టి అక్కడ అది నివసిస్తూంటుంది. మనలో మూడున్నర చుట్లు చుట్టుకుని మూలాధారములో ఉన్నది, కుండలినీ శక్తి అంటారు. ఎందుకంటే పదార్థమైన ప్రపంచానికి బాగా ఆకర్షితులమై ఉన్నాం కాబట్టి. కొంతమందికి హృదయంలో ఉంటుంది, కొంతమందికి గొంతులో ఉంటుంది, కొంతమందికి ఆజ్ఞలో ఉంటుంది. కొంతమందికి మొత్తం పాకి ఉంటుంది. అక్కడి నుంచి ఇక్కడివరకు. ఈ విధంగా మాస్టరుగారు Cosmic Kundalini to Earth Kundalini అన్నారు. మొత్తం అంతా కూడా, అనంతుడుగా అక్కడ నుండీ ఇక్కడి వరకు దారి ఒకటి ఉన్నది. ఆ దారి నుండే మనకి దివ్యలోకాలలో నుండి భూలోకాలకీ, భూలోకాలనుండీ దివ్యలోకాలకి, సిద్ధులు వస్తూ పోతూ ఉంటారు. నారదుడు ఆ మార్గంలోనే 14 లోకాలకీ వెళ్ళటం, రావడం చేస్తూ ఉంటాడు. అది 'కుండలినీ మార్గం'. అంటే Ghat Road అన్నమాట. అట్లా, దాన్ని చుట్టూ వేసుకుంటూ వెళ్తూ చివరికి శిఖరం కెళ్తుంది కదా. ఆ విధంగా మార్గం ఏర్పరిచి ఉన్నాడు. ఆ మార్గంగా నీవు ఉన్నావు, అని చెప్పడానికి కుండలీ.

శివ చక్రి

చక్రి అంటే చక్రాన్ని ధరించినవాడు అని అర్థం. భీష్ముడి కోసం కూడా చక్రాన్ని ధరించాడు. శిశుపాలుని కోసం చక్రాన్ని ధరించాడు. చాలా తక్కువ సార్లు వాడాడు ఆయన. అది వచ్చినప్పుడల్లా కనీసం, తెలిసి ఉండాల్సింది మనుషులకి, ఆయన సాక్షాత్తు విష్ణుమూర్తి అని. కానీ మళ్ళీ మాయ కమ్ముతుంది. ఒక్కోసారి, మనకి అట్లా, అద్భుతమైన అనుభూతి, ఒక సద్గురువుతో ఉన్నా, మళ్ళీ మన మామూలు స్థితిలోకి రాగానే, ఆయన గురించి మనకి మళ్ళీ మామూలు భావనలే ఉంటాయి. ఎందుకంటే మాయ ఒకటుంది కాబట్టి. చక్రి అంటే చక్రాన్ని తిప్పేవాడు అని అర్థం. సుదర్శన చక్రం కలిగి ఉన్నవాడు అని అర్థం. సమస్తమూ కాల స్వరూపంగా స్థూల, సూక్ష్మలోకాలకి వచ్చి పోతుండే చక్రభ్రమణం చేయించేవాడు అని అర్థం. ప్రతిరోజూ ఒక చక్రం. ప్రతి నెలా ఒక చక్రం, ప్రతి సంవత్సరం ఒక చక్రం, ప్రతి యుగం ఒక చక్రం, ప్రతి మహాయుగం ఒక చక్రం, ప్రతి కల్పం, మన్వంతరం, ఒక బ్రహ్మకల్పం ఇట్లా ఎన్నైనా తిప్పుతూ మళ్ళీ వచ్చేస్తూ ఉంటుంది, బయలుదేరిన చోటికి. ఒక చక్రభ్రమణంగా ఈ సమస్తమైన సృష్టినీ నిర్వర్తిస్తున్నవాడు అని తెలియడానికే, ఆయన చేతిలో చక్రం ఉంది. అది దర్శించడం అంటే, దాన్ని సుదర్శనం అన్నారు. దాన్ని సరిగా అవగాహన చేసుకుని, ప్రతీదీ ఈ విధంగా తిరుగుతూ ఉంటుంది, ఏదీ శాశ్వతము కాదు నేను తప్ప. నేను అనే ప్రజ్ఞ ఒక్కటే శాశ్వతము, దాన్ని యొక్క వెలుగు నిశ్చలము, ఆ వెలుగు నుండి ఏర్పడుతున్నవన్నీ కూడా మార్పు చెందుతూ ఉంటాయి అనేది తెలుస్తుంది. సుదర్శన చక్రం అంబరీషుడికి ఇచ్చాడుట అంటే అర్థం అదీ. ఆ స్థితికి వెళ్ళిపోయాడు అంబరీషుడు. ఎక్కడా మార్పుల్లో జీవించక, 'భళీ భళీ అంబరీషు పాగడగ వశమే' అంటాడు. ఏం చేస్తున్నా విష్ణువే, ఇంకోటి లేదు. అంతా దాని చుట్టూ తిరుగుతున్నదే, తిరిగే దానిలో ఎందుకూ, దానిలో ఉండిపోదాం నిశ్చలంగా అని, ఉండిపోయాడు. చక్రం యొక్క అవగాహన అయ్యింది. కాలచక్రం అవగాహన అయ్యింది. సృష్టిచక్రం అవగాహన అయ్యింది. కాబట్టి సుదర్శన చక్రం ఇచ్చాడు. సుదర్శన చక్రం ఇచ్చాడు అంటే ఏదో పళ్లెం లాగా ఉంటుందనుకోవద్దు. అది ఎవరింట్లో అన్నా

పెట్టుకుంటే అవసరానికిట్లా, మనం వేస్తాం కదా, frisbee లాగా వేసేది కాదది, అది అతడిలో ఉంటుంది. అది అతడి అవగాహన, అతడు దాన్ని ఒక్కసారి ఆవాహనం చేస్తే వచ్చేస్తుంది. అంబరీషుడికి ఒక్కడికే ఇచ్చాడు. విష్ణుచక్రం ఇంకెవరికీ ఇచ్చినట్లుగా మనకి కథల్లేవు. తెలియకుండా ఉంటే ఉన్నాయేమో మనకి తెలియదు కానీ, తెలిసిన కథల్లో అంబరీషుడికి ఒక్కడికే విష్ణుచక్రం ఇచ్చాడు. అంటే ఎంతటివాడు? విష్ణు చక్రం ఇవ్వడం అంటే ఏమిటి? ఏదో ఇంట్లోకి తెచ్చుకుని godrejలో lockerలో పెట్టి తాళం వేసుకోవడానికా! ఆ ప్రజ్ఞ ఇతని యందు స్థాపితం చేశాడు, ఇతని స్థిరత్వం చేత. ఇతను కూడా పిలేస్తే వస్తుందది. అయినా సుదర్శన చక్రాన్ని కూడా నమ్మకుండా విష్ణువుని నమ్మినవాడు అంబరీషుడు! ఇది మనకసలు బొత్తిగా కొన్ని లక్షల జన్మలకి కూడా అర్థమయ్యే విషయం కాదేమో అనిపిస్తుంది. సుదర్శన చక్రం ఇచ్చి వాడుకోరా అంటే, మనం గురువుగారినే మర్చిపోతాం. సుదర్శనచక్రం అక్కర్లేదు, ఓ కోటి రూపాయలు మనకి ఇచ్చారనుకోండీ, గురువుగారు, మరి ఇక దాంతో అస్తులవీ కొనుక్కొని, వాటిని maintan చేసుకుని, వాటికోసం తంటాలు పడి, అవి అద్దెలకిచ్చి అవి రాక, అద్దెవాడు లేవక, అక్కడేదో repair వచ్చిందని, ఇక్కడ పంపు పని చేయట్లేదని, వీటి చుట్టూ తిరుగుతూ ఏమిరా అంటే, ఉండండీ సార్, అంటాం. గురువు అక్కర్లేదు అప్పుడు మనకి. ఇవన్ని ఇస్తే, ఇచ్చిన వాటి వంక చూడకుండా ఇచ్చిన వాడి వంక చూశాడాయన! మనం ఇచ్చినవి పట్టుకుని అలా బాధపడిపోతూ ఉంటాం. వైరాగ్యం గురించి బుద్దుడు ఉపన్యానం చెప్తూ, అది దానం చేయడం వల్ల వస్తుందని చెప్తాడు. మమకారం ఉంటే ఇవ్వలేం కదా! పాత చీర అయినా ఇవ్వలేం, పాత బూట్లు ఇవ్వలేం, పాత చెప్పులు ఇవ్వలేం, పాత చెంబు ఇవ్వలేం. మనబోటి వాడికి ఏమి చెప్పి ఉపయోగం? చెప్తున్నాడట బుద్ధుడు, శిష్యులందరూ కూర్చున్నారట, వింటున్నారట, అడవిలో బ్రాహ్మణుడు అట్లా నడిచి వెళ్తున్నాడు. 'ఏమిటో మహాత్ముడు ఏదో చెప్తున్నాడు విందాం' అని విన్నాడుట. వింటే తన్మయం చెందాడట. తన్మయం చెందితే, అసలు దానం ఇవ్వని బతుకు వృథా అనుకున్నాడట. ఎందుకే జన్మ, ఏమీ ఇవ్వలేనప్పుడు, అనుకుని చూశాడట, 'తన దగ్గర ఏం ఉంది ఇవ్వడానికి' అని. కింద కట్టుకున్న గుడ్డ, పైన తుడుచుకోవడానికి వేసుకున్న తుండుగడ్డ.

అంతకన్నా ఏమీ లేవు. ఒక వాచీ లేదు, ఒక ఉంగరం లేదు. కాళ్ళకి చెప్పులు లేవు, ఇవ్వడానికి ఏమీ లేవు. ఇంత చెప్పాడే ఈయన కనీసం అప్పటికప్పుడు మనం ప్రత్యక్షంగా ఇవ్వడం గురించి ఏదన్నా మొదలుపెడితే బాగుంటుంది కదా అని ఆ ఉన్న పై తుండు గుడ్డ బుద్ధునికి ఇచ్చేసి, కాళ్లదగ్గర నమస్కారం చేసుకుని, 'స్వామీ నా దగ్గర ఇదే ఉంది, మీకు సమర్పిస్తున్నానని' ఇచ్చేసి వెనక్కు తిరిగి చూడకుండా కూడా వెళ్ళిపోయాడట. బుద్ధుడికి ఆ మహాత్ముడు ఇచ్చిన దానం లోంచి చాలా ఆనందం వస్తుందిట. అది కూడా సద్బుద్ధితో ఇస్తే. ఏదో పుచ్చుకుందామని ఇస్తే కాదు. మన దగ్గర కోరికలు తట్టెడు పెట్టుకుని, వాడి దగ్గర ఏదో ఇస్తే, అది ఏడ్చినట్టుగా ఉంటుంది. ఈ బ్రాహ్మణుడికి ఏమీ అక్కర్లేదు. విన్నాడు కాబట్టి ఇచ్చేశాడు. ఇచ్చేశాడు, వెనక్కి తిరిగి చూడకుండా వెళ్ళిపోయాడు. ఆశ్చర్య పోయాడు బుద్ధుడు. వీడెవడని! ఇంతమంది శిష్యులు అక్కడే కూర్చుని ఉన్నారు గుండ్రాళ్ళల్లే. ఎవరూ ఏమీ కదలలేదు. ఎందుకంటే మళ్ళీ ఎప్పుడు ఉపన్యాసం అని అడుగుతారు వీళ్ళు అంతే! ఇప్పుడు ఈ ఉపన్యాసం అయింది, తరువాత భోజనాలు ఏమిటి? అని next, భోజనం అయిన తరువాత విశ్రాంతి ఎక్కడ? మళ్ళీ రేపు ఉపన్యాసం ఎక్కడ? ఇంతేగా! ఎన్ని విన్నా అంతేకదా! అట్లా టపక్ అని పెట్టేసి వెళ్ళిపోతుంటే, వాడికి లోపల నుండి విపరీతమైన ఆనందం వచ్చిందిట. ఎంత ఆనందం వస్తుందంటే, 'నా జన్మకి నేను కూడా ఇవ్వగలిగాను' అనుకున్నాడట. అదే ఆనందం పుట్టిస్తుందట. ఆ భావనే. ఇంత ఆనందంగా వెళ్ళిపోతుంటే ఎదురుగుండా ఆ బాటలో రాజుగారు 'బుద్ధుడు వనంలో ఉన్నాడు, ఆయన దర్శనం చేసుకుందాం' అని బోలెడు కానుకలు పట్టుకుని వస్తున్నాడు. ఈ బ్రాహ్మణుడి ఆనందం చూసి ఆశ్చర్యం వేసింది. ''ఏంటి ఇట్లా వీడు పిచ్చివాడల్లే విపరీతంగా ఆనంద పడుతున్నాడు' అని రథం ఆపి వాడిని పిలిచి 'ఏంటి విషయం?' అని అడిగాడట. 'ఏమీ లేదు నా జన్మ ధన్యం అయ్యింది, బాగా ఆనందంగా ఉన్నాను' అంటే, రాజుగారు ఎందుకు? అంటే, 'ఇవ్వాలని' ఆయన ఉపన్యాసం చెప్పాడు, ఆయనకి ఇచ్చాను, ఏమిటో విపరీతంగా లోపల నుండి ఆనందం కలుగుతోంది. ఆనందానికి అంతు లేకుండా ఉంది' అన్నాడు. ఓరి నీ, అనుకుని, 'ఏమిచ్చావ్' అనడిగితే, 'ఏమీ లేదు, ఇది ఇచ్చాను, ఇంతకన్నా ఏమీ లేదు అన్నాడు. ఉన్నదొక్కటి, రెండోదిస్తే

బాగుండదు కాబట్టి' అంటాడు. సంఘ శ్రేయస్సు గుర్తుందో ఏమో లేకపోతే అది కూడా ఇచ్చేసే వాడేమో. అప్పుడు రాజుగారు ఏం చేశారంటే రథంలో, బుద్ధుడికి, శిష్యులందరి కోసం వస్త్రాలు, అందరికీ భోజన పదార్థాలు, అందరికీ పళ్లు, ఇవన్నీ పట్టుకెళ్తున్నాడు. వీడిని చూడంగానే ఆ శిష్యుల కిచ్చే వస్త్రాల్లో ఒక పది తీసి ఇద్దామనుకుని ఆయన కిచ్చేశాడు. 'ఉంచుకోరా' అని. 'తీసుకున్నాడు'. రాజు వచ్చేశాడు, బుద్ధుడికి నమస్కరించుకున్నాడు, మాట్లాడుతుంటే ఈ బ్రాహ్మణుడు అవన్నీ మోసుకొచ్చేసి ఈయన దగ్గర పెట్టేశాడు. మనలాంటి వాళ్ళము మామూలుగా ఒకటిస్తే పది వస్తాయని ఇస్తాం. కానీ ఆ బ్రాహ్మడు మళ్ళీ పది వస్తే పది కూడా ఇచ్చేశాడండీ. ఇచ్చేసి వెనక్కి తిరిగి వెళ్ళిపోయాడంతే, ఇంక మళ్ళీ ఏం మాటా లేదూ, మంతీ లేదు, ఆయన్నేమన్నా ఓ మంత్రం అడగడం లేదు, ఓ దేవుడి గురించి నాకేం చెప్తారు, నా సంగతి ఏం చేశారు', ఇవన్నీ ఏం లేవు. వెళ్ళిపోయాడు. అంతకన్నా పదిరెట్లు ఆనందంలో వాడు వెళ్ళిపోతున్నాడు. ఈ రాజుకీ వాడ్ని చూస్తే ఆనందం వేసిందిట. వీడి దుంప తెగ, ఇంత ఆనందంగా ఉన్నాడేమిటి అని, మళ్ళీ తిరిగి వెళ్ళిపోతూ వాడిని ఆపి, నువ్వు 'ఎక్కడుంటావు? ఏమిటి? అన్నీ కనుక్కుని, వెళ్ళిపోయాడు. వెళ్ళిపోయిన తరువాత రాజభటుల్ని పంపించి రాజాస్థానానికి పిలిపించి 'నీ ఆనందం చూస్తుంటే, నాకు ఆనందంగా ఉంది, కాబట్టి నేను, ఇదిగో నీకు, ఇంత ధనరాశి ఇస్తున్నాను, ఇక నీకు జీవితంలో లేమి అనేది ఏమీ ఉండదు. హాయిగా జీవించు. కేవలం నా ఆనందం కోసం ఇస్తున్నాను సుమా' అని చెప్పాడు. తీసుకున్నాడు వెళ్ళిపోయాడు. కొన్నాళ్ళు పోయిన తరువాత వెళ్లి చూస్తే, మామూలుగానే ఉంటున్నాడు. వాడు అవన్నీ బుద్ధుడికిచ్చేశాడు. రాజుకి తెలిసి మరింత ఆనందం వేసి, 'పిచ్చివాడా! నేను నీకోసం ఇస్తున్నాను', అంటే, 'నేను చాలా ఆనందంగా ఉన్నాను నాకేమీ అక్కర్లేదు' అంటాడు. అప్పుడు ఆయన ఒక అగ్రహారం ఇస్తాడు. బ్రాహ్మణ అగ్రహారాలు. బోలెడు ఉన్నాయి మనకి ప్రతి చోటాను. ఉంచుకున్నవారంతా పాడైపోయారు. పంచి ఇచ్చినవాళ్ళకే అగ్రహారాలు పనికొస్తాయి. దాచుకున్నవాళ్లకి పనికిరావు. అగ్రహారం ఇస్తే, కొన్ని సంవత్సరాలు పోయిన తరువాత 'ఆ బ్రాహ్మణుడు అగ్రహారంలో బాగా settle అయ్యాడా లేదా కనుక్కుని రండి' అంటే 'రాజా! వాడు ఆ అగ్రహారంలో లేడు. మొత్తం

అగ్రహారం అంతా ఒక ఆశ్రమం అయిపోయింది' అని చెప్తారు. 'ఎవరున్నారు' అంటే, 'బుద్ధుడి శిష్యులు' అని చెప్తారు' 'మరి వీడు?' అంటే 'వాడు ఎక్కడా కనపడలేదు' అని అంటారు. సరే వెతికారు, వెతికారు, ఎక్కడా కనపడలేదు. మళ్ళీ బుద్ధుడు ఎక్కడో వనంలో ఉన్నాడట అంటే రాజు వెళ్తే, బుద్ధుడి పక్కనే వుంటాడీ బ్రాహ్మణుడు. 'ఏమిరా ఏం చేశావ్ అగ్రహారాన్ని' అంటే, బుద్ధుడు చెప్తాడు, 'వీడు నన్ను రక్షించాడు' అని. అదేమిటండీ అంటే 'నా శిష్యుల బారి నుండి రక్షించాడు. వాళ్ళకి అగ్రహారం దొరకగానే settle అయిపోయారు. వీడికి అగ్రహారం వద్దు, ఏం వద్దు, ఆ ఒక్క గుడ్డే చాలు వాడికి, ఇంకేం అక్కర్లేదుట. అందుకని నాతో ఉన్నాడు. అసలైన శిష్యుడు దొరికాడు. మిగతా వాళ్లందరినీ వదిలించుకొన్నాను, మహోపకారం చేశాడు. వీడికేం ఇచ్చినా ఉపయోగం ఏం లేదు. ఇంకొకరికి ఇస్తాడు. ఇంకొకడికి ఇద్దాం అనే ఉద్దేశం నీలో ఉంటే, వీడికి ఇస్తూ ఉండు, వీడు ఇస్తూ ఉంటాడు' అంటాడు. అంటే ద్రవ్యయజ్ఞం చేయడం ద్వారా, జ్ఞానయజ్ఞంలోకి ఉద్ధరింపబడతాడు ఆ బ్రాహ్మణుడు. అందుకని ద్రవ్యయజ్ఞం అని చెప్తారు. అంటే ఏమన్నా చేయండి, బుద్ధుడే కావాలి తప్ప, బుద్ధుడు చెప్పిన శాసనమే తప్ప, ఊరికే ఆ ఇచ్చిన వాటితో తృప్తిపడే వ్యవహారం కాదు. అటువంటివాడు అంబలీషుడు. అందుకని సుదర్శన చక్రం ఇస్తే, సుదర్శన చక్రం గురించి ముచ్చటపడిపోకుండా విష్ణువులోనే ఉన్నాడు. సుదర్శన చక్రం ఉన్నదనే విషయం కూడా మర్చిపోయిన స్థితిలో ఉన్నాడు. అటువంటి వాళ్ళు చక్రాన్ని సంపాదించుకోగలరు. నువ్వు తప్ప ఇంకోటేమీ లేదనుకునేవాడు, ఎటువంటి ప్రలోభాలకీ లొంగనటువంటివాళ్ళకి మాత్రమే, చక్ర దర్శనం, చక్ర అనుగ్రహం! ఈయనకేమీ అక్కర్లేదు కాబట్టి ఈయన దగ్గర ఎప్పుడూ ఉంటుంది. పరతత్త్వం ప్రకారం చెప్పుకోవాలంటే, సృష్టి చక్రం అంతా కూడా ఆయన లోనే వుంటుంది.

౨౪౦ విక్రమీ

విశిష్టమైన క్రమము చేత సమస్తాన్నీ వ్యాపించిన వాడు. మీరు కూడా జీవితంలో ఒక క్రమశిక్షణ ఏర్పరచుకుని దాని ప్రకారమే జీవించడం అనేది, దీర్ఘకాలం, అంటే, 30 ఏళ్ళు అనుకోండి. అది ఒక Saturn cycle అని చెప్తారు. చేస్తే, చాలా వ్యాప్తి వస్తుంది జీవ చైతన్యానికి. ఈ మొత్తం సృష్టిని అంతా ఒక క్రమంగా నిర్వర్తిస్తూ దాని నుండి తన మొత్తం సృష్టి అంతా కూడా తానే వ్యాపించి ఉన్నాడు. అదీ 'విక్రమః' అనే నామానికి అర్థం. విక్రమః అంటే విశిష్టమైన క్రమము కలవాడు. విక్రమత్వం అంటే సమస్తాన్నీ జయించినవాడు. భక్తులు, అటువంటి క్రమాన్ని అవలంబించడం చేత తమ పరిసరాలన్నీ జయించి ఉంటారు వాళ్ళు. జయిద్దాం అని పోట్లాడితే జయించడం కాదు. వశిష్ఠుడి జయం అట్లా ఉంటుంది. సత్త్వగుణ సంపన్నుల జయం అంతా అటువంటిదే. ప్రహ్లాదుడి జయం అటువంటిది. శుకుడి జయం అటువంటిది. ఏది జయం అంటే క్రమమైన జీవితము, ధర్మబద్ధమైన జీవితము, అనుస్యూతము నిర్వర్తించుకుంటూ ఉండడం. Bore కొడుతోంది అనుకోకుండా. 30 ఏళ్ళు కనీసం నిర్వర్తించి చూడండి. ఎంత వ్యాపనం వస్తుందో చూడండి. ఎందుకంటే క్రమమైన జీవితంలో నుండి శక్తి పుడుతుంది. There is power in arrangement of objects అని, మనకి వ్యాపన శక్తి ఎక్కడ నుండి వస్తుందయ్యా అంటే, క్రమబద్ధమైన నడకలో నుండి వస్తుంది. Jupiter లేక బృహస్పతి వ్యాపనానికి ప్రతీక. వ్యాపనశక్తిగా ఉండేవాడు బృహస్పతి. ఆయన పెరగాలంటే మనలో సమస్తమైన విషయములకీ ఒక క్రమం ఉండాలి. ఆ క్రమాన్నిచ్చేవాడు శని! క్రమం తప్పిన వాడిని శని బాధ పెట్టడంలో ఉద్దేశ్యం ఏంటయ్యా అంటే, క్రమంలోకి వస్తావని. లేకపోతే క్రమంలోకి రాము కదా! అందుకని మొదటి గురువు శనే. తరువాత గురువు బృహస్పతి. ఆ తర్వాత గురువు శుక్రుడు. రహస్య విద్య! ఇట్లా అందుతారు. అందుకని ఈ 'విక్రమత్వం' ఏమిటయ్యా అంటే, నీయందున్న క్రమము చేత, నీవు సమస్తాన్ని జయించి ఉన్నావు. అందులో రహస్యం మనం అందుకోవలసింది సాధకులుగా ఏమిటంటే మనం కూడా అటువంటి క్రమాన్ని అనుసరించినట్లయితే మనం కూడా అలా జయిస్తాం.

దాన్నే 7th ray అన్నారు జ్వాలాకూలుడు. 7th ray is of magic అన్నారు. Magical results వస్తాయన్నారు Surprising Expansions వస్తాయి మనిషిలో అని చెప్పారు. దీనికి కావసిసినదంతా శ్రద్ధ, సబూరి. అందుకే ఆ రెంటినీ శంఖు, చక్రాల్లా పెట్టుకున్నారు షిర్డి సాయిబాబా. తన దగ్గరకి వచ్చేవారికి శంఖు చక్రాలు పనిచేయడం అంటే 'శ్రద్ధ ఉండాలి, ఓపిక ఉండాలి'. సబూరి అంటే ఓపిక. క్షమ, ఓర్పు కలిగి, శ్రద్ధతో ఒక క్రమాన్ని అనుసరించి అనుస్యూతం అట్లా జీవిస్తూ ఉంటే, నీలో వ్యాపక శక్తి అనేది పుట్టక తప్పదు. వ్యాపన చెందడం తప్పదు. అట్లాగే మహాత్ములు భూమి అంతా కూడా వ్యాపన చెందుతారు. రమణ మహర్షి, రామకృష్ణ పరమహంస, అరవింద యోగీంద్రులు, మాస్టర్ CVV, మాస్టరు గారు, సత్య సాయిబాబా, ఉన్నారు కదా తారాకాణాలు. మరి వీళ్ళందరూ భూగోళమంతా పాకుతున్నారు కదా! ఎందువల్ల పాకుతున్నారు అంటే, వారి దినచర్యలో అట్లా ఉంటుంది. ఏ క్రమమూ తప్పరు, అతిక్రమించరు. అతిక్రమించడం, క్రమాన్ని తప్పడమే. విక్రమత్వం అందులోంచి వస్తుంది. ఊరికే బలం పెంచుకోవడం, ఆయుధాలు పెట్టుకోవడం వల్ల రాదు విక్రమత్వం. ధర్మరాజుకి ఏ ఆయుధాలు ఉన్నాయి, అర్జునుడికి, భీముడికి ఉన్నన్ని కూడా లేవు. ఏదో అంతంత మాత్రంగానే బాణాలు వేయగలడు పాపం. కానీ క్రమం ఉన్నది మనిషిలో. అదీ విక్రమత్వంలో ఒక రహస్యం. మనకి కూడా అది జరగాలంటే, క్రమాన్ని పరిపాలించడమే! మాస్టరు CVV గారు ప్రత్యేకించి నొక్కి వక్కాణించేది అదే. Saturanian Training అన్నారు ఆయన. 'అది రుచి కలిగిన నాడేరా నీకు దారి, లేకపోతే దారి లేదు. నువ్వు ఎక్కడకు వెళ్ళినా మొదట వచ్చేది నేనే నీదగ్గరకి. దీన్ని అందుకో. శరీర శ్రమ, మానసిక శ్రమ అనుకోకుండా వచ్చిన పనులన్నీ చేస్తూ ఉండు' అన్నారు. సక్కుబాయి, మీరాబాయి ఎంత శ్రమ పడ్డారండీ! ఊరికే అట్లా మనం హాయిగా ఇడ్లీ, సాంబారు తిని, కట్టు పొంగలి తింటే నిద్ర వస్తే పడుకుని, అలా వుండదు, మార్గం. గురుపూజలలో కట్టు పొంగలి పెడితే మరి వెంటనే నిద్ర వచ్చేస్తుంది మనకి. క్రమం పెంచుకుంటే విక్రమత్వం వస్తుంది. విశిష్టమైన క్రమం వస్తుంది, అందులోంచి వ్యాపనం వస్తుంది, అందులోంచి నువ్వు జయిస్తూ ఉంటావు, నువ్వు జయించాలి అనే సంకల్పం లేకుండా. సమస్తం నీకు లోబడిపోతూ ఉంటుంది. మనుషులొచ్చి

లోబడిపోతూ ఉంటారు. ఇప్పుడు చూడండీ భీమలి ఎట్లా పరుగెడుతున్నాం! ఎందుకు పరిగెడుతున్నాం, అయనేమన్నా 'నువ్వు రా, నువ్వు రాకపోతే నాకు తోచదు' అని అడుగుతారా! ఏ గురువు అడుగుతున్నారు, 'నా దగ్గరకి నువ్వు రాకపోతే నాకు తోచదని?' ఎందుకు అట్లా పరుగెడుతున్నాం? ఎందుకు లోబడుతున్నాం? అందువల్ల లోబడుతున్నాం, అంటే జయించినట్లేనా ఆయన మనల్ని? జయించాడా లేదా, పుట్టపర్తి అయినా, అటు షిర్డీ అయినా, ఇంకొక దక్షిణేశ్వర్ అయినా, మరొక ఆరోవిల్లి అయినా, వీళ్ళంతా, మనమీద ఏమన్నా యుద్ధం చేసి, జయించారా! మనకి ఉపన్యాసాలు చెప్పి జయించారా? మనకేదో కుండలినీ శక్తి ప్రచోదనం చేసి జయించారా? ఏమీ లేదు, ఏమిటో అట్లా పోతూ ఉంటాం కదా. విక్రమత్వం అంటే అది. అలా బెల్లం చుట్టూ ఈగల్లాగా తిరుగుతాం.

౨౪౧ ఊర్జితశాసనః

అలా తిరుగుతున్నాం అనుకోండి వాళ్ళ చుట్టూ, వాళ్ళు ఏదో ఒక్క మాట చెప్తారుట —— Oneword. ఒక సామెత ఉంది —— 'గురువాజ్ఞ, తక్షణ కర్తవ్యం'. రేపు అనుకోబోక, సాయంత్రం అనుకోబోక, మంచిరోజు చూసి మొదలుపెడదాం అనుకోబోక, తత్ క్షణం, ఆ క్షణంలో మొదలుపెట్టాలిట. శాసనంట! మనకేమిటో ఎన్నో సార్లు చెప్తాడు పాపం. చెవిటి వాళ్ళం కదా, గుడ్డివాళ్ళం. అందుకని చెప్తాడు. పదేళ్ళు పోయిన తర్వాత మళ్ళీ అడిగితే ఇదివరకు నీకు చెప్పిందే, నువ్వు చేయనిది అని అదే చెప్తాడు. ప్రతి సద్గురువు ఒక శిష్యుడు బాగుపడడానికి వాడికి ఏదో ఒకటి చెప్పకుండా వెళ్ళడు. వాడు అది చేస్తుండాలి. అంతే. అందులోంచే వాడికి ముక్తి. బట్టలుతకమని చెప్తాడు కొంతమందికి, కట్టెలు కొట్టమని చెప్పేవాడు కొంతమందికి, సమిధలు ఏరుకుని రా అని చెప్పేవాడు కొంతమందికి, ఇంట్లో వంట చేయమని చెప్పేవాడు కొంతమందికి, పూజచేయమని ఇంకొకరికి చెప్పేవాడు. పూజ చేయమని వాడికి చెప్పాడు, నన్ను కట్టెలు కొట్టమన్నాడుని అనుకుంటే పోయాడే. ఈ పూజ చేసేవాడు మనల్ని పూజచేయమన్నారని ఉబ్బాడు అంటే పోయాడే. ఏమీలేదు! అది శాసనం.

'ఊర్జిత శాసనం' నోట్లోంచి మాట వస్తే, అది శాసనమే! అదీ రహస్యం. గురుశిష్యుల మధ్య, శిష్యుడు బాగుపడాలంటే వాడికి సంబంధించినది ఏదో ఒకటి వాడికి చెప్తాడు. అది తప్ప ఇంక నువ్వు లక్ష మంచి పనులు అనుకుని చేసినా ఏమీ కాదు నీకు. అంతకన్నా బావుంటుందని చేయకూడదు ఇంకొకటి. నీకు ఏది బావుంటుందో నీకన్నా ఆయనకు ఎక్కువ తెలుసు. అది ఆయన చెప్పాడు. చెప్పింది, తక్షణం అంటే ఆ క్షణం నుండి దాన్ని నిర్వర్తించడమనేది మొదలు పెట్టాలి. కృష్ణుడు అలాంటి శాసనాలు చాలా మందికిచ్చాడు. నిర్వర్తించినవారు ఉద్ధరింపబడ్డారు. మర్చిపోయినవాళ్ళు ఏడ్చారు. వాడెవడో సవాలు చేస్తున్నాడు, అటు తోలు గుర్రాలు. అటు గుర్రాలు తోలితే ఇటు వీడు ఏమైపోతాడూ అని అడిగాడు. ఫర్వాలేదన్నాడు. Almost ఆ రోజు ధర్మరాజు దొరికిపోవాల్సివచ్చింది. ద్రోణుడికి కొంత ధర్మం ఉన్నది కాబట్టి ధర్మరాజుని పట్టుకోలేదు కానీ. సూర్యుడు అస్తమిస్తున్నాడని పట్టుకోలేదుట, లేకపోతే ఆ రోజు ధర్మరాజుని హాయిగా పట్టుకుని వెళ్ళిపోయేవాడు.. మర్నాడు కూడా మళ్ళీ అదే పని, చెప్పినా. Suggestive గా ఉంటుంది తప్ప, శాసనంగా ఉండదు. అదీ తమాషా. గురువు చెప్పేది శాసనం అయినప్పటికీ కూడా, చెప్పడం చాలా మర్యాద ఇచ్చి ఒక సూచనగా చెప్తారు. It is a hint. It is not an order. He does not give order. అందుకని మనకి అస్సలు బొత్తిగా ఎక్కదు. 'నోర్మూయ్, నేను చెప్పినట్లు చెయ్యి' అనడు. 'ఇట్లా చేసుకుంటే బావుంటుందేమో' అంటాడు. అంతే. నోటి నుండి ఏది వస్తే అది శాసనం, అంతే! అటువంటివాడు దైవం. దైవం నోటి నుండీ ఏది వస్తే అదే శాసనం. దైవానుభూతి పొంది, దైవంలోనే జీవించేవాడి నోటి నుండి ఏది వస్తే అదే జరుగుతున్నప్పుడు, ఇంక దైవం విషయంలో చెప్పేదేముంది. అందుకని అంత దైవంలో ఉండేవాళ్ళ మాట తూలరు! దైవత్వం బాగా ఉన్నవాళ్ళు ఏమన్నా అంటే అయిపోతూ ఉంటుంది. అంటే త్రికరణ శుద్ధి ఎక్కడ ఉంటుందో, అక్కడ వాక్ శుద్ధి ఉంటుంది. దాని ప్రకారం అయిపోతుంది. అటువంటి వాక్ శుద్ధి ఎక్కడ ఉన్నదో, అక్కడల్లా కూడా ఊర్జితశాసనుడిగా భగవంతుడున్నాడనుకోవచ్చు. అది ఒకటి. అదే విధంగా ఒక మహాత్ముని నమ్మి, వారి దగ్గర ఒక సలహా పుచ్చుకుందామని వెళ్ళినపుడు, చెప్పింది శాసనంగా తీసుకోవాలి. చెప్పిన తర్వాత మనం మళ్ళీ

మంచి చెడ్డలు చూసుకుంటే--! వెళ్ళే ముందే ఆలోచించుకోవాలి. వెళ్ళింతర్వాత ఏం చెప్తే అది. ఆ నిర్ణయం నువ్వు తీసుకుని వెళ్ళాలి. అలా కాకపోతే ఏమవుతుందంటే ఒక శాసనం పరిపాలించని వారికి మళ్ళీ ఇంకొక శాసనం దొరకదు. అంటే సూచన దొరకదు.

242 శబ్దాతిగః

శబ్దాన్ని అతిక్రమించి ఉన్నవాడు, శబ్దానికన్నా ముందు నుండి ఉన్నవాడు. తను శబ్దంగా దిగి వచ్చినవాడు. శబ్దంతో ఉన్నవాడు.

943 శబ్దసహః

శబ్దం ముందు నుండి ఉన్నవాడు, శబ్దాన్ని పుట్టించి, శబ్దంలో మళ్ళీ తానున్నాడు. అందుకే భగవంతుని యొక్క పరిపూర్ణ అనుభూతి ఓంకారానుభూతే అని చెప్తారు. ఇంక ఆ పైన ఆయనలో కలవడమే. ఆ ఒక్క తొడుగు తీస్తే ఇంక ఆయన, మనమూ ఒకటే. నిజరూప దర్శనం అయిపోయేసరికి మనం, తన్మయం అయిపోతాం. అంటే తత్ మయం, ఇంక మన మనస్సు ఉండదు. అదీ ఇదీ కలిసిపోతుంది. మళ్ళీ అక్కడ ఒక తొడుగు వేసుకుంటే 'శబ్దం' ఓంకారంగా ఉంటాడు. మనం ఉంటాం. ఓంకారాన్ని వింటూ ఉండచ్చు. ఇంకొక తొడుగు వెలుగు. ఇంక అక్కడ నుండి రంగులు. అక్కడ నుండి అందాలు. ఇంక అక్కడ నుండి అట్లా, ఎన్ని తొడుగులైనా వస్తాయి. శబ్దాతిగః, శబ్దసహః. అతిక్రమించి ఉన్నా మళ్ళీ అందులో కూడా ఉంటాడాండీ! అదీ గొప్ప విషయం. పై మెట్టు ఎక్కితే కింద మెట్టు మీద కూడా ఉంటాడుట. పై మెట్టు మీద నుండి కింద మెట్టు వరకూ వ్యాపించి ఉంటాడు. శబ్దాతిగః అన్నాడు కదా అని, ఇంక శబ్దం అక్కర్లేదని అనుకోవద్దు, శబ్దంలో కూడా ఉన్నాడు.

944 శిశిరః

శిశిరః అంటే చల్లదనం. ఆకురాలు కాలం. శిశిర ఋతువు. Cold! చలి, చావు. ఎప్పుడు cold గా ఉంటుంది. చల్లబడిపోయిందమ్మా, అంటాం కదా. ఇవన్నీ మరి శిశిర ఋతువే! సంవత్సరానికి శిశిర ఋతువు అదే. అన్నీ తీసేస్తాడు.

945 శర్వరీకరః

రాత్రి కలిగిస్తాడట. అదీ శర్వరీకరః అంటే. రాత్రి అంటే చీకటి. అంటే ఏమీ లేకపోవడం. అట్లా పట్టుకొచ్చారు చివరికి. Discouragingగా! ఈ శ్లోకం, అరౌద్ర దగ్గర నుండి పుట్టుకొచ్చి, శిశిరః, శర్వరీకరః. ఏది అంతం? ఏది చల్లబడుతుందీ? ఏది పుట్టిందో, ఏది వేడెక్కిందో అది చల్లబడుతుంది. పుట్టి, వేడెక్కి, పెరిగింది, కరగడం, చల్లబడటం. వెలుగులోకి రావడం, చీకట్లోకి వెళ్ళిపోవడం. ఎవరదీ? మనం కాదు. మన చుట్టూ ఉన్నది. గొప్ప విషయం మన వాఙ్మయంలో ఏంటంటే, అదొకటి పట్టుకొచ్చి మధ్య మధ్యలో ఇస్తూ ఉంటారు. ఇదొకటి ఉంది సుమా, మర్చిపోకండని. 'నిధనపతయే నమః, నిధనపతాంతికాయ నమః'. నిధనం అంటే మళ్ళీ అంతా తిరోధానం చెందడం. అందుకని శిశిరః అంటే శిశిర ఋతువు లేక ఆకురాలు కాలము లేక జీవుల చుట్టూ ఏర్పడినవన్నీ పోతాయి. మళ్ళీ వసంత ఋతువు వస్తుంది కదా! శిశిర ఋతువు వస్తుందనే బాధ అవసరం లేదు. ప్రతి శిశిర ఋతువు ఒక వాగ్దానం చేస్తుంది, వసంత ఋతువుని పట్టుకు వస్తానని, ప్రతి వసంత ఋతువు వాగ్దానం చేస్తుంది, మళ్ళీ శిశిరఋతువు వస్తుందని. ఇదే మొత్తం సావిత్రి కథ అంతా. 'సాయంత్రం అయిపోయింది, చీకటి వస్తోందని భయపడకు' అని చెప్తుందట సూర్యుడు వెళ్ళిపోయిన తరువాత ఉన్న వెలుగు. 'రేప్పొద్దున మళ్ళీ పట్టుకు వస్తాను కదా! నీకు ఏం భయం లేదు' అని చెప్తుందట. పొద్దున సూర్యుడి కన్నా ముందు వచ్చి, వస్తున్నాడని ముందు వార్త తెస్తుంది. సూర్యుడు వెళ్ళిపోయేంతవరకు ఉండి, మనకు చెప్పి, 'రేపు మళ్ళీ సూర్యుడ్ని పట్టుకు వస్తాను, బాధపడకు' అని చెప్తుందిట. మళ్ళీ పొద్దున్నే ముందు తను వచ్చి 'వస్తున్నాడు సూర్యుడు అని ముందు వార్త ఇస్తుందిట'. అదీ సావిత్రి కథ. అదీ అరవిందుని సావిత్రి. సత్యవంతుడు చావడు. చచ్చినట్టు'గా ఉంటాడు. నట్టే. ఎందుకంటే జీవుడు పోయేదేమీ లేదు. నువ్వు అక్షరుడవు, అని చెప్పాడు కదా. నువ్వు నాలోంచి వచ్చావు కాబట్టి నా అంతటి వాడివి. నువ్వు పోయేదేంలేదు. నీ చుట్టూ ఉండేవి పోతాయి. నా చుట్టూ ఉండేవే పోతూంటాయి. నువ్వెంత! బోడి, అన్నట్లుగా. ఆయన చుట్టూ ఉన్నవే మొత్తం అంతా ఒకసారి తీసేస్తుంటాడు. మళ్ళీ వస్తూ ఉంటుంది, పోతూ

ఉంటుంది. ఇక్కడ కూడా అంతే. కాల చక్రంలో అట్లా వస్తూ ఉంటుంది. సంవత్సరంలో శిశిరం ఎటువంటిదో, ప్రతి రోజు రాత్రి అటువంటిది అని చెప్తున్నారు. రాత్రి కాగానే మన కార్యక్రమాలు మూసేస్తాం కదా! అవి ఎక్కడకి పోయినాయి? ఉన్నాయి కదా! మనకి లేవు. అలాగే సృష్టి మూసేస్తే సూక్ష్మంగా ఆయనయందు ఉంటాయి. మళ్ళీ తెల్లారేసరికి అన్నీ వస్తూ ఉంటాయి. ఎప్పుడూ వచ్చేదల్లా పోయేదే అని తెలిసి ఉండాలి. అని చెప్తూ ఉంటారు. 'It has came to pass' అంటుంది Bible. చాలా అద్భుతమైన వాక్యం. అది మన తెలుగులోనూ, సంస్కృతంలోనూ తప్పకుండా ఉండే ఉండాలి నాకు తెలియదు. ఒక event వస్తుంటే, it has come to pass, అని అప్పుడే, చెప్పేస్తారు. అంటే ఏమిటి? ఇది వస్తోంది గానీ వెళ్ళి పోతుంది అని చెప్పడం. It has come to stay కాదు. It has come to pass. Everything that comes has to pass. Every thing that is born is to die. Everything that grows has to come down. చావనగానే మనకి ఒకరకమైన భయం! వెళ్ళడం రావడం కోసమే, రావడం వెళ్ళడం కోసమే. చక్రం. కుండలీ చక్రి! అందుకని ఇక్కడ చివరలో మళ్ళీ తీసుకొచ్చి, శిశిర ఋతువులో ఆకులు రాలిపోయి చెట్లు అన్నీ బోడిగా ఉంటే, కొత్త చిగురు వస్తుందని భావన చేసినవాడు అదృష్టవంతుడు. 'అయ్యో! ఆకులు రాలిపోతున్నాయే' అని ఏడ్చేవాడు అజ్ఞాని. పశ్చిమాన సూర్యుడు అస్తమిస్తుంటే, 'మళ్ళీ రేప్పొద్దున సూర్యుడు వస్తాడు' అని తెలిసినవాడు జ్ఞాని. అస్తమిస్తున్నాడు ఇంక అయిపోయింది అనుకునేవాడు అజ్ఞాని. అస్తమించే కాలంలో దీపం పెట్టిన వారు ఋషులు. చీకట్లో దీపం మనకిచ్చిన సమస్తమైన జ్ఞానం! కలియుగం, నాలుగు యుగాలలో కటిక చీకటి. మనం చీకటిలో ఎలా బతకాలి? అందుకని చీకటిలో చిరుదీపంగా మనకి ఈ జ్ఞానాన్ని,ఈ యోగమార్గాన్ని, మళ్ళీ దాన్నే వీళ్ళందరి రూపంలో వచ్చి అందించాడు. అందుకని రాత్రి కలిగించాడు. శిశిర ఋతువు కలిగించాడు. రాత్రి నువ్వే! శిశిర ఋతువూ నువ్వే! మళ్ళీ పగలు నువ్వే! 'అహసంవత్సరో వ్యాలః'. ఇట్లా మనకి చాలా సార్లు, ఇటూ అటు, ఇటూ అటు, తిప్పుతాడు. ఏమీలేదు, ఇన్ని సార్లు తిరిగేసరికి మన mind లో 'ఇదంతా చక్ర భ్రమణమే, మనం ఉంటాము, ఈ చక్రం మాత్రం మారుతూ ఉంటుంది. మనకి వచ్చిపోయేవి,

మన చుట్టూ ఉండేవీ అన్నీ మారుతూ ఉంటాయి. జీవులుగా మనం శాశ్వతులంగా ఆయన యొక్క వ్యక్త స్వరూపులుగా ఎప్పుడూ ఉంటాం' అని తెలిసి ఉండడానికి పనికి వస్తూ ఉంటాయి.

946 అక్రూరః

అక్రూరః అంటే క్రూరత్వము తన స్వభావము నందు ఏమాత్రము లేనివాడు అని అర్థం.

పేశలః అంటే చాలామృదు స్వభావుడు అని అర్థం. ఎంత మృదువో చెప్పలేనంత మృదుత్వం.

దక్షః మృదుత్వం కలిగివున్నప్పటికీ కూడా చాలా దక్షత్వము కలిగినవాడు. సమర్థత కలిగినవాడు. సన్నివేశములయందు సమయస్ఫూర్తితో ప్రవర్తించేవాడు.

దక్షిణః అంటే తన్ను తాను దక్షిణగా సమర్పణ చేసుకునేవాడు. యజ్ఞములు నిర్వర్తించిన తర్వాత దక్షిణ అని చెప్పి సమర్పణ చేస్తారు. ఆ దక్షిణ రూపములో ఉండేది భగవంతుడే, అందుకునేవాడు అలా అందుకోవలసి వుంటుంది.

క్షమిణాంవరః క్షమిణాం అంటే క్షమంచగలిగిన, భరించగలిగిన క్షమ. వారు ఎట్టి పరిస్థితిలో కూడా విసుగు, విరామము చెందని వారు, ఎంత కష్టాన్నైనా, ఎంత బరువునైన భరించేవారు. వారందరిలో శ్రేష్ఠుడు.

విద్వత్తమః విద్వత్ అంటే జ్ఞానము. అది కలిగిన వారందరిలో కూడా ఉత్తముడు.

వీతభయః భయాన్ని తీసేవాడు.

పుణ్యశ్రవణకీర్తనః ఆయన గురించి కీర్తన చేసినా, చేస్తున్న కీర్తనలను విన్నా మనలో వున్న పుణ్యములు పెంచేవాడు.

ఈవిధముగా ఈ శ్లోకానికి అవగాహన వున్నది.

అక్రూరః

అక్రూరః అని ఉద్దేశించడంలో మొత్తం సృష్టికార్యం లో క్రూరత్వం ఏమీ లేదు, మన అవగాహనలో తేడా తప్పా, ఏది ఎప్పుడు ఏవిధంగా నిర్వర్తింపబడాలో అప్పుడు ఆ విధంగా నిర్వర్తింపబడుతూంటుంది. ఈ లోపల మనం కొన్ని మమకారాలు పెంచుకోవడంవల్ల కొన్ని కొన్ని సన్నివేశాలలో క్రూరంగా వుంది అనిపిస్తూ వుంటుంది. ఏదీ క్రూరంగా వుండదు. అగ్ని ప్రమాదం జరగడానికి కారణాలు తెలిస్తే క్రూరం అనిపించదు, అలాగే వరదలు రావడనికి కారణాలు వుంటాయి. అది తెలిస్తే అగ్ని ప్రమాదం వాళ్ళకే ఎందుకు జరిగింది? వాళ్ళకే వరదలు ఎందుకు వచ్చాయి? వాళ్ళింట్లోనే దొంగలు ఎందుకు పడ్డారు? వాళ్ళనే ఎందుకు కొట్టారు? వీటన్నిటికి సమగ్రమైన అవగాహన మనకి వున్నట్లయితే 'సృష్టిలో జరిగేదంతా కూడా కార్యకారణ సంబంధంగా జరుగుతూ వుంటుంది' అని తెలుస్తుంది. క్రూరత్వం మనం ఒక సన్నివేశం దాటి/కొంత మరచిపోయి కొంత భాగం చూస్తూ వుంటే కనిపిస్తుంది. కొంత మంది కొంత మందిని నిష్కారణంగా హింసిస్తున్నట్లుగా కనిపిస్తుంది. ఆ హింస వాడికే ఎందుకు జరిగింది? అని ఆలోచిస్తే వెనక కథ/ flashback చూస్తే తెలుస్తుంది. కాని మనకి flashback ఉండదు కదా! ఉండకపోవడం వల్ల 'మనయందు చాలా నిర్దయ చూపిస్తున్నాడు, కఠినంగా ఉన్నాడు, మనయందు చాలా క్రూరంగా ఉన్నాడు' అనే భావములు మనకి విధి గురించి ఏర్పడుతూంటాయి. 'క్రూరవిధి' అంటూంటాం, అలాంటిదేం లేదు. పూర్ణమైన అవగాహన, పూర్వాపరములు తెలియాలి, తెలిస్తే మనకి సమస్తం అర్థం అవుతుంది, అలా కాకపోతె తెలియదు. అందుకని మొత్తం సృష్టి కార్యంలో కొంత భాగం లయం అవుతూంటుంది, కొంత భాగం జీవులు చేసిన కర్మలననుసరించి, కొంత మందిని కొంత మంది హింసిస్తూంటారు. ఆ హింస వలన వాళ్ళకి కర్మ క్షాళనం జరుగుతుంది, చేసినవాడికి మళ్ళీ మొదలవుతుంది. ఇలా అంతా ఒక కథగా నడిచిపోతూంటుంది. అసలు

సృష్టిలోనే క్రూరత్వం లేదు, యుద్ధం క్రూరం అని మనం ఈ రోజుల్లో అవగాహన తక్కువై అనుకుంటున్నాం కానీ, ధర్మం నిలబెట్టడం కోసం అవసరమైతే యుద్ధం కూడా చేయాలనేది ఆర్ష/ఆర్య సంస్కృతి. యుద్ధం చెయ్యము అంటే, అధర్మంగా ప్రవర్తించే వాళ్ళు యుద్ధం లేదు కదా అని యింకా అధర్మంగా ప్రవర్తిస్తారు, అధర్మాన్ని అరికట్టాలంటే ఏదో ఒక రకమైన శాసనం జరగాలి. అందుకని శ్రీకృష్ణుడు ఒక్కడే మనమెరిగిన పరమగురువులనండి/మహాత్ములనండి/ దివ్యపురుషులనండి యుద్ధము అనే ఒక అవకాశాన్ని తోసిరాజనకుండా వున్నవాడు. 'యుద్ధం లేకుండానే అంతా మనం చక్కబెట్టవచ్చూ, భగవంతుడే దిగి వచ్చినపుడు చెడ్డవాళ్ళను కూడా మంచి వాళ్ళుగా మార్చవచ్చు కదా! ఎందుకు యుద్ధం చేయించడం' అని కృష్ణుని మీద విదురుడు లాంటి పండితులు, సాత్వికులు చేసిన ఆరోపణలు చాలా ఉన్నాయి. ఏ జీవుడు ఏ విధంగా అయితే పరిణామం చెందుతాడో వాడికి ఆ విధంగా జరిపించడం వల్లనే వాడు పరిణామం చెందుతాడు. కొంత మందిని శిక్షిస్తేనే మార్గంలోకి వస్తారు. కొంత మందికి బాగా వివరించి మంచి చెడ్డలు చెప్తే మార్గంలోకి వస్తారు. కొంత మందికి కేవలం చెప్పడంవల్ల మార్గంలోకి వస్తారు కొంత మందికి చెప్పనే అక్కరలేదు. శిక్షిస్తేకాని మార్గంలోకి రాని వాడికి మనం ఎంత నయాన చెప్పినా వీలుపడదు, భయాన చెప్పినా వీలుపడదు, ఆ ప్రయత్నాలన్నీ అయిన తరువాతే శిక్ష అనేది ఉంటుంది. ఆ శిక్షణ కూడా ఆ జీవిని ఉద్ధరించుకోవడం కోసమే! తర్వాత నామంలో మనకి 'ఉత్తారణో' అని వస్తుంది. జీవుడ్ని ఉద్ధరించుకోవాలంటే' ఒక సంతానాన్ని తల్లితండ్రులు ఎన్ని రకాలుగా ఉపాయాలు ఆలోచించి, వాళ్ళని పరిరక్షించి, వృద్ధి పొందించాలని ప్రయత్నం చేస్తారో, అటువంటిది. ఒక ఉపాధ్యాయుడు ఒక విద్యార్థిని పైకి తీసుకుని రావడానికి bench ఎక్కించొచ్చు, ఒంటి కాలు మీద నిలబెట్టచ్చు, గుంజీలు తీయమనవచ్చు, లేకపోతే 10 సార్లు కాపీ రాయమనవచ్చు. అవన్నీ దేన్ని ఉద్దేశించి చేయబడ్డాయి? వాడి యొక్క బాగోగుల్ని నిర్దేశించి చేయబడ్డాయి కాబట్టి సృష్టిలో క్రూరత్వము లేదు. ఒక పులి ఒక లేడిని తింటుంటే మనకి చాలా క్రూరంగా కనిపిస్తుంది కదా! కాని సృష్టి అవగాహనలో పులి లేడిని తినడం వున్నది. ఒకదానికొకటి ఒకదానికొకటి

ఆవిధంగా హద్దులు పెట్టుకుంటూ వచ్చారు. సృష్టిలో ఎలుకకు పిల్లి, పిల్లికి కుక్క, కుక్కకి పులి, దానికి మనిషి, మనిషికి వాడు చేసే పనులు, తద్వారా వాడికి మితి. ఇలా ప్రతివాళ్ళకి మితి ఏర్పరుస్తాడు. ఒక దానికొకటి అలా ఆహారంగా ఏర్పడి ఉంటుంది. సమస్తమూ ఒకే తత్త్వం, ఇన్నిరకాలుగా దిగి వచ్చి కిందది పైదానికి ఆహారంగా అవుతూవస్తోంది. వృక్షాలు భూమి నుండి ఆహారంగా తీసుకుంటే, వృక్షాన్ని ఆహారంగా మనుషులు, పశువులు తీసుకుంటే, పశువునాహారంగా మనుషులు తీసుకుంటే, మనుషుల్ని ఆహారంగా భావాలు తీసుకుంటూ ఉంటాయి. ఆలోచనలు మనిషిని తినేస్తాయి కదా! కాబట్టి మనోలోకంలో వచ్చేభావములు మనిషిని ఆహారంగా వాడుకుంటూ ఉంటాయి. 'ఏంటండీ అలా అయిపోయారూ?' అంటే 'problems గురూ' అంటారు. అంటే ఆలోచనలు మనం తినేదంతా హరిస్తూంటాయి. ఇట్లా ఒకదాన్నొకటి తినడం అనేది ఒకటి ఉన్నది. సమగ్రమైన అవగాహన వస్తే భగవత్ తత్త్వంలో అక్రూరత్వమే తప్ప క్రూరత్వం లేదు. 'ఇంత యుద్ధం చేసినా, జీవుల యొక్క ఉద్ధారణ కోసం నీవు చేయించిన యుద్ధం తప్పా, ఇందులో నీ క్రూరత్వం ఏమీలేదు' అని కృష్ణుని పరంగా భీష్ముడు చెప్తున్నాడు. సాధకులకి మొట్టమొదట ఇచ్చే ప్రాథమికమైన కొన్ని ఆచరణీయమైన సూత్రములలో అహింస ఒకటి. భావం చేతగాని, మాట చేతగాని, చేత చేతగాని ఎవ్వర్నీ మనం హింసించ కుండా వుండడం. హింసించిన వాడు హింసించబడతాడు. అందులో ఏమీ సందేహం లేదు. మనం క్షోభ పడుతున్నాంట అంటే మనం ఎవర్నో క్షోభ పెట్టాం అన్నమాట. మనకి తెలీదు మనం మర్చిపోయాం. ఇప్పుడు కూడా పెడుతూ ఉండి ఉండవచ్చు కానీ, మనకి పెడుతున్నాం అని కూడా తెలీదు. ఇట్లా ఎవర్నో ఒకర్ని క్షోభ పెడుతూంటే ఆ క్షోభ అలా అలా తిరిగి కాలచక్రంలో మన దగ్గరికి వస్తుంది. అందుకని మనకొచ్చినదాన్ని అంగీకరించి, అందులో మన కర్తవ్యాన్ని నిర్వర్తించి, అనుభవించడం అనేది ధీరుల లక్షణం. భీష్ముడు ఎందుకు పడాలి ఇంత బాధ? చాలా క్షోభ పడ్డాడు కదా, చివరికి బాణాల మంచం మీద పడుకున్నాడు కదా! అటువంటి వాడే కృష్ణుడు ని 'నువ్వు అక్రూరుడవు' అని అంటున్నాడు. సాధకునికి complaint nature అనేదే ఉండకూడదు. Whatever that has been given to you by time,

through time అందుకొని అందులో నీ కర్తవ్యం నిర్వర్తించి మిగతాది భరించు, ఏం వచ్చినా సరే! అందులో ఉంది ధీరత్వం, అంతే కానీ పారిపోడంలో గాని, ఏడవడంలో గానీ, బెంబేలు పడిపోడంలో గాని, ఉన్నమతి పోగొట్టుకోడంలో గాని లేదు. మనలో ఎంత అక్రూరత్వం పెరిగితే మనకి అంత నిర్భీతి వస్తుంది. ఎవరికీ హానిచేయనివాడ్ని ఎవరూ, ఏదీ హానిచేయరు. పులి హాని చేయని సిద్ధులు ఉన్నారు. త్రాచుపాములు హానిచేయని సిద్ధులు ఉన్నారు. చంపేద్దామని వచ్చి, కత్తిపట్టుకుని మెడమీద కొడదామనుకున్నవారు కూడా ఆ క్షణంలో కత్తి దింపేసిన సిద్ధులు ఉన్నారు, వాళ్ళందరూ మనకి ideals. ఏదో కొండ ఎత్తునో, తాటిచెట్టు ఎత్తునో మనం ideal పెట్టుకుని, మనకి చేతనైన లీతిలో మొదట పక్కవాడ్ని తిట్టకుండా, ఎదుటవాడ్ని తిట్టకుండా, మెలిక పెట్టి వాడ్ని ఏడ్పించకుండా ఉండాలి. మన దగ్గర బోలెడు మెలిక మాటలు ఉంటాయి, ఆ మాట మాట్లాడితే అవతల వారు బాధ పడుతూంటారు, కానీ అవి మనం అన్నట్లుండదు, పోలీసు దెబ్బల్లాగ ఉంటాయి మరి. ఇటువంటివన్నీ మాట్లాడుతూంటాం కదా! మాటల్లోనూ, చేతల్లోను, భావాల్లోను అక్రూరత్వం అనేది దేవుని కళ్యాణగుణంగా తీసుకుని సాధకులు దాన్ని నిర్వర్తించడానికి ప్రయత్నం చేయాలి. ప్రయత్నం చేయకపోతే నీవు చేసే క్రూర కార్యములు వల్ల అవి తిరిగి తిరిగి నీదగ్గరకే వస్తాయి. ఏ ఒక్కటీ మన దగ్గరకి రాకుండా ఉండదు, మనం చేసింది ఏదైనా మన దగ్గరకు రావలసిందే. వచ్చినప్పుడు భరించేయాలి, భరించేది కూడా వాడి స్ఫూర్తిలో ఉన్నట్లైతే భరించడము సులభం అవుతుంది, వాడి స్ఫూర్తిలో లేకపోతే బరువెక్కిపోతుంది, వాడి స్ఫూర్తిలో ఉంటే బరువుగా ఉన్నది కూడా తేలికై పోతుంది. అందుకని ఎంత సమస్యలో ఉంటే అంత దైవంలో ఉండడం అనేది ఒక అదృష్టం. దైవంలో ఉండకపోతే సమస్య పెద్దదిగా ఉంటుంది, దైవంలో ఉంటే సమస్య చిన్నదవుతూంటుంది. పెద్దగీతను చిన్నగీతను చేసినట్లు అవుతుంది. భాగవతంలో చెప్తాడు 'మహాసముద్రం లాంటి ఈ జీవితాన్ని చిన్నపిల్లవాడు పిల్లకాలువ దాటినట్లుగా, ఇంటిముందు మురుగు కాలువ దాటినట్లు దాటేయవచ్చు', ఎప్పుడూ ? అంటే వాడిలో జీవిస్తేనే. కాబట్టి వాడ్ని పెంచుకుంటూ ఉంటే ఇవి/ సమస్యలు తగ్గుతూ ఉంటాయి. నారదుడు చెప్పాడు 'అసలు అన్నిటికన్నా తలమానికమైన సాధన వాడి భావంలో

ఉండడానికి ప్రయత్నించడమే' 'భావములోన, బాహ్యము నందున గోవింద గోవింద అనవే మనసా' అని అన్నమయ్య అన్నట్లుగా నారదుడు కూడా భక్తిసూత్రాల్లో అదే చెప్తాడు. అసలు భావంలో వాడ్ని స్థిర పరచుకుంటూ ఉంటే, ఈ కల్యాణ గుణాలు ఒక్కొక్కటి నీవద్దకు చేరుతాయి. అక్రూరత్వం ఒక కల్యాణ గుణం. క్రూరత్వం లేనివాడి చుట్టూ మనుషులు చేరుతారట. క్రూరత్వం ఉన్నవాళ్ళ చుట్టూ ఉన్నవాళ్ళు కూడా పారిపోతారట. 'అహింస చక్కగా సాధించిన వారి చుట్టునూ జీవులు చేరుదురు' అని పతంజలి మహర్షి అంటాడు. 'ఏమిటో ఉన్నవాళ్ళు కూడా మన దగ్గర నుండి పారిపోతున్నారుట' అంటే, మన వద్ద అక్రూరత్వం లేదుట, అది మనం నేర్చుకోవాలి అని మనకి తెలుస్తుంది. అలా నీవు అక్రూరుడవవుతూ ఉండడం అనేది సాధకుడి చిహ్నం. సిద్ధులలో అక్రూరత్వం చూడవచ్చు, వారు పూర్ణమైన సత్త్వగుణంలో ఉండడం చేత ఏ మాత్రం క్రూరత్వం చూపించరు. ఆ కోవకి చెందిన వాళ్ళే శుకుడు, వ్యాసుడు, పరాశరుడు, వశిష్ఠుడు, నారదుడు ఈ భాగవత పరంపర అంతా ఆ మార్గంలో ఉన్నవాళ్ళు. అందుకనే ఇక్కడ అహింస గురించి బాగా చెప్పబడుతున్నది. భగవంతుని కల్యాణ గుణాల్లో అహింస ఒక్కటి. ఒక కళ్యాణ గుణాన్ని పరిపూర్ణంగా మనం సాధన చేయడంలో నిమగ్నమై ఉంటే అది ఇంకోటి ఇంకోటి ఇంకోటి---- అలా కళ్యాణ గుణాలు సంఘాలల్లే వచ్చి మన వద్దకి చేరడం మొదలు పెడ్తాయి. అసలు ఏదీ మొదలు పెట్టకపోతేనే తంటా. ఒకటి మొదలు పెడ్తే అందులోంచి ఇంకోటి, అందులోంచి ఇంకోటి ఆ విధంగా అందుతూ వస్తూంటాయి. అందుకని దానికి చాలా ప్రయత్నించి సాధన చేసుకోవాలి.

౨౪౭ పేశలః

పేశలః అంటే మృదుస్వభావము. భగవంతుడు చాలా మృదుస్వభావుడని చెప్పడంలో పెద్దవింత ఏమీ లేదు. ఇలా మనందరి మధ్య చోటుగా కూడా ఉన్నాడు. ముట్టుకుంటే ఏమీ ఉన్నట్టు కూడా తోచనంత మృదువుగా ఉన్నాడు. ఇంత మృదువుగాను ఉండగలడూ, అవసరాన్ని బట్టి ఇంకో రకంగా కూడా ఉండగలడు, ఇది భగవంతునిలో ఒక కళ్యాణగుణం. సిద్ధులలో కూడా మృదుస్వభావం అనేది కల్యాణగుణంగా మెలుగుతూ ఉంటుంది. శ్రీకృష్ణుని మృదుత్వం అనుభూతి చెందిన వాళ్ళు చాలామంది ఉన్నారు. ఎంత సౌకుమారం అంటే రాముని గురించి, కృష్ణుని గురించి తెలిపేటప్పుడు ఈ మృదుత్వం గురించి చెప్తారు. అంత మృదువుగా మనకి మిగతా అవతారాలు గోచరించవు, ఇవి పూర్ణావతారాలుగా వచ్చినవి కాబట్టి వారి దగ్గర ఆ మృదుత్వం ఉంటుంది, ఈ మృదుత్వం ఎందులోంచి వచ్చింది? సత్త్వగుణంలో నుండి వ్యక్తం అవుతూ ఉంటుంది. రజోగుణంలో వ్యక్తం అయ్యే మృదుత్వం రాగ ద్వేషాలను బట్టి ఉంటుంది. తమోగుణము లోంచి వ్యక్తం అయ్యే మృదుత్వం మమకారాలబట్టి, మోహాలబట్టి ఉంటుంది. అందరియందు సహజంగా సాధు స్వభావం కలిగి ప్రవర్తించే వారుగా సిద్ధులు గోచరిస్తారు. వారందరి రూపాలలో ఉండేది భగవత్ తత్త్వమే! మనలో కూడ దాన్ని పెంచుకుంటే హృదయం బాగా వికాసం చెందుతుంది. అది ఈ నామానికి అవగాహనగా మనకి కనిపిస్తుంది. అన్నం బాగా మెత్తగా ఉడికితే పేశం, పేశం అయ్యింది అంటాం. ఈ పేశం అనే తెలుగు పదం ఆ పేశలః అనే సంస్కృత పదంలోంచి వచ్చినదే. ఎంత మెత్తదనం అంటే లోదృష్టి ఉన్నవాడికి భగవంతుని యొక్క మెత్తదనం, కరుణ, ప్రేమ, అనురాగము అత్యద్భుతంగా ఉంటాయని గోచరిస్తుంది. కృష్ణుని మృదుత్వం ఆ విధంగా అనుభవించిన వారు ఆ సమయంలో చాలా మంది ఉన్నారు. ముట్టుకుంటే కందిపోతాడేమో అన్నంత మృదుత్వం, శరీరం దగ్గర నుండి తత్త్వం వరకు అంతా వ్యాపించినది. ఇది భగవంతుని కల్యాణ గుణాలలో ఒకటి.

948 దక్షః

మృదువుగా ఉన్నాడుట, హింసలు పెట్టడుట అన్నంత మాత్రాన సమర్ధత లేదుట అనుకోరాదు. చాల మంది సమర్ధత లేక మృదువుగా ఉండేవాళ్ళు ఉంటారు. సమర్ధత లేక అహింస అవలింబించిన వాళ్ళుంటారు. ఇక్కడ సమర్ధత ఉండి అవలంభించడం. అదీ గొప్పదనం! భగవద్భక్తుడు అసమర్ధుడు కాదు చాలా సమర్ధుడు కానీ సమర్ధతను నమ్ముకుని బతకడు. దైవము యొక్క అస్థిత్వాన్ని నమ్ముకుని బతకడమే తప్ప, తన చుట్టూ ఏర్పడిన సమర్ధతలు తనవిగా భావింపక, ఆ దైవము యొక్క వైభవముగా భావించి తాను మాత్రము దైవము నందు ఉంటాడు. అందుకని బయట ప్రపంచానికి మిగతావాళ్ళు ఆనినంత ఆనరు. ఎందుకంటె బయట ప్రపంచం గుర్తించేది రజస్సు ఎక్కువ. రజస్సులో చూపించేటి సమర్ధత ఎక్కువ గుర్తిస్తారు, సత్త్వంలో ఉండే సమర్ధతని సన్నివేశాల్లో మాత్రమే గుర్తిస్తారు. మనం దీన్ని ధర్మరాజు సమర్ధతని, భీమార్జునుల సమర్ధతతో పోల్చిచూస్తే తెలుస్తుంది. కష్టమైన సన్నివేశాల్లో కూడా చెదరక నిర్వర్తించవలసిన విషయాన్ని నిర్వర్తించడం అనే దక్షత దైవీతత్త్వం కలిగినవాళ్ళకే ఉంటుంది, దైవీగుణం పొందిన వాళ్ళకే ఉంటుంది. దైవము కూడా అంతే! అందుకని రజోగుణ ప్రేరితులైన ఎంతోమంది రాజుల మధ్య శ్రీకృష్ణుడు ఎవ్వరికీ ఆనలేదు. మనం కూడా ఏం చూస్తాం? మహాత్ములని మనం ఎట్లా గుర్తిస్తాం? బాగా ఎక్కువగా TVలలో కనబడి, ఎక్కువగా ఆడంబరం చేసి, ఎక్కువగా వేషం ధరించి విపరీతంగా ప్రచారం జరుగుతూ ఉంటే, ఈయన చాల పెద్ద గురువుగారని గుర్తిస్తాం, పాపం ఇంకొకాయన ఉంటాడు ఏమీలేకుండా, పాపం ఈయన--- ఏమిటో? అంటే ఏదో మన దయకు ఆయన పాత్రుడైనట్లుగా! కానీ అసలు సన్నివేశం వచ్చినప్పుడు మిగిలేది ఈ రెండో ఆయనే! మొదటి ఆయన కాదు. అందుకని రజోగుణ ప్రేరితమైన దక్షత అత్యంత క్లిష్టమైన సన్నివేశాలలో ఉండదు. ఇది అటువంటి సన్నివేశాల్లో కూడా ఉంటుంది. బలరాముడు చాలా బ్రహ్మాండంగా కనిపించేవాడుట. కృష్ణుడి కన్నా పచ్చగా ఉంటాడు, పొడుగ్గా ఉంటాడు, బలంగా ఉంటాడు. నదిని సరాసరి ఎక్కడ పొలాలున్నాయో అక్కడకి నాగలితో

తీసుకొచ్చే డట, యమునని పాలాల వైపుకి రావాలని ఇలా పీకితే వచ్చేసిందిట! ఇటువంటివన్నీ ఉన్నాయి, రజోగుణం కదా! అందుకనే దుర్యోధనుడుకి నచ్చుతాడు. ఎందుకంటే దుర్యోధనుడు కూడా అదే. రజోగుణం ఉండేవాళ్ళకి రజోగుణం గురువులే నచ్చుతారు, తమోగుణం ఉండేవాళ్ళకి తమోగుణం గురువులు నచ్చుతారు, 'ఏం చేయనక్కర్లేదు అట్లా తిని పడుకుంటే చాలు అని చెప్పుతారు' అట్లా తిని పడుకుంటే అదే యోగం అనే స్థితి వుంటుంది. ఊరికే ఒళ్ళు విరుచుకుని ప్రపంచానికంతా ఏదో చెప్పకపోతే, ప్రపంచం ఏమైపోతుందో అని తాపత్రయ పడే రజోగుణం వాళ్ళు ఉంటారు. రెండూ లేకుండా ప్రశాంతత తమయందుండి, వచ్చినవాళ్ళకి అందించి, వాళ్ళలో ఉండే రజోగుణ ప్రవృత్తిని కూడా శమింపచేసే వాళ్ళుఉంటారు. సన్నివేశంలో వీరే ఎక్కువ పనికివస్తారు. మిగతా వాళ్ళిద్దరూ బెంబేలు పడిపోతారు. మొత్తం భారతయుద్ధంలో బెంబేలు పడకుండా ఉన్నవాళ్ళు ఎవరు అని మనం చూస్తే కృష్ణుడు, ధర్మరాజు! అంతే! మిగతా వాళ్ళంతా ఒకరోజు అలా ఆకాశంలో కనిపిస్తే మర్నాడు గోతిలో కనిపిస్తారు, ఇలా ఉంటుంది, అది దక్షత కాదు. దక్షత అంటే తన యందు తానుండుటచేత, భగవత్ శక్తి తన నుండి పనిచేస్తూ ఉండడంచేత, జరగవలసింది ఖచ్చితంగా జరిపిస్తూ, బయటకి తాను జరిపిస్తున్నానని కూడా తెలియకుండా ఉండేవాడు దక్షుడు కదా! ఎంత దక్షత అంటే సమస్తాన్ని ఇతడే తిప్పుతున్నాడు కాని ఇతడే తిప్పుతున్నట్లు తెలియదు. ఇంకో చోట చూస్తుంటారు. అక్కడెక్కడో అర్జునుడి దగ్గర చూస్తారు, భీముడి దగ్గర చూస్తారు, ధర్మరాజు దగ్గర చూస్తారు, దుష్టద్యుమ్నుడి దగ్గర చూస్తారు లేకపోతే కర్ణుడి దగ్గర చూస్తుంటారు. ద్రోణుడ్ని చూస్తారు, భీష్ముడ్ని చూస్తారు, అశ్వత్థామని చూస్తారు. కానీ ఈయన ఆనడు. ఎవరికీ ఆనకుండా ఉంటాడు. ఎవరికి ఆనడూ? రజోగుణము, తమోగుణము ఉండే వాళ్ళకు సత్వగుణ సంపన్నుడు ఆనడు. వీళ్ళకి వీళ్ళలాగే డంబాచారంగాళ్ళు ఆనుతూ ఉంటారు. అందుకే వీళ్ళు చేసే ప్రార్థనలు కూడా అటువంటి తత్త్వానికి సంబంధించినవే అయి ఉంటాయి. రుద్రం చేస్తూంటారు, శివుడు వేరు రుద్రుడు వేరు, వీడిలో రౌద్రం పెరిగిపోతూ ఉంటుంది. అలాగే చండి, కాళి ఇట్లా ఉంటాయి, ఏం చేస్తూంటే అవి వస్తూంటాయి. సత్త్వగుణంలో ఉండే వాడు అసలు ఏమీ

చేస్తున్నట్లు ఉండడు, పూజ కూడా చేస్తున్నట్లు కనిపించడు, బిగించుకుని ధ్యానాలు చేస్తున్నట్లు కూడా కనిపించడు. మొహం మీద బొట్టు కూడా పెట్టు కోక పోవచ్చు. ఉన్మత్త వేషధారి గావచ్చు. దత్తాత్రేయమార్గంలో పూర్ణతత్త్వంలో ఉండేవాడు బయటకి ఏమీ కనబడండి! Nil, None, Naught levels లాగ అన్నమాట. ఏమాత్రం కనిపించేట్లుగా ఉన్నా కూడా అది disqualification! మరి వాడి దక్షత చూస్తే అత్యద్భుతం. బలరాముడు యుద్ధం వచ్చేప్పటికి 'యుద్ధం ఎందుకు, హాయిగా పుణ్యక్షేత్రాలు దర్శనం చేసుకుందాం' అని వెళ్ళిపోయాడు. కృష్ణుడు అక్కడే ఉన్నాడు. దక్షత వహించాడు. తను చేయనన్నాడు కాని అంతా తనే చేశాడు, అది దక్షత. దక్షతకి పరాకాష్ట ఏంటంటే He is the doer but He is not known to be the doer. మనం అది చేశాం ఇది చేశాం అని, ఇంకోటి చేశామని అంత విర్రవీగుతూ ఉంటాం. మనలో వాడుండి ఆ సంకల్పాలు కలిగించబట్టి కదా చేస్తూంటాం. కాబట్టి చేస్తున్నవాడు వాడా, మనమా? వాడే మనలాగ చేస్తూ ఉంటే మనం చేస్తున్నామని మనం అనుకుంటూంటే కూడా 'నీవు కాదురా నేనే' అని చెప్పడే ఎన్నాళ్ళు పోయినా, నువ్వు తెలుసుకోవాలి తప్పా. ఏదో దేవుడి దయ, కరుణ అండీ అనో, అంతా గురువు గారి అనుగ్రహమండీ అనో ఊరికే పైపైకి అంటూంటాం, కానీ అంతా మనమే. మనకి మంచి Promotion వస్తే ఎవడు వచ్చాడు, ఎవడు దండ వేశాడు, ఎవడు వేయలేదు ఇటువంటివన్ని గుర్తు ఉంటాయి. సన్మానం చేస్తుంటే మనవాళ్ళంతా వచ్చారా, ఎంత మంది రాలేదు, రాని వాళ్ళ ఎందుకు రాలేదు ఇలాంటివన్నీ చూసుకుంటాం, ఇదంతా రజోగుణమే. దక్షుడెట్లా ఉంటాడంటే అసలు ఇతరులకి దొరకడు కేవలం సత్త్వగుణంలో వుండే వారికి మాత్రమే దొరుకుతాడు. అందుకనే ప్రపంచం లో సద్గురువులని గుర్తించడం అంత సులభం కాదు. ఎందుకు సులభం కాదు అంటే నీలో డంబాచారం ఉంటే కనపడడు, ఇప్పుడు అసలు నీకవసరం లేదన్నమాట. అందుకూ వాడు కనబడడు. కనబడినా నీకు వాడ్ని చూస్తే ఏమీ అనిపించదు. శుద్ధసత్త్వం దగ్గరకి ఒక రజోగుణ ప్రవృత్తి కలవాడు వెళ్తే 'ఏమిటో చాలా చెప్తారు ఏముందండి అక్కడ' అంటారు, ఏమి వుండనిది నీకూ! స్మశానంలో ఏం ఉంటుంది? శివుడు ఉంటాడు, కదా! స్మశానంలో ఏమీలేనట్లుగా ఎలా

ఉంటుందో అట్లాగే రజోగుణ ప్రవృత్తికి, తమోగుణ ప్రవృత్తికి సత్త్వగుణ సంబంధమైన దైవీతత్త్వం బొత్తిగా ఆనదు. ఆనక పోగా విర్రవీగినట్లు ఉంటుంది. సత్త్వగుణ సంపన్నుడు ఒకడి గుర్తింపు కావాలని కూడా అనుకోడు. హనుమంతుని కన్నా దక్షత్వం ఎవరికి ఉన్నది? ఆయనేం చేశాడు? 'మనదేం లేదు అంతా రామునిదే' అని చెప్పేశాడు. 'అంతా నీదే' అంటే 'నాదేంలేదు అంతా రామునిదే' అన్నాడు. 'నీవు శివాంశలోంచి పుట్టుకొచ్చావ్' అంటే, 'అయ్యుండవచ్చు అయినా అంతా రాముడిదే' అన్నాడు. ఆయన గూర్చి ఆయనకి అసలు గుర్తులేకుండా ఉన్నాడు. ఎంత అద్భుతమైన పనులు చేశాడూ! రామ కార్యాలు ఎవరూ చేయనంత చేశాడు, కాని చేసింది గుర్తులేదు అతనికి. ఎందుకు గుర్తులేదు? మతిమరుపా? చేసింది గుర్తు ఉంటే దేవుడిలో ఎలా ఉన్నట్లు? తన గురించి ప్రస్తుతంలో కూర్చున్నా దేవుడిలో లేనట్లే, తన గురించి అయిపోయింది గుర్తున్నా దేవునిలో లేనట్లే, తన గురించి ముందు రావలసింది గుర్తున్నా దేవునిలో లేనట్లే. హనుమంతుడు అలా ఎప్పుడూ అలా ఆయనలో ఉండడం వల్ల తన గురించి ఎప్పుడూ గుర్తుండక పోవడం అనేది ఒక అద్భుతమైన స్థితి. భక్తుల్లో కూడా చాలా తక్కువ మందిలో ఆ స్థితి మనకు కనిపిస్తుంది. ఇది భాగవతులకు మాత్రమే ఆ స్థితి. వాళ్ళు ఉండరు, వాళ్ళు ఆయనలో కలసి ఉంటారు. వాళ్ళు దక్షత అంటే భగవంతుడి దక్షతే వాళ్ళదక్షత. ధర్మరాజు అలా కనబడకుండా ఉన్నాడు. అందరూ పడిపోతే ఆయన లేస్తాడు. నలుగురు తమ్ములు మా వశం కాదు అన్న సందర్భంలో ఆయన నిలబడతాడు. వాళ్ళందరు ఏదో చేస్తుంటే వాళ్ళతోనే సరిపోతుంటే మనం ఎందుకు దిగాలి? అన్నట్లుగా, ఉంటాడు. చాలామటుకు భీమార్జునులు నకులసహదేవులే పనికానిస్తున్నారు. వాళ్ళ వశం కాని సన్నివేశాలు మూడు వచ్చాయి. యక్ష ప్రశ్నలు, నహుష ప్రశ్నలు, మహాప్రస్థానము. ఈ మూడింట్లో మిగిలింది ఈయనే! వాళ్ళెవ్వరూ మిగల్లేదు. మూడోసారి ఇక తిరిగి కూడా రాలేదు. రెండుసార్లు ఈయనే వాళ్ళ ప్రాణములు కోరి తెప్పించుకుంటాడు. మూడోసారి అంటే అందరూ పడిపోయినా మిగిలి ఉండేది ఏది? పరతత్త్వము! మొత్తం సృష్టి అంతా కూడా వెళ్ళిపోయింది, ఏం మిగిలింది? అమ్మవారు కూడా అయ్యవారిలోకి వెళ్ళిపోయింది, కాలం అందులోకి

వెళ్ళిపోయింది. ప్రకృతి, కాలము, శక్తి కూడా అదృశ్యమైపోతే మిగిలింది ఏమిటి? అదే కదా! అదే వీటన్నిటికి ఆధారం కదా! అది లేకపోతే వీళ్ళెవ్వరూ లేరు కదా! కాని దాని చుట్టు ఇన్ని అల్లినప్పుడు అది ఉన్నట్లే తెలీదే! అదీ దక్షత! నడిపిస్తాడు, నడిపిస్తున్నట్లుగా కనబడడు. అదీ దక్షతలో పరాకాష్ట. ఇంత భారత యుద్ధం చేసిన తర్వాత పేరు వచ్చింది అర్జునుడికి, భీముడికి, ధర్మరాజుకి కదా! పేర్ల కోసం ప్రాకులాడే స్థితి ఎప్పుడో దాటిపోయిన వారు వాళ్ళు. ఇక కృష్ణుడికి తన గురించి అనే point ఉండదు. అసలు కృష్ణుడేమిటి కృష్ణుని భక్తులకే లేదు. కృష్ణభక్తుడ్ని నేను అని అనుకుంటే ఇక తన గురించి గుర్తుండకూడదు. ఎందుకంటే తనుంటే కృష్ణుడు ఉండడు, కృష్ణుడుంటే తనుండడు. నువ్వా, నేనా? నాలాగ నాలో నువ్వుండి నేనుగా నువ్వుంటావా? లేకపోతే నేను నువ్వుగా ఉంటావా? అంటే కృష్ణుడి దక్షత్వం కావాలనుకుంటే leave it to Him. 'నాకు వదిలెయ్యరా నేను చూసుకుంటాను' అన్నాడు కదా! మనం వదలకుండా పట్టుకుని చూస్తుంటాం, అది వదిలేస్తే తప్ప నేను చూడనంటాడు. నువ్వు పట్టుకుంటే నామీద నీకు పూర్తిగా నమ్మకం లేదు కదా! అది కష్టమైన విషయం కానీ అది ఏ మనస్సుకు సులభమవుతుందో వాడు చాలా అదృష్టవంతుడు. ధర్మరాజు అలా వదిలేశాడు, ఎంత వదిలేశాడంటే శకుని పాచికలు మోసం చేసి వేసినా సరే మళ్ళా ఆడతావా అంటే, 'ఊ కానీ ఏదైనా కాని' అన్నాడు, ఎందుకంటే తీసుకెళ్ళి అక్కడ పెట్టేశాడు. అదే 'సర్వ ధర్మాన్ పరిత్యజ్య' అంటే. అలా సంసిద్ధత లేనివారికి వీలు పడదనిపిస్తుంది, సంసిద్ధత ఉన్నవాళ్ళు అలా చూపిస్తారు. అందుకని ఆయన 'ఆ చివరి పట్టుకూడా నీవు వదిలేస్తే తప్పా నేను రక్షించకోలేను, నువ్వు పట్టుకుంటే ఏమవుతుందంటే నీవు పట్టుకున్నది నేను చెయ్యడానికి అడ్డొస్తుంది' అంటాడు. కృష్ణుడిలో ఉన్నామనుకోండి కుటుంబం ఎట్లా గుర్తుంటుంది? కృష్ణుడిలో ఉన్నామనుకోండి సమస్యలు ఎలా గుర్తుంటాయి? సమస్యలు గుర్తొచ్చాయనుకోండి కృష్ణుడిలో లేము కదా! సమస్య వస్తే నా సలహా, దాన్ని అక్కడపెట్టి కృష్ణుడిలోకి వెళ్ళిపోవడం ఒక పద్ధతి, లేకపోతే సమస్యనే కృష్ణుడిగా భావించడం ఒక పద్ధతి. అది చాలా సులువైన మార్గం, భక్తిమార్గం. తానెంతసేపూ అతడిగా ఉంటే, అతడు తనని మన నుండి నిర్వర్తిస్తుంటే, ఇన్ని అనంతకోటి సృష్టులనే నిర్వర్తిస్తున్నవాడు

మన విషయం ఎంతా? ద్రౌపది అట్లా చూపించింది కదా! 'అనన్యశరణం' అంటామే అది. నిన్ను నీవు గుర్తించుకోని స్థితిలో దైవమే అట్లా ఉంటున్నాడు కదా! 'ఒరే నేనింత చేశాను కదా నాకేదిరా గుర్తింపూ, ఏదైనా సన్మానము చేయండిరా' అనేమీ అడగలేదు కదా! యుద్ధమంతా చేసింది ఆయన కదా! కూర్చోపెట్టి సన్మానం చేయించుకోవద్దూ! అలా ఏం లేదు. The more you are capable, the deeper you do things and you relatively remain unknown. మహాత్ముల జీవితాల్లో చూసుకోవచ్చు కృష్ణుడి వరకు అక్కరలేదు. ఒక సద్గురువు తన్నాశ్రయించిన శిష్యుడికి ఏం మంచి చేస్తున్నాడో శిష్యుడికే తెలియదు. అంతేకాదు చేస్తున్నట్లు కూడా చెప్పడు. శిష్యుడికి ఆ సంగతి తెలిసేసరికి ఆయన ఉండడు, అట్లా చేస్తాడు. ఈ లోపల మనం ఏదో లుంగలు చుట్టుకుంటూ వుంటే నవ్వుకుంటూ వుంటాడు. 'మనకి మన గురువుగారు ఏమీ చేయడు, ఏమీ లాభం లేదు పక్క గురువుగారు అన్నీ చేసేస్తున్నారు' అని మనకి భావాలు వుంటుయి కదా. జరగదు అంటే, జరుగుతుందో లేదో నీకు తెలీదు కదా. యోగానందని వాళ్ళ గురువుగారు, యుక్తేశ్వరులు 14ఏళ్ళు ఏడిపించాడు. 'ఉండరా నేను వెళ్ళిపోయే సమయం వచ్చింది' అని గురువుగారు అన్నారు. యోగానంద అప్పటికే నాలుగైదు సార్లు విదేశాలకి వెళ్ళి వచ్చారు. ఏదో ఒక అవగాహన, ఒక్కసారి కళ్ళు మూసుకుని తెరిచి ఏం పర్వాలేదు మనం ఈ లోపల ఆ పక్కఊరు వెళ్ళి వచ్చేవరకు ఈయన ఉంటాడని లెక్క వేసుకుని వెళ్ళిపోతాడు. అంటే ఏమిటే? అది రజోగుణమే! గురువే ఉండమని చెప్తే, ఆయన చెప్పేది రైటా తప్పా అని ఆలోచించే పరిస్థితిలో ఉన్నప్పుడు, శిష్యుడు వెళ్ళగానే గురువుగారు శరీరాన్ని వదిలేశారు. ఇక అక్కడ నుండి 'గురువు గారికి మనం చాలా ముఖ్యమైన శిష్యులం కదా! మరి వెలుగు శరీరంతో కనబడాలీ కదా' అనుకొని అట్లా ఒకపక్క తొలుస్తుండేది. 'గురువుగారు ఉండమంటే ఉండలేదు, మనం లేనప్పుడు ఆయన వెళ్ళిపోయాడు, మనకి కనబడడు' అని ఒక పక్క ఇది సలుపుతూ ఉంటే, అడ్డమైన చాకిరి 14 ఏళ్ళు చేశాడు. ఏమిటి చాకిరీ అంటే 'క్రియా యోగం', అది ఆయనకివ్వబడిన పని. దాన్ని పాశ్చాత్త దేశాలలో మన దేశంలో కన్నా ఎక్కువగా అందించడం ఆయన కర్తవ్యం. అదంతా నిర్వర్తిస్తుంటే లోపల రోజు ఇది తొలిచేస్తుండేది, ఎవరు తన్ను ఈ దారిలో

పెట్టాడో, ఆయన మాట చివరి క్షణంలో వినలేదు, ఆయన కాస్తా వెళ్ళిపోయాడు కనబడడు. ఉన్నప్పుడు చెప్పాడు 'నాకు వెలుగు శరీరం ఉంది, నేను కనిపిస్తాను' అని. పైగా ఆయన ఉన్నప్పుడు చాలా కలలు వచ్చేవి ఆయన గురించి. ఆయన వెళ్ళిపోయాక కలలో కూడా కనబడలేదు. అలా 14 ఏళ్ళు! అంటే ఏం లేదు ఈయనకి అహం చచ్చిన తర్వాత ఒక రోజు కనిపిస్తారు. ఇన్నాళ్ళూ మనమే చేశాం అనుకుంటూ వుంటాం. అసలు మనం లేకపోతే మన గురువుగారికి పేరెక్కడ నుండి వస్తుందన్నట్లుగా వుంటాం కద! మనం చెప్పకపోతే ఆయన గురించి ఎవరికీ తెలియదు కదా అన్నట్లుగా వుండే పరిస్థితులుంటాయి శిష్యుడికి. ఇన్ని జరుగుతున్నా శిష్యుడిలో సాధన జరిపిస్తూనే ఉంటాడు. సద్గురువు ఒక్కసారి పట్టుకుంటే వదలడు, దెయ్యమైనా వదులుతుందేమో కానీ ఈయన వదలడు, అలా చేస్తూ వుంటాడు. మనకి నమ్మకం వుండదు, నమ్మకం వుండడం వుండక పోవడం గురువుకి సంబంధం లేదు, మనకి అర్ధం కాదు, కొన్ని జన్మల తర్వాత తెలుస్తుందని చెప్తున్నారు కదా! 12 జన్మలకి నీకు నీ గురువు గురించి పూర్ణంగా తెలిసేది, నీకు భౌతికంగా అప్పుడు కనిపిస్తాడు. కనిపించడానికి ముందే పన్నెండు జన్మలు నుండి guide చేస్తూ వుంటాడు, అంటే మొదట ఒకసారి కనిపిస్తాడు ఇహ అక్కడి నుండి అనుస్యూతంగా (continuousగా) అదృశ్యంగా (invisibleగా) అట్లా guide చేస్తూనే ఉంటాడు. మనకి తెలియకపోవచ్చు, అందుకనే నీకు తెలిసింది చాలా తక్కువ. కాబట్టే గురువు గురించి అంచనా వేయక చెప్పింది చేసుకుంటూ వెళ్ళిపోతూ ఉండు, ఎందుకంటే గురువు యొక్క దక్షత్వం అలా వుంటుంది, అది భగవత్తత్త్వమే! అది మనకి అందరి గురువుల్లోనూ కనిపిస్తుంది. ఎంత దక్షుడు కాకపోతె షిరిడిసాయి పదిమంది మధ్య అట్లా గోలీకాయలు ఆడుతూ, మొక్కలు పెంచుకునేవాడు, ప్రపంచం అంతా వ్యాపించాడు. దీని గురించి అప్పుడే ప్రణాళిక వేసుకున్నాడా? 'వీళ్ళంతా నా గురించి చెప్పట్లేదు' అనేం అనలేదు కదా! మరి ప్రపంచమంతా వ్యాపించాడు, అలాగే రమణ మహర్షి ప్రపంచం అంతా వ్యాపించాడు, రామకృష్ణపరమహంస వివేకానందుడిని ముప్పతిప్పలు పెడ్తాడు. ఎందుకని? వివేకానందుడిది రజోగుణ ప్రవృత్తి, ఈయన శుద్ధ తత్త్వము. పిచ్చి పిచ్చిగా కనిపించేవాడు

రామకృష్ణపరమహంస. Practical అస్సలు కాదు మాగురువుగారు అన్నట్లుండేవాడు. వివేకానందుడికి ఆయన అసలు బొత్తిగా అర్థంకాలేదు. పైగా ఏ మాత్రమైనా అర్థం అవుతూ ఉంటే అపార్థం అయేట్లుగా కూడా చేస్తాడు రామకృష్ణుడు, చాలా ఏడిపిస్తాడు ఎందుకంటే నువ్వు రజోగుణంలోంచి గురువుని చూద్దాము అనుకుంటే అయ్యిచావదు. చివరి చివరికి నువ్వు పండుతూంటే ఆయనెంతటి వాడో తెలుస్తూవుంటుంది. నువ్వు ఒక్కక్క మెట్టూ ఎక్కినప్పుడల్లా ఆయన కనబడి ఆశీర్వదిస్తుంటాడు. వినాయకుడు కుమారస్వామికి కనిపించినట్లు. వాళ్లు మూడు లోకాల్లో ఉండే అన్ని నదుల్లో స్నానం చెయ్యడానికి వెళ్ళినప్పుడు, కుమారస్వామి ఇంకా నదిలోకి స్నానం చేయడానికి వెళ్తుంటే వినాయకుడు అక్కడ నుండి స్నానం చేసి వచ్చేస్తూ 'తొందరగ కాని' అనిచెప్పి మరీ వెళ్ళి పోతూండే వాడు. మీరు ఏ మెట్టు ఎక్కండి ముందు మెట్టు మీద ఆయన ఉంటాడు, ఇదేంటి నాకన్నా ముందు ఈయన ఎలా వచ్చాడు? అని అనిపిస్తుంది. నీకన్నా ముందు రావడం కాదు నీకన్నా ముందు నుండి ఉన్నాడు. నీకు ముందు కనిపించాడు మళ్ళీ మధ్యలో కనిపించడు, ఎందుకు కనిపించడు? ఈ లోపల మనకి కొంత file clearances ఉంటాయి, అవన్నీ నిర్వర్తిస్తుంటాడు. ఎంత dexterous గా చేస్తాడో మనం ఊహించలేము. ఒక్క మాట చెప్పడు 'నేను నీకిది చేస్తున్నానని గాని, నీకు నేనది చేసి పెట్టానని గాని, అట్లాచేసి పెడ్తానని గాని, ఇట్లా ఇక ముందు చేస్తానని గాని' ఇట్లా మాట్లాడుతాడా? ఒక్కటే మాట చెప్తాడు 'గురువాజ్ఞ తక్షణ కర్తవ్యం ఊర్జిత శాశనః' అంతే, అట్లా పట్టుకు పోతూ ఉండడమే అదే అవుతూ వుంటుంది. ఈ లోపల మన కంతా చాలా అవ్వాలి. ఆయన ఎంత చక్కగా నిర్వర్తిస్తాడంటే you are sure to float in spite of any kind of difficulties. 'నా భక్తుడు నశించడు' అని కదా కృష్ణుడు చెప్తాడు. ఎంత dexterousగా పాండవులని లాక్కొచ్చాడు కదా! ఎటువంటి మహాసముద్రంలో నుండి లాక్కొచ్చాడు? అలా ఉంటుంది దక్షత్వం. మనకి గురువు యొక్క దక్షత్వం అవగాహన ఉండదు. మనం పైపై మెరుగులే చూస్తాం కనక, అసలు తత్త్వం తెలీక పోవడంవల్ల మనకి అలా అవుతుంది. కృష్ణుడి యొక్క దక్షత్వం ఎవ్వరికీ తెలియదు, ఆ రోజుల్లో ఉన్న మహాత్ములకు కూడా తెలియలేదు. నారదుడికే తెలియలేదు. మరి

భీష్మాదులకి. ద్రోణాదులకి, విదురుడికి. అక్రూరుడికి తెలియలేదు. మైత్రేయాదులకు తెలుసూ తెలియదు. గోపికలు తెలుసుకుందామని ప్రయత్నం చెయ్యలేదు, ఆయనలోనే ఉండిపోయారు అంతే! ఎందుకంటే మొత్తం ఆధారం అంతా అదే సద్గురువు అన్నా అదే. నీ గురువు యందు నీ గురి అంత నిశ్చలంగా ఏర్పడితే గానీ నీ గురువు నీకర్థంకాడు. గురుచరిత్రలో మొట్టమొదటి కథలో దీపకుడనే శిష్యుడ్ని ఆ గురువు గారు ఎన్ని రకాలుగా పరిక్షలు పెడతారూ? ఏంలేదు నీలో ఎంత stability ఉందో చూడడానికి. అది తెలిస్తే కానీ ఆయన సమగ్ర రూపం, నిజస్వరూపం చూపించడానికి అవకాశం లేదు. నీకేవో వేరే విలువలు ఉంటాయి, వేరే values ఉంటాయి, వేరే assessments ఉంటాయి. అంతసేపూ ఈయన దాగే ఉంటాడు.

౨౪౨ దక్షిణః

అదొక్కసారి తెలిసిన వారికి తన్నుతాను సమర్పణ చేసుకుంటాడు. దక్షిణ అంటే సమర్పణ చేసేదేగా! వ్రతాలు, యజ్ఞాలు చేసిన తర్వాత పంచబడేది. అట్లా తనని తాను పంచుకుంటాడుటండీ! తనను నమ్మిన వారికి తనను తాను పంచుకుంటాడు. ఎంత పంచుకుంటాడంటే, మామూలుగా మనకి లౌకికంగా తెలిసిన లెక్కలకి అందేది కాదు, అంత పంచుకుని, అంత అదుకుని వాళ్ళకోసం మనభాషలో చెప్పాలంటే నానా కష్టాలు భక్తుడు కోసం భగవంతుడు పడుతున్నట్లుగా ఉంటుంది. శిష్యుని కోసం గురువు అట్లా పడతాడు. కష్టాల్లో ఉండే పుత్రుని కోసమో, పుత్రిక కోసమో తల్లిదండ్రులు ఎట్లా తాపత్రయపడ్తారో అంత తాపత్రయం ఉంటుంది. తనను వాళ్ళకి పంచి ఇచ్చేసుకుంటాడుట. ఎందుకంటే వాళ్ళు తనని నమ్ముకుని ఉన్నారు కాబట్టి. వాళ్ళ యొక్క స్థితిగతులతో గాని, వాళ్ళ యొక్క శక్తి సామర్థ్యాలతో గాని సంబంధం లేకుండా, ఆయన వాళ్ళలోంచే పెరగడం మొదలు పెడ్తే, వాళ్ళకి 'పంగుం లంఘయతే గిరిం, మూకం కరోతి వాచాలం' ఇవన్నీ జరుగుతూ ఉంటాయి. మూగవాడు మాట్లాడేడట, ఏమీ శాస్త్రజ్ఞానం లేనివాడు ప్రపంచాన్నంతా వాక్కుతో జయించుకొస్తున్నాడట, వీడా? కాదు వాడు కదా! వేకానందుడు చికాగో లో మాట్లాడితే అందరూ అలా కళ్ళప్పగించి విన్నారుట, యోగానంద వెళ్ళి మాట్లాడాడట అందరూ విన్నారుట, ఏమిటి మాట్లాడింది? 'తనకున్ భృత్యుడు వీని బ్రోచుట మహాధర్మంబు పామ్మంచు' అని ఉంటుంది భాగవతంలో. అర్జునుడు తనని నమ్ముకున్నాడు. కాబట్టి అతన్ని కాపాడుకోవడం అనేది అన్ని ధర్మాలకన్నా మించిన ధర్మం కాబట్టి ఆయుధం పట్టనని అన్నమాటని తోసిరాజని, అబద్ధం ఆడితే ఏమిటిటా, అని దూకి చక్రాన్ని invoke చేశాడు. అంటే ఏమిటి? తనని తిట్టుకుంటే తిట్టుకున్నారు, తనని నమ్మిన వాడిని రక్షించాలి, అంతేకాని 'ఇవాళ ఇటువంటి మాట ఒకటి ఇచ్చాను, మరి అవతలివాడు బాణం వేసేస్తాడు ఇవాళ నువ్వు వెళ్ళిపోతావా' అని శిష్యుడికి చెప్తే ఎలా వుంటుంది? 'ఇప్పుడు తనువు శాశ్వతము కాదు కదా' అని అంటే right philosophy in the wrong time అన్నమాట. మనకి చేతకాక వాడికది నేర్పడం. భీష్ముడు ఏమి

చేశాడు? కావాలనే చూద్దాం అని చేశాడు. 'శస్త్రం పట్టనన్నాడు కదా, అస్త్రం పట్టనన్నాడు కదా చూద్దాం' అని అన్నాడు, 'అయితే ఏమిటి? పట్టుకుంటాను' అన్నాడు కృష్ణుడు. ఎందుకన్నాడు? శిష్యుడు తనకి సమర్పణ చెంది ఉన్నాడు కనుక. ఎవరు భగవంతునికి ఎంత సమర్పణ చెందుతారో, అట్నుంచి కూడా అంతా ఉంటుంది, same to you అంటాం చూశారా! As much as you are submitted to Me so much I am submitted to you. Protected కూడా కాదు, submitted. బద్ధుడ్ని అవుతానని చెప్తాడు. భక్తుడికి నేను బద్ధుడ్ని, ఇంక దేన్ని నేను care చెయ్యను అని చెప్తాడు. తన మేలు కోరడట, భక్తుల మేలు కోర్తాడట. తన మేలు కోరేవాడైతే 'ఆయుధం ముట్టనన్నాను కదా, నువ్వేదో చాలా తెచ్చుకున్నావు కదా అవన్నీ వేస్తుండు' అని చెప్తాడు. కాని భక్తుడ్ని రక్షించడం మహాధర్మంట, ధర్మాల్లో మళ్ళీ gradation. మన పేరు పోకుండా ఎవరికైనా సాయం చేయడం ఒకటి, మన పేరు పోతుందిట అయినా ఫర్వాలేదు వాడు మనల్ని నమ్ముకున్నాడు, వాడికి మనం సాయం చేయాలి అనుకోవడం ఒకటి. అది ఎవడూ చేయలేడు, దైవీత్తత్త్వం వుంటే తప్పా చేయలేరు. హనుమంతుడు చేశాడు కదా! ఆ గయుడు ఈయన్ని నమ్ముకుని వచ్చేశాడు శరణు కోరాడు హనుమంతుడు ఇచ్చాడు. ఇంతాచేసి ఇతడ్ని చంపుతానన్నవాడు తన దైవమే! అయినప్పటికీ వదలలేదే! 'నీవు నా దైవమే అయ్యి వుండవచ్చు' అన్నాడు, 'నాకు నువ్వే దైవానివి, నువ్వు నన్ను చంపేసెయ్యి కావాలంటే, నేను ఇతనికి శరణు ఇచ్చాను' అంటాడు. రాముడు ఎట్లా చంపుతాడు? హనుమంతుడి గొప్పతనం ఏమిటంటే 'నేను నీకు సమర్పణ చెందినవాడ్ని, ఇతడు నాకు సమర్పణ చెందాడు, ఇతడికి నేను అభయమిచ్చాను కాబట్టి, నేను బ్రతికి వుండగా అతడు చావడానికి వీలు లేదు. నన్ను చంపేసి అతడ్ని చంపెయ్' అంటాడు. తనని కావాలంటే కొట్టుకోమన్నాడు 'ఏమి కొట్టుకుంటావు? ఇక్కడ నువ్వే ఉన్నావు, అప్పుడు నిన్ను నీవు కొట్టు కున్నట్టవుతుంది' అంటాడు తనని చూపించుకుంటూ హనుమంతుడు. అలా హనుమంతుడు ఒక speciality, భక్తి విషయంకి వస్తే రాముడు తప్ప ఇక ఎవరూ గోచరించరు అన్నట్లుగా ఉంటాడు, రాముడే సర్వస్వం అటువంటి రాముడితో యుద్ధం, అదీ రామాంజనేయ యుద్ధం. సమర్పణ చెందినవాడ్ని భగవంతుడు ఏం

చెయ్యలేడనే ఎంతో మంచి విషయాన్ని ఇక్కడ ప్రతిపాదించారు. వృత్తాసురుడు నారాయణ తత్త్వానికి అలా సమర్పణ చెందాడు, సమస్తాన్నీ నారాయుణుడుగా దర్శనం చేస్తున్నాడు. ఇంద్రుడు వెళ్ళి విష్ణువు వద్ద వృత్తాసురుడ్ని చంపడానికి వరం తెచ్చుకున్నాడు. కాని ఏం కాలేదు, ఏం చెయ్యలేకపోయారు. వాడ్ని ఉద్ధరించుకొని వీడికి కుర్చీ ఇప్పించాలి తప్పా ఇంకో పద్ధతి లేదు, బలిచక్రవర్తి కూడా అంతే! అందుకని భగవంతుడు దక్షిణ స్వరూపుడు అంటే అర్ధం ఏమిటి అంటే తన్ను తాను సమర్పణ చేసుకొనువాడు. వీడు నన్ను నమ్ముకున్నాడు అనే భావన సద్గురువుకి ఏర్పడితే వాడ్ని రక్షించుకునే సమస్తమైన కార్యక్రమాలు సద్గురువే చూసుకుంటాడు. అది కృష్ణుడి విషయంలో కనిపిస్తుంది, రాముడి విషయంలో కనిపిస్తుంది. విభీషుణుడు తనను నమ్ముకున్నాడు. 'శత్రువయ్యా, బొత్తిగా శత్రువు తమ్ముడయ్యా' అంటే 'ఐతే ఏమిటిట' అంటాడు. 'శరణు అని కోరినవాడికి క్షాత్ర ధర్మంలో జీవిస్తున్న నేను శరణు ఇవ్వను అనే ప్రశ్న లేదు' అంటాడు. ఎంత గొప్పవిషయం? తను ముందు వెళ్ళిపోవాలి తప్ప, తనని నమ్మినవాళ్ళు వెళ్ళిపోవడానికి వీలులేదు, ప్రాణాలు కూడా అలాగే ఇస్తాడు గురువు. శిష్యుడికి గండం ఉందనుకోండి తప్పించడానికి గురువు ప్రయత్నం చేస్తాడు. కొన్నికొన్ని బొత్తిగా తప్పించలేనివి వస్తాయి. ఏం చేస్తాడో తెలుసా? తనది వాడికిచ్చేసి తాను వెళ్ళిపోతాడు, ఎందుకని? వాడి ద్వారా ఈయనే పనిచేసుకోవచ్చు. షిరిడిశాయి అదే చేసినట్లుగా మనకు ఆయన కథలో కనిపిస్తుంది. వాడెవడో దగ్గుతూ వుంటాడు 'లాభం లేదు వాడుపోయేటట్లుగా ఉన్నాడు' అంటే 'అలాగా' అన్నాడు, ఈయన వెళ్ళిపోయాడు వాడు బతికాడు. తనని చంపుకోవడం అంటే ఏమిటి? శరీరం వదలడమేకదా! తన ఆయుర్దాయం వాడికి ఇచ్చేంత commitment. మనకన్నీ బావుంటే మనకున్న దానిలో కొంచెం surplus ఏదో ఉందంటే, అందులో 1% తీసి పదిమంది చూస్తుండగా ఇచ్చి 'వాడు నాశిష్యుడు అందుకని ఇచ్చాను' అని వూరంతా చెప్పుకుని-- ఇట్లా cheapగా ఉంటుంది. అటువంటిది ఇది ఎంత పవిత్రంగా ఉంటుందంటే, ఇంత చేస్తే ఈయన ఇచ్చాడని, ఈయన వల్ల మనం బతుకుతున్నామని శిష్యుడికే తెలీదు. సృష్టిలో పరతత్త్వం కూడా అంతే. మనం

ఏంచేస్తున్నా మనకి ఏం జరుగుతున్నా ఆయన తనని తాను వండుకుని మన రూపాల్లో వచ్చి మనలో ఉండబట్టి కదా, మనం ఏం చేసినా, ఎన్ని వెర్రివేషాలు వేసినా సాగుతుంది. ఆయన సమర్పణ చేయబట్టి కదా క్రిమికీటకాదులు దగ్గర్నుండీ, ఇవన్నీ వచ్చినాయి, లేకపోతే వస్తాయా? అంతకన్నా దక్షిణ ఏముంది? 'పరతత్త్వమే ఈ సమస్తముగా ఏర్పడెను. అన్నిటియందు ఆయనే ఉండెను' అనుకుంటే అది ఒకటి. రెండవది ఇట్లా భక్తులను రక్షించే భక్తి కథలన్నీ చదువుకోవడం. భక్త విజయలన్నీ కూడా భగవంతుని విజయాలే! అది భక్తుడికి తెలుసు. ప్రపంచం భక్తుడ్ని గుర్తిస్తూ ఉంటుంది. ఈయన ఆనందం పొందుతూంటాడు. ఎందుకని? ఆయనకేం కీర్తి కావాలి? ఆయనకి ఏం అక్కర లేదు. కొడుక్కి కీర్తి వస్తుంటే తండ్రి సంతోషించినట్లుగా, శిష్యుడికి కీర్తి వస్తుంటే గురువు సంతోషిస్తుంటాడు. అప్పడప్పడు ఈయన శిష్యుడికి కూడా కాస్త ఏమన్న ఎక్కిందేమో అని చూడడానికి 'నీవు నాకన్నా better' అంటూంటాడు. అంటే నిజమేమో అనిపిస్తుంది, అనిపిస్తే అయిపోతుంది. గురువుకన్న తను ఎప్పుడూ better కాదు. వినాయకుడికి, కుమారస్వామికి ఉన్న సంబంధం గుర్తు పెట్టుకోవాలి. At all stages HE is ahead of Him. ఎక్కడకన్నా వెళ్ళు, అక్కడ ముందు గురువే కనిపిస్తాడు. 'హాయ్' అంటాడు, ఎందుకని? నిన్ను అట్లా నడిపిస్తుంటాడు, నీకు చెప్పకుండా నడిపిస్తుంటాడు, నీ ప్రమేయం లేదు, ఎందుకని? ఒకసారి దణ్ణం పెట్టావు కదా! ఇంత సమర్పణ మరెక్కడ ఉండదు. సద్గురువు దగ్గర కనిపిస్తుంది, భగవత్ తత్త్వం లో కనిపిస్తుంది. మిగతా ప్రేమలన్నీ కూడా బూటకం. మనకి కథ చెప్తారు కదా! పెళ్ళాం పిల్లల్ని వేసుకుని, ఉన్న కాస్తా డబ్బు మూటగట్టుకుని పడవెక్కాడట. ఎందుకంటే రాజమండ్రి మునిగి పోతుందని. పడవెక్కి వెళ్ళిపోతుంటే సగం దూరం వెళ్ళేసరికి గోదావరి బాగా పొంగుతూ వస్తుంటుంది, పడవ బాగానే ఉంది గానీ సగం దూరంలో చిల్లుపడ్డది, పడవవాడు అంటాడు 'ఒకళ్ళు దిగిపోతే పడవ కాస్తా తేలుతుంది' అంటాడు. ఎవరెళ్ళాలి? సద్గురువైతే ఆయన దూకేస్తాడు కదా! ఎవరు దూకితే బాగుంటుందిరా అని discussion పెడ్తాడు, ఒక్కొక్క పిల్లాడ్నే పడేస్తుంటాడు, ఎందుకంటే వీడు లేకపోతే మళ్ళి పుట్టించుకోవచ్చు. అందరు అయిపోతారు ఆయన ఆవిడా మిగులుతారు.

ఆవిడ ఆ మూట పారెయ్యమంటుంది. 'మూట లేకపోతే ఎలా నువ్వు దూకెయ్' అంటాడు. అప్పటికే wrong route కాబట్టి కథ అలా చెప్పారన్నమాట. ఆ మూటేదో పిల్లల కోసం, పెళ్ళాం కోసం ముందే పారేస్తే ఇంత బాధ ఉండేదికాదు. చివరికి మూట, వీడు మిగులుతారు, పడవ వాడు 'మరి మూటా మీరా?' అని అడిగితే, మూట పారేసి నేనేం బతుకుతాన్లే అని వీడు దూకి మూట ఉంచేస్తాడుట. మనం కూడా మనకి సౌకర్యంగా ఉన్నప్పుడు మిగతావాళ్ళకి చెయ్యడంగా ఉంటుంది. మన సౌకర్యాసౌకర్యాలతో సంబంధం లేకుండా మనలాభ నష్టాలతో సంబంధం లేకుండా, మన జయాపజయాలతో సంబంధం లేకుండా, మన కీర్తి ప్రతిష్ఠలతో సంబంధం లేకుండా అవతలి వాడి క్షేమం కోసం పాటుపడె తత్త్వం ఉన్నదే, అదీ దక్షిణః!

౨౬౦ క్షమిణాంవరః

క్షమించే వాళ్ళలో శ్రేష్ఠుడు అని చెప్తున్నాడు. ఎంత క్షమిస్తాడంటే, ఎంతో క్రూరకృత్యాలు చేసినవాడు కూడా తన చేత సంహరింపబడినప్పుడు, ఆ జీవుణ్ణి తనలోకి ఐక్యం చేసుకునేంతటి క్షమ. శిశుపాలుడ్ని, అక్రూరుడ్ని, పూతనని ఇలా తన చేతి స్పర్శ తగిలి ఎవరైతే మరణించారో వారందరిని తనలోకి అందుకున్నాడు కదా! క్షమించే గుణం లేకపోతే అందుకోవాలి. మనం కూడా అటువంటి క్షమించగలిగే స్వభావం నేర్చుకోకపోతే ముందుకు వెళ్ళలేం. Forbearance - Ten Commandments లో మొట్ట మొదట చెప్పినది Tolerance. భగవద్గీతలో భక్తుడికి వుండే గుణాలలో మొట్ట మొదటగా వచ్చేది 'క్షమ'. నీకు నిష్కారణంగా/కారణం లేకుండా బాగా అపకారం చేసినవాడు ఒకడున్నాడు. సరే వాడిని అలా పక్కన పెట్టేసి నీ దారిన నువ్వు మంచి పనులు చేసుకుంటూ, సాధన చేసుకుంటూ ముందుకు వెళ్తున్నావు అనుకోండి, నీలో మంచి అద్భుతమైన సిద్ధి కలిగే ముందు నీకో కల వస్తుందిట, అది కలకాదు అంతా సత్యంగానే వుంటుంది. 'ఇది సత్యమే! కల కాదు' అనే కలలు కొన్ని వుంటాయి కదా! అక్కడ ఏమి జరుగుతుందంటే ఒక తలుపు వుంటుంది. ఆ తలుపు అవతల దివ్యమూర్తి దర్శనం. ఇద్దరొస్తారు. ఎప్పుడూ ఇద్దరొస్తారు గుర్తుపెట్టుకోండి. దేవతలు కూడా యిద్దరు కన్పిస్తారు, అదృశ్యరూపులు కూడా ఇద్దరు కన్పిస్తూ వుంటారు. తీసుకొస్తారు 'నీవు చేసిన అద్భుతమైన కార్యాలకి, శ్రేయోదాయకమైన కార్యక్రమాలకు నీవు చూపిన దీక్షకి, నిరంతర కృషికి ప్రతిఫలంగా ఈ రోజున నీకు జగద్గురువు మైత్రేయులు, వారి దర్శనం యివ్వడానికి సంకల్పించారు, ఆయన నీకో శక్తిపాతం చేస్తారు, ఇక అప్పట్నుంచి నీవు చిరంజీవిగా ఈ భూమి మీద మాతోపాటు కలకాలం పని చేస్తూ వుండవచ్చునని' చెప్పి నిన్ను బాగా పాగుడుతారు. అప్పుడు నిన్ను పొగిడినా పట్టించుకోని స్థితిలో నువ్వు ఉంటావు. మనది కాదు పొగడ్త అంతా వాడిదే అనే స్థితిలో ఉంటావు. 'ఈవాళ నీకొక్కడికే ఈ అవకాశం, ఈ మధ్య కాలంలో అంటే గత ౨౦౦-౩౦౦ సంవత్సరాలుగా ఎవ్వరికీ లేదు' అని అవీ ఇవీ చెబుతారు. నీవు చాలా special అన్నట్లుగా తయారు చేస్తారు. అన్నీ అయిన తరువాత ఇక ఐదు

నిమిషాల్లో తలుపు తెరుచుకుంటుంది అనంగా మరో ఇద్దరు యింకొకడిని పట్టుకొస్తారు. 'ఎవడు వాడూ' అంటే, 'నీతో పాటు వాడికి కూడా ఇదంతా అంటారు'. మనకొక్కళ్ళకే అంటే మనకి బాగుంటుంది కానీ మనతో బాటు ఇంకొకడికి అంటే మనకి బాగుండదు కదా! 'వాడిక్కూడాలే' అంటారు. ఆ! అని తేడా పడితే ఉండదు, పంపించేస్తారు. అంతేకాదుట! వాడెవడో వీడు చూస్తాడుట, ఊరుకోం కదా! వేంకటేశ్వరస్వామి గుడికి మంచి influence తీసుకుని మనం ఒక్కళ్ళమే ముందుండడానికి వెళితే, యింకొకడు కూడా మనమొక్కళ్ళమే అనే వాడూ వస్తాడు. దేవుడితో పాటూ వీడిని కూడా చూస్తుంటాం. 'వీడెవడు! మనతో పాటూ సమానంగా వచ్చాడు, మనం ఒక్కొళ్ళమే అని చెప్పారు కదా' ఇటువంటివన్నీ వస్తాయి కదా! అట్లా రాగానే నీ భావాలు చూస్తారుట, భావాలు చూసి 'నీకు దర్శనం లేదు వెళ్ళిపొమ్మని' చెప్తారు. అపుడేం జరుగుతోంది? అది కూడా దాటాడూ అనుకోండి 'వాడూ పుణ్య కార్యాలు చేసి వుంటాడు, మనమేనా! ఎంతోమంది వున్నారు బావుంది', ఇంకోడు కూడా మనతోబాటు ఆనందం అనుభవిస్తుంటే ఆనందించడం అనేది సామాన్యమైన విషయం కాదు. జీవుడికి చాలా కష్టమైన విషయం. మనకొక్కళ్ళకే exclusive అని చెప్పి యింకొకడిని అందులో పెడ్తే ఒప్పుకుంటామండీ? ఒప్పుకోం కదా! అది కూడా దాటాడనుకోండి, అప్పుడు ఆ పక్కన నిలబడ్డ వాడ్ని చూస్తే నీకు ఇదివరకు తీరని అపకారం చేసినవాడుంటాడు. వాడిని చూసి వీడేంటి? వీడికి కూడానా! అని అనిపిస్తుంది, అలా కూడా అనిపించకూడదట. మనకి మాస్టారు గారు ఒక కథ చెప్తుండేవారు, ఆంధ్రులు ప్రార్థన చేసి పక్కవాడికి కనిపించమోక అని అడుగుతారట. దేవుడు 'ఒక్కటే వరం యిస్తాను కోరుకో' అంటే 'నాకేం అక్కరలేదు నా పక్క ఇంటి వాడికి మాత్రం కనిపించక' అని అడుగుతారట, అని చెప్తుండేవారు. అటువంటిది యిక్కడ నీకు నిష్కారణంగా తీరని అపకారం చేసినవాడు, వాడు కూడా నీతో సమానంగా దర్శనానికి వస్తే వాడికి కూడా మైత్రేయ దర్శనం అవ్వడం ఏమి న్యాయం? అప్పుడు నీ క్షమకు నిజమైన పరీక్షట. 'చాలా బావుంది' అనుకుంటే, అప్పుడు దర్శనంట. రాముడు, కృష్ణుడు అటువంటి వాళ్ళు. రాముడు రావణుడి యందు ఎంత క్షమ చూపిస్తాడు! రావణుడి శరీరానికి ఎటువంటి దహన సంస్కారాలు

చేయిస్తాడు! మామూలుగా యింకోడైతే కసిగా కాలితో తన్ని, చూడండి సినిమాల్లో విలన్ని చంపేసిన తరువాత చివరికి ఒకసారి కాలితో తన్ని వెళ్ళిపోతాడు, అదేంచేసింది? దాదాపు లక్ష్మణుడు ఆ mood లోనే వుంటాడు, దగ్గరుండి రాముడు విభీషణుడికి చెప్తాడు 'అత్యంత వైభవంగా దహన సంస్కారాలు చెయ్యి, బ్రహ్మ వర్చస్సు కలిగిన వాడు, ఆ ఒక్క గుణం లేకపోతే బ్రహ్మర్షి కదా మీ అన్నయ్య' అని చెప్తాడు. అది మనతో అయ్యే పని కాదు. వాలికి అట్లా చేస్తాడు, రావణుడికి అట్లా చేస్తాడు. ఇక కృష్ణుడు సంతర్పణే అది, ఒక్కొక్కణ్ణి, ఒక్కొక్కణ్ణి ఏరేస్తూ వాడ్ని తనలోకి తీసుకోవడం అనేది ఎలా వీలు పడుతుంది? అందుకని మన దృష్టిలోనే మంచివాళ్ళు, చెడ్డవాళ్ళు తప్పా బాగా ఉత్తమ స్థితికి వెళ్తున్న కొద్దీ ఇక మంచీ లేదు, చెడూ లేదు అంతా ఒకటే, అందులో భాగమే. అది మనకి నచ్చదు, మనతో పాటు వాడికి కూడానా? అయితే ఇదంతా ఎందుకు waste అన్నట్లుగా వుంటుంది మనకు. అట్నుంచి logic వేరుగా వుంటుంది. రెండూ వీడ్నీ వాడ్నీ నిన్ను ఉద్ధరించటానికే పట్టుకొచ్చారు, లేకపోతే నీవిట్లా తయారయ్యేవాడివా? అందరినీ క్షమించగల్గే స్వభావం. ద్రౌపది క్షమించ లేకపోతుంది, యుద్ధం జరగదేమో తన వెంట్రుకలకు సంస్కారము జరగదేమో అని అనుకుంటూ వుంటుంది. ప్రతిజ్ఞ చేసింది కదా! వాడిదెవరిదో నెత్తురు తెచ్చి, ఎక్కడి నెత్తురు? గుండెల్లోంచి చీల్చి ఆ నెత్తురు తెచ్చి ఈవిడ వెంట్రుకలకు రాసుకుందామని ఆమె ఎదురు చూస్తుంది. ఎప్పుడు జుట్టు చూసినా 'దుశ్శాశనుడి రక్తం ఎప్పుడు తెస్తావని' అన్నట్టుగా భీముని పక్క చూస్తుంటుంది కదా! అది చూడగానే కోపం కొద్దీ యింకొంచెం బస్కీలు తీసేవాడు భీముడు. అలాగే అర్జునుడు బాణాలు పదును పెట్టుకోవడం, వింటిని బాగా సారించడం, విల్లును రోజూ maintain చేయడం వంటి బాధలన్నీ వుంటాయి. అసలు యుద్ధం వుంటుందా లేదా చెప్పు అని కృష్ణుడిని వాళ్ళు అడుగుతారు. 'ఏం ఎందుకు జరగాలి?' అంటే 'మరి ఏం చేస్తావు నా జుట్టు' అంటే, 'నీ జుట్టు ముఖ్యం కాదు నాకు' అంటాడు కృష్ణుడు, ద్రౌపదికి గుండె పేలిపోతుంది. 'అదేం నేను నీ భక్తురాల్ని, నాకింత అవమానం జరిగితే అలా అంటావేం' అంటే 'అవన్నీ అట్లా ఉంచు, కౌరవులు వంద మంది, మీరు ఐదుగురు ఉన్నారు. మీ 105 మందిలో ఉండే ఈ గొడవలకి మొత్తం లోకం

అంతా ఎందుకు బలైపోవాలి?' అంటాడు. ఏమిటయ్యా అంటే అన్నదమ్ముల బిడ్డలు కొట్టుకుంటున్నారట దానికోసం 18అక్షౌహిణులు చేరినాయి. అంటే మొత్తం భూమి మీద ఉండే అన్ని రాజ్యాలలో ధర్మాన్ని అనుసరించే వాళ్ళంతా పాండవులతో చేరారు, అధర్మాన్ని అనుసరించే వాళ్ళంతా కౌరవులతో చేరారు. ధర్మానికి, అధర్మానికి నిష్పత్తి ఇక్కడ ఏమిటంటే 5:13. పాండవులతో చేరినవి 5 అక్షౌహిణులు, కౌరవులతో చేరినవి 13 అక్షౌహిణులు వాళ్ళకేమీ direct cause లేదు కదా? 'మీకోసం ఇంతమంది చచ్చిపోవాలా? నీ జుట్టు అలా ఉంటే ఏమిటి? అలా లేకపోతే ఏమిటి?' అని అడుగుతాడు. 'అయితే ధుర్యోధనాదులని క్షమించేస్తావా' అని అడుగుతుంది, 'ఎందుకు క్షమించకూడదూ?' అని అడుగుతాడు. అదీ ఆయన! అంటే ఎవర్ని ఎప్పుడు క్షమించాలన్నా సిద్ధంగా ఉంటాడండీ! మనం ఒక చిన్న పాల్లు మాటకి జన్మాంతం మాటలు లేకుండా ఉంటాం కదా, ఒక పక్క పూజలు చేస్తునే ఉంటాం, గుళ్ళకి వెళుతునే ఉంటాం, గుంజీలు తీస్తునే ఉంటాం, లెంపలు వేసుకుంటూనే ఉంటాం, స్తోత్రాలు చేస్తూనే ఉంటాం. ఇవి భక్తి యోగంలో 42 ఇచ్చాడు, మరి ఇవన్నీ ఎందుకు చేయడం అంటే స్ఫూర్తి కోసం. అంతేగానీ ఇవి ఇవిగాను, అవి అవిగాను వేరువేరుగా పెట్టుకుంటే అవ్వదు. కృష్ణుడిది, రాముడిది అంత క్షమ. మాటమాటకి ఒకడ్ని కొటి, ఇప్పుడైనా సంధికి ఒప్పుకుంటాడేమో అని రావణుడికి రాముడు కబురు పెడుతూనే ఉంటాడు, రామాయణం చదివితే మనకి తెలుస్తుంది. అసలు రాముడి క్షమ చూసి మనకి విసుగు వస్తుంది, ఎప్పుడూ ఇదే గోలేనా అని అనిపిస్తుంది. ఎందుకంటే మనకి క్షమ లేక. ఇంకా పోయి వాణ్ణి అడిగేది ఏమిటో? అన్నట్లుగా ఉంటుంది మనకి. ధర్మరాజుకే అంతే! అటు ఇటు కూడా అందరూ వెళ్ళిపోయారు. ఈ మొత్తానికి కారణభూతుడైన దుర్యోధనుడు ఒక్కడు నీళ్ళల్లో ఉన్నాడు 'ఏరా ఇప్పుడన్నా సంధి చేసుకుందామా' అంటాడు, 'సంధి చేసుకుందాము ఎందుకు చచ్చిపోతావు' అంటాడు. మిగతా వాళ్ళందరికి కారం రాసినట్టుగా ఉంటుంది, ఆయనకేం ఉండదు. వాడు 'సరే అన్నయ్యా' అంటే వీరందరికే ఏమైపోవాలో తెలీదు. అసలు మనం ఊరికే వీటి గురించి ఆలోచిస్తే చాలు, అంత వాళ్ళము అవ్వడానికి కొన్ని వందల జన్మలు పడుతుంది, అసలు అటువంటి వాళ్ళు ఉన్నారా భూమి మీద! అట్లా

జీవించారా! అంత క్షమ ఉన్నదా! మనం ఎక్కడ ఉన్నాం? పోనీ అందులో కోటో వంతు క్షమ అయినా మనం నేర్చుకుందామా, అన్న భావన కలిగినా అదృష్టమే. ఎక్కడ క్షమా, ఎక్కడ ఓర్పు, ఎక్కడ సహనం, తనకు వ్యక్తిగతంగా జరిగిన అన్యాయమును ధీరతతో సహించుట అని మనకి సువర్ణ సోపానములలో ఉన్నది కదా! Endurance of personal injustice నీకు అన్యాయం జరిగిందయ్యా, పోనిలే జరిగితే జరిగింది వాడే చేశాడు అని అనుకో. ఆ దైవంలోకి పోయిన వాడు ఇట్లా వదిలేస్తాడుట ప్రతీదీ. మనకేది కావాలో వాడే చూసుకుంటాడు, మనకేది మంచో, ఏది చెడో అన్నీ వాడికి తెలుసు మనకెందుకు అన్నట్లుంటుంది. ఇంతలా రామాయణంలో మనకి కనిపిస్తుంది. సీతాదేవి రాముడే ఉపాయం ఇంకేదీ కాదు అనుకుంటుంది. హనుమంతుడికి రాముడే ఉపాయమని తెలుస్తుంది. మనకి అసలు రాముడిదేముంది హనుమంతుడు లేకపోతే అనిపిస్తుంది. హనుమంతుడ్ని అడిగితే 'రాముడు లేకపోతే నేను లేను కదా' అంటాడు. 'అట్లా అనబోక అంతకు ముందు నుండి నువ్వున్నావు' అని మనం ఎన్ని చెప్పినా ఆయన ఒప్పుకోడు. 'సముద్రం దాటావు కదా, లంకలోకి దూకావు కదా' అంటే 'రామబాణంగా వెళ్ళాను' అంటాడు. 'రాముడు పంపించిన బాణంలాగ నేను లంకానగరం చేరతాను' అని సంకల్పించుకొని వెళ్తాడు. అంతేకాని జాంబవంతుడు వాళ్ళు పొగడడం చేత నాకు చాలా బలం ఉంది, నేను ఎగరగలను అనే భావన అతనికిఉండదు. Everything is that అలా ఉంటాడు.

151 విద్వత్తమః

విద్వత్తు ఉన్న వాళ్ళలో కల్లా ఉత్తముడు. అంటే జ్ఞానులలో శ్రేష్ఠుడు అని అర్థం. చాలా మంది జ్ఞానులు ఉండవచ్చు, వాళ్ళ జ్ఞానాన్ని మించి ఈయన జ్ఞానముంటుంది. అందుకనే కృష్ణుని యొక్క అవగాహన అప్పుడుండే చాలా మంది ఋషులకు కూడా తెలియలేదు. సమర్పణ చెందిన వారికే తెలిసింది. అక్రూరుడికి తెలియలేదు, ఆయన మహాజ్ఞాని. వ్యాసుడంతటి వాడు. అయినా ఎందుకు తెలియలేదంటే వ్యాసుడేమో సమర్పణ చెందాడు, అక్రూరుడు అహంకారంలో జీవించేవాడు అందుకని తెలియలేదు. విదురుడికీ తెలియలేదు. కృష్ణుడు చాలా మంది జ్ఞానులకి ఆ సమయంలో తన జ్ఞానం చూపించాడు. ఎప్పటికప్పుడు అవసరమైతే పలుకుతాడు తప్పా ఎప్పుడూ అదే పనిగా జ్ఞాన బోధలు చేసినవాడు కాదు. రాముడి జ్ఞానం కూడా అంతే. ఉత్తమ జ్ఞానులలో కెల్లా ఉత్తముడు. అందుకనే భగవద్గీత ఈ భూమి ఉన్నంత కాలం చిరస్థాయిగా నిలబడుతుంది. This is the direct message from the Lord. ఇది ఈయన పలికితే రాసింది. అందుకని ఇది final గా నిలిచిపోతుంది. కాబట్టే మనం రోజూ చదువుకోవలిసిన గ్రంథాల్లో ఇది ఒకటి. ఉత్తమ జ్ఞానం నీకు కలగాలంటే పిచ్చిపిచ్చి వికారాలు లేకుండా అతికి పోకుండా ఉండాలి, శాస్త్రాల్లోకి పోతే అతి వచ్చేస్తుంది. అది కూడా జ్ఞానయోగంలో చెప్తాడు, 'నన్ను మర్చిపోయి శాస్త్రాలు చదువుకున్నావో అంతే సంగతి నీకు' అంటాడు. 'శాస్త్రాలు నేర్చుకున్న బరువు మిగిలిపోతుంది తప్పా శాస్త్రజ్ఞానం నీకు అబ్బదు, లభ్యం కాదు, నువ్వు చదువుతున్న శాస్త్ర రూపంలో నేనే ఉన్నానని భావన చేసి చదువుకో నీకు సమగ్రమైన జ్ఞానం అబ్బుతుంది' అని జ్ఞానయోగంలో చెప్తాడు. అందుకని ఆయన ఇచ్చిన జ్ఞానంలో ముందు ఆ సోపానాలు ఎక్కుతూ భగవద్గీతలోకి వెళ్ళితే journey is safe! లేకపోతే మనం పక్కదార్లు పట్టుకుని అట్లా కొన్నాళ్ళు అడవులలోకి వెళ్ళిపోయి, అవే ఏవో చాలా అనుకుని మళ్ళి వెనక్కి వచ్చి, మళ్ళీ ఇందులోకే రావాల్సి ఉంటుంది. జ్ఞానం వల్ల మోసపోయిన వాళ్ళు చాలా మంది ఉన్నారు. అది పాండిత్యం మాత్రమే! గుర్తు పెట్టుకోండి, నారదుడు ఒక మాట చెప్తాడు. 'యోగం లేని జ్ఞానం భ్రష్టత్వానికి దారితీస్తుంది' అని. నీవు ఒక

సద్గురువు వద్ద ఒక యోగ మార్గాన్ని అందుకుని అందులో ప్రయాణం చేస్తుంటే నీకు భక్తి, జ్ఞానం రెండు రెక్కల్లా పనిచేసి పురోభివృద్ధికి పనిచేస్తాయి. యోగం లేకుండా భక్తి, యోగం లేకుండా జ్ఞానం పెట్టుకున్నామనుకోండి? యోగం లేని భక్తి 'మూఢ భక్తి', యోగం లేని జ్ఞానం 'అహంకారుడు' గా తయారు చేస్తాయి. Intellectuals అన్నమాట, వారి వల్ల ప్రపంచానికి ఏమీ జరగదు. 'నాకింత తెలుసు' అని చెప్పుకోవడానికి పనికి వస్తుంది తప్పా నీకు అనుభూతీ ఉండదూ, నీవు పది మందికి ఒక స్ఫూర్తినీ ఇవ్వలేవు. యోగంలో నడిచే వాడికి భక్తి, జ్ఞానాలు అబ్బుతూ ఉంటాయి అందుకని వాళ్ళకి తెలిసింది చాలా తక్కువైనా వాళ్ళు మాట్లాడుతుంటే మనుషుల్లో/జీవులకి ప్రేరణ జరుగుతుంది. అందుకనే పండితులు మాట్లాడుతూ ఉంటే bore కొడుతూ ఉంటుంది. యోగంలో నడిచి వెళ్తున్నవాళ్ళు, పెద్ద జ్ఞాన సముపార్జన ప్రత్యేకంగా లేకపోయినా వాళ్ళు చెప్తుంటే స్ఫూర్తి కలుగుతూంటుంది. వీళ్ళుకూడా మార్గంలోకి ప్రవేశిస్తూంటారు. కారణం ఏమిటంటే తాను యోగంలో ఉండడం చేత తనకి తన లోనించే జ్ఞానం ఉద్భవిస్తుంది, తన నుండే భక్తి ఉద్భవిస్తుంటుంది. రెంటినీ తన రెండు రెక్కలుగా చేసుకుని ముందుకు సాగిపోతుంటాడు. అదే CVV గారు చెప్పడం కూడా. 'నీకు కావలసిన బోధనలని నేను అంతర్ముఖంగా చేస్తాను కదా' అంటారు. అంటే నీకు లోపలనుండి ఇది చదువుకో, అది చదువుకో అని నీకు ఏరోజు అనిపిస్తుందో అది వెంటనే చదవడానికి ప్రయత్నం చేయాలి. ఇది చదువుకోండి అంటే చదువుతున్నదాన్ని ఆపి, అది చదువుకోవాలని భావం వస్తుంది. ఇది ఆపి అది చదువుకుంటే దీని connection అందులో ఉంటుంది. 'ఈ పుస్తకమంతా అవ్వనీయండి గురువుగారు తరువాత చదువుతాను' అంటే అవ్వదు. ఎందుకనీ? అంతర్ముఖ బోధన నీకు యోగంలో ఉండడం చేత అబ్బుతుంది, అలా అందిందల్లా నువ్వు ఆచరణలోకి పెట్టడానికి ప్రయత్నం చేయాలి, అందుకూ పుస్తకం పెట్టుకోమన్నారు మాస్టరుగారు. మనం పుస్తకం పెట్టుకుని ఏమి ఆలోచనలు వస్తాయా అని కూర్చుంటే చాలా ఆలోచనలు వచ్చి ఏమీ చేయకుండా అయిపోతుంది, పుస్తకంలో రాయడం మన గమ్యంకాదు. మనం మాస్టరుగారికి సమర్పణ చెంది కూరు న్నప్పుడు ఇట్లా చేసుకో అట్లా చేసుకో, ఇది చదువుకో అది

చదువుకో అని instructions వస్తే అవి రాసుకోవాలి. అసలు రాసుకోవడమే మన సంకల్పంగా కళ్ళు మూసుకుంటే చాలా వచ్చేసి ఏమీ చెయ్యం. అందుకని చేసేవి అయ్యేంత వరకు కొత్తవి ఉపయోగం లేదు. ఆ విధముగా నీకూ సమస్తమూ యోగమార్గంలో అంతర్ముఖంగా జరుగుతుంది కాబట్టి, భారత దేశంలో యోగం ద్వారా సిద్ధులుగా తయారైన వారు ప్రతి శతాబ్దానికి బోలెడు మంది ఉంటారు. మిగతా చోట్ల ఉత్త జ్ఞానం అట్లా పోగేసుకుంటూ ఉండవచ్చు లేదా ఉత్త భక్తి పోగేసుకుంటూ ఉండవచ్చు, ఆ భక్తులకి గమ్యం తెలీదు. ఆ భక్తిని గురించి వివేకానందుడు చెప్తాడు 'యోగంతో కూడని భక్తి మూఢ విశ్వాసాలుగా, మతాలుగా ఏర్పడుతూంటాయి, అక్కడ మనిషికి పూర్ణమైన వికాసం రాదు'. అలాగే కృష్ణుడు 'యోగంతో కూడని జ్ఞానం అహంకారాన్ని పెంపొందించి, నేనింతటివాడ్ని అని ప్రపంచాన్ని మోసం చేయడానికి పనికొస్తుంది. పుష్పములు వర్ణించినట్లుగా మాట్లాడగలరేమో గానీ ఎవరికీ స్ఫూర్తి రాదని' సాంఖ్యయోగం రెండో అధ్యాయంలో చెప్తాడు. అలా పువ్వులు రాలుతున్నట్లు మాట్లాడుతారుట, అంత అద్భుతంగా శాస్త్రాలు వారు చదువుకున్నారు. అవన్నీ వల్లిస్తారటండీ, ఒక్కొక్కసారి కొందరి ఉపన్యాసాలు వింటే 'అబ్బా! ఈయనకు చాలా తెలుసునండీ' అని అనిపిస్తుంది, మనలని ఆ కాసేపూ trance లో పెట్టేస్తాడు ఆ తర్వాత ఏమీ ఉండదు. ఎందుకిది జరుగుతోంది అంటే తాను యోగము నందు ఉండక పోవడం వల్ల. యోగం అంటే ఏమిటి? తనని తాను తెలుసుకునేటటు వంటి ప్రయత్నము. దానికొక పద్ధతి ఉన్నది, దానికొక క్రియ ఉన్నది. అది సద్గురువు వద్దే లభ్యమౌతుంది. కృష్ణుడు సహజంగా యోగి, యోగులందరికీ యోగి. యోగేశ్వరులకు కూడా ఈశ్వరుడు, అది కదా యోగేశ్వరః. యోగీశ్వరులకు కూడా ఈశ్వరుడవడం చేత యోగేశ్వరుడు అయ్యాడు. మరి ఆయన నుండి వ్యక్తమయ్యే జ్ఞానం ఉత్తమ జ్ఞానం, అప్పటికి అక్కడ ఏం కావాలో అది వస్తుంది, ఊరికే తట్టలు తట్టలు గ్రంథాలు బుర్రలో మోయనక్కర లేదు ఆ క్షణానికి అది అట్లా వస్తుంది. అందుకనే మొత్తం తామరతంపరగా పెరిగిన ఆర్యవాఙ్మయాన్నంతా సంస్కరించి 18 అధ్యాయాలుగా మనకిచ్చాడు. వేదములు, ఉపనిషత్తులు, బ్రహ్మవిద్యల సారం పిండి ఓ పద్ధతిగా అందించాడు. భగవద్గీతే మనం

చదవం ఎందుకంటే మనకి గొప్పకావాలి కదా! ఎవడో వాడు రాసినవి, వీడు రాసినవి చదువుతాము. ఎన్నయినా చదువు కాని ముందు భగవద్గీత చదువు. భగవద్గీత చదవలేదంటే, మిగతావి చదివి ఉపయోగం లేదండి. భగవద్గీతలో కృష్ణుడు ఏం చెప్పాడో రోజూ చదువుకోవాలి, పరమ గురువు దేవాపి అంతటివాడు రోజూ భగవద్గీత చదువుతాడు, మనం ఎంతా? పరమ గురువు దేవాపి అంటే మనకు అవగాహన లేదు. ఏదో photo పెట్టుకుంటాం, ఏదో గందరగోళం పడుతూ వుంటాం. ఆయన చెప్పింది ఒక్కటే 'ఈ మార్గంలో నడవాలంటే నీ దగ్గర ఎప్పుడూ భగవద్గీత ఉండాలి' ఆన్నాడు. ఏందుకనీ? ఉండడం వలన తీయడానికి అవకాశం ఉటుందని. ఊరికే ఉంటే చాలదు, ఆ భగవద్గీత తీసి ఒక్క శ్లోకం చదువుకోవాలి. అసలు కృష్ణుడేం చెప్పాడో తెలియకుండా నువ్వు ఊరికే కృష్ణుడు, కృష్ణుడు అంటే ఉపయోగం ఏమిటో? మనం చేసేదంతా మనల్ని మనం మోసం చేసుకోవడమే. ఎందుకు భగవద్గీత చదవాలీ? మనం హిందువులం అనికాదు, ఉత్తమ జ్ఞానం మనకి భగవద్గీతలో ఉంది. ఎందుకంటే 'బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే' కనక. మరి దాన్ని ఉపనిషత్తులన్నారు, యోగశాస్త్రమన్నారు, యోగవిద్య అన్నారు ఇన్నిరకాలుగా దాన్ని చెప్పారు. ఎందుకని? అన్నీ ఇందులో ఉన్నాయని చెప్పడానికి చెప్పాడు వేదవ్యాసుడు. కారణమేమిటి? ఇప్పుడు ఒక గురువుగారు 600 పుస్తకాలు రాసాడనుకోండి. చూస్తే libraryలో 600 పుస్తకాలు ఉంటాయి. మనకేం అనిపిస్తుంది. 'అయ్యా ఈ 600 పుస్తకాలు ఎప్పుడు చదవగలం? ఇందులో ఏదన్నా మూలమైన పుస్తకం ఒకటి చదవుకోవాల్సింది ఉంటే ఇవ్వండి' అని అడుగుతాం కదా! అట్లా నీకు మూలం కావాలంటే, నీకు అరటి పండు వలచి నీ నోట్లో పెట్టినట్లు ఉండాలంటే అది భగవద్గీతే! అందులో వేదం ఉంది. అందులో బ్రహ్మవిద్య ఉంది. అందులో యోగం ఉంది. అందులో ఉపనిషత్తులున్నాయి. నువ్వు వేరే గ్రంథాలు చదువుకున్నా చదువుకోకపోయినా ఇది చాలు 18 మెట్ల సోపానమిది. 'అదంతా old అండి ఇప్పుడు మా గురువుగారండీ' అంటూంటారు. ఎంత మూర్ఖత్వమో చెప్పలేం. మన గురువుగారు maximum కృష్ణుడు old. అప్పటికి relevant ఇప్పుడు కాదిది అంటారు చాలామంది. కాని ఇది eternally relevant. మాస్టరుగారంతటివారు

secret doctrine చదవాలని మొదలు పెడ్తే 'అది అటు పెట్టవోయ్ ఇది చూడు ముందు' అనిచెప్పారు ఆయన గురువు గారు. 'నీకు భగవద్గీత ఏమాత్రం అర్థమైందనీ Secret Doctrine Secret Doctrine అంటున్నావు ముందు భగవద్గీత చదువు' అన్నారు. 'భగవద్గీత నాకొచ్చు' అంటే 'నీకేం రాదు' అని చెప్పారు. 'నువ్వు చదువు నేను చెప్తున్నాను కదా' అన్నారు, ఏదీ ౭౦౦ శ్లోకాలూ బట్టీయంగా వచ్చీ, వాటి తాత్పర్యం బాగా లోతుల్లో తెలిసిన మనిషికి 'నీకేం తెలీదు భగవద్గీత నేనివ్వాళ చెప్తున్నాను చదువుకో' అనిచెప్పారు ఆయన గురువు గారు ఆయనకి. మనకి ౭౦౦ శ్లోకాలలో ఏడు శ్లోకాలు కూడా నోటికి రావు, కృష్ణుడు ఎట్లా చెప్పాడో మనకి తెలియదు, ఏం చెప్పాడో తెలియదు, మనకెందుకు ఊరికే ఈ పుస్తకాలూ, ఆ పుస్తకాలూ? ఎంత వ్యామోహమో! గొప్పకి తీస్తాము తప్పా, అసలు మూలమైనది అక్కడే వున్నది. రెండు రుపాయలకి దొరికేది మనకి అక్కరలేదు ౭౦౦ రూపాయల పుస్తకం అట్ట చూసి మోజు పడ్తాం. ఎందుకిది చెప్పుకుంటున్నాం అంటే ఉత్తమ జ్ఞానాన్ని నువ్వు అందించావు అని భీష్ముడు చెప్తున్నాడు. జ్ఞానులందరిలో నీవు ఉత్తముడివి అని చెప్తున్నాడు. దానికి తార్కాణం ఏంటయ్యా అంటే భగవద్గీత! మనం భగవద్గీత శ్లోకం చదువుకోవడం, దాని అర్థం చదువుకోవడం, దాని మీద కాస్త భావన చెయ్యడం చెయ్యాలి. ఊరికే దానికి ఉండే టూకీ అర్థం తీసుకోండి దాని మీద మీరు భావన చెయ్యండి. ఒక అధ్యాయం క్షుణ్ణంగా భావం తెలుసుకోవడం కోసం ఒక సంవత్సరం అని పెట్టుకున్నా 18 సంవత్సరములలో అయిపోతుంది, లేకపోతే 18 జన్మలు పట్టినా మనకి భగవద్గీత తెలియదు. సరాసరి దేవుడే జ్ఞానమిచ్చింది ఇది ఒక్కటే ఇంకెక్కడా లేదు ఇది సత్యం And it is the Sacred Lore, మొత్తం భూమి మీద అది అతి పవిత్ర గ్రంథం. అన్ని ఆశ్రమాల్లో కూడా ఇదే పవిత్ర గ్రంథం ఇందులో యోగం ఉంది. ఒక్కో మెట్టు, ఒక్కో మెట్టు దేని తర్వాత ఏది ఎందుకిట్లా ఉంది అని ఆలోచించుకుని వాటి ఆచరించుకుంటూ వెళ్తూ ఉంటే చాలా అద్భుతమైన పురోగతి వస్తుంది.

౨౬౭ వీతభయుఁ

వీతభయుఁడంటే భయాన్ని తీసేస్తాడట. 'దేవుడ్ని తలుచుకుంటున్నామండీ భయంగా ఉందండీ' అంటే ఈ రెండూ కుదరదు. భయం వల్ల దేవుడిని తలచుకున్నా భాగవతత్త్వం లేదా నీవు నమ్ముకున్న దైవం లేదా నువ్వు నమ్ముకున్న గురువు సర్వ సమర్థులు అన్న భావం నీలో ఉంటే నీకు భయం ఉండదు. ఏమో ఆయనకే అంతంత మాత్రం తెలుసు నన్నేం ఉద్ధరిస్తాడు అన్న భావన ఉన్నదనుకోండి, పోనీ సరాసరి దైవాన్నే పట్టుకోండి. నీలో భయం ఆయన పారద్రోలతాడు, ఎప్పుడూ అంటే? He is there. He will take care of me. I don't care. నేను దేన్నీ లక్ష్యపెట్టను. నాకొచ్చిన కష్టాన్ని నాకర్తవ్యాన్ని నిర్వర్తిస్తాను, నా సంగతంటారా? వాడు చూసుకుంటాడు' అనుకున్నప్పుడు! చూసుకోవలసింది వాడు తప్పా, మనమా? మనం చూసుకుంటే ఎలా ఉంటుందో మనకి కనబడుతోంది కదా! Fear is mostly a self-generated illusion అంటాడు జ్వాలాకూలుడు. భయంలోకి వెళ్ళిపోతే నిన్ను నీవు భ్రమలో పెట్టుకుంటూ ఉంటావు. ఆ భ్రమ నిన్ను భగవంతుడి నుండి, భగవద్భావన నుండి కూడా దూరం చేస్తూ ఉంటుంది. భయం వచ్చినప్పుడల్లా దేవుడిలో ఉండు భయం పోతుంది. అలా ఉండలేమూ అంటే ఎవరన్నా శ్రవణం చేస్తున్నారు వినుఁ. నీవు కీర్తించు. కీర్తించలేము వినుగ్గా ఉంటీ పోని వినుఁ. అదీ పుణ్య శ్రవణకీర్తనఃఁ

953 పుణ్యశ్రవణకీర్తనః

మనలో వెలుగుని, నిర్మలత్వాన్ని, బుద్ధిని, సమస్తాన్నీ కేవలం విన్నా, కీర్తించినా పెంచుతాడట. అందుకే ప్రతి వ్రతకథలో చదివినా. విన్నా అని ఉంటుంది. క్రమమ తప్పకుండా కీర్తించు విను. కీర్తించలేవూ విను. కాని వినలేను, కీర్తిస్తాను అంటే కుదరదు. నీవు కీర్తించేది నువ్వు వినాలి. నువ్వు కీర్తించక పోయినా ఇంకొకడు కీర్తించేది విను. వినడం ప్రధానం కాబట్టే శ్రవణం ముందు పెట్టి కీర్తనం అని తర్వాత పెట్టారు. రుద్రం అంతా చదవలేమయ్యా చేసుకోవాలని యావ ఉన్నది, హాయిగా Tape పెట్టుకో. కళ్ళుమూసుకో వింటూ ఉండు. విష్ణుసహస్ర నామం చదవలేం ఓపికలేదు tape పెట్టుకుని వింటూ వుండు, వింటూ ఉంటే వచ్చేస్తుంది, అక్కడ నుండి కీర్తనలోనికిరా. శ్రవణం ద్వారా, కీర్తనం ద్వారా పుణ్యం పెరుగుతుంది. పుణ్యం అంటే మనలో ఉండే కళ, మనలో ఉండే వెలుగు, మనలో ఉండే వైభవం, మనలో ఉండే శ్రీ తత్త్వం ఇవన్నీ పెరుగుతాయి.

954 ఉత్తారణః

ఉత్తారణః అంటే ఉద్ధరించడం. ఎట్లా ఉద్ధరిస్తాడు? సత్త్వగుణపరమైన సత్కార్యాలు, సత్త్వగుణపరమైన ఆరాధనలు, సత్త్వగుణపరమైన ధ్యానములు, అంతా సత్త్వగుణపరంగా వెళుతూ ఉంటే దుష్కృత్యాలు తగ్గుతూ ఉంటాయి, దుఃస్వప్నాలు తగ్గుతూ ఉంటాయి. స్వప్నాలు అంటే మన లోపల పిడకల్లో పెట్టినవల్లా అక్కడ విచ్చుకుంటూ ఉంటాయి. ఏదో దొంగతనం చేయబోతే police పోలీసు వెంటపడినట్లుగా! దొంగ స్వభావం ఉంది అందుకని police వెంటపడుతూ ఉంటాడు. అక్కడ, ఇక్కడ అక్కరలేని చోట్లా తిరిగి వచ్చినట్లుగా ఉంటుంది. దుఃస్వప్నాలు అంటే ఇవే! చచ్చిపోయినట్లుగా కల వస్తూ ఉంటుంది. లేదా మన వాళ్ళు చచ్చిపోయినట్లుగా కల వస్తుంది. మనల్ని ఎవరో ఎత్తుకుపోయినట్లుగా కల వస్తుంది. ఎవరో తలకాయ పగలగొట్టినట్లుగా కల వస్తుంది. చాలా వస్తాయి. ఉలిక్కిపడి లేస్తూంటాం. ఈ దుఃస్వప్నాలు లోపల ఇంకా కార్యరూపం దాల్చక ముందు పిడకల్లో పెట్టినవి, మనకి అపుడప్పుడు కనబడేవి. అవి బాగా బయటకు వస్తే దుష్కృత్యాలుగా వుంటాయి. ఈ దుష్కృతాలని, దుఃస్వప్నాలని సత్త్వగుణపర ఆరాధన వల్ల, సత్త్వగుణపరమైన జీవితంలో బాగా ఇమిడి వుండడం చేత పుణ్యం పెరుగుతూ ఉద్ధారణ జరుగుతూ వుంటుంది. అది 'ఉత్తారణ' అంటే. 'ఉత్' అంటే ఊర్ధ్వగతికి వెళ్ళడం. ఊర్ధ్వగతి అంటే స్థూలం నుండి సూక్ష్మము అని అర్థం. స్థూలమైన ప్రకృతిలో ఇమిడి యున్న చైతన్యములో నుండి సూక్ష్మమైన ప్రకృతిలో ప్రవేశించడం ఊర్ధ్వగతి. వెలుగు లోకాల్లోకి ప్రవేశం. చీకటి లోకాలలో నుండి వెలుగు లోకాలలోనికి ప్రవేశాన్ని ఉత్తారణం అన్నారు. అది పుణ్యం వలన కలుగుతుంది. దుష్కృతులు హరింపబడతాయి, దుస్వప్నాలు కూడా హరింపబడతాయి.

255, 256 దుష్కృతిహా, పుణ్యాః

పుణ్యమంటే మనం చేసిన సత్కర్మల వలన మనలో పెరిగిన కాంతి, వెలుగు. దాన్నే శ్రీ అంటారు. పుణ్యం ఒక పక్కనుండి పెరుగుతూంటే, సత్కర్మలు బాగా జరుగుతూంటే, భగవత్కీర్తనం బాగా జరుగుతూంటే, దుష్కృతిహా అంటే మనలో చేయకూడని పనులు (దుష్కృతులు) చేయడం అనేది హరింపబడుతుంది. మామూలుగా మనం చేయకూడనివి, చేయవలసినవి కూడా చేస్తుంటాం. భగవద్భక్తుడు భక్తిమార్గంలో, సత్త్వగుణోపేతమైన ఆరాధనలో ఉండాలి. ఎందుకంటే రజోగుణ ఆరాధనలోనూ, తమోగుణ ఆరాధనలోనూ మితిమీరిన అహంకారం పెరిగి మనిషి తప్పుదారిలో పడ్డ కథలు మనకి చాలా కనిపిస్తాయి. అందుకని ఆరాధన ఎప్పుడూ సత్త్వగుణోపేతమై ఉండాలి. సత్కార్యాలు, సంకీర్తనలు, ఆరాధనలు సత్త్వగుణ పరంగా జరుగుతూంటే పుణ్యం పెరుగుతుంది. పుణ్యం పెరుగుతూంటే చెడ్డపని చేయని ఆత్మనియతి లోపల నుండి వస్తుంది. అంతేగానీ వాళ్ళు వీళ్ళు చేయకూడదన్నారనో, వాళ్ళు వీళ్ళు చూస్తే బాగుండదేమో అనో, బయటకి బింకంగా ఉండడం లోపల దానికి సంబంధించిన బీజాలు బలంగా ఉండి కేవలం సంఘపరంగా బావుండదని చేయకుండా ఉండడం వేరు. 'Morality is lack of opportunity' అని మనకు ఒక నీతి వాక్యం. నీతిమంతుడు ఎవరయ్యా అంటే అవకాశంలేక నీతిమంతుడు తప్పా, అవకాశం ఉంటే నీతిమంతుడిగా ఉండడం అనేది ఎంతో పుణ్యాత్ములకు గానీ వీలుపడదు. లంచం లేని ఉద్యోగాలలో ఉండి లంచాలు తినే ఉద్యోగిని ఎద్దేవా చేస్తారు. మనం కూడా లంచం తీసుకోగలిగే ఉద్యోగంలో ఉండి మన చుట్టూ రకరకాల ప్రలోభాలు పెట్టేవాళ్ళున్నప్పుడు లంచం పుచ్చుకోకుండా ఉన్నామంటే అదీ లెక్క! అలాగే ఎక్కడా స్త్రీ జనంలేనిచోట పురుషుడు జీవిస్తూ 'తాను బ్రహ్మచారిననీ, స్త్రీ వ్యామోహం లేదు, స్త్రీ సాంగత్యంలేదు' అని అనడం వేరు. అందమైన స్త్రీల మధ్య, అందుబాటులో ఉన్నప్పుడు, ఎవరూ కాదనకుండా ఉన్నప్పుడు వారిని అందుకోకుండా ఉండడం నిజమైన బ్రహ్మచర్యం. భక్తుడికి 3 రకాల పరీక్షలు ఉంటాయి.

1. వీడిలో ధనకాంక్ష ఎలా ఉన్నది?

2. వీడిలో కీర్తి కాంక్ష ఎలా ఉన్నది?

3. వీడిలో స్త్రీ/పురుష వ్యామోహం ఎలా ఉన్నది?

స్త్రీకి పురుషుని యందు, పురుషునికి స్త్రీ యందు ఎవరూ చూడడం లేదు, ఒకరికొకరు అనుకూలంగా ఉన్నారు, ధర్మసమ్మతం కాకపోయినప్పటికీ ఫరవాలేదుట అన్న కథలు బోలెడు చెప్పారు. అది ధర్మ సమ్మతం కానప్పుడు, ఆ విధంగా అవకాశం ఉన్నప్పటికీ, ఎవరూ గుర్తించకుండా ఉన్నప్పటికీ ధర్మసమ్మతంగా ప్రవర్తించడం అనేది 'సత్కృతి'. అంతేగాని అవకాశం లేక... మనం చెప్తాము కదా 'అందని ద్రాక్ష పళ్ళు పులుపు' అని. అన్నీ అందుబాటులో ఉండగా వేటియందూ వ్యామోహం లేకపోవడం అనేది పుణ్యాత్ములకి మాత్రమే సాధ్యం. మామూలుగా పుణ్యాత్ములనుకునేవాళ్ళందరూ ఎట్లా ఉంటారంటే సాదా పుణ్యాత్ములు అవకాశాలు లేక అలా ఉంటారు. ఉండి, వాటియందు వ్యామోహం లేకుండా ఉండడం అనేది చాలా కష్టం. అందుకనే మహాభక్తులకు కూడా చిట్టచివర సమయంలో ఈ స్త్రీ పరిక్ష ఒకటి ఉంటుంది భక్తుడికి తుకారాం కథ తెలిసే ఉంటుంది. మాష్టారుగారు కూడా రాశారు. సృష్టిలో లలితయొక్క రహస్యములలోనికి ప్రవేశించడానికి స్త్రీ యొక్క పరిపూర్ణమైన సహకారం కావాలి. అది జరగాలంటే స్త్రీ తో తన ప్రవర్తన చాలా ధర్మసమ్మతంగా ఉండాలి. అలా కానప్పుడు అది దొరకదు. అది దొరక్కపోవడంవల్ల మంచివారుగా ఉండిపోయినవారు 90%. అది దొరికినా అలా ఉండగలిగిన వాళ్ళే లెక్క. శ్రీకృష్ణుడు తన చుట్టూ ఎంత మంది స్త్రీలు ఉన్నప్పటికీ ఎవర్నీ ఆ విధంగా అందుకోలేదు. శ్రీరాముడిగా ఎవ్వర్నీ అలా అందుకోలేదు. భక్తులందరికీ కూడా దుష్కృతములు లోపల హరింపబడి ఉంటాయి. దాచబడి ఉండడం వేరు, హరింపబడి ఉండడం వేరు. దాచబడి ఉంటే లోపల విత్తనం ఉండడం వల్ల, అవకాశం వచ్చినప్పుడు అది మొలకెత్తే అవకాశం ఉంటుంది. Switzerlandలో ఒక గురువుగారు, శిష్యుడు కలిసి రోడ్డు మీద విహారంగా ఓ సాయంకాలం బయల్దేరారు. శిష్యుడు గురువు గారితో ఏదో తత్త్వం విషయం మాట్లాడుతుంటే అవతల ప్రక్క నుండి చాలా అందమైన యువతి ఇటువైపు నడచి వస్తోందిట. వస్తుంటే ఈ ఇంత శిష్యుడూ,

తత్త్వబోధ గురించి అడుగుతూ వింటున్నవాడు, ఇది మర్చిపోయి ఆమెను అలా కాసేపు చూసేసి, మెడ ఆమె వెళ్ళే వరకు తిప్పి మళ్ళీ మామూలుగా గురువుగారి వద్దకు వచ్చేశాడు. గురువుగారు చూడలేదు అనుకున్నాడు. 'నేను వెళ్ళి ఆ అమ్మాయితో మాట్లాడనా' అని గురువుగారు అన్నారు. చాలా పాగరుమోతు గురువు అంటే చీరేసే పద్ధతి ఆయన దగ్గర. 'ఏం మాట్లాడుతారూ' అని అడిగాడు. అదే 'ఈ రాత్రికి నీతో ఉంటుందేమో' అని అడుగుతాను అన్నారు. ఎలా ఉంటుంది శిష్యుడికి? 'అదేంటండి' అంటే, 'భావంలో అప్పుడే అక్కడ వరకు వచ్చావు కదా! ఇంక ఊరికే చేతలోనే కదా ఇక మిగిలింది. భావంలోకి వచ్చాక ఇహ దానికి విలువ పోయింది' అని అన్నారుట. మంద్రజాలంలో మాష్టారు రాస్తారు, celibacy అనేది physical అనుకోవడం childish అని., భౌతికంగా ఎవర్నీ ముట్టుకోలేదుట అంటే సంఘానికి భయపడి ముట్టుకోలేదట. అదికాదు బ్రహ్మచర్యం. మనవాళ్ళు ఆ దేశాలకు వెళ్ళినప్పుడు చాలా విచ్చలవిడిగా అయిపోతుంటారు. ఎందుకంటే సంఘంలో కొంత అంగీకారం ఉంది. వాళ్ళయొక్క president గారే చెత్తపని చేసినా వాడ్ని ఏమీ అనకుండా వదిలేసిన దరిద్రపు సంఘం. అటువంటి సంఘంలో ఉన్నప్పుడు నీవన్నీ బయటకి వస్తాయి. నీ వికారాలన్నీ ఎప్పుడు బయటకి వస్తాయంటే అవకాశం ఉన్నప్పుడు వస్తాయి. అంత మాత్రం చేత నువ్వు మంచివాడవని అనుకోవడానికి లేదు. కారణం, ఇవన్నీ నీ లోపల ఉన్నాయి. విచ్చుకోవడానికి అవకాశం రాలేదు. పూర్ణ అవకాశం వుండి, ఏ అభ్యంతరాలు లేకపోయినా ధనం ముట్టుకోలేదుట, స్త్రీని ముట్టుకోలేదుట, కీర్తిని కాంక్షించ లేదుట అంటే అప్పుడు దుష్కృతాలు వీడిలో హరించుకుపోయే అవకాశం వుంటుంది. ఈ విధంగా సత్త్వగుణ పరంగా ఆరాధన చేసుకునే వారికి హరింపబడతాయి. ఒక గురువుగారి చుట్టూ చేరే శిష్యులలో కూడా రకరకాల భావాలుంటాయి. ఎందుకంటే ఆ గురువుగారిలో వుండే వెలుగు ఒక్కొక్కరిని ఒక్కొక్క విధంగా ఆకర్షిస్తుంది. ఆకర్షిస్తుంటే, ప్రతీ ఆశ్రమంలో కూడా భక్తి పేరున కొంత మంది భక్తులు వెకిలిగా ఉండడం అనేది వుంటుంది. తెలిసినప్పటికీ వాడి బలహీనత అని ఊరుకుంటారు గురువుగారు. అప్పుడప్పుడు అవసరం చూసి వాత పెడుతూంటారు. అందుకని పుణ్యం పెరగడం వలన మనలో ఉండేవి, మనకు

హానికరమైన ఈ విషబీజాలు హరింపబడాలి తప్ప, వాటిని ఊరికే మనం మూత పెట్టి వుంచితే అవకాశం వస్తే విజృంభిస్తాయి. ఎంతటి వాడికైనానూ విజృంభిస్తాయి. అదే మనకు తపస్సు చేసుకునే వారి దగ్గరకు పరీక్షగా ఇంద్రుడు వాళ్ళను, వీళ్ళను పంపడం అంటే. ఇంద్రుడు అంటే మనస్సే కదా! మన మనస్సులో నుండే ఒకొక్కటి బయటకి వస్తుంది. సాధన చేసినపుడు కూడా ఇవన్నీ బయటకు వస్తాయి. ఎందుకంటే విసిరి పారెయ్యాలి కదా లోపల! వచ్చినప్పుడు వాటిని జాగ్రత్తగా, గురువు అనుగ్రహం చేత దాటాలి తప్ప వేరే పద్ధతి లేదు. అందుకనే భక్తులు దుష్కృత్యాలు చేయరని ఏమీ లేదు, ఎప్పుడు చేయరంటే అట్లా పడివుంటే సత్త్వగుణంలో, పుణ్యం పెంచుకుంటూ వుంటే దుఃస్వప్నాలుండవు, దుష్కృతాలు వుండవు. దుష్కృతాలు హరింపబడతాయి. చేయమన్నా చేయలేడు. వాడివల్ల కాదంతే. కదా. అర్జునుడ్ని ఇంద్రలోకంలో ఉండే ఊర్వశి వచ్చి 'భూలోకంలో నీలాంటి అందగాడు లేడు, ఇక్కడ ఎవరూ లేరు, మా సంఘంలో పట్టింపులు ఏమీలేవు, ఇటువంటి ఆచారం మాకుంది, నన్ను వరించమని' కోరుతుంది. మిగతావాళ్ళయితే ఏమయ్యేదో గానీ అర్జునుడు మాత్రం 'తప్పు. అలా చేయకూడదు'. అని చెప్తాడు కదా! రకరకాలుగా ఉంటాయి. ఎవరికి లోపల ఎలా, ఎక్కడ మొలుస్తాయో తెలియదు. లోపల అంతా పెంట కుప్ప. దాన్నిండా పెంటవిత్తనాలూను. బయటకు ఏమీ తెలియదు 'మేడి పండు చూడ మేలిమై యుండు, పొట్ట విప్పి చూడ పురుగులుండు' అన్నట్లు. మనలో మనకి ఎన్ని పురుగులున్నాయో తెలియదు. అద్దంలో ముఖం చూసుకుని ఏదో మనం చాలా మంచివాళ్ళం అని అనుకుంటూంటాం. ఊర్వశి ఎంత ప్రలోభ పెట్టినా అర్జునుడు లొంగడు. అప్పుడు ఇంద్రుడు సంతోషిస్తాడు. సంతోషించి ఆయనా వరమిస్తాడూ, అవిడా వరమిస్తుంది. అందుకని ప్రతి పరిక్షలోంచి ఒకొ్క వరం ఉంటుంది, ఒకొ్క శాపం ఉంటుంది. పరిక్షలో పడ్డావా, ఒక రెండు మూడు జన్మలు వెనక్కి వెళ్ళిపోయి మళ్ళీ రావలసి వస్తుంది. Pass అయ్యావా రెండు మూడు నిచ్చెనలు దొరుకుతాయి. వైకుంఠపాళే! అందుకని ఇవన్నీ మనకి మన వల్ల అవుతాయా? పోగొట్టుకోవడం మనవల్ల కాదు. చాలా కష్టం. ఏవేవో ఉంటాయి ఎప్పటెప్పటి సంస్కారాలు ఉంటాయి. జంతువులుగా బయలుదేరినప్పటి నుండి ఇప్పటి వరకు ఎన్నెన్ని

సంస్కారాలూ? కొన్నితీరి, కొన్నితీరక ఏదో pass అవుతూ వస్తూంటాం. ఇంకా మిగిలిపోతాయి. వందకి వంద మార్కులూ అన్నింట్లోనూ వచ్చి పై తరగతులలోకి వచ్చిన వాళ్ళము కాదు కదా! ఏదో వాళ్ళు కూడా తోసెయ్యమంటూంటారు. Moderation చేస్తే తప్ప వీళ్ళు మనుషులవ్వరండీ అంటే పోనీ తోసెయ్యమంటారు. ఏదో నాలుగు మార్కులు కలిపి, 35, 40 మార్కులతో pass అయ్యి వచ్చిన వారమే గానీ మిగతా 60, 65 మార్కులు లేవుగా. వాడి కారుణ్యం చేత తోయబడ్డావు గాని నీలో పశుప్రవృత్తి చాలా ఉంటుంది కదా! మరి అది పోయేంత వరకు దుష్కృతాలు పిడకలో పెట్టిన విత్తనాల్లా ఉంటాయి. మాష్టరు EK గారికి ఆ మాట చెప్పడం చాలా ఇష్టం. 'ఏం లేదురా అన్నీ పిడకలో పెట్టి ఉంచారు. ఒక్కొక్కడూ అవకాశం వస్తే మర్రిచెట్టల్లే విచ్చుకుంటాడు. ప్రతి ఛండాలపు విషయంలో కూడా' అని అనేవారు. మరెలాగా అంటే ఈ లోపల సత్త్వపరమైన ఆరాధన, సత్త్వపరమైన సేవ, సత్కార్యము చేసుకోవాలి. మనకి సేవ చాలా రజస్సుగా గోచరిస్తుంది ఈ రోజుల్లో. గొప్పకు చేయడమే ఎక్కువ. పదిమందికి తెలియాలని చేయడము ఎక్కువ, చేసి చెప్పుకోవడము ఎక్కువ. ఎవరూ మాట్లాడకపోతే మనమే వాళ్ళను పిలిచి, సభ ఏర్పాటు చేసి, ఇట్లా చేసుకున్నాము ఈ సంవత్సరం అంతా అని నెమరు వేసుకోవడం ఎక్కువ. ఇదంతా రజోగుణ సంబంధిత సేవ తప్ప ఇందులో జీవుడు పెరగడు. జీవుడు సంస్కరింపబడడు. జీవుడికి పుణ్యమనే సంస్కారం రాదు. అందుకని దుష్కృతిహా, దుస్స్వప్న నాశనః, పుణ్యః అని ఇచ్చారు.

౨౫౮, ౨౫౯, ౨౬౦, ౨౬౧ వీరహా, రక్షణఃి, సంతఃి, జీవనఃి

వీరులను కూడా చంపుతాడట. మనలో కూడా కొన్ని కొన్ని భయంకరమైన సామర్థ్యాలు వుంటాయి. అంటే రజోగుణ ప్రేరితమైన సామర్థ్యాలు, తమోగుణ ప్రేరితమైన సామర్థ్యాలు. వీటినే ఆసురీ సామర్థ్యం లేదా ఆసురీ శక్తి అంటారు. సురశక్తి, ఆసురీశక్తి అని రెండు. ఆసురీశక్తి యొక్క ముఖ్యమైన పద్ధతి ఆక్రమించడం, ఇతరులను దమించడం. వారిని మనం మన బలంచేత, మన తెలివి చేత, మనకుండే వివిధములైన బలములతో అంటే బుద్ధి బలం, మనోబలం, కాస్తో కూస్తో ఉన్న ఆత్మబలం, శరీర దారుఢ్యం ఇవన్నీ పెట్టి ఎదుటి వారివన్నీ మనం దోచుకుంటాం. అబ్బో చాలా గొప్పవాడని ఊళ్ళోవాళ్ళు అనుకుంటూ వుంటారు. వెనకాల తిట్టుకుని, ముందు పొగుడుతూంటారు. రాక్షసులు కూడా అంతే కదా. ఆక్రమిస్తుంటారు. మనలో రాక్షసత్వం వుంటుంది. దాన్ని సంహరించడం అనేది ఈ మార్గంలో జరుగుతూ వుంటుంది. ఉత్త తెలివితేటలతో పనిచేయడం కాదు, తెలివి తేటలకు సద్గుణమ్ముల బలిమి కూర్చాలని మాస్టరుగారు వ్రాసారు కదా, 'తెలివికిని సద్గుణమ్ము ల బలిమి కూర్చి' అని 'let virtue be the strength of my intelligence' అని. గుణ సంపద వున్నవాడు తెలివి గలవాడైతే, చాలా ఉపయోగపడతాడు. తెలివి లేక గుణ సంపద వుంటే ఏదో వాడి వరకూ అలా బ్రతుకుతూంటాడు. గుణ సంపద లేక తెలివుంటే లోకకంటకుడవుతాడు. అది చెప్పడానికే మనకి కర్ణుడు v/s అర్జునుడుగా చెప్తారు. కర్ణుడు చాలా వీరుడు, అర్జునుడూ వీరుడే. కర్ణుడు అర్జునుడి కన్నా వీరుడే, కానీ గుణ సంపద లేదు. అసలు కర్ణుడు లేకపోతే భారత యుద్ధమే లేదు. అసలు కర్ణుడి బలం చూసుకునే దుర్యోధనుడు యుద్ధంలోకి దిగుతాడు, ఎందుకంటే దుర్యోధనుడికి మొదటి నుండీ అనుమానమే, ఈ భీష్మ ద్రోణులకు పాండవులంటే ఇష్టం, ఎక్కడో మనల్ని జార్చేస్తారని, వీళ్ళని నమ్ముకుని లాభంలేదు, వీళ్ళని వాడుకోవాలి అంతే. మనకంటూ పనికి వచ్చినవాడు కర్ణుడే అనే లెక్కతో కర్ణుడ్ని నమ్ముకుని యుద్ధంలోకి దిగుతాడు. కర్ణుడి యొక్క వీరత్వం ఎటువంటి వీరత్వం? అధర్మంతో కూడినది, రాజసంతో కూడినది. అహంకారంతోనూ,

౨౫౮, ౨౫౯, ౨౬౦, ౨౬౧ వీరహా, రక్షణఃసంతఃజీవనఃసంతఃజీవనఃసంతఃజీవన

౨౫౮, ౨౫౯, ౨౬౦, ౨౬౧ వీరహా, రక్షణఃసంతఃజీవనఃసంతఃజీవనఃసంతఃజీవన

౨౫౮, ౨౫౯, ౨౬౦, ౨౬౧ వీరహా, రక్షణఃసంతఃజీవనఃసంతఃజీవనఃసంతఃజీవన

౨౫౮, ౨౫౯, ౨౬౦, ౨౬౧ వీరహా, రక్షణఃసంతఃజీవనఃసంతఃజీవనఃసంతఃజీవన

౨౬౭ పర్యవస్థితః

పరి, అవస్థ అంటే final transformation. మనం ఉన్నప్పుడు పొంగుతాం, పోయినప్పుడు కుంగుతాం. ఇవన్నీ చాలా సహజంగా ఉంటాయి. ఇట్లా ఏ రోజు నవ్వుతామో, ఏ రోజు ఏడుస్తామో తెలియని వాడితో వాడికి ఏం సుఖం. పిల్లవాడు ఇప్పుడు బానే నవ్వుతున్నాడండి, చెప్పలేమండీ next moment లో ఏడవచ్చు అన్నట్లుగా ఉంటుంది. ఎప్పుడు ఏడుస్తాడో తెలియదు, ఎప్పుడు నవ్వుతాడో తెలియదు, ఎప్పుడు పొర్లుతాడో తెలియదు. కదా. వాడు ఎప్పుడూ ఒకే స్థితిలో, ఒకే ఆనంద తరంగాలలో ఉండాలంటే యెంత పని? ఇంత పని. ఈ శ్లోకంలో చెప్పినంత పని. అందుకని పుణ్యాన్ని పెంచి, దుష్కృతులు తగ్గించి, దుస్స్వప్నాలు తగ్గించి తామస, రాజసములలో కూడిన శక్తి సామర్థ్యలు తగ్గించి, నీలో సత్త్వాన్ని పెంచుతాడు. నీలో మార్పులన్నీ ఒక్కోటి జరుగుతూంటే నెమ్మదిగా ఇవన్నీ కావడి కుండలని తెలుస్తుంది. వాడికి ఎంత ధైర్యం అయితే వాడు ఆ మాట అన్నాడు దేవదాసు! 'కుడి ఎడమైతే పొరబాటు లేదోయ్' అన్నాడు చచ్చిపోవు కదా. చాలు ఆ పాట చాలు మన జన్మకి. కుడి ఎడమయినంత మాత్రాన ఓడిపోలేదు నువ్వు అంటున్నాడు. అంటే అటుదిటయ్యిందని చెప్పడమన్నమాట. ఓడలు బండ్లయినాయి, బండ్లు ఓడలయినాయి. 'కుడి ఎడమైతే పొరపాటు లేదోయ్ ఓడిపోలేదోయ్'. వ్రాసిన వాడు ఎంతటి వాడై ఉండాలి? వాడందులో బాగా వేదం సారం చూసినవాళ్ళే వ్రాసేవారు పాటలు ఆ రోజుల్లో. కావడి కుండలు, 'ఒకదాంట్లో కష్టం ఒకదాంట్లో సుఖం, రెండు నువ్వే మోసుకుపోతున్నావు' అని చెప్పాడు. జీవితంలో, ఉన్నంతకాలం కావడి మోస్తూ ఉంటే ఒక కుండలో కష్టం ఒక కుండలో సుఖం ఉంటుంది. ఉత్త సుఖం ఉండదెప్పుడూ, ఉత్త కష్టం ఉండదెప్పుడూ. 'సంసార జలధిలో కష్టసుఖాలు తరంగాలు కావా, ఇది ఎరుంగవా జీవా' అంటూ ఒక పాట. 'వెధవా ఈ మాత్రం తెలీదా' అన్నట్లొక పాట. ఏమిటో ఇంత తెలుసుంటాం, అది తెలియదు మనకి. ఇవన్నీ మనం మామూలుగా ఇంకొకళ్ళకి, ఈ పూట బాగా తిని, మధ్యాహ్నం హాయిగా నిద్రపోయి, సాయంత్రం స్నానంచేసి కమ్మగా కాఫీ తాగి కూర్చొని చక్కగా చెప్పవచ్చును. అదే మనకి అలా

నడుస్తుంటే కాలికి చిన్న గుండు సూది గుచ్చుకుంటే చూడాలి మన పరిస్థితి. ‘Brainless fellows, useless fellows వెధవలంతా చేరారిక్కడ, గుండుసూదులు ఇలా పారేస్తారా’ అని, ఒక సహస్రం చదివి కదా వెళ్తాం. ఏమయ్యిందీ? పర్యవసానం అంటే ఏమిటయ్యా అంటే ‘all is ok boss’ అంటారు చూశారా, వాళ్ళూ భాగవతులు. చాలా బాగుంటుంది. చదువుకుంటూంటే బాగుంటుంది, ఆ సమయం వచ్చినప్పుడు అవుతుంది. కనీసం, ఆ స్ఫూర్తిలో అలాంటివాడ్ని వాడ్ని చూసినప్పుడన్నా, ‘ఇతడూ మనకి కథానాయకుడు. ఇతడిలా మనం ఆచరిస్తే బావుంటుంది అనుకోగలుగుతాం.’యద్యాదాచరతి శ్రేష్ఠః’ కదామరి. ఇవాళే అలా అయిపోలేం. అది మనకి తెలుసు. కానీ ఇలా ఉన్నవారు ఉన్నారని తెలిసిందనుకోండి, ఇట్లా కూడా ఉండవచ్చు, ఇట్లా ఉండడంలో ఆనందం తెలిసి. ‘ఓహో ఇతగాడు ఇందుకే ఇంత ఆనందంగా ఉన్నాడు’ అని తెలుస్తుంది. ఎందుకు ఆనందంగా ఉన్నాడంటే, it’s Ok for him. అంతా భగవంతుడి సృష్టిలో అన్నీ వస్తూంటాయి, పోతూంటాయి. It came to pass అన్నాడు కదా! అది తెలిసి, అదొక్కటే సత్యం, మిగతావి వస్తాయి, పోతాయి అని తెలుస్తుంది. కీర్తి వస్తుంది, పోతుంది. అపనింద వస్తుందీ, పోతుంది. అపనిందలు కూడా వస్తాయి. రాముడంతటి వాడికి వచ్చింది, కృష్ణుడంతటి వాడికి వచ్చింది. ఈయనే శ్యమంతకమణిని కాజే డని వచ్చింది కదా? ఈ రోజు దేవుడంటారు, రేపు దొంగ అంటారు. అందుకని దేవుడన్నవాళ్ళని మనం అలా ఉంచాలి తప్ప, ఎక్కించుకోకూడదు. దొంగన్నవాడిని కూడా అలా ఉంచాలి తప్ప ఎక్కించుకోకూడదు. ఎందుకంటే దొంగ అన్న వాడే దేవుడనచ్చు, దేవుడు అన్నవాడే దొంగనచ్చు. ఏదైనా అనొచ్చు. ఎవరు ఎప్పుడు ఏదైనా అనచ్చుట. అట్లా ఉంటుంది. అంతా నువ్వు అనుకోవడమే అన్నట్లుగా వాడి వైభవంగా చూడడం ‘పర్యవస్థితః’.

೨೬೩ అనంతరూపః

అనంతరూపః అంటే అనంతమైన రూపాలు అని అర్థం. మనకి తెలిసినవి చాలా తక్కువ. సృష్టిలో 84 లక్షల జీవరాశులు ఉన్నాయి అని చెప్తారు. మనమెన్ని చూశాం? ఒక వెయ్యి కూడా చూసి ఉండము. లెక్కపెట్టండి మనకి తెలిసినవి. ఒక దోమ నుండి లెక్కపెడితే ఒక వెయ్యి కూడా చెప్పలేము. 84 లక్షల జీవరాసులుట. దేని రూపం దానిదే. ఇవన్నీ కూడా వర్గాలు. 84 లక్షలు. అంతే గాని జీవాలు కాదు. ఇంతమంది మనుషులు ఉన్నారు. 84 లక్షలేనా అండి మనమే ఒక 100 కోట్లు ఉన్నాం కదా భారతీయులం అని చెప్పచ్చు కదా. 21లక్షలు అందులో మానవులుట. అంటే 21లక్షల వర్గాలుగా చెప్తారు. ఇన్నిటిలో మనిషిని పోలిన మనిషి ఉండడు. జంతువుని పోలిన జంతువుండదు. మనకు అన్నీ ఒకటిగానే కనిపిస్తాయి. అన్ని గేదెలూ మనకు ఒకేలా అనిపిస్తాయి కానీ గేదెలకు వాటిలో వాటికి తెలుస్తుంది difference. వాటికి మనం అన్నీ గేదెల్లాగే కనిపిస్తాము. ఇవన్నీ ఒకటే కదా అనుకుంటాము. అవి మనకి మంద, వాటికి మనం మంద. కానీ వాటిల్లో వాటికి తెలుస్తుంది తేడా. అట్లా అరణ్యంలో మృగాలన్నింటికీ ఎవరి గుంపులో ఎవరెవరో వాళ్లకు తెలుస్తుంది, అన్నయ్య ఎవరో, తమ్ముడు ఎవరో. ఎన్నో అంటే 'అనంతం' అన్నారు. దీనికి అంతం లేదు నాయనా, ఒక పక్క నుండి వెళిపోతుంటే మరొక పక్క నుండి పుట్టుకొస్తుంటాయి. లెక్కలేనన్ని అని చెప్పడం ఒకటి, ఎప్పటికీ అవ్వవు అని చెప్పడం ఇంకొకటి. అంతం లేదు. హమ్మయ్య అయిపోయింది అంటే అవ్వలేదు అంటాడు. ఒక పక్క అయిపోతుంటే ఒక పక్క వస్తూ ఉంటాయి. అది కదా! అందుకు ఉదాహరణగా నదిని చెప్పుకున్నాము. అయిపోతూ ఉంటే వస్తూ ఉంటుంది. ఎన్ని రూపాలు? అనంత రూపాలు.

264 అనంతశ్రీః

అంటే అనంతమైన వైభవాలు. భగవంతుని వైభవం ఎంత చెప్పినా తరగదని అందుకని వాళ్లంటారు, తెలిసినవాళ్ళు. మనం మహా చెప్పకోగలమేమో ఒక 100 చెప్పకుంటాం. ఒక వెయ్యి చెప్పకుంటున్నాము గత ఆరేళ్ల నుండి. చెప్పకుంటూనే ఉన్నారట ఇంకా తెమల లేదుట చాలామందికి. నైమిశారణ్యంలో అట్లా వింటూ ఉన్నారట కనురెప్ప కూడా ఆర్పకుండా. ఎన్ని రకాల వైభవాలో భగవంతునికి! మనకు అంతు పట్టనన్ని Splendors/ విభూతులు. రకరకాల విభూతులు చూస్తూ ఉంటాం. ఒక్కొక్క మహాత్ముడి దగ్గర ఒక్కొక్క రకమైన విభూతి కనిపిస్తుంది. అందరూ ఒకే రకమైన విభూతి కాదు. ఎవరి విభూతి వారిది. అంటే అక్కడ భగవంతుడు ఆ విధంగా అవతరించి ఉంటాడు. ఒక్కొక్క మహాత్ముడికి వారి యొక్క ప్రత్యేకమైన ఒక పద్ధతి కనిపిస్తుంది. అందరిలోనూ ఒకటి common గా కనిపిస్తుంది ఏమిటయ్యా అంటే ప్రశాంతత, ప్రేమ, వికాసాన్ని ఇవ్వడం ఇవన్నీ ఉండగా ఎవరి విభూతి వారిది ప్రత్యేకంగా ఉంటుంది.

౨౬౬ జితమన్యుః

మన్యు (మన్యువు) అంటే క్రోధం, కోపం. అందుకే మనం రుద్రాభిషేకంలో కూడా అడుగుతాం నీ మన్యువు యొక్క అల్లెతాడు తీసేయమని. మామీద కోపం చూపించక, అని అడుగుతాం. 'నమస్తే రుద్ర మన్యవ ఉతోత ఇషవే నమః' అంటాం. బాబూ, నీకు కోపము వద్దు అని. ఎందుకని ఆయన కోపం? మనం చూపించిన కోపమే ఆయన తిరిగి మనకు return with thanks చేస్తాడన్నమాట. ఎవరి మీద మనం కోపం చూపించినా, అది ఇంకోళ్ళద్వారా మనకి పట్టుకొచ్చి మనకు ఇచ్చేస్తుంటాడు, రుద్రుడు. అదే major పనిగా పెట్టుకున్నాడు రుద్రుడు. మనం ఎవరి మీదయినా బాణాలు వేశామనుకోండి... మాటలతోనో, చేతలతోనో ఏదో రకంగా చేశామనుకోండి, ఆ బాణాలు తిరిగి మన దగ్గరకు వేయిస్తాడన్నమాట. అది 'రుద్రమన్యువు' అన్నారు. ఏంటి ఆ మన్యువు అంటే నువ్వు చూపించిన క్రోధం మళ్ళీ నీకు అందజేసేటటువంటిది. మన్యుసూక్తం ఒకటి ఇచ్చారు ఇది తగ్గడం కోసం. ఇతరులకు అపకారం చేయకుండా, ఇతరులను బాధ పెట్టకుండా మనం ఉండటం కోసం, మనలో ఉండే అంతఃశత్రువులందరూ నాశనం అవ్వడం కోసం మన్యుసూక్తం. ఒకడుంటాడు మనలో. బుస్సు మని లేస్తుంటాడు ప్రతిదానికి. మన permission కూడా తీసుకోడు. బొత్తిగా మనతో వాడికి సంబంధం లేదు. అట్లా లేచిపోయి పనిచేసేసి, కొంచెం బీభత్సం చేసి మళ్లీ వచ్చి కూర్చుంటాడు. అప్పుడు మనం ఏడుపు మొహం పెట్టుకుని కూర్చోవాలి. ఛీ-- ఎన్నాళ్ళు పోయినా నువ్వు ఇంతే కదా అని, అనిపిస్తుంది కదా మనకి. ఇటువంటివి చేస్తూనే ఉంటాం. ఆయన జితమన్యుడుట. అంటే ఇవన్నీ దాటేశాడుట. ఇక్కడ దాటేసిన వాళ్ల రూపంలో ఆయన ఉన్నాడని కూడా తెలుసుకోవాలి. ఆయన దాటేశాడు అనడం పెద్ద విషయం కాదు. ఈయన దాటాడు అని, భీష్ముడు చెప్తున్నాడు. అది దాటిన వాళ్ళు మహాత్ములు మనకు కనిపిస్తూ ఉంటారు. ఎప్పుడు దాటుతారండీ, ఏ స్థితిలో ఈ మన్యువు ఉండదు, మన్యువును జయించినవాడు అవుతాడు అంటే మాస్టర్ గారు ఒక చక్కటి వాక్యం వ్రాశారు 'నేనున్నాననే భావం మరచిపోయిన వాడు దాటతాడు' అని. 'నేనున్నాను'

అనుకోవడం అహంకార ప్రజ్ఞ. అది ఉన్నంతసేపూ మన్యువు పక్కన ఉంటుంది. వాడున్నాడు నా రూపంలో అనుకుంటే ఉండదు. వాడే నేనుగా ఉన్నాను అని గుర్తున్న వాడికి ఉండదుటండీ. అట్లా వాడితో ముడిపడి ఉంటే సత్త్వంలో ఉంటాం. ఉండడం చేత మన్యువు ఉండదు. లేకపోతే మన్యువుకి మనం బద్దులమై ఉంటాం. భగవంతుడు లేక భగవత్ తత్త్వము యందు పరిపూర్ణంగా జీవించే వాళ్లకు అది ఉండదు. వాళ్ల నాన్న మీద ఎంత కోపం రావాలి ప్రహ్లాదుడికి? రావణుడి మీద ఎంత కోపం రావాలి రాముడికి? సీతకే కోపం రాదు. అది చూడండి. వీడు అజ్ఞాని, మూర్ఖుడు అని, పాడైపోతున్నాడని సీతాదేవి ఎక్కువ బాధపడుతుంది. అంతేగాని వాడేదో ఈవిడని చేసేస్తాడేమో అని భయం ఆవిడకు లేదు. ముట్టుకుంటే చస్తాడు. ఎందుకంటే ఒక గడ్డిపోచతో మాట్లాడి ఇదే రావణుడిగా నేను భావన చేసి మాట్లాడుతున్నాను అనేంత level లో మాట్లాడింది కదా ఆవిడ. అంటే నువ్వు ఇంతే రా నా ముందు, అన్నట్లుగా చెప్పిందావిడ. అంతకంతకీ వాడు పాడైపోతున్నాడని బాధ పడింది. అంతేగాని క్రోధం లేదు. వాడు పాడైపోతాడని బాధ. రాముడికి లేదు. అట్లాగే కృష్ణుడికి లేదు. చాలామందికి లేదు. ఈ లేకపోవడమనేది ఎక్కడ నుండి వస్తోందంటే వారి యందు అహంకారం లేదు. ధర్మరాజుకు లేదు. అందుకని భారతంలో ధర్మరాజు Hero. అర్జునుడికి ఉంది. భీముడికుంది. ద్రౌపదికి ఉంది. వీళ్ళందరికీ ఉన్నాయి. మిగతా వాళ్ళకి చాలామందికి ఉన్నాయి. సత్యభామకు ఉంది. బలరాముడికి చాలా దట్టించి ఉంది. ఎవరెవరికి ఉంటుందయ్యా అంటే నేను ఉన్నాను అని తనకొక ప్రత్యేక అస్తిత్వం ఎవరైతే కలిగి ఉంటారో, వారందరి దగ్గర ఈ మన్యువు ఉంటుంది. అటువంటిది లేనివాడికి అన్నీ ఉంటాయి. వాళ్లను పొగిడినా ఏమవదు, తిట్టినా ఏమీ చలించరు వాళ్ళు. తుల్యనిందా స్తుతిర్ మౌని... అంటాడు భక్తి యోగంలో. ఎందుకంటే ఎవరిని తిడుతున్నావు? అందుకని మాస్టర్ గారు ఏం చెప్పారంటే... 'జితమన్యువు' అనేది అహంకారము లేనివారికి. అహంకారం అంటే ఇంకొక చోట వ్రాస్తారు... 'నేనున్నాను' అనే భావన కలిగి ఉన్నవాడు. అహంకారం పోయి, అతడే నేను గా ఉన్నాను, 'అహమస్మి' పోయి 'సోహమస్మి'. ఏదో అంటుంటాడు తెలియక అన్నట్లుగా ఉంటుంది. లేకపోతే మనకు క్రోధం

వస్తుంది. చాలా క్రోధం. నా అంతటి వాడిని అంటాడా వాడు సంగతి తేలుస్తా, వాడి అంత చూస్తా, అంటాం కదా. చాలామంది అంతు చూడటానికి పుట్టినట్లుగా ఉంటుంది మనం. ఈ లోపల మనకు అంతు వచ్చేస్తుంది. అదేంటి రా వాడి అంత చూస్తా అన్నావు అంటే, వచ్చే జన్మలో చూసుకుంటా అన్నట్లుగా ఉంటుంది. ఈ జన్మకు మరి time లేదు వాడెవడో నన్ను పట్టుకు పోతున్నాడు అన్నట్లుగా ఉంటుంది.

೨೬೬ భయాపహః

క్రోధం ఉన్నవాడికే భయం కూడా ఉంటుంది. అహంకారం ఉన్నవాడికే భయం ఉంటుంది. ఇదొక పెద్దరహస్యం. భయమెందుకు ఉంటుంది? మనకున్నది ఏదో పోతుందని, లేదా మనల్ని ఎవరో ఏదో చేస్తారని. ఇదే కదా. మనమే పోతామని. ఇవన్నీ ఎక్కడ నుండి వస్తాయి? When you feel that you are existing, and you have something of your own. నువ్వు ఒకడివి ప్రత్యేకంగా ఉన్నాను అనుకోవడం, అంతేకాక నీవి ఉన్నాయనుకోవడం. Primary thought నేనున్నాను, secondary thought నావి. 100వ శ్లోకం కదా కొంచెం higher plane లోనే ఉంటుంది. 100 అంటే ఏమిటి రెండు సున్నాలు దాటి ఉన్న ఒకటి అన్నమాట. అంటే భూలోకం, భువర్ లోకం దాటి సువర్ లోకంలో ప్రవేశం కింద ఉంటుంది. రామ రామ అంటే 100 అవుతుందిట. రామ రామ రామ అంటే వెయ్యి అవుతుందిట. అందుకని ఇక్కడ ఏమి చెప్తున్నారంటే జితమన్యుఃభయాపహః అంటే 'నువ్వే లేవురా వాడే నువ్వుగా ఉన్నావు' అన్న సందర్భంలో, ఇక నీవేమిటీ, నీదేమిటి? వాడే ఉన్నాడు కదా నువ్వు పోవడం ఏమిటి? పోతానేమో అని భయం కదా అసలు ముందు. జబ్బొచ్చిన దగ్గర నుండి నేను పోతానేమో అని భయం. నీ వాళ్ళు అనుకున్న వాళ్ళకి వీడు పోతాడేమో అని భయం. 'నేను, నావి. అసలు నేనే లేదు కదయ్యా. ఉన్నదే నేను కదా నువ్వు కాదు కదా' అని అంటాడు కదా తొమ్మిదవ అధ్యాయంలో శ్రీకృష్ణుడు. ఉన్నది నేనైనప్పుడు, నేను అలగా వచ్చినప్పుడు పోతానేమో అని ఏంటి? పోకపోతావా? అలగా వచ్చినవాడు సముద్రం అవ్వద్దూ? అవ్వాలా? ఇంతసేపు అలగా ఉండాలి అని ఎవరు నిర్ణయం చేస్తారు? ఏ అలా ఎంతసేపు ఉండాలో ఎవరిదండీ నిర్ణయం? సముద్రందే! ఈ class ఎంతసేపు నడవాలో ఎవరిది నిర్ణయం? Class మొదలుపెట్టిన వాళ్ళది. మరి వాడి నుండి వచ్చిన వాళ్ళు వాడి చేతిలో ఉంటారు వీళ్లంతా. 'వెళ్లి ఆడుకుని రారా' అంటే 'నా ఇష్టం వచ్చినంత సేపు నేను ఆడుకుంటా' అంటే కుదరదు. వెళ్లేటప్పుడే చెప్తాము కదా, అయిదయ్యింది ఆరింటి వరకు ఆడుకుని ఇంటికి రా అని. అంతేనా? ఆరుకు రాకపోతే పట్టుకుపోతాడా? అంటే

పట్టుకుపోతాడు. అసలు వాడే. నువ్వు అనుకోవడం వల్ల వస్తాయి చిక్కులు. అదేనండీ వచ్చిన గొడవ. మొత్తం అంతా మనవాళ్లు ఒకదానికి చివరి మెట్టు ఎక్కించారు. పర్యవస్థితః ఆఖరి మెట్టు ఏమిటయ్యా అంటే 'నువ్వు లేవు, మొత్తం అంతా అదే. అదే ఉంది. అది నువ్వుగా ఏర్పడి, నీ చుట్టూ ఏవో ఏర్పడితే అవన్నీ నీవి అని అనుకుంటున్నావు. అవి కూడా వాడివే, అనుకోమన్నారు. నువ్వు ఆడుకున్నంత సేపు ఆడుకో. ఆట వస్తువులు తీసేస్తాడా, వాడి ఇష్టం. నిన్నే తీసేస్తే? ఒక్కొక్కసారి నిన్ను తీసేయచ్చు, ఒక్కొక్కసారి వస్తువులు తీసేయచ్చు. ఇది తెలిసిన వాడికేంటి భయం? మన వాళ్ళు చెబుతారు 'తెగించిన వాడికి తెడ్డే లింగం' అని. ఒక తెడ్డు పెట్టుకుని శివలింగం లాగా పూజ చేస్తాడుట. ఇదేమిటిరా తెడ్డు పెట్టుకుని శివలింగంలాగా పూజ చేస్తున్నావు అంటే ఇది కాదా? అన్నాడుట వాడు. మనకు ఏమవుతుంది అంటే concepts అన్నీ మిగిలిపోయి, ఏమీ లేక, ఓహో ఇంకేమీ లే, వాడే ఉన్నాడు, వాడే చూసుకుంటాడు, వాడే నడిపిస్తాడు, నేను వాడి ఒళ్లో ఉండి వాడు చూపించినంత చూస్తాను అని అనుకోవాలి తప్ప, ఈ లోపల మనం ఏదో మన సొంత programmes వేసుకుంటే అవ్వవు. ఇక దానికోసం వాడిని బిగించడానికి మనం ఏవేవో చేస్తూ ఉంటాం. అవి అవ్వవు. అవి నీ mind లో ఉండే పట్టే (పుట్టు) తప్ప వాడి నిర్ణయానికి నువ్వు జీవిస్తావా, నీ నిర్ణయానికి వాడిని జీవించమని అడుగుతావా? ఈ సులువు తెలిసిన వాడికి ఇంక జీవితంలో అన్నీ వదిలేసినట్లేనండి. వాడూ ఇక మొండిమొలగా తిరిగేవాడు. వాడు అన్నీ చేస్తూ ఉంటాడు కానీ ఎందులోనూ పట్టు లేకుండా ఉంటాడు.

౨౬౭ చతురశ్రో

చతురస్రం అంటే నాలుగు పలకలు. దానిని ఒక కొమ్ము మీద నిలబడితే Rhombus అంటాం. దానికి ఉత్తర దక్షిణాలు, తూర్పు పడమరలు కలిపామనుకోండి, దానిని 'ఇంద్రుడి వజ్రం' అంటారు. పిడుగు Thunderbolt! అది పెట్టుకుంటే ఏ భయాలు ఉండవటండీ. ఇట్లా రకరకాలుగా ఇచ్చారు ఋషులు. అసలు భయమే లేదని చెప్తున్నాడు అక్కడ

(భయపహాः). ఇక్కడ ఏమో చతురస్రం ఇచ్చారు. ఈ నాలుగు కొమ్ములు ఒకదానితో ఒకటి కలిపేస్తే అంటే ఉత్తర దక్షిణలు తూర్పు పడమరలు, కలుపుకుంటూ గీతలు గీస్తే ఒక పలక వస్తుంది. ఆ పలకను ఒక కొమ్ము మీద నిలబెట్టి ఉంచుకుంటే, దాన్ని ధ్యానం చేసుకుంటూ ఉంటే రక్షణ ఉంటుందిట, భయం ఉండదుట. 'సర్వభద్రా యంత్రం' అని పెడతుంటారు కదా. ఇది 'ఇంద్ర యంత్రం'. దానిని చతురస్రం అంటారు. All powerful should not be uttered outside the temple అని ఒకటి చెప్పుకున్నాం. అది సహస్రం. ఇది చతురస్రమే. ఇది నాలుగే. అది వెయ్యి. ఇది చాలు. నాలుగు చాలు. చతురస్రాः. తూర్పు- పడమరలు, ఉత్తర- దక్షిణలు అన్నీ మనం కలిపేసుకుంటే వస్తుంది. ఈ చతురస్రం ఇంద్రుడి ఆయుధం అని చెప్పారు. ఈ చతురస్రమే మనస్సు యొక్క నాలుగు స్థితులని చెప్తారు. ఈ చతురస్రాన్నే మనస్సు పూర్ణంగా అనుభూతి చెందితే చివరి 4 మెట్లు యోగంలో ఎక్కుతారు అని చెప్పారు. అంటే ప్రాణాయామము, ప్రత్యాహారము, ధారణ, ధ్యాన, సమాధులు ఐదు ఉన్నాయి మనకు. అందుకని ప్రాణాయామం తర్వాత నాలుగు తీసుకోవాలి. ప్రత్యాహారము, ధారణ, ధ్యాన, సమాధి. ప్రాణాయామము మనస్సుని మనము శ్వాస మీద ఉంచడం. ఆ శ్వాసను పట్టుకుని అంతర్ముఖంగా లోపలికి వెళ్లడం. గుండెలోతుల్లోకి వెళ్లడం. గుండె లోతుల్లోకి వెడితే ప్రతి-ఆహారము అన్నమాట. 'లోపలికి వెళ్ళిపోయింది' అని అర్థం. Absorbed అని అర్థం. లోపలికి వెళ్లిపోయిన వాడికి ఇక బయట విషయాలు ఏమీ ఉండవు. నిద్రలో ఉండవు కదా! ఇక్కడ ఉండవు. అది మొదటి కొమ్ముట దానికి. లోపలికి వెళ్ళిపోతే బయటదుండదు గానీ లోపల వెలుగు లోకాల్లో ఉంటాం. అంటే భౌతికమైన సృష్టి, బహిర్గతమైన సృష్టి నుండి అంతర్ముఖమైన సృష్టి లోకి ప్రవేశం. ఆ ప్రవేశాన్ని 'ప్రత్యాహారం' అంటాము. అక్కడి నుండి ఇంకా లోతుల్లోకి వెళితే హృదయం నుండి ఊర్ధ్వముఖంగా వెళ్లి భూమధ్యంలోకి వస్తాం. అప్పుడు మనమే ఈ శరీరాన్ని ధరించి ఉన్నాము గానీ, ఈ శరీరం మనల్ని ధరించి లేదు. శరీరంలో మనము లేము,మనమే శరీరాన్ని ఆవరించి ఉన్నాం. మన బట్టి శరీరం తప్ప శరీరం బట్టి మనం లేము. చొక్కా లాగు వేసుకున్నట్లుగా ధరించి ఉన్నాము అని చతురస్రంలో రెండో కొమ్ము తెలుపుతుంది. అక్కడి నుండి ధ్యానం చేసేటప్పుడు శరీరం

ఉండగా తాను ఉండే స్థితిలోకి వస్తాడు. తాను చిన్న వెలుగు, దేన్ని ధ్యానం చేస్తున్నాడు? పెద్ద వెలుగుని. ఇక విశ్వాత్మ చైతన్యము, జీవాత్మ చైతన్యము రెండే ఉంటాయి. శరీర భావన ఉండదు. అదీ ధ్యానం! అక్కడ నుండి నాలుగో కోణం ... ధ్యానంలో అప్పుడప్పుడు తాను అదయిపోతూ ఉంటాడు. ఇలా అవుతూ ఉంటాడట అండి. అది వజ్రం. అది చతురస్రం. అది ఇంద్రుడి ఆయుధంగా ఇచ్చారుట. అంటే ఇవన్నీ మనస్సుకు అప్పచెప్పి ఇచ్చారు అని అర్థం. ఇవన్నీ చేయడానికి మనస్సు ఉండాలి. సృష్టిలో ఇంద్రుడు ఉన్నట్టుగా మనిషిలో మనస్సు ఉంది. మనస్సు చేతనే ఈ నాలుగింటినీ నిర్మాణం చేసుకోవచ్చు. అందుకనే four states of our existence, ప్రత్యాహార, ధారణ, ధ్యాన, సమాధి స్థితులను మనస్సు ద్వారానే అందుకోవచ్చు. మనస్సే వీటిలోకి రూపాంతరం చెందుతూ ఉంటుంది. ఈ నాలుగు స్థితులలో మనస్సుకి పైన ఉన్నటువంటి వాడు దైవమే. ఇంద్రుడు అంటే మనలో మనస్సు. మనస్సు ప్రధానంగా జీవిస్తున్నాం కాబట్టి మనకు ఈ నాలుగు స్థితులు మనకు పైన ఉన్నాయి, మనము అందుకునేటట్లుగా ఉన్నాయి. అలా ఇంద్రుడికి అందుబాటులో ఉంటాడట భగవంతుడు. అందుకని మనస్సు ప్రాణాయామం ద్వారా అంతర్ముఖం చేసి స్పందన లోకి వెళ్లి, సూక్ష్మస్పందన లోకి వెళ్లి, ధ్యానంలోకి వెళ్లడమనేది మనవాళ్ళు యోగమార్గంగా ఇచ్చారు. యోగంతో కూడని భక్తి, యోగంతో కూడని జ్ఞానం వలన ఏమీ ఉపయోగం లేదు. ఇది యోగ మార్గం. ప్రతిరోజు కొంత ప్రయత్నం దీని మీద జరుగుతూ ఉండాలి. అంతర్ముఖం అవ్వడాకి ప్రయత్నం చేయాలి. అంతర్ముఖమయితేనే అసలు కథ. అంతవరకూ కథే లేదు. అంతర్ముఖమైన వాడికి ఈ వజ్రం. అందుకని మాస్టర్ గారు మనకు ఈ వజ్రపు గుర్తును ఇచ్చి దీనిని అట్లా ఎక్కడపడితే అక్కడ కనపడేటట్లుగా పెట్టారు. మనకి గుర్తొస్తుందేమో చేసుకోవడానికి అని. అది ఎందుకు ఇచ్చారో కూడా మనం ఆలోచించం. ఒక దేవాలయం క్రింద పునాదిరాయిగా ఈ యంత్రం వేస్తారు. ఎందుకంటే మనస్సు basis గా ఇవన్నీ మనం అవగాహన చేసుకోవచ్చు, అనుభూతి పొందవచ్చు. మనస్సు ఐదవది. Fifth principle అంటారు. ఈ పైన నాలుగున్నాయి. ఈ నాలుగింటిని పొందడానికి చేసే ప్రయత్నం గురించి మనకు గుర్తు చేయడం కోసమే ఈ నలుపలకల బిళ్ళ. నాలుగు కోణాలు కలిపినది. అంటే ఒక సరళరేఖని

ఇంకొక సరళరేఖ cross చేస్తూ ఉంటే లంబకోణం ఏర్పడిందనుకోండి, దాని చుట్టూ నిర్మాణం చేసేది చతురస్రం.

168 గభీరాత్మా

ఈ జీవుడు తానుగా చేసే కార్యక్రమాలు అన్నిటికీ వాడి లోపల, లోతుల్లో దైవం ఉండబట్టి వీడు కదులుతున్నాడు కదా. ఆత్మ, గభీరాత్మా. నువ్వు చేస్తున్నట్లు కనిపిస్తుంటాయి అన్నీ. నువ్వు మాట్లాడుతున్నట్టు కనిపిస్తుంది. నువ్వు వింటున్నట్లు కనిపిస్తుంది, నువ్వు చూస్తున్నట్లు కనిపిస్తుంది, నువ్వు తింటున్నట్లు కనిపిస్తుంది. కానీ దాని లోపల ఉన్నవాడు వాడు. అది చెప్పడానికి 'గభీరాత్మ'! ప్రతి దాంట్లో లోపల ఉన్నవాడు ఎవడు? పులిని చూశాం. పులి రూపంలో జీవాత్మ ఉందని గబగబా భయపడిపోయి ఏదో చేసుకుంటాం. పులి రూపంలో జీవాత్మ లోపల ఉన్నవాడెవడు? ఇట్లా ప్రతిదానికీ లోపల, లోపల. చీమలో, దోమలో...పాట ఉంటుంది కదా! లోపల వున్న వాడెవడు? వాడి లోపల వున్న వాడెవడు? వీడి లోపలున్న వాడెవడు? ఇట్లా 'ప్రతి దాంట్లో మూలం లోకి వెళ్తే మూలం నువ్వే కదా' అని చెప్పే నామం గభీరాత్మా. ఎన్ని చెప్పినా, ఆ చెప్పిన వాడి వెనకాల ఉండేవాడు వాడండీ. ఆ చెప్పే వాడి వెనుకాల ఉండేవాడు వాడు. ఎందుకంటే వాడు ఉండబట్టే కదా వీడు చెప్తున్నాడు, వాడు ఉండబట్టే కదా వినేవాడు వింటున్నాడు. వినేవాడిలో వాడున్నాడు. చెప్పేవాడిలో వాడున్నాడు. కాబట్టి ఇట్లా ప్రతిదాంట్లో పొరలు తీసుకుని చూసుకోవడాన్ని, లోతులో ఉండే దేవుడిని చూడడం. ప్రతి జీవాత్మలోని లోతుల్లో, బాగా లోతుల్లో ఉండేది నీవే కదా! అని చెప్పే నామం గభీరాత్మ.

౨౬౨ విదిశః

విశిష్టమైన దిశలు ఉన్నాయిట. అంటే ఈ దిశలకు ఉపదిశలన్నమాట. వీటిలో నుండి పుట్టినవి. ఉత్తరానికి, తూర్పుకి మధ్యస్థంగా ఈశాన్యం పుడుతుంది. అంటే పరతత్త్వం, వెలుగు రెండూ కలిసే చోటు ఈశాన్యం. అది అర్ధనారీశ్వర తత్త్వం. అంటే కనబడనిది, కనపడేది రెండూ కలుస్తాయన్నమాట ఈశాన్యంగా. అందుకని ఈశాన్యం అతి పవిత్రం! ఎందుకని? అనిర్వచనీయమైన భగవత్తత్త్వం, సృష్టిలో ఉన్న అమ్మవారి తత్త్వం లేక వెలుగు ఈ రెండు కలిసే స్థానం/ meeting point ఈశాన్యం. వెలుగు, ప్రేమ ఈ రెండూ కలిసే స్థానం ఆగ్నేయం. వెలుగులో నుండి అగ్ని పుడుతుంది. అలాగే పడమర, దక్షిణం రెండూ కలిసే స్థానం నైఋతి. అది ఈశాన్యానికి సరిగ్గా ఐమూలగా ఉంటుంది. అంటే దానికి opposite అని అర్థం అన్నమాట. అంటే దానికి ప్రతిబింబంగా అక్కడ సృష్టి స్థానం ఉంటుంది. రాక్షస స్థానం అంటారు. రాక్షసులు అంటే మనకు ఉండే అవగాహన వేరు. ఆ పదం 'రక్షస్సు' నుండి పుట్టినది. సమస్త సృష్టిని ఏర్పరచి, రక్షణ చేసే ప్రదేశం నైఋతి. అలాగే పడమర, ఉత్తరం రెండూ కలిసే స్థానంగా వాయవ్యం ఉంటుంది. వాయవ్య స్థానం వాయువుకు సంబంధించినది. కాబట్టి మనం వరుసగా అష్టదిక్కులు తీసుకుంటే దిశలు, విదిశలు కలిపితే అష్టదిక్కులవుతాయి. ఈ అష్ట దిక్కులుగా ఉన్న ఒక అష్టభు దానికి కేంద్రం నుండి పైకి ఒక దిశ ఊర్ధ్వదిశ, కిందకు ఒక దిశ తీసుకుంటే అధోదిశ. ఊర్ధ్వదిశ, ఆధోదిశ కలిపితే పది అవుతాయి.

౨౮౦ వ్యాదిశః

ఈ ఊర్ధ్వదిశ, అధోదిశలుగా ఉన్న దానిని వ్యాదిశలు అంటారు. ఇట్లా పది దిశలండీ. దశ దిక్కులు. ఈ దశ దిక్కుల్ని ఇప్పుడు మనం నాలుగు లోంచి మళ్ళీ ఇంకో నాలుగు పుడితే, ఎనిమిది అయినాయి మనకు. ఆ ఎనిమిది రేఖల్ని అలా పైకి ఊర్ధ్వానికి, ఇలా అధో దిక్కుకు కలిపితే ఒక సంకేతం వస్తుంది. ఒక యంత్రం వస్తుంది. దానికి ఎనిమిది దిశలుంటాయి. ఊర్ధ్వదిశ ఉంటుంది, అధోదిశ ఉంటుంది. ఊర్ధ్వదిశ కి ఎనిమిది దిశలు గోపురంగా కలుస్తాయి, అధోదిశకీ కలుస్తాయి. ఇది నిర్మాణం చేసుకుంటారు సంధ్యావందనంలో ప్రతిరోజూ. 'ఏతస్యాం ప్రతి వసంతి ఏతాభ్యశ్చ నమో నమః'. పది. ఇన్నింటిగా కేంద్రం నుండి ఒకడే వ్యాపించాడు. వాడు పదకొండవ వాడు. ఈ మొత్తాన్ని రుద్ర సూక్తం లో 'సస్పిఞ్జరాయ' అంటారు. 'సస్పిఞ్జరాయ త్విషీమతే' అని చదువుతాం కదా. అది ఒక అద్భుతమైన యంత్రం. ఇది రోజూ నిర్మాణం చేసుకుని అందులో జీవించే పద్ధతి సులభంగా ఒకటి ఉంది. Double Pyramid అని చెప్తారు. ఏదో రకరకాలుగా చెప్తారు. ఇది ఒక యంత్రం. అంటే తన నుండే ఉత్తరం, తన నుండే తూర్పు, తన నుండే దక్షిణం, తన నుండే ఈశాన్యం, తన నుండే ఆగ్నేయం, నైరుతి, వాయువ్యం, ఊర్ధ్వదిశ, అధోదిశ. ఇవన్నీ మనం హోమం లో కూడా చేస్తాం. చూసినట్లయితే ఇన్ని దిక్కులుకీ మనం వరుసగా సమిధలు సమర్పణ చేస్తూ ఉంటాం కదా. ఊర్ధ్వదిశకి, అధోదిశకి. ఎందుకు ఇవి చేస్తున్నావ్? We are constructing సస్పిఞ్జర. ఈ సస్పిఞ్జరని ఇక్కడ మనకు 'విదిశః, వ్యాదిశః, దిశః' అని ఇచ్చారు. చతురస్రం! ఈ directional knowledge ఉండడం చాలా అవసరం. ఎటు నుండి ఎటు వెళ్తున్నాము అనేది తెలిసి ఉంటే ఆటు పక్క ఉన్న దేవతల యొక్క అనుగ్రహం కోరుతూ అటు వెళ్లాలి. తూర్పు వైపు వెళ్ళాలనుకోండి, తూర్పు దేవతలు నన్ను రక్షించుగాక. అసలు పొద్దున్నే బయలుదేరే ముందే సంధ్యావందనంలో అందరు దేవతలకు నమస్కరిస్తాం. ఎటైనా వెళ్లొచ్చు కదా మనం. అన్ని పక్కల నుండి అంత మంది దేవతలూ మనకు సహకరించాలని, వాళ్లు మనల్ని రక్షించాలని, మనకు దర్శకత్వం వహించాలని, మనకు దారి చూపించాలని కోరుకునే ఒక ఉత్తమమైన

సంస్కారం సంధ్యావందనంలో ఉంది. అదలా ఉండగా మనము ఏ దిశ వైపు వెళ్తున్నామో ఆ దిశకు సంబంధించిన దేవతల యొక్క సహకారం కోరితే మీకు ఆపదలు రాకుండా ఉంటాయి, కష్టాలు రాకుండా ఉంటాయి. ఇట్లా ఈశాన్యంగా హిమాలయాలకు వెళ్ళామనుకోండి, ఈశాన దేవతలందరినీ మనం బాగా ప్రార్థన చేసుకుని వెళ్తే, దారిలో రోడ్డు మీద అవి పడిపోవడం, ఇవి పడిపోవడం, మనం ఆగిపోవడం అవీ ఉండవు. అలా Europe వాయవ్య దిశగా వెళ్ళామనుకోండి, విమానంలో కూడా వెళ్తాం కదా, వాయువుకు సంబంధించిన దేవతలందరినీ ప్రార్థన చేసుకుని వెళ్తే, మన విమానానికి, మనకు చిక్కులు రాకుండా ఉంటాయి. ఇట్లా పెట్టారు. ఎందుకంటే ఈ మొత్తం అంతా ఒక గోళంలో దశ దిశలుగా ఒకడే వ్యాపించి ఉన్నాడు. ఈ వ్యాపించి ఉన్నవాడిని ఎప్పటికప్పుడు ఏం చేస్తున్నా గుర్తు పెట్టుకోవడానికి ఇన్ని రకాలుగా వాళ్ళు అల్లి యిచ్చారు. అంటే ఎట్లాగైనా సరే మనకు వాడు తప్ప ఇంకొకడు గుర్తు రాని పద్ధతిగా జీవితాన్ని అల్లి యిచ్చారు. అది ఋషులు చేసిన సేవ. మనకు bore కొడితే కొట్టొచ్చు. ఎందుకంటే మనకు శ్రద్ధ లేనప్పుడు bore కొడుతుంది. శ్రద్ధ ఉంటే ఇవన్నీ కూడా వినియోగపడతాయి. ఇట్లా వినియోగించుకునే వాళ్ళుంటారు. దాని ప్రకారం ఇన్ని దిశల్లో ఒకే తత్త్వం యిన్ని రకాలుగా ఉన్నదని చూసుకునే జీవించే వాళ్ళు ఉంటారు. వాళ్లకు ఆ అనుభూతి సత్యమవుతుంది, ఆ దేవతలు సత్యమవుతారు. 'నమః ప్రాచ్యై దిశే యా శ్చ దేవతాః ఏతస్యాం ప్రతివసంతి ఏతాభ్యశ్చ నమో నమః'. అని మళ్లీ ఇటు తిరిగి, అటు తిరిగి, అన్ని పక్కలకు తిరిగి దండాలు పెడతాం ఇన్ని దిక్కులూ. నమః ఊర్ధ్వాయై దిశే, అధరాయై దిశే యివన్నీ చెప్పకుంటాం కదా. ఇన్ని దిశలుగా నీవే ఉన్నావు అని ఇక్కడ విష్ణు సహస్ర నామంలో దిక్కు నీవే అంటున్నాడు. 'నా దిక్కు చూచి కావుము నీ దిక్కే నమ్మినాను నిజముగ కృష్ణా' అంటుంటాము కదా. So He directs and He is the direction అని చెప్పడానికి ఈ నామాలు యిచ్చారు. అంతకుముందు రక్షణకు, అభయానికి, మార్గానికి, యోగమార్గానికి సంకేతంగా చతురస్రం ఇచ్చారు.

౨౧1 దిశః

దిశలు నాలుగు :- ఉత్తరం, తూర్పు, దక్షిణం, పడమర. ఉత్తరం పరతత్త్వానికి సంకేతం. బ్రహ్మవిద్యోపాసకులు, సమాధి స్థితి పొందాలనుకునే వాళ్ళు, సరాసరి ultimate తో ఏకీభావం చెందాలనుకునే వాళ్ళందరూ కూడా ఉత్తర దిశగా ధ్యానాలు చేసుకుంటారు. ఊర్ధ్వం వేరు, ఉత్తరం వేరు. ఊర్ధ్వమంటే సూక్ష్మం. ఉత్తరం కూడా సూక్ష్మస్థితికే దారితీస్తుంది. Absolute silence అంటారు Northని. అక్కడ ఏమీ గోచరించదు. తూర్పు చైతన్యం. అందుకే వెలుగు తూర్పు నుండి వస్తుంది. ఉత్తరమేమో పరతత్త్వమైతే అంటే సృష్టికి అతీతమైన భగవత్తత్త్వమైతే, తూర్పు సృష్టి లోనికి వెలుగుగా దిగిన తత్త్వం. వెలుగనవచ్చు, విష్ణుమూర్తి అనచ్చు, అమ్మవారు అనచ్చు. ఉత్తరాన్ని అయ్యవారు అనచ్చు. ఏదైతే మనకు అనిర్వచనమైన తత్త్వంగా ఉన్నదో అది దక్షిణంలో దాక్షిణ్యముతో కూడిన తత్త్వంగా గోచరిస్తుంది. ప్రేమ! అది ఎవరికి అందుబాటులో ఉంటుందయ్యా అంటే యమ నియమాదులను పాటించే వారికి మాత్రమే! అందుకని యమస్థానం అని కూడా చెప్తారు. పడమర, ఈ వెలుగుకి గమ్యస్థానం ఏమిటయ్యా అంటే పదార్థం. ఇట్లా నాలుగు దిశలున్నాయి మనకు. అందుకనే భగవత్ కార్యాలను చేసేటప్పుడు ఉత్తర దిశగాను, తూర్పు దిశగాను ఉన్ముఖులమై చేసుకుంటూ ఉండటం ఉంటుంది. ఇల్లు కట్టుకునేటప్పుడు కూడా భగవత్పరమైనవి, తేలికైనవి, పదార్థమయం కానివి, మంచి అనుభూతి ఇచ్చేవి, దైవీపరమైనవి, ఉత్తరానికి, తూర్పుకి పెట్టుకుంటారు. పడమర బాగా పదార్థమయం, బరువు పెట్టుకుంటారు. దక్షిణం ఎంత శుభ్రంగా ఉంటే అంత మంచిది. వాస్తులోకి వీటినే తీసుకున్నారు. ఈ దిశలుగా ఒకడే యిన్ని దిశలుగా ఏర్పడ్డాడు. ఒక తత్త్వమే! పరతత్త్వం వెలుగై, వెలుగే ప్రేమగా మారి, ఈ వెలుగే పదార్థంగా మారుతుంది. అందుకని దిశా జ్ఞానం ఉండాలి మనిషికి. ఎక్కడైనా కూర్చుంటే ఎటు పక్కకు తిరిగి కూర్చున్నాం అనేది తెలిసి ఉండాలి. ఏ దిశలో ఏమున్నాయో చూసుకుంటూ ఉండాలి. ఏ దిశగా మనం ప్రయాణం చేస్తున్నామో చూసుకుంటూ ఉండాలి. రోజూ మనం ప్రయాణం చేస్తున్నది ఏ దిశగా ఉందో చూసుకుంటూ ఉండాలి.

కొంత దిశాజ్ఞానం వలన భగవంతుని అస్తిత్వం ఈ నాలుగు రకాలుగా తెలుస్తుంది.

972, 973 అనాదిః, భూర్భువః

మొదలు లేనివాడు. మొదలు ఎప్పుడు? ఇప్పటినుండి అంటే మొదలు ఉంటుంది. ఎప్పుడూ ఉండేదానికి మొదలు ఎక్కడ ఉంటుంది? మిగతా వాటన్నిటికి మొదలూ చివరా ఉన్నాయి. మొదలు ఉన్న ప్రతిదానికి చివర ఉన్నది. బ్రహ్మ కూడా పుట్టాడు. కాబట్టే తత్త్వంలోకి వెళ్ళిపోతాడు. ప్రకృతి, కాలం, శక్తి ఇలా పుట్టినవన్నీ తత్త్వం లోకి వెళ్ళిపోతాయి. ఇది మాత్రం ఇలా ఉండిపోతుంది. ఇదీ యోగం అందించేది. దేవతలని పట్టుకున్నాం అనుకోండి దేవతలకే శాశ్వతత్త్వం లేదు. అందుకనే బ్రహ్మ వేత్తలు ఏం చెప్తారు అంటే 'బ్రహ్మవిద్యాయాం, యోగశాస్త్రే శ్రీకృష్ణార్జున సంవాదే' అని. బ్రహ్మము ఏదైతే ఉందో, అందులోంచి ఏవైతే వచ్చాయో వాటిని తెలిపే విద్య. అనాది అంటే ఆ బ్రహ్మము! యోగం ద్వారా జీవుడు దాన్ని చేరతాడు. చేరితే శాశ్వతుడై ఉంటాడు. సృష్టిలో అంతా అంతం అయిపోయినా, వెళ్ళి ఆయనలో ఇమిడి ఉంటాడు. మళ్ళీ ఆయన లోంచి బయటకి వస్తాడు. కల్పాంతర రహస్యములు తెలిసి ఉంటాడు. అదీ నారదుడు. మనం కిందటి జన్మ తెలిస్తేనే గొప్ప అనుకుంటాం. నారదమహాముునికి కిందటి సృష్టి కథలో ఆయన ఏమిటో ఆయనకి తెలుసు. Too much కదూ? ఎట్లా తెలుసూ? పూర్వ సృష్టి స్మరణ ఉన్నది. ముందు సృష్టిలో ఒక జన్మలో తను దాసీపుత్రుడిగా పుట్టిన కథ నారదుడు వేదవ్యాసుడికి చెప్తాడు. అది నిన్న జరిగింది కాదుకదా? అప్పుడు ఆయన పొందిన అనుభూతిలో 'వచ్చే సృష్టిలో సరాసరి పూర్ణజ్ఞానంతో నాలోంచి వస్తావు' అని నారాయణుడు నారదుడ్ని ఆశీర్వదిస్తాడు. గుర్తుపెట్టుకోండి మర్నాటినుండి అని కాదు. 'ఈ సృష్టికి నీవు వాసుదేవోపాసనతో గడిపెయ్యి, నారాయణోపాసన అయ్యేపని కాదు, ఇలాహాయిగా జీవించెయ్యి, కల్పాంతం అయ్యి మళ్ళి బయటకి వచ్చినప్పుడు మొదట్నుండే తెలిసినవాడిగా వస్తావు' అని చెప్తాడు నారాయణుడు.

నారదుడు నారాయణోపాసన బాగా అవగాహన చేసుకున్నవాడు కనకనే, ఒక్కోసారి బ్రహ్మ కన్నా తెలిసినవాడిగా/ అవగాహన కలిగినవాడిగా ఉంటాడు. యోగులు అదీ కోరతారు. అందుకే 'శుకాయ నమః, వ్యాసాయనమః, నారదాయనమః' అని, తర్వాతి మెట్టు 'పరబ్రహ్మణే నమః' అంటాం. మధ్యలో ఇంకే మెట్లు లేవు. సరాసరి పరబ్రహ్మతత్త్వాన్ని అందించడానికి మనచుట్టూ ఉన్న 60 సూర్యమండలాలకీ గురువుగారు ఈ నారదుడు. సామాన్యమా? అందులో మనదొక మండలం అయితే, అందులో ఒక భూమి మనది. ఆ భూమి మీద గురుపరంపర. ఎటువంటి వాడికైనా చివరకు పరబ్రహ్మతత్త్వానికి మార్గం ఇచ్చేవాడు నారదుడు. అందుకనే మనం చదివే గురుపరంపరలో నారదుడి తర్వాత వచ్చేది 'పరబ్రహ్మణే నమః'! అది శాశ్వతమైన తత్త్వం! అది అనాది! అందులోంచి ఆది కలిగినవి వస్తాయీ, మళ్ళీ అంతం అవుతాయి. అదెప్పుడూ ఉంటుంది. అందులోంచే భూర్భువ లోకాలు వస్తాయి. భూః అంటే పదార్థమైన లోకము, భువః అంటే శక్తిమయమైన లోకము, సువర్లోకము అంటే ప్రజ్ఞామయ లోకము. పదార్థానికి, శక్తికి, ప్రజ్ఞకి అన్నిటికీ ఆధారభూతమైన తత్త్వము ఈ మూడింటిగా ఏర్పడినపుడు వీటియందు కూడా నిండి ఉన్నది. అనాది అంటే ఇంక ఏమీలేవు అని అనుకుంటాం. బ్రహ్మగారే మళ్ళీ లోపలకి వెళ్ళిపోతాడంటే వెంటనే బ్రహ్మ, ఆదిత్యులు, వసువులు, రుద్రులు ఇలా వీళ్ళంతా ఎందుకనిపిస్తుంది అసలు. అందుకని wrong sided understanding ఉండకూడదని భూః అని చెప్పాడు. అనాది నుండి భూః వచ్చేస్తారు. ఋషులు బోధచేయడం అంటే అలా ఉంటుంది. తల నుండి సరాసరి తోకకి వస్తారు. తోక నుండి తలకు తీసుకువెళ్తారు. ఇలా సాగతీస్తారు. ఎక్కడా మనం ఇరుక్కుపోకుండా అన్నింట్లో ఒక్కటే ఇమిడి ఉన్నది అని మనం గుర్తు పెట్టుకునేటట్లు. పదార్థముగా కనబడేది అతనే సుమా! అనే గుర్తుపెట్టుకో సుమా, అనాది అనే మోహంలో పడిపోకా, అని చెప్తుంది ఈ నామం. అనాదే పదార్థముగా ఉన్నది. పదార్థమును కదిలించే శక్తిగా ఉన్నది. అతి తెలివితో దీన్నంతా నిరాకరిచవద్దని వెంటనే అక్కడ బోధ. అదీ సమగ్రమైన బోధ! అనాదండీ, మిగతాది మాకు అక్కర్లేదనకుండా సరాసరి పదార్థము అంటే ప్రసాదానికి వచ్చేస్తారు. ప్రసాదమే కదా

అనుకోవద్దు. ప్రసాదము పదార్థమే అనుకోవద్దు, ప్రసాదమనే పదార్థములో మళ్ళీ ఆయన్నే చూడు, అని చెప్పడం. భువః పదార్థాన్ని కదిలించే శక్తి. ఊర్యే sudden గా ఒక contrast. Two extremities are presented at the same time, So that your comprehension is expanded tremendously. మన అవగాహన అద్భుతమైన వ్యాపనం చెందుతుంది ఈ మూల నుండి ఆ మూలకు సాగదీసినట్లు. Left to right అటు ప్రజ్ఞను, ఇటు పదార్థాన్నీ సమతుల్యంగా వుంచి, సృష్టిని ఏర్పాటు చేసే అద్భుతమైన శక్తిగా' భువః అను శబ్దమును అవగాహన చేసుకొనవలెను. ప్రజ్ఞ, పదార్థము విభిన్నమైన తత్త్వములు. వాటిని సమతూకంగా ఏర్పరచడంతోనే సృష్టి సంపద ఏర్పడుతుంది. ఒకదానికి ఒకటి పోటీగా ఉంచి సృష్టిని ఏర్పరచడం ఒక మహా అద్భుతమైన ప్రక్రియ. అదియే విష్ణుమహత్యం. దీనినే ఋగ్వేదమందలి విష్ణు సూక్తములో వేదర్షులు కొనియాడినారు.

౨౭4 లక్ష్మీ

సంపద, వైభవము. లక్ష్మి అని ఇక్కడ చెప్పే ఉద్దేశ్యము కనిపించే ప్రతీది చిహ్నమే! మనిషిగా కనిపించేది, అందముగా స్త్రీ, పురుషులుగా కనిపించే తత్త్వము అని అర్థం. అందుకనే పెద్దలు చెట్టు గురించి చెట్టు అనేటటువంటిది అని అంటారు. చెట్టు అనరు. మనకి చెట్టు. ఋషులకి చెట్టు అని పిలవబడేది. That which is called tree, that which is called man, that which is called beauty. మనిషిలో అందంగా కనిపించేది లక్ష్మి. వెండి గ్లాసుగా కనిపించేది తత్త్వము. వెండి గ్లాసు అనే చిహ్నం ద్వారా భగవంతుడ్ని అందిస్తోంది లక్ష్మీదేవి. అదీ లక్ష్మి! అందులో నీరుగా కనిపిస్తోంది. అందుకే అడ్డగోలగా నీరు పారబోయరాదు. ఎందుకంటే నీరు రూపంలో/ నీరు అనే చిహ్నం లో తత్త్వం అక్కడ ఉన్నది. ఇదొకటి ఉపాసన చేయవలసిన విషయం. నీరు రూపంలో తత్త్వం వున్నదని చెప్పడం ఉన్నదే, అది చిహ్నంగా/ రూపం గా ఇచ్చినది లక్ష్మి. దేనికి చిహ్నంగా ఉన్నది? ఆయనకి చిహ్నం! ఆయనకి first representative ఆమే కదా! పదార్థంగా కనిపిస్తుంది, శక్తిగా కనిపిస్తుంది. భూర్భువః. శక్తి చూసినా లక్ష్మి.అంటే శక్తి అనే తత్త్వం గా లక్ష్మి కనిపిస్తుంది. శక్తి అంటే ఇచ్ఛాశక్తి కావచ్చూ, జ్ఞానశక్తి కావచ్చూ, క్రియాశక్తి కావచ్చూ, ఏ శక్తి అయినా అవ్వచ్చు. శక్తిగా ఆ తత్త్వాన్ని లక్ష్మి ప్రసాదిస్తోంది. అలా చెయ్యాలి లక్ష్మి యొక్క ఆరాధన. ఈ రూపంలో ఆయనని తెచ్చావా తల్లీ! అనే భావనలో ఉండాలి. బయటకి అనఖ్ఖర్లేదు. అమ్మవారు అయ్యవారిని రకరకాల రూపాలుగా పట్టుకొస్తుంది. ఆవిడ చిహ్నం! చిహ్నమే చిన్నమ్మ అయిపోయింది. భూర్భువ లోకాలలో అంటే శక్తి లోకాలలో, పదార్థమయ లోకాలలో, సంకేతాలుగా symbolic presentation of that గా తత్త్వమును చిహ్నములుగా అవగాహన మేరకు పట్టుకొచ్చేది లక్ష్మి! ప్రజ్ఞా లోకంలో ఇక వెలుగే ఉంటుంది. ఇహ అక్కడ సంకేతాలు ఏమి ఉండవు. లక్ష్మీప్రదము అంటే తత్త్వంతో కూడి ఉన్నది కాబట్టి దాన్ని ఆ విధంగా అవగాహన చేసుకోవడం వల్ల, మనలో ఉండే ఆ తత్త్వం చిగురించడం జరిగి, మనకి శుభాలు కలుగుతాయి. అప్పుడు మనకి సృష్టిలోనూ, మనలో కూడా సంపద గోచరిస్తుంది. ఆనందం పెరుగుతుంది.

అందుకూ లక్ష్మీ పూజ! మార్వాడీ వాళ్ళు లక్ష్మీదేవికి దీపావళి రోజున వెండి బిళ్ళల తోనో, బంగారం బిళ్ళలతోనో పూజ చేసేసి మళ్ళీ లోపల పెట్టేస్తూ ఉంటారు. ఏ రూపం అయినా అది చిహ్నమే. ఏదైనా anything you see is presented (like this) that అని చెప్పేది లక్ష్మీ. అలా చూస్తుంటే అన్నిటిలోనూ వెలుగే దర్శనం అవుతూ వుంటుంది.

౨౭౫ సువీరః

మంచివీరుడు. కృష్ణుని వీరత్వం వేరే ప్రత్యేకించి చెప్పకోనక్కరలేదు. విష్ణుమూర్తి యొక్క ధర్మ సంస్థాపనలో ఆయన చూపించిన వీరత్వం మనకి తెలుసు. ధర్మయుక్తమైనది ఈ వీరత్వం. ధర్మవీరులుగా కనిపించేవారిలో కనిపించే వాడు కూడా ఈయనే! ఈయనే వ్యక్తమౌతూ ఉంటాడు. ధర్మం నిలబెట్టే వారిలో కూడా ఈయన్ని దర్శనం చేసుకోవచ్చు. 'న అవిష్ణుః పృథ్వీపతిః' అనే వాక్యం ఉన్నది. విష్ణు అంశ లేనిదే పృథ్వికి నాయకుడిగా ఉండలేడు. ఎక్కడ ధర్మాన్ని రక్షించే వాళ్ళు ఉన్నారో, వారందరి రూపం లో నువ్వే ఉన్నావని ఈ నామం లో చెప్తున్నాడు. .

೨೭೬ రుచిరాంగదః

అన్ని రూపముల యొక్క, అన్ని అవయవముల నుండి రుచి అంటే వెలుగు అని అర్థం. రుచి అంటే ఆసక్తి, శ్రద్ధ పెరగడం. దాని యందు రుచి కలిగిస్తుందిట. ప్రతి అంగము నుండి వెలుగు అలా గోచరిస్తుందిట. కొంతమందికి అలా ఏమి చూసినా వెలుగే గోచరిస్తుంది, మరేమీ గోచరించదు. రూపాన్ని అంటి పెట్టుకుని ఉన్న వెలుగుని చూసేవారు కొంతమంది, రూపాన్నే చూసేవారు కొంతమంది. మహాత్ములు ఒకరినొకరు అలాగే గుర్తించుకుంటారు. ఎందుకంటే వీరిలో వెలుగు వారిలోను, వారిలో వెలుగు వీరిలోను దర్శనం చేస్తారు. వీరు చూసేది వెలుగునే, మిగతావి కాదు. ఎందుకంటే వారి అధికారం, సంపద, భౌతికమైన అందం ఇవేవి గోచరించవు. అలా కనిపిస్తే మేనక విశ్వామిత్రుడ్ని ప్రేమించగలదండి? లోదృష్టి కలగడం చేత ఆమెకు ఆయన వద్ద విపరీతమైన తేజస్సు కనిపిస్తుంది. ఈ లక్ష్మీ ఉపాసన ఇంతకు ముందు చెప్పినట్లుగా మనం చేస్తుంటే, దేన్ని చూసినా ముందు వెలుగునే చూడడం ఉంటుంది. మిగతావి తర్వాత. ముందు దైవ దర్శనం తర్వాత మిగతా విషయాలు. దాని చుట్టూ అల్లుకున్నవి తర్వాత కనిపిస్తాయి. అవి దైవం ఆధారంగా మన స్వభావం నుండి అల్లుకున్నవి. సరాసరి దాన్నే (వెలుగుని) చూడటం ఋషిదర్శనం. అలా చూస్తే సమస్తము వెలుగుమయంగా గోచరిస్తుంది. కృష్ణుడలా లక్ష్మీప్రదంగా కనిపిస్తాడు. లక్ష్మీ అనే నామం విష్ణువుకి, కృష్ణుడికి కూడా ఉన్నది. రుచిరాంగద అంగములన్నిటి నుండీ, అంటే ప్రతి అంగము నుండి కూడా కాంతి ప్రసారం చేసేవాడు రుచిరాంగదుడు. కేవలం నవ్వు, కన్నులే కాదు, కాలి గోరు చాలు. అమ్మవారిని స్తుతించేటప్పుడు లలితా సహస్రనామంలో ఆమె కాలిగోర్లలో నుండీ కోటానుకోట్ల నారయణులు పుట్టుకొచ్చారని చెప్తారు. అలా విపరీతమైన కాంతిదర్శనం కూడా లక్ష్మే! కారణం ఏమంటే, అసలు తత్త్వమనేది కన్నులకు కనిపించేది కాదు. అలా కన్నులు జిగేల్ మని మిరుమిట్లు గొలిపే విధంగా అంతర్ముఖంగా భగవంతుని దర్శనం జరుగుతుంది. అంతర్ముఖంగా జరిగిన వాడికే బహిర్ముఖంగా కూడా జరుగుతూ వుంటుంది.

౧౭౭, ౧౭౮, ౧౭౯ జననః, జనః, జన్మాదిః

జననో పుట్టడం ఆయనే. పుట్టడం, పుట్టిన వాళ్ళు, పుట్టుకకు మూలం అన్నీ ఈయనే. ఇది త్రయీ విద్య. ఒకడే మూడవుతుంటాడు. ఎంతసేపూ ఇదే వ్యవహారం. అక్కడ నుండి ఇచ్ఛ వస్తుంది. ఇచ్ఛలో నుండి జ్ఞానము వస్తుంది. అక్కడ నుండి క్రియ జరుగుతుంది. ఈయన పుట్టడానికి ముందున్నాడు, జన్మాది. అక్కడ నుండి పుట్టడం అనే ప్రక్రియ వచ్చింది. అందులో నుండి ఈయనే పుట్టుకొచ్చాడు. పుట్టిన వాడు ఈయనే ! ఈయనే లేకపోతే బ్రహ్మ ఏడి? అ తర్వాత వచ్చిన వాళ్ళు ఏరి? ఈ పుట్టిన అందరూ ఈయనే బ్రహ్మతో సహా! జన్మకాదీయన, జన్మ అనే ప్రక్రియ ఈయన, జనులు ఈయన. జనులు అంటే మనుష్యులని కాదు, పుట్టినవి అని అర్థము. జంతువు అన్నా కూడా అంతే! మనం కూడా జంతువులమే! మనం పశువులము కూడా. పశువు అంటే పాశము చేత కట్టబడింది అని ఒక అర్థము. లోపల నుండి బయటకు చూచేది అని మరొక అర్థము. అంటె మనము లోపలకి చూడం కదా! బయటకేగా చూస్తాము. మనం పశువు అంటామే అది కూడా అంతే! ఇలా లోపలకు చూడక బయటకు చూసేవాటిని పశువు అన్నారు. లోపలకు చూస్తే పశుత్వం పోతుంది. అంతః దర్శనాలైతే బహిః దర్శనాలు అవుతాయి. అంతః దర్శనం అయినప్పుడు దివ్యచక్షువు ఏర్పడి పశుత్వం పోతుంది. అంటే బంధనం పోతుంది. అంతవరకు జంతువులమే! కాకపోతే మానవజంతువు పుట్టుక అంత సులభం గా దొరకదు. అందుకే 'జంతూనాం నరజన్మ దుర్లభం' అన్నారు. పుట్టే వాటిల్లో నరుడిగా పుట్టడం ఎప్పుడూ దొరికే అవకాశం కాదు. నరుడిగా పుట్టడం చాలా దుర్లభం. ఇదొక అవకాశం. దీనిని ఉపయోగించుకుని బాగు చేసుకోమని శంకరాచార్యులవారు పదే పదే చెప్పి వెళ్ళిపోయారు. వచ్చిన ప్రతి మహాత్ముడు అదే చెప్పి వెళతాడు. అందుకని మనం పుట్టినవాళ్ళం కూడా ఆయనే. అదే కదా కృష్ణుడు అర్జునుడితో 'నీకు నీవు గుర్తులేవు. నాకు నేను గుర్తున్నాను. మనిద్దరి మధ్య తేడా అదే' అంటాడు. మనం కూడా అంతే. మనం ఎవరో మనం మర్చిపోయాము. మన పేరూ, ఊరూ, ఎక్కడ నుంచి వచ్చాం? ఎందుకొచ్చాం?... ఇలా ఇవన్నీ మర్చిపోయాం. అంతమాత్రం చేత మనం అవి కాకపోతామా? ఎవరినుండి

మనం పుట్టుకువచ్చామో వాడికి తెలుసు మనం అంతా వాడేనని. మనకి తెలియకపోతే ఏంటిటా? తెలుసుకుంటాడని ధైర్యం ఉంది. తెలియకపోతే తెలియజెప్పకుంటా అన్నాడు. వినకపోతే చావగొట్టి చెప్పకుంటా అన్నాడు. ఎందుకంటే ఎక్కడా ఆయనని దాటిపోయేది లేదు. అందుకని మొత్తం అంతా పుట్టడం అనే ప్రక్రియ ఆయన. పుట్టినవాళ్ళు ఆయన. పుట్టడానికి ముందు నుండే వున్నవాడు ఆయన

౨౪౦ భీమః

భయంకరుడు అని అర్థం. ఎంతటి వాళ్ళనైనా భయపెట్టేస్తుంటాడండి! భక్తులనూ భయపెట్టగలడూ, రాక్షసులనూ భయపెట్టగలడు, భయపెట్టంది ఎవరిని? మనం చదువుకున్న కథలన్నీటిలోనూ ఎంత విర్రవీగినవాడికీ చివరకు భయం వచ్చేస్తుంది. ఏమీ భయం లేని కంసుడ్ని, రావణుడ్ని భయపెట్టేశాడు. తన సుందర రూపంతోనే రావణుడ్ని భయపెట్టేసాడు. హిరణ్యకశిపుడికి ఇంకా భయంకర రూపం ధరించాడు కానీ, రాముడు నవ్వితే చాలండి రావణుడు భయపడిపోయాడు. కృష్ణుడూ! బొట్టి యల్లే వుంటాడు కానీ అవతల వాడికి భయమే. భీముడు బయటకు పటారమే. కానీ వీడు లోపలికి భీమ, బయటకి సోమ అన్నట్లుగా ఉంటుంది. బయటకి సోమ అంటే చంద్రుడే. ఆహ్లాదంగా కనిపిస్తాడు. చల్లగా ఉంటాడు. అవసరం అయితే అతి భయంకరుడు. ఎంత భయంకరుడు అంటే అర్జునుడు 'నీ భయంకర రూపం నేను చూడలేను. మూర్ఛవచ్చేస్తోంది. ఒళ్ళు చెమటలు పడుతున్నాయి. కాళ్ళు వణుకుతున్నాయి. ఇక చాలు. నీ సౌమ్య రూపం చూపు' అని చెప్తాడు. హిరణ్యకశిపుడికి ఎలా కనిపించాడు? ఎదుటివాడి కళ్ళు మూసుకు పోయేంత కాంతితో వచ్చాడు. భయంకరమైన సింహ ముఖం. అధోభాగం అంతా నరదేహం. ఆయుధాలు లేకుండా, గోళ్ళే ఆయుధాలుగా వచ్చాడు. ఎంత భయంకరంగా చంపాడు. పుచ్చకాయ వలచినట్లుగా వేళ్ళు పెట్టి వలిచేశాడు. చీల్చి అవతల పారేశాడు. భయంకరమేనా అంటే 'I can be that also' అని చెప్పాడు. అవసరమైతే చీల్చి చెండాడి ఎండబెట్టేస్తాడు అన్నట్లు కనిపించాడు కదా! మరి పరశురాముడు తలకాయలు ముంజకాయల్ని కొట్టేసినట్లు కొట్టేశాడు. పరశురామావతారాన్ని మనం చూసి శ్లాఘించేటట్లుగా వుండదు. వస్తుంటేనే భయపడి పారిపోతాం. అదీ భీముడంటే! నవ్వుతూ భయపెట్టగలడు. భీకరమైన ఆకారం కూడా దాల్చగలడు. భీకరమైన పనులు చేయగలడు. ఎంత భీకరంగా అంత భీకరంగా ఎవడూ చేయలేడు. భీకరకృత్యాలు అంటూ దుర్మార్గులు అంతా చేస్తూంటారే. అవేమీ ఈయన భీకరకృత్యాల ముందు పనికి రావండి. కృష్ణుడు అట్లా నవ్వుతూ సున్నితంగా అందంగా కనిపిస్తే, ఆ..

ఇంతమందిని చంపిస్తాడా! అనుకున్నారంతా. ఇంత సౌజన్యమూర్తి అంతమందిని చంపిస్తారని ఎవరూ అనుకోలేదు. శుభ్రంగా ఏరేశాడు. ఏమీ కానట్లు. అంత భీకరమైన తత్త్వం ఆయన యందు అలా దాక్కుని ఉంది. అది చూడగలిగాడు భీష్ముడు. అస్సలు దయాదాక్షిణ్యం లేకుండా కూడా ఉండగలిగాడు. అలా ఉండగలిగాడు కనుకనే ఆ ద్రోణుడి తలకాయ అలా తీయించేశాడు. కర్ణుడు 'ఏంటయ్యా ఇదీ?' అంటే ఎందుకిలా చెయ్యకూడదని అడిగాడు. రథం ఇరుక్కుపోతోంది. కాస్త తీసుకుని బాణం వేస్తానన్నాడు కర్ణుడు' His petition need not be considered అన్నాడు అంతే! వీడి అర్జీ బుట్టదాఖలు చేయమన్నాడు. 'ఏం ఫర్వాలేదు. బాణం వేసి లాగి పారెయ్యి' అని చెప్పాడు అర్జునుడికి కృష్ణుడు. ఎంత నిర్దాక్షిణ్యంగా లేకపోతే అలా చేయగలుగుతాడండీ! అసలు ముందు అర్జునుడేమన్నాడు. 'మా తాతయ్య, మా గురువు.... ఎంత చెడ్డా మా cousins' అన్నాడు. అక్కరలేనప్పుడు దయ. ఇప్పుడు దయేంటి? ఎవరు ఎటువంటి శిక్షకు పాత్రుడో తెలిసినవాడు కాబట్టి ఈ పనికిరాని consideration అక్కరలేదు. ఎందుకు అక్కర్లేదు? ద్రౌపదిని వివస్త్రని చేయడానికి ప్రేరేపించినవాడు. నీచుడు. కొన్ని మంచి గుణాలుండవచ్చు గాక, నిన్న మొన్న యుద్ధంలో ముక్కుపచ్చలారని అభిమన్యుడ్ని నీచాతినీచంగా చంపిన దానిలో పాలు పంచుకున్నాడు. అలాటి వాడు మనకి సమఉజ్జీ ఏమిటి? తీసేయమన్నాడు. కర్ణుడి పూర్వాపరాలు చూసుకోకపోతే ఎంతో అన్యాయం జరిగినట్లు ఉంటుంది. కానీ ఎక్కడా అన్యాయం జరగలేదు. చూస్తే భగవంతుడి పద్ధతిలో అంతా న్యాయమే. దేముడిలో ఇంత కసి ఉందా? అన్నట్లు ఉంటుంది. 'భీమంబై తలద్రించె ప్రాణంబుల బాపె, చక్రమా సుక్రీన్' అని ఉంటుందో పద్యం. ఆయనే కాదుట, ఆయన చక్రం వదిలితే అంత భీకరంగానూ తీసేస్తుందిట. తియ్యమంటావా అని అడగదుట. మెరుపు తీగల్లే అలా వచ్చి ఎంతటి వారి కుత్తుకైనా తెగేసి వెళ్ళిపోతుందిట. అటువంటి భీమ పరాక్రముడు. 'ఎప్పుడూ నేను జగన్మోహన రూపమే అనుకోక. అంత opposite గానూ ఉండగలను అవసరాన్ని బట్టి, సన్నివేశాన్ని బట్టి అని చెప్పాడు. అటు జగన్మోహనమూ కాదు. ఇటు భీకరమూ కాదు'. నిర్వికారమూ, నిరాకారమూను. అలక్షణం, అప్రతర్క్యం, అవిజ్ఞేయం. ఇలా చెప్పారు. అవిజ్ఞేయం అంటే తెలుసుకోలేని

తత్త్వం. అప్రతర్క్యం అంటే మన తర్కానికి అందనిది. ప్రశస్తమైన తర్కానికి కూడా అందనిది. ఎంత తర్కించినా దానికి పైనే ఉంటుంది. ఆ తర్కం చేసేవారి రూపంలో ఉంటుంది. కనుక వారి కందదు. అలక్షణం అంటే ఏ లక్షణాలు లేవు. అప్రజ్ఞాతం ఇంకా ప్రజ్ఞగా వికాసం చెందలేదు. ఏం చెప్తాం దాని గురించి? అయినా అలా ఉండగలడు, అరివీర భయంకరుడన్నట్లుగా నిర్భీతి ఉండి దుర్మార్గమైన పనులు చేసేవారిని కూడా భయపెట్టగలడు. ఆయనకు హిరణ్యకశిపుడు, రావణుడు. దుర్యోధనుడులాంటి వారికి అంతభీకరమైన వాడు. తన భక్తులయందు అపచారము చేస్తే అంత భయంకరంగా ఉంటాడు. అస్సలు spare చెయ్యడు. అంతకు ముందు scene లో ఏమో 'నువ్వు ధర్మాత్ముడివి, ఇటు వచ్చెయ్యి' అని చెప్పాడు. కానీ తర్వాత మాత్రం 'వాడి మీద ఏ మాత్రమూ జాలి చూపించక, వాడు క్షమార్హుడు ముమ్మాటికికాదు. బాణం వేసెయ్యి,' అన్నాడు.

౨81 భీమపరాక్రమః

పరాక్రమ అనే పదంలో క్రమము, ఆక్రమము, పరాక్రమము అని మూడు అంచెలలో ఆ నామము ఉన్నదని చెప్పకున్నాం. క్రమము చేత ఆక్రమించవచ్చుట. క్రమబద్ధమైన జీవితము సాగిస్తుంటే జీవితము మీద స్వామిత్వం ఆక్రమణం చేయవచ్చు. అందుకూ సాధన. క్రమబద్ధమైన జీవితము లేకపోతే ఆక్రమణం అనేది జరగదు. ఆక్రమణం చేసేవాడు కూడా భౌతికంగా క్రమబద్ధంగానే చేస్తుంటాడు. అలెగ్జాండర్, నెపోలియన్ great warriors. అది భౌతికంగా స్వామిత్వం. కాని ఇది వేరు. ఇది అంతర్గతమైన ఆక్రమణ. ముందు శరీరం మీద స్వామిత్వం, ఇంద్రియముల మీద, మనస్సు మీద, బుద్ధి మీద స్వామిత్వం. సమస్తాన్ని అధిష్టించి, ఆధ్యాత్మ అంటే అధిష్టించి ఉన్న ఆత్మగా ఉండి, ఆక్రమించి శరీరాన్ని, ఆ చుట్టూ పరిసరాలని ఆక్రమించి, అలా వ్యాపిస్తూ వెళ్ళిపోతాడుట. అదీ ఆక్రమణం. ఇలా ఆక్రమిస్తూ పరతత్త్వం వరకు వెళ్ళిపోతే పరాక్రముడు. ఈయనదీ భీమపరాక్రమము! అంటే మొత్తం పధ్నాలుగు లోకాలు వణుకుతాయిట. హిరణ్యకశిపుడ్ని చంపడానికి నరసింహావతారంలో వచ్చి, చీల్చి చెండాడాడు. ఎంత భయంకరంగా ఉన్నాడంటే మొత్తం సృష్టి అంతా ప్రకంపనం చెందిపోయిందిట. ఎట్లా ఉపశమింపచేయాలో అర్థం కాలేదుట. మళ్ళా అందరూ ప్రహ్లాదుడ్ని ఆశ్రయించారుట. 'నువ్వే దిక్కు నీయొక్క ఆహ్లాదం చేత ఆయనని ప్రశాంతపరచు' అని. చెంచులక్ష్మి అలాంటి కథల్లో ఆమెని చూసి అన్నీ మరచిపోయాడని చెప్తారు. అంతవరకూ వచ్చాకా ఆయనకి తేడా ఏం వుందండి? అలా ఆమెతో మాట్లాడుతూండగానే ఎన్నిసార్లు హఠాత్తుగా ఆయన వదిలి వెళ్ళలేదండి? చక్కగా సరస సల్లాపాలు చేస్తూండగా ఏమీకానట్లుగా గభీమని వస్తానని కూడా చెప్పకుండా లేచి వెళ్ళిపోయాడు కదా! అలాంటి వాడు భక్తుడికి తప్ప ప్రణయానికి వశం కాలేదు. అందుకే ప్రహ్లాదుడు ఆహ్లాదం కలిగించేట్టుగా మన సింహాచలం కొండ మీద స్తుతించాడని అంటారు అనే అనుకుందాం. ఎందుకంటే ఆ కథ మనకి భూమి మీద జరిగింది కాదు. భూమి మీద జరిగిన కథ మనకి పరశురామ అవతారం నుండే. అయినప్పటికీ మనకి భక్తి ప్రపత్తులు పెరగడానికి ఇలా చెప్తారు.

భీమపరాక్రమః అంటే పధ్నాలుగు లోకాలూ కంపించిపోయేంత, భయపడి పోయేంతగా ఉన్నాడుట. ఆయనలో ఆ భయపెట్టే లక్షణం లేకపోతే మిగతా వాళ్ళకి ఎలా వస్తుంది ఆ లక్షణం. అదీ భీమపరాక్రమః

982 ఆధారనిలయః

ఈ సమస్త సృష్టికీ ఆయనే ఆధారం. ఆయనే నివాసం. ఆయనే మూలం. మనలో కూడా అలా ఆధారనిలయం ఉన్నది. దాన్నే మూలాధారం అంటాం. మన ప్రజ్ఞ, భగవత్ప్రజ్ఞ అక్కడ ఉపస్థితమై ఉండడం, వల్ల ఈ శరీరం నిలచి ఉన్నది. శరీరంలో ఏ భాగం లో అయినా సరే మానవ ప్రజ్ఞ ఉండవచ్చు. మొత్తం శరీరంలో భగవత్ప్రజ్ఞ ఉండడం చేత ఈ శరీరం ఉన్నది. అలాగే ప్రతి జీవికీ ఆయన ఆధారంగా ఉన్నాడు. ఆధార నిలయం అంటే abode of the basis పునాదన్న మాట. అంటే అది లేకపోతే ఇంకేమీ లేదని అర్థం. అదీ ఆధార నిలయం. ఏ నిలయమైతే సమస్తానికీ ఆధారంగా ఉన్నదో, దేన్నుండి సమస్తమూ పుట్టుకొచ్చిందో, ఎందులోకైతే సమస్తమూ మళ్ళీ తిరోధానం చెందుతుందో, ఏది లేకపోతే జీవులకు స్థితి ఉండదో, దానిని 'ఆధారనిలయం' అన్నారు. అందుకని మూలాధార ప్రజ్ఞగా మనలో దర్శనం చేయవచ్చు. మనలో కుండలినీ చైతన్యం మూలాధారంలో ప్రజ్ఞగా స్థిరపడి ఉంటుంది. అక్కడ నుండి ఊర్ధ్వగతి చెందుతుంటే భగవత్తత్త్వాన్ని మనం అనుభూతి చెందుతుంటాం. కానీ మనయందు కేవలం మూలాధారమునందే కాక సమస్తమునందు వ్యాపించి ఉన్నాడు. మనకి ఆధారంగా ఉన్నాడు. జీవరాశులకి ఆధారంగా ఉన్నాడు. గ్రహగోళాదులకు ఆధారంగా ఉన్నాడు. ఈ విధంగా దేని వలన మిగతా లోకాలన్నీ ఏర్పడుతున్నాయో దానిని ఆధారనిలయం అని చెప్పవచ్చు. ఏడు లోకాలకి ఏ లోకం ఆధారమో దానిని 'గోలోకం' అని కూడా చెప్తారు. అక్కడి నుండి సమస్తమైనవీ విచ్చుకుంటూ వస్తున్నాయి.

983 ధాతా

బ్రహ్మ అని అర్థం. బృహ్మణము చెందువాడు. తానే బ్రహ్మగా ఏర్పడి సృష్టి బృహ్మణము చేయువాడు. అందుకని బ్రహ్మ ద్వారా మొదలులోంచి ఈ సమస్తమూ వ్యక్తం అవుతుంది. అటువంటి బ్రహ్మలు 21 మంది ఉన్నారు అని ప్రజాపతి అనే నామానికి అర్థం చెప్పుకున్నప్పుడు చెప్పుకున్నాం. ఒక్కో లోకంలో ముగ్గురు బ్రహ్మలు. ఏడు లోకాలలో ఇరవైయొక్క మంది బ్రహ్మలు ఉన్నట్లు, పది మంది బ్రహ్మలు ఉన్నట్లు, తొమ్మిది మంది బ్రహ్మలు ఉన్నట్లు చెప్పుకున్నాం. బ్రహ్మము అంటే వ్యక్తమగువాడు, బృహ్మణము అని అర్థం. బ్రహ్మమును వ్యక్తము చేయువాడు బ్రహ్మ. అందులోంచి మళ్ళీ బృహ్మణము. అందులోంచి మళ్ళీ బృహ్మణము. ఇట్లా సృష్టి ధరించినవాడుగా బ్రహ్మ కనిపిస్తాడు. బ్రహ్మ వరకూ ఉన్నదే బ్రహ్మకు కూడా ఆధారం. అందుకని బ్రహ్మకు ఏది మూలమో దానిని ఆధారనిలయం అని అన్నారు. ముందు కనిపించేది వ్యక్తమైన సంకల్పం. మొదట బయటకు వచ్చినవాడు బ్రహ్మ. ఆయన నుండి ఈ సమస్త సృష్టి వ్యక్తమై వస్తూంటుంది.

౨౮4 పుష్పహాసః

బ్రహ్మ నుండే వ్యక్తమయ్యే లోకాలన్నీ వికసించిన పుష్పాల్లా ఉంటాయిట. నవ్వితే నవరత్నాలు రాలినట్లుగా భగవంతుని నవ్వులో నుండే అలా సమస్త సృష్టి జాలము కాంతిపుంజాలుగా వస్తున్నాయిట. అదీ ఆయన నవ్వు అని భీష్ముడు కృష్ణుని మందహాసం గూర్చి చెప్తున్నాడు. అందమైన పువ్వు వికసిస్తూ ఉంటే మనం చూడలేం. విచ్చాక చూస్తాం. ఈ రోజు మొగ్గగానే ఉన్నదనుకుంటాం. మరురోజు లేచేటప్పటికి అది విచ్చుకుని ఉంటుంది. అది విచ్చుకుంటున్నప్పుడు జరిగే లక్షల పరిణామ ప్రక్రియలని ఒక్కసారి చూశాం అనుకోండి. అందులోంచి వచ్చే కాంతి, సువాసన, అందం ఈ మూడూ మనల్ని ముగ్ధుల్ని చేస్తాయి. అటువంటి ముగ్ధత చేకూర్చే నవ్వు కలిగినవారు రాముడు, కృష్ణుడు. అలాగే మహాత్ముల చిరునవ్వుల నుండే చక్కని ప్రశాంతమైన వెలుగు వెదజల్లబడుతుంటుంది. ఒక పువ్వు యొక్క వికాసం చూసినట్లైతే ఏ విధమైన ఆనందం కలుగుతుందో అదే విధమైన ఆనందం మహాత్ముల చిరునవ్వుల నుండి వ్యక్తం అవుతుంది. నరసింహ, పరశురామ లాంటి అంశావతారాల మినహా వామనుడు, రాముడు, కృష్ణుడు అవతారాల నవ్వులు అవిధంగా ఉంటాయి. సాధకులు కూడా వీలైనంత చిరునవ్వు కలిగి ఉండాలి. అది ప్రయత్నం చేస్తే సగం ఆరోగ్యం అందులోంచే వస్తుంది. కొంతమంది ముఖం ఎప్పుడూ చిట్లించే ఉంటుంది. ఎందుకు? లోపల భావాల్లో పట్టు అట్లా ఉంటుంది కనక వాళ్ళు అట్లా ఉంటారు. భయంగా అదుర్దాగా, వెలితిగా, అనుమానంగానూ ఉంటాయి. అందుకే జ్వాలాకూలుడు చెప్తాడు. 'నీ ముఖం నువ్వు రోజూ కొంచెంసేపు అద్దంలో చూసుకుని నవ్వడం అభ్యాసం చేయ్' అని. వెకిలి నవ్వు నవ్వడం కాదు. అలా అభ్యాసం చేస్తే మనలో ఉండే tensions తగ్గిపోతాయి. పట్టు తగ్గిపోతుంది. పట్టు తగ్గితే మనలో ఉండే వెలుగు ప్రసారానికి ఆనకట్టలుండవు. అందువల్ల చోటులో ఉండే ప్రజ్ఞ చక్కగా మనలో ప్రవేశించి మనలో అన్ని మూలలకీ బాగా ప్రవహించి మళ్ళీ చోటులోకి వెళ్తూ.... ఇలా జరిగే circulatory processలో మనం ఉంటుంటాం. అందుకని మనకి హాయిగా ఉంటుంది. అలా కానప్పుడు దాన్ని మనం arrest/ బందీకృతం చేయడం వల్ల అది మనల్నే

బాధ పెడ్తూ ఉంటుంది. మనకి tension వస్తుంది. పట్టు వస్తుంది. మనసులో పట్లు ఉంటే ఒంట్లో పట్లు ఉంటాయి. అందుకని నవ్వాలి. 'నవ్వడం అభ్యాసం చేయండి. గ్రంథాలు ఎక్కడా చెప్పవని నేను చెప్తున్నాను' అని చెప్పాడు జ్వాలాకూల్ మహర్షి. ఎందుకంటే రాముడూ, కృష్ణుడూ నవ్వారు కదా. వారి ముఖమే చిరునవ్వుతో కూడినది. వారు కోపం తెచ్చి పెట్టుకోవాలి. మనం నవ్వు తెచ్చి పెట్టుకోవాలి. వాళ్ళు అవసరాన్ని బట్టే కోపం అభ్యాసం చేస్తారు. ఇహ తప్పకపోతే కోపం తెచ్చుకు ప్రవర్తిస్తారు. తత్త్వపరంగా పుష్పహాసం ఎలా ఉంటుందంటే పువ్వులు వికసించినట్లుగా భూమండలాలు, సూర్యమండలాలు, సవితృమండలాలు అలా విచ్చుకుంటూనే ఉంటాయి. అనంతకోటి మండలాలు విచ్చుకుంటాయి. ప్రతిదీ ఒక వికాసమే. ఆ వికాసంలోంచి ఒక వెలుగే, ఆనందమే! దీనిని పరతత్త్వంగా మనం చెప్పుకుంటాం. కృష్ణతత్త్వంగా చెప్పుకుంటే ఎప్పుడూ చిరునవ్వే. ఏనాడూ పోలేదు. బాగా నవ్వితే రెండు దవడలూ కలిసే చోట relaxation వస్తే, అక్కడి నుండే మొత్తం body అంతా విశ్రాంతి పొందుతుందిట. అందుకని జపాన్ వాళ్ళు అద్దంలో నీ నోరు ఎంత సాగితే అంత సాగదీసి చూసుకోమని చెప్పారు. ఒక్కొక్కళ్ళూ ఒకటి పట్టుకున్నారు పట్టుపోతుందని. అదీ పుష్పహాసః క్లుప్తంగా. రాముడి చిరునవ్వుకీ, కృష్ణుడి చిరునవ్వుకీ ఎంతోమంది ముగ్ధులయ్యారు. మహాత్ముల చిరునవ్వుకి ముగ్ధులయ్యే ఆ కళ్యాణగుణం భగవంతుని అస్తిత్వము భక్తులయందు ఉండడం చేత వారిక్కూడా ఆ గుణం కలుగుతుంటుంది. కొంతమందికి సహజంగానే ఆ చిరునవ్వు ఉంటుంది. అది పుష్పం వికసించినట్లుగా ఉంటుంది భగవంతుని నవ్వు అనే భావన ఇక్కడ యిచ్చాడు. ప్రత్యేకించి కృష్ణుడి నవ్వు గురించి భీష్ముడి సూచనగా గుర్తు పెట్టుకోవాలి.

೨೮೮ ప్రజాగరః

అసలు అతడు ఎప్పుడూ నిద్రపోడట. అమ్మవారైనా అయ్యవారిలోకి వెళ్ళి కాసేపు పడుకుంటుందేమో కానీ ఈయన మాత్రం నిద్రపోడట. ఆయన నిద్రపోతే అందులోంచి మరేమీ రాదు. Ever wakeful. మనం నిద్రపోయినప్పుడు మనలో ఉన్న ఆయన నిద్రపోతే మనం లేవం. మనకి పాద్దున్న తెలివిరావడం అంటే చైతన్యవంతులం అవడం. సాయంత్రం తెలివిపోవడం అంటే చైతన్యం సత్యంలో యిమిడి ఉండడం. లోపల తత్త్వం సత్యంగా మేల్కాంచి ఉండటం వల్ల మళ్ళీ తెలివి వస్తోంది. అదే నిద్రపోతే? సృష్టిలో అదెప్పుడూ నిద్రపోదట. అన్నింట్లోనూ మేల్కాంచి ఉంటుందిట. గుండ్రాయిలో, మామిడి చెట్టులో, జంతువులలోనూ ఇలా అన్నిటిలో మేల్కాంచి ఉంటుంది. అలా మేల్కాంచి ఉంటేనే అన్ని వ్యాపారాలూ సక్రమంగా నడుస్తూ ఉంటాయి. అందుకని జాగరం అంటాంగా! అంటే మేల్కొని ఉండడం. ప్రజాగర అంటే ప్రశస్తమైన, ప్రసిద్ధమైన, ప్రకటితమైన జాగరం. భగవతుడు నిద్ర పోవడం అస్సలు లేదు. భగవంతుడు నిద్ర పోవడం అన్నది లేదు తత్త్వపరంగా. సత్యము ఎప్పుడూ ఉండేది. శాశ్వతమైనది. అందులోంచి పుట్టుకొచ్చిన ఒక సృష్టికి కాలపరిమితి ఉండవచ్చు. ఒక సంకల్పానికి పరిమితి ఉండవచ్చు. ఆయనలోంచి పుట్టిన సంకల్పమే కదా సృష్టి! 'పరమాత్ముని సంకల్పమొ పరాపకృతివై' అంటాం. పరమాత్ముని సంకల్పం లోంచి వస్తుంది పరాశక్తి. పరాప్రకృతితో పాటే కాలం, సంకల్పం పుడుతుంది. ఆ సంకల్పానికి ఒక time limit ఉంటుంది. మన సంకల్పానికి ఉన్నట్లే. విష్ణుసహస్రనామం అనే సంకల్పం కూడా ఓ ఆరేళ్ళల్లో అయిపోతుంది. అలా పెద్ద పెద్ద సంకల్పాలు కూడా అయిపోతాయి. సూర్యమండలం అనే సంకల్పం అయిపోతుంది. అలాగే సృష్టి సంకల్పం అయిపోతుంది. మళ్ళీ ఇంకోటి వస్తుంది. అయిపోతే మళ్ళీ ఇంకొకటి రావడానికి ఎవరో ఒకరు ఉండాలి కదా! మనలో ఒక సంకల్పం అయిపోతే మళ్ళీ మరో సంకల్పం రావడానికి మనగా వాడు ఉన్నాడు కదా! సంకల్పం అయిపోయినంత మాత్రాన మనం అయిపోవడం కాదు కదా! అలాగే సృష్టి ఒక సంకల్పంగా వ్యక్తం అయినప్పుడు అది అయిపోయినంత మాత్రాన సృష్టి

అయిపోయినట్లు కాదు. ఇంకొకటి వస్తుంది. సృష్టి మొత్తం ఒక సంకల్పం. ఇటువంటివి ఎన్నయినా వస్తుంటాయి, పోతుంటాయి. అయిపోవడం అనేది ఉండదు. అందుకనే మనకి అనంతుడు, అనాది అనే నామాలు. అంతం లేనివాడు, ఆది లేనివాడు అని చెప్పడం. ఆ విధంగా ప్రజాగరుడుగా ఉన్నాడు.

986 ఊర్ధ్వగః

భగవత్తత్త్వం ఎప్పుడూ ఊర్ధ్వంగానే ప్రవహిస్తూ ఉంటుంది. దానికి పదార్థం వేలాడుతూ సమస్తమూ ఏర్పరచుకోవడం తప్ప, అది మాత్రం క్రిందకి దిగడం ఉండదు. అది అలా ఉండగా దాన్నుండి రకరకాల చైతన్య స్థితులు అల్లుకుని పదార్థమయలోకాలు ఏర్పడుతూ ఉంటాయి. అంతేకాని అది మనలో ఎప్పుడూ ఊర్ధ్వగతే చెందే ఉంటుంది. ఊర్ధ్వము అంటే స్థూలము నుండి సూక్ష్మము అని చెప్పడం జరిగింది. ఊర్ధ్వగతి అంటే ఉత్తరము. సత్యం సూక్ష్మం కన్నా అతీతమైన తత్త్వం. సూక్ష్మ స్థితి నుండి స్థూలస్థితి వరకు 'అది' ఆధారంగా సృష్టి అల్లిక శక్తి, ద్రవ్యములుగా ఏర్పడుతూ ఉంటుంది. ఈ ఏర్పడేవాటన్నిటికీ ఆధారంగా ఉన్నది మాత్రం ఎప్పుడూ ఊర్ధ్వముఖంగానే ఉంటుంది. అందుకనే భగవద్భక్తులు ఎప్పుడూ ఊర్ధ్వముఖులై ఉంటారు. ఊర్ధ్వరేతస్కులై ఉంటారని చెప్తారు అంటే వారి యొక్క ప్రజ్ఞ పాతాళం చేరే ప్రశ్నేలేదు. భూమి నుండి వెలుగుమయలోకాలలోకే ప్రసారం ఉంటుంది తప్ప అధోముఖలోకాలలోకి ప్రసారం ఉండదు. అది మనకు తెలియాలంటే ఒక్కసారి కుమారసంభవం చదువుకోవాలి. శివుని నుండి కుమారస్వామిని పొందడానికి దేవతలు చేసే ప్రయత్నం చూస్తే అర్థం అవుతుంది. అసలు ఊర్ధ్వరేతస్కులు అంటే ఎలా ఉంటారు? 'ఊర్ధ్వరేతం విరూపాక్షం విశ్వరూపాయవై నమో నమః' అసలు వారి శుక్రబీజం క్రిందకి పారనే పారదట. అమ్మవారిపై ఈయనకి ప్రేమ పుట్టడానికి రకరకాల ప్రయత్నాలు చేస్తారు. బాణాలతో కామదేవుడ్ని పంపిస్తారు. బాణాలు తగిలి ఏమిటి తగులుతున్నాయని చూస్తే అతడు కాస్తా భస్మం అయిపోతాడు. ఎదురుగా పార్వతీదేవి కనిపిస్తుంది. దేవతలు వచ్చి ప్రార్థిస్తే పెళ్ళి చేసుకుంటాడు. ఈ

రోజుల్లో పెళ్ళికి వేరే అవగాహన ఉంది. సంతానోత్పత్తికి పెళ్ళి అనుకుంటే, పార్వతి, శివుడు కలసి ఉండడానికే పెళ్ళి చేసుకుని హాయిగా ఉన్నారుట. ఒకరి దేహమునందు ఒకరికి ఆసక్తి లేదు. జీవప్రజ్ఞలుగా, ప్రకృతీపురుషులుగా, ఒకరిగా అలా వేలసంవత్సరాలు ఆనందంగా తిరుగుతున్నారు. ఎన్నటికీ దేవతలు అనుకున్న కార్యం జరగదు. ఎందుకంటే ఆయన రేతస్సు నుండి కుమారస్వామి వస్తే తారకాసురుని సంహారం జరగాలి. కానీ కలగనే కలగదు. ఎందుకు కలగదయ్యా అంటే ఊర్ధ్వగః! అందుకే మహర్షులకి కూడా ఒక పట్టాన వెంటనే సంతానం కలిగే కార్యక్రమం ఏమీ ఉండదు. అదెప్పుడూ భగవన్నిర్ణయంగానే జరగాలి. అందుకే ఋషులు వారి జుట్టు పైకి ముడివేసుకుంటారు. దానర్థం మా రేతస్సు ఊర్ధ్వముఖంగానే ప్రవహించేదే తప్ప అధోముఖంగా ప్రవహించేది కాదు, అనే దీక్ష యందు సిద్ధి పొందినవారు. అధోముఖం అంటే క్రిందకి అంటే స్థూలంలోకి ప్రవేశించడం అన్నమాట. అంటే బాహ్యంలో వారిని ఏదీ ఆకర్షించలేదు అని అర్థం. ప్రజ్ఞ బహిర్ముఖంగా ప్రవహించదు. దాన్ని పట్టుకుని అమ్మవారు ఇంత ఆటలాడి, అంతా అల్లి, మనస్సు ఇంద్రియాలు పుట్టించి, రుచులు పుట్టించి, ఈ శరీరాన్ని పుట్టించి, ఇంత తాపత్రయ పడి ఇదంతా తయారు చేస్తుంది. శివుడు మాత్రం ఎక్కడ పడితే అక్కడే ఉంటాడు. ఎక్కడున్నా ఒకటే! అక్కడ నుండి ఎప్పుడూ ఆకాశం లోకే! అగ్ని వెలిగిస్తే జ్వాల ఎప్పుడూ పైకే వెళ్తుంది. ఇంకో direction లేదు. అగ్నిశిఖ ఎప్పుడూ నిట్టనిలువుగా వెళ్ళడమే దాని తత్త్వం. ఊర్ధ్వముఖం చెందే కొలదీ పంచభూతాత్మకమైన సృష్టి మీద మమకారం, వ్యామోహం, ఆరాటం తగ్గుతాయి. ఈ ఆరాటాలు ఒక పక్క పెరుగుతూ సాధన చేస్తున్నాం అనే భ్రమలో జీవించకండి. మనకెంతెంత ఆరాటం? ఈ రోజుల్లో భక్తుల కున్న ఆరాటం మామూలు మనుషులకి లేదు. ఎందుకంటే భగవంతుణ్ణి పెట్టుబడిగా పెట్టి, సమస్త కోరికలనీ తీర్చుకోవాలని ఆరాటం. అంతేకాని, భగవోన్ముఖంగా అటు వెళ్దామని లేదు. అందుకనే వైరాగ్యం లేని భక్తి చాలా కనిపిస్తుంది ఈ రోజుల్లో. ఎంతభక్తో అంత తనవి అని అనుకునే వాటిమీద మమకారం. శరీరం నుండి బంధువుల వరకు తనవారు, తన సంపద ఇట్లాంటి వాటిపై మనకెంత మక్కువలు? అంటే మనం చేస్తున్న ప్రార్థనలు ఒక direction లో, చేసే ప్రవర్తన మరో directionలో ఉండడం వల్ల మనకి ఏమీ

ఉపయోగం ఉండదు. సహజంగా భగవత్తత్త్వం ఊర్ధ్వముఖమే. కృష్ణుడికి ఈ మొత్తంలో అర్జునుడు, పాండవులు ఇలా ఏంలేదు. ఓ గీత దాటితే అంతా ఒకటే. కానీ ప్రపంచంలో ఉన్నప్పుడు ధర్మం దాటితే, ధర్మాన్ని support చేస్తాం. దానికి సహకరిస్తాం. ఎందుకంటే సృష్టి ఏర్పరచి, ధర్మం ఏర్పరచి, సృష్టి ధర్మంగా నేనే ఉన్నాను కాబట్టి 'ధర్మాన్ని ఆశ్రయించే జీవులు నా ఆశ్రితులు' అని చెప్తాడు. మిగతా వారు కాదా? కాకపోతే వారు ఆయనలోకి ఎలా వచ్చేస్తారు? విశ్వరూప స్థితిలో అందరూ ఒకటే. అలా కాక ఓ రూపంలో దిగి వచ్చి ధర్మాన్ని నిలిపే దైవంగా ఉన్నప్పుడు, గురువుగా ఉన్నప్పుడు మంచివారికి ఆశ్రయం యిచ్చి అధర్మాన్ని శిక్షించడం చేస్తారు. అంతమాత్రం చేత అధర్మాన్ని పెరగకుండా చూడడమే తప్ప ఆ జీవులు, ఆ జీవులమీద ఏమీ వ్యతిరేకభావం ఉండదు. ఎందుకంటే అంతా తనలోకి వచ్చేవారే. ఓ పరిధి దాటి వస్తే 'దేవుడికి నేను చాలా ప్రియమైన వాణ్ణి' అనుకునే వాడికి కూడా గుండె గుభేల్ మంటుంది. భయం వేస్తుంది. మనం ఈయనకసలు ఏం కాదు అనిపిస్తుంది. అప్పుడప్పుడు తన భక్తులకది చూపిస్తాడు. నువ్వు, ఆ రాయి ఒకటే అన్నట్లుగా. భక్తుడు ఎంతసేపు ఆయన ప్రియత్వాన్ని పొంది, 'ఆయనకి నేను చాలా దగ్గర. ఆయనకి నాకన్నా సన్నిహితుడు లేడు.' ఇలా అనుకుంటూంటే అనుకోనిస్తాడు. ఒక్కోసారి ఆయన నిర్లిప్తత చూస్తే చాలా భయం వేస్తుంది. ధర్మరాజు ఒకసారి కృష్ణుణ్ణి చూసి అలా భయపడ్డాడు. అలా ఉన్నప్పుడు ఎవరూ దగ్గరకి రాలేరు. ఎంత నవ్వుతూ వచ్చినా ఏమీ ఉపయోగం లేదు. నిన్న బాగా ప్రియంగా సంభాషించాడు కదా అని అనుకోవడానికి వీలు లేదు. ఆ క్షణంలో మొత్తం సృష్టిలో ఎవరు ఎక్కడ నుండి వచ్చినా ఒకటే అన్నట్లు కనిపించాడు ధర్మరాజుకి. ఎందుకంటే ఎంతసేపూ vertical movement తప్ప horizontal movement తాత్కాలికమే. Horizontal movement is temporary to Him. His nature is to be vertical. అందుకని లింగాన్ని ఆరాధన చేసేటప్పుడు లింగాన్ని నిట్టనిలువుగా పెట్టుకుంటాం. కానీ పడుకో పెట్టి చెయ్యం కదా! ఎందుకంటే దానియొక్క స్థితి అటువంటిది.

౨౪౭ సత్పథాచారః

అందరిలో కూడా సత్పథాన్ని అనుసరించే ఒక అభ్యాసంగా ఉంటాడట. ఒక ఆచారంగా ఏర్పడతాడట. ఏంటో ఇంతవరకు ఇలా అయిపోయింది. ఇక నుండైనా బావుండాలని అనిపిస్తుంది కదా! ఏ భక్తుణ్ణి చూసినప్పుడో, ఏ భక్తుడి జీవితచరిత్ర చదివినప్పుడో, అద్భుతమైన సన్నివేశంలోనో, ఓ సద్గంథపఠనంలోనో మంచి స్ఫూర్తి వస్తుంటుంది. అది జారిపోవడం వేరే సంగతి. అసలు వస్తుంది కదా. 'ఇప్పటికే time waste అయిపోయింది. ఛీ ఇలా ఉండకూడదు. ఇలా ఉండాలి' అని లోపల నుండి అనిపిస్తుంది కదా. అంటే సత్త్వధర్మంలో మనల్ని ఉంచడానికి ప్రయత్నం చేస్తూ లోపల అభ్యాసం కల్పించేవాడిగా భగవంతుడే ఉన్నాడు. గుర్తు చేస్తుంటాడు. ఎన్నాళ్ళిలా అని. మార్చుకుంటే బావుణ్ననిపిస్తుంది. కానీ మనం మారలేము. మళ్ళీ ఏ వారానికో, పదిరోజులకో అనిపిస్తుంది. మళ్ళీ అంతే! గుర్తుచేస్తుంటాడు, మళ్ళీ మనం అంతే! సత్సంప్రదాయంలోకి మనం ఒక అభ్యాసం కల్పించేట్టుగా మనకి లోపల ఎప్పుడూ కాచి ఉంటాడు. అట్లా నడిపిస్తాడు. సత్పథమునందు నడిపించేవాడని అర్థం. సత్పథమునందు తాను నడుస్తూ నడిపిస్తాడు. ఆచారమంటే అదే! తాను ఆచరించి ఎలా ఆచరించాలో ఇతరులకి తెలిపి తన ఆచరణ ద్వారా చూపిస్తాడు. ఊరికే తెలిపితే సరిపోదు చేసి చూపాలి. Demonstration is better way of teaching అన్నారుగా. అందుకని తాను అలా జీవిస్తూ, దాన్ని ప్రకటితం చేసి, దాన్లో వారికి స్ఫూర్తి కల్పించి, వారిని కూడా ఆ మార్గంలో నడిపించడం ఆచారం. ఆచార్య అని పేరు పెట్టుకుంటే తనెవరో తనకి తెలియాలి, అలా తను నడుస్తూ ఉండాలి. తనెలా నడుస్తున్నాడో కోరినవారికి చెప్తుండాలి. తన నడక, తన మాట వారికి స్ఫూర్తినిచ్చి వాళ్ళు కూడా నడవాలి. ఇట్లా పదిమంది నడవడం చూసాక ఆయన శరీరం వదిలేసినా ఫర్వాలేదు. ఎందుకంటే వీళ్ళు ఉన్నారు కదా ఉదాహరణగా. వీళ్ళని చూసి ఇంకొకరు. అది ఆర్య సంస్కృతి. అలా సత్పథం లోకి మనుషులు వచ్చే ఆచారం ఒకటి, ప్రతి సత్పురుషుడు తన నడక ద్వారా చూపిస్తాడు బహిర్గతంగా. అంతేకాకుండా అంతర్గతంలో కూడా సత్పథంలో నడిచేవాడిని చూస్తే 'మనం కూడా ఈయనలా వుంటే

బావుండు' అనిపించే సంస్కారం ఉంటుంది. మనలో ఆ సంస్కారంగా ఉన్నది కూడా ఆ భగవత్తత్త్వమే! ఇంకా అదలా అనిపించలేదనుకోండి, ఇంకా పడుకున్నాడని అర్థం. కృష్ణుడు భగవద్గీతలో 'కొంతమందిలో నిద్రపోతుంటాను. కొంతమందిలో శిశువులాగా మేల్కొంటాను, మరికొంతమందిలో హనుమంతుడివలే గంతులు వేస్తుంటాను. మరికొంతమందిలో పూర్ణంగా ఉంటాను', అని నాలుగు రకాలుగా చెప్తాడు. కొంతమందిలో ఉన్నాడు కానీ వాడు busy కనుక వాడికి అంతరాయం కలిగించకుండా అట్లా గాడిదలా వదిలేస్తాడు. ఎందుకంటే వారందరిలోనూ సన్నివేశాలలోంచి వాడు నేర్చుకుంటాడు. జీవితం కన్నా పెద్ద గురువు ఎవరూ లేరు. జీవితసన్నివేశాలే నేర్పుతుంటాయి ఎవరికైనా. మనకి మించిన సన్నివేశం వచ్చినప్పుడు ఎవరి కాళ్ళో పట్టుకోవడం మొదలవుతుంది. అంతవరకు మనకాళ్ళే! కష్టం వచ్చినప్పుడే కదా ఏదో గుడో, గురువో, దైవమో, భజనో, సంకీర్తనమో, స్తోత్రమో. వాడికి తెలుసు ఎప్పుడో ఒకప్పుడు వస్తాడని. వాడులేస్తే వాడిలో శిశువల్లే పుడతాడట. ఓ హనుమంతుడి గుడికో, వినాయకుడి గుడికో వెళ్దామని మొదలువుతుంది. అంతటితో ఆగదు. అక్కడి నుండి ఇంకొకటి వస్తుంది. ఇంకొకటి వస్తుంది. అలా లోపలి నుండి వస్తుంటాయి. ఒక్కసారి శిశువై లేచాక కాళ్ళూ, చేతులూ ఆడిస్తాడు. కెవ్వుమంటాడు. రకరకాలుగా ఆడిస్తాడు. అంటే static గా ఉండేది dynamic అయ్యింది. అక్కడి నుండి రుచి బాగా పెరిగి గంతులు వేస్తాడు. అంటే చప్పుడు చేసే భక్తులు ఎక్కువ కదా. వారిలో కోతిగా ఉన్నాను అంటాడు. అంటే inconsistency. కాసేపు ఇది, కాసేపు అది అంటూ కొమ్మల మీదకి ఎగిరి, ఏదో కాయ కొంచెం కొరికి అది పారేసి, మరో కొమ్మమీదకి ఎగిరి ఇలా చేస్తాం. అది కోతి అంటే. అలా కొన్నాళ్ళు తిరిగి తిరిగి ఒక సద్గురువు వద్దకి చేర్తారు. అది తప్పదు అందరికీ. కొంతమందికి ముందే అయిపోయి ఉండాలి. కొంతమందికి అవుతూ ఉండాలి. కొంతమందికి ఇంకా మొదలవ్వకపోయి ఉండాలి. రాంగానే అక్కడ స్థిరపడతాడు. ఇంక ఎక్కడికీ వెళ్ళనక్కరలేదనిపిస్తుంది. అది తెలిసి ఒక పాగరు పుడుతుంది. మిగతాదంతా bash ఇది ఒక్కటే right అనుకుంటాడు. ప్రతి సద్గురువు వద్ద ఉండే శిష్యుడికి ఇదొక రోగం. ఎందుకంటే మన గురువుగారిదే అసలు path

మిగతావాళ్ళవి ఏమీ లేదని. కొన్నాళ్ళు పోయాక అందరు సద్గురువుల యొక్క తత్త్వం ఒకటే అనే స్థితికి వచ్చేసరికి నిశ్చలమైన వెలుగు కిరణంగా అయిపోతాడు. ఇలా నాలుగు స్థితులు చెప్తాడు. సత్పథంలో ఇవన్నీ మనకి అభ్యాసంలో వచ్చేవే. వచ్చి ఒకచోట గట్టిగా, స్థిరంగా, నిశ్చలంగా, ఇంక దిక్కులు చూడకుండా, కళ్ళెం కట్టిన గుర్రం లాగా, ఆ మార్గంలోనే నడిచి వెళ్తూ అటూ ఇటూ గడ్డి కోసం చూడరు. కళ్ళెం పక్క చూపులు లేకుండా ఉండేందుకు కదా కట్టేది. పక్క చూపులు లేకుండా ముందుకు సాగేవరకు ఈ ఆచారాన్ని అభ్యాసరూపంలో అందిస్తూ ఉంటారు. అలా మనలో ఉన్నాడు. అలా సంస్కారాలు, సంప్రదాయాలు ఏర్పరుస్తాడు. సత్సంప్రదాయాలను ఆ విధంగా మనం అవగాహన చేసుకోవాలి. వాటిని పాటిస్తూ ఉండాలి. ఆయన పాటించి మనకు నేర్పాడు. నేను ఎవరికీ దణ్ణం పెట్టక్కర్లేదు అనుకునే సమూహాల మధ్య తాను దైవం అయినప్పటికి పెద్దలందరి పాదాలకూ నమస్కరించాడు. బ్రాహ్మణులకూ, ఋషులకూ నమస్కరించాడు. నేనే భగవంతుణ్ణి, నేనెందుకు నమస్కరించాలి అని తత్త్వం చూపించలేదు. ఎందుకంటే నేను పెట్టకపోతే వాడూ పెట్టడు. ఈయన పెట్టకపోయినా ఫర్వాలేదు కానీ ఈయనని చూసి నేర్చుకునేవారిలో ఈయనలా తయారవడంలో పాడయిపోయే అవకాశం ఉంది కదా! యద్యదాచరతి శ్రేష్ఠః పెద్దవాళ్ళు ఏంచేస్తే చిన్నవాళ్ళు అదే చేస్తారు కాబట్టే చిన్నవాళ్ళకోసం నేను కూడా అలా జీవించి చూపిస్తున్నాను అని చెప్పాడు. ఇలా ఆచారాలు ఏర్పరుస్తాడు. భారతీయ తత్త్వంలో ఈ సత్పథాచారం చాలా ఉన్నది. అది మనం గొప్ప చెప్పుకోవడం కాదు. అది మన అదృష్టంగా భావించాలి. మిగతాచోట్ల ఆచారాలన్నీ పోయినాయి. ఏమిటో ఆచారము? సత్పథమునందు నడిపించే ఆచారం! దాన్నే యోగమార్గము! అంటారు. మనల్ని మనం తెలుసుకునే పద్ధతి! అంటారు. దానికి మన శరీరాన్ని ఏ నియమాలలో ఉంచాలి? ఇంద్రియాలని ఏ నియమాలలో ఉంచాలి? మనస్సుని ఏ విధంగా నియమించాలి? ప్రాణమును ఏ విధంగా నియమించాలి? తద్వారా అంతర్ముఖులం ఏ విధంగా కావాలి? వీటన్నిటికీ ఒక ఆచారసంపత్తి ఉన్నది. ఇవన్నీ చేయకుండా ఏదో కొంతసేపు మనకి తోచిన పద్ధతుల్లో గొడవ చేసేసి, చాలా సేపయ్యింది ఇంకా ఏమిటి మనకి

కనిపించడం లేదనేట్లుగా ఉంటే ఎలా? యోగమార్గం ముఖ్యం. అదొక్కటే మనల్ని భగవంతుడికి చేర్చే రాజమార్గం! దానికి అనుపానాలుగా భక్తి, జ్ఞానాలుండాలి. భక్తి, భక్తిగానూ, జ్ఞానం, జ్ఞానంగానూ ఉంటే ప్రయోజనం లేదు. భక్తి జ్ఞానములు యోగముతో జోడించి నిర్వర్తించుకుంటే పరిణతి చక్కటి క్రమంలో జరుగుతుంది. అలా కాకపోతే జరగదు. జ్ఞానం కలగాలంటే గ్రంథపఠనం చేయాలి. తెలుసుకోవాలనే తపన ఉండాలి. దానివల్ల మనసుకీ, బుద్ధికీ వికాసం. భక్తి సంకీర్తనములు, శ్రవణములు, స్తోత్రములు, పూజాదికార్యక్రమములు, అభిషేకములు చేసుకోవడం ద్వారా మనలో వినయ విధేయతలు, శ్రద్ధ పెరుగుతాయి. ఏదో ఒకటి కాక, రెండూ చేసుకుంటూ యోగంలో ఉండాలి. అంటే యమనియమాదులు ఆచరిస్తూ, మనసుకు ప్రశాంతత కలిగించుకుని, శ్వాస మీద ప్రాణాన్ని ఉంచి అంతర్ముఖం కావడం యోగమార్గం. ఈ మూడూ ఇలా కలిసే ఉండాలి. ఇవన్నీ సంప్రదాయం క్రింద, ఆచారం క్రింద, సంస్కారాల క్రింద, భారతీయసంస్కృతిలో పదిలపరచి ఉంచారు. భగవంతుడు మళ్ళీ దిగివచ్చి మళ్ళీ దాన్నే అందిస్తూ ఉంటాడు. భగవంతుడైన శ్రీకృష్ణుడు దాన్నే మళ్ళీ వచ్చి అందించాడు. యోగాన్ని సంస్కరించి, పునః ప్రతిష్ఠ చేశాడు. పరంపరను ఏర్పరచాడు. వాఙ్మయాన్ని వేదవ్యాసుడి ద్వారా ఏర్పరిచాడు. ఉద్ధవాదుల ద్వారా భక్తిమార్గానికి ప్రాణప్రతిష్ఠ చేశాడు. మైత్రేయాదుల ద్వారా యోగాన్ని పునఃప్రతిష్ఠ చేశాడు. మూడు వాహికల ద్వారా మూడింటినీ చేశాడు. ఇంతకన్నా ఏం చేయ్యాలి? యోగం పేరున వడియం ముక్కల్లా తయారుకారాదు. భక్తి, జ్ఞానం లేకుండా కొంతమంది తలకింద ఓ యిటుక పెట్టుకుని అన్నీ మాస్టారు చేసుకుంటారు అని పడుకుంటారు. ఏం చేసుకుంటారు? హాయిగా నిద్రవచ్చేట్లు, ఇతరులకు అంతరాయం కలుగకుండా చూస్తారు. Master EK భక్తి వృద్ధి కావించారు. జ్ఞానం అందించారు. యోగాన్ని అందించారు. సద్గురువు అలా చేస్తుంటాడు. మనం కూడా Master EK అని అరిస్తే రాదు. నడిస్తే వస్తుంది. Master EK వలే భక్తిశ్రద్ధలు, జ్ఞానము, యోగము నందు నిలచి ఉండడము ఉండాలి. సహజమైన వాహికగా ఉండాలి. అప్పుడే పూర్ణమైన ఆచారం అవుతుంది. సహజ వైరాగ్యం వస్తుంది.

188 ప్రాణదః

ప్రాణాన్నిచ్చేవాడని అర్థం. అందరిలో ప్రాణం ఆయనందించిందే అనే భావం ఒకటి ఉండగా, ఆ సత్పథాచారంలో నుండి క్రొత్త ప్రాణం పుడుతుంది. అంటే ప్రాణానికి ఊపు వస్తుంది. సరైన యోగమార్గంలో ముందుకు వెళ్ళేవాడికి ప్రాణం వృద్ధి చెందుతుంది తప్ప సన్నగిల్లదు. ప్రాణం సన్నగిల్లుతోందిట అంటే ఆచరణలో తేడా ఉందని అర్థం. ప్రాణం పెంపొందుతోందిట అంటే యోగంలో ముందుకు వెళ్తున్నాడట. ఈ ప్రాణదః నామం సత్పథాచారః అనే నామం తర్వాత వచ్చింది కాబట్టి సత్పథమును ఆచరించడం వల్ల మళ్ళీ ప్రాణం పెంపొందుతుంది. Prana Treat అన్నారు కదా. అంటే ప్రాణాన్ని పెంపొందించడం, ప్రాణాన్ని సరిదిద్దడం. మళ్ళీ మన యోగమునకు అంతరాయం కలగని స్వస్థత యిస్తారు. అంటే కండలు పెంచి కోడిరామమూర్తి లాగా తిరుగుతామని కాదు. యోగమునకు మొదటి అంతరాయం అనారోగ్యం అని చెప్పారు. యోగమునకు అంతరాయము లేనంతటి ప్రాణశక్తిని కలిగిస్తాడు. స్వస్థత చేకూరుస్తాడు. మనం అనుకున్నట్లు కాదు వాళ్ళ లెక్కలో. మళ్ళీ క్రొత్త ఊపిరి పోసారంటారు చూశారా. సద్గురువు ఆ విధంగా క్రొత్త ఊపిరి పోస్తాడు. సత్పథాచార మార్గంలో మనం వెళ్తుంటే, ఆచరణలో ఉన్నప్పుడు ప్రాణం ఆ విధంగా వృద్ధి చెందుతుంది అని అర్థం.

189 ప్రణవః

అంతటితో ఆపడుట. మనస్సు ఎప్పుడైతే ప్రాణం మీద అంటే శ్వాస మీద లగ్నం అవుతుందో అప్పుడు అంతర్ముఖం అవుతుంది. అక్కడి నుండి స్పందనం వద్దకు వెళ్తుంది. మరి స్పందన ప్రాణం యొక్క ప్రవృత్తే కదా. ఆ స్పందనం నుండి ప్రాణం యొక్క లోతుల్లోకి ఇంకా వెళ్తుంటే ప్రాణమును దాటి ప్రణవంలోకి వస్తాం. ప్రణవానుభూతి. ఓంకారం యొక్క అనుభూతి. ప్రణవముగా మళ్ళీ గోచరిస్తాడు. ఆ విధంగా ఇక్కడ అర్థం చెప్పుకోవాలి.

೨೭೦ పణః

ఓంకారం చేసే తత్త్వం లోకి మనం ప్రవేశించామన్నమాట. సత్ప్రథాచారులం అవడం వల్ల క్రొత్తఊపిరి అందుకుని ఆ ప్రాణం పట్టుకుని అంతర్ముఖులమై మనలో అనుస్యూతంగా జరిగే ప్రణవము నందు ఆసక్తి కలవారమైనప్పుడు ఓంకారంలోకి అంటే ఓంకారం చేసే తత్త్వంలోకి ప్రవేశించినపుడే అసలు విలువ! పణః అంటే అసలు విలువ. The Original value, అంటే ప్రణవానికి ఏది ఆధారమో అది కనిపిస్తుంది. అది పణం. Value విలువ, అసలు విలువ. ఖరీదు కట్టలేని విలువ. దాన్నుండే అన్నీ అందుకునే సరికి ఈ పాదంలో మొదటి నామమైన ఊర్ధ్వః. Vertical levels అన్నారే CVV గారు, అది అయిపోతుందన్నమాట. చైతన్యం స్థిరమై నిట్టనిలువుగా, నిటారుగా స్థితప్రజ్ఞత చెంది ఉంటుందన్న మాట. ఇలా ఈ నామాలలో మనకి ఒక గొలుసు ఉన్నది. పణం పెట్టడం అంటే విలువలు. అవన్నీ చిల్లర విలువలు. అదే విలువైనది. అందులోంచే ఓంకారం పుట్టింది. అందులోంచే ప్రాణం పుట్టింది,అందులో నుండే సమస్తం పుట్టింది కాబట్టే అన్ని విలువలకి మూలమైన విలువ. అమ్మవారి విలువ అందులోంచే పుట్టింది. బ్రహ్మ విలువ అందులోంచే పుట్టింది. త్రిమూర్తుల విలువ, దేవతల విలువ, ఆదిత్యుల విలువ, రుద్రుల విలువ, వసువుల విలువ, అన్ని విలువలు అందులోంచి పుట్టినవే. అన్ని విలువలకు మూలమైన విలువ గనుక పణం. విలువకట్టలేనంత విలువ కలిగినటువంటి తత్త్వము నందు మనం ఇమడడానికి అవకాశం ఏర్పడుతుంది.

౨౨1 ప్రమాణం

భగవంతుడే సమస్తమునకు ప్రమాణము. అంటే ఆయన యొక్క ప్రవర్తన ఆయన నుండి దిగివచ్చిన తత్వము లేక వేదము, యోగమార్గము, జ్ఞానమార్గము, భక్తి మార్గము ఈ విధంగా రకరకములుగా ఆయన నుండి దిగివచ్చినవన్నీ కూడా standard/ authority అంటామే, ఏమాత్రము సంశయము, సందేహముకు తావులేని వివరణగా, అవగాహనగా మిగిలి ఉండే తత్వము. ఏ స్థితి చెందితే ఇక ఇంతకన్నా తెలుసుకోవలసింది లేదు అనే స్థితికి చేరతామో, ఆ ప్రమాణంగా ప్రతి విషయమునందు ఉంటాడు, ప్రతి కార్యక్రమమునందు ఉంటాడు. ఒక సృష్టి కార్యక్రమంలో కూడా అదే విధంగా ఉంటాడు. ఆయనయే ప్రమాణము. ఎప్పుడు ఎవరికీ ఏ సందేహము కలిగినా, ఏ సందిగ్ధత కలిగినా, ఏ ఘర్షణ వచ్చినా, ఇక దారి ఎటు? అనే పరిస్థితి వచ్చినా, అక్కడ ప్రశ్న వేసి తెలుసుకున్నట్లయితే పరిపూర్ణమైన పరిష్కారం అందుతుంది. అందుకని ప్రమాణం. అక్కడ అంటే ఎక్కడ? అని మనకి ఒక ప్రశ్న వస్తుంది. అది ఎక్కడో ధ్యానయోగంలో శ్రీకృష్ణుడు చెప్పాడు. 'అక్కడ మనసు నిలుపు' అంటాడు. అందుకని ఎవరికి ఏ పరిష్కారం కావాలనుకున్నా కూడా మనలో ప్రమాణంగా నిలిచి, మనకి అంతఃసాక్షిగా ఉండి, అంతఃబోధకుడిగా ఉండి, సమస్తమును అంతర్ముఖముగా మనకి అందించి, మన సమస్యకు పరిష్కారము ఇవ్వగలిగిన ప్రమాణము. మనకే కాదు దేవతలకి కూడా అట్లాగే పరిష్కారం ఇస్తాడు. దేవతలకే కాదు ఎవరి నుండి అయితే ఈ దేవతలందరూ పుట్టుకొచ్చారో ఆయనకి కూడా అక్కడ నుంచే పరిష్కారం. సమస్తమునకు పరిష్కారాన్ని అందించి తాను ప్రమాణంగా ఉన్నవాడు. దేవతలందరికీ సమస్య వస్తే బృహ్మాణముగా వ్యక్తమైన తత్వము అయిన బ్రహ్మగారికి విన్నవించుకుంటే, ఆయన అంతర్ముఖుడై నారాయణుడి యొక్క ఆజ్ఞ ఏమిటో తెలిసి, అది వీరికి అందించి 'ఈ ప్రకారంగా నారాయణుడు దిగి వస్తాడు, సమస్య పరిష్కారం అవుతుంది, అంతవరకు మీరు భగవద్భావనలో బాగా ఉండండి, కాలం రూపంలో దిగివస్తాడు' అని చెప్పిన సన్నివేశాలు మనం చాలా చూస్తాం. అలా బ్రహ్మకే ఘర్షణ వచ్చి, సమస్య వచ్చి, కష్టం వచ్చిన సందర్భంలో కూడా,

బ్రహ్మకి మళ్ళీ సమస్య పరిష్కారం చేసిన సందర్భంగా మనకి వేదములను అందించడంగా ఉంటుంది. మనలో కూడా మనం నారాయణ తత్వం యందూ ఉన్నాం, బ్రహ్మ తత్వము నందూ ఉన్నాం, దేవతాతత్వాలన్నీ ఉన్నాయి, ఆసురీ తత్వములన్నీ ఉన్నాయి, మానుషీ తత్వములు ఉన్నాయి, పశు ప్రవృత్తి ఉన్నది. అన్నీ ఉన్నాయి. మొత్తం సృష్టి మళ్ళీ మానవుడు. మొత్తం సృష్టి అంతా ఒక sampleగా చేసేసి వీడ్ని పట్టుకొచ్చాడు. అందుకని మనల్ని మనం తెలుసుకుంటే అంతా తెలుస్తూ ఉంటుంది అని చెప్పడం. సమస్తము మనలో ఉన్నది కాబట్టి మనం ఉన్న స్థితి నుండి ఆ స్థితికి ఒక్కసారి స్మరణ మాత్రం చేత చేరవచ్చు. అది మనయందు మనం ఉండడంగా ఉంది. దానిని మనం ప్రశ్నిస్తే అక్కడి నుండి సమాధానం రావడం అనేది వేద సాంప్రదాయం. బాగా లోతుల్లో మనల్ని మనం ప్రశ్నించుకుంటే లోపలి నుండి 'అది' మనకి సమాధానం ఇస్తూ ఉంటుంది. అలా విని చేసినవాడే తెలిసినవాడు. ఎక్కడ ఉంటే అక్కడ కళ్ళు మూసుకుని అలా నిశ్శబ్దంగా ఉంటే, తన లోపల ఉన్న సంకల్పంగా తను ఉన్నవాడు ఆ సంకల్పాన్ని కూడా, ఆ సంకల్పం ఎక్కడ నుండి ఉద్భవిస్తోందో దాని యందు సమర్పణ చేసినట్లయితే, సమస్యను అక్కడ సమర్పణ చేసి వేచిఉన్నట్లయితే అక్కడ నుండి సమాధానం వస్తుంది. ఎవరికొచ్చినా లోపల నుండి రావాల్సిందే సమాధానం. మనం వెళ్ళి మహాత్ములని అడిగినప్పుడు వాళ్ళు కూడా అలాగే అంతర్ముఖులై, నారాయణలోకం నుండి సమాధానం తీసుకొచ్చి మనకి అందిస్తారు. ప్రవక్తలంతా అట్లా విని పనిచేసిన వాళ్ళే. సిద్ధులంతా అట్లా విని పనిచేసిన వాళ్ళే. గురువులంతా అట్లా విని పనిచేసిన వాళ్ళే. యోగులంతా అట్లా విని పనిచేసిన వాళ్ళే. అంటే ఈ మొత్తం చాంతాడు పట్టుకుని వెళ్ళక్కర్లా. పరంపరాగతమైన మన కన్నా ముందు వచ్చిన వాళ్ళని మనం పూజించాలి. వారి యొక్క ఆశీర్వచనం అందుకోవాలి. వారి యందు శ్రద్ధా భక్తులు కలిగి ఉండాలి. పరతత్వం వారి ద్వారా దిగిరావడంగా అని ఉండదు. నీలో ఉన్నది. వీరందరినీ మనం ఆశ్రయించడం వల్ల దారి సుగమం అవుతుంది. ఒక్కసారి సిద్ధుడు అయిన తర్వాత మాటిమాటికీ గురువుగారి దగ్గరికి వెళ్ళి ప్రతిదీ చెప్పుకుని పనిచేసేది ఏం ఉండదు. మనం కూడా అట్లా అంతర్ముఖులమై విని, ఆ వినికిడి ప్రకారం నిర్వర్తించుకునే పద్ధతి ఒకటి ఉన్నది. అది అందే వరకు

అట్లా వినగలిగిన వాళ్ళ దగ్గరకు చేరడం అనేది ఒక సాంప్రదాయంగా ఏర్పడింది. వినగలిగి చెప్పగలగాలి. వినగలిగితే చెప్పచ్చు. వినకపోతే ఏం ఉంది? అబద్ధం చెప్పాలి. తెలియకపోయినా తెలిసినట్టు చెప్పాల్సొస్తుంది కదా! ఇట్లా ప్రమాణం ఎవరయ్యా అంటే అందరికీ వాడే ప్రమాణం! బ్రహ్మాది దేవతలకు అతడే ప్రమాణం. సమస్త సృష్టికి అతడే ప్రమాణం. అతడు ఇచ్చిన వాఙ్మయము బ్రహ్మకి వేదము. అదియే ప్రమాణము. వేదము అంటే ఏది తెలిస్తే ఇక తెలియవలసింది అంటూ ఏమీ లేక మిగిలి ఉంటాడో ఆ తెలియడాన్ని వేదము అంటారు. తెలియడం, తెలుసుకునేవాడు, తెలుసుకోబడేది మూడు ఒకటే అని తెలిసి, అది ఒకటి మూడు అవుతూ ఉంటుంది, మూడు ఒకటి అవుతూ ఉంటుంది అనే స్థితి యందు, అనుస్యూతం ఆ ప్రజ్ఞయందు, నిలబడి ఉన్నవాడిని 'వేదవిత్' అంటాం. అన్నిటికీ ఆయనే ప్రమాణం. అందుకని ఏం చెయ్యాలయ్యా అంటే 'అక్కడ' చెప్పకోవాలి. 'అక్కడ' నుండి అందుకోవాలి. 'అక్కడ' నుండి సమస్యలకు పరిష్కారం తెచ్చుకోవాలి. అలా శ్రీకృష్ణుడు ప్రమాణంగా నిలిచి ఉన్నాడు. ఏది నువ్వు చేసిన దానికి ప్రమాణం? అంటే 'నేనే' అని చెప్పే దమ్ము గలిగినవాడు. ఆయనే ప్రమాణం. నేను చేసినట్టే చేయండి, కాపోతే అతడేం చేశాడో బాగా అవగాహన చేసుకుని చేయండి. సత్త్వగుణ సంపన్నులకు మాత్రమే అవగాహన అవుతుంది. ఆనాటి నుండి ఈనాటి వరకు కృష్ణుడు అంటే రకరకాల భావములు ఉండేవాళ్ళు ఉంటారు. ఎందుకు ఉంటారయ్యా అంటే పూర్ణమైన తత్వం లోకి పెరిగితే తప్ప, కృష్ణతత్వం అవగాహన అవడానికి వీల్లేదు. మహా జ్ఞాని అయిన భీష్ముడు కృష్ణుని యొక్క ప్రమాణం దర్శించాడు. ఎలా దర్శించాడు? ధర్మానికి గ్లాని కలుగుతున్న సందర్భంలో, అధర్మానికి బలం బాగా పెరిగి ధర్మానికి బలం తగ్గిన సందర్భంలో, అధర్మం ధర్మం మీద పై చేయిగా వలపన్ని మోసం చేసి అందుకుంటున్న సందర్భంలో కొన్ని చిన్న ధర్మాల్ని పెద్ద ధర్మం కోసం ఆయన త్యాగం చేశాడు. అది కదా భీష్ముని యొక్క సంహారానికి తాను ఉపక్రమించడం అనేది, ఆడిన మాట తప్పకూడదు అది ఒక ధర్మం కదా! భీష్ముడు తన తండ్రి క్షేమం కొరకు తానుగా చేసిన వాగ్దానాన్ని తప్పక ఉండడం అనే ఒక ధర్మంలో చిక్కుకుని ఉన్నాడు. ధర్మంలో చిక్కుకోవడం ఉండకూడదు. ఆ విధంగా చిక్కుకుని ఉండడం చేత, ఎవరైతే ఈ వరాలు తన

దగ్గర నుండి కోరారో వారి యొక్క ఉద్దేశ్యములు అపవిత్రములు అవడం చేత, అవి ఫలించకపోవడం చేత, కురు సామ్రాజ్యానికి అధిపతి లేని పరిస్థితి ఏర్పడినప్పుడు సత్యవతి దేవి చెప్తుంది. 'మా నాన్న కుత్సితమైన ఆలోచనల చేత ఇవన్నీ చేశాడు కాబట్టి అయన యొక్క ఆలోచనలు ఫలించలేదు. నేను మీ నాన్నగారిని కలిసే సన్నివేశమే జరగక ఉండి ఉన్నట్లయితే నీవు రాజుగా ఉండే వాడివి కదా! మా తండ్రి పన్నిన పన్నాగం దురుద్దేశ్యంతో కూడింది కాబట్టి అది ఫలించలేదు. కాబట్టి ఇప్పుడు నువ్వు రాజ్యాన్ని ఏలు' అని చెప్పినప్పుడు 'నేను మాట ఇచ్చానని, మాటకు కట్టుబడి ఉంటానని' అంటాడు. మాటకు కట్టుబడి ఉండడం అనేది చాలా ఉత్తమమైన ధర్మం. అందులో సందేహం లేదు. కానీ అది కారణంగా లోక శ్రేయస్సు దెబ్బతింటోంది అనుకోండి, అది కారణంగా ధర్మానికి గ్లాని కలుగుతుంది అనుకోండి, ఓ లక్ష మందికి బావుంటుందిట నువ్వు చెడిపోతావుట అంటే పరవాలేదుట. నువ్వు నరకానికి పోతావు కానీ ఓ లక్ష మంది స్వర్గానికి వెళ్తారు అంటే ఫర్వాలేదుట. రామానుజాచార్యుల వారికి వారి గురువుగారు శ్రీరంగంలో గుళ్ళోకి తీసుకువెళ్ళి, స్వామి సన్నిధిలో, 'నీకు అర్హత ఉన్నది కాబట్టి నేను నీకు మోక్ష ప్రాప్తిని కలిగించే అష్టాక్షరీ మంత్రం అందిస్తున్నాను. అందుకని ముక్తసంగుడవై జీవించి ప్రజలకు సేవ చేసుకోమని' చెప్పాడు. 'ఎవరు చేసినా ముక్తిని ఇస్తుందా?' అన్నాడు రామానుజుడు. 'ఇస్తుంది' అన్నాడా గురువుగారు. పుచ్చుకున్నాడు. పుచ్చుకున్న వెంటనే గబగబా శ్రీరంగం గోపురం శిఖరం పైకి ఎక్కాడు. ఎంత ఎత్తు ఉంటుందో మీకు తెలుసా? మనం ఎక్కితే కళ్ళు తిరిగి పడిపోతాం. అటువంటిది శిఖరాగ్రం చేరుకుని గంటలు కొట్టి, ఊళ్ళో వాళ్ళందరిని పిలిచి 'మీ అందరికీ తరుణోపాయానికి నేను ఇప్పుడే అందుకున్న మంత్రం మీకు బోధ చేస్తున్నాను. మీరందరూ చేసుకోండి' అని వారందరికీ ఉపదేశం చేసేశాడు. వైష్ణవ సంప్రదాయం అంటే అట్లా ఉంటుంది. అంటే 'నేనొక్కడినీ ఉట్టికట్టి స్వర్గానికి వెళ్ళడం కాదు. నేను నరకంలోకి వెళ్ళినా ఓ పదిమంది స్వర్గంలోకి వెళతారు అంటే ఫరవాలేదు. పదిమంది వెళతారు. నేను నరకంలో ఉంటే అక్కడ కూడా ఇదే పని చేస్తా. ఎక్కడున్నా ఇదే పని చేస్తా' అంటాడు. ఇటువంటివి కొన్ని మహా ధర్మాలు ఉంటాయి. అంటే తనకి చెడు జరిగినా పది మందికి మంచి

జరుగుతుందిట, ధర్మం తప్పడం వల్ల తనకి చెడు జరుగుతుందిట చెయ్యకూడదు. 'పదిమందికి మంచి జరుగుతుందిట నీకు కొంచెం చెడు జరిగినా' అంటే చేయగలిగిన ధైర్యం ఉండాలి. అది కృష్ణుడు చూపిస్తాడు భీష్ముడికి. నీ మూలంగా కదా ఇవాళ ఇంత దూరం వచ్చాం మనం. అసలు ఈ ధృతరాష్ట్రుడే పుట్టేవాడు కాదు. ధృతరాష్ట్రుడు పుట్టవలసిన అవసరం ఎక్కడ నుండి వచ్చింది? భీష్ముడు నేను ఒప్పుకోను అంటాడు వాళ్ళ అమ్మ చెప్పినా. సత్యవతి దేవి చెప్తే 'అలా కుదరదు అమ్మా నేను కట్టుబడి ఉన్నవాడిని' అని చెప్పేస్తాడు. ఇంత కట్టుబాటుగా తను ఉంటే, తనతో సమానమైన జ్ఞాని, పుట్టీ పుట్టంగానే సమస్తమైన జ్ఞానమును ఎరిగి తల్లి కనుల ముందే అలా పసి బాలుడై, ఆ తరువాత యువకుడై, ఆ తరువాత మధ్య వయస్కుడై గడ్డాలు మీసాలు వచ్చేసి అన్నీ క్షణంలో జరిగిపోయాయి. ముహూర్త కాలంలో వేదవ్యాసుడు యొక్క జననం నుండి ఆయన ఒక మహర్షిగా అట్లా పెరిగిపోతాడు. అంటే ఇదేమన్నా సామాన్యమైన విషయమా? 'తల్లీ! నేను దిగివచ్చిన కార్యం వేరే ఉన్నది. కాబట్టి నాకు శెలవు ఇవ్వు. నా పని మీద నేను వెళుతున్నా' అని పుట్టీ పుట్టంగానే పనిలోకి వెళ్ళిపోయాడండీ! ఇప్పుడే కదా వచ్చాం. కాసేపు విశ్రాంతి పుచ్చుకుందాం అనుకోలా. కదా! మనమైతే అంత ప్రయాణం చేసి వచ్చాం కాస్త విశ్రాంతి తీసుకోవాలి——ఇలా ఉంటుంది కదా! ఆయన ఎక్కడ నుండి ప్రయాణం చేసి వచ్చాడు, ఉపరిచరవసువు అక్కడ నుండి దింపారు. 'రావయ్యా' అన్నారు. ఉపరిచరవసువు అంటే చాలా పైన తిరుగుతూ ఉంటాడట. అమ్మ! ఇప్పుడే దిగాం కదా దేహంలోకి, కాస్త విశ్రాంతి తీసుకుందాం అనుకోలేదు. మామూలుగా Janatha express లో second class 71, 72 సీట్లు వచ్చాయనుకోండి! అక్కడ వస్తే ఇంక సువాసన, మొత్తం ప్రయాణం అంతా మనకే ఉంటుంది. ఇంక ఎవరికీ ఉండదు. ఇంటికి వచ్చిన తర్వాత పని అంటే కాసేపు ఆగు అంటాం కదా! అలా అనకుండా తల్లికి నమస్కారం చేసుకుని వెళ్ళిపోయాడుట. వెళ్ళడం వెళ్ళడం భూలోకం, కృష్ణలోకం మరి కృష్ణ ద్వైపాయనుడు కదా! అలా తపస్సులోకి వెళ్ళిపోయాడు. పని మొదలు పెట్టుకున్నాడుట. తండ్రి ఆజ్ఞ అది. ఆయన్ని పిలుచుకున్నది సత్యవతీ దేవి. పిలుచుకుని, 'రాజ్యం దుర్భిక్షం అయిపోతుంది రాజు లేకపోతే. మరి నా తనయులు మరణించారు. నీవు కూడా నా

తనయుడవే కాబట్టి నీ నుండి కనక వారికి సంతానం కలిగినట్లయితే సామ్రాజ్యం నిలుస్తుంది. రాజు ఉంటాడు' అని కోరుతుంది. కోరితే వేదవ్యాసుడు ఏం చెప్పాలండీ? హిమాలయాల్లో వేదాల్ని వర్గీకరణ చేస్తున్నాడు. పురాణాలు రాసుకుంటున్నాడు. పెళ్ళి చేసుకున్నాడు. ఒక కొడుకు ఉన్నాడు. కదా! మా అవిడ ఏమనుకుంటుంది? మా అబ్బాయి నా గురించి ఏమనుకుంటాడమ్మా? అదీ కాదు ఇంతమంది శిష్యులున్నారు. తిరిగి వెళితే నా గురించి వాళ్ళు ఎటువంటి భావన భావిస్తారో? తప్ప కదా? ఇట్లా నువ్వు అడగవచ్చా?' అనాలా? భీష్ముడు అనాల్సింది భీష్ముడు అనకపోగా, వేదవ్యాసుడు ఇటువంటి స్థితిలో 'అలాగేనమ్మా' అన్నాడు. అయినప్పటికీ ఫలించలేదు. ఎందుకని? అంతే ఇంకా ఆ సింహాసనానికి. ఎప్పుడైతే ధృతరాష్ట్రుడు పాండురాజు యొక్క సింహాసనాన్ని తను దొంగిలించాడో, అప్పటి నుండి శాపగ్రస్తం అయిపోయింది. కలియుగం వచ్చేస్తోంది. వేదవ్యాసుడికి ఇదంతా తెలిసినప్పటికీ, వీళ్ళ వల్ల ఏమీ అవదమ్మా అని చెప్పాడు, కదా! ఒకత్తేమో కళ్ళు మూసుకుంది ఆయన తేజస్సు చూడంగానే. ఇంకో అవిడ పాలిపోయింది. మరొక అవిడ శూద్ర స్త్రీ. రాజ్యాలు ఏలడానికి వీల్లేదు. ఆవిడ బానే ఉందిట. Ignorance is bliss అంటాం చూశారా! వారెంత మహాత్ములయితే మనకేంట? మనకేం తెలియదు. తెలియడం చేత భయం. తెలియకపోతే ఏం భయం ఉంది? ఆవిడ అందుకుందిట. విదురుడు వచ్చాడు. రాజ్యం చేయడానికి వీల్లేదు. పాలిపోయిన అవిడకి ఒకాయన దిగొచ్చాడు. కళ్ళు మూసుకున్న అవిడకి ఒకాయన దిగొచ్చాడు. ఇవన్నీ వేదవ్యాసుడుకి ముందే తెలిసీ, కానీ తల్లి ఆజ్ఞ. శిరసావహిస్తాడు. అట్లా ఉంటుంది ప్రమాణం. ఏమిటి ప్రమాణం? లోకక్షేమం కోసం తల్లి కోరింది. ఆవిడ స్వార్థం ఏం లేదు అందులో. అట్లా లోకక్షేమం కోరి ఆయుధం పట్టనన్నవాడు ఆయుధం పట్టి, భీష్ముడు మీదకు సింహమల్లే దుమికేసరికి అప్పుడు జ్ఞానం కలుగుతుంది భీష్ముడికి. పిచ్చివాడా మాట మాట అని అట్లా కట్టేసుకున్నావు కదా! నువ్వే ఆరోజు సింహాసనం ఎక్కి ఉంటే ఇంత ఉండేదా కథ? 'రాజ్యం కాపాడుతాను తప్ప సింహాసనం మీద కూర్చోను' అన్నావు నువ్వు. నేనూ ఆయుధం పట్టనన్నాను. ఇప్పుడు పడుతున్నాను. ఏమిటి? ఇది 'మహా ధర్మం' అని చెప్తాడు. ఏమవుతుంది? 'ఆయుధం

పట్టనన్నవాడు ఆయుధం పట్టాడు. అబద్ధం ఆడాడు' అనుకుంటారు. అంతేగా! అనుకోనీ అని అంటాడు. ఇలా ఉంటాయి ధర్మాలు. ప్రమాణం. అందుకని నువ్వే ప్రమాణం అని చెప్పడం. ఏ పని చేసినా శ్రీకృష్ణుడు జీవితంలో అదే ప్రమాణం. అట్లా నిర్వర్తించి చూపించాడు. ఎందుకంటే ధర్మాన్ని బాగా అవగాహన చేసుకోవడంలో ధర్మం తెలుస్తున్న కొద్దీ కొంత అహంకారం పెరిగితే మళ్ళీ రజస్సు కూడా పెరుగుతుంది. అక్రూరుడు జ్ఞాని, ధర్మం తెలిసిన వాడు. అటువంటివాడు కంసుడు కొలువులో ఉండకూడదు కదా! కంసుడు సలహాదారుగా ఉంటాడు. ఎందుకని? తన సలహా వల్ల వాళ్ళని బాగు చేయచ్చు అని. అహంకారం లేకపోతే ఒక్కటి తెలియాలి నిజమైన జ్ఞానికి. స్వభావం చేత దుష్టుడైన వాడికి నువ్వు మంచి విషయాలు చెప్పినా వాడు వినడు. దుర్బలుడికి చెప్తే వింటాడు. అక్రూరుడికి సలహా ఇచ్చి, వాడ్ని బాగు చేద్దాం అని ఈయన ఒక ఉద్ధారణ కార్యక్రమం పెట్టుకుని అతని దగ్గర చేరుతాడు. అట్లా చేరితే, అతడు మన మాట వినడం మానేసి మనని వినియోగించుకుంటూ ఉంటాడు. నువ్వు వినియోగపడడం నీలో ఉండే ఒక దుర్బలత్వం. దుష్టుడికి, అధికారంలో ఉండే ఒక దురాత్ముడికి అన్నీ తెలిసి నీవు కొలువులో ఉండి వినియోగపడుతున్నావుట అంటే అంతకన్నా అధర్మం ఏముంది? ఎందుకు ఇది వస్తుంది? కొంతమందికి రాజాశ్రయం మీద మోజు ఉంటుంది. అధికారంలో ఉండే వారి చుట్టూ మనం ఉంటే మనకి కూడా భోగాలు జరుగుతూ ఉంటాయి. మన వారి మధ్య మనం వెలుగుతూ ఉండచ్చు. ఇక్కడ వెలుగుతున్నావు కానీ ఎటువంటి వెలుగు అది? అంతకంతకీ వాడు క్షీణిస్తాడు. నువ్వూ క్షీణిస్తావు.

విదురుడు ఎన్నాళ్ళు పోయినా కొలువు వదలడు. ఏనాడూ ఈయన సలహా ఆయన విన్నది లేదు. ఏంటండీ అంటే advisor to the king! ఎప్పుడన్నా విన్నాడా అంటే వినడు. నువ్వు consultant వి, నీ మాట client వినడు. కాకపోతే నీకు డబ్బులు ఇస్తూ ఉంటాడు. నీకు మంచి quarters ఇచ్చాడు. నీకు హోదా ఇచ్చాడు. నీకు అన్నీ ఇచ్చాడు. నేను వినను గానీ నువ్వు చెప్తూ ఉండు, అంటాడు. ఏంటది? అయినప్పటికీ నువ్వు ఎందుకు ఉన్నావక్కడ? ఎన్ని సంవత్సరాలు ఉన్నాడు? 100 ఏళ్ళ పైన ధృతరాష్ట్రుడి వద్ద విదురుడు కొలువు. అన్నీ తెలిసి అట్లా కొన్నిటికి లొంగిపోయి ఉంటారు.

నీకున్న జ్ఞానానికి నువ్వు కంసుడ్ని ఆశ్రయించడం ఎందుకు? ఆయన ధృతరాష్ట్రుడ్ని ఆశ్రయించడం ఎందుకు? ఎప్పుడైతే కొలువు అధర్మపరం అయిందో ధర్మార్థులు అక్కడ ఉండకూడదు. ఉన్నాడుట అంటే వాడికి కూడా అందులో ఒక భాగం ఉంటుంది. అలా మనకి పెద్ద పెద్ద వాళ్ళే ధర్మాన్ని అవగాహన చేసుకోవడంలో కిందా మీదా పడుతూ ఉంటారు. వాళ్ళందరినీ మనం వెక్కిరించక్కర్లా. వాళ్ళ జీవితాలలో ఎక్కడ తప్పటడుగులు వేశారో భగవంతుడు వాళ్ళకి చూపించాడు, మనకి చూపించాడు. మనం అట్లా వేయకుండా ఉండడానికి ముందు అసలు అంతటి వాళ్ళం అయిన తర్వాత సంగతి అది. అంత వాళ్ళు అయినప్పటికీ కూడా తప్పటడుగులు వెయ్యచ్చు అని అక్కడ కనిపిస్తోంది. ఎంతటి వాడు వాలి? వాళ్ళంతా తెలియక తప్పులు చేసిన వాళ్ళు కాదు. తెలిసి తప్పులు చేసినవాళ్ళు. మరి రాముడు ఏం చేశాడు? ఏంటయ్యా ఇట్లా కొట్టేశావు? అని అడిగాడుట. అంటే అట్టాగే కొట్టేయాలి నిన్ను ఇంకో పద్ధతి లేదు, అని చెప్పాడు. 'ప్రమాణం'! అందుకని ధర్మాలుంటాయి, మహాధర్మాలుంటాయి. మనం ఏరోజు అయితే ఈరోజు నుండి నిజమే చెబుదాం అబద్ధం చెప్పం అనుకున్నాం అనుకోండి. ఆ రోజే ఎవరో ఒక పసివాడ్ని చంపేయడానికి ఒక దొంగ వెంటపడి కత్తి పట్టుకుని వస్తుంటే, వాడు మన ఇంట్లో దూరాడనుకోండి. ఆ దొంగ చూశాడనుకోండి. వాడు 'మీ ఇంట్లోకి వచ్చినట్టున్నాడు కుర్రాడు' అంటే అవునని చెప్తావా? ఏమిటంటే ఇవాళే ఒట్టేసుకున్నాను నిజం మాట్లాడాలని అని చెప్పావనుకో, నీకన్నా మూర్ఖుడు ఇంకెవడన్నా ఉన్నాడా? నువ్వు నిజం మాట్లాడడం వల్ల ఒక ప్రాణం బలి అయిపోతోంది కదా! లేడు, అని చెప్పినా తప్పులేదు. మా ఇంట్లోకి రాలేదు, అని చెప్పినా తప్పులేదు. ఒక ఋషి ఇట్లాగే నేను నిజం చెప్తానన్నాడుట. చాలా మంచి భక్తుడు, చాలా ఉత్తమమైన స్థితిలో ఉన్నవాడు. చూద్దాం ఏం చేస్తాడో అని ఆయన ఆశ్రమం వైపు ఒక జింక పరిగెత్తుకుంటూ వెళ్ళినట్టుగా సృష్టి చేసి, ఆ జింకను తరుముకుంటూ వచ్చే ఒక వేటగాడుగా భగవంతుడు వేషం ధరించి అట్లా వస్తే, ఆ జింక ఈయన ఆశ్రమంలోకి పరిగెత్తించేట్టుగా సంకల్పిస్తాడు. అది ఆయన ముందు నుండి వెళ్ళి చాలా భయం నటించి, లోపల దాక్కుంటుంది. అప్పుడు వేటగాడు రూపంలో ఉన్న దైవం వస్తాడు. 'ఏమయ్యా ఇటేమన్నా జింక వెళ్ళిందా?'

అంటాడు. మాట్లాడడు. 'నువ్వు సత్యమే చెప్తావు అని విన్నాను నేను. ఇప్పుడు నువ్వు చెప్పేది సత్యమో, అసత్యమో నాకు ఉన్నది ఉన్నట్టుగా చెప్పమంటాడు'. ఏం చేస్తాడు? ఋషి సమాధానం చాలా బాగా చెప్తాడు. 'ఏం చెప్పమంటావు? ఉన్నది ఉన్నట్టుగా చెప్పమన్నావు పెద్ద చిక్కుందయ్యా' అంటాడు వేటగాడితో ఋషి. 'ఏమిటా చిక్కు' అన్నాడు. 'ఏం లేదూ, కన్నేమో చూస్తుంది చెప్పలేదు. నోరు చెప్పగలదు చూడలేదు. చూచిన కన్ను చెప్పలేదు. సాక్ష్యం చూసేది కన్ను కదా! లేకపోతే వినేది చెవు కదా! ఈ రెండూ మాట్లాడలేవు. చూసినవాడు కదా చెప్పాలి'. అంటాడు. అంతేనా? చూడండి మరి మనవాళ్ళు నిజంగా వాళ్ళకి ఎన్ని దణ్ణాలు పెట్టినా ఆ తెలివి మనకు దక్కదు. చూచినవాడు చెప్పాలి. చూసినవాడు సాక్షి. చూసినవాడు కన్ను. ప్రయత్నం చేసిన్నా కంటితో చెప్పడానికి అవదు. నోరు చూడలేదు కదా! అది చెప్పినా చూడకుండా చెప్పింది అవుతుంది కదా! కాబట్టి నీకేం చెప్పను?' అంటాడు. చాలా సంతోషిస్తాడు దైవం. అద్భుతంగా ఉంది నువ్వు చెప్పిన విషయం అని చెప్పి, దర్శనం ఇచ్చి, 'చాలా సంతోషం, ఉత్త జ్ఞానమే కాదు, నీ దగ్గర యుక్తి కూడా ఉంది, కౌశలం ఉంది, నాకు బాగా ఆనందం కలుగుతోంది' అని ఆశీర్వదించి వెళ్ళిపోతాడు. లేడి కూడా ఉండదు తరువాత ఆశ్రమంలో. ఉంటే అటువంటి తెలివి అయినా ఉండాలి కదా! కృష్ణుడు అటువంటి తెలివి చాలాచోట్ల ప్రదర్శించాడు. రేపల్లె నుండి వెళ్ళిపోయేప్పుడు వస్తానని చెప్పి వెళ్ళాడు అందరికీ. అసలు బొత్తిగా రాలేదు. వస్తానని చెప్పి రాకపోతే వాళ్ళేమనుకోవాలి? అబద్దాలకోరు అనుకోవాలి. కానీ వాళ్ళ వరకు ఆయనసలు వెళ్ళనే లేదు. అదేంటి మరి కృష్ణుడు రాలేదు కదా అంటే, వెళ్తే కదా అన్నారు వాళ్ళు. అట్లా వచ్చాడు వాళ్ళ హృదయాలలోకి. అలా ఉండాలి. ఇటువంటి ధర్మాలు ఎక్కడి నుండి తెలుస్తాయి? 'ప్రమాణం'! ఇట్లా ఎన్ని కృష్ణ కథలు అయినా చెప్పుకోవచ్చు. భగవత్ కథలన్నీ అట్లా ప్రమాణంగా ఉంటాయి. ఎంత ప్రమాణం చెప్పండి! హిరణ్యకశిపుడు అడిగిన వరాలకు వాడ్ని సంహరించడానికి దిగిరావాలంటే ఎటువంటి ప్రమాణం అది! అక్కడేమో తాతయ్యా నాకు చావు లేకుండా చెయ్, అని అడిగాడు బ్రహ్మగారిని. అది కుదరదయ్యా తత్తుల్యమైనది కోరుకో, అని అంటాడు. అంటే అప్పుడే తెలిసి ఉండాలి తత్తుల్యమే తప్ప అది కాదని కదా! అట్లా ఉండదు

మనకి. పోనీ దానికి సమానమైనది ఇంకోటేదో ఇస్తానంటున్నాడు కదా పుచ్చుకుందాం, అని చెప్పాడు. దేవతల చేత గానీ, రాక్షసుల చేతగానీ, గంధర్వుల చేతగానీ, కిన్నెరుల చేతగానీ, మానవుల చేతగానీ, పశువుల చేతగానీ, చెట్ల చేతగానీ, జీవుల చేత, మనకి మామూలుగా మనకు తెలిసినవన్నీ ఏకరువు పెట్టాడు. వీటి చేత చావకూడదు అని ఒకటి. ఎటువంటి ఆయుధం చేత చావకూడదు, అన్నాడు. సరే, అన్నాడు. ఇంటి లోపల చావకూడదు ఇంటి బయట చావకూడదు, అన్నాడు. చూడండి మరి చాలా బాగా అడిగినట్టే కదా వాడు. ఎక్కడన్నా చంపితే లోపల అయినా చస్తాం, బయట అయినా చస్తాం కదా! కానీ ఇంట్లో చావకూడదు, ఇంటి బయట చావకూడదు. అప్పటికే వాడికి doubt వచ్చి, పగలు చావకూడదు, రాత్రి చావకూడదు. ఇట్లా పెట్టుక్కూర్చున్నాడు. ఇంకా వాడిని ఏం చేస్తారు ఎవరు మాత్రం! అంటే దిగాడు. ఒకటే ఆట ఆడేస్తున్నాడు చెడుగుడు. అసలు ఇటువంటి స్థితిలో వీడిని సంహరించడానికి భగవంతుడు ఎట్లా దిగివస్తాడండీ! అట్లా దిగి వచ్చాడు. మనిషి కాదు జంతువు కాదు. కదా! ఎక్కడ చంపాడు? అది ఇంటి లోపల కాదు, ఇంటి బయట కాదు గుమ్మం దగ్గర. పగలు కాదు, రాత్రి కాదు సంధ్యా సమయం. ఆయుధం కాదు గోళ్ళు. శుభ్రంగా పాడిచి, ఇట్లా చీల్చేశాడు. అయిపోయింది. 'ప్రమాణం'! ఇట్లా ఉంటాయి ప్రమాణాలు. భగవంతుడు భక్తుడ్ని రక్షించుకోవడానికి ప్రమాణాలు ఆచరిస్తూనే చేసేస్తూ ఉంటాడు. ఒక్కొక్క ప్రమాణం ఒక్కొక్క రకంగా ఉంటుంది. మాస్టర్ గారు చెప్తూ ఉండేవారు ఇటువంటి విషయాలు. ఊళ్ళో collecter గారు ఇప్పుడు ఇట్లా ఒక program అని అందరికీ చెప్తారు. CM గారు వస్తున్నారని రాత్రి phone వస్తుంది. CM గారు వస్తే CM గారి program ముఖ్యం కదా collecter గారికి. మరి ఇట్లా చెప్పారు కదండీ మీరు అబద్ధం ఆడారు అంటారా? మీరు చెప్పింది ఇలా ఉంది కదా sir మరి ఆయన వస్తారు కదా ఇప్పుడు ఏం చేస్తారు అంటే ఏం చేయడానికేం లేదు ఆయన చెప్పింది చెయ్యడమే. ఎందుకనీ? When the higher law prevails the lower gets neutralized. మీ ఊరు వస్తా రేపు, అని చెప్పిన తర్వాత ఇవాళ రాత్రి train లు bus లు అన్ని cancel అయిపోయాయి అనుకోండి, ఏం చేస్తావ్? ఆడిన మాట తప్పారు అన్నది ఉండదు కదా. అలా

ఉంటుంది ధర్మం. 'ప్రమాణం'. The right measure. ఎవరెవరికి ఎట్లా చూపించాలో అట్లా చూపిస్తాడు చక్కగా.

౨౨౭ ప్రాణనిలయః

ప్రాణానికి ఆయన నిలయం. ప్రాణానికి ఏమిటి నిలయం? ప్రణవమే! అందుకని ఓంకారం చేసుకుంటే ప్రాణం కూడా సరిదిద్దబడుతూ ఉంటుంది. గట్టిగా చేయాలి. బాగా పీల్చి వదిలే అప్పుడు చేయాలి. చేస్తే ప్రాణ ప్రవృత్తులన్నీ కూడా ఒక్కసారి పుంజుకుంటాయి. బలం కలుగుతుంది. భగవంతుడు మనలో ప్రాణనిలయుడిగా అంటే ఓంకార స్వరూపుడుగా ఉన్నాడు అని చెప్పడానికి ఈ నామం. ప్రణవః అని ఇదివరకు వచ్చింది. ఇక్కడ ఓంకారంలో ఒక లక్షణమే చెప్తున్నారు, ప్రాణానికి నిలయం అయినది అని. ప్రమాణంగా మనలో ఉన్నాడు అని చెప్పాం కదా! ప్రాణనిలయుడుగా మనలో ఉన్నాడు. మన చుట్టూ కూడా ఉన్నాడు. మనలో ప్రాణం ఉన్నది. అసలు మనం ఉన్నది ప్రాణంలో. మాస్టర్ గారి ఉదాహరణలో గోదావరిలో చెంబులాగా! చెంబు గోదావరిలో ఉండడం వల్ల చెంబులో కూడా గోదావరి ఉంది, అని అంటూ ఉండేవారు. సముద్రంలో అల ఉండడం వల్ల అలలో కూడా సముద్రం ఉన్నది. మహాప్రాణంలో మనం ఉండడం చేత మనలో కూడా ప్రాణమున్నది. అందుకని మొత్తం సృష్టికే ప్రాణనిలయుడు. అందులో ఒక్కొక్క బొట్టిగాయిగాడి కూడా ప్రాణనిలయుడు చీమ, దోమతో సహా. మనలో ఉండే వాడిని ముందు మనం దర్శనం చేస్తే మొత్తంలో ఉండేవాడిని దర్శనం చెయ్యచ్చు. ఋషుల మొర ఎప్పుడూ ఒకటే. వాళ్ళు జీవులకి మొరపెట్టుకుంటూ ఉంటారు. ఏమిటయ్యా అంటే ఒరేయ్ ఇట్లా చూడరా, ఇట్లా చూడరా అని. ఓంకార స్వరూపుడిగా లోపల చూడు, బయట కూడా వాడే నిండి ఉన్నాడని తెలుస్తుంది. శబ్దమే/ ఓంకారమే/ ప్రణవమే సృష్టికి ఆధారం. ప్రణవంలోంచే సమస్తం పుట్టింది. ప్రాణం కూడా పుట్టింది.

౨౨3 ప్రాణభృత్

అదే ఓంకారం లోంచి ప్రాణభృత్ అంటే స్పందనంగా ప్రాణం వ్యక్తం అవుతోంది అని చెప్యున్నారు. ప్రణవం నుండి ప్రాణం బయటికి స్పందనం ద్వారా వస్తూ ఉంటుంది. అందుకని మనవాళ్ళు ప్రాణాయామానికి, ఆ శ్వాస మీద మనస్సు పెట్టడానికి, బాగా శ్వాస పీల్చి వదలడం అనే కార్యక్రమానికి చాలా ఎక్కువ ప్రాముఖ్యత ఇచ్చారు. చేసుకుంటూ ఉన్నవాడు అదృష్టవంతుడు. తెలిసి కూడా చేసుకోకపోవడానికి కారణం ఏమిటంటే మనకు ఉండే భుక్తం కారణం. పోగేసుకున్న కర్మ కారణం చేత, తెలిసిన విషయాన్ని ఆచరించలేం కాబట్టి ఆచరిస్తూ ఉండే వాళ్ళతో కలిసి జీవించడం చేత ఆచరించడానికి కావలసిన స్ఫూర్తి వస్తూ ఉంటుంది. మనం చేయలేంది ఇంకోడు చేస్తున్నాడుట అంటే, మనకి కూడా అది చేద్దాం అని మోజు మనలో ఉందిట అంటే, మోజంటే ఆసక్తి, ఆత్రుత, శ్రద్ధ. అయ్యో చెయ్యలేకపోతున్నామే అనే బాధ, ఆర్తి ఉన్నాయనుకో చేసేవాడు కనబడితే వాడి దగ్గరికి చేరిపోవడమే. అది నీకు వస్తూ ఉంటుంది. వాడి సాన్నిధ్యంలో నీకూ అబ్బుతుంది. ఇనుము అయస్కాంత సన్నిధి చేరినట్టు. ఎవరెవరు ఏ ఏ గుణములు కోరుకుంటున్నారో సద్గుణములే కానీ దుర్గుణములే కానీ వాటికి గురువులుంటారు. వాళ్ళతో చేరిపోవడమే. భారతాది కథల్లో, రామాయణాది కథల్లో కూడా బాగా దుర్గుణములున్న గురువు వద్ద దుర్గుణ సంపద ఉండే వాళ్ళందరూ చేరిపోతూ ఉంటారు. అట్లాగే సద్గుణ సంపత్తి కోసం తాపత్రయపడేవాళ్ళు, అది కావాలనుకునే వాళ్ళు, అది ఉన్నవాళ్ళు దానికి పరాకాష్ఠగా ఉన్నవాడి దగ్గర చేరిపోతూ ఉంటారు. ఎవరెవరు వారి వారి స్వభావముల యందు ఏ రకమైన సంస్కారములు కలిగి ఉన్నారో దానిబట్టి వారు, వారి యొక్క గురువులను చేరుకుంటూ ఉంటారు. అందుకని సృష్టిలో అందరు గురువులూ కూడా ఆ విధంగా ఉంటారు. మనం ఆరోపణ చేసి ఉపయోగం లేదు. It cannot be a complaint. జూదగాడికి జూద గురువు ఉంటాడు. యోగం చేసే వాడికి యోగం గురువు ఉంటాడు. డబ్బు సంపాదించే వాడికి డబ్బు సంపాదించే వాడే పెద్ద గురువు. అట్లా ఒక్కొక్క దానికి ఒక్కొక్క, రాజకీయ గురువు ల్లేరూ! నమస్కారం గురువుగారూ,

అంటాడు ఆయన. రాజకీయాల్లో ఏమిటయ్యా అంటే ఒక్కొక్క గురువుని కొన్నాళ్ళే పెట్టుకోవాలి. వాడ్ని దాటి మనం వెళ్ళిన తర్వాత వాడి పై వాడు మన గురువు తప్ప వీడు కాదు. ఇట్లా ఉంటూ ఉంటుంది. అందుకని ఈ విధంగా మనం చేరడం వలన, అవి చేసుకునే వాళ్ళతో సాంగత్యం వలన, ఏది మనం పొందలేకపోతున్నామో అది పొందడానికి అవకాశం ఏర్పడుతుంది. అదీ సత్సాంగత్యం అంటే! సద్గుణాలు ఎక్కడ ఉన్నాయో ఆ సద్గుణాలు నీకు కావాలనుకుంటే ఆ సద్గుణం కోసం నువ్వు అక్కడికి చేరాలి. మకరందం కావాలనుకున్నప్పుడు తేనెటీగ అది ఉన్న పువ్వు మీద వాలింది తప్ప, కొబ్బరి చెట్టు మీద తాటి చెట్టు మీద వెళ్ళి వాలదు కదా! వాలుతుందా? దానికున్న బుద్ధి కూడా మనకు లేదే! ఎక్కడికి వెళ్ళి వాలి తీసుకుంటుందండీ తేనెటీగ? పిల్లలు ఉన్నారు. మంచి మార్కులు రావాలనుకుంటే బాగా తెలిసిన ఉపాధ్యాయుని దగ్గర ఉండి చెప్పించుకోవాలి. ఏమీ రాదుట వాడితో కలిసి చదువుకుంటున్నాడు అంటే ఏమి ఉపయోగం? మనం ఏది కోరుకుంటున్నామో దానికి ఎవరు ఇప్పుడు గురురూపం అంటే పెద్ద రూపంగా గోచరిస్తున్నాడో హూ.. వాడి దగ్గరికి పో. వాడి దర్శనం చేసుకుంటూ ఉండు. వాడితో సంభాషణ చేసుకుంటూ ఉండు. వాడ్ని విసిగించకుండా, వాడ్ని మెప్పించి వాడి దగ్గర నుండి ఆ విద్య పొందు. మెప్పించంది విద్య రాదు. ఎందుకంటే గురువు ఉన్ముఖుడవాలి. గురువు ఉన్ముఖుడవాలి అంటే గురువు మెచ్చుకునే పద్ధతిగా నువు ప్రవర్తించాలి. అందుకని మనకి ప్రాణాయామం తెమలాలంటే అట్లా తెమలాలి మనకి. అప్పుడు గానీ ప్రాణభృత్ గానీ, ప్రాణ నిలయంగానీ ఇవన్నీ మనకి అందే విషయాలు కాదు.

౨౨4 ప్రాణజీవనః

స్పందనం ప్రాణభృత్. స్పందనాత్మకుడుగా భగవంతుడు మన యందు ఉన్నాడు అనేది అనుభూతి చెందే వాడికి, (ప్రాణజీవనం నుండి వెనక్కి వచ్చా. ప్రాణభృత్ లోకి వచ్చేసా. ఎందుకంటే మనకి ఇది bridge.) ఈ బయట తిరిగే భాగం, మన లోపల ఉండే భాగంతో జతగూడాలంటే మనకి ఏది వంతెనయ్యా అంటే స్పందనము వంతెన. ఇంకోటేదీ లేదు. అందుకని మనస్సు శ్వాస మీద ఉంచి, శ్వాసను బాగా ఏకాగ్రమైన మనస్సుతో గమనిస్తూ ఉంటే, అది స్పందనం దగ్గరికి తీసుకు వెళుతుంది. స్పందనము ప్రాణమునకు ముఖ ద్వారము ఒకటి. స్పందనము నీవు లోపల ఉన్న జీవుడుగా ఏ విధంగా ఉన్నావో తెలియడానికి కూడా ముఖ ద్వారము. ప్రాణము ఆధారంగానే జీవుడూ ఉన్నాడు. అది ప్రాణజీవనః. సమస్త జీవులూ ప్రాణం ఆధారంగానే ఉన్నాయి. అటు ప్రాణానికి కానీ ఇటు జీవచైతన్యానికి కానీ రెండింటికీ ముఖద్వారముగా ఉన్నది స్పందనం. అంటే అది మనకి త్రివేణీ సంగమం లాంటిది. ఇడ, పింగళ కలిసిన చోట కదా నీకు. గంగా యమున కలిసిన చోట కదా అంతర్వాహినిగా నీకు గోచరిస్తుంది. అలాగే నీకు జీవుడు ఎక్కడ గోచరిస్తాడంటే ప్రాణము, తెలివి రెండు అనుసంధానం చెందేది స్పందనం వల్ల. ఈ రెండూ కలిసిన చోట స్పందనము విచ్చుకుని జీవుని యొక్క దర్శనం చేయిస్తాయి. అంటే అంతర్ముఖుడుగా జీవుడ్ని గోచరింప చేయిస్తాయి. అది మనం అని తెలుస్తుంది. ఈ బయట వాడు మనకి పనివాడని తెలుస్తుంది. ఇంతకాలం మనం ఉత్తమమైన మన స్థితి కోల్పోయి, మన పనివాడుగా మనం చేయిస్తున్నాం అన్నమాట. ఇప్పుడు మనస్సు, ఇంద్రియములు, శరీరంతో కూడిన శరీరం ఏది అయితే ఉన్నదో అది మన పనివాడు, మనం సింహాసనం మీద కూర్చున్న జీవ ప్రజ్ఞ అని తెలియడానికి పనికి వస్తుంది. అది ప్రాణజీవనః! ఆ ప్రజ్ఞ కూడా అట్లా స్పందనాత్మకంగానే ఉంటుంది అంగుష్ఠమాత్రంగా ఉన్నప్పటికీ కూడా! వెలుగు స్వరూపం అని తెలుస్తుంది. ప్రమాణం, ఆ ప్రమాణం చేరుకోవడం కోసం మళ్ళీ ఒకటి పెట్టాడు. ప్రాణనిలయం, ప్రాణభృత్, ప్రాణజీవనః. ఆపైన

ప్రమాణంగా ఆయన ఉన్నాడు జీవుడికి. మళ్ళీ నాలుగు. ఎక్కడ చూసినా నాలుగు, నాలుగ్గా వేసేస్తూ ఉంటాడు.

२१५, २१६ తత్త్వం, తత్త్వ-విత్

తత్త్వం అంటే తత్ గురించి వివరించేది అని అర్థం. మనకి అర్థం కాదు కాబట్టి ఎవరైనా అర్థం కాకుండా మాట్లాడుతుంటే వాడేదో తత్త్వం చెప్తున్నాడు లెండి అంటాం మనం. కదా! మనకి తెలియంది తత్త్వం అని ఒక భావన. నిజానికి తత్వము అంటే తత్ గురించి తెలియజెప్పిన శాస్త్రం/ జ్ఞానం/ బోధ. తత్ అంటే 'అది'. అది అంటే? ఏది అయితే ఈ సమస్తానికీ ఆధారమో, దేనికయితే రూపం లేదో, కానీ అన్ని రూపాలుగా ఏది అయితే నిండి ఉన్నదో, దేనికయితే నామం లేదో, కానీ అన్ని నామాలుగా అదే వ్యక్తం అవుతుందో అది. దానికి నామం లేదు, రూపం లేదు, శబ్దం లేదు, రంగు లేదు, వెలుగు కూడా లేదు. కానీ అందులోంచి పుట్టాయి. శబ్దం లేదు, వెలుగు లేదు, రూపం లేదు, నామం లేదు, నీకు తెలిసింది ఏదీ లేదు దానికి. నీకు తెలిసిందల్లా అందులోంచి పుట్టిందే తప్ప అది తెలియడం అంటే నీకు కూడా ఆలోచన లేకుండా ఉండాలి. నీక్కూడా ఆలోచన లేకుండా నువ్వు ఉన్నావనుకో, అప్పుడు నువ్వు ఎట్లా ఉన్నావో నీకు తెలిస్తే, అది ఏమిటో నీకు తెలుస్తుంది. అందుకనే శబ్దపరంగా దైవాన్ని వినడం, వెలుగుపరంగా దైవాన్ని చూడ్డం, రంగులు రంగులుగా దేవతలని చూడ్డం, అద్భుతమైన రూపాల్ని చూడ్డం ఇట్లా ఉంటుంది. ఇవన్నీ ఆ అసలు దానికి తొడుగు. ఆ అసలు దాని గురించి చెప్పడానికే వేదం ప్రయత్నం చేస్తుంది. దాంట్లోంచి 'నేతి' అనే సిద్ధాంతం వచ్చింది. 'నా ఇతి' అని. ఇదిగా కూడా ఉంది కానీ, ఇదే కాదు. ఏది చెప్పండీ, అది దాన్నుండి వచ్చిందే! దాన్నుండి రానిది మీరు చెప్పలేరు. అందుకని వాళ్ళు 'న ఇతి, న ఇతి' అన్నారు. ఇట్లా అవతరించింది. వెలుగుగా అవతరించింది. ప్రణవంగా అవతరించింది. ప్రణవమే కాదు. 'హూం' అని శబ్దం లోపల అట్లా current తీగలో current వెళుతున్నట్టుగా ఉంటుంది. మరి current తీగ ముట్టుకుంటే మనకి దాని తరంగాలు తెలుస్తాయి కదా! అది అట్లా నడవడానికి ఏదో ఉండాలి. లేకపోతే ఎందుకలా నడుస్తుంది? ప్రణవానికి

ఏది ఆధారమో, వెలుగుకు ఏది ఆధారమో, అంకెకి ఏది ఆధారమో, రూపానికి ఏది ఆధారమో, వీటన్నిటికీ ఏది ఆధారమో దానికి లక్షణం లేదు, దానికి పేరు లేదు, దాన్ని మనం తర్కించలేము, దాన్నుండి వ్యక్తమైన మొదటివన్నిటినీ గురించి మనం వర్ణన చేసుకోవచ్చు. వెలుగు వర్ణనము అదితి. వేదంలో అదితిని విపరీతంగా వర్ణిస్తారు. 'అది' వెలుగ్గా అయ్యిందన్నమాట. 'అది' కాలంగా అయ్యింది. 'అది' ప్రకృతిగా అయ్యింది. 'అది' శక్తిగా అయ్యింది. మన ఆరాధనలన్నీ అక్కడికి వెళ్ళాల్సిందే. ఆపైన ఆరాధించడానికి ఈ రూపంగా వాడ్ని చూడ్డమే. దాని గురించి రకరకాలుగా చెప్పారండీ ఈ ఋషులు. ఎంత అద్భుతంగా ఉంటుంది! అసలు ఇట్లా మాట్లాడగలమా? ఇట్లా భావంలోకి తీసుకురాగలమా? వాళ్ళు విపరీతమైన ప్రయత్నం చేసి అందించారు. అందుకు చదువుకోవాలి ఉపనిషత్తులు. ఎంత అద్భుతంగా చెప్తారో తత్వం. ఇట్లా చెప్పగలమా? అసలు ఇటువంటి మాట మన నుండి వస్తుందా? అనిపిస్తుంది. మనం ఇంత బాగా ఆలోచించగలమా? అనిపిస్తుంది. గుర్తుపెట్టుకోండి ఉపనిషత్తులు, కనీసం తెలుగు తాత్పర్యం అన్నా చదువుకోండి. ఇంతింతే ఉంటాయి చిన్న పుస్తకాలు. చదువుకుని వాటిమీద బాగా ధ్యానం చేయండి. సరాసరి తత్వానికి దారి చూపించేవి ఉపనిషత్తులు. 'దానికి' దగ్గరగా కూర్చోబెట్టేవి ఉపనిషత్తులు. దేనికి? 'అది'. అది మగా కాదు, ఆడా కాదు. జీవుడు మగా? దేవుడు ఆడా? నువ్వు ఏమనుకుంటే అది నీకు. నువ్వు అనుకున్నది కూడా సత్యమే! అయితే అది పూర్ణసత్యం కాదు. 'అదే' అనకూడదు నువ్వు. 'అది కూడా'. నువ్వు ఏ రూపంలో కావాలంటే ఆ రూపంలో ఉన్నాడు, అందుకో. కానీ నన్ను ఆ రూపానికి పరిమితం చేయక, అంటాడు. ఏ నామంలో కావాలంటే ఆ నామములో నన్ను స్మరించుకో, కానీ అది నా ఒక నామమే! అది గుర్తుపెట్టుకో తప్ప, అదే నేననబోక. 'అది' అట్లా ఉంటుంది. దాన్ని తెలియాలి అంటే పేర్లు దాటి, మనకుండే అవగాహనలు దాటి సరాసరి 'అది' అనేదాన్ని మనకి చూపించడం కోసం ఋషులు చేసిన ప్రయత్నంగా, మన బోటి వాళ్ళకి సులభంగా అర్థం అయ్యేట్లుగా ఉపనిషత్ మార్గాలున్నాయి. మనకి సంస్కృతం కూడా రాదు కాబట్టి, మన మీద అపారమైన కరుణతో కొంతమంది దాని తాత్పర్యాలు తెలుగులో రాశారు. తెలుగు రాని వాళ్ళకి ఇంగ్లీషులో రాశారు.

తెలుగు రాని తెలుగు వాళ్ళు చాలామంది ఉన్నారు. ఎందుకంటే చిన్నప్పటి నుండి ABCD చదువుకోవడంలో ఉండే మోజు 'ఓం నమః శివాయ సిద్ధం నమః' అనిపించడంలో లేదు కదా! దురదృష్టం. అందుకని తెలుగు చదువుకోలేని వాళ్ళు ఇంగ్లీషులో కూడా చదువుకోవచ్చు. అట్లా రకరకాలుగా, రకరకాలుగా మనకి దీన్ని అందించడానికి ప్రయత్నం జరిగింది. మొత్తం పది శ్లోకాలు కూడా ఉండవు. తాత్పర్యం ఉంటుంది. పుస్తకం అంతా పావుగంట కూడా పట్టదు ఊరికే చదివేయడానికి. ఒక్కొక్క దాని మీద కూర్చుని నువ్వు ధ్యానం చేస్తుంటే ఎంత లోతులో! 'ఓమిత్యేతత్' అంటుంది. 'ఓం ఇతి ఏ తత్.' 'సమస్తమూ ఓంకారమే' అంటుంది. 'తత్సత్' అదే ఉన్నది అంటుంది. ఉన్నది అదే నువ్వు ఎట్లా చూస్తే అట్లా కనిపిస్తుంది. 'అది' అన్నాం కదా దాన్ని. పేరు పెట్టలా. తత్ అది అది అది అని అప్పుడప్పుడు ఓం అంటూ ఉంటారు. తరువాత దాన్ని 'మొదటి వ్యక్తం' అని ఉంటుంది. అప్పుడప్పుడు బ్రహ్మ కన్నా ముందున్నాడే వాడు అంటుంటారు. అది పరబ్రహ్మం. బ్రహ్మకు కూడా పరుడు అని చెప్పడం కోసం పరబ్రహ్మం అంటారు. బ్రహ్మ కన్నా తెలియడానికి ఏం ఉండదు దేవతలకి కూడా. ఆపైన ఉన్నాడే వాడు అని చెప్పడానికి బ్రహ్మకి పరుడు. మొట్టమొదట మనకి కనిపించేవాడి కన్నా ముందున్నవాడు అని అర్థం. దాని గురించి వేదవాఙ్మయం అంతా చెప్పింది. దాని గురించి ఉపనిషత్తులు చెప్పినాయి. ఇంకా ఆ తరువాత మరి చెప్పుకునేది ఎందులో చెప్పినా కూడా పేర్లు, రూపాలే! కొంత విష్ణుపరంగా చెప్పారు. కొంత శివపరంగా చెప్పారు. కొంత శక్తిపరంగా చెప్పారు. కొంత గణపతి పరంగా చెప్పారు. మరికొంత సూర్యుడు పరంగా చెప్పారు. ఇంకా ఇవి కాకుండా చిల్లరగా బోల్డు మతాలు వచ్చేశాయి కలియుగంలో. కానీ సరాసరి జ్ఞానం పొందిన వాళ్ళు దాంతోనే మాట్లాడుకున్నారు. Old Testament లో ప్రవక్తలందరూ కూడా దాంతో సంబంధం పెట్టుకున్న వాళ్ళే. కాకపోతే కలియుగం వచ్చేసరికి ఏమయిందంటే మన బుద్ధి బాగా సన్నగిల్లి, పిల్లి ఒప్పుకుంటే పిల్లి బుర్ర అయిందనుకోవచ్చు. పిల్లి ఒప్పుకోకపోవచ్చు. నాకున్న బుర్ర నీకుందా అనచ్చు. పిల్లి బుర్రలు కాబట్టి అలా సరాసరి తత్త్వాన్ని మనం అంతర్ముఖంగా అందుకుని, దాన్ని విని, దాన్ని చూసి, దాంతో ఆడుకుని, దాంతో సంతోషపడే

తత్వం లేకపోవడం వలన, ఏదో అది తెలిసిన వాడి చుట్టూ వేలాడుతూ ఉండడం అనేది ఇంకోటి ఒకటి వచ్చింది. అందుకని New Testament ఉందనుకోండి ఏసుక్రీస్తుకి చుట్టూ మొత్తం అల్లారు. ఆయన చేసిన పనులు, ఆయన చెప్పిన కథలు. Old testament? తత్వం! Noah దేన్ని విన్నాడు? ప్రవక్తలంతా దేన్ని విని పని చేశారు? అబ్రహం దేన్ని విన్నాడు? తత్ నే! అంతకంతకీ, అంతకంతకీ మనం బాగా చిల్లర మనుషులం అయిపోవడం వలన, మనకి అందకపోవడం వలన, మీకు ఎట్లాగూ అంది చావదు కదా, అందుకున్న వాడి కాళ్ళో వేళ్ళో పట్టుకోండి అన్నారు. అది మనం గురువులని పట్టుకోవడం. ఇహ ఇంతేలే ఈ యుగానికి ఇంతకన్నా 'అలసులు, మంద బుద్ధులు, అల్పతరాయువులు, కలియుగమందలి మానవులు' అని కదా వేదవ్యాసుడు రాశాడు. అందుకని అంత తత్వం తెలిసిన వేదవ్యాసుడు కూడా, వేదాలని వర్గీకరించినవాడు కూడా పురాణాలు రాసి, దేవీ పురాణాలు, విష్ణు పురాణాలు, శివ పురాణాలు ఇలా ఏవో రకరకాలు రకరకాలుగా, చిల్లర మల్లరగా అవి మనకి అందించడానికి చేసే ప్రయత్నంలో తగ్గించి పట్టుకొచ్చారు. అవి పట్టుకుని నువ్వు వెళ్తూ వెళ్తూ ఉంటే మళ్ళీ చివరికి అక్కడికి వెళ్ళాల్సిందే! అంతేతప్ప ఇది maximum, మా Christ maximum అని అంటే, ఇంకోడు ఇంకోటి maximum అంటాడు. ప్రతి గురువూ వాడికి maximum అయిపోయి, minimum లో ఉన్నారు అందరూనూ. ఇది మళ్ళీ అందించే ప్రయత్నమే పరమ గురువుల ప్రయత్నం. అంతర్యామి అని మాస్టర్ గారు నెత్తి నోరు పెట్టుకుని 30 సంవత్సరాలు ప్రపంచంలో దాని గురించే వివరించడం చేశారు. అలా అని అది అందుకోవడానికి సిద్ధంగా ఉండరు కాబట్టి, ఏవో కొంత గాయత్రీ మంత్రం, కొంత పూజలు, కొంత అభిషేకాలు, కొంత హోమాలు, కొన్ని వ్రతాలు ఇంకా అట్లా దాన్ని కూడా పల్చగా ఇచ్చారు. ఎందుకంటే నిచ్చెనలు ఎక్కడానికి ఏర్పరిచారు. ఎవరెవరికి వేటి మీద ఆసక్తి ఉంటుందో వాటిలోంచి వాళ్ళు ఆ నిచ్చెనెక్కిస్తే అంతర్యామిలోకి అన్నా వస్తారని. అందుకని మాస్టర్ గారి వాఙ్మయంలో ప్రమాణగ్రంథం నా దృష్టిలో 'శంఖారావం'! నిస్సందేహంగా. ప్రతి దాంట్లోంచి పాపం ఆయన అంతర్యామిలోకి మన్ని తీసుకెళ్ళడానికి ఓ ప్రయత్నం చేశారు. అది మతాతీతం. అందరిలో ఉన్నది అదే! ఎవరో ఒకడ్ని ప్రజలకెక్కించే ప్రయత్నం

లేదు. ప్రతివాడూ వాడి గురువుని ప్రపంచానికి ఎక్కించాలని కదా ప్రయత్నం. గురువులు బాధపడుతున్నారు. మనం ఎక్కిద్దాం అనుకున్నది వీళ్ళు ఎక్కించుకోక మన్ని ఎక్కిద్దాం అనుకుంటున్నారు వీళ్ళు అనుకుంటారు వాళ్ళు. చాలా ఘోరం కదా! వాళ్ళు మనల్ని ఒక నిచ్చెన ఎక్కిద్దాం అనుకుంటున్నారు. మనం ఏం చేస్తున్నాం అంటే ఆ నిచ్చెన ఎక్కకుండా మహాత్ములందరినీ చెట్టెక్కిస్తున్నాం. అంతకన్నా మూర్ఖత్వం, మూఢత్వం లేదు ప్రపంచంలో. మనం అదే! అందుకని మనకదే ఇష్టం. అది దాటి రాము. రమ్మన్నా రాము. ముమ్మాటికీ రాము అంతే. అలా ఉంటుంది. కానీ ఇక్కడ ఏం చెప్తున్నాడు భీష్ముడు? ఇన్ని రకాలుగా నేను చెప్తున్నాను కానీ అసలు తత్వమే రూపు కట్టుకు వచ్చింది. నువ్వు తత్వం అన్నాడు. అట్లా తత్వమే దిగివస్తుంది గురువుగా! 'గురుస్సాక్షాత్ పరబ్రహ్మ' అంటున్నాం కదండీ! ఏమిటి అక్కడ గురువు? పరతత్వమే! తత్ ఏ అక్కడ కూర్చుంది నిన్ను అందులోకి తీసుకువెళ్ళడానికి. నువ్వేమో ఏవేవో పట్టుకుంటావు ఆయనకి సంబంధించనవి. ఇవి కాదురా ఇక్కడ పట్టుకోరా, అంటాడు. అక్కడ పట్టుకోము. మిగతావన్నీ పట్టుకుంటాము. అట్లా పట్టుకుంటే మనకి మతాలు వస్తాయి. ఇట్లా పట్టుకుంటే యోగంలోకి దారి దొరుకుతుంది. అన్నిచోట్లా అదే చూడచ్చు. వేరే చూడాల్సిన అవసరం ఏం ఉండదు. ఇట్లా తెలుసుకున్న వాళ్ళు మగాళ్ళండీ! వాళ్ళు తత్త్వవిత్! తత్వం తెలిసినవాళ్ళు. దేంట్లో అయినా అదే చూడగలిగిన ద్రష్టలు ఋషులు. ప్రత్యేకించి ఒక మతంలోకి ప్రపంచాన్ని నడిపించాలనే దుర్బుద్ధి, కుబుద్ధి, చిన్నబుద్ధి, పిల్లిబుద్ధి లేనివాళ్ళు. తత్వాన్ని చూపించడానికి చిహ్నంగా నీకేదన్నా ఇస్తాను తప్ప, చిహ్నమే తత్వమనుకోకుసుమా అని చెప్తూ ఉంటుంది. లింగం అని ఎందుకు ఇచ్చారు? 'అది' అనుకుని దీనికి చేసుకో, అని. లింగం అంటే కూడా చిహ్నమే! ఆ... లింగం అంటే శివుడు కాబట్టి విష్ణువు పూజించే వాళ్ళు చూడకూడదు, మిగతా వాళ్ళు ముట్టుకోకూడదు ఇటువంటివన్నీ ఎక్కడి నుండి వచ్చినాయి? వెర్రి. దాన్ని ఏదో ఒక ప్రతీకగా 'అది' భావనగా దీన్ని ఆరాధన చేసుకోవడం అనేది ఒకటున్నది. అదే అక్కడ వాళ్ళు పెట్టుకున్నది కూడా Solomon Templeలో. సైన్ అంటారు. అంటే సియాన్ అని వస్తుంది. ఏదో ఒకటి 'అది' అనుకుంటూ దీనికి చేసుకుంటాడు. అదే ఇది అని

చేసుకుంటూ ఉంటాడు. ఎవడు చేసినా చెయ్యాల్సింది అదే. ఇంకోడు ఇంకో మూర్తి పెట్టుకుంటాడు. ఇంకోడు ఇంకో మూర్తి పెట్టుకుంటాడు. అందరూ ఏ ఏ మూర్తులైనా పెట్టుకుంటూ ఉండవచ్చు. గుర్తుండాల్సింది ఏంటంటే దానినే దీనిలో చూసి పూజ చేస్తున్నాము. అందుకనే ఋషులేం చేశారంటే నువ్వు 'అది' చూసి పూజ చేసేట్టయితే దేనికైనా చేసుకో. చెట్టుకు పూజ చేసుకో అదేగా! పుట్టకు పూజ చేసుకో. రాయికి పూజ చేసుకో. మనిషికి పూజ చేసుకో. చెట్టు, పుట్ట, రాయి సులభం. మనిషికి చేయడం కష్టం కదా! ఏం మనిషి మాత్రం 'అది' కాదా? 'అది' కానిది ఏది ఉంది? అట్లా తెలిసినవాడు తత్వవిత్. వారికుండేది ఏకాత్మ.

197 ఏకాత్మా

ఒకడే ఇన్నిగా ఉన్నాడు. కాబట్టి వాడికి అదొక్కటే సత్యంగా మిగులుతుంది. అందుకని ఏదీ నిరాకరించని స్థితిలో ఉంటాడు. ఏది నిరాకరించినా వాడిని నిరాకరించినట్టే కదా! నిరాకరణ లేదు. దేన్నీ నిరాకరించక, అన్నిటియందూ ఒకే తత్వాన్ని దర్శనం చేస్తూ, అప్పుడు ఆ కాలంలో తన కర్తవ్యం ఏం ఉందో దాన్ని నిర్వర్తించుకుంటూ జీవిస్తూ ఉంటాడు. ఉన్నది ఒకటే అని చెప్తోంది. ఆ ఒక్కటి జన్మ మృత్యు జరాతిగః.

౨౨౪ జన్మమృత్యుజరాతిగః

పుట్టుకకీ, చావుకీ, ముసలితనానికీ అతీతంగా ఉంటుంది అది. అతిక్రమించి ఉంటుంది. అధిగమించి ఉంటుంది. నీవు 'అది' అని నీకు తెలిసినప్పుడు పుట్టానని, చచ్చానని, ముసలి వాళ్ళం అయ్యాం అని ఇవేం ఉండవు. అవన్నీ నీకు సంబంధించినవి కాదు. నీ వాహనానికి సంబంధించినవి. వాహనం పాతది అయితే నువ్వు పాత వాడివా? వాహనం కొత్తది అయితే నువ్వు కొత్తవాడివా? వాహనంకి repair వస్తే నీకు repair వచ్చినట్టా? అదీ అవగాహన! నేను ముసలివాడిని అయ్యాను అనుకోవడం అజ్ఞానం. నేను శిశువుని అనుకోవడం అజ్ఞానం. శరీరానికి ఆపాదింపబడవలసిన గుణాల్ని మనకి ఆపాదించుకోవడం వల్ల మనం ఇబ్బంది పడుతూ ఉంటాం. నిజానికి మనం ఎప్పుడు పసివాళ్ళం నుండి కుర్రవాళ్ళమయ్యామో మనకి తెలియదు. కదా! ఫలానా రోజు నుండి నేను కుర్రవాడిని అయ్యాను అండీ అంతకు ముందువరకూ పసివాడిని, అని మనకేమన్నా తెలిసిందా? కుర్రవాడు యువకుడయ్యాడు. తెలిసిందా? యువకుడు మధ్యవయస్కుడయ్యాడు. తెలిసిందా? వాళ్ళు వీళ్ళు అంటుంటే నిజం అని నమ్ముతాం కదా! పెద్దవాళ్ళు అయ్యారు మీరు, అంటూంటారు. ఆ.. అనిపిస్తుంది ఒకడంటే. ఇంకోడంటాడు తరువాత. ఏంటిరా standard అంటే జుట్టు నెరిసిందిగా, అంటాడు. జుట్టు ఊడిపోయిందిగా, అంటాడు. కూర్చుంటే లేవలేక పోతున్నావుగా, అంటాడు. అవా? మనల్ని దేనికి చెప్పి దేనికి చూపిస్తున్నాడండీ? నీ గురించి మాట్లాడుతున్నాడు, నీ శరీరం గురించి చెప్తున్నాడు. ఆయన కూర్చుంటే లేవలేడండీ! ముసలివాడు అయిపోయాడు, అంటాడు. ఆయన ముసలివాడు అవలా, ఆయన శరీరం అయిపోయింది. 'పలువురాడు మాట పాటియై ధర చెల్లు' కదా! అందుకని పదిమంది అట్లా అనేస్తూ ఉంటే వాడు అది అయిపోతూ ఉంటాడు పాపం తెలియక. అదే మనకు బ్రాహ్మడు, మేక కథ. చిన్నప్పుడే చెప్పేశారు. మీక్కూడా తెలిసే ఉంటుంది. కానీ ఇప్పుడు తెలుగు చదువుకోని చిన్నపిల్లలు ఉన్నారు కాబట్టే చెప్పకుంటే బావుంటుంది. ఓ బ్రాహ్మడు మేక పిల్లను సంతలో బాగా దిట్టంగా ఉన్నదాన్ని, బాగా పాలిచ్చే దాన్ని పట్టుకుని వస్తుంటే దారిలో దొంగలు

చూశారుట ముగ్గురు. వాళ్ళంతకుముందే అహింసావ్రతాన్ని అవలంబించాలని నిర్ణయం చేసుకున్నారుట. దొంగతనం మానేస్తాం అని పెట్టుకోలా వాళ్ళు. దొంగతనం మానేస్తే భుక్తి కలగదు కదా! అందుకని వాళ్ళు ఏమన్నారంటే మనం హింసించకుండా దొంగతనం చేసి హాయిగా సంపాదించుకుందాంరా. జీవహింస వద్దు అనుకున్నారట, వాళ్ళు. తలకాయ పగలగొట్టి పుచ్చుకోవద్దు యుక్తితో పుచ్చుకుందాం, అని వాళ్ళు ఒక నిర్ణయం చేసుకున్నారుట. వీడు వస్తున్నాడు సంత నుండి మేక తీసుకుని. వస్తుంటే ఒకడు వచ్చాడు ముందు. 'చాలా బా గుందండీ మీ కుక్క' అన్నాడుట. 'బుద్ధి లేదా కుక్క అంటావేంటి మేక' అన్నాడట. 'మేకా? కుక్క అనుకున్నాలెండి' అంటాడు. అంతకన్నా వాడు మాట్లాడ్డు. వాడు వెళ్ళిపోతాడు. 'వెర్రి వెధవ వాడికి మేక, కుక్క తెలియదు' అనుకుంటాడు ఈయన. ఇంకొంచెం ముందుకెళ్తే ఇంకోడొస్తాడు. 'అబ్బో బ్రహ్మాండమైన కుక్కను తీసుకున్నారు సార్ ఎంతకు కొన్నారు? ఎక్కడ కొన్నారు? ఎక్కడ దొరుకుతాయి ఇటువంటి కుక్కలు?' అన్నాడు. ఇంకోడు కూడా కుక్క అనేసరికి, 'కుక్క అంటావేంటయ్యా మేక, ఇంకోడు కూడా ఎందుకు కుక్క అన్నాడు? కుక్కలాగా కనిపిస్తోందేమో, అంటే నీకెలా కనిపిస్తోంది' అన్నాడు వాడు వీడ్ని. 'మేకలా కనిపిస్తోందా? ఏమో మరి నాకు కుక్కలాగా కనిపిస్తోంది' అన్నాడు వాడు. ఇద్దరికి కుక్కలాగా కనిపించింది. వీడు చూస్తే వీడికి మేకలాగా కనిపిస్తోంది. ఇది మేకా? ఇది కుక్కా? అని దాన్ని చూసుకుంటూ అట్టా తీసుకెళుతున్నాడుట. ఇంకొంత దూరం వెళ్ళేసరికి మూడో వాడు వచ్చాడు. 'వాడు డాబర్ మానా అండీ? అన్నాడుట. బావుంది మంచి ఏపుగా ఉంది. అద్భుతంగా ఉంది డాబర్ మాన్. ఈ డాబర్ మాన్ కోసం నేను చాలా రోజుల నుండి చాలా ప్రయత్నం చేస్తున్నాను. మన ఊళ్ళో ఎక్కడా దొరకట్లేదు. ఎక్కడ నుండి కొనుక్కొస్తున్నారు' అని ఇంక వాడ్ని ఏమీ మాట్లాడనీయకుండా వీడే ఇహ కుక్కలు, కుక్కల గురించి చెప్పడం, ఆ కుక్కతత్వం దీనిలో ఎట్లా ఉందో చూపించడం, ఇట్లా విపరీతంగా ఒక అరగంటసేపు వాడు దంచేశాడు. వీడికి పూర్తిగా దిగిపోయింది. 'మనకి ఏదో తేడా పడ్డదా? అందరికీ కుక్కలాగా కనిపిస్తోంది, నాకు మేక లాగా కనిపిస్తోంది' అని అనిపించి వాడిని అడిగాడట, 'నిజం చెప్పు నిన్ను నమ్మి

అడుగుతున్నాను, ఇది నిజంగా కుక్కా' అని అడిగాడు. ఎంత దుస్థితి చూడండి! 'నిజంగా కుక్క అంటారేంటండీ కుక్కే కదా' అంటాడు వాడు. 'ఖచ్చితంగా కుక్కేనా' అంటాడు. అయిపోయింది వాడికి. 'ఖచ్చితంగా నూటికి నూరుపాళ్ళు కుక్కే సార్' అంటాడు. 'ఇందాకటి నుండి ఇటువంటి కుక్క కోసం నువ్వు ఎదురు చూస్తున్నావని అనుకున్నావు కదా! నేను ఇచ్చేస్తాను తీసుకెళ్ళు. డబ్బులు కూడా ఇవ్వక్కర్లేదు' అని వాడికి ఇచ్చేసి వెళ్ళిపోతాడు. ఇది మనకి చిన్నప్పటి కథ కదా! అట్లా మనల్ని ముసలివాడివయ్యావు, నువ్వు అదయ్యావు, నువ్వు ఇదయ్యావు, నీకు రోగం వచ్చింది, నీకు రోగం కదా! మాటిమాటికీ ఏంటి నీకు రోగం? నీక్కాదు రోగం. నువ్వు వెలుగు కదా అని ఎవడూ చెప్పడండీ! ఒక్క గురువే చెప్తాడు. 'ఒరేయ్ నువ్వు వెలుగువురా' అంటే ఛీ ఫో అన్నట్టుగా ఉంటుంది మనకి. ఏదో పాపం ఆయన పిచ్చాడు ఆయనకంతా వెలుగే కనిపిస్తుంది కాబట్టి మనబోటి వాడిలో కూడా, శుద్ధ రాచిప్పలాంటి మనలాంటి వాడిలో కూడా ఆయన వెలుగు చూస్తాడు. ఆయన గొప్పదనం తప్ప మనలో వెలుగు ఎక్కడుంది అని అనిపిస్తుంది మనకి. అట్లా గురువేం చేస్తున్నాడంటే 'నువ్వు వెలుగువి, నువ్వు చైతన్య స్వరూపుడువి, నువ్వు జ్యోతి స్వరూపుడివి, నువ్వు దివ్యాత్మ స్వరూపుడివి' ఆయన చెవిలో గింగిరాలు తిరిగేట్టు మోయిస్తాడు కానీ అది మనం నమ్మం. అదేమిటమ్మా అంత జబ్బు చేసిందా? అంటే అవునమ్మా అంటూంటాం. ఎంతసేపు జబ్బులు, శరీరం లావుగా ఉందా, సన్నగా ఉందా, తిన్నది అరుగుతోందా లేదా? రెండు పూట్లా తినగలుగుతున్నామా లేదా? ఇవి కదా మనకెంతసేపూ. ఇవన్నీ మనవి కావు. జన్మ లేదు. మృత్యువు లేదు. వృద్ధాప్యం, వ్యాధి లేదు. ఉందనుకుంటే ఉంది నీ కర్మ. అలా నువ్వు ఉండడానికి ప్రయత్నం చేయి. ఎట్లా ఉంటుందో చూడు. జబ్బులు ఆగుతాయి. ఉండచ్చు. 'నోర్ముయ్' అంటాం చూడండి ఒక్కోసారి మనం కోపం వస్తే. అట్లా భయపడుతూ ఉంటాయి. ఏం చేయవు. ఏం చేస్తాయి? నువ్వు వెళ్ళిపోయే time కి, సార్ మరి మేం పని చేస్తాం మా time వచ్చిందంటే ఆ.. చేసుకోండి, అని వాటికప్పచెప్పేసి ఈయన వెళ్ళిపోతాడు. అట్లా ఉంటాడు. రోగాల్లేని గురువులెవరూ లేరు. ఉంటాయి. కాకపోతే వాళ్ళనేం చేయకుండా ఉంటాయి. ఎప్పుడూ? వాటి time

వచ్చినప్పుడు ఈయన సులభంగా వెళ్ళిపోవడానికి అవి పనికొస్తాయి. వాటితో ఈయన పోట్లాడడు. మహాత్ముల దగ్గర అట్లా ఉంటాయి. వాళ్ళ మాట కాదని వాళ్ళ మీద పడేట్టుగా ఉండవు. ఎందుకని? వాళ్ళు శరీరాన్ని అధిష్టించి ఉంటారు. అధి దైవము, అధి భౌతికము, ఆధ్యాత్మము ఉన్నాయి కదా! అష్టమ అధ్యాయం. కాబట్టి వాళ్ళకి జన్మ లేదు. మృత్యువు లేదు. జరా లేదు. కృష్ణుడికి మూడూ లేవు. అందరూ వేలాడిపోయారండీ యుద్ధం time కి. ఆ మొత్తం యుద్ధంలో 16 ఏళ్ళ కుర్రాడుగా కనిపించింది ఈయనొక్కడే! ౨౦ ఏళ్ళు అర్జునుడికి. మనవాళ్ళు బొమ్మలు అన్యాయంగా వేస్తున్నారు గానీ అర్జునుడికీ కృష్ణుడికీ ఒకే వయసు ఉన్నట్టుగా బొమ్మలేస్తారు. అట్లా ఉండదు. ఎందుకంటే కృష్ణుడు 16 ఏళ్ళుగానే ఉండిపోయాడు 126 ఏళ్ళు వచ్చినా శరీరానికి. ఏమీ చేయలేదు ధాతువులు కూడా, మరీ పూర్ణ తత్త్వం కాబట్టి. అసలు ఇంతమంది ముసలి వాళ్ళ మధ్య ఒక కుర్రాడు ఉన్నట్టుగా ఉంటుంది. మొత్తం కురుక్షేత్రం ఒక్కసారి అట్లా కళ్ళు మూసుకుని మనం ఊహిస్తే, దర్శనం చేస్తే అనబోకండి ఊహేగా. 'త్వం ఊహట దర్శనం' అని. అట్లా imagination నుండే మనం సృజనాత్మక శక్తిని కూడా పుట్టించుకోవచ్చు. అసలు ఊహే లేని వాడికి ఏదీ లేదు. మొత్తంలో ఈయన అద్భుతంగా ఉంటాడు. మిగతా వాళ్ళంతా కొంచెం ఏదో అంతంత మాత్రంగా. శరీరం బలంగా ఉండేవాడు, శరీరం పల్చగా ఉండేవాడు, ఇంత బలంగా ఉండే శరీరంగా ఉన్న వాడిని, పల్చగా ఉన్న శరీరం వాడు చితకబాదేస్తూ ఉంటాడు. ఏమిటయ్యా అంటే ఆత్మబలం. దాటి ఉన్నవాళ్ళు. దైవం ఎప్పుడూ అట్లాగే ఉన్నాడు. కృష్ణుడు అట్లా ఉన్నాడు, అని చెప్తున్నాడు భీష్ముడు ఇక్కడ. నీకు పుట్టుకే లేదు, మరణం లేదు, ముసలితనం కూడా లేదని చూపిస్తున్నావు కదా ఇక్కడి నుండే, అన్నాడు. జీవుడు కూడా అంతే. కృష్ణుడు అది చెప్పడానికే వచ్చాడు. నీకు కూడా లేవు. ఉన్నాయని నువ్వు అనుకుంటే ఉంటాయి. 'యద్భావం తద్భవతి'.

೨೨೨ భూః భువః సువః

మనకి అంతకుముందు శ్లోకంలో భూర్భువోలక్ష్మిః, ఇప్పుడు భూర్భువ సువః తరుః. ఇక్కడ ఒక చెట్టు ఉన్నది. ఆ చెట్టు ప్రజ్ఞామయ లోకాలను పుట్టించి (సువర్ లోకం అంటాం), ప్రజ్ఞ కారణంగా శక్తిమయ లోకాలను పుట్టించి, శక్తి కారణంగా పదార్థమయలోకాలను పుట్టిస్తుంది. మనకి పదార్ధమయ లోకాలు బాగా దృగ్గోచరములై ఉంటాయి. దానిని నడిపిస్తున్న శక్తిలోకములు కూడా అవగాహనకు అందుతాయి. శక్తికి ఆధారంగా ఉన్న ప్రజ్ఞామయ లోకములను దర్శించాలన్న ఆకాంక్ష సత్సాధకునికి ఉండడం చేత ఇటువంటి సత్కార్యములను మనం నిర్వర్తించుకుంటూ ఉంటాం. అది మనలో మనవలె, మన ప్రజ్ఞగా భాసిస్తూ ఉంటుంది. అది దివ్యప్రజ్ఞ. ఇవన్నీ ఇట్లా ఒకదాంట్లోంచి ఒకటి, ఒకదాంట్లోంచి ఒకటి శాఖోపశాఖలుగా విచ్చుకోవడం అనే సృష్టి గురించి చెప్తారట.

1000 తరుః

అంతకుముందు మనకి న్యగ్రోధో (మర్రి), ఔదుంబరో, అశ్వత్థః అనే మూడు వృక్షముల గురించి తెలుసుకున్నాం. ఇక్కడ చెప్పే చెట్టు పై మూడు చెట్లు కాక సృష్టి చెట్టు గురించి చెప్తున్నారు. సృష్టి చెట్టు అదృశ్యలోకాల నుండి దృశ్యలోకాలలోకి విచ్చుకుంటుంది. దాన్ని పురుషోత్తమ ప్రాప్తియోగంలో భగవానుడు 'మూలములు ఊర్ధ్వముగా ఉంటాయి, శాఖలు అధోదిశగా ఉంటాయి' అన్నా . ఊర్ధ్వముగా ఉంటాయంటే 'సూక్ష్మంగా' ఉంటాయి అని అర్థం. ఊర్ధ్వముఖము అంటే అట్లా మెడలు విరిగేటట్టుగా ఆకాశంలోకి చూడక్కర్లేదు. 'ఊర్ధ్వముఖము అంటే స్థూలము నుండి సూక్ష్మమునకు ప్రయాణము'. అన్నీ సూక్ష్మంగా ఉండి, సూక్ష్మము నుండి స్థూలమునకు విచ్చుకుంటూ ఉంటాయి. దానిలో మన ప్రజ్ఞ కారణంగా ఒక సంకల్పం విచ్చుకుని, ఆ సంకల్పానికి ఒక భావ రూపం కావడం చేత దానికి మనం భౌతికంగా ఒక రూపకల్పన చేస్తూ ఉంటాం. అన్నీ సూక్ష్మం నుండి స్థూలానికి విచ్చుకున్నవే. స్థూలం నుండి సూక్ష్మానికి విచ్చుకోవడం కాకుండా సూక్ష్మము నుండి స్థూలంగా విచ్చుకోవడం. చెట్టుని గమనిస్తే మూలాలు ఎప్పుడు కూడా సూక్ష్మంలో ఉంటాయి. మనందరి ప్రవర్తనకు మూలం, మనలో ఉండే 'స్వభావంలో' ఉంటుంది. అది మారితే గాని మన ప్రవర్తనలో మార్పు రాదు. మూలంలో మార్పు రాకుండా మనం ప్రవర్తన కప్పిపుచ్చుకోవడమే గానీ మార్పులేదు. ఒక మామిడి చెట్టు నుండి ఒక రకమైన పండు వచ్చి, ఆ పండ్లల్లో ఒక భాగం ఎప్పుడూ కుళ్ళిపోయేటట్టుగా వచ్చిందనుకోండి, పండుని మనం ఎంత repair చేసినా మారదు. చెట్టు లోనే ఉంటుంది. సూక్ష్మమైన నీటిలో మలినములు కలిసినప్పుడు, దానిని మనం ఐసు ముక్క చేసుకుంటే అందులోకి కూడా అవి వస్తాయి. సూక్ష్మమైన నీటిలో ఒక బొట్టు ఇంకు సిరా పడితే స్థూలమైన ఐసు ముక్కలోకి అవి దిగి వస్తాయి. దానిలోకి నిర్మూలనము చేయలేదు. నిర్మూలనము అంతకన్నా సూక్ష్మమైన లోకాలలో జరుగుతుంది. ఇట్లాగే మార్పులు అన్నీ కూడా భౌతికంగా మనకి నచ్చని విషయాలు. వీటిలో మార్పు జరగాలంటే భౌతికంగా ఎన్ని రకాలుగా మార్పులు చేసినా సుఖాన్ని ఇవ్వదు. మార్పులు అంతర్ముఖంగా జరగాలి.

కొంతమందికి సమస్యలు ఎన్నటికీ పరిష్కారం కావు. ఎందుకు పరిష్కారం కావు అని ఆలోచించుకుంటే మన లోపల మన యొక్క ఆలోచనా విధానం, వాగ్ధోరణి, ప్రవర్తన మారాలి. ఈ మూడింటిని మార్పు చేసుకోవాల్సిన అవసరం ఉంది. అధో లోకాలలో బాగుండాలి అంటే సూక్ష్మ లోకాలలో మార్పులు జరగాలి. సూక్ష్మ లోకములలో నేను ఏమీ మారను అధోలోకాలలో మార్పులు రావాలి అనుకోవడం అజ్ఞానము. మనకు దేనియందు సాధించవలసినంత సిద్ధి లభించడం లేదో, దానియందు మన విధానంలో లోపం ఉంది అనుకోవాలి తప్ప, ఇంకో పద్ధతి లేదు. అందుకని దృశ్యమైన విషయములయందు, ప్రశాంతతతో కూడిన వాతావరణం మనకు ఏర్పడాలి అంటే సూక్ష్మము, అదృశ్యము అయిన మన స్వభావంలో మార్పు తెచ్చుకోవాలి. అలా మార్పులు తెచ్చుకోవడానికే సాధన, తపస్సు. అలా మార్పులు అంతర్ముఖంగా తెచ్చుకోకుండా బహిర్ముఖంగా ఏమి చేసినా అవదు. అందుకని సృష్టిలో జరిగే వాటికి అన్నిటికీ కూడా అంతర్ముఖంగా ముందు తయారై, అవి అధోముఖంగా వ్యక్తమవుతుంటాయి. వ్యక్తమైన తర్వాత మార్పులు చేయడానికి వీలు లేదు. అప్పటికే జరగవలసింది అంతా జరిగిపోయింది. పూరీలు తయారు చేయడానికి గోధుమ పిండిలో ఉప్పు ఎక్కువ కలిపేస్తే, ఉప్పు ఎక్కువ కలిపిన పూరీ వస్తుంది కదా! కలపడం లోనే వుంది. అలాగే మన త్రిగుణముల యొక్క సమ్మేళనం ఎలా ఉన్నదో దాన్ని బట్టి మనలో దిగి వచ్చే ఆలోచన, చేత, మాట ఉంటుంది. త్రిగుణముల యొక్క మేళవింపులో మార్పులు జరగాలి. ఒకసారి ఉప్పు ఎక్కువ వేసుకున్నాం, ఇంకోసారి తక్కువ వేసుకోవడానికి ప్రయత్నం చేయాలి. అంతేకానీ వండిన పూరీ repair అవదు. పిండి కలిపేటప్పుడు మార్పు రావాలి. పిండిలో ఇసుక కలిసి పోయింది అనుకోండి, పూరీలో ఇసుక ఏరలేరు. నీళ్ళు కలపకముందే చూసుకోవాలి. మనం చాలా రోజులుగా, చాలా దశాబ్దాలుగా ఇట్లాఉంటే బాగుంటుంది, ఇట్లా ఉంటే బాగుంటుంది అని అనుకుంటూ ఉంటాం. అలా ఉండలేము కదా. ఉంటే బాగుంటుంది అనేదే మిగిలిపోయిందే తప్ప ఉండడం రాలేదు. ఎందుకని రాలేదు అంటే లోపల మార్పులు చేసుకోవడానికి సంసిద్ధత తక్కువగా ఉంది. అంతర్ముఖంగా మార్పులు తెచ్చుకోవడమే సత్సాధన! బహిర్ముఖంగా మనం ప్రపంచానికి ఇంకొకరకంగా మన

గురించి అభిప్రాయం ఇవ్వవచ్చు. కానీ అది మనం కాదు కదా. మనం అది కానప్పుడు అటువంటి అభిప్రాయం ప్రజల్లో మనం ఏర్పర్చినప్పుడు, వారి అభిప్రాయం కోసం మనం జీవించే పరిస్థితులు మనం ఎంతో ఘర్షణ పడతాం. మనం ఎవరో మనకు తెలుసు కదా. ప్రపంచం మీరు చాలా మహాత్ములు అన్నా కూడా కాదని తెలిసినప్పుడు, వాళ్ళు మహాత్ములు అన్నారు కాబట్టి, వారి కనుసన్నలలో మనం ఎట్లా ఉండాలో వారు నిర్ణయించినట్టుగా మనం జీవించాలి అనుకుంటూ బాధ పడేవాళ్ళు కూడా చాలామంది ఉంటారు. పేరు కోసం, ప్రతిష్ట కోసం, సంఘం గుర్తింపు కోసం తాపత్రయపడే వాళ్ళందరూ కూడా ఇలాగే ఘర్షణలో ఉంటారు. ఎందుకంటే నీవు నీలాగా త్రికరణ శుద్ధితో జీవిస్తూ ఉంటే నిన్ను సంఘం గుర్తిస్తే గుర్తిస్తుంది, గుర్తించకపోతే గుర్తించదు. సంఘం గుర్తించడం కోసం జీవిస్తున్నావా? సంఘం గుర్తింపు కోసం జీవించేవాడు మాయలో, మోహంలో పడిపోతాడు. అబద్ధాలు ఆడుతుంటాడు. వారిని, వీరిని manage చేసుకుంటూ, ఇట్లా రకరకాలుగా బాధలు పడుతుంటాడు. ఎందుకంటే అధోలోకంలో ఏదో రకంగా manage చేయాలి అనే భావనలో ఇరుక్కుపోయి ఉంటాడు. కప్ప ఎప్పుడు తక్కెడలోంచి మళ్ళీ దూకుతుంది అని తెలిసినప్పుడు, నీ తక్కెడ ఎప్పుడు కప్పకు దగ్గరగా ఉంటుంది. ఒకటి అందులోకి వేస్తే రెండు అందులోంచి బయటకి గెంతుతూ ఉంటాయి. మళ్ళీ దాని తెచ్చి ఇందులో వేసుకుంటూ ఉండాలి. మళ్ళీ ఇంకో నాలుగు ఎగురుతాయి. ఎందుకు ఇదంతా? అసలు కప్పతత్త్వం పోవాలి. భగవంతుని సృష్టిలో అలా ఉండదు. ప్రజ్ఞ నుండి శక్తి. శక్తి అనే power మనం తెచ్చుకుందాం అంటే అవదు. ప్రజ్ఞ ఉన్నవాడికి అధికారం సహజంగా ఉంటుంది. ఇతరులకి తెచ్చి పెట్టుకున్నది కాబట్టి రజోగుణంలో బందీకృతుడై ఉంటాడు. అవసరమైనప్పుడు శక్తులు వస్తాయి, అవసరం లేనప్పుడు అవి ఉండవు. అది సుఖం కదా. సత్త్వగుణ సంపన్నుని యొక్క శక్తి అట్లా ఉంటుంది. ఎప్పుడూ శక్తిలో జీవించడు. ఎప్పుడూ సత్త్వంలో జీవిస్తాడు. అవసరమైనప్పుడు శక్తి పని చేస్తుంది, వెళ్ళిపోతుంది. లేకపోతే మోసుకు తిరుగుతూ ఉండాలి. మంత్ర శక్తులు సంపాదించిన వాళ్ళు వాటి బరువుని అట్లా మోస్తూ ఉంటారు. భూత ప్రేత పిశాచాది శక్తులు అన్నీ సాధన

చేసినవాళ్ళు వాటితో ఎప్పుడు దమించి ఉండాలి. లేకపోతే అవి ఎప్పుడు ఇతనిని లొంగ తీసుకోవడానికి ప్రయత్నిస్తాయి. అందుకని శక్తి ఆరాధనలో కూడా చాలా బాధ ఉన్నది. భౌతికంలో శక్తులు కూడా బాధలు ఉన్నాయి. ప్రజ్ఞ యందు నిలబడ్డ వాడికి శక్తి గాని, పదార్థం గాని చక్కని సహకారం అందిస్తుంది. అందుకని భగవంతుడు ఏం చెప్పాడంటే, నీ ఒక చెట్టువి, నీ నుండి ప్రజ్ఞ వ్యక్తం అవుతున్నది. నీ ప్రజ్ఞ నుండి శక్తి వ్యక్తం అవుతున్నది. నీ శక్తి నుండి పదార్థం వ్యక్తమవుతున్నది. సాధనపరంగా కూడా మనం అందుకోవాల్సింది కూడా, సూక్ష్మము నుండి స్థూలమునకు. ఋషి ప్రోక్తమైన మార్గం కూడా అదే. అటు నుండి ఇటు చూడమంటారు, ఇటు నుండి అటు ఎక్కడం కష్టం అంటారు. అందుకని శాఖను పట్టుకుని మూలంలోకి వెళ్ళే ప్రయత్నం చేయకు అని పురుషోత్తమ ప్రాప్తి యోగంలో చెప్తారు. శాఖలు పట్టుకుని కేంద్రంలోకి వెళ్ళలేవు, కేంద్రం నుండి శాఖలోకి రావచ్చు. మూలం నుండి శాఖలోకి రావచ్చు. కేంద్రం నుండి పరిధికి వెళ్ళడం సులభం కానీ, పరిధి నుండి కేంద్రం చేరడం అంత సులభం కాదు. ఒక ఊరు center లో వదిలేసి ఈ ఊరు బయటకు వెళ్ళిపో, అన్నారనుకోండి. ఎటు పోయినా ఊరు బయటకు వెళ్ళిపోతారు. ఊరు బయట నుండి ఊర్లోకి రమ్మన్నాం అనుకోండి, ఊర్లోకి రాలేకపోవచ్చు. కేంద్రంలోకి రాలేక రహదారులు పట్టుకుని ఒక దాంట్లో నుండి ఇంకోటి, ఇంకో దాంట్లో నుండి ఇంకోటి తిరుగుతూ ఉండడం అవుతుంది తప్ప కేంద్రం చేరడం కష్టం. కేంద్రం నుండి పరిధికి చేరడం సులభం. పరిధి నుండి కేంద్రం చేరడం కష్టం. శాఖల నుండి మూలాన్ని అందుకోవడం కష్టం. మూలాన్ని పట్టుకుంటే అక్కడ నుండి శాఖల్లోకి విచ్చుకోవడం సులభం. అందుకని మన భారతీయమైన మార్గంలో నీ మూలం లోకి నీవు ముందు వెళ్ళి, ఆ మూలంలో నుండి నీవు ఎట్లా విచ్చుకుంటున్నావో చూసుకోమన్నారు. అలా చూసుకున్నట్లయితే మళ్ళీ మనకు నాలుగు స్థితులు గోచరిస్తాయి. నేను, నా ప్రజ్ఞ, నా ప్రజ్ఞ నుండి వ్యక్తమవుతున్న శక్తి, దాని నుండి ఏర్పడుతున్న పదార్థం. Matter four consciousness అంటారు కదా. Consciousness అంటే ప్రజ్ఞ, అది కూడా పుట్టిందే అని చెప్పుకున్నాం.

'జన్మ మృత్యు జరాతిగః'. చైతన్యం కూడా వచ్చి పోతూ ఉంటుంది. తెలివి వచ్చిపోతున్నట్టుగా. నిద్ర రాగానే తెలివి నిద్రలోకి వెళ్ళిపోయింది. ఉండడం ఎప్పుడూ ఉండగా, అందులో నుండి చైతన్యవంతులం అవుతూ ఉండగా, అందులో నుండి చైతన్యమే శక్తిగా మారుతుంటే అక్కడి నుండి పదార్థము, వాటి యొక్క ఏర్పాటు ఉంటాయి, కాబట్టి సృష్టిచక్రం గుర్తుపెట్టుకోమన్నారు. అందుకని పురుషోత్తమప్రాప్తి యోగంలో భగవంతుడు దీని గురించి ఒక తాళం చెవి ఇచ్చాడు. 'ఇది సూక్ష్మము నుండి స్థూలమునకు వ్యాపించిన చెట్టు, నీకు తలకిందులుగా గోచరిస్తుంటుంది. కానీ అదే నిజమైన చెట్టు. నీవు కూడా ఆ విధంగానే ఉన్నావు. నీవు ఉన్నావు, నీ నుండి నీ ప్రజ్ఞ ప్రతి ఉదయము వ్యక్తమౌతుంది. అది కారణంగా నీలో నుండి శక్తులు ఉద్భవిస్తున్నాయి త్రిగుణాత్మకంగా. దాని కారణంగా ఏవో పనులు చేసుకుంటున్నావు. ఇలా ఉండే నువ్వు 'అసంగము' అనే అస్త్రమును సంధించు' అంటాడు. అసంగము అంటే సంగం లేకుండా ఉండడం. అంతమాత్రం చేత ప్రతిదీ కత్తిరించడం, ఖండించేయడంగా భావన చేస్తూ ఉంటాం. ఖండించేస్తే ఏమీరాదు. భార్య పిల్లలు, ఇల్లు వాకిలి వద్దు, వచ్చే ఉద్యోగాలు వద్దు, ఏమీ వద్దు, అనుకుంటే అసలు 'నువ్వు కూడా నాకు వద్దు' అంటాడు. అసంగము అనే అస్త్రములో ఒక రహస్యం ఉన్నది. 'అ' తో సంగమం చేయడం అసంగము. 'అ' తో సంగమం. విభూతి యోగంలో అక్షరములలో 'అ' నేను అంటాడు భగవానుడు. అన్ని భాషలకి మొట్టమొదటి అక్షరం 'అ' యే, ఒక్క English భాషకి తప్ప. అందుకని ఆ భాషను పెద్దగా లెక్కచేయవు మిగతా భాషలు. Greek నుండి పుట్టిన భాషలైనా, Latin నుండి పుట్టిన భాషలైనా, సంస్కృతం నుండి పుట్టిన భాషలైనా అన్నింటికీ మొదటి అక్షరం 'అ'! మనం ఏదైతే ఇంగ్లీషులో 'ఎ' అంటామో దాన్ని మిగతా దేశాల వాళ్ళు అంటే English భాష మాట్లాడే వాళ్ళు తప్ప మిగతా వాళ్ళు ఆ అక్షరమును 'అ' అని పిలుస్తారు. 'ఎ' అని పిలవరు. 'ఎ' ఎప్పుడు వచ్చింది? 'అ' కు 'ఇ' కలిపితే వచ్చింది. 'ఎ' ఎప్పుడు వచ్చింది? 'అ' తర్వాత 'ఇ' వచ్చి, 'ఇ' తర్వాత 'ఉ' వచ్చి, 'ఉ' తర్వాత 'ఎ' వచ్చింది. 'ఐ' తర్వాత వచ్చింది. వ్యాకరణం కాస్త కొంచెం పరిచయం ఉన్నా, మూడో రకంతో మొదలైంది English. ఆంగ్ల అక్షరంల పట్టి. అక్షర మాల. ఇక అందరూ మొత్తం

భూగోళంలో 'అ' తో మొదలుపెడతారు. ఎందుకని 'అ' నేను. 'మొదటి అక్షరం, ఆది.' అందుకని 'అ' తో సంగమం చేయి, అని పురుషోత్తమప్రాప్తియోగంలో సూచన. అన్నిట్లో ఉన్న నన్ను దర్శనం చేయడమే ప్రాథమిక దర్శనం. అది ఆధారంగా, సాధనగా నీ మిగతా సమస్తమైన సాధనములు పూర్తిచేసుకుని సిద్ధి పొందు. చివరకు దాన్నే పొందుతావు. ఇది కాక ఏం చేసినా సరే నీకు ఏదీ అందదు. ఇది మరవక ఎన్నైనా చేస్తూ ఉండు, అది సత్ఫలితాన్ని ఇస్తుంది. సత్ విభూతిని ఇస్తుంది. సంస్కారమును ఇస్తుంది. సాన్నిధ్యాన్ని ఇస్తుంది. అందుకని అది మరవక చేసుకోమని చెప్పడం కోసమే భాగవతం, అద్వైత సిద్ధాంతం! 'ఉన్నది అదే సుమా' గుర్తుపెట్టుకోండి. ఉన్నది ఒకటే దానితో సంగం చేయడంతో అదే ఇదిగా ఉన్నదని తెలుస్తుంది. అదే చెట్టుగా ఉంది, అదే మనిషిగా ఉంది, అదే జంతువుగా ఉంది, అది సంగమం. అందుకని పురుషోత్తమప్రాప్తిలో 'తలకిందులుగా ఉండే చెట్టు నీకు అర్థం కావాలి అంటే, మూలం నువ్వు పట్టుకో. మూలం నువ్వు పట్టుకోవాలి అంటే 'అ' ని పట్టుకో. అసంగము అనే అక్షరం చేత, ఈ సమస్తాన్ని చిక్కుముడి నుండి విప్పుకో' అని చెప్పారు. ఎంతవరకు దాన్ని దర్శనం చేస్తుంటావో అంతవరకు ప్రశాంతత చెడదు. అంతవరకు త్రిగుణముల యొక్క సమాంతర స్థితి మారదు. Equilateral triangle అంటారే సమకోణ త్రిభుజం. సమకోణ త్రిభుజము అంటే ఏమిటి? త్రిభుజానికి ఎన్ని డిగ్రీలు ఉంటాయి? 180! సమకోణ త్రిభుజంలో మూడు భుజాలలో 60 డిగ్రీలు ఉంటాయి. సమకోణం వేటి మధ్య ఏర్పడాలి? త్రిగుణములలో తమస్సు, రజస్సు రెండూ సమానంగా ఉంటే ఏర్పడేది సత్త్వం. అసలు మొదట సత్త్వ ఉన్నది. అక్కడ నుండి రజస్సు, తమస్సు దిగి వచ్చినప్పుడు ఈ రెండిటి యందు సమన్వయం లేకపోవడం చేత సత్త్వం అదృశ్యం అవుతుంది. ఒకటి అరవై, ఇంకోటి అరవై, ఉంటే మూడోది అరవయ్యే ఉంటుంది. మూడోది కొలవక్కర్లేదు. ఈ త్రిభుజంలో మూడు కోణాలు ఏ ఏ డిగ్రీలో ఉన్నాయి చెప్పండి అంటే, రెండు తెలిస్తే మూడోది తెలిసిపోయినట్టే. రెండు సమానంగా ఉంటే రెండు అరవైలు కదా. రజస్సు, తమస్సు సమపాళ్ళల్లో ఉంటే సత్త్వం అక్కడ మనకు దర్శనమిస్తుంది. సత్త్వ నందు నిలబడతాం. అలా నిలబడటం చేత సత్త్వాతీతమైన తత్త్వము

మనకు అందుబాటులో ఉంటుంది. రజస్సులోనూ, తమస్సులోనూ అందుబాటు ఉండదు. సాధించాలి, జయించాలి, ఆక్రమించాలి, దమించాలి ఇలాంటి భావన ఉన్నచోట సత్త్వ పనిచేయదు, కాబట్టి సత్త్వమునకు అతీతమైన తత్త్వం కూడా అంతమాత్రం లోనే ఉంటుంది. అందుకని త్రిగుణములు సమపాళ్ళల్లో ఉండాలి అంటే 'అ' ని ఆశ్రయించాలి. 'అ' ని ఆశ్రయించడం చేత త్రిగుణాతీతమైన సత్త్వము నిలబడడానికి వీలు ఉంటుంది. ఎప్పుడైతే ఆ సత్త్వమునందు ఉంటామో సంగమమే లేదు. ప్రత్యేకమైన అనురాగం గాని , విరాగంగాని ఉండదు. రాగద్వేషములు, కామ క్రోధములు, ఈర్ష్య అసూయలు అనే ద్వంద్వములు హరింపబడతాయి. ఇట్లా ద్వంద్వములలో ఉండే సృష్టికి అతీతంగా నువ్వు ద్వంద్వములకు అతీతంగా ఉండడానికి వీలు పడుతుంది. అదీ ఈ చెట్టు. ఈ చెట్టుని అట్లా ఆరాధన చేసుకోవాలి. భగవంతుని ఈ వృక్షముగా ఇక్కడ చెప్తారు. భూర్భువస్వ తరుహుః

1001 తారః

ఎప్పుడైతే ఈ చెట్టు నీకు పూర్ణమైన అవగాహన ఇస్తుందో, నీ యందు దాని యొక్క అవగాహన ఏర్పడిందో అప్పుడు నీవు తరించిన వాడివి అయ్యావు. తారా అంటే దాటడం అని అర్థం. తారక మంత్రం అంటుంటాం. తరించడం అంటాం. ఈ విధంగా భగవత్తత్త్వాన్ని రజోగుణ సంపత్తి, తమోగుణ సంపత్తి దాటించాలి. తమో గుణ సాధన, రజోగుణ సాధన, సత్వగుణ సాధన ఎట్లా ఉంటుందో చూశాము. సత్వగుణ పరంగా సాధన చేసుకుంటూ వెళుతూ ఉంటే ఆ పట్టి దగ్గర పెట్టుకుంటే. ఎప్పటికప్పుడు ఆ పట్టీని మనం refer చేసుకుంటూ ఉంటే, మనం తప్పటడుగు వేస్తే మనకు తెలుస్తుంది. మనకు తెలియకుండానే మనం రజస్సులోకి, తమస్సు లోకి ప్రవేశించేస్తుంటాం. మనం సహజంగా అందులోనూ, ఇందులోనూ ఉన్న వాళ్ళం కాబట్టి అదే ఎక్కువ మనకి సౌకర్యంగా ఉంటుంది. దానికి కూడా ఉదాహరణ చెప్పారు. సుగంధ ద్రవ్యాలు వేసిన నీటిలో పందిని స్నానం చేయిస్తే దానికి అంత సుఖంగా ఉండదు. మళ్ళీ అది బురదలో పడుకుంటూనే ఉంటుంది. అట్లా ఉంటుంది కాబట్టి, సత్త్వగుణపు పట్టి లో 27 గుణాలున్నాయి. మన ప్రవర్తనలో వీటికి ఎంత చోటు ఉంది, వీటికి వ్యతిరేకమైన వాటికి ఎంత చోటు ఉంది. అవే అనసూయతం ఆచరించడానికి దీక్ష వహించాలి. అలా చేయడం వల్ల రజస్సుకి, తమస్సుకి సమన్వయం ఏర్పడి సత్త్వంలోకి పెరుగుతాం. సత్త్వంలోకి పెరగడం వలన సత్త్వాతీత స్థితిలోకి వస్తాం. అప్పుడు నీవే నీ ప్రజ్ఞగా ఎట్లా వ్యక్తం అవుతున్నావు, నీవే నీ ప్రజ్ఞ నుండి శక్తి ఎట్లా వ్యక్తం అవుతుందో తెలుస్తుంది. ముందు వెలుగు వచ్చిన తర్వాత కదా అందులో నుండి మూడు శక్తులు వచ్చాయి. మనం చేసుకున్న పూజలు కూడా వెలుగుకి. వెలుగుని ముగ్గురు అమ్మలుగా చూస్తాం. దుర్గా, లక్ష్మి, సరస్వతి. ఆ వెలుగుని ఆదితి అంటాం, దుర్గ అంటాం, లలిత అంటాం. కాబట్టి వెలుగుకే పుట్టుక ఉంది. మనం అది. అసలు తత్త్వమే మనయందు మనంగా ఉన్నప్పుడు, మన నుండి ప్రజ్ఞ ప్రచోదనమై వ్యక్తం అవుతుంటే అందులో నుండి శక్తి. దానిలో నుండి మాటలు, చేతలు, ప్రపంచంలో మనం విసర్జన చేసిన భావనలు, బోలెడు మనం వెళ్లే లోపల ఇక్కడ వదిలేసి వెళ్తాం

కదా. ఎవరండీ ఇది కట్టించారు బ్రహ్మాండంగా ఉంది అంటే, ఫలాని ఆయన అని చెప్తారు. వేల సంవత్సరాలు భూమి మీద స్ఫూర్తిని ఇచ్చేది, ఇక్కడ నిర్మాణం చేసి వెళ్ళిపోయిన వాళ్ళు ఉన్నారు. వాళ్ళు ఏం చేశారు అంటే ఆ చెట్టుని పట్టుకుని దిగివచ్చారు. ఆ చెట్టు మీద నుండి దిగి వచ్చిన వారు అని అర్థం. ఈ విధంగా మనం అసంగాన్ని పట్టుకుని అట్లా వెళ్ళడం చేత తరించిన స్థితిలో ఉంటాం. సృష్టి అనే క్రీడలో మన వంతు ఆట మనం ఆడినప్పుడు, దెబ్బలు తగలకుండా, penalty లు పడకుండా, Fine వేయించుకోకుండా, Green Card, Red Card, Yellow Card (Foot ball లో లాగా) చూపించుకోకుండా, అవన్నీ తెచ్చుకోకుండా మళ్ళీ తిరిగి వెళ్ళడమే తరింపు. అందుకని ఈ చెట్టు చాలా ముఖ్యం. ఈ చెట్టే పురుషోత్తమప్రాప్తి యోగంలో ఇవ్వబడింది. అందుకని ముందు పిల్లలందరి చేత చిన్నతనంలో పురుషోత్తమప్రాప్తి కలగాలనే ఉద్దేశంతో, పైగా అందులో ఉన్న శ్లోకముల సంఖ్య అన్నిటికన్నా తక్కువ కాబట్టి అది ముందు హృదయస్థం చేయిస్తారు. మొత్తం భగవద్గీతలో కనీసం పురుషోత్తమప్రాప్తి యోగం కంఠస్థం చేయాలి. కంఠస్థం చేస్తే చాలదు, హృదయస్థం చేయాలి. కంఠస్థం చేయడము గొప్పకి. ఇంకోడి దగ్గర మనకి ఇది వచ్చు అని చెప్పడానికి పనికి వస్తుంది. హృదయస్థం చేస్తే మనకి పనికి వస్తుంది. మన స్వభావంలో అది భాగంగా ఏర్పడాలి. మామూలుగా మనం చేసే స్తోత్రాలు అన్నీ కంఠస్థమే, హృదయస్థం కాదు. చదువుకుండేటప్పుడు కూడా గురువుగారు కంఠస్థం చేయరా అంటారు. ఎందుకని అంటే తర్వాత పెద్దగా పనికి వచ్చేది కాదని. ఇవి శాశ్వతంగా జన్మజన్మలకు పనికి వచ్చే విద్య కాబట్టి ఇవన్నీ హృదయస్థం చేయాలి. అంటే నీ స్వభావము అదిగా మారాలి. మారితే అప్పుడు నీకు తరింపు దొరుకుతుంది. దొరికితే పుట్టుకకు స్థానంలోకి నువ్వు వెళ్ళడం వల్ల, ప్రపితామహుడు అని సవిత అందుతాడు.

1002, 1003 సవితః, ప్రపితామహః

పితామహః అంటే తండ్రి. ప్రపితామహః అంటే తాతయ్య. మనకి తాతయ్య ఆయనే! ఎవరు? ఈ సూర్యునికి వెలుగుని ఇచ్చిన వాడు, ఈ సూర్యుని వెలుగుకి మూలమైనవాడు. మనం ధ్యానం చేసుకుంటూ ఉంటాం. అంటే వెలుగు మూలాల్లోకి వెళ్ళవచ్చు. ఆయన మన Grand Father. సూర్యుడు మనకి తండ్రి అయితే సవితుడు మనకి తాత. ఆ సవిత్రుని పట్టుకుని అక్కడ ఉండి, అక్కడ నుండి వెలుగుగా వచ్చి, ఇహ అక్కడ నుండి సూర్యుడుగారు ఎట్లా అయితే ఈ గోళాలన్నీ పెంచారో, అట్లా ఒక సంసారాన్ని పెంచుతావు. అయితే పెంచి ఆయన ఇరుక్కోలేదు. తన నుండి పెరిగినది తన మీదే ఆధారపడింది తప్ప తనని దాటి పోలేదు. మనం ఏదైనా పెంచుకుంటే దానిమీద మనం ఆధారపడడం మొదలుపెట్టడం చేత స్వామిత్వం కోల్పోతూ ఉంటాం. డబ్బు మీద, పదవి మీద తాను గాక ఇతరములైన వాటిని వేటి మీదైనా నీవు ఆధారపడ్డా నీవు బానిసవే. నీ నుండి పుట్టిన వాటి మీద నీవు ఆధారపడకూడదు అనేది ఆధ్యాత్మిక సాధనలో ఒక ముఖ్యమైన అంశం. నీ నుండి కీర్తి పుట్టవచ్చు, దాని వెనక నువ్వు పడక. లేకపోతే కక్కిన కూడు తిన్నట్టుగా ఉంటుంది. నీ నుండి వచ్చింది అంటే అంతేగా. నీ నుండి వచ్చిన సంపద. నువ్వు ఉండబట్టి కదా అది అంతా వచ్చింది. నీకన్నా నీ సంపద, కీర్తి గొప్పా? నీవు ఉండబట్టే కదా విద్య వచ్చింది. కాబట్టి నీ విద్య యందు కూడా నీవు రమించక. ఒక్కొక్కళ్ళు ఏవేవో నేర్చుకుంటారు, ఇహ అవి పట్టుకుని లుంగలు చుట్టుక పోతారు. జ్యోతిషంలో లేదా సాముద్రికంలో, లేదా Healing పేరున లుంగలు చుట్టుకుపోయిన వాళ్ళు ఉంటారు. గుర్తుపెట్టుకోండి Healing is also a science. యోగంలో ఉన్న వాడికి ఇవన్నీ 'యోగస్థః కురు కర్మాణి సగంత్యక్త్వా ధనంజయ'. దేనితో నువ్వు జిగురు వేసి అంటించుకోకుండా యోగస్తః అంటే యోగం నందు సాగిపోవడం. యోగం అంటే విశ్వాత్మ చైతన్యముతో ముడిపడి ఉండడం. అది ఒక్కటే యోగం. మిగతావన్నీ దానితో వియోగం. అవన్నీ మనకు వికారాలు కలిగిస్తాయి. అందుకని ఎన్ని రకాలుగా నీ జీవితాన్ని అల్లినా ఆ అల్లికలోకి నీవు దిగకు. నీ అల్లిక నీ యొక్క స్వాధీనంలో ఉండాలి. అప్పుడు

నీవు నీ జీవితానికి స్వామివై జీవిస్తావు. అంతేగాని నీవు చేద్దామనుకున్నవి, నీకు ధార్మికము అనిపించినవి, నీకు పునర్వృద్ధి ఇస్తాయి అనిపించినవి, వాటిని అడ్డుపడే వాటిని అన్నింటినీ పెంచుకుని, అందులో నుండి రాలేక నువ్వు ఉన్నావంటే నీవు బానిసవే. బందీకృతుడైన వాడివి. ఏంటోనండి వీలుపడదు అది అలా పెంచుకున్నాము, అంటారు. ఎవరు పెంచుకున్నారు నువ్వేనా? ఎవరు ఏది పెంచుకున్నా అది వాడు పెంచుకున్నదే. పెంచుకున్నది నీ అధీనంలో ఉంటే నీవు స్వామివి నీ జీవితానికి. ఊళ్ళో వాళ్ళ మీద స్వామిత్వం వద్దు, మన మీద మనకు స్వామిత్వం రావాలి. మన మీద మనకు స్వామిత్వం వచ్చినవాడి వెంట పది మంది వస్తారు. అట్లా ఉండడం ప్రతివాడు కోరుకుంటాడు. అదీ స్వతంత్రత! స్వతంత్రత అంటే తన్ను తాను పరిపాలించుకోవడం. Self rule. Ruling others, యోగులు ఎవ్వరూ చేయరు. ఇంకోళ్ళని మనం పరిపాలించాలి అనుకోవడం రజోగుణం. తన్ని తాను పరిపాలించుకోవడం అనేది సాధన. తన్ని తాను స్వామిత్వం వహించడం అనేది యోగం. నీ మీద నువ్వు స్వామిత్వం కలిగియున్నప్పుడు, ఇట్లా మనం కూడా ఉంటే బాగుంటుంది అని ఇంకోడు అనుకొని వాడు కూడా నీ దగ్గర చేరుతాడు. అంత మాత్రం చేత వాడి మీద నువ్వు స్వారీ చేయకూడదు. ఏది చూసి నీ దగ్గరకు చేరాడో అదే నువ్వు చేసుకుంటూ ఉంటే, నీ దగ్గర అది నేర్చుకుంటాడు. మనకి మనిషి వస్తే చాలు భుజాలు ఎక్కేస్తాం. అదొక పెద్ద ఆచారంగా తయారు చేసుకుంటాం. రజోగుణం కారణంగా వచ్చే వాడి మీద ఎక్కడం ఉంటుంది. వచ్చేవాడిని తనతో సమానంగా ఆదరించి, తన పని తాను చేసుకుంటే, వాడు కూడా చెయ్యి కలిపితే కలపనిస్తాడు. చెయ్యి తీసేస్తే ఎందుకు తీశేశావు? అని అడగడు. అంతకుముందు వాడు లేడు. నువ్వు మొదలు పెట్టినప్పుడు వాడు రాలేదు, వాడు మధ్యలో వెళ్ళిపోతే, మానేస్తావా? లేదా వాడి మీద పోట్లాడుతావా? వాడి గురించి మాట్లాడుకుంటూ మనం చేసే పని మానేస్తామా? 'నది' మనకు ఉదాహరణ. ఎన్నో పిల్ల కాలువలు వచ్చి చేరుతూ ఉంటాయి, చేరనిచ్చింది. కొన్ని విడిపోతూ ఉంటాయి, విడిపోనిస్తుంది. అంత మాత్రం చేత తన గమ్యాన్ని తను మరవదు కదా. అదీ స్వామిత్వము! నదిని చూస్తే స్వామిత్వము ఏమిటో తెలుస్తుంది. గోదావరి గాని , కృష్ణ గాని తమ పుట్టుక

స్థానాలలో మన ఇళ్ళల్లో ఉండే పంపు గొట్టం అంత ఉంటే, అవి సముద్రం దాకా ఎలా చేరతాము, మధ్యలో ఇంకిపోతామేమో అని ఆలోచించవు. గంగ అంటే విపరీతమైన ధార. ఇది పుట్టిన చోటు చూస్తే భయంకరంగా ఉంటుంది. ఇదా గోదావరి, ఇదా కృష్ణ అనిపిస్తుంది. తన దారిన తను నడిచి వెళ్తూ ఉంటే ఎన్నో చేరినాయి. చేరినాయి అని చెప్పి వాటితో కూర్చొని కబుర్లు చెప్పుకోవడం, ఏవో తంత్రాలు వేయడం, కుతంత్రాలు వేయడం ఇవన్నీ ఉండవు కదా. తన దారిన తను పోతుంటే చేరినవి చేరుతున్నాయి, విడిపోయినవి విడిపోతున్నాయి. పోతే పోయినాయి. వచ్చినప్పుడు నువ్వు అడిగావా! నేను రమ్మంటే అవి వచ్చాయా, అవి పోతే నేను బాధపడ్డానికి, నా దారిన నేను పోతున్నాను తథాగతుడివలె, అన్నారు మాస్టర్ గారు. అలా స్వామిత్వము గల వాళ్ళు ఉండగలరు. అది సవిత. తన నుండి ఇన్ని వచ్చినా వాటి యందు తను చిక్కుకోలేదు. వెలుగు దేనియందు చిక్కుకోలేదు. వెలుగులో నుండి అన్నీ వచ్చాయి, వెలుగు దేనికి చిక్కుకోలేదు. వెలుగులో ఎవరు ఏ పనులైనా చేసుకోవచ్చు. వెలుగు సహకారాన్ని ఇస్తుంది, కానీ పాల్గొనడం లేదు. దాన్నే మాస్టర్ గారు 'ప్రభావమే తప్ప ప్రమేయం లేదు' అన్నారు. యోగి యొక్క ప్రభావమే తప్ప ప్రమేయం ఉండదు అన్నారు. ఇక్కడ వెలుగులో మనం విష్ణుసహస్రనామం చెప్పుకోవచ్చు, రాజకీయాలు మాట్లాడుకోవచ్చు, చీట్లపేక ఆడుకోవచ్చు, తన్నుకోవచ్చు, పాడుచుకోవచ్చు. అన్నీ వెలుగులోనే జరిగాయి. చీకటైతే పైనచెప్పినవి ఏమీ చేయలేము కదా! కాబట్టి వెలుగు ఏం చేసింది? ఏం చేయలేదు కదా. అట్లా సవిత! సూర్యగోళం తన నుండి పుట్టి, అందులో నుండి ఇన్ని గోళాలు పుట్టి, అందులో ఇంత మంది జీవులు వస్తుంటే ఎంతెంత clairvoyance ఉండాలి ఆ తత్త్వానికి. కానీ ఆ తత్త్వం అసలు ఉన్నట్టే తెలియకుండా ఉంటుంది. ఇదీ మహత్యం! భగవత్ విభూతి అట్లా ఉంటుంది. ఉన్నట్లు తెలియదు. నిజానికి మనకు ఆధారమైనట్టిది, అది లేకపోతే మనం లేని స్థితిలో ఉన్న మనం, మన గురించి హెచ్చులు ఊరికే చెప్పుకుంటూ ఉంటే, ఏం మాట్లాడకుండా అట్లా ఉంటుంది. ప్రపితామహుడు. తండ్రే అర్థం కాలేదు ఇక తాత వరకు ఏమిటి?

1004 యజ్ఞః

ఎందుకిన్నిసార్లు యజ్ఞం అని వచ్చింది విష్ణు సహస్ర నామంలో అంటే అసలు జీవితం యొక్క పరమార్థం అందులోనే వున్నది. ఇంకోదాంట్లో లేదు.

'యజ్ఞో, యజ్ఞపతిః, యజ్వా, యజ్ఞాంగో, యజ్ఞవాహనః, యజ్ఞభృత్ యజ్ఞకృత్ యజ్ఞ, యజ్ఞభుక్, యజ్ఞసాధనః, యజ్ఞాంతకృత్, యజ్ఞగుహ్యం'

అంతకు ముందు మహా యజ్ఞం, అప్పుడు యజ్ఞం వచ్చింది. యజ్వ వచ్చాడు. యజ్ఞం అంటే 18 అంకె గుర్తుండాలి. 18 అంటే సృష్టిలో ఉన్న 24 తత్త్వములలో అదృశ్యముగా ఉన్నవి అని అర్థం. దృశ్యమానముగా ఉన్నవి 6. దృశ్యమానముగా ఉండే 6, ఆ 18 కారణంగా ఉన్నాయి. ఆ 18 కూడా 3 sets of 6. 3 x 6 =18. అక్కడ 3 అదృశ్యముగా ఉన్నవి ఇక్కడ ఒకటి నాలుగవది దృశ్యంగా వున్నది. కాబట్టి సూక్ష్మలోకాలయందు ఎరుకగలిగి ఉండమని తెలియపరిచేది యజ్ఞమనే నామం. యజ్ఞం చేయడం వల్ల జయం కలుగుతుంది అనేది ఇంకొక సంకేతం. యజ్ఞము అంటే నియత కర్మను చేయడం. కార్యం కర్మ, నియత కర్మ. నీవు చేయవలసిన పని ఫలితములను ఆశించక చేయడమే. చేయవలసిన పనికి ఫలితంతో సంబంధం లేదు. అంతేకాక భగవంతుని యజ్ఞంలో ఉద్దేశ్యము కూడా లేదు. యజ్ఞార్థ కర్మ అంటే ఉద్దేశ్యము కూడా ఉండదు. క్రీడాప్రాయంగా చేస్తూ ఉంటాడు. మనం యజ్ఞార్థం, యజ్ఞార్థం అంటుంటాం కాని, అందులోంచి ఏదన్నా కాస్త కీర్తి వస్తే బావుంటుందనిపిస్తుంది. నలుగురు గుర్తిస్తే బావుండుననిపిస్తుంది. డబ్బులు పోతే పోయాయి, కనీసం గుర్తింపన్నా రాలేదనిపిస్తుంది. ఇన్నాళ్ళు చేసాను, ఎవరు పట్టించుకున్నారనిపిస్తుంది. ఇవన్నీ వస్తుంటే అది యజ్ఞం అవదు. ఎందుకంటే ఉద్దేశ్యం ఒకటి వుంది. ఫలితం కోరలేదు గానీ, అంటే in terms of tangibility కోరలేదు. అంటే పదార్థపరమైన ప్రతిఫలం ఆశించలేదు కానీ కీర్తి ఆశిస్తావు. ప్రతిష్ఠ, గుర్తింపు ఆశిస్తావు. జీవితంలో గుర్తింపు ఆశించనివాడు చాలా పెద్ద మోకాలి పర్వతం ఎక్కినట్లు. మిగతావారికుండే బాధలు వారికుండవు. గుర్తింపు ఆశించకుండా మొదలుపెట్టినా కొంతదూరం పోయాక గుర్తింపు రాగానే గుర్తింపు మజాలో పడిపోతాడు. అదొక విచిత్రం. పది మంది గుర్తించి, 11వ వాడు

గుర్తించకపోతే వీడికేం రోగం అనిపిస్తుంది. ఇంత మంది గుర్తిస్తే వీడెందుకు నన్ను గుర్తించలేదు అనిపిస్తుంది. చాలా తమాషాగా వుంటుంది మనస్తత్వం. ఎప్పుడూ ఎవరు మనల్ని ఎందుకు గుర్తించాలి? అసలు ఇంత చేసినవాడిని ఆయనని ఎవరూ గుర్తించడం లేదు, దానికి ఆయన ఏమీ పట్టించుకోడం లేదు. మనకేంటి గుర్తింపుల కోసం తాపత్రయం. 1) ఉద్దేశ్యం లేక చేయడం, 2) ఫలితములను కోరక చేయడం, ఈ రెండూ కవల పిల్లల్లాంటివి. ఒకటి పుడితే తర్వాత రెండవది పుడుతుంది. ముందు ఉద్దేశ్యము పుడితే తర్వాత ఫలితం ఆశించటం ఉంటుంది. ఏదో ఒక రకమైన ఫలితం, బావుంది సార్ మీరు చేసింది, అనైనా అనిపించుకోవాలని ఉంటుంది. బొత్తిగా ఎవరూ పట్టించుకోకపోయినా చేస్తూంటాడు. ఎందుకు చేయాలి? ఎందుకు చేస్తాడలా అంటే వాడికి అది అంటే పరిపూర్ణమైన ఇష్టం అయితే చేస్తాడు. సిగరెట్టు కాలిస్తే ఎవరైనా గుర్తిస్తారటండీ! అయినా ఎందుకు కాలుస్తావు, ఇష్టం. వాడెప్పుడూ సిగరెట్లు కాలుస్తాడని ఇంకొక రకంగా గుర్తిస్తారు. పూర్తి ఇష్టం, pure experience అంటారు. పూర్తి అనుభూతి ఎక్కడ దొరికితే అక్కడ మనస్సుకుండే తర్కం పనిచేయదు. Logic ఉండదు అక్కడ. అందుకనే అనుభూతి పరంగా జీవించేవాడిని మన logic లో బంధించి చూడలేము. వాడి నుండి వచ్చింది కొత్త logicలా తీసుకుంటారంతే. షిరిడీసాయి ఎవరికి అర్థం అయ్యాడు? కృష్ణుడు ఎవరికి అర్థం అయ్యాడు? ఎవరికీ అర్థంకారు వాళ్ళు. ఎందుకంటే ఒకళ్ళకి అర్థం కావడం కోసం వారు బ్రతకలేదు. పూర్ణజీవనం అంటే ఏమిటో చూపడానికి వచ్చారని మనం అనుకుంటాం. వాళ్ళు అదీ చెప్పరు. వాళ్ళు ఉండడానికి వచ్చారంతే. మీ అందరికీ చూపించడానికి వచ్చానని చెప్పినవాళ్ళు తెలిసినవాళ్ళు కాదు. ఆయనని చూసినవారు మనకందరికీ తెలియజెప్పడానికి వచ్చారని అంటారు. ఇంకొకడికి చూపించడం కోసం మనం బ్రతుకుతూంటే మన పని అయిపోతుంది. అదీ యజ్ఞార్థం అవ్వదు. యజ్ఞానికి ముందు ఉద్దేశ్యం లేదు. తర్వాత ఫలితములు ఆశించడం లేదు. ఈ రెండూ ఎక్కడ ఉంటే అది యజ్ఞం. మానవులు యజ్ఞం లోకశ్రేయస్సు కోసం చేస్తారు. అది కూడా భగవంతుడి యజ్ఞ స్వరూపానికి ఒక మెట్టు క్రిందే. భగవంతుడు యజ్ఞపురుషుడిగా తనని తాను అప్పగించుకుని

వండించేసుకున్నాడు కదా! ఆయన్నే కదా వాళ్ళు బంధించి యజ్ఞం చేశారు. దాని ఉద్దేశ్యం ఏమిటి, క్రీడ/లీల. అదే మాస్టారు 'ఎందుకు మీరు మందులు యిస్తూంటారు' అంటే 'నాకిష్టం కాబట్టి' అన్నారు 'ఎందుకు ఉపన్యాసాలు చెప్తారు' అంటే 'నాకిష్టం కనుక' అన్నారు. మందులు ఇవ్వడం నాకు ఇష్టం కనుక నేను ఇస్తాను. మీకూ అలా యిష్టం అయితేనే మందులివ్వండి తప్ప, ఇంకొకరకంగా మొదలుపెడితే ఏడుస్తారు అనేవారు. మందులిచ్చాక ఎవరూ నన్ను గుర్తించడం లేదు, మన గురించి ఎవరూ అర్థం చేసుకోవడం లేదు ఇలా అన్నీ రకరకాలుగా వస్తాయి. పాతికేళ్ళు ఈ జగద్గురు పీఠంలో చేస్తే ఏంటిలా మర్చిపోయారన్నట్లు ఉంటుంది. మొదలుపెట్టినప్పుడు అందరూ గుర్తు పెట్టుకోవాలని చేశావా? యజ్ఞార్థం ఎలా చేయాలో చూపించడానికి అప్పుడప్పుడూ మహాత్ములు/తెలిసిన వాళ్ళు వస్తూంటారు.

1005 యజ్ఞపతిః

యజ్ఞానికి ఆయనే స్వామి. ఆయన లేకపోతే యజ్ఞం లేదు.

1006 యజ్వా

యజ్ఞాన్ని చేయించేవాడు ఆయన. బ్రహ్మని ముందు సృష్టించాడు. సృష్టించి నన్ను వండేయమన్నాడు. అదేంటండీ అంటే మరేం ఫర్వాలేదు వండేయ్ అన్నాడు. అట్లా ఎవరైనా తనను తాను వండించుకోవడానికి ఒప్పుకుంటారా? నన్ను నువ్వు వండేస్తే వీరంతా వచ్చేస్తారు బయటకి. అని బ్రహ్మను ముందు తనలోంచి బయటకు తీశాడు. యజ్వా అంటే చేయించే వాడు. ప్రతి క్రతువుకూ ఒక బ్రహ్మ ఉంటాడు. మనకే వచ్చు కదా అని మనం చేసేసుకోకూడదు. ఎందుకంటే యజ్ఞం అయ్యాక దక్షిణ యివ్వాలి. బ్రహ్మకి దక్షిణ యిచ్చి బ్రహ్మ నుండి ఆశీర్వచనం పొందడం ఉంటుంది యజ్ఞంలో. మన పూజ మనమే చేసేస్కుని, మనమే ప్రసాదం తినేసి, ఎవరికీ దక్షిణ యివ్వం కదా! ఎవరూ బాగా చేయడం లేదు, అందుకే చేస్తున్నాను

అనుకుంటే, ఎవరికన్నా ఒక సత్పురుషుడికి దానం చెయ్యాలి. దక్షిణ ఇవ్వాలి. కనీసం ప్రసాదం పంచు. కొబ్బరికాయలాంటిది గుళ్ళో కొడితే రెండు చిప్పలు జాగ్రత్తగా తెచ్చుకుని ఇంట్లో పచ్చడి చేసుకుంటాం, మనవాళ్ళే తింటారు అని. ఇచ్చిన చిప్ప గుళ్ళోనే కొట్టి నలుగురికీ పంచేవాడిలో కాస్తోకూస్తో ఈ భావం ఉన్నట్లు. అంతా ఇచ్చేశావా? ఇంటికి తెస్తే పచ్చడి చేసుకునేవాళ్ళం కదా అనే భావం ఉన్నవాళ్ళు ఈ యజ్ఞానికి బాగా దూరంగా ఉన్నవాళ్ళు.

1007 యజ్ఞాంగః

అంటే యజ్ఞములోంచి పుట్టుకొచ్చిన వన్నీ. యజ్ఞములో భాగములు. అన్నీ అతడే.

1008 యజ్ఞవాహనః

యజ్ఞం ఆధారంగానే తిరుగుతూ ఉంటాడు. మొత్తం సృష్టి అంతా వ్యాపించి ఉంటాడు. మనలోపలి నుండీ ఆయన కదిలిరావలంటే మన జీవితం యజ్ఞార్థం అయితేనే ఆయన వస్తాడు. యజ్ఞం అనే వాహనాన్ని ఎక్కి వస్తాడు. గరుత్మంతుణ్ణి ఎక్కి వచ్చినట్లుగా వస్తాడు. గరుత్మంతుణ్ణి ఎక్కి రావడం అంటే స్పందనాన్ని ఎక్కి రావడమే. యజ్ఞవాహనుడై అతడు రావాలంటే మనం యజ్ఞం చేయాలి. యజ్ఞాన్ని తననుండి ఎట్లా నిర్వర్తింపాలో తెలియచెప్పిన వాడు అతడే! అతడే వేదములు అందించిన బ్రహ్మ. ఎంతో మంది దేవతల రూపంలో దిగివచ్చింది ఆయనే! ఆయనే దిగి వచ్చి ఇంత మందిగా దాన్ని నిర్వర్తిస్తూ వచ్చాడు.

1009, 1010, 1011, 1012, 1013, 1014, 1015 యజ్ఞభుక్, యజ్ఞకృత్, యజ్ఞీ, యజ్ఞభుక్, యజ్ఞసాధనః, యజ్ఞాంతకృత్ , యజ్ఞగుహ్యం

యజ్ఞంలో సమస్తాన్నీ భుజించేవాడు. అంటే యజ్ఞానికి మనం పిలిచినవాళ్ళ రూపం లో, అందులో భోంచేసిన వాళ్ళు కూడా ఆయనే. యజ్ఞం అంటే ఇంత పాక వేసి. ఇంత హోమం చేసి, కాసిని మంత్రాలు చదువుతుంటే అది యజ్ఞం అనుకుంటాం. కాని అది కాదు. యజ్ఞంలో భాగంగా సమస్తాన్నీ హవిస్సుల ద్వారా అందుకుంటూంటాడు. అంటే అగ్నితత్వంగా సృష్టిలో సమస్తాన్ని మళ్ళీ తనలోకి అందుకుంటూంటాడు. అలా అందుకుంటూ మళ్ళీ యజ్ఞాన్ని పరిసమాప్తి చేస్తాడు. అది యజ్ఞాంతకృత్. సృష్టి యజ్ఞానికి తనే పతి. తనలోంచే బయటకు వచ్చింది. తనే జ్ఞానం. తనే యజ్ఞం. తనే యజ్ఞాన్ని నిర్వర్తించేవాడు. తనే యజ్ఞానికి పతి. అందులోంచి ఏర్పడినవన్నీ తనే. అక్కడ నుండి మళ్ళీ తనలోకి అందుకునేది తనే. యజ్ఞాన్ని పూర్తి చేసేవాడు కూడా తనే. ఈ యజ్ఞాన్ని గుహ్యం గా చేసుకున్నాడు. అసలు యజ్ఞానికి రహస్యం ఆయనే! ఆయన అంటే తత్త్వం! మనలో ఉండి ఈ శరీరాన్ని అలా పెంచి మళ్ళీ అట్లా తగ్గించేయడం లేదు? 70, 80 సంవత్సరాలు వచ్చేసరికి శరీరం కృశించడం లేదూ? మన శరీరాన్ని ఎవరు తినేశారు? తెలీకుండా తినేస్తాడు. ఒకదానికొకటి అన్నంగా ఏర్పరిచారు.

1016, 1017 అన్నం, అన్నాదః ఏవచ

అన్నాదలు అంటే అన్నం తినే జీవులు. అన్నం కూడా జీవులే. కొంతమంది జీవులు కొన్ని జీవులకు అన్నంగా ఉంటారు. తింటున్నప్పుడు అన్నాదులు. తినబడుతున్నప్పుడు అన్నం. ఒకదానిని ఒకటి తినే programe పెట్టడంతో ఎప్పుడూ self contained గా జరిగిపోతూ ఉంటుంది. ఒకదాంట్లోంచి ఒకటి పుట్టుకొస్తూంటే ఒకదానినొకటి తినేస్తూ ఉంటుంది. అదే భగవద్గీతలో చెప్తాడు. ఆకాశం లోంచి భూమికి వచ్చిన నీరు, మళ్ళీ సముద్రంలోకి, అక్కడ నుండి ఆవిరయ్యి మళ్ళీ ఆకాశం లోకి, అదే recycling process లాగా తిప్పతూ ఉంటాడు. అదే తిరిగి తిరిగి వస్తూంటే, మనం giant wheel లో ఎక్కి తిరుగుతున్నప్పుడు కొంతమంది పైనా, కొంతమంది క్రింద ఉంటారు, పైవాడు క్రిందకి వస్తే ఆ స్థానంలోకి ఇంకొకడు పైకి వస్తాడు. ఒకడు దిగితే ఇంకొకడు అలా వస్తూనే ఉంటాడు. అంటే అక్కడ ఎప్పుడూ ఒకడు ఉంటూనే ఉంటాడు. ఒక ప్రక్క అయిపోతుంటే, ఇంకో ప్రక్క నుండి వస్తుంటుంది. అలా అన్నాదులనీ, అన్నాన్నీ ఏర్పరచాడు. మనం తినేస్తూంటే అయిపోతూంటుంది కదా! మళ్ళీ ఎక్కడ నుండి వస్తోంది? ఈ తినడంలో ఒక ఆనందం పెట్టాడు. అన్నం అంటే 'తింటే ఆనందాన్ని ఇచ్చేది' అని అర్థం. అందుకే కొంతమంది పద్యాలు, కవిత్వం రాసి వాటిని వినిపించి, మనని తింటూ ఉంటే వారికి ఆనందంగా ఉంటుంది. అదొక రకమైన తిండి. ఆ రోజుల్లో మాస్టారు గారి చుట్టూ కవులు చాలా మంది ఉండేవారు. ఒకడు ఏదైనా రాసి వస్తున్నాడంటే వీళ్ళు ఇంట్లోంచి వెళ్ళిపోయేవారు. ఎందుకంటే ఇంక ఆ రోజుకు వాడు వాళ్ళను నంజుకు తినేస్తాడు. వీడి కవిత్వం వినడానికి వాడి రోజు బలైపోతుంది. వాడు తింటానికి వస్తున్నాడు. వాడికి తినబడేవాడు కావాలి. ఇలా రకరకాల తిళ్ళు ఉన్నాయి. అన్నం తిన్నావా అని అడిగితే కొంతమంది కేవలం బియ్యమే అనుకుంటారు. శనివారం అన్నం తిననండీ అంటారు. అన్నం కాకుండా ఇంకా ఎక్కువ తింటూ, అది ఉపవాసం అంటారు. పదార్థాలు, ఖనిజాలు, వృక్షాలచేత తినబడతాయి. వృక్షములను పశువులు, మానవులు తింటారు. పశువులని మానవులు తింటూంటే మానవులని వారి భావాలు తింటూ ఉంటాయి. కొన్ని భావాలు మనల్ని ఎంత

తినేస్తాయి? అంత మేకు లాంటి మనిషి ఏకై ముడుచుకుని పోయి కుచించుకుపోతాడు. ముసలివాడైపోతాడు. ఏంటిలా ఉన్నావు, ఎవరు తినేశార్రా, అంటే కాలమే! ఇలా సమస్తాన్నీ చివరికి తినేది కాలమే! ఇలా ఒకదానికొకటి ఆహారంగా ఏర్పడుతూ, మళ్ళీ ఆహారంగా ఏర్పడినది మళ్ళీ తినేవాడిగా ఏర్పడుతూ ఒక చక్రాన్ని నిర్మాణం చేసి ఉంచేశాడు. అది ఎప్పుడూ శాశ్వతంగా నడుస్తూ ఉంటుంది. కృష్ణుడు మొట్టమొదట నుండి చెప్పుకొచ్చినది అన్నీ యజ్ఞార్థం చేస్తూండు అని. ఎందుకంటే ఇది ఒక చక్రం. నువ్వు తినేవాళ్ళు కొంతమంది ఉంటే, నిన్ను తినేవాళ్ళు కొంతమంది ఉంటారు. చిన్న జంతువుని పెద్ద జంతువును తింటే, ఆ పెద్ద జంతువును ఇంకొక పెద్ద జంతువు తింటోంది కదా! ఒకదానినొకటి ఇలా హరింపబడుతోంది కాబట్టే నువ్వు చేయవలసినది చేసే దాంట్లో ఎక్కడా నీకు అని ఏదీ కొంత ఇవతలకు లాగకు. అట్లా జీవించేవారిని 'దేవతలు' అంటారు. దేవతలావిధంగా యజ్ఞార్థం జీవిస్తారు. వారికి ప్రత్యేకంగా ఏమీ అక్కరలేదు. వారి వారికి నియమింపబడ్డ కార్యములు వారలా చేస్తూనే ఉంటారు. ఉప్పులో ఎప్పుడూ ఉప్పగానే ఉంటారు. ఆ ఉప్పదనం కనిపించే తత్త్వంగా అక్కడ దేవతలు పనిచేస్తున్నారు. ఉప్పగా ఉంటే ఆ దేవతకు ఏం వస్తుంది? ఏమీ రాదు. తీపి తియ్యగా ఉంటే అందులో ఆ తియ్యగా ఉంచడం అనే రుచి దేవతకు ఏం రాదు, సూర్యుడి వెలుగు మనకు ఉపయోగం. దానికేం ఉపయోగం? గాలి వీస్తే మనందరికీ, జీవులందరికీ ఉపయోగం. దానికేం ఉపయోగం? తాగడానికీ, మిగిలిన పనులకి రకరకాలుగా నీరు వాడతాం. నీటికేం ఉపయోగం? ఏంలేదు. మన భాషలో చెప్పాలంటే తల్లి పిల్లవాడికి చిన్నప్పటినుండీ చాకిరీ చేస్తుంది. ఏంటి ఉపయోగం? తర్వాతి కాలంలో ఎలాగూ మాట వినడు, మర్చిపోతాడు. సృష్టిలో ఉపయోగం అనే భావన లేదు. కేవలం మనిషి యొక్క మస్తిష్కం లోనే ఉంది. ఉపయోగపడడమే ఉంది. పడుతూ ఉంటే నీకూ ఉపయోగపడేవారు ఉంటారు. అది చక్రంలో ధర్మంగా ఉంది. ఉపయోగపడుతు కదా, నాకు ఎవరన్నా ఉపయోగపడితే బావుందని ఎదురుచూసే వారికి ఎవ్వరూ ఉపయోగపడరు. అందుకనే పంచభూతాలు, సూర్యుడు, చంద్రుడు, గ్రహములు, ఇవన్నీ ఏం ఉపయోగం అని అలా తిరుగుతున్నాయి? భూమి

ఇట్లా తల తిరేగేటట్లుగా 30 కోట్ల సంవత్సరాలుగా తిరుగుతుంది. మనలాగా నాకేమిటి ఇందులో అనే ఆలోచించే బుద్ధితో చేస్తే అది యజ్ఞం కాదు. యజ్ఞం చేయడం అంటే జీవితమే యజ్ఞార్థంగా జీవించడం. ఈ మొత్తంలో నాకేమిటి అనుకునేవాడు commission agent. Transaction అవుతూంటే వాడు ఇందులో మనం ఎంత పుచ్చుకోవాలనే ఒకపక్క నుండి ఆలోచన నడుస్తూ ఉంటుంది. మనం అంతా commission agentsమే. అసలు commission ఏమిటి? Deal లో సగం పైన లాగేద్దామనే ఉంటుంది mind లో. అందుకని భగవంతుడు కర్మ యోగంలో నీవు వాటిని (సూర్యుడు, గ్రహములు) చూసి నేర్చుకో. అవి కూడా సృష్టిలో ఉన్నాయి. నీకెందుకంత కొంచెం బుద్ధి? నేను అంతా నీకిస్తానంటే కొంచెం అడుగుతావేంటిరా? అంటాడు. నీ కోసం నీవు ఆలోచించుకుంటే నీది ఉగ్గుగిన్నె అంతబుర్ర అయిపోతూంటుంది. ఆలోచించలేదో బ్రహ్మాండం అంత బుర్ర అయిపోతుంది. నీ గురించి ఎందుకసలు? దీనికి చాలా ధైర్యం కావాలి. ఇదే శాశ్వత సత్యం, ధర్మం అనే స్థిరమైన విశ్వాసం ఏర్పడాలి. ఎప్పుడేర్పడుతుంది? సత్త్వంలోకి వస్తేనే ఏర్పడుతుంది. లేకపోతే ఏర్పడదు. ఏం చేస్తున్నా ఇవ్వాళ ఇది నా చేత చేయబడుతున్నది, అని చేస్తూ ఊరుకోవడమే. నాకేమిటి అన్న ప్రశ్న అక్కరలేదు. నీకు కావలసినంత ఉన్నది. అట్లా మిగతావి ఆలోచించవు. ఈ చెట్లు నీరు కూడా సరిగ్గా పోయకపోయినా ఏదో ఒకటి (పండ్లు) మనకి ఇస్తూనే ఉంటాయి. మొక్కలకి కాస్త నీరు పోస్తాం గానీ, చెట్లకి నీరు ఎవరు పోస్తారు? మామిడి చెట్టుకు పెరిగాక నీళ్ళు పోయరు. నీళ్ళు పోయక వదిలేసినా అది ఎక్కడెక్కడి నుండో భూగర్భం లోంచి రకరకాల ఆహారాన్ని వేళ్ల ద్వారా సంపాదించుకుని తను పెరుగుతూ మనకు పండ్లు ఇస్తోంది. దానికేం వస్తోంది? నిజంగా మనం వికాసం చెందాలంటే ఇవి చాలు. పెద్దపెద్ద తర్కాలు, పుస్తకాలు, మహాత్ముల మహత్వాలు అక్కరలేదు. ఇంత కన్నా మహత్యం ఏముంది! చెట్టు గాలి యిస్తుంది. నీడ యిస్తుంది. కోసుకుంటే ఆకులు యిస్తుంది. మన ఇంట్లో పండగ వచ్చిందంటే మామిడి చెట్టుకు గండమే. గుత్తులు గుత్తులుగా కోసేసి మన ఇంట్లో కట్టేసుకుంటాం. చెట్టు చాలు స్థిరత్వానికి, పరోపకారానికీను. మాస్టరు గారి భాషలో చెప్పాలంటే రాయివేసి కొడితే నాలుగు పండ్లు ఇస్తుందిట. మనల్నెవరన్నా

కొడితే వాడి పళ్ళు రాలగొడతాం. అసలు ఈ మామిడి చెట్టు కన్నా ఏ గురువు కావాలండీ! యజ్ఞార్థం పని చేయడం అంటే అలా ఉంటుంది. కోసుకుపోయేవాడు కోసుకుపోతుంటే, కోసుకుపోయేవాడి వంక చూడక, తనకు బలం ఇచ్చేవాడి వంక చూసుకుంటుంది. చెట్టు భూమిలో ఉండే సారంవైపు చూసుకుంటుంది తప్ప, తననుండి ఏం కోసుకుపోతున్నారో చూసుకోదు. తన బలం ఎక్కడో అక్కడ ఆశ్రయించి వుంటుంది. సూర్యుడి వెలుగు దానికి బలం. భూమిలో దొరికే సారం బలం. నీరు బలం. ఇవన్నీ మనం అమర్చకపోయినా అందుతున్నాయి. అడవులన్నీ మనం పెంచామా? పెరిగినాయి. ఎందుకంటే వాటి యందు ఆ పరస్పరత్వం వుంది కనక వాటంతట పెరిగాయి. మనంకూడా పరస్పరత్వం పెంచుకోవడానికి ప్రయత్నం చేయాలి. అది కావాలంటే సత్త్వం కావాలి. కావాలి అనేది పోతేనే సత్త్వం ఉంటుంది. 'ఎప్పుడూ కావాలనేది కాదు, చెయ్యాలనేది చూసుకో' అని చెప్పారు పెద్దలు. 'నీకేం కావాలో ఆలోచించక నీవేం చెయ్యాలో ఆలోచించు'. మన ఆలోచనలన్నీ తలక్రిందులే. మనకేం కావాలో రోజూ బాగా గుర్తు వస్తుంది. కానీ మనం ఏం చెయ్యాలో గుర్తుంచుకుంటేనే కానీ లాభం లేదు. సృష్టి కార్యంలో ఓర్పు (సబురి) చాలా ముఖ్యం. అవతలవాడికి మామిడికాయలు వస్తున్నాయంటే నీవూ ఒక మొక్క వేసుకుని చక్కగా పెంచి ఓర్పుతో వేచి ఉండు. పక్కవాడు అవన్నీ చేశాడు కనుక ఈ రోజు ఫలాలు అనుభవిస్తున్నాడు. నీకు కూడా వస్తాయి. కానీ నీవూ అంతా వేచి ఉండాలి. కావలసినది కోరుకోవడంలో గొప్పలేదు. దాని గురించి చేయడంలో గొప్ప ఉంది. చేయడంలో కోరుకోకపోవడంలో ఇంకా గొప్ప ఉంది. చేయడంలో ఉద్దేశ్యం లేకపోవడంలో పూర్తి గొప్ప ఉంది. అలాగ భగవంతుని యజ్ఞంలో ఉద్దేశ్యం లేదు. క్రీడ! సరదాకి చేస్తున్నాడంతే! అందుకే పెద్దలు బాగా తర్కించి, విశ్లేషించి, వివరించి ఇదంతా 'just a play' అన్నారు. క్రీడార్థం పుట్టిస్తున్నాడు, క్రీడార్థం పెంచుతున్నాడు, క్రీడార్థం తుంచుతున్నాడు. అట్లా ఎలా చేస్తాడండీ మరీ బొత్తిగా అంటే 'చిన్నపిల్లల్లాగే' అన్నారు. చిన్నపిల్లలు లక్కపిడతలతో బోలెడు ఆటలు ఆడతారు. పెళ్ళివారిని పిలుస్తారు. పెళ్ళికూతురుని, పెళ్ళికొడుకుని పెడతారు. భోజనాలు అంటారు. అవీ ఇవీ అంటారు. ఇంతలో వాళ్ళ నాన్న office నుండి వచ్చాడనుకోండి, ఈ ఆడే ఆట

అంతా తీసిపారేసి గభాలున నాన్న వద్దకు పరిగెడతారు. ఆడుకోవడానికి ఉద్దేశ్యం ఏమిటి? ఆడుకునే పిల్లల్ని పిలిచి మీరు ఆడుకుంటే ఏం వస్తుంది? ఆడుకోవడంలో మీ ఉద్దేశ్యం ఏమిటి? అని మనం అడిగితే, వాళ్ళు మన వైపు వెర్రివాడా అన్నట్లు చూస్తారు. అట్లానే there is no 'why' of the creation. There is only 'how' of it and the beauty of knowledge relative to how of it. Know, How it is. Dont question why it is? You will never get the answer అన్నారు ఋషులు. ఎందుకు ఆడుకుంటున్నావని అడిగితే ఎలా సమాధానం ఉండదో, పూర్ణమైన అనుభూతిలో ఉండేవాడికి కూడా సమాధానం ఉండదు. మనం ఉంటుందనుకుని ఆడుకుంటాం. మన ఆట అందుకే ఏడ్చినట్లు ఉంటుంది. హాయిగా ఉండడం కోసం ఆడుకోవడంతో మన ఆట మొదలు పెడతాం. అందుకే అంత ఆనందించలేం. వాడికి హాయిగా వుంటుందనుకుని ఆడుకోవడం వుండదు. ఆడుకోవడమే వుంటుంది. లోకశ్రేయస్సు కోసం చేస్తున్నాం అనుకున్నాం అనుకోండి, 'ఎందుకయ్యా నీ యజ్ఞార్థ జీవితం' అంటే, 'భగవద్గీతలో చూశాను, కృష్ణుడు చెప్పినట్లు చేద్దామనండీ' అనంటే 'ఎలా ఉందంటే' 'ఏదో మాదిరిగా' ఉందంటాడు. ఆనందం ఉండదు. ఎవడో చెప్పాడని చేస్తే ఆనందం ఉండదు. నీకుగా అనిపించి నీవు చేస్తుంటే ఆనందంగా ఉంటుంది. హృదయస్థం లో జీవించే వాడిని తలకాయలో జీవించేవాళ్ళు అర్థం చేసుకోలేరు. భక్తుడు ఏం చేస్తుంటాడో మిగతా వారికి అర్థం కాదు. శివాజీ మహారాజు కొన్ని సంవత్సరాలకి సరిపడా ధనధాన్యాలు ఇస్తే, తుకారాంగారు ఆ రోజు సాయంత్రం లోగా అంతా పంచేశాడు. మనకైతే impractical అనిపిస్తుంది. వాళ్ళ ఆవిడ అదే అంది. అంటే 'నీ మొహం అవన్నీ పెట్టుకుని, కాపాడుకుని కాపలా కాస్తూ ఉంటామా? ఇది ఎలా వచ్చిందో ఇక మీద కూడా అలాగే వస్తుంది అంతే' అన్నాడు. కుచేలుడు practical. మనం పూర్తిగా impractical. దాచుకున్న దానిని కాపాడుకోవడం కోసం సగం జీవితం వెచ్చించడం అవుతుంది. కీర్తి, ధనం ఏదన్నా కావచ్చు. వచ్చిన కీర్తిని కాపాడుకోవడం కోసం ఎంత కష్టపడతారండీ! ధనం కూడా అంతే! అందుకే ఆ మార్గంలో పూర్ణానందం లేదు. ఎందుకంటే దేన్నో ఉద్దేశించి చేస్తున్నాం కాబట్టి ఆనందం ఉండదు.

ఫలితాలు ఆశించకపోయినా ఉద్దేశ్యాలు ఉన్నాయి. ఇది ఎవరికి పనికి వస్తుంది? అని సృష్టి చేస్తుంటే ఎవరికీ పనికి వచ్చేట్లుగా ఉండదు. కానీ అందరికీ పనికి వస్తుంది. అందుకే పంచభూతాలని, గ్రహగోళాదులని, దేవతలని, శబ్దతరంగాలనీ sound, light, colour, formations, shape consciousness, form consciousness. అలాగే మనిషిలోంచి మనిషి రావాలనే ఏముంది. కానీ అలాగే వస్తారు. అట్లా విశ్వకర్మ చేస్తున్నాడట. ఈ పని ఎందుకు అనే ప్రశ్నకు సమాధానం లేదు. ఎందుకు అనే ప్రశ్న అందులో మనకేమిటి అనే point ఉన్నప్పుడు వస్తుంది. అందులో మనకేమిటి అని అననప్పుడు ఏం లేదు. ఇట్లా అందులో మనకేమిటి అని లేనివాళ్ళు సృష్టిలో కొంతమంది ఉంటారు ఎప్పుడూ. అందులో మనకేమిటి అనేవాళ్ళూ ఉంటారు. వాళ్ళు, వీళ్ళు ఎప్పుడూ ఉంటారు. వారికి ఘర్షణ జరుగుతూ ఉంటుంది. యజ్ఞార్థం పనిచేసేవాళ్ళని చూసి ఓర్వలేక స్వార్థం కోసం పనిచేసేవారు అసూయ పెంచుకుని, వారితో ఓ రకమైన ఘర్షణకి దిగుతారట. లేకపోతే విశ్వామిత్రుడికి, వశిష్ఠుడికి ఘర్షణ ఏమిటండీ? వశిష్ఠుణ్ణి చూస్తూ ఉంటే విశ్వామిత్రుడికి తెరలు తెరలుగా ఈర్ష్య వచ్చేస్తూ ఉంటుంది, వశిష్ఠుడి గొప్పతనం అంగీకరించలేక. అతడు అంగీకరించకపోయినంత మాత్రాన వశిష్ఠుడికి ఏమన్నా కోపం వచ్చిందా? లేదే! అసలు ఆ సరుకు లేదుగా! రాముణ్ణి చూస్తూంటే రావణుడికి అలా వచ్చేసింది. కృష్ణుణ్ణి చూస్తుంటే శిశుపాలుడికి అలాంటి reaction వచ్చేది. నవ్వితే చాలు వచ్చేసేది. కారణం ఎక్కడ ఉంది? వాడిలోనే ఉంది. దుర్యోధనుడికి ధర్మరాజుని చూడగానే వచ్చేది వికృతంగా. అలా సత్త్వగుణ సంపన్నుణ్ణి, ప్రశాంతమైన స్వభావిని చూస్తే అవి లేని వాడికి ఈర్ష్య పుడుతుంది. అది సత్త్వానికి చాలా దూరం. అందుకని భాగవతంలో వాడిలో ఉండే ఆ కళ్యాణగుణం నేనే అని భావన చేసుకో అని చెప్తారు. అలా భావన చేసుకునేవారు బ్రతికిపోతారు. వాడంటే యిష్టం లేదు కానీ వాడిలో చాలా మంచి గుణాలు ఉన్నాయి. మనకన్నా ఎక్కువ మంచి పనులు చేస్తున్నాడు. మనకన్నా బాగా చేస్తున్నాడు. మరి వాడి రూపంలో ఉన్నవాడినైనా చూడచ్చు కదా! ఆ కళ్యాణగుణాలుగా నేనే అస్తిత్వం చెంది ఉన్నాననే భావన ఉంటే అంత ద్వేషం రాదు. రోజురోజుకీ తన ద్వేషాన్ని చక్రవడ్డీలా పెంచుకుంటూ

పోతూంటే, వీడికే పతనం తప్ప వాడికేం కాదు. వాడలాగే హాయిగా ఉంటాడు. బెల్లం కొట్టిన రాయిలా. విశ్వామిత్రుడి కథ రామాయణం లో బాలకాండలో చదివితే తెలుస్తుంది. ఎన్ని తిప్పలు పడతాడు? కేవలం వశిష్ఠుడితో పోల్చి చూసుకోవడం వల్ల కదా ఈ తిప్పలన్నీ. మనకన్నా గొప్పవాడు ఉన్నాడంటే ఓర్వలేకపోయాడు. తను ఎంత గొప్పవాడైనా తనకంటే ఇంకాస్త ఎక్కువ గొప్పవాడిగానే వశిష్ఠుడు ఉండిపోయాడు. వినాయకుడికీ కుమారస్వామికీ ఏం జరిగిందో, వశిష్ఠుడికీ విశ్వామిత్రుడికి అదే జరిగింది. ఎందుకంటే యిక్కడ ఉద్దేశ్యాలు లేవు. అక్కడ ఉన్నాయి. వశిష్ఠుడు ఉంటాడు అంతే. సృష్టి అంతా ఉంటాడు. సృష్టి అయిపోయినా ఆయనలా ఉంటాడు. సృష్టి రాగానే మళ్ళీ వచ్చేస్తాడు. ఏం చేస్తూంటారంటే ఉంటాం అయ్యా, ఉండమంటే ఉంటాం. ఎవరన్నా వస్తే చెప్తాం. ఎవరూ రాకపోతే ఏం చెప్పక హాయిగా కూర్చుంటాం, ఇంటికి ఎవరన్నా వస్తే భోజనాలు పెడతాం. ఇంతే ఆయన కార్యక్రమాలు, జ్ఞానం అడిగితే జ్ఞానం చెప్తారు. యోగం అడిగితే యోగం చెప్తారు. రాముడికే యోగం చెప్పిన వాడు వశిష్ఠుడు. జ్ఞానవాశిష్ఠం ఉంది. యోగవాశిష్ఠం ఉంది. వశిష్ఠుడు రాముడికిచ్చిన జ్ఞానము, యోగము రాముడి కోసం కాదు. మనకోసం. రాముడి కారణంగా వశిష్ఠుడి లోంచి బయటకి వచ్చాయి. అడక్కపోతే చెప్పరు. అడిగినవాడికి కూడా 'అడిగినవాణ్ణి బట్టి అప్పటికి వాడి కెంత అవసరమో' అంతే. అడిగినవాడు రాముడు కాబట్టి పూర్ణంగా వస్తుంది. అందుకనే పృచ్ఛకుడు కూడా గట్టివాడై ఉండాలి. అప్పుడే అది బయటకి వస్తుంది. లేకపోతే రాదు. మనం మహాత్ముల వద్ద వేసే ప్రశ్నలు చచ్చుగా ఉంటాయి. అసలు జ్ఞానం వదిలి మన వ్యక్తిగత సమస్యలే చెప్తాం. వాళ్ళని 'అది' అడిగితే విపరీతమైన ఉత్సాహం వస్తుంది. ఇంక వాళ్ళకి అక్కడ time కూడాతెలీదు. అప్పుడు వారికి స్ఫూర్తి వస్తుంది. సాన్నిధ్యం వస్తుంది అడిగిన వారిని బట్టి. అడక్కపోతే బావుండదేమో అని అడిగితే ఏమీ చెప్పక దాటేస్తాడు. ఎందుకంటే కేవలం ఉండడంగా ఉంటాడు. అదీ తత్త్వం అంటే! ఉండడమే! ఉన్నవాడిని ఉండనీయదు కాలం. అందుకని కాలము, దేశము graph లో చూస్తే, కాలము నిలువుగీత, దేశము అడ్డగీత. ఇందులో ఒక్కో ప్రదేశంలో మనం ఉన్నప్పుడు ఆయా కాలాల్ని బట్టి మన వద్దకు సన్నివేశాలు

వస్తూంటాయి. సన్నివేశాలకి సత్త్వగుణంతో స్పందించడమే ఉంటుంది తప్ప ఉద్దేశ్యాలు ఉండవు. అదీ యోగం అంటే! మనుషుల మీద విరుచుకుపోవడం కాదు. తోమెయ్యడం అంతకన్నా కాదు. తనను తాను పరిపాలించుకుంటాడు. ఇతరులు కూడా ఎవరిని వారు పరిపాలించుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటాడు. అంతేకాని తన బానిసలుగా ఉండాలని కోరుకోడు. తన చెప్పచేతల్లో ఉండాలని కోరుకోడు. తను ఉండడమే! అడిగితే చెప్తాడు. జ్ఞానం అడిగితే జ్ఞానం. యోగం అడిగితే యోగం చెప్తాడు. తిడితే మౌనం వహిస్తాడు. పలకరిస్తే పలుకుతాడు. కొడితే తిరిగి ఆయన లోంచి వచ్చేస్తుంది. ఆయనేం కొట్టడు. మంచివారికి అపకారం చేస్తే చాలా ఉధృతంగా వచ్చేస్తుంది. ఎందుకంటే అద్దంలాంటిదది. అక్కడా మనలాగే ఉంటే ఏదో Account settlement ఉంటుంది. చెల్లు అయిపోతుంది. ఎవణ్ణి ఎప్పుడో లెంపకాయ కొడితే, ఈ రోజు మనల్ని ఎవరో లెంపకాయ కొడితే వీడి వరకు చెల్లు. కానీ ఎప్పుడూ లెంపకాయ కొట్టనివాణ్ణి నువ్వు లెంపకాయ కొడితే ఆయనేం చెయ్యడు కానీ ప్రకృతి ఒప్పుకోదు. అదే అంబరీషుణ్ణి గొడవ పెడితే దుర్వాసుడికి జరిగింది. అంబరీషుడు ఏమీ చేయలేదు. అదే వచ్చేసింది. అలాగే విశ్వామిత్రుడు వేస్తుంటే అన్నీ తిరిగి వచ్చేశాయి. అందుకనే బాగా దుర్మార్గులని భగవంతుడు శిక్షించాలంటే నారదుడు ఓ మెలిక పెడుతూంటాడు. అధర్మంలో ప్రవర్తించేవాణ్ణి ధర్మాత్ములను ఎక్కువ హింసించేట్లుగా పురి ఎక్కించడమే ఆ మెలిక. ఎందుకంటే ధర్మాత్ములని నువ్వు హింసిస్తే వెంటనే వచ్చేస్తుంది దానికి ప్రతీకారం. కొన్ని ముట్టుకోకూడదు. ముట్టుకుంటే అయిపోయిందే! లంచగొండి బాగా లంచాలు లాగుతూ ఓ సత్పురుషుణ్ణి కూడా లంచం కోసం వేధించి లాగాడనుకోండి, అయిపోయింది వాడి పని. అందుకనే భారతం లో జూదం అవగానే వీళ్ళంతా అయిపోయారని లెక్క వేశారు తెలిసినవారంతా. వసుదేవుణ్ణి కారాగారంలో పెట్టగానే కంసుడి పని అయిపోయింది. మిగతాదంతా automatic. వంకర చేసిన రోజే దానికి చెందిన పాశం పడిపోయింది. వంకర చేసి మనం పడకూడదని తాపత్రయపడితే అది అవదు. ఆ వంకర ఎవరికి చేశావు అన్నదాంట్లో ఎక్కువ ఉంటుంది. వంకరలేనివాడితో వంకరలు పెట్టుకోకూడదు. ఎందుకంటే వాడన్నిటికీ

సిద్ధమే. తిట్టినా పడతాడు. ఏమీ చేయడు. వాళ్ళు జీవించడం యజ్ఞార్థం. మెళ్ళో పాము వేస్తే శమీకునికి కోపం రాలేదు. వాళ్ళ అబ్బాయికి వచ్చింది. శాపం ఇస్తే పరీక్షిత్తుకు కోపం రాలేదు. వాళ్ళ అబ్బాయికి వచ్చింది. అబ్బాయిలకే problem వచ్చింది రెండు చోట్లా. ఏమీ సంబంధం లేని తక్షకుడు అనవసరం గా వంకర చేసి తెచ్చుకుంటాడు అంతా. అందుకు యజ్ఞార్థంగా చేసినప్పుడు వంకర కుదరదు. అందుకనే యజ్ఞం అనే నామం చాలా పవిత్రమైనది. మనకు మహాభారతాన్ని అందించిన వాడు సూతుడు. అంతకు ముందు దాని పేరు 'జయం'. భారతం అని చెప్పినవాడు వైశంపాయనుడు. అది భారతమూ కాదు, మహాభారతమూ కాదు. వేదవ్యాసుడు అందించినపుడు 'జయము'. జయము అని ఎందుకు పెట్టాడంటే యజము చేసినవారి గురించి అందులో ఉంటుంది. యజము అంటే యజ్ఞము. యజ్ఞార్థం జీవించినవారు ఎలా ఎన్నెన్ని దాటరాని కష్టాలని కూడా దాటి వచ్చేశారు అన్నది ఉన్నది. కేవలం పాండవుల కథే కాదు మహాభారతంలో ఉన్నది. అంతకుముందు ఆదిపర్వంలో బోలెడు కథలున్నాయి. వేదవ్యాసుడు ప్రతిపర్వంలోనూ ప్రతిపాదించేది యజ్ఞమే! యజ్ఞార్థ జీవనమే! అట్లా జీవించి ఉన్నవారు విపత్కర సన్నివేశాలలో కూడా ఎలా తేలి ఉన్నారు? మిగతావాళ్ళంతా ఏ విధంగా నశించారు? ఇవి చూపించడానికి ఆయన రాసుకొచ్చాడు. వాటికి సంబంధించిన సూత్రాలన్నీ 18 పర్వాలలో ఇచ్చాడు. యజ్ఞార్థంకాక ఎంతో తెలిసి జీవించినవారు ఏ విధంగా దెబ్బతిన్నారో చూపించారు. అందుకని వేదవ్యాసుడు పెట్టిన పేరు జయం. జయము యజము చేస్తే వస్తుంది. యజము అంటే నీకిష్టం ఉన్నాలేకున్నా నీ వద్దకు పాద్దున్న లేచిన దగ్గర నుండి పనులు వస్తాయి. చేయవలసినదైతే చేస్తూ ఉండు. ఇది భగవద్గీతలో మొదటి సూత్రం. ఇష్టం అయితే చేస్తాం, లేకపోతే చెయ్యం. ఇష్టం లేకపోతే ఇష్టం లేదని చెప్పలేక, అయినా చేస్తూ వెనక రంధ్రాలు పెట్టే పద్ధతులు ఉంటాయి. ఏవో మెలికలు వేసేస్తూ ఉంటాం తెలివితో. ఇష్టాయిష్టాలు కాదక్కడ. చేయవలసినదా, కాదా అనేది ధర్మం. చేయవలసినదయితే ఇష్టం ఉన్నా, లేకున్నా చెయ్. లాభం అయినా నష్టం అయినా కష్టం అయినా సుఖం అయినా చెయ్. అదీ first instruction భగవద్గీతలో. 'ఇన్నాళ్ళు యుద్ధం చేశావు అప్పుడు

అనిపించలేదా, ఇప్పుడెందుకు అనిపిస్తుంది? ఇష్టం లేదు. ఎందుకూ? ఎదురుగా ఉన్నవాళ్ళు బంధువులు కనుక. అంతకుముందు? నేను నీతో కలిసి పనిచేసేది ఇష్టం మీద కాదు. ధర్మం మీద. నీ రథంలో నేను కూర్చున్నది నీవు ధర్మాన్ని పరిపాలిస్తావని/అనుసరిస్తావని' అని అర్జునుడికి చెప్తాడు కృష్ణుడు. అలాగే మన రథంలో భగవంతుడు కూర్చోవాలంటే ధర్మాన్ని మనం పరిపాలిస్తేనే. లేకపోతే మనకిష్టం అయ్యేట్లు కూర్చోడు. చేయవలసినదైతే జయాపజయాలను, లాభనష్టాలను, సౌకర్య అసౌకర్యములను చూసుకోకు అని చెప్తాడు. ఇవి fundamental teachings. మూడవ అధ్యాయంలో దొరుకుతుంది. మూడవ అధ్యాయంలో అలా చేసిన వాళ్ళందరినీ చూపిస్తాడు. అట్లా జీవించడం ప్రాతిపదిక! అట్లా భగవంతుడు ఉన్నాడు. అంతేకాదు, భగవద్భక్తుల జీవితంలో కూడా చూడవచ్చు. మనం ఆయనెక్కడ యజ్ఞార్థంగా లేడో చూస్తూ ఉంటాం. ఎందుకంటే మనకెప్పుడూ తప్పులెన్నాలని లోపల ఉంటుంది కాబట్టి. అంత వెలుగు వస్తూంటే ఆ వెలుగుని చూడక చంద్రుడిలో మచ్చ చూసినట్లు. వెన్నెల అంతా, అన్నిచోట్లా చివరకు నీ మొహం మీద కూడా పడుతున్నా కూడా ఆ చంద్రుడిలో మచ్చ చూడమని చెప్పే వాళ్ళని ఏమనాలీ? మహాత్ముల జీవితాల్లో యజ్ఞార్థజీవనం అంటే చూస్తే తెలుస్తుంది. ఒక్క మానవులు తప్ప మిగతా జీవరాశులన్నీ యజ్ఞార్థమే జీవిస్తాయి. గొర్రెలను పొలాల్లో ఎరువు కోసం తెస్తాం. ఇక్కడ వేస్తే వీళ్ళకి ఎరువు అయిపోదూ అని అనుకుంటాయా? మనల్ని వేయమంటే ఎంతిస్తావ్ అని అడుగుతాం. అంటే గొర్రెకి తెలిసినంత కూడా మనకి తెలియదే! పెద్దపెద్ద విషయాలు, భగవద్విషయాలు చెప్పేది మన భావన యందు పవిత్రీకరణ కోసం. ఇంత విష్ణుసహస్రనామం చెప్పి చివరకు ఇక్కడకు తెచ్చి పడేశారు. ఇన్ని నామాలు యజ్ఞం గురించి ఎక్కడ ఉన్నాయి? మొత్తంలో ఒకటిన్నర శ్లోకం వరసగా ఉంది. అంతకుముందు మూడు, నాలుగుసార్లు వచ్చింది యజ్ఞం గురించి. ఏమిటి ఉద్దేశ్యం? ఒరేయ్ ఇదంతా అయ్యాక విష్ణుసహస్రనామం బాగా చెప్పకున్నామని ఉబ్బక. చేయవలసినది యజ్ఞార్థం! అది భగవంతుడు అన్ని స్వరూపాల్లో అలా అన్ని చోట్ల ఉన్నాడు. అది మనకి అవగాహన కావాలి. అది అవగాహన కావడానికి సత్త్వం కావాలి. లేకపోతే ఇలాంటివి వింటూంటే వికారంగా ఉంటుంది. ఏదో ఇవన్నీ

చెప్పకోవడానికి బావుంటాయండి. చేయడానికి ఏం పనికిరావు, అన్నట్లుగా ఉంటుంది. ఈ కాలంలో ఎవరండీ అంటే నువ్వు ఉన్నావు కదా! అలా ఉన్నవాళ్ళు నువ్వు చూస్తే కనిపిస్తారు. వాళ్ళల్లో ఇవి కూడా ఉన్నాయి కదా అంటే అవి చూడక ఇవి చూడు. వాళ్ళలో మిగతావి చూడక చంద్రుడిలో మచ్చలు చూసినట్లు. ఇంత వెలుగున్నది కదా అది చూడు. ఎంత యజ్ఞార్థం జీవించారో అది ఆదర్శంగా పెట్టుకో! భగవంతుణ్ణి ఆదర్శంగా పెట్టుకో. ఆయన ఊర్కే కబుర్లు చెప్పలేదండి. మొత్తం పూర్తిగా దిగిపోయి, దిగక ఉన్నాడు. అందుకని మనకిన్ని యజ్ఞం నామాలు. యజ్ఞం ఆయనే, యజ్ఞానికి స్వామి ఆయనే, యజ్ఞాన్ని చేయించేవాడు ఆయనే, యజ్ఞం explain చేసేవాడు ఆయనే, యజ్ఞం ఎలా చేసుకోవాలో చెప్పేవాడు ఆయనే, యజ్ఞం ద్వారా సమస్తాన్నీ హరించేవాడు ఆయనే, యజ్ఞాన్ని పరిసమాప్తి చేసేవాడూ ఆయనే, యజ్ఞంలో ఉండే రహస్యం ఆయనే అంటే యజ్ఞగుహ్యం. ఎట్లా ఉన్నాడు అంటే తినమనేవాడు ఆయనే, తినేవాడు ఆయనే! అన్నం పరబ్రహ్మ స్వరూపం అనుకుంటాంగా తినేటప్పుడు. అన్నం ననింద్యాత్, మరి నువ్వేమిటి? నువ్వూ అదే అని చెప్పడానికి. అన్నాదులు అన్నం. భోజనం భోక్త అవుతోంది కదా! ఈ నామంలో ఒకసారి యజ్ఞం పేరున చివరకు వస్తున్నామని మంచి reminder. ఎవరికుండే సత్త్వగుణ సంపత్తిని బట్టీ దాని నిర్వర్తించుకోవడం ఉంటుంది. ఇట్లా ఒక్కసారి చెప్పకోవడం వల్ల మళ్ళీ ఆ స్ఫూర్తి రావచ్చు. రాలేదో యజ్ఞార్థం అయిపోయింది. ఫలితం ఆశించకుండా, ఉద్దేశ్యం లేకుండా చెప్పకున్నాం అన్నమాట. గొప్ప విషయం ఏమిటంటే ఫలితాన్ని ఆశించకుండా అని చెప్తారు. కానీ ఇక్కడ ఆ ఉద్దేశ్యం లేదు. భగవంతుడి సృష్టిలో ఉద్దేశ్యం ఏమీ వెతక్కు ఎందుకు చేస్తున్నాడో వెతక్క. ఏమీ కనపడదు. ఉత్తి పుణ్యానికి మంచి పనులు ఎందుకు చేస్తారనిపిస్తుంది. దేనికో ఒకదానికి చేస్తున్నారు అనుకునేవారు రజస్సులో బాగా ఉన్నవారు. దేనికోసమో చేసేటట్లైతే దశాబ్దాల పాటు చేయలేరు. పడిపోతారు. బండి ఎక్కడో అక్కడ ఆగిపోతుంది. Oil అయిపోతుంది. ఇక్కడ continuos supply of oil ఉంటుంది. అలాగ యుగాల తరబడి చేసేవారున్నారు. మరి పరమ గురువులంతా కలియుగాది నుండి చేస్తున్నారు. వారు మనకి ప్రమాణం. అందుకని అసలు మనుషులని తీసేస్తే

మిగిలిన జీవరాశుల్లో బాగా కనిపిస్తుంది ఇది. అందుకని మనం దాన్ని అందుకోవడానికి మళ్ళీ స్ఫూర్తి పొందడం కోసం 104, 105 శ్లోకాల్లో ఈ నామాలు చక్కగా గుత్తిగా ఒకచోట వేశారు.

1018, 1019 ఆత్మయోనిః, స్వయంజాతః

తన పుట్టుక స్థానం తన నుండే వ్యక్తం అవడం అనేది భగవత్తత్త్వాలలో ఒక ముఖ్యమైన అంశముగా ఇక్కడ చెప్పబడి ఉన్నది. తనను తాను తన మాయచేత జనింప చేసుకునేది, జన్మించనివాడు, జన్మించేవాడుగా మనకు గోచరించడం అనేది ఆయన దగ్గర ఉండే మాయ కారణంగా ఏర్పడుతుంది. 'నన్ను నేను నా మాయ ద్వారా సృష్టి చేసుకుంటాను', అని భగవద్గీతలో భగవంతుడు చెప్పడం జరిగింది. ఈ శ్లోకంలో ఈ మొత్తం విష్ణుసహస్రనామాలన్నీ కూడా శ్రీకృష్ణుణ్ణి ఉద్దేశించి చెప్పినట్లుగా దేవకీనందనః అనే నామం కూడా మనకు వచ్చింది. ఆత్మయోనిః - తనను తాను సృష్టి చేసుకునేవాడు. సృష్టి చేసుకోవడానికి పుట్టుకస్థానం కూడా తానే. స్వయంజాతః అనే నామంలో తనను తాను జన్మింప చేసుకుంటున్నాడు అనే విషయం మనకి అవగాహన అవుతుంది. తనని తాను జన్మింప చేసుకోవడానికి తన పుట్టుకకు కూడా ఒక స్థానం ఉండాలి కాబట్టి, ఆ పుట్టుక స్థానంగా కూడా తానే ఏర్పడతాడు. ఇది చాలా ముఖ్యమైన విషయం. సృష్టికి అతీతమైన తత్త్వము, పరతత్త్వము, తత్ అని పిలువబడేది, పరబ్రహ్మము అని తెలియబడేది, అనిర్వచనీయమైనది, అవిజ్ఞేయమైనది, తర్కమునకు అందనిది, లక్షణములకు అతీతమైనది, ప్రజ్ఞకు కూడా మూలమైనది, (ఇంకా ప్రజ్ఞ కూడా పుట్టలేదు) అయినటువంటిది, తనను తాను పుట్టించుకోవడానికి చోటులో ఒక బిందువుగా ఏర్పడడం. ఇది చాలా గ్రహించవలసిన విషయం. మొత్తం చోటులో ఒక బిందువు ఏర్పడి, బిందువు ఏర్పడడమే సృష్టికి ఒక అహంకార ప్రజ్ఞగా ఏర్పడి, మొత్తములో ఒక బిందువు ఏర్పడినప్పుడు, బిందువు అనేది ఒకటి ఉన్నదని వేరుగా చూడడం అనేది ఏర్పడుతుంది. ఒక తెల్లటి గోడ మీద ఒక చుక్క పెట్టామనుకోండి, అంటే

అక్కడ కేంద్రీకృతమౌతోందన్నమాట. అంటే అక్కడ్నుంచీ విచ్చుకుంటుంది అని. అట్లా తన నుండి వచ్చిన మొదటి సంకల్పం/ ఆది సంకల్పమే తనకి యోనిగా అంటే పుట్టుక స్థానముగా, తను వ్యక్తమగు స్థానముగా, అన్నిచోట్లా వ్యక్తం అవుతూ ఉన్నాడు. తనను తాను వ్యక్తము చేసుకోగలిగిన తత్త్వము గురించి ఇక్కడ చెప్తున్నారు. అది అట్లా వ్యక్తం చేసుకోగలదు కాబట్టే నిద్రలో ఉండే మనం, మన యొక్క ప్రజ్ఞతో సంబంధం లేకుండా లేవడం జరుగుతోంది. ప్రతి ఉదయం మనం ఎట్లా పుడుకు ం? ఏ విధంగా మేల్కాంచుతున్నాం? అనే విషయం మీద బాగా తపస్సు చేసినట్లైతే, పరతత్త్వము ఏ విధంగా మేల్కాంచి ఇంత బ్రహ్మాండంగా ఏర్పడిందో తెలుసుకోవడానికి కావలసిన అవగాహన దొరుకుతుంది. మేల్కాంచిన తర్వాత ఉండే వెలుగులోంచి సమస్తమైన సృష్టి పుట్టుకొస్తోంది. అసలు మేల్కాంచడమో, అది ఎక్కడి నుండి మేల్కాంచుతున్నది? ప్రజ్ఞ వచ్చిన తర్వాత ప్రజ్ఞలోంచి సంకల్పం వస్తుంది అని చెప్తాం. మనం ఉదయం లేచిన తర్వాత, మనలోంచి సంకల్పం వ్యక్తం అవుతూ ఉంటుంది. అంటే చైతన్యవంతులం అయిన తర్వాత, ఇచ్ఛగా వ్యక్తం అయ్యేది, దానిని నిర్వర్తించుకునే జ్ఞానముగా వ్యక్తం అయ్యేది, ఆ జ్ఞానముననుసరించి నిర్వర్తించుకునే క్రియగా అవుతుంది మూడుగా; ముందు సంకల్పం వ్యక్తమై అందులో నుండి త్రివిధములుగా, త్రిగుణములుగా, మూడు శక్తులుగా వ్యక్తం అవుతూ వస్తున్న దానికి ముందు విషయాన్నే మన పెద్దలు బిందువుగా ఇచ్చారు. ఒక బిందువు ఏర్పడితే, ఆ బిందువుకొక పరిధి ఏర్పడుతుంది. మనమంతా కలిపితే, ఒక్కక్కొక్కం అణోరణీయాన్ అంటామే, అణువులో అణువంత ఉంటాం. అది భౌతిక శరీరమునందు స్థాపితమై ఉన్నట్లైతే భౌతికమైన విషయముల యందు ఆసక్తి కలిగి ఉంటాం. కామశరీరమునందు స్థితి చెంది ఉన్నట్లైతే కోరికలయందు ఆసక్తి కలిగి ఉంటాం. మనస్సుయందు స్థితి చెంది ఉన్నట్లైతే ఆలోచనల యందు ఎక్కువ జీవిస్తూ ఉంటాం. అది బుద్ధి యందు ప్రవేశించినట్లైతే బుద్ధి వికాసం కలిగి, విజ్ఞాన లోకములలో జీవించడం చేస్తూ ఉంటాం. అంతకు పైన ఈ బిందువు, ఉర్ధ్వగతి చెంది, ఆనందమయ లోకములకు వెళ్ళినప్పుడు, ఇదే జీవితం ఆనందమయంగా ఏర్పడుతూ ఉంటుంది. ఆ బిందువు బట్టి. ఆ బిందువుకి ఒక

పరిధి ఉంటుంది. మనందరికీ, ఎవరి పరిధి వారికుంటుంది. చీమకి చీమ పరిధి ఉన్నది. దోమకి దోమ పరిధి ఉన్నది. సామాన్యుడికి అతని పరిధి అతనికి ఉన్నది. ఇంకొంచెం విశేషమైన లక్షణములు కలిగినవాడికి ఇంకొంచెం పరిధి ఉంటుంది. అట్లా, తమ యొక్క ప్రజ్ఞాపాటవములను బట్టే పరిధి ఏర్పడుతూ ఉంటుంది. అట్లాగే తాను పుట్టుక స్థానంగా ఏర్పడి, అందులోంచి తను స్వయంజాతుడుగా వ్యక్తం అయినప్పుడు, ఆ సృష్టికి ఒక పరిధి ఉంటుంది. మనకు కనపడదు కాబట్టి దాన్ని 'అనేమిచక్రం' అన్నారు. దాని అంచులు కనబడవు. అంచులు లేకపోయినప్పటికీ పరిమితి ఉన్న సృష్టిగా తనను తాను దిగిరాక ముందు, తానొక బిందువుగా వస్తాడు. అందులో నుండి సమస్తమూ ఒక అండముగా ఏర్పడడం జరుగుతుంది. ఆ అండంలో నుండి నాలుగు దళముల పద్మముగా ఒకటి వికసించడం జరుగుతుందని చెప్తారు. 'The Globe is a lotus before blossomming' అనే ఒక అత్యుత్తమమైన వాక్యమును హిమాలయపు గుహల్లో ధ్యానం చేస్తూ ఉంటారు. Blossomming అంటే వికసించడం. వికసించక ముందు ఉన్న స్థితి గోళం. వికసిస్తే పద్మం అవుతుంది. అందుకనే మనలో చక్రాలు కూడా పద్మాలుగా మారతాయి, స్ఫూర్తి కలిగినప్పుడు. అనాహత చక్రమున్నది. అనాహత పద్మము ఉన్నది. మణిపూరక చక్రము ఉన్నది, పద్మము ఉన్నది. ఆజ్ఞా చక్రము ఉన్నది, పద్మము ఉన్నది. ఈ విధంగా విచ్చుకుని, నాలుగు దళములుగా అని చెప్పడంలో ఉద్దేశ్యం ఏమిటయ్యా అంటే, చతుర్ముఖములుగా సమస్తమైన సృష్టి ఏర్పడుతుంది అని చెప్పడం. వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధ వ్యూహాలుగానూ; పరా, పశ్యంతి, మధ్యమ, వైఖరీ వాక్కులుగాను; రామ, లక్ష్మణ, భరత, శతృఘ్నులు గాను, నాలుగు కాలాలు కృతయుగము, త్రేతాయుగము, ద్వాపరయుగము, కలియుగముగాను, నాలుగు వర్ణములు బ్రాహ్మణము, క్షాత్రము, వైశ్య, శూద్రము గాను (స్వభావమును బట్టి). ఇట్లా అన్నీ నాలుగు నాలుగుగా దిగిరావడానికి కావలసిన ప్రాతిపదిక బిందువులోంచి విచ్చుకుంటుంది. బిందువులోంచి గోళము ఏర్పడి, గోళములోంచి నాలుగుదళముల పద్మము వచ్చి, అందులో నుండి నాలుగు తలకాయలుండే బ్రహ్మ వచ్చినట్లుగా చెప్తారు. ఇదంతా సంకేతమే! సంకేతము ద్వారా జ్ఞానం అందించడం అనేది

మన ఋషుల యొక్క సాంప్రదాయం. చతుర్ముఖములంటే నాలుగు రకములైన సృష్టి విధానములు. ముత్తాత, తాత, తండ్రి, కొడుకు లాగా. భర్గోదేవమండలము, సవితృమండలము, సూర్యమండలము, భూమండలము. ఈ విధంగా నాలుగుగా దిగి రాకముందు, తాను ఒక బిందువుగా ఏర్పడినప్పుడే మొత్తము నుండి తాను అనేది వేరవడం అనేది జరుగుతుంది. అప్పుడే స్పందనం కూడా కలుగుతుంది. 'The birth of the bird is the separation of a centre' అంటారు. ఒక చుక్క పెట్టంగానే మొత్తం నుండి అది వేరుగా ఒకటి తయారవుతుంది. దాని కొక పరిధి ఏర్పడుతుంది. పరిధి ఏర్పడంగానే, ఆ గోడ మీద చుక్క పెట్టి పరిధి మనం గీచినట్లైతే, ఆ గోడ, పరిధి లోపల గోడ, పరిధి బయట గోడగా అవుతుంది కదా! నిజానికి లోపల అయిందా అది, బయట అయిందా? గోడ గోడగానే ఉంది కదా! గోడ కాకపోతే black board అనుకోండి. Black board ఎక్కువ correct ఏమో! ఎందుకంటే, అది ఏమిటో అవగాహన కానిది కాబట్టి దాన్ని 'Darkness is the absolute light' అన్నారు. 'పెంజీకటి కవ్వలనెవ్వండేకాకృతి వెలగు'. ఈ కన్నుతో, చీకటి చూడలేం. అందుకనే చీకట్లో కూడా చెవి వినగలదు కాబట్టి పరమాత్మను వినడం అన్నది చూడడం కన్నా గొప్ప విషయంగా పెద్దలు చెప్తారు. బ్రహ్మ పరమాత్మను అట్లా వింటూ ఉంటాడు. పరతత్త్వాన్ని అట్లా వింటూ ఉంటాడు. పరబ్రహ్మమును బ్రహ్మ ఆ విధంగా విని చెప్తూ ఉంటాడు. మన అవగాహన కోసం రకరకాలుగా చిత్రీకరించారు. మనం తత్త్వపరంగా, సాధన పరంగా, యోగ పరంగా అర్థం చేసుకోవడానికి ప్రయత్నం చేస్తున్నాం కాబట్టి ఏమీ లేనట్టు ఉన్నచోట్లోంచి, ఏదో ఉన్నట్టుగా వ్యక్తమవుతుందని తెలుసుకోవాలి. ఈ అవడం వలన, దానికేర్పడిన పరిధి కారణంగా, పరిధికి లోపల ఉన్నచోటు, పరిధి బయట ఉన్న చోటు; సృష్టి పరిధికి లోపల ఉండే చోటుని సృష్టిలో దేవుడన్నారు. భగవంతుడన్నారు. పరిధికి అవతల ఉండే దైవాన్ని, అంటే ఈ మొత్తానికి, అసలు ఒక బిందువు ఏర్పడి, అది గోళమై, అది వికసించి, దానికో పరిధి ఏర్పడడం అనేది పెరగడానికి అంతటికీ మూలంగా ఉన్నదే, దాని నుండి/ అదియే ఒక స్పందనముగా, ఒక బిందువుగా ఏర్పడుతుంది. ప్రతి బిందువూ స్పందనమే! మనలో కూడా, నేను తాను అని మనం అనుకునేవి, ప్రతి ప్రజ్ఞ

కూడా, స్పందనం నందు ఇమిడి ఉన్న ప్రజ్ఞగా ఉంటాం. ప్రాణ నిలయం అంటే ఓంకారం. స్పందనముగా వ్యక్తమగునది. తననే తాను స్పందిచుకుని ఇవతలకు వస్తాడు. బయట, లోపల వ్యాపించిన దానినే ఉపనిషత్తులలోనూ, వేదములోనూ, బ్రహ్మము అన్నారు. వైష్ణవులు నారాయణుడు అన్నారు. శైవులు పరమ శివుడు అన్నారు. శాక్తేయులు పరాశక్తి అన్నారు. క్రైస్తవులు 'స్వర్గమున నున్న నా తండ్రి.' అన్నారు. అవ్యక్త, అలక్షణ, అప్రతర్క్య, అనిర్వచనీయ, అనామధేయుడు అన్నారు. మహమ్మదీయులు అల్లా అన్నారు. అందరూ అంటున్నది ఒకటే. అనేవారి బుద్ధులు వేరు కాబట్టే వేరుగా చూచుకుంటూ పోట్లాడుకునే జబ్బు అలవాటయ్యింది. పరిధికి అవతల వున్న దైవాన్ని అవ్యక్తం అన్నాడు. ఈ మొత్తానికి అసలు ఒక బిందువేర్పడి, అది గోళమై అది వికసించి, దానికో పరిధి ఏర్పడటం అనేది జరగటానికంతటికీ మూలంగా దైవమే ఉన్నది. దాని నుండి అదియే ఒక స్పందనముగా, ఒక బిందువుగా ఏర్పడుతుంది. ప్రతి బిందువు స్పందనమే. మనలో కూడా నేను, తాను అని అనుకొనే ప్రతి ప్రజ్ఞ కూడా స్పందనమునందు యిమిడి ఉన్నటువంటి ప్రజ్ఞగానే ఉంటాయి. అదే గరుత్మంతుడినెక్కి వస్తాడని చెప్పుకోవడం. యుగయుగానికీ మన బుర్రలు చిన్నవవుతున్న కొద్దీ, మన అవగాహన కోసం ఋషులు చాలా రకాలుగా ఆరాటపడి చాలా సులభమైన పద్ధతుల్లో చెప్పుకుంటూ వచ్చారు. మనకిప్పుడు పద్యాలు అర్థం కావు. అందుకని వచనంలోకి వచ్చారు. అందులో కూడా గంభీరమైన పదాలు వాడుతున్నట్లయితే మనకు అర్థం కావు కాబట్టి మామూలుగా వాడుకునే భాష లో చెప్తున్నారు. లేకపోతే కొంతమంది పెద్దవాళ్ళు చెప్తూ ఉంటే విషయం అర్థం కాదు. ఎందుకర్థం కాదంటే ప్రస్తుతం వాడుకలో ఉన్న భాషలో చెప్పకపోతే ఇప్పుడుండే మేధస్సుకు అందదు. అందుకని ఋషిప్రోక్తమైన మార్గంలో నీవు అందుకునేవాడ్ని బట్టి దిగిరావడమే తప్ప, చెయ్యి పట్టుకుని మళ్ళీ పైకి ఎక్కించడం ఉండదు. ఆ పద్ధతుల్లో స్పందనాత్మక చైతన్యాన్ని మనలో గమనించినట్లైతే, అంటే ఈ స్పందన మనలో ఎవరు కలిగిస్తున్నారో మనకు తెలిసినట్లైతే, స్పందనానికి అవతల ఎవడు ఉన్నాడు అనే విషయం తెలిసినట్లైతే, స్పందనాని అవతల ప్రాణనిలయము లేక ప్రణవము ఉన్నదని తెలిస్తే, ప్రణవమనే నాదమునకు వెనకాల ఏది ఉన్నది అని తెలిస్తే... ఇట్లా

అంతర్ముఖులమై పోతూ ఉండాలి. మనం పుట్టడం అంటే ఏమిటి? మనం పుట్టడం అంటే ఏమిటో, పరతత్త్వం/ పరబ్రహ్మతత్త్వం నుండి బ్రహ్మ పుట్టడం. ఒక స్పందనము. ఒక స్పందనము ఒక సృష్టి. సృష్టి నిండా మళ్ళీ అట్లా స్పందనము తరంగములుగా దిగి వస్తూనే ఉంటుంది. మనం కూడా బహిర్లోకములకు ప్రతిస్పందించకుండా, అంతర్ముఖులమై, అంతర్లోకములయందు, బాగా స్పందనమునందు మనస్సును పరిపూర్ణంగా లగ్నం చేసిన సందర్భంలో, స్పందనము సూక్ష్మస్పందనములోకి వెళితే, సూక్ష్మస్పందనము ఒక రకమైన నిర్లిప్తత, స్తబ్ధత గా మారి, అనూహ్యమైన నిశ్చలత్వము నువ్వు పొందినపుడు, నీవు లేక అది నిండి ఉండి ఆ తర్వాత మళ్ళీ నీలో స్పందనం కలిగి నీవు ఉన్నప్పుడు, అంతకుముందు నువ్వు ఎక్కడ ఉన్నావో నీకు తెలియక, ఆ స్థితిలో ఉండే అనుభూతికి ఆనందము చెంది, మళ్ళీ దాన్ని కోరుకునేవాడుగా మిగిలిపోతావు. ఇది మనకు ప్రాథమిక దశలోనే నారదుని యొక్క అనుభవంగా భాగవతంలో ఇస్తారు. ఈ ఆత్మయోని అనే నామం సాధనపరంగా మనకి తెలియాలంటే మనం ఎక్కడ్నిండి పుట్టుకొస్తున్నామో దాని గురించి బాగా తీవ్రమైన శోధనము చేయాలి. శోధనం చేయడాని కోసం ఈ శ్లోకంలో వైఖానః అనే నామం ఉంది.

1020 వైఖానసః

అంటే బాగా తవ్వుకున్నాడట తనని. తనని తవ్వుకుని యివతల పడేస్తే ఇదంతా వచ్చిందండీ. మనని మనం ఎంత శోధన చేసుకుని పనిచేస్తూంటే అంత మన నుండి దివ్యమైన కార్యములు బహిర్గతమవుతూ ఉంటాయి. ఒళ్ళు దాచుకుంటే అవ్వవు. మహాత్ములే దానికి మళ్ళి సరియైన ఉదాహరణం మనకి. వాళ్ళు ఒళ్ళు దాచుకోరు. అహర్నిశలూ పనిచేస్తూ ఉంటారు. ఎందుకని? ఆ గుణం ఆయనలో ఉంది కదా! అది మనలో బాగా శోధన చేయాలి. శోధన చేస్తూంటే, పెద్దలు చెప్పే మార్గంలో, లోపలి నుండి మణులు, మాణిక్యాలు, వజ్రాలు, వైడూర్యాలు, అమితమైన సంపదలు, జ్ఞానము బయటికి వస్తూంటాయి. శాస్త్రములు నీలోంచి బయటికి వస్తూ ఉంటాయి. నువ్వు పెద్దగని. మనం గొయ్యి తవ్వినప్పుడు, తవ్విన కాస్తా మళ్ళీ పారతో బయట పోస్తేనే కదా తరువాత తవ్వుకుంటూ ఉంటాం. మహాత్ముల జీవితముల నుండి ఈ విధంగా మణిమాణిక్యముల వలే సమస్తమైన దివ్యకార్యములు బయటికి వ్యక్తం చేయబడుతూ ఉంటాయి. ఒక పక్క అంతర్ముఖంగా తపస్సు జరుగుతూ ఉంటే, రెండవ పక్క ఆ తపస్సు నుండి వస్తున్న ఫలములు సంఘమునకు సమర్పణ చేస్తూ, వాటి యందు మోహము చెందక, ఆశపడక, పొంది ఉండక, అట్లా యజ్ఞం అనే అర్థంలో పంచిపెడుతూ ఉంటారు. అలా పంచి పెడుతూ ఉండడమే! ఏం ఉంటే అది పంచి పెడుతూ ఉంటారు. తీసిన కొద్దీ వస్తూ ఉంటుంది. వచ్చినకొద్దీ ఇచ్చేస్తూ ఉంటారు. ఎందుకంటే అవి తన దగ్గరే పెట్టుకుంటే మళ్ళీ గోతిలో పడిపోతాయి. పడిపోతే గొయ్యి పెద్దదవ్వదు. లోతు అవ్వదు. గోతిలోంచి తీసిన మట్టి గోతిలోనే ఉంచుకుంటే? మన నుండి రకరకములైన సంపదలు వ్యక్తమవుతాయి. అది ద్రవ్య సంపదగా వ్యక్తం అవచ్చు, జ్ఞాన సంపదగా వ్యక్తం అవచ్చు, ఇతరులకి సేవలు చేయగలిగినట్టి సామర్థ్యముగా వ్యక్తం అవచ్చు. ఏదైనప్పటికీ అది ఇతరులకి వినియోగపడుతున్నప్పుడే, నీవు లోతుల్లోకి వెళ్ళడానికి అవకాశం ఉంటుంది. బయటకు తీసినవాటికి వినియోగం జరగకపోతే లోపలికి వెళ్ళడానికి వీలుఉండదు. అందుకనే తపస్సు, లోకహితం. నీలోంచి ఏం వస్తే అది పంచు. మహాత్ములు అట్లా

పంచారు. నువ్వెంత పంచితే, నీలోంచి అంత బయటికి వెళ్ళిపోతూ ఉంటే, నీకు లోపలకి వెళ్ళడానికి చోటు వస్తూ ఉంటుంది. Dip Deep అన్నారే Master CVV గారు, అలా లోతుల్లోకి వెళ్ళాలి. నిన్ను నీవు తవ్వుకోవాలి. ఇంకొకళ్ళని తవ్వకూడదు. ఇంకొకళ్ళని తవ్వి వాళ్ళ దగ్గర నుండి అందుకున్నదల్లా బరువే. నిన్ను నువ్వు తవ్వుకుని నీలోంచి బయటపోసినదంతా, నీకు తేలికైపోతుంది. అందుకనే యోగమార్గంలో, చెయ్యి ఇలా ఉండడమే (ఇవ్వడమే) తప్ప, చెయ్యి ఇలా ఉంచక (తీసుకోక) అని చెప్తారు. ఉన్నంతలోనే! నీక్కావాలంటే నమ్ముకున్నవాడిని అడుగు. ఎందుకు నీకు కావాలి? వాళ్ళకి ఇవ్వడం కోసం ఐతే తప్పకుండా యిస్తారు. నీకోసం అయితే తలుపు మూసేస్తారు. ఉన్నంతలో ఎంత ఉంటే అంత ఇస్తూ ఉంటే, ఇస్తున్నానన్న భావం లేకుండా తేలికపడుతున్నానన్న భావంతో, లోకహితానికి సమర్పణ చెంది తపస్సులో నిమగ్నమై ఉండాలి. తపస్సు లేక లోకహితంలోకి వెళ్ళిపోయినా మనిషి పేలవమైపోతాడు. లోతులు పెరగవు. ఇక బయటే తిరుగుతూ ఉంటాడు. చేసే పనులు చెప్పకుంటూ. లోకహితం లేకుండా తపస్సు చేద్దాం అనుకుంటే అవ్వదు. ఎందుకంటే తవ్వి బయట పొయ్యట్లేదు కదా! అందుకని హిమాలయాల్లో ఉండే ఋషులు ఈ రెండూ రెండు రెక్కలుగా చెప్పారు. ఇంకొక రకం రెక్కలు చెప్పకున్నాం. భక్తి, జ్ఞానము, రెండు రెక్కలుగా యోగము జరిగితే పరిణతి ఉంటుందని. ఇప్పుడు మళ్లీ ఇంకో రెండు రెక్కలు. తపస్సు, లోకహితము. లోకహితము లేనివానికి తపస్సు జరగదు. తపస్సు చేసినా ముందుకు వెళ్ళదు. తపము చేసుకునేవాడు లోకహితం చేస్తూ ఉండాలి. అందుకని ఈ రెండూ చేసుకుంటూ వెళ్తూ ఉండడమే, ఈ వైఖానసుఁ అనే నామం. అట్లా తనని తాను తవ్వుకుని ఈ సృష్టి అంతా ఏర్పరచాడాయన. 'Fohat digging holes in space' అని ఒక వాక్యం ఉంది.

ఖం అనే శబ్దాన్ని ఉచ్చరిస్తారు. అది ఒక మంత్రం, బీజాక్షరము. ఎవరికి అంటే తనని తాను తవ్వుకుని సృష్టిని ఏర్పరచేవాడికి. ఆకాశంలో ఖం అనే శబ్దం బృహస్పతి యొక్క బీజాక్షరంగా చెప్తారు. శం అనే శబ్దం శనికి బీజాక్షరంగా చెప్తారు. అందుకనే ఈ రెండు బీజాక్షరాలు కలిపి శంఖం అని యిచ్చారు. అది పవిత్రం అన్నారు. వైఖానసుఁ అనే నామంలో ఖ కి చాలా

ప్రాముఖ్యత ఉంది. ఆ ఖం కొంచెం సరళంగా గం అయ్యింది గురుమంత్రంగా, గణపతి మంత్రంగా. గణపతి అంటే Cosmic Jupiter కదా! తప్పుకుంటూ మనం వెళ్తే, అంటే ఉన్నది వదిలించుకుంటే, తేలికపడుతూ ఉంటే, అంతర్ముఖులం అవుతూ ఉంటే, పుట్టుక స్థానం దగ్గరికి వెళ్తాం. పుట్టుక స్థానానికి అవతల 'అది' ఉన్నది, అంటే తత్త్వం ఉన్నది. మగ కాదు, ఆడ కాదు. మగ, ఆడ అనేది ఏం లేదు అక్కడ. ప్రజ్ఞకే పర. పరాప్రజ్ఞ. శక్తికే పర, పరాశక్తి. అంతా పరా అది. విద్యకే పర, పరావిద్య అంటాం. అక్కడికెళ్ళి నువ్వు ఆగితే, ఇవతల నువ్వు ఉంటావు. అవతల అది ఉన్నది. సంధానకర్తగా స్పందనం ఉంటుంది. స్పందనమే పుట్టుకస్థానం. అట్లా తనను తాను పుట్టించుకోవటానికి ఒక స్పందన కలిగించి, ఆ స్పందనం లోంచి తను దిగివచ్చి, దిగివచ్చినవాడు చతుర్ముఖుడై, ఇట్లా సృష్టి చేస్తాడు అని పురాణాలు చెప్తాయి. ఇది మన కథే. భగవంతుని కథ మన కథే. కాకపోతే ఇది Micro, అది Macro. ఇది అణువు, అది మహత్తు. 'అణోరణీయాన్ మహతో మహీయాన్.' మన కథ మనకి అర్థం అయితే, సృష్టి కథ అర్థం అవుతుంది. మనం మనకి తెలిస్తే దైవం తెలుస్తుంది. అందుకే రోజూ పుట్టంగానే పొద్దున్నే ఎక్కడ్నించి పుట్టాం? అని వెనక్కి వెళ్ళాలి. పొద్దున్నే, ఉదయమే, Retrograde Step వెయ్యాలి. ఎవరు నేను? ఎక్కడ్నించి పుట్టాను? పొద్దున్నే పుట్టంగానే ఎన్నిసార్లు పుడుతున్నామో మనం! రోజూ పుడుతూనే ఉన్నాం. అక్కడ్నించే పుడుతున్నాం. మొత్తం అంతా ఎక్కడ్నించి పుట్టిందో అది మనలో కూడా ఉంది. అది చోటు. చోటుగా, మనలో సత్యముగా, ఉన్నదిగా, శాశ్వతముగా ఉన్న 'ఇది' ఉన్నది. దాంట్లోంచి పుట్టుకొస్తాం. పుట్టుకొచ్చినప్పుడు మనం ఎక్కడ్నించి పుట్టాం అనే ప్రశ్న వేసుకుని, కూర్చోవడం అనేది తపస్సు. నేనెవరు అని ప్రశ్న వేసుకోవడం తపస్సు. మన గురించి మనకున్న నిర్వచనాలన్నీ తప్పని తెలియాలి. ఎందుకంటే నీవు కూడా దాని నుండి వ్యక్తమైనవాడవే కాబట్టి అనిర్వచనీయుడవే! అయినప్పటికీ ప్రపంచం కొరకు అంటే బహిర్లోకముల కొరకు ఎప్పుడూ మనం దిగి పని చేస్తాం కాబట్టి ఒక సౌకర్యం కోసం మనకొక పేరు ఉంటుంది. ప్రపంచం అనే నాటకరంగంలో పని చేయడం కోసం మనకొక స్థితి, మనకొక పాత్ర కల్పించబడి ఉన్నది. రోజంతా పాత్ర పోషణమే తప్ప మనము

అది కాదు అనేది బాగా తెలిసి ఉండాలి. What is the game plan for today? అంటాడు ఒక మహాత్ముడు పొద్దున్నేలేచి. ఎందుకంటే ఇది ఆటే కదా! ఒక్కొక్కరోజు ఒక్కొక్క రకంగా ఉంటుంది కదా! కొంతమంది ఏమంటారంటే, ఈ రోజుకి మన ప్రణాళిక దివ్య ప్రణాళికగా ఏవిధంగా నిర్వర్తింపబడుతుందో గమనించుకుని దాని ప్రకారం జీవించడానికి ప్రయత్నం చేస్తాం. మరొకడు దీన్నే ఆయన నుండి నేను లేచాను, అతడే నేను అని గుర్తు ఉండి, అంటే సోహమస్మి! అతడే నేనై ఉన్నాను అనడమే సోహమస్మి అంటే! అది బాగా గుర్తు రావాలి ప్రొద్దున్నే. లోపలనుండి అసలు మనకు reminder అది. ప్రతి క్షణం లోపల నుండి ఆ స్పందనం మనకి చెప్తున్నది ఒకే విషయం. 'అతడే నేను', 'అతడే నేను' అని అలా స్పందన చెప్తూనే వుంటుంది. వినగలిగిన వాళ్ళకి, శ్రద్ధ కలిగిన వాళ్ళకి లోపల వినిపించే రెండక్షరముల మంత్రం. ద్వయమంత్రం అంటారు, ఇదే. వైష్ణవులు 'ద్వయమంత్రం ఇస్తారండీ' అంటారు. వాడు నువ్వుగా వచ్చావు కాబట్టి, రెండు శబ్దములు స హ, అహమస్మి. సోహమస్మి. సోహం, సోహం. అందుకని లేవంగానే మనం పెట్టుకున్న దేవతలు, వాటి రూపాలు, వాటి నామాలు, వాటి కళలు, వాటిల్లోకి దిగకముందు, ప్రొద్దున్నే లేచినచోటు ఎక్కడో గుర్తించి ఆ చోటుకి మళ్ళే వెళ్ళి అతుక్కోవాలి, కాసేపు. That I am. నేను అతడనకండి. ఋషులు ఒక హెచ్చరిక ఇచ్చారు. నేనతడే అనవద్దు. నేనతడే అంటే నీవు ముందవుతావు. అతడే నేను అంటే అతడు ముంద ఉన్నాడు. నేనుగా వున్నానని నువ్వు వచ్చావు. మళ్ళే అతడే మిగులుతాడు. బ్రహ్మాహమస్మి. ముందు నేనున్నానుకుంటూ వుంటావు. అహమస్మి. తరువాత తెలుస్తుంది. నేనేం లేను, అతడే తెలుస్తుంది. సోహమస్మి. ఆ తరువాత మనం లేము కదా! వాడే కదా ఉన్నాడని కదా తెలుస్తుంది. బ్రహ్మాహమస్మి. నిచ్చెనలు యివన్నీ. కాబట్టి లేచీ లేవంగానే ఎక్కడ్నించి పుట్టామో దాన్ని ధ్యానం చేసుకోవడం అనేది సాధనపరంగా 'ఆత్మయోనిః' అనే నామానికి మనం అందుకోవలన సాధన. Every time we wake up, we have woken up from somewhere. ఎక్కడ్నించి ఇప్పుడు మేల్కొన్నాం? దానినే భగవంతుడు ధ్యానయోగంలో అక్కడ ధ్యానం చెయ్యి అంటాడు. అక్కడ అంటే ఎక్కడ అని ప్రశ్న. ఇక్కడ. లేచి లేవంగానే,

పశువైపోక, జంతువైపోక. జంతువైపోవడం అంటే పుట్టిందేగా జంతువు. పుట్టంగానే మనకుండే విశేషణములతో మనం ముడి వేసుకుని అదే నేననుకున్నాం అనుకోండి. నీ గురించి ఎవరు నువ్వు? నేను చాలా పండితుణ్ణనో, నాకు చాలా బాగా తెలుసనో, నేను ఇదనో, నేను అదనో? ఇవా గుర్తుండాలి? నువ్వు ఏదీ కాదు. నువ్వు ఏదనుకుంటే అది. నువ్వు మనిషనుకోవడం కూడా నీ అజ్ఞానమే. లేచీ లేవంగానే నిన్ను నీవు మనిషిని అనుకోనక్కరలేదు. ఆ పూటకి నీ పాత్ర మనిషిగా ప్రవర్తించడం ప్రపంచంలో. మళ్ళీ రాత్రి పడుకుంటే ఏమీ లేదు. నిద్రలోకి వెళ్ళేటప్పుడు ఏం లేదండి. నువ్వు మనిషీ కాదు. అదీ కాదు, ఇదీ కాదు. ఏదీ కాదు. నీ స్థితీ లేదు, నీ గతీ లేదు, నీ పేరూ లేదు, నీ సంపదా లేదు, ఏదీ లేదు. వాడైపోయావు. మళ్ళీ వాడే నీవుగా వస్తున్నప్పుడు వాడే నేనుగా వస్తున్నానని గుర్తుండాలి. అతడే నేను అని గుర్తుండడం కోసం ఈ మంత్రం. అది ఏం జరుగుతుందంటే అతడు నేనుగా వచ్చేటప్పుడు తెలీదు. వచ్చిన తర్వాత తెలుస్తుంది. మేల్కాంచిన తర్వాత కదా నేనున్నాననే భావన!. మేల్కాంచక ముందు ఎక్కడుందా భావన? లేదే! అప్పుడు మనం అదిగా ఉన్నాం అన్నమాట. అదైపోయాం అన్నమాట. చిన్న నేను, పెద్ద నేను అయిపోయిందన్నమాట. అల సముద్రంలోకి వెళ్ళిపోయిందన్నమాట. మళ్ళీ కథ ఎప్పుడయ్యా అంటే సముద్రంలోంచి అల వస్తేనే. పొద్దున్నే మళ్ళీ కథ మనకి, రాత్రి కథ ఏమీ లేదు. 'నీకే అస్తిత్వం లేదయ్యా. నా అస్తిత్వమే నీ అస్తిత్వం. నీకొక అస్తిత్వం ఉందని నీవు అనుకుంటున్నావు కాబట్టి అనుకోనిస్తున్నాను' అని భగవద్గీత తొమ్మిదవ అధ్యాయంలో దైవము చెప్పాడు కదా. అల తాను ఉన్నదనుకుంటే అనుకోనిచ్చింది సముద్రం. సముద్రం లేకపోతే అల లేదు కదా! ఇది చాలా ముఖ్యమైనది. అసలు మనని మనం నిర్వచించుకోవడం లోనే ఉన్నది మొత్తం మోసం అంతా. ఎవరూ మోసం చెయ్యక్కరలేదు. మనమే మనని మోసగించుకుంటున్నాం. లేచీ లేవంగానే 'రాజకుమారుడను' అని గుర్తు ఉండాలి. రాజు పరతత్త్వం అయితే, అందులోంచి వచ్చిన వాడివి కాబట్టి రాజకుమారుడవు. అందుకనే ప్రతి ఒక్కడూ దైవకుమారుడే! సహజముగా ప్రతి ఒక్కడూ అందులోంచి వచ్చినవాడే! దానిని భావన చేయడం వలన మన నిజస్వరూపం మనకి కాస్సేపు గుర్తు ఉంటుంది. Colgate toothpaste,

brush మీద పెట్టుకునే లోపలే మర్చిపోతాం. మర్చిపోకుండా ఎంతసేపు ఉంటుందో చూసుకోవాలి. రోజంతా ఉంటే ధన్యుడు. వాడు సరి అయిన పాత్రధారి. ధర్మరాజు అటువంటి పాత్రధారి. మర్చిపోడు. భాగవతంలో ఇవ్వబడిన ఆ నారద, ప్రహ్లాద, అంబరీష, శుక, శౌనకాదులు వాళ్ళెప్పుడూ మర్చిపోరు. కాబట్టి భాగవతులు! భగవంతుడే నాలో, నాలాగ, నావలే ఉన్నాడని తెలిసి ఉండాలి. అందుకనే నాటకం! నాటకాల్లో వేస్తే బాగా పరిణతి వస్తుందని చెప్తారు, ఈ స్ఫూర్తితో నాటకాలలో వేసేవాళ్ళకి. ఎందుకంటే నాటకంలో నీవు నటిస్తున్నప్పుడు నీకు తెలుసు కదా, ఆ పాత్రధారివి నీవు కావని. ఇవ్వాళ ఒక సాంఘిక నాటకంలో వేషం వేశావు. రేపు ఒక పౌరాణికంలో, ఆ మర్నాడు ఒక జానపదంలో వేస్తావు. ఈ మూడిట్లో ఏదిరా నీవు? అంటే మూడూ నేను కాదు కదా అంటావు. అంతే కాదు అందులో నీవు పాత్ర వహించి పోషిస్తున్నప్పుడు కూడా నీకు నీవెవరో తెలిసి పాత్రపోషణ చేస్తున్నానని నీకు గుర్తుంటుంది. నిజమైన నటుడు ఎవరయ్యా అంటే తనెవరో తనకి తెలిసి తన పాత్ర పోషణలో రక్తికట్టించిన వాడు తప్ప, పాత్రలో లీనమైపోయి ఏడ్చేవాడు కాదు. పాత్రలో లీనమైపోయే వాడు ఎట్లా వుంటాడంటే రంగం దిగిన తర్వాత కూడా అదే వేషం, అదే భాష, అదే భావన! దానిని మనం హాస్యానికి చెప్పుకుంటాం. హనుమంతుడి వేషం వేసిన వాడు నాటకం అయిపోయిన తర్వాత అట్లాగే ఊర్లోకి వస్తే ఎట్లా ఉంటుందో మన పరిస్థితి అంతే. నీవు హనుమంతుడివి కాదుకదా! నువ్వేమిటి! అక్కడనుండి దిగి వచ్చిన తత్త్వం! అదే నీవు! రోజుకొక సన్నివేశం. ఒక సన్నివేశం ఒక scene అన్నమాట. ఎన్ని సన్నివేశాలున్నాయి రోజులో? నాటకంలో అవన్నీ acts అంటాం. రంగ ప్రవేశం చేస్తూంటాం. రంగంలో ప్రవేశించినపుడు నీకో పాత్ర పోషణం ఉంటుంది. అలాగే నీతో ప్రవర్తించేవాడిది కూడా పాత్ర పోషణమే! అయినప్పటికీ రక్తి కట్టిస్తున్నావు కదా! నాటకం నిజంగా గోచరిస్తుంది కదా! ఇన్ని రూపాల్లోనూ ఆడుతున్నది ఎవరు? ఒకడే! 'నర్తకుని భంగి పెక్కగు మూర్తులతో ఎవ్వడాడు'. ఎంత నర్తిస్తాడట అంటే 'మునులు, దివిజులున్ కీర్తింపనేరనెవ్వని, ఎవ్వరి వర్తనములెరుగరు'. ఎంత నాటకం అనుకున్నా కూడా అప్పుడప్పుడు తెలిసినవాళ్ళకి కూడా మాయ కమ్మవచ్చు. ఆయన దాటాడనుకుంటే

దాటలేదని అర్థం. దాటలేం అని పడి ఉన్నవాడ్ని దాటిస్తూ ఉంటుంది. ఈ పార ఏదైతే ఉందో, ఎందులోంచి ఆయన పుట్టుకొస్తాడో, దాన్నే మాయ అంటారు. దాన్నే ఇక్కడ ఆత్మయోని అంటారు. అట్నించిటు దిగి రాగానే అదని గుర్తుండదు. అదే దిగి వచ్చినా, అది కాదేమో అనుకున్న జ్ఞానులు, పండితులు బోలెడు మంది లేరా కృష్ణావతారంలో? కృష్ణుడు కూడా తనను తాను సృష్టించుకుని దిగివచ్చినవాడే. దిగి వచ్చి దేవకీదేవి గర్భంలో నుండి వచ్చిన శిశువు మీద తనను తాను ఆపాదించుకున్నవాడు తప్ప, గర్భస్థుడైన వాడు కాదు. గర్భంలో నుండి శిశువు వచ్చేవేళ వసుదేవుడికీ, దేవకికి తాను చతుర్భుజుడై కనిపించి, మొత్తం చేయవలసిన ప్రణాళికను చెప్పి, శిశువు బయటికి రాగానే తనను తాను ఆపాదించుకున్నాడు. అందుకనే 'కనియెన్ దేవకి' అని పోతనామాత్యుల వారు ద్రష్ట కాబట్టే చక్కని పద్యం రాశాడు. చూసిందట. కన్నది అంటే రెండు అర్థాలు ఉన్నాయి. చూసిందని, ప్రసవించింది అని. ఎటువంటివాడ్ని చూసింది? చతుర్భుజుడ్ని చూసింది. పుట్టిన పిల్లవాడికి నాలుగు భుజాలు లేవు. కదా! అందుకని భీష్ముడు 'నీ సంకల్పంచే నిన్ను నీవు పుట్టించుకున్నావు తప్ప నీవు సామాన్యుడవు కాదు' అని కృష్ణుణ్ణి సంబోధిస్తున్నాడని కూడా తెలుసుకోవాలి. ఈ విధంగా కృష్ణుడు పుట్టాడు. ఈ విధంగా మహాత్ములు తమను తాము ఆ విధంగా పుట్టించుకుంటూంటారు. అంగుష్టమాత్ర పురుషుడిగా తనను తెలుసుకున్నవాడు, తనని తాను ఎరిగినవాడు, తాను కేవలం జ్యోతిస్వరూపుడని తెలిసి, విదేహుడై ఉంటాడు. వాళ్ళే విదేహరాజ్యంలో ఉంటారు. వారందరికీ నాయకుడు జనకుడు. అందుకనే యోగుల గురించి చెప్పేటప్పుడు జనకుడి గురించి చెప్పకుండా ఉండడానికి వీలు లేదు. శ్రీకృష్ణపరమాత్మ అంతటి వాడు జనకుడి గురించి చెప్పాడు భగవద్గీతలో. విదేహులు అంటే విశిష్టమైన దేహము కలిగినవారు అని అర్థం కూడా వుంది. విశిష్టమైన దేహము అంటే 'వెలుగు దేహం'. దాన్నే 'భాగవత శరీరం' అంటారు. దాన్నే 'అంతఃకరణ శరీరం' అంటారు. దాన్నే పాశ్చాత్యదేశాల్లో Etheric body అంటారు. వెలుగు శరీరం అంటారు. తల్లి గర్భంలోంచి వాళ్లే పుట్టరు, ఇహ శ్రీకృష్ణుడి గురించి చెప్పేదేమున్నది. సూర్యాత్మకమైన ప్రజ్ఞ తండ్రిని ఆవరించి ఉంటే, చంద్రాత్మకమైన ప్రజ్ఞ తల్లి కడుపులో పెరుగుతూ

ఉంటే, సామాన్యజీవుడు 7వ నెలలో ఆ గర్భంలోకి (సూర్యాత్మక ప్రజ్ఞ) ప్రవేశిస్తుంది. ఆ తొంభైరోజులే వీడు పడే నరకయాతన అంతాను. అక్కడి తొంభైరోజులు బయట తొంభై సంవత్సరాలతో సమానం. ఈ తొంభైరోజులలో జీవుడు విపరీతమైన అవస్థ పడుతూ ఉంటాడు. ఎందుకంటే మలమూత్రములు విసర్జించే అవయవముల దగ్గర తను పెరుగుతూ ఉంటాడు. అందుకనే తల్లి యొక్క సంస్కారమును బట్టి గానీ మహాత్ములు దిగి రారు. అత్యంత పవిత్రమూర్తి అయితే తప్ప వీలు పడదు. మామూలు వాళ్ళందరూ కూడా ఏడవ నెలలో అందులో చేరతారు. అందుకనే సీమంతం. మహాత్ములు బయటకి వచ్చిన తర్వాత బిడ్డ, అప్పుడు ఆపాదించుకుంటూంటారు. అందుకనే ప్రతి మహాత్ముడు He is immaculately conceived. Immaculate conception. అమృతత్వమును పొందినవాళ్ళందరికీ ఇది సాధ్యమైన విషయమే. వారికి జనన మరణములు లేవు. శరీరం నందు ప్రవేశించుట, శరీరమునుండి వైదొలుగుట తెలిసి ఉంటారు. ఎప్పుడూ శరీరంలో ఉండరు. మనం ఏ విధంగా వాహనాన్ని వాడుకోవడానికి వాహనంలోకి చొరపడి, వాడి, అయిన తర్వాత బయట portico లోనో, car shed లోనో park చేస్తామో అట్లా మహాత్ములు శరీరాల్ని వాడతారు. వాళ్ళకి చావు లేదు. ఇహ పుట్టుక ఉండదు. 'ఇక పుట్టుక లేని స్థితిని నాకివ్వు' అని అడగడంలోని ఉద్దేశ్యం ఇదే. అంతే కాని అట్లా ఆకాశంలో ఒక పడక కుర్చీ వేసుకుని పడుకుంటాం అని కాదు. సృష్టి అయ్యేంత వరకు ఇంక మాకు పుట్టుక ఉండదండి. ఆకాశంలో పడక కుర్చీ వేసుకుని పడుకుని ఉంటాం. మనకొచ్చే కాఫీ, ఇడ్లీ అన్నీ అక్కడికొచ్చేస్తాయనుకోవడం. చాలా మంది అడుగుతూ ఉంటారు. మాకు పుట్టుక లేకుండా మోక్షం యివ్వండి. ఏమిటి మోక్షం? భావముల/ భావబంధముల నుండి బయట పడడమే మోక్షం. ఎంతటి వాడికైనా ఏదో ఒక భావమునందు పట్టు ఉంటుంది. పట్టు ఉన్నంతసేపూ బంధమే! పట్టు దాటితే మోక్షం. మనకి ఎంత తెలిసినా ఎన్నెన్ని పట్లుంటాయి? శరీరము నందు పట్టు, కోరికల యందు పట్టు. అవి లేకపోతే రుద్రగ్రంథి, విష్ణుగ్రంథి, బ్రహ్మగ్రంథి అని చెప్తూ ఉంటాం కదా. అవన్నీ విడిపోతాయి. రుద్రగ్రంథి విభేదిని, విష్ణుగ్రంథి విభేదిని అని చదివితే విడిపడతాయా? పడవు. చదివితే

స్ఫూర్తి వస్తుంది. విడదీసుకోవడం నీ బట్టి ఉంటుంది. శరీరమునందు నీకెంత మమకారం ఉన్నది, నీకింకా ఎన్ని కోరికలు మిగిలి ఉన్నాయి, నిన్ను ఏ భావములు బంధించుచున్నవి, సంపద భావమా, మనవారను భావమా, మన సంతానమను భావమా, మన సాంప్రదాయమనే భావమా, మన దేశమనే భావమా, మన జాతి అనే భావమా, మన మతమనే భావమా, మన కులమని భావమా, ఏదో ఒకటి ఎక్కడో అక్కడ పట్టేస్తుంది. ఇంకేం మోక్షం! మోక్షస్థితి అంటే ఏదీ బంధించదు. అన్నింటిలోకి వెళ్ళి వచ్చేస్తూ ఉంటాం. గాడిదలోకి కూడా వెళ్ళి వచ్చేయవచ్చు. తిరిగి రాగలం అని తెలిస్తే గాడిద శరీరంలోకి, కోతి శరీరంలోకి, పాము శరీరంలోకి వెళ్లడానికి అభ్యంతరం ఉండదు. అట్లా ఉన్నారు మహాత్ములు. పెద్ద పెద్ద నాగుపాము రూపాల్లో ఉంటారు. మనకి చాలా భయం పాముగా ఉండమంటే. తెల్లటి హంసల వలే ఉంటారు. పావురాల వలే ఉంటారు. కోతుల వలే ఉన్నారు కదా కొంతమంది. అదేంటయ్యా కోతిలా ఉన్నావు? ఏమిటిట ఐతే? అందులో, నడిచేది వాహనం. చల్తీకా నామ్ గాడీ కదా! అది Ambassador/ Maruthi Zen/ Maruthi 1000/ Maruthi 800 ఏదైతే ఏమిటి? దాంట్లోనే ఎప్పుడూ ఉండం కదా! సిద్ధులు ఎప్పుడూ శరీరంలో ఉండరు. శరీరం ద్వారా కూడా చేస్తూ ఉంటారు. షిరిడీ సాయి ఉన్నారనుకోండి, ఎప్పుడూ, అక్కడ ఆ సమాధిలో కూర్చుని ఉంటాడా? బ్రతికున్నప్పుడే లేడట్లా. శరీరం అక్కడ ఉన్నంత మాత్రాన అక్కడ ఉన్నట్లు కాదు. శరీరం లేనంత మాత్రాన లేనట్లు కాదు. వీళ్ళంతా ఎవరు? పుట్టుకంటే ఏమిటో తెలిసిన వారు. అంటే మరణం అంటే ఏమీ లేదని తెలిసినవారు. మరణం లేనివారికి పుట్టుకలేదు. పుట్టుకలేని వారికి మరణం లేదు. 'నచికేత విద్య' అందుకు ఇచ్చారు. నిలదీసి అడుగుతాడు యముడ్ని. నచికేతాగ్ని యిచ్చాడు. నచికేతుడు సాధించాడు అంటాడు ఉపనిషత్తులో. ఏమిటో చెప్పరు. ఎందుకు చెప్పరంటే అర్హత ఉన్నవాడికి బోధకుడే వచ్చి అందిస్తాడు. ఇంకా అంతవరకు రాలేదుగా నువ్వు. యావ తప్ప రాలేదు కదా, సాధన లేదు కదా. యావ ఉన్నవాడికి ఇస్తారు. అదే ఆరాటంగా ఉండి, ఆ స్థితికి వచ్చినవాడు. ఆత్మయోనిః వైఖానసః అంటే తవ్వుకున్నాడు వాడినివాడు. ఇంకోడ్ని తవ్వలేదు. ఊళ్ళో వాళ్ళందర్నీ తవ్వుకుని తెచ్చుకొనేవాళ్ళకి అయ్యే పనికాదు. మనని

తవ్వుకుని మన దగ్గర ఉండేది ఊళ్ళో వాళ్ళకి పోయడమే! మీ partner మీ దగ్గర అన్యాయంగా కొట్టేస్తున్నాడు. మీ దగ్గర ఉండేది ఊళ్ళో పోస్తున్నాడు, మీరు చూసుకోవట్లేదు అని చెప్పారనుకో. ఆ పట్టుకు పోనీ. ఎంతమంది పట్టుకుపోతే అవుతుందో ఇది. CVV గారు railway contracts చేస్తుంటే మంచి ఆషాఢభూతిలాంటి భాగస్వామి ఉంటాడు. అతడు పట్టుకుపోతూంటాడు ఈయనదంతా. పెట్టుబడి ఈయనది. సంపాదన ఆయనది. అలాంటి భాగస్వాములు ఉంటారు. ఒకళ్ళ పెట్టుబడితో వాళ్ళు అనుభవిస్తూ, ఏదో పొందుతున్నాం అనుకుంటారు. పొందడం కాదు అది ముంచుకోవడం. ఉంచుకున్నదల్లా ముంచుకోవడమే. పక్కవాడిది ఉంచుకుంటే మరీ ముంచుకోవడం. బొక్కిందల్లా దక్కుడనుకుంటాం మనం కలియుగంలో, బరువెక్కిపోతుంది. అందులో ధర్మాత్ముడిది బొక్కితే మరీ బరువెక్కిపోతుంది. వీడు పారేస్తూంటాడు. వాడు బొక్కెస్తూంటే CVV గారి అమ్మ చెప్పిందిట. ఆవిడకి అసలు వ్యాపారంలో లౌకిక జ్ఞానం ఏమీలేదు. 'ఒరేయ్ వాడు తినేస్తున్నాడట్రా' అంటే 'తిననీ అమ్మా, వాడికి ఎంత ఆకలి వేస్తే అంత తిననీ. ఏం పోయింది, మనదా? వాడిదీ. తన వాడికి వాడు పెట్టుకుంటున్నాడు. మనం తేలికైపోతున్నాం కదా!' అన్నారు. అందుకనే ఆత్మసాధన, ఆత్మశోధన, ఆత్మజ్ఞానము, యోగము అని చెప్తారు. వీటన్నిటికీ మనని మనం తవ్వుకోవడమే తప్ప ఊర్లో వాళ్ళని తవ్వడం కాదు. పోగేసుకోవడం అనే ప్రణాళికే లేదు. వచ్చిందల్లా వాడిచ్చింది. వాడికొరకే, వాడి వాళ్ళకోసమే వినియోగిస్తాం అనే వాడు వైఖానసుడు. భగవంతుడిని వైఖానసుడు అని చెప్పడంలో పెద్ద విశేషం ఏం లేదు. భగవద్భక్తుల్లో యివన్నీ చూడాలి. భాగవతులలో గోచరిస్తాయి. యోగులలో గోచరిస్తాయి. వాళ్ళ జీవితాలు మనకి ఆదర్శప్రాయములు. దమ్ముంటే అట్లా నడవాలి. లేకపోతే 'వాయ్ ముడు'. ఏదన్నా చేస్తే అట్లా మగాడిలా జీవించాలండి. ఎన్నాళ్ళని పిరికి పిరికిగా జీవిస్తావ్! ధీరులు, నిరపేక్షులు. నిరపేక్షత్వము, అపరిగ్రహము, ధీరత్వము. ఎవరు నీకు దిక్కంటే, నా లోపలే ఉన్న ఆయనే నాకు దిక్కు తప్ప ఇంక ఏదీ దిక్కు కాదు అనే స్థితిలో ఉండాలి. ఎవడో ఇంట్లోంచి ఓ ఇటుక ఎత్తుకుపోయాడంటే ఏడుస్తూ కూర్చుంటూ ఉంటే మన చైతన్యబిందువు యిటుకలో ఉందన్నమాట. శరీరం కూడా వదిలేసేదే!

కొత్తగా చెప్పులు కొనుక్కుని సభలకు వస్తే బయట పెట్టామనుకోండి. ఎక్కడ ఉంటుంది మన చైతన్యబిందువు? అక్కడుంటుంది. ఆ చెప్పుల దగ్గర! ఏంటో ఈయన ఉపన్యాసం ఆపడు. ఆ చెప్పులెవరన్నా ఎత్తుకుపోతారేమో అని. అట్లాగే పోతాయి అవి. చెప్పుల మీద ఎవరికి మనసుంటుందో వాళ్ళ చెప్పులు ఎక్కువగా పోతూంటాయి.

1021 సామగాయనః

ఛందోబద్ధంగా అట్లా పాడుకుంటూ ఉంటాడటండీ. ఆయనే పాడుకుంటాడు. ఈ నామమేటిటంటే ఆయన్ని ఆయన పుట్టించుకోవడానికి పుట్టుకస్థానం ఏర్పరచుకున్నాడట. ఆయన్ని ఆయన పుట్టించుకున్నాడట. ఆయన్ని ఆయన తవ్వుకుంటున్నాడట. 'నన్ను వండకండిరా మీరు' అంటే 'మరి సృష్టిరాదు సార్' అని చెప్తారు.'దేవాయద్యజ్ఞం తన్వానాః అబధ్నన్ పురుషం పశుం, తం యజ్ఞం బర్హిషి ప్రౌక్షన్స్' వండేయండిరా నన్ను అని చెప్పడం. అదే 'త్యాగేనైకేన అమృతత్వమానసుఃతన్ను తాను సమర్పణ చేసుకోవడం వల్ల సృష్టి బయటకి వచ్చింది. అలాగే మనని మనం సమర్పణ చేసుకోవడం వల్ల అటు వెళ్ళిపోతాం. నరమేధం జరగాలి. కృష్ణుడి విషయంలో అట్లా నరమేధం జరిగింది. అంతా యిచ్చుకోవడమే. ఎక్కడా పుచ్చుకోవడం లేదు. ఇటీవలికాలంలో నరమేధం పూర్తిగా నిర్వర్తించిన వాడు ఏసుక్రీస్తు. There is no equal. ఏమిటి ఇంత భారతీయుడై యుండి బ్రాహ్మడై ఉండి యిట్లా మాట్లాడుతాడు అని అనుకోవచ్చు. అనుకుందురు గాక! సత్యం అదే! కాకపోతే 'శరీరాన్ని దాటి మనం ఉంటాం' అని తెలిసిన మహర్షులు ఎంతోమంది ఉన్నారు. వాళ్ళు సంకల్పం చేత లోకశ్రేయస్సు కోసం దివ్య ప్రణాళికలో భాగంగా పుడుతూ ఉంటారు, వెళ్ళిపోతూ ఉంటారు. వాళ్ళకు పుట్టుకలేదు. చావులేదు. వస్తూ పోతూ ఉంటే పుట్టాం, చచ్చాం అని అనుకోలేం కదా! అందుకనే మహాత్ముల విషయంలో Date of birth అనేది ఉండదు. వశిష్ఠుడి Date of birth ఏమిటండీ? అగస్త్యుడి పుట్టినరోజు ఏమిటి? మన పుట్టినరోజంటే మన భాషలో చెప్పాలంటే. నా పుట్టినరోజు కదా ఎవ్వరూ Happy Birthday చెప్పలేదని పీక్కుంటామే. ఎవరెవరు చెప్పలేదో గుర్తు పెట్టుకుంటాము, చెప్పినవాళ్ళని మర్చిపోతాం. వాడికంత పొగరా చెప్పలేదని. ఒక మహాత్ముణ్ణి అమెరికాలో కృష్ణుడి Date of birth ఏమిటని అడిగారు. 'మా కృష్ణుడు పుట్టనూలేదు. వెళ్ళిపోనూలేదు. ఎప్పుడూ ఉండేవాడికి Date of birth ఏమిటి నీ మొహం' అని చెప్పాడాయన. 'మీ Christ కి Date of birth ఉందని మీరు అనుకోవడం మీ అజ్ఞానం' అని

చెప్పాడు ప్రతిరోజూ పుడుతున్నాం. పుట్టడమే అయితే. పొద్దున్నే పుట్టిన తర్వాత ఎలా నడుస్తోంది? మనది అదో రకమైన పాటగా నడుస్తూ ఉంటుంది కదా! నట్లు పడుతూ ఉంటాయి మన పాటలో/ మన గీతంలో. ఆయన గానం సామవేదం లాగా అట్లా గానం జరిగిపోతూ ఉంటుందిట. అంటే అర్థం ఏమిటి? స్పందనాత్మక చైతన్యమే సామవేదం. ప్రాణస్సామవేదః, మనో యజుర్వేదః కదా! అట్లా స్పందనాత్మకంగా విచ్చుకుంటూ ఉంటుంది. నిశ్చలమైన సరస్సులో ఒక బెడ్డ వేస్తే ఎట్లా తరంగాలు అట్లా తిరుగుతూ తిరుగుతూ పరిధి వరకూ ఏర్పడిపోతాయో, అట్లా యిన్ని వలయాలుగా ఏర్పడిపోతాయి. తరంగాలు వలయాకారంగా ఏ విధంగా పరిధికి చేరతాయో అదే విధంగా మళ్ళీ కేంద్రాన్ని చేరుతూ ఉంటాయి. అవి తాళ, లయబద్ధంగా వ్యాపనం చెంది, సంకోచము చెందుతాయి. ఆ సమస్తమూ సంగీతమే. అట్టి సంగీతమే మన యందు, సృష్టి యందు స్పందనముగా ఉన్నది. అది కారణంగా చంధోబద్ధంగా లోకములు, లోకులు ఏర్పడుతూ ఉంటారు. సూక్ష్మము నుండి స్థూలమునకు, స్థూలము నుండి సూక్ష్మమునకు రాకపోకలు సాగుతూ ఉంటాయి. ఇదే గానము. అదీ సామ! సామవేదం. మనలోపల, ఋగ్వేదం జరుగుతోంది, సామవేదం స్పందనమే ఇక ఉంటుంది. సామవేదం అంటే ఇట్లా ఎడమ చేయి మూసేసి-- శరీరం పవిత్రత వస్తుంది, సందేహం లేదు. అసలు సామవేదం లోపల జరుగుతుంది. ఋగ్వేదం జరుగుతోంది, యజస్సు జరుగుతోంది. అది కారణంగా అధర్వ. మనలోంచి వచ్చే సంకల్పములన్నీ మనలో జరిగే ఋగ్వేద ప్రక్రియే! మనలో జరిగే స్పందనాత్మకమైన గానమేదైతే ఉందో దాన్నే The music of the Soul అన్నారు. మంద్రమైన గానమది. మంద్రమంటే చైతన్యము. చైతన్యవంతమైన గానం. ఆ గానం వినడం కోసమే ఎప్పుడూ ఋషులు అక్కడ ఉంటారట. బయట పనులుంటే గబగబా చేసేసుకు వచ్చేసి ఆ గానం వింటారు. ఇట్లా గానం రూపంలో తనను తాను వ్యాపనం చేసుకున్నాడండీ. మనలో కూడా ఆ గానం ఉండబట్టే కదా, మనం లేచిన తర్వాత యివన్నీ చేస్తున్నాం. ఆయన గానం ఛందోబద్ధంగా ఉంటుంది. ఛందస్సు ఉంటుంది. తాళం ఉంటుంది. లయ ఉంటుంది. ఎన్నాళ్ళు పోయినా భూమి ఇన్ని గంటలలోనే ఒక చుట్టు తిరుగుతుంది. సూర్యుడి చుట్టూ భూమి తిరిగే

కాలమానం అదే. బృహస్పతి సూర్యుడి చుట్టూ తిరిగే కాలమానం అదే. ఛందస్సులే ఇవన్నీ. శనికి 30 ఏళ్ళు. బృహస్పతికి 12 ఏళ్ళు. ఇంద్రగ్రహానికి 14 × 12 = 168 ఏళ్ళు, వరుణగ్రహానికి 7 × 12 = 84 ఏళ్ళు. ఇలా అన్నీ ఛందస్సులే. వత్సరములుగా పిండుకొచ్చాడు అని పృథుచక్రవర్తి కథలో ఉంటుంది. ఛందస్సులే పిండబడతాయి. ఈ గానం ఛందస్సులతో సాగుతూ ఉంటే ఈ సృష్టి అంతా కూడా అట్లాగే ఏర్పడి ఋతువుల వరకు వచ్చినాయి. జీవులందరికీ ఋతువులున్నాయి. మనుషులకి తప్ప. మామిడి చెట్టుకి ఋతువు ఉంది. పశువులకు ఋతువులున్నాయి. వృక్షాలకు ఋతువులున్నాయి. మనకే అసలు ఏ ఋతువు తెలీదు. అన్నీ ఒకటే మనకు. మామిడిచెట్టు ఏ ఋతువులో మామిడికాయలిస్తుందో మనందరికీ తెలుసు. మనకే ఋతువూ లేదు. మనం పడిపోయాం. ఆ గానంలోంచి బయట పడిపోయి అపశ్రుతిలో పడ్డాం. మళ్ళీ శ్రుతి పెట్టుకుంటున్నాం. మన పెట్టెకి శ్రుతి పెట్టుకోవడమే ఈ కార్యక్రమమంతా. గానంగా నడిచిపోతోంది. ఛందోబద్ధంగా నడిచిపోతోంది. 24 గంటలు, 24 తత్త్వాలు. 24 పౌర్ణిమ, అమావాస్యలు, 24 ఏకాదశులు, 24, 24,24 కనిపిస్తాయి. 60, 60, 60 గా కనిపిస్తాయి. అట్లా అన్నీ వేటికి ఇవ్వబడిన ఛందస్సు ప్రకారం అవి అలాగే నిర్వర్తిస్తూనే ఉంటాయి సృష్టిలో, ఆ గానం అట్లా సాగుతూనే ఉంటుంది. ఆ గానమే వినాలని ప్రయత్నం చేస్తూ ఉంటారు. అది సృష్టి అంతా నిండి ఉన్నది. అదే శ్రీకృష్ణుడు వేణువు ఊదితే చుట్టూ ఉన్న ప్రపంచం అంతా పులకించడానికి కారణం. సృష్టితో శ్రుతి కలిపి ఉండేది. సృష్టి జీవులందరూ అందులోకి ఉద్ధరింపబడేవారు. కాలం దాటిపోయిందని తెలీదు, గుర్తుండేది కాదు. వింటున్నాం అని కూడా గుర్తుండేది కాదు.

1022 దేవకీ నందనః

దేవకీ నందనుడు. ఇక్కడ వివరించుకోవాల్సింది ఎక్కువ ఏమీ లేదు. ఇది వరకే చెప్పా దేవకి, వసుదేవులు ఎటువంటి వాళ్ళో, ఎంతటి వాళ్ళు అవడం చేత ఇటువంటి ప్రజ్ఞ దిగి రావటానికి అవకాశం ఏర్పడింది. వాసుదేవా అంటాడు. చివరికి. 'వాసుదేవో అభిరక్షతు' కదా! చాలా సార్లు వచ్చింది ముందుకూడా వాసుదేవ. ఇక్కడ దేవకీ నందనః

1023 స్రష్టా

స్రష్టా అంటే సృష్టించగలిగినవాడు. సృష్టికర్త! సృష్టి కర్తనే సృష్టించినవాడు. సృష్టికి ప్రతి సృష్టి విశ్వామిత్రుడిలాగా రజోగుణాన్ని ఆధారంగా చేసుకుని చేసినవాడు కాక, సత్త్వగుణ ప్రధానంగా సృష్టికి ప్రతి సృష్టి చేసి బ్రహ్మకి కూడా శిక్షణ ఇచ్చినవాడు. అంతర్యామి, పరతత్త్వము. సృష్టికర్తను సృష్టించింది అనడం ఒక ఎత్తు. 'శ్రీకృష్ణుడు సృష్టికర్తకు బుద్ధులు గరిపెను' అనేది ఇంకొక ఎత్తు. ఈ నామాల్లో అద్భుతం ఏమిటి అంటే రెండు పక్కలా మనకి కనిపిస్తుంది. మూడవది నువ్వు. పరతత్త్వం, అవతారతత్త్వం, సిద్ధుడు, యోగి, సాధకుడు. ఇలా మనం నాలుగు రకాలుగా చూసుకుంటున్నాము. నువ్వూ సృష్టికర్తవే!. కాకపోతే నువ్వు మర్చిపోయావంతే. ఆయన సృష్టికర్త. ఏం చేశాడు? అసలు సృష్టికర్త ఆవుల్ని, దూడల్ని, గోపబాలకుల్ని అందరిని బ్రహ్మగారు దాచేశాడు. ఒక్క రోజే ఆయన లెక్కలో. ఆయన దాచిన ఒకరోజు మన భూమి మీద ఒక సంవత్సరం. 'కోపింపన్ పని లేదు' అనే పద్యం చదువుకున్నాం కదా! బ్రహ్మదేవుడికి కోపించాల్సిన అవసరం ఎందుకు? లేదు. ఏదో కొంచెం సత్త్వం నుండి వైదొలిగాడు. 'నువ్వేకాదోయ్. నువ్వు లేకపోయినా నేను పని చేసుకోగలను' అని తెలియజెప్పడానికి తాను ప్రతి సృష్టి చేశాడు. చేస్తే అంతకన్నా బావుంది. 'చూడవయ్యా నేను చేస్తే ఇట్లా ఉంటుంది. నీ ద్వారా

చేయించుకోవడం బట్టి ఇంత నాసిగా ఉంది' అన్నట్లుగా అద్భుతంగా ఉంటుంది. అంత అద్భుతమైన సృష్టి. ఆ దూడలని చూస్తే ఆవులకి అమితమైన ప్రేమట. ఆ పిల్లల్ని చూస్తే వ్రజంలో ఇంట్లో ఉండే తల్లిదండ్రులకు అసలు వివరించలేనంత ఆత్మీయత. ఆనందం. ప్రేమ పొర్లి పొర్లి పోయింది. ఆ సంవత్సరం అంతా కూడా అదొక పెద్ద సంరంభంగా గడిచింది. మరి ఇవన్నీ తెలిసినవాడు కదా భీష్ముడు. స్రష్ట. You are the creator of the creator. మనము కూడా! మనలో creator పొద్దున్న లేస్తాడు. మంచిపనో, పాడుపనో చేయడానికి పొద్దున్న లేచిన తర్వాతే కదా, నిద్దర్లో ఏం చేస్తాం. అందుకనే నాలో సంకల్పములు సరి అయిన పద్ధతుల్లోనే నీకనుగుణంగానే ఉద్భవించేట్టు చూడమని కోరడమే ప్రార్థన. 'నేనెవరు' నుండి 'నేనేం చేయవలెను' అని తర్వాత ఒక ప్రశ్న. నేనెవరు? నేనెక్కడ ఉన్నాను? నేనేం చెయ్యాలి? నేనెక్కడ ఉన్నాను?-పరతత్త్వంలో యిమిడి ఉన్నాను. నేనెవరు-అతడే నేను. ఏం చెయ్యాలి- నీ సంకల్పం మేరకు నేను పని చెయ్యాలి. ఎందుకంటే దానిలో కూడా సంకల్పాలు పుట్టేట్టుగా నువ్వు నన్ను నిర్మాణం చేశావు. ఎంత ఉదార స్వభావం కాకపోతే తనంతటివాడుగా నిర్మాణం చేస్తాడండీ? ఎంత నేర్పినా ఒక మెట్టు తక్కువగా ఉండేట్టుగా నేర్పుకుంటాం కదా. తనతో సమానంగా తయారు చేశాడు. నువ్వే సంకల్పించుకోవచ్చు అన్నాడు. అది ఆయన సంకల్పానికి అనుగుణంగా ఉంటే వృద్ధి చెందుతాడు. లేకపోతే చిక్కులు వేసుకుంటాడు. అందుకని ప్రతివాడూ తనదైన జీవితాన్ని తను సృష్టి చేస్తున్నాడు కదా! తనలోంచి వచ్చిన భావముల ప్రకారమే తన జీవితాన్ని అల్లాడు. నేత నేశాడు. నిర్మాణం చేశాడు. ఎవడి జీవితం వాడి సృష్టి. అది వాడికర్పితమై చేసినట్లైతే వైభవంగా ఉంటుంది. మనంగా చేసుకున్నట్లైతే ఏదో ఉంటుంది. అది కూడా. మనమే పాగుడుకోవాలి. ఊళ్ళో ఎవరూ పాగడరు పాగిడించుకోవడానికి డబ్బులిచ్చి పాగిడించుకోవాలి. పాగిడేవాడు ఆ రోజు పాగిడి మర్చిపోతాడు. మళ్ళీ పాగిడించుకోవడానికి మళ్ళీ డబ్బులివ్వాలి. వీళ్ళందరినీ వేల సంవత్సరాల నుండి శాశ్వతంగా వద్దురా అన్నా పాగుడుతున్నారే! గుర్తింపు రావాలన్నా దానికొక తెలివి ఉంది. ఏమిటా తెలివి? వాడితో కలిసి ఉండడమే. వాడితో కలిసి ఉంటే అంతా వైభవమే!

వాడికి నీ జీవితమునందు మక్కువ కలిగి, అది ప్రచారం చేయిస్తాడట సృష్టిలో. భాగవతుల కథలన్నీ శాశ్వతంగా భూమి మీద ఉండడానికి కారణం భగవత్సంకల్పమే!. 400 ఏళ్ళు అయిపోయింది, ఇంక 500 ఏళ్ళు కూడా అయిపోతాయి, అన్నమాచార్యుని ఇప్పుడు బయటకి తీసి చూపిద్దాం ప్రజలకి అని చూపించలేదా? విజృంభించాడు. ఎక్కడో పాలస్తీనాలో పది మందితో మంచి కబుర్లు చెప్పుకునే ఆయన్ని ప్రపంచం అంతా ఎక్కించలేదా? చర్చి ఎక్కించిందనుకుంటే తప్ప. చర్చి ఎక్కించింది, క్రైస్తును చెట్టు ఎక్కించింది. క్రైస్తు చెప్పింది వేరు. చర్చి చెప్పింది వేరు. క్రైస్తు పరమ భాగవతోత్తముడు. సమస్తమూ విశిష్టాద్వైతమే అతని పలుకులు. ఇంకొకటి కాదు. ఎక్కడో షిరిడీలో 100 గడప కూడా లేదు కదా! గోళీకాయలు ఆడుకుంటూ పిల్లలతో ఏవో చేశాడాయన. అంత తెలిసినవాడు. ఎవ్వరికీ తెలియకుండా వెళ్ళిపోయాడే. అదే ధైర్యము, అదే ధీరత్వము. ఇదేంటి తన గురించి తను చెప్పుకోవడము ఏమిటి? వాడితో వుండేవాణ్ణి వాడు చూసుకుంటాడండీ ఎక్కడికి వెళ్ళినా. మాస్టరు గారు చెప్పినట్లు red carpet treatment. ఈరోజున షిరిడివాలా భూగోళమంతా అట్లా సరసరసరసర ఎవ్వరి ప్రమేయం లేకుండా పాకుతున్నాడే! మనము అట్లా పాకించుకుందాం అని అనుకున్నా అవుతుందా? ఎందుకు పాకింది? అసలు విడిపడనిదే, అసలు విషయంతో! అవినాభావ సంబంధం. వాళ్ళ సృష్టి చూడండి ఎట్లా ఉంటుందో. భగవంతుడి సృష్టి చూడండి ఎట్లా ఉంటుందో. భగవంతుడితో అనుసంధానం చేసి జీవించిన వాళ్ళ చరిత్ర చూడండి ఎట్లా ఉందో. వాళ్ళు నిర్మాణం చేసినది చూడండి ఎట్లా ఉందో. వేల సంవత్సరములు అవుతున్నకొద్దీ ఇంకా రాణింపు వస్తుంది తప్ప నాసెక్కదు. వాసికెక్కడమే తప్ప, నాసి అవదు. కాబట్టి, తనకు గుర్తింపు అనుకున్న వాడు కూడా తెలివిగా ఉండాలనుకంటే, శ్రద్ధ, భక్తి పక్కన పెట్టు. వాడితో ఉండు! వాడితో ఉండడం వలన; వాడికి కీర్తి అక్కర్లేదు. భక్తుల కీర్తే ఆయనకు కీర్తి. భక్తులను ఎక్కడ ప్రశంసిస్తూ ఉంటే, అక్కడ భగవంతుడు ఆనందం చెందుతూ ఉంటాడు. రాముడిని ప్రార్థిస్తే హనుమంతుడు అనుగ్రహించినట్లు, హనుమంతుడిని ప్రార్థిస్తే రాముడు అనుగ్రహిస్తాడు. పరస్పరంగా ఉంటుంది. మనకి వాడిని

పాగుడుతున్నాడు కదా, మనకి ఏంటి వీడితో సంబంధం అన్నట్టుగా ఉంటాం మనం. స్రష్ట!

Ensure what are the impulses that are springing out from you. నీనుండి వ్యక్తమవుతున్న సంకల్పములు ఏ విధంగా ఉన్నవో ఒక్కసారి పరిశీలించి చూసుకొనుము ప్రతి ఉదయము. అవి నీకు సంబంధించినవా, లోక శ్రేయస్సుకు సంబంధించినవా, దైవంతో ముడి వేసుకున్నావా, నీతో ముడి వేసుకున్నావా, నీతో ముడి వేసుకుంటే ఏమీ ఉపయోగం లేదు. నీ పరిధి చిన్నదైపోతుంది. వాడితో ముడి వేసుకో. హరి సంకల్పమే నీ సంకల్పంగా నిర్వర్తింపబడాలి. 'నీ వారై చనువారిలో నేనొక్కడినై.' .అంటారు. వాడి వాళ్ళంటే ఏమిటి? 'స్వామీ, ఈరోజున నన్ను నిద్ర లేపింది నువ్వు. నీ సంకల్పం మేరకు నన్ను జీవించేటట్టుగా చూడు. నీ సంకల్పమే నా సంకల్పంగా వ్యక్తం అవనీ. వ్యక్తమైన సమస్తమూ నీదిగానే నే భావన చేస్తూ నీ దాసుడిగా నేనుంటాను'. మనకి idea వచ్చిందనుకోకూడదు. మనకి idea ఇచ్చాడు అనుకోవాలి . మనలోంచి వచ్చేవన్నీ కూడా Father Thy will be Done. Not mine అనేది భాగవతమార్గం. నీ గురించి నేను చేస్తాను కదా! నీ గురించి ప్రశంసిస్తాను కదా! పది మందికి చెప్తాను కదా! అని మనం దేవుడితో చెప్పాం అనుకోండి, నవ్వుకుంటాడు. లేవంగానే అందులోకి ఇముడు. ఎందుకనంటే లేవంగానే విడపడ్డావు. అందులోకి ఇమిడి దాన్ని పట్టుకొచ్చుకో. దాన్ని నిర్వర్తించనీ. నువ్వు అతని వాడివిగా తయారవు. నీ శరీరం అతనికి సమర్పణ చెయ్.

1024 క్షితీశః

దేవుడి గురించి క్షితీశః అని చెప్పడం పెద్ద విశేషం అవదు. పదార్థము నాశనము చెందునది. తన నుండి వ్యక్తమైనదే కదా! ప్రజ్ఞయే తన నుండి వ్యక్తం అయింది, శక్తి తన నుండి వ్యక్తం అయింది, పదార్థము తన నుండి వ్యక్తం అయింది. దానికి తను ఈశ్వరుడు, అలా అనుకోవడం ఒక భావం. మనం సరాసరి ఈ నామంలో మన దగ్గరికి వచ్చేద్దాం. మన క్షితి ఏమిటి, మన శరీరమే. ఎంత సులభంగా మనం వాడుతున్నాం, మన శరీరం అని, మనది కాదు కదా? ఈశుడెవరు ఈ క్షితికి? నేను కాదు. జీవుడుగా నేను కాదు. నాకివ్వబడ్డదీ శరీరం. అందుకనే అర్జునుని శంఖాన్ని దైవదత్తం అన్నారు. ఈ శరీరము దైవదత్తము. ఇది దైవమునకు సంబంధించినది. దీనికి ఈశ్వరుడు దైవమే. అతడు మనకిస్తే మనం వాడుకుంటున్నాం. మనదనుకుంటున్నా కూడా ఆయన కాదనడం లేదు. ఎంత ఉదార స్వభావం? ఒక్క పూట మీ scooter నాకిచ్చి నేను వాడుకుంటూంటే మళ్ళీ ఎప్పుడిస్తాడా అని ఉంటుంది. ఎక్కడన్నా ఎవరిదీ scooter అని అంటే నాది అని నేనంటే అది విన్నారనుకోండి మీరు, గిలగిల్లాడి పోదు ప్రాణం, అమ్మా! నా scooter వీడికిస్తే వీడు నాదని చెప్తాడా అని, వెంటనే వచ్చి తీసేసుకుంటాం ఎందుకైనా మంచిదని. ఇల్లు అద్దెకిస్తే శాశ్వతంగా ఆ యింట్లో ఎట్లా ఉండిపోవాలో అని కదా మన ప్రయత్నం. ఒళ్ళూ అద్దెకే ఇచ్చారు. వాడిది ఇది. వాడుంచితే ఉన్నాం. వాడు ఖాళీ చెయ్యమంటే ఖాళీ చెయ్యాలి. అసలు నువ్వెడివి? వాడి వాడివే! నీ తండ్రి నీ కొక యిల్లిచ్చాడయ్యా. అందులో కొన్నాళ్ళుండు, మళ్ళీ నేనొచ్చేవరకు అంటే మళ్ళీ నాన్న వచ్చేస్తాడేమో అని, వాడు రాకుండా చూసుకునే ప్రయత్నాలు, ఔరంగజేబులాంటి ప్రయత్నాలు ఉంటాయి కదా! అసలు వాడ్నే తీసేస్తే పోలే అన్నట్టుగా. ఎప్పుడూ శరీరంలో ఉండాలనే కదా ఇంత తెలిసిన వాళ్ళూ ప్రయత్నం చేశారు. హిరణ్యాక్ష, హిరణ్యకశిపులు. రావణాది జ్ఞానసంపన్నులు. రావణుడు సామాన్యుడు కాదు మన వరకు. అహంకారం ఒక్కటి తీసేస్తే, మనం అంతా దణ్ణం పెట్టాల్సినవాడు. మనమే కాదు సమస్త సృష్టినూ. ఇంత బ్రహ్మజ్ఞానం ఉండి దాంతోబాటు అహంకారం వచ్చింది. చావులేకుండా చూడు అన్నాడు. అంటే

ఏమిటి అర్థం? ఇల్లిస్తే ఈ ఇల్లు మళ్ళీ నువ్వు అడక్కుండా చూడు నా దగ్గరుంచేసేయ్ అని చెప్పడం. మన శరీరానికి ఆయనే యజమాని. మనంకాదు. మన శరీరం అని అనుకోవడం వల్లే యింత అసహ్యంగా దాన్ని తయారుచేశాం. ఇది వాడిది. వాడి వస్తువు మన దగ్గర ఉంచాడు. శ్రద్ధా భక్తులతో దీన్ని మనం సద్వినియోగం చేసుకోవాలి. సద్వినియోగం చేసుకుంటాం అని ఆశపడి యిచ్చాడు. మన మీద ఎంతో నమ్మకముంచి ఇచ్చాడు. మన మీద ప్రేమతో ఇచ్చాడు. అపారమైన కరుణతో ఇచ్చాడు. దాన్ని అతని పనికే వినియోగిస్తే! ఇదే రహస్యం కృష్ణుడు అర్జునుని రథంలో కూచున్నాడంటామే. అర్జునుడిది రథమేంటి? అర్జునుడిది కాదు రథం. అగ్నిదేవుడిది. ఇచ్చాడు. ఎవరడిగితే ఇచ్చాడు? అర్జునుడు అడిగితే ఇచ్చాడా? అర్జునుడు అడిగితే ఇవ్వలేదు. కృష్ణుణ్ణి అడిగాడు అగ్నిదేవుడు నీకేదన్నా కావాలా అని. 'నాకేం ఇస్తావ్. నీ మొహం. వీడికివ్వు' అన్నాడు. తనకేం అక్కరలేదు కదా! తన వాడొకడున్నాడు కదా! వాడికిస్తే చూసి మనం ఆనందిస్తాం. మనకర్థమయ్యే పని కాదు లెండి అది, ఎందుకంటే ఇంకోడికి మనదిచ్చి, వాడు వాడుకుంటూంటే చూసి ఆనందించే బుద్ధే లేనప్పుడు, కష్టం కదా. ఇచ్చిన దగ్గర నుండి వాడేం చేస్తున్నాడో దాంతో అనే భయమే. అందుకనే రథం కళ్యాలు నేను పట్టుకుంటాను అన్నాడు. మన కళ్యాలు, మన రథం, మనం పట్టుకోవటం వల్లే, మన శరీరాలు ఇంత నాసిగా ఉన్నాయి. 'నీకెందుకు నేను పట్టుకుంటా కదా! నేన్నడిపిస్తా కదా! నీ రథం తయారు చేసి తెస్తాను. నీవందులో కూర్చో. నువ్వు యుద్ధం చెయ్యి. ప్రతి సాయంత్రం నువ్వు రథం దిగు. నేను తీసుకెళ్ళిపోయి దాన్ని బాగు చేసుకుని మళ్ళీ పొద్దున్నే తీసుకొస్తా'. ఇదే కదా. రోజూ జరిగే కథ అదే మనకి. ప్రతి రాత్రికి మన శరీరాన్ని హూనం, హూనం చేసి యిహ తప్పక నిద్ర వస్తూంటే అప్పటికి కళ్ళు మండుతున్నా కూడా అదేదో ఆ program TVలో చూసి అప్పుడు కదా పడుకుంటాం. రాత్రి పడుకున్నప్పుడు నీ శరీరపరిస్థితి ఏమిటి? ఉదయన్నే నువ్వు నిద్రలేచేప్పటికి నీ శరీర పరిస్థితి ఏమిటి? మళ్ళీ energized కదా! శక్తివంతమైంది కదా! పూవు వలె మళ్ళీ, Fresh like flower అంటాం కదా, అలా తయారు చేశాడు కదా! ఎందుకని? మళ్ళీ రోజంతా దాన్ని చితక్కొట్టమని కదా! యుద్ధమే కదా! అర్జునుడు చేసినది యుద్ధమే.

మనమూ అదే! లేచిన దగ్గర నుండి నీ జీవితం యుద్ధమే కదా! మరి యుద్ధంలో గుర్రాలు అలిసిపోతాయి. రథం చక్రాలకి కాస్త నట్లు అవీ ఊడిపోతాయి. సీలలు ఊడిపోతాయి. బిగించుకోవాలి. గుర్రాలకి సేద తీర్చాలి. వాటిని చైతన్యవంతంగా తయారు చేయాలి. శరీరాన్ని, రథాన్ని పటిష్టంగా తయరు చేయాలి. పొద్దున్నే మళ్ళీ నీకు తీసుకువచ్చి యివ్వాలి. ఇట్లా రోజూ పార్థసారథియై- పార్థుడు అంటే ఏమిటి? పార్థివతత్త్వంలోంచి పుట్టుకొచ్చినవాడు. మట్టిలోంచి పుట్టినవాడు అని అర్థం. పృథుతత్త్వం. కాబట్టే వాడ్ని యిట్టా తయారు చేసి యిస్తూంటే వాడుకుంటూ ఉన్నాం రోజూ. అర్జునుడూ అట్లాగే వాడుకున్నాడు, 18 రోజులున్నూ. చివరి రోజున కొంచెం గురువు గారి మీద శిష్యునికి జాలి కలిగింది. ఎంతసేపు విశ్వరూపం చూపించినా ఇతడికి బావే! దైవం అని మర్చిపోతూ ఉంటాడు. అత్యవసర పరిస్థితిలోనే దైవం గుర్తుండేది. లేకపోతే బావా! అంటూంటాడు. సఖా! అంటూ ఉంటాడు. ఆయనకి అన్నీ ఒకటే. వీడి మొహంలే అనుకుంటాడు లోపల. '18 రోజులూ ఇట్లా నువ్వు ఎప్పుడు నిద్రపోయావో, ఎప్పుడు నిద్రలేచావో, ఈ గుర్రాలను ఎప్పుడు వీటిని ఇంత బాగా తయారు చేశావో, అసలు నువ్వు రాత్రి నిద్రపోయావో లేదో' అని. నిద్రే లేదు కదా, అంతకుముందు చెప్పకున్నాం ఒక నామంలో. ప్రజాగరః ఆయన నిద్రపోడు. నిద్రపోతే కథ లేదింక. నువ్వు ఎప్పుడు నిద్రపోయావో, ఎప్పుడు లేచావో నేను దిగిన తర్వాత నువ్వు రథాన్ని తీసుకు వెళ్ళేవాడివి, పొద్దున్నే మళ్ళీ పువ్వల్లే రథాన్ని తెచ్చేవాడివి. గుర్రాలు చూస్తే అద్భుతమైన చైతన్యంతో ఉన్నాయి. అయిపోయింది కదా యుద్ధం. ఈ ఒక్కరోజుకే నువ్వు ముందు దిగు నాకన్నా రథంలోంచి, అని అడుగుతాడు. మర్యాద కృష్ణుడికి. రోజు నేనే ముందు దిగి వెళ్ళిపోతున్నాను. ఈ ఒక్కరోజుకే నువ్వు నాకన్నా ముందు దిగు తర్వాత నేను దిగుతానన్నాడు. ఏడిశావులే ముందు దిగు అని చెప్తాడు. నీకేం తెలీదు నువ్వు దిగు. నువ్వు దిగింతర్వాతనే నేను దిగడం యోగం. గుర్తు పెట్టుకోండి. ఆయన దిగిం తర్వాత మనం యిహ దిగడానికి ఏమీ ఉండదు. ఏం? అన్నాడు. ఏం అంటే 'అదంతే నువ్వు దిగు నేను చెప్తా కదా' అన్నాడు. దిగాడు. కొంచెం దూరంగా వెళ్ళు అన్నాడు. వెళ్ళాడు. ఈయన దిగాడు. ఈయన దిగంగానే ఎట్లా అంటుకుందో, ఎక్కడ నుండి అంటుకుందో తెలీదు. Human

Bomb లాగా ఒక్కసారి పేలిపోయింది. రథం. గుర్రాలు, రథం అట్లా పెద్ద మంట వచ్చింది, అట్లా అదృశ్యమైపోయాయి. నేను ముందు దిగి ఉంటే నీతో సహా అది జరిగి ఉండేది అని చెప్తాడు. మరి తర్వాత నీకు సన్మానాలేం ఉండవు. 18 రోజుల యుద్ధంలో నువ్వు గెలిచినట్టు. మరి కీర్తంతా అర్జునుడిదే కదా! పెద్ద పెద్ద సన్మాన సభలన్నీ miss అయిపోయేవాడివి నువ్వు. మిగిలి ఉండేవాడివి కావు అని చెప్తాడు. యోగ రహస్యం. అతను ఉండగానే మనం ఇందులోంచి బయటకి రావడం నేర్చుకోవాలి. అంటే శరీరంలో ప్రాణం ఉండగానే దైవం ఉండగానే దాంట్లోంచి నువ్వు బయటికి వచ్చి నువ్వు దాన్ని దర్శించగలగాలి. అదీ నువ్వు దిగు ముందు, అని చెప్పడం. అది యోగసాధన ద్వారానే జరుగుతుంది. మరొక మార్గం లేదు. మనకి మనం అనుకుంటే లాభం లేదు. మనం నిజంగా ముక్తజీవులమా కాదా అని తెలియాలంటే అదొక్కటే తార్కాణం. అర్జునుడు రథం దిగి రథాన్ని చూస్తూ ఉంటే రథం భస్మమైపోయింది. రోజూ రథం దిగాడు. చూశాడు రథాన్ని. నువ్వు కూడా అట్లాగే రథం దిగాలి. అసలు కార్లోంచి బయటికి రానంటే ఎట్లా?అక్కడే అన్నం తెచ్చుకు తిని, అక్కడే పడుకుని, ప్రతి రాత్రి మనకి తెలీకుండా మనందర్నీ బయటకి పట్టుకొచ్చేసి దాన్ని repair చేస్తూంటాడు ఆయన. మనం ఉంటే అడ్డు. నీకుగా నీకు తెలిసి నీ రథం నుండి నువ్వు బయటికి రావడమే నచికేత విద్య. అమృతత్వ విద్య, శుక్రవిద్య, మృతసంజీవినీ విద్య. మార్కండేయ విద్య. ఏమన్నా పేరు పెట్టుకోండి మీ యిష్టం. అది యోగమార్గం ద్వారా ఈ శరీరంలో ఉండగా సాధించుకోవాలి. దానికి నిర్దిష్టమైన మార్గం ఉన్నది. ఇది అతనిది. అగ్ని నుండి పుట్టించారు దీన్ని. ఈ రథం కూడా. కాబట్టే అగ్నికి సమర్పణ చేసే సాంప్రదాయం భారతీయసంస్కృతిలో ఉన్నది. మిగతా వాళ్ళేదో పాతేసి, ఏదేదో చేస్తూ ఉంటారు. అజ్ఞానమే నిస్సందేహంగా. కోప్పడి లాభం లేదు. ఎవరిది వాళ్ళకిచ్చేయాలి. అసలు ప్రతి రాత్రి యిచ్చేయమని చెప్తూంటారు. యోగంలో. నీలోని పృథివిని పృథివికి అప్పజెప్పు, జలమును జలమునకు అప్పజెప్పు. అగ్నిని అగ్నికి అప్పజెప్పు. వాయువును వాయువుకు అప్పజెప్పు. ఆకాశరూపుడవై అంతర్యామితో అనుసంధానం చెంది జీవుడుగా దైవముతో కలిసి ఉండు అని చెప్తారు. ప్రతిరోజూ రాత్రి అదే. Restitution, elimination and Integration అని మూడు మెట్లున్నాయి. ఇవి ప్రతి రాత్రి

నిర్వర్తించుకోవలసినది. పంచభూతాత్మకమైన శరీరాన్ని పంచభూతాలకి అప్పజెప్పేయ్. వాటివే ఇది. నీది కాదు. నీవు ధర్మకర్తవని నీకిచ్చారు. ధర్మకర్త అంటే ఏమిటి? ధర్మంగా వీటిని వాడుతావు అని. అలాగే Restitution, వాటిని వాటికి restitute చెయ్యి. Elimination, నీ భావములున్నాయే నీ జీవితానికి సంబంధించినవి. అవన్నీ మళ్ళీ పొద్దున్న వరకు నీకు వాటితో పని లేదుగాబట్టే తీసేయ్. ఇంకేమైంది? నువ్వు ఉంటావు. ఉత్త 'నేను' గారు మిగులుతారు. చిన్న నేను, పెద్ద నేను ఉన్నది. ఈ ప్రత్యగాత్మ ఆ విశ్వాత్మచైతన్యంతో అనుసంధానం చేసి నిద్రలోకి వెళ్ళు. నిద్ర వచ్చినప్పుడు పడుకో. నిద్రపోవాలని యావ అక్కరలేదు. Integration. పొద్దున్నే మళ్ళీ చొక్కాలాగు వేసుకున్నట్టుగా భావముల తొడుగు వేసుకో. శరీరము, పంచభూతాల్లోకి దిగు, మళ్ళీ వచ్చేసేయి. రోజూ చేస్తారు యోగులు. ఇదిట్లా వదిలేసి అట్లా తిరిగి వస్తారు. కర్తవ్యం మేరకు సంచరిస్తారు, శరీరం యిక్కడ ఉంచి. వీళ్ళంతా క్షితీశులే అంటే ఏమిటి? భగవంతుడిది ఈ శరీరం అని తెలిసి, తాను భగవంతుడికి చెందినవాడే అని తెలిసి, దైవకార్యములను నిర్వర్తించుకుంటూ శాశ్వతంగా ఉంటాడు. అందుకనే భూమీశులు, భూమిసురులు అని పేర్లు ఉన్నాయి. పేర్లు ఎవరికి? బ్రహ్మతత్త్వము తెలిసినవారికి.

1025 పాపనాశనః

ఇన్ని నామాల తరువాత పాపనాశనం గురించి ఎక్కువ చెప్పుకోవాల్సిన అవసరం లేదు. కేవలం స్మరణ మాత్రం చేత మన వికారములన్నీ కూడా సరిదిద్దుతాడు. ఒక్కసారి కళ్యాణమైన ఆ మూర్తి దర్శనం స్మరణ చేసినా, కనులు మూసుకుని, చతుర్భుజుడైన, కాంతివంతమైన మూర్తిని పాదములనుండి, కిరీటం వరకు, సమస్త అంగముల నుండి ఎటువంటి రుచులు అంటే వెలుగులు వెదజల్లబడుచున్నవో వాటిని కేవలము స్మరణ చేయటము వలన మనలో ఉండే ఆసురీ భావము హరింపబడుతుంది. సురభావము పెంపొందింపబడుతుంది. సుర కేంద్రములు ఉన్నాయి మనలో. వాటిని కప్పేసి ఉంటాయి అసురీతత్త్వములు లేక అసురభావములు. అందుకని సమర్పణ చేత మనలో ఉండే దేవతాప్రజ్ఞలు మేల్కాంచుతాయి. లోపలే ఉన్నాడని భావన చెయ్యండి. లోపలవాడు నిండి ఉంటే నిన్ను కూడా ఉండనిచ్చాడనుకుంటే వాడింట్లో మనం ఉంటున్నాం. వాడే మనంగా కూడా ఉన్నాం. అసలు వాడిదే అంతా. మనకేదో చిన్నచోటిచ్చాడు. ఉండడానికి. మొత్తం వాడుకున్నా ఏం కాదనటం లేదు. కాబట్టే వాడిని పొద్దున్నే గుర్తు చేసున్నావనుకో. ఆ కాంతివంతమైన ఆ రూపము, తేజోమయమైన ఆ రూపము ఒక్క ముహూర్తకాలం పాటు మనం సమగ్రంగా భావన చెయ్యగలిగినట్లైతే దేవతాప్రజ్ఞలు మనలో మేల్కాంచుతాయి. ఎన్నో ఉన్నాయి. శరీరం అంతా నడిపిస్తున్నది దేవతాప్రజ్ఞలే. ఆసురీప్రజ్ఞలు కొంచెం శమింపబడతాయి. అది కారణం చేత పాపపు అంటే పాపం అంటే అధర్మం. ధర్మమునకు వ్యతిరేకమైన భావములే రావు. వాక్కులంతకన్నారావు. చేతలు ఉండనే ఉండవు. ఆ విధంగా పాపనాశనం చేస్తాడు. పాపం అనేది సృష్టిలో ఎప్పుడూ ఏర్పడుతూనే ఉంటుందబ్బాయ్ అని చెప్పాడు మనకు భగవద్గీతలో. కాబట్టి ప్రతి నిత్యం కడుక్కుంటూ ఉండాలి. అగ్నికార్యమే కదా సృష్టి అంతా. సృష్టి ఒక అగ్నికార్యంగా జరుగుతున్నప్పుడు అందులోంచి బొగ్గుపులుసు పుడుతూ ఉంటుంది. Carbon products అంటాం. అన్నం తినడం మనం చేస్తూ ఉంటే మరి మనకి మలమూత్ర విసర్జనలు అవుతున్నాయి కదా! మూత్రం

కోసం మంచినీళ్ళు తాగడం లేదు. మలం కోసం అన్నం తినట్లేదు. కాకపోతే ఇదంతా జరుగుతూంటే అవి ఏర్పడుతున్నాయి కదా! ప్రణాళికలో భాగమా? అగ్నికార్యం కాబట్టి ఏర్పడుతూనే ఉంటాయి. అద్దం ఉంటే దాని మీద దుమ్ముపడడం ఉంటుంది. తుడుచుకుంటూ ఉండాలి. మలినములను ఆ విధంగా నివృత్తి చేసుకుంటూ ఉండాలి. మలిన నివృత్తి మనోమయలోకములలో జరగాలంటే ఈ తేజోమయమైన తత్త్వమును ప్రతి ఉదయం బాగా దర్శనం చేసుకోవాలి. అందుకే సూర్యుని చూస్తూ తూర్పు వెలుగును ధ్యానం చేసుకోవడం. దీపం పెట్టుకుని ధ్యానం చేసుకోవడం. కాంతిమయమైన రూపాల్ని బయట ఏర్పరచుకుని బాగా దీపాలు పెట్టుకుని ఆ కాంతిని లోపల దర్శనం చేసుకోవడం. ఎంత లోపల వెలుగు దర్శనం జరుగుతూ ఉంటే అంత చీకట్లు పోతూ ఉంటాయి. అంత మలినములు పారద్రోలబడుతూ ఉంటాయి. అలా కాకపోతే అక్కడ చేరుతూ ఉంటాయి. అందుకనే నిత్యమూ ఆరాధన చేసుకోవడము. నిత్యమూ అంటే ఏమిటి? ఎప్పుడూ అని అర్థం. నిత్యం చేస్తున్నారంటే రోజూ అరగంట చేస్తే నిత్యం చేస్తున్నాం అని చెప్పుకుంటాం మనం. పోనీ అదన్నా చేసుకోవాలి. రోజుకొక్కసారన్నా, 'రోజంతా' అనే స్థితిలో ఉంటాడు యోగి. ఇంక మరి అక్కడ చేరవు ఏమీను. ఏమన్నా చేరితే మళ్ళీ పాద్దున్నే తీసేసుకోవచ్చు. 'యదహ్నాత్కురుతే పాపం, తదహ్నాత్ప్రతిముచ్యతే.' ఏపూట కాపూట అలా గాయత్రీ మంత్రం జపం చెయ్యాలి. రజోగుణములు, తమోగుణములు విజృంభించకుండా ఉంటాయి. ఆ విధంగా మనకి ఎప్పటికప్పుడు పాపమును నాశనం చేస్తూ ఉంటాడు. పాప ప్రవృత్తి మనలో కలుగుతోందిట అంటే మనలో దైవారాధనము జరగవలసిన రీతిలో జరగట్లేదు అని అర్థం. ఇంత దైవభక్తులూ తప్పుడు పనులు చేస్తూ ఉంటారు. తప్పుడు పనులు చేసే బుద్ధి ఎక్కడ నుండి పుడుతోంది, నీలో నుండేనా? అది పుట్టడానికి తావు ఎక్కడ ఏర్పడింది? కొన్ని ప్రజ్ఞా కేంద్రములు మూసుకుపోయి, చీకట్లు వచ్చేస్తాయి అన్నమాట. అందువల్ల ఈ మలినం లోంచి పుడుతూ ఉంటాయి అవి. మలినమైన భావములు పుట్టినా, అవి కారణంగా వాక్కు, అవి కారణంగా చేతలు. దైవారాధనము పెంచుకోవాలి. అది ఆడంబరంగా ఉండకూడదు. నీవు భక్తుడవని ఊళ్ళో తెలియడం వల్ల ఉపయోగం ఏమీ లేదు.

భగవంతుడికి తెలియాలి. అవిభక్తి. అతనితో వేరుపడి స్థితిలో కాసేపు ఉండు రోజూ. ప్రతిదినం ఉండు! ఉంటే చేరవు! భయపడతాయి చేరడానికి. అసలు ఎప్పుడూ అదే నిండి ఉన్నవాడికి చేరే ప్రశ్నే లేదు. అప్పుడప్పుడు చేసే వాళ్ళ దగ్గరకి బోలెడు రంధ్రాలు ఉంటాయి కాబట్టి అందులోంచి దూరిపోతాయి. నలుడు, ఎంత ధర్మాత్ము తెలుసా! ఆయన్ని ఆవరించాలని, యుగపురుషుడు; ప్రతి యుగానికి ఒక పురుషుడు ఉంటాడు కదా. కలి పురుషుడు. పుష్కరుడు. ఎట్లాగో అట్లా ఈయన లోకి దూరి, ఈయనని దెబ్బతీయాలని, వేచి ఉన్నాడు.వేచి ఉంటే ఎలా ఈయనలో ప్రవేశించాలో తెలియలేదుట, కలికి. ఏదో ఒక రోజున సాయం సంధ్య అప్పుడు, ఇంటికొచ్చి కాళ్ళు సరిగ్గా కడుక్కోకపోతే అందులోంచి దూరిపోయాడట. సూది బెజ్జం అంత ఉంటే అందులోంచి దూరిపోయాడు నలుడి విషయంలో. సూది బెజ్జం అంత దేవుడిని దూరనిస్తే మనలో, కలియుగంలో, కలి దూరడు. కలియుగంలో అందుకనే సులభం అని చెప్పారు. ఎందుకంటే కటిక చీకటి కదా. గుడ్డి దీపమైనా బాగా వెలుగుగానే ఉంటుంది. కృతయుగం పగలు. సూర్యుడి వెలుగులో నువ్వు ఎంత దీపం పెడితే మాత్రం దారి చూపేను? అందుకనే కృతయుగం ధర్మాలకీ, కలియుగం ధర్మాలకీ, చాలా విపరీతంగా concessions ఇచ్చేశారు. అందుకని రోజూ సూది మొన అంత చోటు ఇవ్వు. ఆ వెలుగుకి!

నీవార సూక వర్తన్వీ పీతాభాః స్వత్యణుపమా .
తస్యా శిఖాయాః మధ్యే పరమాత్మా వ్యవస్థితః.

బియ్యపు గింజ పైన, చిన్న తలకాయ ఉంటుందే, అంతట. బియ్యపుగింజంత కూడా కాదు. అంత భావం చేయి చాలు. చూసుకుంటాడు. అందుకని ప్రతిదినం. మనం స్నానం చేసినట్లే, ప్రతిదినం ధ్యానం చేసుకోవాలి. ధ్యానం చెయ్యని రోజున అన్నం తినకూడదు. అట్లా పెట్టుకోండి. స్నానం లేక, ధ్యానం లేక, ఏ మొహం పెట్టుకుని అన్నం తింటున్నావురా, అని ఇంకొకరిని అనద్దు. మిమ్మల్ని మీరు చూసుకోండి. ఇంకొకరిని అనే అర్హత లేదు. ఇదంతా స్వతంత్రమే. స్వ తంత్రం. నిన్ను నువ్వు నియమించుకో. నిన్ను నువ్వు పరిపాలించుకో. నీ మీద నీకు స్వామిత్వం తెచ్చుకో. నిన్ను నువ్వు ఉద్ధరించుకో. అది కారణం చేత రోజూ ఒక్కసారి ఇలా నీ ఇష్టమైన రూపం

పెట్టుకో. నామం నీ ఇష్టమైనది పెట్టుకో. అది వెలుగు రూపమై భావన చేయి. శబ్ద తరంగములై మొత్తము దేహమంతా కూడా వాటియొక్క ప్రభావం అందుకనే అంగన్యాస కరన్యాసాలు, మహన్యాసాలు పెట్టారు. చెవిలో చూడడం, కుడి చెవిలో, ఎడమ చెవిలో, కన్నులో, ముక్కుపుటాల్లో, నాలుక మీద, పై అంగిట్లో కింద అంగిట్లో, అన్నీ కలిపేసి ప్రతిదీ ప్రతిచోటా ప్రతిష్ఠించడమే. అంతా భావం చేత అట్లా చేసుకోవచ్చు. ఒక నామం చెప్పుకోవడం, శిరస్సు ఒక నామం, నుదురు ఇంకొక నామం, కన్ను ఇంకొక నామం అంటే, ఇంకొకసారి అదే నామస్మరణ అని. ముక్కు ముక్కులో ఒక రంధ్రం, ఇంకొక రంధ్రం, నోరు, పై దవడ, కింద దవడ, నాలుక, నింపెయ్ అట్లా వరసగా. ఎడమ చెవి, కుడి చెవి, మెడ, వెన్నెముక, భుజాలు, ఛాతి, పొట్ట, బొడ్డు. కటిప్రదేశం, అట్లా పై నుండి కిందక వరకు నామం తో నింపు! అదే కవచం. అసలు మొత్తం. వాడే నిండి ఉన్నాడు అని నీకు గుర్తుంటే అది కవచం. 'కవచమితి కవచమితి పరమం పవిత్రం అని. రక్ష ఇతి రక్ష ఇతి'. అదే రక్ష. ఈ శరీరంలో ఉన్నది వాడు, వాడు నడిపిస్తున్నాడు, నేను నడుస్తున్నాను, అని గుర్తుంటే, నీకు accidents అవ్వవు. Aa విధంగా వాడిని మనం భావన చేసుకుని, పాపరహితులం అవ్వాలి! ఎందుకంటే అసలు ముందు ప్రాథమికమైన దశ ఇదే. మనలో పాపం పెరుగుతూ ఉంటే సాధన ఏ మాత్రం జరగదు. సాధనకి అంతరాయం కూడా, పాపం. పాపం అంటే, గుర్తుపెట్టుకోండి, మలినమే. అధర్మ ప్రవర్తన వల్ల వచ్చే మలినం ఒకటి, అగ్నికార్యంగా మనలో జరుగుతున్న దాంట్లో నించి పుట్టే మలినములు ఒకటి. ఇవి నిర్మూలించుకుంటూ ఉండాలంటే, ఈయనని ఒక్కసారి, భావన చేసుకోవాలి,

1026 శంఖభృత్

శంఖభృత్ అంటే శంఖమును ధరించినవాడు. 108 శ్లోకంలో యజ్ఞసాధనః అనే నామానికి చెప్పడం జరగలేదని తరువాత గుర్తించడం జరిగింది. అందుకని యజ్ఞసాధనః అంటే యజ్ఞం అంటూ చేయడానికి అవకాశం కల్పించినవాడు అని అర్థం. ఆయనే లేకపోతే యజ్ఞం లేదు. ఆయన సంకల్పించకపోతే యజ్ఞం లేదు. యజ్ఞం లేకపోతే సృష్టి కథే లేదు. జీవుల కథా లేదు. మనం ఇట్లా చెప్పుకోవడానికి కూడా ఏమీలేదు. ఈ సమస్తాన్ని ఇట్లా సాధన చేయడానికి అవకాశం యిచ్చాడు. అవకాశం ఇవ్వడం ఆయన సంకల్పించడమే. సంకల్పమే రాకపోతే ఇదంతా లేదు అని చెప్పడానికి యజ్ఞసాధనము నువ్వు అని చెప్పడం. సంభవించేట్టు చేశావు. అవకాశం కల్పించావు. అట్లాగే యజ్ఞభృత్ అన్నచోట యజ్ఞాన్ని ధరించావు. తన నుండి వ్యక్తమవుతున్నదంతా తను ధరించాడు. మనకి విష్ణుమూర్తి రూపంలో ఇది కనిపిస్తుంది. శంఖభృత్, నందకీ - ఖడ్గం, చక్రి — సుదర్శనచక్రం, శార్ఙ్గధన్వా:- శారంగమనే ధనస్సును ధరించినవాడని. సారంగపాణి అంటారు. గధాధరః- గదను ధరించినవాడు. రథాంగపాణి రథము యొక్క అంగములను ధరించిన వాడు. అక్షోభ్యః ;- ఎట్టి సమయంలోనూ కూడా విస్తుపోయే పరిస్థితి ఏమీలేదు ఆయనకి. ఆశ్చర్యపోయే పరిస్థితి లేదు. సర్వప్రహరణ ఆయుధః;- శత్రువులను జయించే సమస్తమైన ఆయుధములు కలిగి వున్నవాడు అని అర్థం. ఇది క్లుప్తంగా.

శంఖము అంటే శబ్దానికి చిహ్నం. శంఖభృత్ అంటే శబ్దమును ధరించినవాడు అంటే ప్రణవమూర్తి అని అర్థం. ప్రణవము అతడు ధరించాడు అంటే మొదటి ధారణ శబ్దము. వినికిడి, చూపుకన్నా ఎక్కువ లోతైనది. కాబట్టి తనను తాను ప్రణవంగా సృష్టించుకోవడం చేత అక్కడ నుండి ప్రాణంగా సృష్టించడం చేత, ఆ తరువాత దేహధారణ చేయడం ఇటువంటివన్నీ వస్తూంటాయి. అందుకని ముందు శంఖం చెప్తారు. శంఖచక్రగదాధరుడంటాం. చక్రశంఖగదాధరుడు అనరు కదా! భగవంతుడు ధరించిన ఆయుధములలో శంఖం మొదటి వ్యక్తరూపం. మనలో కూడా ఆ శబ్దము ప్రణవంగా వున్నది, దాన్ని వినడానికి చెవి వున్నది.

కదా! అందుకనే ధ్యానమార్గంలో ఇంద్రియాలన్నింటిలో ఏదో ఒక ఇంద్రియానికి మిగతా ఇంద్రియముల బలమిమ్మంటారు. ఐదు ఐదుగ విడివిడిగా వుంటే 5వ వంతు బలం మాత్రమే కలిగి వుంటుంది. అన్నిటి బలం ఒక్కదానికి అప్పచెప్తే దానికి 5 రెట్లు బలం పెరుగుతుంది. అందుకని ధ్యానంలో వినడమే ప్రధానంగా చెవి మాత్రమే పనిచేసేట్టు, కనులు పని చెయ్యకుండా వాసన, రుచి, స్పర్శ ఇవన్నీ వాటి బలం కూడా తీసుకు వచ్చి వినికిడికిచ్చి, ఆ వినికిడి లోతట్టున ఎట్లా వినిపిస్తోందో వింటూ వుండమని చెప్తారు. ఐదు రకాలుగా వున్నాయి ధ్యానాలు. అందులో ఇదొక రకం. అలాగే ఐదు ఇంద్రియములలో యొక్క బలములన్నీ కూడగట్టి కన్నుకిచ్చి అంతర్ముఖంగా చూస్తూండమని చెప్తారు. ఇది రెండవ పద్ధతి ధ్యానంలో. ఇవన్నీ యోగంలో చెప్పబడినవే. వినికిడికి సంబంధించిందే మంత్రోపాసన. చూచుటకు సంబంధించింది మనం అంతర్ముఖంగా ఏమున్నదో చూసే ఒక పద్ధతి. మనం అనుకున్నది చూడడం ఇంకొక పద్ధతి. ఏమున్నదో చూడు. కంటితో లోపల చూడు. లోకన్నుగా చూడు. బయటకి చూస్తే పశువని చెప్పాం. కదా! లోపల్నుంచి బయటకి చూసేది అని చెప్పడానికి పశువు అని చెప్తారు. అందుకని ఆ బంధనం నుండి తప్పించుకోవడానికి బయటకి చూసే ఇంద్రియం ఏదైతే వున్నదో దాన్ని అంతర్ముఖం చెయ్. అలాగే చెవి. బయట విషయాలు వినడానికి ఎక్కువ ఆసక్తి. చెవి కొరుక్కుంటూ వుంటాంగా. ఆ గదిలో మాట్లాడుకుంటూ వుంటే ఈ గదిలోంచి ఎట్లాగైనా వినాలనిపిస్తూ వుంటుంది. ఏం మాట్లాడుకుంటున్నారో? తన గురించి ఏమైనా మాట్లాడుకుంటున్నారా? రహస్యాలు మాట్లాడుకుంటున్నారా? మనని కాదని మాట్లాడుకుంటున్నారంటే అందులో మనం వినవలసింది ఏదో వుండి వుంటుంది. ఇట్లాంటివన్నీ పెట్టుకుని అట్లా చెవులు వినాయకుడు లాగా బాగా విస్తరించి వినడానికి ప్రయత్నం చేస్తాం కదా! ఈ చెవితో అంతర్ముఖంగా వినడం చెయ్యాలి. ఈ రెండు ప్రధానమైన ధ్యానాల్లో చెప్తారు. మూడవది స్పందనం మీద మనస్సు వుంచడం. నాలుగవది ఆలోచనల పుట్టుక స్థానంలో మనస్సు ఉంచడం. అయిదవది పరిశీలనము. ఇలా శ్రవణము, దృశ్యము, మననము, (మంత్రమును మననము చేసుకోవడం) స్పందనము, పరిశీలనము. ఇవన్నీ కూడా ఆయన వేసుకున్న తొడుగులు. మొదటి తొడుగు

శబ్దం. దానికి సంకేతంగా నేను శంఖాన్ని ధరించి వున్నాను అంటే అర్థం ఏమిటంటే శబ్దమును ధరించి వుండడం అని. అందుకని శంఖానికి ఆ పవిత్రత ఏర్పరచారు ఋషులు. వైఖానఃఅనే నామంలో చెప్పుకున్నాం శం అంటే ఏమిటి ఖం అంటే ఏమిటి అని. ఖం అనేది వ్యాపనము చెందే ప్రజ్ఞ. ఖం అనే అక్షరము బీజాక్షరము. దాని యొక్క సరళ రూపమే 'గం' అనే గణపతి మంత్రంలో వుండే గణపతి బీజాక్షరము. అది పరుషముగా వున్నప్పుడు 'ఖం' అవుతుంది. ఆకాశం నుండి పంచభూతాత్మకమైన సృష్టి వ్యక్తం కావాలంటే ఖం అనే శబ్దాన్ని చేసుకోవాలి. దేని వలన ఆ శబ్ద తరంగములు లోపల మనకు జరుగుతూ వుంటాయో అదే ప్రణవము. దాని వలననే ప్రాణము. అది ధరించి వున్నవాడు ఎవరు? మనలోని తత్త్వము. అందుకని తత్త్వమునకు మొదటి తొడుగుగా మనకి శబ్దాన్నిస్తారు. అందుకనే విష్ణుమూర్తి యొక్క శంఖాన్ని దర్శనం చేసినపుడు ఈ భావం రావాలి మనకి. ఏం చెప్తున్నది విష్ణుమూర్తి శంఖం అంటే లోశబ్దమును విను. అనాహతమును విను. ఆహతము కానిది, ఎవరూ చప్పుడు చేయకయే ఎప్పుడూ వున్న శబ్దాన్ని వినడానికి ప్రయత్నం చెయ్యి. వినడం కన్నా మించింది లేదు. బ్రహ్మ వింటాడు, చూడడు కదా! సృష్టికి ఒక పెద్ద సమస్యగా ఎవరన్నా తయారైతే, crisis ఏర్పడితే దేవతలందరూ వెళ్ళి (ఇంద్రాది దిక్పాలకులంటాం) మొరపెట్టుకుంటే బ్రహ్మ కనులు మూసుకుని వింటాడు. విని వస్తాడు. రక్షిస్తాడు. మీరు మీరు ఈఈ అంశలతో పుట్టండి, అని చెప్తాడు. మహాత్ములు కూడా పరలోకాల్లోంచి వినడం వుంటుంది. రహస్యమైన, పవిత్రమైన ఆశ్రమముల నుండి వినడం వుంటుంది. మన భూమికి ప్రభువుగా వున్న సనత్కుమారుని యొక్క ప్రజ్ఞ శంబళ అనే గ్రామములో వున్నది. శంబళ అనే పేరు రూపాంతరం చెంది అలా తయారయ్యింది. దాని అసలు నామము 'శ్యామబాల'. ఈ భూమికి చాలాసార్లు ప్రళయాలు వచ్చినాయి. వచ్చినా కొంతమంది చిరంజీవులు అప్పట్నుంచి ఇప్పటివరకు భూమి మీద వున్నవాళ్ళు వున్నారు. అటువంటి వాళ్ళలో మార్కండేయుడు ఒకడు. భూమంతా జలమయం అయినపుడు ఆయన అట్లా తిరుగుతూ వుంటే అక్కడ వొకాయన నీలమేఘశ్యాముడి వలే, పసిబాలుడి వలే తేలుతూ వున్నాడట. ఓహో శ్యామబాలుడు అనుకున్నాడట. సనత్కుమారుడు. సనత్కుమారుడు భూమికి

విష్ణు అంశ. భూమి మీద విష్ణువు అవతరించాలంటే ఈయన శరీరంతో అవతరిస్తాడు. సనత్కుమారుడు విష్ణు అంశగా శుక్రగ్రహం నుండి ఇక్కడికి వచ్చి మనల్ని పరిపాలిస్తున్న ప్రభువు. ఆయనతో సహకరించి పనిచేస్తున్న వాళ్ళే సమస్తమైన గురుపరంపర. ఆ శ్యామబాలుడు వుండే ప్రదేశాన్నే శంబళ అన్నారు. గోబీ desert అంటాం కదా! గోబీ ఎడారి. గోబీ అంటే గోబీ కాదు అది గోపి. గోపి ఎడారి గోబీ ఎడారి అయ్యింది. గోపి అంటే గోపనముగా వున్నది అని అర్థం. గోపనము అంటే రహస్యముగా వున్నదని అర్థం. కైలాసానికి ఉత్తరదిశగా భూగర్భంలో సూక్ష్మమైన లోకంలో శంబళ గ్రామం వున్నది. విష్ణు యశస్సుకి పుట్టి అక్కడ్నించి కల్కి దిగి వస్తాడని కదా చెప్తారు. విష్ణు యశస్సు అంటే ఏమిటి? విష్ణువు కీర్తే. ఇవంతా శంబళ గ్రామము, సనత్కుమారుడు ఆ ప్రజ్ఞకు సంబంధించినవే. అక్కడ వింటూ వుంటాడు. ఆయనే పైన వింటూ వుంటాడు. పరమగురువులంతా శంబళ గ్రామంలో వింటూ వుంటారు. 'అక్కడ్నుండి ఆజ్ఞ ఏమి వస్తుందో' అని. గురు ఆశ్రమముల నుండి వారి అనుయాయులు వింటూంటారు. వారి దగ్గర నుండి భూమి మీద పని చేస్తున్న మహాత్ములు వింటూంటారు. విని చేస్తూ వుంటారు. ఎవరెవరు చేయవలసినవి వారు విని చేయుటయే. బ్రహ్మ దగ్గర నుండి అందరూ వినడమే పెట్టుకున్నారు. 'చూడడంలో మోహపడడం వుండవచ్చు, వినడంలో వుండదని' ఒక అవగాహన. అందుకని విష్ణుమూర్తి రూపంలో ఒకటి శంఖము అని ముందు చెప్పారు. తరువాత చక్రము. పైగా ఆ విష్ణుమూర్తి శంఖమునకు పేరేమిటి? పాంచజన్యము! సృష్టిని పంచీకరణముగా జనింపచేసే తత్త్వమంతా కూడా శబ్దములో ఉన్నది అని చెప్పడానికి శ్రీకృష్ణుని యొక్క శంఖమును పాంచజన్యము అన్నారు. 'పాంక్తం వా ఇదగ్ం సర్వం పాంక్తేనైవ పాంక్తంగ్ స్పృణోతీతి' అని మహాభారతంలో ఒక శ్లోకం వున్నది. సమస్తము 5,5,5,5గా ఏర్పరచారని. ఈ కనబడుతున్న సృష్టి అంతా ఐదే అన్నారు. మూడే అన్నారు ఒకసారి. ఏడే అన్నారు ఒకసారి. కాదు తొమ్మిది అన్నారు. ఋషులు ఒకే సత్యాన్ని ఇన్ని రకాలుగా దర్శించి యిచ్చారు. ఒకటే అంటారు ముందు. రెండే అంటాడు. అంటే పురుషుడు, ప్రకృతి. కాదు కదా మూడు అంటాడు. క్షర పురుషుడు, అక్షరపురుషుడు, పురుషుడు కాదు కదా నాలుగు అంటారు. అట్లాగే ఐదు. ఎమిటి ఐదు? మన

శరీరంలోనే కనిపిస్తాయి. పంచకర్మేంద్రియాలున్నాయి. పంచజ్ఞానేంద్రియాలున్నాయి. పంచభూతాలున్నాయి. పంచ తన్మాత్రలున్నాయి. పంచారముగా సమస్తమును ఏర్పరచడాన్నే పంచాక్షరీ మంత్రం, తద్వారా పంచభూతముల మీద స్వామిత్వం.

యో రుద్రో అగ్నౌ యో అప్సుయ ఓషధీషు యో
రుద్రో విశ్వాభువనా వివేశతస్మై రుద్రాయ నమో అస్తు.

అన్నప్పుడు అర్థం ఏమిటయ్యా అంటే ఏ తత్త్వమైతే, ఏ వెలుగైతే అగ్నియందున్నదో, ఓషధుల యందున్నదో, నీటి యందున్నదో, వాయువునందున్నదో ఆకాశము, పృథివి యందున్న ఓషధులయందున్నదో, అన్నిటి యందు నిండి వున్న ఆ ప్రజ్ఞకి నేను నమస్కారము చేస్తున్నాను. పంచీకరణము అనేది మనకి చాలా పెద్ద అంశము. సృష్టి అవగాహనకు ఒక మార్గము. అందుకని సమస్తము పంచీకరణంగా దింపుతాడు. పంచభూతాత్మకమైన సృష్టి అయినా, మన శరీరమైనా! దీన్నంతటినీ పుట్టించేదెక్కడ నుండి? శబ్దంలోంచి! అందుకని కృష్ణుని యొక్క శంఖము పాంచజన్యము. తనకు తానుగా పుట్టించగలడు వీటినన్నింటినీను. అర్జునుని యొక్క శంఖము దేవదత్తము. మనకివ్వబడింది దేవదత్తము. మన శరీరము మనకివ్వబడింది. పంచభూతములతో తయారు చేయబడి, పంచేంద్రియములు, కర్మేంద్రియములు, తన్మాత్రలు అన్నీ ఏర్పరచి నీకిచ్చి అందులో వుండమన్నాడు. అందుకని నీ శరీరం దేవదత్తం. అందుకని అర్జునుని యొక్క శంఖాన్ని దేవదత్తం అన్నారు. కృష్ణుని యొక్క శరీరము పాంచజన్యము. కారణమేమిటంటే ఎవరూ ఇవ్వలేదాయనకి. ఆయనే తయారు చేసుకున్నాడు. ఏఏ శబ్దములను ఉచ్చరించడం వలన తన వంటి ఉత్తమోత్తమమైన వెలుగు, వెలుగుని అందుకోగలిగిన సృష్టికాధారభూతమైన పంచభూతములను ఏర్పరచవచ్చునో తాను నారదునికి తెలిపితే, నారదుడు పరాశరునికి తెలిపితే, పరాశరుడు, వ్యాసుడు, మైత్రేయుడు, మరువు, దేవాపి ఇటువంటి ఋషులందరూ కూడా చాలా దీక్షతో ఈ శబ్దములను ఉచ్చరించడం చేత, ప్రత్యేకమైన పంచభూతములతో తయారు చేయబడిన శరీరమొకటి ఏర్పడి, అది దేవకీదేవి గర్భంలో పెరుగుతుంది. అది కృష్ణుని యొక్క జననానికి వుండే ఒక

ప్రత్యేకత. ఎందుకంటే భూమినావరించి వున్న పంచభూతములు, ఇంత వెలుగుని భరించలేవు. అందుకని అప్పటికప్పుడు వేడివేడిగా అంటామే, అలా తయారు చేయించాడు. నారదుడు ఉపదేశం చేశాడు. పరాశరుడు ఆచరించాడు. చిట్టచివరికి యీ శబ్దాచ్చారణలో నాయకుడైనవాడు తనను తాను పురుషమేధంగా సమర్పణ చేసుకోవాలి ఆ శబ్దములకు. అందుకని చివరిశబ్దము ఉచ్చరించినవలసిన రోజున పరాశరుడు గుహలోకి వెళ్ళి ఉచ్చరిస్తాడు. మళ్ళీ అక్కడ్నించి ఆయన ఏమై పోయినాడో తెలియదు. లోపలికెళ్ళి చూస్తే చోటుంది అంతే. అలా ఋషులు యజ్ఞార్థం పురాణపురుషుని యొక్క అవతారం కోసం కృషి చేశారు. ఆ విధంగా శబ్దము చేత సృష్టి చేయబడిన శరీరములో తాను వచ్చి ఆపాదించుకున్నాడు. అందుకనే ఆ శరీరముతోనే దివ్యమైన కార్యములు చేస్తాడు. బయటకి కనిపించేదేమో దేవకి గర్భం లోంచి వచ్చిన శరీరం. పూతనని చంపినా, శకటాసురుని చంపినా, తృణావర్తుని చంపినా, మరొకడిని చంపినా, కాళీయుని మర్ధించినా, ఆ శరీరముతోనే! వెనకాల అది ఆధారంగా ఇది కనిపిస్తూంటుంది. అది కనిపించదు. అది యోగులకి మాత్రమే కనిపిస్తుంది. ఒక దివ్య శరీరము ఈ శరీరాన్ని ఆపాదించుకుని వుంటే అందులో ఆయన వుండి చూసేవాళ్ళకి ఇది కనపడుతుంది, చేసే పనులన్నీ అది చేస్తూంటుంది. అందుకనే శ్రీకృష్ణుడికి ప్రాకృత శరీరము, అప్రాకృత శరీరము అని రెండు వున్నాయని చెప్తారు. తనను కోరిన వారందరికీ అప్రాకృత శరీర స్పర్శనిచ్చి దివ్యానుభూతి కలిగించాడు తప్ప, ఈ భౌతికమైన శరీర స్పర్శను పొందామని వాళ్ళు అనుకున్నారు. ఇచ్చింది అప్రాకృత శరీరస్పర్శ. అది సరాసరి వీర్ని దివ్యానుభూతిలో నింపింది. ఇవన్నీ ఎందులోంచి జరిగినాయయ్యా అంటే శబ్దము యొక్క ప్రజ్ఞ. He who knows sound knows all అని చెప్పి వేదం లో ఒక వాక్యం వుంది. పరమగురువులు చెప్తే మీకు చెప్తున్నా. ఎందుకంటే వేదంలో వుంటే మరి సంస్కృతంలో చెప్పచ్చు కదండీ మీరు అని అనచ్చు. He who knows sound knows all. శబ్దము చేత సమస్తమును సృష్టి చేయడం, శబ్దము చేత సమస్తమును ధ్వంసం చేయడం. ఇవన్నీ మన పెద్దలకి తెలిసి వుండేది ఇది వరకు. అలాగే మయ నాగరికతలో కూడా తెలిసి వుండేది. శబ్దము చేత పెద్ద పెద్ద బండరాళ్ళను

అక్కడ్నించి ఇక్కడికి, ఇక్కడ్నుండి అక్కడికి ఆకాశగమనం చేయిస్తూ వుండేవారు. హనుమంతుడు ఒక్కసారి కొండను పెకలించి చేత్తో పట్టుకొచ్చాడట అంటే శబ్దము చేత దాన్ని దూదిపింజంత తేలిక చేసుకుని, తీసుకొచ్చి, పనికానిచ్చిన తర్వాత మళ్ళీ అలాగే తీసుకు వెళ్ళి అక్కడ పెట్టేస్తాడు. ఇలా శబ్దము యొక్క జ్ఞానము సమస్తము భగవంతుని యొక్క శక్తులలో ఒకటి. ఈ శబ్దాన్ని ధారణ చేస్తున్నవాడు. అందుకని శంఖభృత్. ఇంకా శబ్దము గురించి ఎన్నయినా చెప్పుకోవచ్చు. మనసినిమాల్లో చూశాం కదా! ఋషులు కమండలం లోంచి నీళ్ళు చేతిలో పోసుకుని ఇట్టా చల్లి అంటే, అయిపోతుంది కదా! ఎట్లా అయిపోతుంది? శబ్దం తెలిస్తేను. ధర్మరాజు సింహాసనం అధిష్ఠించడానికి వెళ్తూ వుంటే ఏ మొహం పెట్టుకుని సింహాసనం ఎక్కుతున్నావు అని సభకు వచ్చిన వాళ్ళల్లో కొంతమంది ఆపి, నిలబెట్టి దుయ్యబడ్తారు. కలి ప్రేరణ చేత ఈ ధర్మరాజు సింహాసనం ఎక్కకుండా చాలా ప్రయత్నాలు జరుగుతాయి. అందులో ఇదొకటి. ఈ విధంగా దూషణ చేస్తుంటే ధర్మరాజు కృంగిపోతాడు. కృంగిపోతుంటే పక్కన వున్న సద్బ్రాహ్మణులకు వేరే దుష్టశక్తులు ధర్మరాజు సింహాసనం ఎక్కకుండా చేస్తున్న ప్రయత్నం ఇది అని తెలిసి, కొన్ని మంత్రములు చదివితే అక్కడ చేరి ఈ దూషణ చేస్తున్నవారందరూ భస్మమై పోతారు. ఏదో పుక్కిటి పురాణంలాగా అనిపిస్తుంది. కానీ అది ఒక శాస్త్రము. దానికి సంబంధించిన జ్ఞానం వున్నది. నాలుగు మంచిమాటలు మాట్లాడుకుంటేనే మనకింత బాగుంటుందే, అంతకన్నా నాలుగు చెడ్డ మాటలు ఎవరన్నా మనల్ని అంటే ఉన్నదంతా కలతబారిపోతుంది. మాటేగా! You are a fool అన్నారనుకోండి ఎవరన్నా. You are a scoundrel అన్నారనుకోండి ఎవరన్నా. ఎంత ఉన్నదంతా ఉన్నదంతా కలతబారిపోలే? దేన్నుండి కలతబారింది? శబ్దము నుండే. శబ్దముతో కలతబారేటట్లు చేయడం కానీ, శబ్దముతో నాశనం గానీ చేయవచ్చు. శబ్దముతో సృష్టి చేయవచ్చు. శబ్దముతో పెంపొందించవచ్చు. ఇప్పుడు మనం ఇక్కడ పలికే శబ్దము వల్ల మనలో ఒక రకమైన స్ఫూర్తి కలుగుతూ వుంటుంది. లేకపోతే ఇన్నిసార్లు రాము వీటికోసం. ఇన్ని వేల సంవత్సరాలు ఇవి నిలబడవు కూడాను. స్తోత్రములు వేలాది సంవత్సరముల నుండి, అభివృద్ధి చెందుతున్న మానవుడి చేతుల్లో పడ్డా కూడా, నాశనం

కాకుండా ఇంకా వున్నాయి కదా! ఎలా మిగిలినాయి? అంటే వాటిలోంచి ఆ స్ఫూర్తి వస్తుంది. పునర్నిర్మాణం లోపల సాత్వికంగా జరుగుతూ వుంటుంది. మనస్సును మళ్ళీ అయస్కాంతీకరణం చేస్తాయి. చక్కటి స్తోత్రములు చక్కటి సూక్తములు, చక్కటి కీర్తనములు, శ్రవణములు విన్నా చాలు, అన్నా చాలు. అని వింటే మరీ మంచిది. అలా మనకిచ్చారు ఎన్నో. అందుకనే మొట్టమొదట సూక్తములు యొక్క ఉచ్ఛారణము చేయుట అనేది మొదటి అంగంగా ఇస్తారు. బాగా గంట సేపు చెయ్యాలి రోజూ. చేస్తే శరీరము పునర్నిర్మాణమవుతుంది. అంటే దాని సహజమైన పదును దానికి దక్కుతుంది. ఆ పదును మీద మీరు మిగతావి చెయ్యండి. అందుకనే శిక్ష మొదటి అంగము. 'శిక్షాం వ్యాఖ్యాస్యామః' అని మొదలు పెడ్తాం తైత్తిరీయోపనిషత్తు. శిక్ష అంటే ఉచ్ఛారణ. ఉచ్ఛారణ బాగున్నవాళ్ళు ప్రపంచాన్నంతా జయించవచ్చు. వాక్కుతో సమస్తాన్నీ జయించవచ్చు. వాక్కుతో సమస్తాన్నీ పొందవచ్చు. మృదుమధురమైన భాషణం చేయగలిగిన వాడికి శత్రువులుండరు. మన శత్రువుల్ని నోటితోనే తెచ్చుకుంటూంటాం. ND అంటే నోటి దూల అంటూంటాం చూశారా! తోచక వాడ్నీ వీడ్నీ వాడు లేకుండా అంటాం. వాడి ముందనే దమ్ము లేదుగా. విన్నవాడికి వాడికి చెప్పేంతవరకు ఏం తోచదు. ఎట్లాగోఅట్లా చెప్పాలి. చెప్పినట్లుండాలి, చెప్పనట్లుండాలి. చెప్పాలి మొత్తానికి. ఇట్లా వెళ్ళిపోతూంటాయి. ఇంకక్కడ నుండి మొదలవుతుంది. Sound అనే పుస్తకంలో దాదాపు మనకు మహర్షులు శబ్దం గురించి ఏమి చెప్పారో, దాని సంబంధించిన నియమాలూ, అది ఎట్లా సాధించుకోవాలో యిచ్చాం. అక్కడ్నుండే బీజాక్షరాలు, బీజాక్షరాల కూడికే మంత్రాలు. వాటిని పోగేసుకుంటే కొన్ని సూక్తములు. వాటిని కొంచెం పలచన చేసుకుంటే స్తోత్రములు, వాటిని ఇంకా పలచన చేసుకుంటే సంకీర్తనలు, మరి కొంచెం పల్చగా చేసుకుంటే భజనలు. ఇలా వుంటాయి. అన్నిట్లోనూ దాని ప్రభావం వుంటుంది. అంతకంతకూ ఒకదానికొకటి పలచబడుతూ వుంటుంది. ఎందుకంటే బీజాక్షరము ముట్టుకుంటే కాలిపోయేట్టుగా ఉంటుంది. భజనలు, సంకీర్తనలు ఎవరైనా చేసుకోవచ్చు. స్తోత్రములు చేయాలంటే ఉచ్ఛారణ బాగుండాలి. ఒత్తులన్నీ పలకగలిగి ఉండాలి. లేకపోతే చెయ్యకు. భజనలు

చేసుకో. అందరికీ అన్ని అక్షరాలూ పలకవు అంటే ఆ శరీరం దానికి అట్లా నిర్మాణం కాలేదు. అందుకనే చిన్నతనం నుండి అక్షరముల యొక్క ఉచ్ఛారణ స్పష్టంగా ఉండేట్టుగా ఉపాధ్యాయుడు నేర్పాలి. పిల్లలు నేర్చుకోవాలి. కొంతమందికి కొన్ని పలకవు. మనకు పలికేవాటిలో దాదాపు ఓ పాతికశాతం పాశ్చాత్యులకు పలకవు. కాబట్టి ఈ శబ్దం మార్గం వాళ్ళకి పనికిరాదు. స్తోత్రములు వచ్చేసరికి ఉచ్ఛారణ సరిగా ఉండాలి. సూక్తాలు వచ్చేసరికి ఇంకా నిశితంగా వుంటుంది. అక్కడ్నుండి మంత్రములు, అక్కడ్నుండి బీజాక్షరములు ఇలా ఉంటుంది. ఇదీ శ్రేణి. ఇవన్నీ దిగివచ్చేవి శంఖంలోంచి అని చెప్పడానికి శంఖం/ పాంచజన్యము గుర్తుగా ఇచ్చారు.

1027 నందకి

నందకి అంటే పదునుగలిగిన ఆయుధము అని అర్థం. అందుకని కత్తి అంటాం మనం. వాడు కత్తిలాంటివాడంటాం. అంటే ఏమిటి అర్థం? పదునైన తెలివి కలిగినవాడని అర్థం. అంతే కదా! వాడి మెదడు పదునుగా ఉన్నది అని చెప్పడానికి వాడు కత్తిలా పనిచేస్తాడు అంటాం. తెలియకే కొన్నికొన్ని లోతైన విషయాలు మాట్లాడుతూ ఉంటాం. నందకే యొక్క తత్త్వం అది. చాలా పదునైనది. భగవంతుని బుద్ధి కుశలత, దాని పదును మనం ఎన్ని రకాలుగా చెప్పుకున్నాం. హిరణ్యకశిపుడు అడిగిన వరాలకి ఏ విధంగా అవతారము దాల్చాడు? కృష్ణుడు ఎంత పదును చూపించాడూ? ఎక్కడికక్కడే, ఎక్కడికక్కడే నిశ్చేష్టులైపోయారాయన పదునుకి. అసలు ఈ సన్నివేశంలో ఈయన ఎట్లా బయటపడతాడో చూద్దాం అనుకున్నచోటల్లా కూడా వీరెవ్వరికీ ఊహకందని పద్ధతుల్లో నిర్వర్తించి చూపించాడు. అది ఎంత తెలివి ఉంటే వీలుపడుతుంది? భగవంతుని యొక్క నందకము అంత పదునైనది. అందుకని మొదట వినికిడి. అది కారణంగా పదును. గుంటూరు జిల్లాలో కొల్లూరు అనే గ్రామం ఒకటి ఉంది. అక్కడ పిల్లలకి మెదడుకి పదును పెట్టడానికి 14 సంవత్సరాల వరకు వేదం విపరీతంగా వాళ్ళ చేత వల్లె వేయించేవారు. పదునెక్కిన మెదడుతో వారప్పుడు మన పిచ్చి చదువులు అన్నీ రెండేళ్ళల్లో చదివేసే వారు Matric వరకు. అంటే పిచ్చి అంటే పిచ్చికాదు. దాంతో పోల్చి చూస్తే అట్లా ఉంటుంది. అంతకన్నా ఏమీ లేదు. దూషించకూడదు ఈ చదువును కూడా. ఇక్కడ నానా కుస్తీ పట్టి చదువుతున్నాం కదా ఇది. వాళ్ళు రెండేళ్ళల్లో ఔపోసన పట్టేసినట్టుగా ఈ పదేళ్ళ చదువూ చదివేసి Matric వెళ్తే రాష్ట్రంలో మొదటి శ్రేణుల్లో వచ్చేవాళ్ళు మంచి మంచి ranks లో. అక్కడ్నించి సరాసరి Intermediate చేసి Engineering చేసి లేదా Doctorలు చేసి ఇలా మొత్తం కొల్లూరులో వేదపఠనం చేసినవాళ్ళంతా మా తరం వారు, మాకన్నా కొంచెం ముందు తరం వారు అందరూ America వెళ్ళిపోయారు. వారు వెళ్ళిన దారి గురించి నేను మాట్లాడ్డం లేదు. పదును గురించి మాట్లాడుతున్నా. 10 ఏళ్ళు చదివేది 2 ఏళ్ళలో చదువుకున్నారు, ఒకటి. 10 ఏళ్ళు చదివినవాళ్ళ కన్నా బాగా

మార్కులు తెచ్చుకున్నారు, రెండు. జీవితమంతా పదునుగా జీవించడానికి కావలసిన వనరులు చేకూర్చుకున్నారు. ఇది ఎక్కడ్నుంచి వచ్చింది? వినికిడిలోంచే! వేదం అంటూ వినాలి. అందుకని శంఖం తర్వాత నందకం. మనలో ఉన్నది ఆ తెలివి. తెలివి బాగా పెరగాలన్నా కూడా మనకు ఇవ్వబడిన సూక్తములు బాగా ఉపయోగపడ్తాయి. ఏదో లంక మేత గోదావరి ఈత అన్నట్టుగా లంగరులేకుండా ఋషులు మాట్లాడినట్టుగా ఉంటుంది. మనకి తెలీదు. వాళ్ళకి తెలుసు. మనం ఇక్కడ్నుండి ఓ number తిప్పి phone చేస్తే ఎక్కడో Americaలో ఉన్నవాడు మనతో మాట్లాడుతున్నాడు కదా! మామూలుగా ఎట్లా సాధ్యం? అడుగు ? ఏంటి ఈ numbers కి, వాళ్ళు మాట్లాడడానికి connection? Television ద్వారా Americaలో, Australiaలో ఏం జరుగుతోందో తెలుస్తోంది కదా! వీళ్ళు భౌతికంగా తీసుకురాగలిగారు. వాళ్ళు సూక్ష్మలోకాల్లో ఈ అమరికలన్నీ గమనించి ఇచ్చారు. అందుకని నీలో పదును పెరగాలంటే నీ ఉచ్ఛారణ బాగా ఉండాలి. పిచ్చి పిచ్చి మాటలు మాట్లాడేవాళ్ళు ఉచ్ఛారణ చెయ్యనేలేరు. వేదాంగాలలో శిక్ష అనే అంగం బాగా అనుసరించడం వలన, నందకం అంటే పదునేర్పడుతుంది. దాంట్లోంచి వస్తుంది తెలివి. ఆ తెలివిలోంచి వస్తుంది చూపు. ఉన్నది ఒక్కొక్కడు ఒక్కొక్కరకంగా చూస్తాడు కదా! అక్కడే చాలా మందికి కనిపించనివి ఒక్కడికి కనిపిస్తాయి.

1028, 1029, 1030, 1031 చక్రి, శార్ఙ్గధన్వా, గదాధరః, రథాంగపాణిః

సుదర్శనం అంటే వీటి మధ్య ఎలా ఒక దారం ఉన్నదో చూపిస్తున్నాడు. శంఖభృత్ నందకీ అంటే నందకీ భృత్ కూడా. ఈ భృత్ దానికీ దీనికి. చక్రము ధరించాడు కదా! ఏమిటా చక్రము? సుదర్శనము. సుదర్శనము అంటే చక్కని దర్శనమును ఇచ్చేది అని అర్థం. నీవనుకున్నది చూడడం కాకుండా ఉన్నది గోచరిస్తుంది. అంటే అపోహపడడం ఉండదు. మనకంతా అపోహలే కదా! ఒకటి చూసి ఒకటి అనుకుంటూ ఉంటాం. ఉన్నది చూడం. లేనిది ఉన్నట్టుగా ఉంటుంది. ఉన్నది లేనట్టుగా ఉంటుంది. అందుకని ఉన్నది చూడడానికి పనికి వచ్చేది చక్రం. కాలచక్రంలో ఏవేవి ఎట్లా జరుగుతున్నాయో సమస్తమూ తనకి దర్శనమిస్తూంటే అందులో తన వంతు కర్తవ్యం నిర్మలంగా, నిరాడంబరంగా, మౌనంగా నిర్వర్తిస్తూంటాడు. 'నా దగ్గర ఉందిరా చక్రం. నేనే తిప్పుతున్నాను' అని మనకి సంకేతం విష్ణువు యొక్క రూపం. మనకి భాగవతంలో కానీ, వేదవ్యాసుడు యిచ్చిన పురాణంలో కానీ విష్ణుమూర్తి యొక్క రూపంలో ఇవన్ని చక్కగా మనకి కనిపిస్తాయి. ఇవన్నీ సంకేతార్థములే. వేదములో ఉండే సంకేతములే అన్నీ సమగ్రంగా పోగేసి విష్ణుమూర్తి రూపంగా ఇచ్చారు మనకి. ఏదో రకంగా మనల్ని గట్టెక్కించడానికి చేసే ప్రయత్నాలు ఇవి. మనకి సహస్రనామములో విష్ణుమూర్తి అంగముల యొక్క వర్ణనలు చాలా వచ్చాయి. ఇప్పుడు మళ్ళీ చివరికి అక్కడకే వస్తున్నాడు. చివరి రెండు శ్లోకాలు ఆయన యొక్క రూప వర్ణనే! అవంతా సంకేతార్థములే! కాబట్టి ఈ శబ్దము, వినికిడి, దాని యందు మేధస్సు పెంపొందించడం వలన తెలివి, అది కారణంగా చక్కటి చూపు. ఏది చూడవలెనో అది నిశితంగా చూడడం, మిగతావి పట్టించుకోకపోవడం, సత్యదర్శనం చేయడం. ఉన్నది కనిపిస్తుంది. నీవనుకున్నది మాయ తప్ప ఉన్నది సత్యమే! అందుకని ఉన్నది ఉన్నట్లు గోచరించడం అనే చక్కటి దర్శనము నీవు కలిగి ఉంటావు. ఆ దర్శనం నీకు కాలం రూపంలో కనిపిస్తుంది. 'కాలచక్రం యొక్క దర్శనం' అంటారు. 'కాలజ్ఞానం' అంటారు. కాబట్టి చక్రధారణం చేసినవాడు. మనల్ని కూడా కాలమే తిప్పుతోంది.

తెలిసినవాళ్ళు తిప్పతున్న కాలాన్ని చూసి అందులో తిరక్క, తమవంతు కర్తవ్యం నిర్వర్తిస్తూంటారు. వారూ సిద్ధులు. సారంగపాణి అంటారు. దాన్నే శార్ఙ్గము అంటారు. అది విష్ణుమూర్తి యొక్క భ్రూమధ్యము. తర్వాత కనుబొమ్మలు/ eyebrows మధ్య ఉండే భాగము, eyebrows కలిపితే విల్లు అవుతుంది. ఆ భాగం విల్లుట. అక్కడి నుండి ఆయన సంధించి పనిచేస్తాడు. మనమైనా అంతే. మనమైనా ఆజ్ఞాచక్రం నుండే పనిచేస్తాం. ఆ తర్వాత గద. ముందు ఇవి ముఖ్యం. చెవి, మెదడు, కన్ను చెప్పారు. ఆ తర్వాత భ్రూమధ్యం, భృకుటి చెప్పారు. అక్కడి నుండి గద. గద అంటే తలకాయ, వెన్నెముక. Cerebro-spinal system. ఈ విధంగా మొత్తం ధరించి ఉన్నాడు మనని. మన యందు ఇవన్నీ ఆయన ధరించి ఉన్నాడు. మన రూపమే! మన రూపం అంటే ఆయన రూపమే. ఇలా తయారుచేసి మన రూపం అనుకుంటే అనుకోనిస్తున్నాడు అంతే. మనది అనుకో అని ఆయన చెప్పలేదు. మనం అనుకుంటున్నాం. అనుకుంటే అనుకోనిచ్చాడు. మన పరిభాషలో మన రూపాన్నే దర్శనం చేయాలి. అంటే మనలో అతడే ఈ విధంగా ఉన్నాడు. రథాంగపాణి అంటే అర్థం అది. ఈ రథంలో (అంటే మనలో) ఉండే సమస్త అంగములను ఆయన ధరించి ఉన్నాడు అని చెప్పడం. ఎన్ని ధరించాడు? శబ్దంగా వచ్చాడు. అక్కడి నుండి ప్రాణంగా వచ్చాడు. ప్రాణంగా వచ్చి పంచప్రాణములుగా వచ్చాడు. అలా వచ్చి జీవుడిగా దిగి వచ్చాడు. వచ్చి హృదయంలో ఉన్నాడు. హృదయం నుండి వంద ప్రాణములు శరీరమంతా వ్యాపించి ఉంటాయి. వంద నాడుల్లో మళ్ళీ ఒక్కొక్క నాడికి వంద చిల్లర నాడులున్నాయి. అంటే మొత్తం ఎన్ని అయినాయి. 100 × 100 = 10000 మళ్ళీ వీటికొక్కటికీ 72 అలా 720000. ఈ లెక్కలే చిదంబరం గుడి గోపురం మీద ఒరలు ఒరలుగా, పాలుసులు పాలుసులుగా వేశారు. మన శరీరంలో ప్రాణం ప్రవహించే నాడులు ఎన్ని ఉన్నాయో ఇవీ అని 72 లక్షలో ఎన్నో చెప్తారు వీళ్ళు. ఇవన్నీ ఒక ఉచ్ఛ్వాస,నిశ్వాసలో చక్కగా ప్రతిస్పందిస్తూ ఉంటాయి. ఇవన్నీ ధరించాడు. వీటి ద్వారా శరీరాన్ని ధరించాడు. ఈ శంఖం, చక్రం, గద, నందకం ఇలా ధరించాడు. ఇవన్నీ కాకుండా మళ్ళీ తన దగ్గరికి రావడానికి ఒక నాడి ఊర్ధ్వముఖంగా పెట్టాడట. వంద నాడులు అధోముఖంగా పోతూ ఉంటాయి. ఒకటి ఊర్ధ్వముఖంగా వస్తూ ఉంటుంది. అది

ఉదాన ప్రాణంగా ఉంటుంది. అది అందుకుని విశుద్ధిలోకి రావాలి. అక్కడి నుండి ఆకాశం లోనికి. మళ్ళీ వెనక్కొచ్చే దారి కూడా పెట్టాడు. ఈ విధంగా ఇన్నీ పెట్టి వీటన్నింటినీ అతడే ధరించి ఉన్నాడు. ఈ మొత్తం అంతా మనకి అత్యద్భుతంగా గోచరిస్తుందే తప్ప అతడికి ఇందులో ఆశ్చర్యపడవలసినదేమీ లేదు. మనకి anatomy ఒకటి బాగా తెలియాలి. Exoteric anatomy ఒకటి ఉంటే, occult anatomy ఒకటి ఉంది. గ్రంథుల వరకూ మనకి శాస్త్రం చెప్తూంటే గ్రంథుల్లోంచి పని చేసే తత్త్వాన్ని యోగశాస్త్రం చెప్తుంది. ఈ ప్రాణం అసలు ఎట్లా ఇందులోకి వస్తోంది, ఈ ప్రాణం దేని వల్ల ఇందులో ఉన్నది? దేని వల్ల ఈ ప్రాణం ఇట్లా మన యందు స్పందనాత్మక చైతన్యంగా ఉన్నది? ఈ ప్రాణం ఎన్ని నాడుల గుండా ప్రవహించి పని చేస్తూ ఉన్నది? ఈ రక్త శుద్ధి కార్యక్రమం/ chemical laboratory అంతా ఎట్లా ఏర్పడినది? ఉన్నదని గుర్తించడం వేరు. అసలు ఇట్లా ఎలా ఏర్పడిందని తెలుసుకోవడం వేరు. ఎవరు నడిపిస్తున్నారు దీన్ని? ఇవన్నీ శోధన చేశారు ఋషులు. ఆ విధంగా శోధన చేసి వాళ్ళు కనుక్కున్నవన్నీ మనకి ఇచ్చారు. ప్రశ్న అనే ఒక ఉపనిషత్తులో ఒక ఆరు ప్రశ్నలకు చాలా సమాధానాలు ఇస్తారు. ముందు ఏమీ లేదు. ఇదంతా పదార్థమే అంటారు. ఆ తర్వాత పదార్థంతో పాటు ప్రాణం ఒకటి ఉన్నది. ప్రాణమే పదార్థాన్ని నడిపిస్తున్నది. ప్రాణము శక్తి, పదార్థము అన్నము అంటాడు. ఇంకొంచెం ముందుకు వెళ్ళి ప్రాణము సూర్యుడు, పదార్థము చంద్రుడు అంటాడు. ఆ తర్వాత అది బాగానే ఉంది. అసలు ప్రాణం ఎట్లా వచ్చింది అని అడుగుతాడు. ఈ ప్రాణాన్ని ఎవరు తీసుకువచ్చారు? ఎక్కడ నుండి తీసుకువచ్చారు? అని ప్రశ్న. అప్పుడు చెప్తాడు. సూర్యుడికి అవతల ఏముంది? సూర్యుడికి ఇవతల ఏముంది? అటు నుండి ఇటు సూర్యకిరణాల ద్వారా ఈ ప్రాణం ఏ విధంగా సరఫరా అవుతోంది అని, అన్నీ చెప్పి నీలో ఏ విధంగా ప్రాణం ప్రవేశిస్తోంది. గాలి వలన, చూపు వలన. కన్ను వెలుగును చూస్తే ప్రాణం లోపల అందుకుంటోందట. శ్వాస పీలిస్తే లోపలకందుకుంటూ ఉంటుంది. లోపల కూడా ఉన్నదిట. ఈ లోపల ఉన్నది, బయట ఉన్నది ఒక దానితో ఒకటి అనుసంధానం చెందుతూ ఉండడం చేత స్పందనం ఉంటుందట. జీవుడా! ఎవరూ? అంటాడు మళ్ళీ మధ్యలో, ప్రాణంతో బాటు వీడొకడొస్తాడు. అసలు జీవమే ప్రాణం అంటాడు. దాని

ఆధారంగా ఏర్పడిన ఒక ప్రత్యేకమైన రూపాన్ని జీవుడంటున్నాం అంటాడు. మరి ఈ జీవుడెక్కడినుండి దిగి వచ్చాడు అంటే ఆత్మ అని ఒకటి ఉన్నదని అంటాడు. అట్లా తీసుకుపోతాడు. అక్కడి నుండి పరమాత్మ దగ్గరకి తీసుకుపోతాడు. ఆరు ప్రశ్నలలో మొత్తం అంతా కలిపితే ఓ పాతిక శ్లోకాలు ఉండవు. మొత్తం అంతా చెప్పేస్తారు అయిపోతుంది అనుకోకూడదు. దాని మీద బాగా ధ్యానం చేయాలి. ఇట్లా ప్రాణం రూపంలో, ప్రణవం రూపంలో మనని ధరించి ఉన్నాడాయన. రథాంగములను ధరించి ఉన్నాడని చెప్పడానికి రథాంగపాణి అన్నారు. ఆయన ఎక్కడ ధరించి లేకపోతే అక్కడ అది ఉండదు. పడిపోయింది అంటారు. ఏం లేవట్లేదు చెయ్యి అంటే పడిపోయింది అంటారు. చెయ్యి పడిపోయిన వారు, కాళ్ళు పడిపోయిన వారు ఉండరా? అంటే ఇంక ఆ అంగాన్ని ఆయన మోయట్లేదు అని అర్థం. ధరించడం లేదు అని అర్థం. ఇట్లా నీ యందు సమస్తమూ నిన్ను ధరించి ఉన్నవాడు అతడే. నీ రథము అతనిదే. నీదనుకుంటావు కాని రథము అతనిదే. అతని రథమే నువ్వు మోస్తున్నావు. నువ్వు మోస్తున్నావు అనుకుంటున్నావు. అతనే మోస్తున్నాడని చెప్తున్నాడు. అతని రథము యందు నిన్ను ఉండనిచ్చాడు. నువ్వు అనుభూతి చెందవచ్చు.

1032 అక్షోభ్యః

అక్షోభ్యః అంటే ఆయనకేమీ అకస్మాత్తు కాదుట. మనకి ఈ accidents, surprises వుంటాయి. అకస్మాత్తుగా జరిగిపోయాయి అంటాం. Incidental అంటాం. Accidental అంటాం. రకరకాలుగా మాట్లాడుతూ ఉంటాం. కానీ అక్కడేమీ అకస్మాత్తుగా లేదుట. అక్కడ అంతా తెలిసి ఉంటుంది. అందుకే దేనికి విస్తుపోవడం ఉండదు. బెదరడం ఉండదు. కలత చెందడం ఉండదు. అదరడం ఉండదు. ఎందుకు ఉండదు? మూలమునకు అది లేదు! దాని నుండి వ్యక్తమైనవాటికుంటాయి. బాగా గాలి వస్తే ఆకులు ఆడచ్చు, రెమ్మలు ఆడచ్చు, కొమ్మలు ఆడచ్చు. మాను కదలదుగా! మర్రిచెట్టుని చూడండి, క్రింద మాను కదులుతుందేమో! ఎక్కడ కదులుతుంది? ఎక్కడ కదలదు? లోతుల్లోకి వెళ్ళినకొద్దీ కదలికలు ఏమీ చేయలేవు. స్థిరంగా ఉంటుంది. అదే స్థితప్రజ్ఞత్వం! పై పైన బ్రతికేవాళ్ళకి అన్నీ అద్భుతాలే. అన్నీ ఆశ్చర్యాలే. అన్నీ అకస్మాత్తులే. అనుకున్నది అనుకున్నట్లుగా జరగకపోతే బాగా తడబడిపోతుంది కదా! ఆయన అదేదో పాట రాశాడు. 'తలచినదే జరిగినదా దైవం ఎందులకు, జరిగినదే తలచితివా శాంతి లేదు నీకు'. జరిగేది జరగడం ఒకటి, తలచేది జరగడం ఒకటి. తలచినదే జరగాలనుకుంటే శాంతి ఉండదు. రేపు నీ సన్మానం అని చెప్పిన తర్వాత ఎవరో జైలుకు తీసుకుపోయారనుకోండి అదే timeకి వచ్చి. ఊరంతా మేము సన్మానం చేస్తామని అంతా తయారు చేశాం. Paperలో అన్నీ కూడా రాయించుకున్నాం. Papers వచ్చేశాయి. ఏడింటికి పోలీసులు వచ్చేశారు మిమ్మల్ని arrest చేస్తున్నామండీ, అని. ఎట్లా ఉంటుంది? ఇంతకన్నా చాలా పెద్ద విషయం కదా రాముడికి జరిగింది. రేపు చక్రవర్తి అవబోతున్నాడు. అటు కాదు దారి ఇటు సరాసరి అడవులలోకి వెళ్ళిపో, నారవస్త్రాలు ధరించి, అన్నారు. అక్కడే చూసుకోవాలి రాముని character. మనకు స్ఫూర్తి కోసమే. రాముడంత అయిపోతామని కాదు. లక్ష్మణుడేమి చేశాడు? రాముడేమి చేశాడు? చెండేస్తాను ఒక్కొక్కడిని, అంటాడు లక్ష్మణుడు. నీ కన్నా బలవంతుడు ఎవ్వరూ లేరు. పైగా క్షాత్రధర్మం మనది. నేను చాలు వీళ్ళందరికీ. క్షాత్రధర్మం ప్రకారం నువ్వు సింహాసనం ఎక్కడం తప్పులేదు.

పైగా నువ్వు పెద్ద కొడుకువి. Case లో law అంతా నీ పక్కనే ఉంటుందని' చెప్తాడు. 'నిన్నటి వరకూ ప్రేమతో ఉన్న కైకేయికి, నాతల్లి కన్నా ప్రేమతో ఉన్న కైకేయికి ఈ రోజున ఇంత ద్వేషం మనమీద కలిగిందంటే అది ఆమె కాదు, అక్కడ ఏదో ఆమెను నిమిత్త కారణంగా పెట్టుకుని పనిచేయిస్తోంది' అంటాడు రాముడు. 'నువ్వు అనుకున్నది అనుకున్నట్టు జరగకుండా ఇంకొక రకంగా జరిగిందంటే దాంట్లో దైవాన్ని చూడాలి తమ్ముడు. అంతేకాని వ్యష్ట పడితే ఏమీ కాదు. దాన్నే 'దైవం' అంటారు. దైవం ఎప్పుడు ఏమి చేస్తోందో నువ్వు నేను ఏమి చెప్పగలం? జరిగిందాంట్లో ప్రశాంతత పోగొట్టుకోకుండా మనకు తోచినది చేయటం తప్ప ఇంకొకటి లేదు. ఊరికే గగ్గోలు పడిపోక' అని చెప్తాడు. క్షోభ చెందడు. అక్షోభ్యః అకస్మాత్తుగా జరగడం వలన క్షోభ కలుగుతుంది. క్షోభ అంటే కలత. అట్లా కలిచినట్లు అయిపోతుంది. అది ఎప్పుడూ కృష్ణుడికి లేదు. పరతత్వానికి లేదనడంలో పెద్ద విషయం కాదు. కృష్ణుడికి లేదు. ఎంత కలిచివేసే సన్నివేశాలైనా ఆయనకి ఏమీ తేడా పడదు. ఇంత పని ఎవ్వరూ చెయ్యలేరు సరాసరి భగవంతుడే! అతడే వచ్చి అందరినీ చంపేశాడు. అంతకుముందు వచ్చిన అవతారమూర్తులకు, ఈ అవతారమూర్తికి అదీ తేడా! చాలా మంది అదే ఊహించారు. 'పురాణపురుషుడు వస్తాడు. అష్టమగర్భంలో పుడతాడు. ఇప్పుడు ఉండే ఈ దరిద్రాలకన్నింటికీ పరిష్కారమొస్తుంది. శాంతియుతంగా ప్రజలందరూ హాయిగా జీవిస్తారు' అని అనుకున్నారు. ఈయన ఇంతమందిని ఏరేస్తాడని ఎవ్వరూ అనుకోలేదు. సముద్రపు ఒడ్డున తనవాళ్ళందరూ తన కళ్ళముందే వెళ్ళిపోయారు. మొత్తం తనవారు అనుకున్న యదువంశమంతా దాదాపు అంతఃపురంలో ఉన్నవాళ్ళు తప్ప మిగతావాళ్ళంతా పోతూ ఉంటే అట్లా చూస్తున్నాడట. ఇంత యుద్ధం జరుగుతుంటే అందులో ఉండి చూస్తున్నాడట. 'నీకు క్షోభలేదు నాయనా! మాకే క్షోభ' అని చెప్పడం. ఇది చాలా ఉత్తమోత్తమమైన విషయం. రాముడు అప్పుడప్పుడూ క్షోభ చెందాడు. అమ్మవారిని రావణుడు ఎత్తుకెళ్ళినప్పుడు, లక్ష్మణుడు మూర్ఛ చెందినప్పుడు క్షోభ చెందాడు. మానవ అవతారంగా వచ్చాడు కాబట్టి మానవ సహజమైన క్షోభ చెందాడు. పూర్ణ మానవుడు. కృష్ణుడు అది కాదు. అతిమానుషీతత్త్వం! మనుషులకి మించింది. రాముని ది మనుష్యతత్త్వం. రాముడేడ్చాడట

ఏమిటండీ రామాయణంలో అని ఎవరో అంటే ఏడవకపోతే ఎందుకు ఏడవలేదు అని అడగాలి. ఏడ్చాడని అడగకూడదు అని చెప్తారు మాష్టరుగారు. స్వంతమనిషి ఒకడు పోతే ఏడవలేదంటే వాడు మనిషి కాదు. అయితే రాయి అన్నా కావాలి. లేకపోతే దైవం అన్నా కావాలి. ఏడవడం సహజం. అయితే ఎంత తొందరగా మళ్ళీ స్థిమితం చిక్కుతుందనేది ముఖ్యం. రాముడు ఏడవలేదుట అంటే తప్పవుతుంది. ఎందుకంటే మానవుడుగా, ఉత్తమమానవుడుగా ఎట్లా జీవించాలో చూపించడానికి వచ్చాడు కాబట్టి బాధ పడాలి. రాయి కాదుకదా మనం. బాధ పడడం లేదని పైకి బింకంగా ఉన్నా లోపల ఉంటుంది కదా! అది మానవ సహజమైన విషయం కదా! అందుకని అక్షోభ్యః నామం తత్త్వానికి ఎంత సరిపడుతుందో కృష్ణునికి అంత సరిపడుతుంది. తనవారని ఏమీలేదు. అంతా తనవారే. వర్గీకరణంలేదు. వీళ్ళంతా ఎక్కడికీ పోరు. లోపల ఉంటారు. బైట ఉంటారు. కాదంటే కాసేపు బయట ఆడుకుంటూ ఉంటారు. లేకపోతే లోపలికి వచ్చేస్తారు. ఎక్కడికి పోతారు? ఎక్కడికీ పోరు. ఒక రకంగా చూస్తే మనం భరించలేనంత తత్త్వం అది. అందుకనే వాళ్ళెవ్వరూ భరించలేకపోయారు. మనకు కొన్ని భావాలు ఉంటాయి కదా! దేవుడంటే మంచి మృదువుగా ఉంటాడు. నవ్వుతూ ఉంటాడు. మనం అడిగిందల్లా యిస్తూ ఉంటాడు. మనల్ని కోప్పడడు. ఇట్లా అనుకుంటాం కదా! ఈయన అవసరమైతే చీరేసేట్టుగా ఉంటాడు. అన్నీ ఉన్నాయి. ఏదీ ఇదని చెప్పడానికి లేదు కదా! ఇన్ని జరుగుతున్నా దేనికీ విస్తుపోడు. దేనికీ క్షోభ చెందడు. ధర్మరాజు భోరు భోరున ఏడుస్తాడు యుద్ధం అంతా అయిపోయిన తర్వాత. కొన్నాళ్ళు ఏడుస్తాడు. ఇదేమిట్రా? యుద్ధం అంతా చేసావు కదా! అప్పుడు లేదు ఇప్పుడేడుస్తావేమిటి? అంతా అయిపోయిన తర్వాత వచ్చింది ఆయనకి, 'ఇదంతా ఎట్లా జరిగింది? నేనెందుకు ఇట్లా చేశాను' అంటాడు. నువ్వు చేసేవాడివా? నువ్వు చేశావా? జరిగింది అంతే. ఎవ్వరు చెప్పినా వినలేదు పాపం. ఇంత ధర్మాత్ముడికి కూడా మానవ సహజమైన దుఃఖం అట్లా వచ్చింది. ఒకాయనకు పూర్వభాగంలో వచ్చింది. ఒకాయనకు ఉత్తరభాగంలో వచ్చింది. అర్జునుడు ముందు ఏడ్చాడు. ధర్మరాజు చివరికి ఏడ్చాడు. తట్టుకోలేకపోతే ఎంతోమంది ఋషులు, వాళ్ళు, వీళ్ళు బోల్డుమంది వచ్చి ఎన్నో రకాలుగా చెప్తారు.

విదురుడు కూడా తట్టుకోలేకపోయాడు. అందుకనే వెళ్ళిపోయాడు. బలరాముడు తట్టుకోలేకపోయాడు, వెళ్ళిపోయాడు. ఈ యుద్ధరంగంలో మేము ఉండం అన్నారు. వెళ్ళిపోయారు. చాలా దూరం వెళ్ళిపోయారు. ధృతరాష్ట్రుడు కుమిలిపోయాడు. ఎవరు కుమలలేదు? అందరూ దూరంగా కుమిలిపోయారు. పంచపాడవులను అట్లా నరికేస్తే ద్రౌపది ఎంత క్షోభ చెందిందీ? మనం అది చూడకపోయినా చదువుకోవడానికి ఉంది. అప్పుడూ కృష్ణుడికి ఏమీ లేదు. అర్జునుడు క్షోభ చెందాడు చాలాసార్లు. భీముడు క్షోభ చెందాడు. భీష్ముడు క్షోభ చెందాడు. ద్రోణుడు చెందాడు. మొత్తం లెక్కేసి చూస్తే ఒక్కడే మిగులుతాడు ఈ ఒక్క విషయంలో. ఎందుకంటే వీళ్ళకి ఏమీ కాదు, అని ఆయనకి నమ్మకం. ఊరికే చొక్కాలు చింపేస్తున్నాను తప్ప వాడినేం చేస్తున్నానంటాడు. మళ్ళీ కొత్త చొక్కాలు వీళ్ళ కోసం కుట్టించి ఉంచాడు విశ్వకర్మ చేత. అతడు కుట్టేస్తూ ఉంటాడు. వీళ్ళ చొక్కాలు చింపేస్తున్నాడు. అది ఈయన లెక్క. ఎక్కడికీ పోవని ముందే చెప్తాడు అర్జునుడికి. అందుకనే కృష్ణభక్తిలో మనిషి కరిగినంతగా ఇంక దేంట్లో కరగడు పూర్తిగా, బూడిదైపోవలసినదే వీడు. ఇహ కాలడానికి ఏమీ మిగలకుండా ఉంటే అప్పుడు తీసి రాసుకుంటూ ఉంటాడు ఒంటికి. శివుడు విభూతి రాసుకుంటాడన్నా, కృష్ణ సాన్నిధ్యం అన్నా ఇట్లా ఉంటాయి. కరగడు లోపల. 'నువ్వు లేవురా! నేనే ఉన్నాను కదా! నేనుగా నువ్వు ఉన్నావు. ఎక్కడికీ పోవు. నీకేం ఫర్లేదు. కానీ ఎన్నంటించినా ఫర్లేదన్నట్టుగా ఉంటుంది'. కాని అందులో ఎంత మాధుర్యం ఉంటుందంటే కాల్తున్న కొద్దీ వాడికి రుచిగా ఉంటుంది తప్ప బయటికి రాడు. అట్లా సన్యాసి అయి రోడ్డు మీద పడిపోతుంది కదండీ పట్టపురాణి అయిన మీరాబాయి. ఆవిడ ఏంటి? ఆవిడ పుట్టుక ఏమిటి? ఆవిడ మెట్టిన ఇల్లు ఏమిటి? ఆవిడ హోదా ఏమిటి సంఘంలో. అట్లా జుట్టు విరబోసుకుని, సంస్కారం లేకండా అట్లా రోడ్డు మీద పాటలు పాడుకుంటూ వెళ్ళిపోతుంది ఇంటాయన వెళ్ళిపోమ్మంటే. మన స్థితిగతులు గుర్తు ఉంటే అవన్నీ చేస్తామా? అట్లా వెళ్ళిపోయింది అంతే బృందావనం. ఏంటండీ ఇట్లా చేస్తున్నాడంటే నవ్వుతాడు. పక్కన లక్ష్మీదేవికి మాత్రం చాలా suspense గా ఉంటుంది. ఈ కృష్ణుడు చేసే పనులు రుక్మిణికి ఏమీ అర్థం కాదు. ఇంతమంది యాదవులు వెళ్ళిపోతే ఇంటికి రాగానే అడుగుతుంది. 'మీకు తెలుసా తెలీదా

చెప్పండి ముందు? తీసుకెళ్ళారు కదా అందరినీ picnicకి అక్కడికి, పోతారని మీకు తెలుసా? తెలిసే ఇదంతా చేశారా? మీకేదీ తెలియదని అనుకోవడానికి వీలులేదు కదా' అని. నవ్వుతాడు. ఈ ప్రశ్నలకి సమాధానాలు చెప్తే దాని వల్ల నీకేమి వస్తుంది? అని అడుగుతాడు. ఎక్కడికక్కడ తప్పించుకు తిరగడమే! 'నాకు తెలుసు అన్నాననుకో. దాని వల్ల తేడా ఏమైనా ఉందా? నాకు తెలీదు. అయిపోయింది. తెలిసినా తెలియకపోయినా ఇప్పుడు అయిపోయింది కదా!' అందడు. ఇదీ సమాధానం! వాడెవడో బాణం వేసి వేలు కొడతాడని తెలుసు. Injection యిస్తానంటేనే యిట్టిట్టా అవుతుంది శరీరం కదా! అది intravenous అంటే చచ్చామే. పైగా నరం ఓ పట్టాన దొరకదు కదా! అటువంటిది వాడెవడో ఈయన్ని బాణం వేసి కొడతాడు. అదీ ఈయన బొటనవేలుకి తగలాలి. అది కారణంగా ఈయన శరీరం వదలాలి. వాడికి ఈయన సంకేతం చూపిస్తాడు బొటనవేలలా ఆడిస్తూ. ఆడిస్తూ ఉంటే దూరం నుండి వీడు చూసి, అదేదో మృగం యొక్క ఒక భాగం అనుకుని దానికేసి కొడతాడు. కొడతాడు, మెల్లగా లోపలకెళ్తుందని తెలిసి కూడా అట్లా ఉండడం కష్టం కాదూ? ఎంతవరకెళ్ళింది? అదేం బాణమో మనం ఊహించలేము. చిన్న మేకు గుచ్చుకుంటేనే చచ్చిపోతాం విలవిలల్లాడి. ఆ ములుకు ముసలంలో భాగమే. అది వాడి దగ్గర చేరింది. అది బొటనవేలులో గుచ్చుకుని పాదంలోంచి, చీలమండల్లోంచి, పిక్కలలోంచి, మోకాల్లోంచి, తొడలోకి ఎక్కిందండీ బాణం. ఇట్లా ఎక్కుతుందని తెలిసే ఉంటుంది. అక్షోభ్యః కదా! ఏదీ అకస్మాత్తు కాదు కదా!

1033 సర్వప్రహరణాయుధః

సర్వప్రహరణాయుధః అంటే విసరవలసిన అన్ని ఆయుధాలు కలిగినవాడు అని. మనవి మనకే తిరిగి విసురుతాడు. మాటలు విసిరేవాళ్ళకు మళ్ళీ తిరిగి మాటలు విసురుగా వస్తాయి. అన్నవాడు తినాలి. అట్లాగే చేతలు చేసినవాడికి చేతలు తిరిగి వచ్చేస్తాయి. నువ్వు ఏ విధంగా ఒకడ్ని హింసించావో అదే విధంగా నీకు తిరిగి వస్తుంది. Returned with thanks అంటాం చూశారా! అట్లా చక్కగా ఎవరెవరు ఏ విధంగా అత్యాచారాలు చేశారో, వారి వారికి ఆయా విధములుగా మళ్ళీ తిరిగి అందించేస్తాడు. దాన్నే 'రుద్రతత్త్వం' అంటాం. 'రుద్రుడి బాణములు' అంటాం. అందుకనే రుద్రసూక్తం కాస్త ఆ విల్లుకి తాడు తీసేయ్ అంటుంది. అంటే బాణం వెయ్యక అని సూటిగా అనకుండా విల్లుకి దారం తీసేయ్ అంటాం. ఎందుకంటే విల్లుకి తాడు తీసేస్తే బాణం వెయ్యరు అని. బాణం వెయ్యడానికే విల్లుకి దారం వేస్తారు. ఎప్పుడూ అట్లా టెన్షన్లో పెట్టి ఉంచరు బాణాన్ని విల్లు తాడు ఎక్కించి బాణాలు వదులుతూ ఉంటాడు. శివుడు అట్లా విల్లు పట్టుకుని చూస్తూ ఉంటాడు రుద్ర రూపంలో. ఒకరు మనమీద కోపం వహించారట, ద్వేషం వహించారట అంటే వాళ్ళ రూపంలో రుద్రుడు మన మీద బాణాలు వేస్తున్నాడని అర్థం. అది మన ఋషుల అవగాహన. నీ పారబాటు లేకుండా వాడు నీ మీద బాణాలు వేస్తుంటే అవి మళ్ళీ వాడికే వెళ్ళిపోతాయి. నీ పారబాటు ఉంటే నీవు సర్దుకోవాలి. అట్లా సర్దుకోకపోతే ఆ బాణాలు అట్లా వస్తాయి. అట్లా ఎన్ని ఆయుధాలు? ఎవరెవరు ఎటువంటి ఆయుధాలు పట్టుకొచ్చి వేసినా మళ్ళీ అవే ఆయుధాలు వాళ్ళకి తిరిగి వెళ్ళిపోతాయి. ఆయుధాలు అంటే ఇక్కడ మనం భౌతికంగా చెప్పకోవడం లేదు. మాటలు అన్నవాళ్ళు మాటలు పడతారు. ధన నష్టం కలిగించిన వాళ్ళు మోసం చేత ధన నష్టం పొందుతారు. ఇతరులకు అపకీర్తి కలిగేట్టుగా చేసేవాళ్ళు అపకీర్తి పొందుతారు. ఇట్లా ఆయుధాలు ఉన్నాయి అయన దగ్గర. అవి విసురుతాడట. సర్వప్రహరణాయుధః - నువ్వు ఏ ఆయుధం విసిరితే అది నీ దగ్గరికి వచ్చేస్తుంది. అద్దమే! లేని ఆయుధం లేదు. ఎందుకంటే సమస్త సృష్టిలో ఎవరెవరు ఏఏ ఆయుధములు ఎవరెవరి మీదికి విసురుతున్నారో అవి మళ్ళీ

తిరిగి వాళ్ళ మీదికి పంపించే తత్త్వం అని చెప్పడానికి సర్వ ప్రహరణాయుధః. He can hit with any weapon. Weapons ఒక్కొక్కళ్ళ మీద ఒక్కొక్క రకంగా వాడాడు. కంసుడికి భయం అనే ఆయుధం వాడాడు. నవ్వి భయపెట్టాడు కదా! ఒక్కొక్కళ్ళను చేతులతో గుద్దాడు. ఇంకొకళ్ళకి చక్రము, ఇంకొకళ్ళకి బాణం ఎట్లా వేశాడు? ఏం చేశాడు? అది కృష్ణావతారపరంగా. అలా కాకుండా మనం సృష్టిపరంగా చూసుకుంటే చేసినవారికి చేసినట్టుగా అందిస్తూ ఉంటుంది. ఈ జన్మలో మనకి ఏవో జరుగుతూంటే ఏ జన్మలో ఏ పాపం చేశామో ఈ జన్మలో ఇట్లా జరుగుతోందని అనుకోమా? ఏదైనా అట్లా వచ్చేస్తుంది. అట్లా రాకుండా ఉండడానికి పెట్టాడట ఒక scheme. చేసినదానికి హృదయపూర్వకంగా ప్రాయశ్చిత్తం చెంది పెద్దల దగ్గరకి వెళ్ళి ప్రాయశ్చిత్త వ్రతం ఏదన్నా వాళ్ళని అడిగితే వాళ్ళు చెప్తారట. అది కూడా నిర్వర్తిస్తే అప్పుడది కొంత ఉపశమిస్తుందిట. పూర్తిగా పోదు అప్పటికీ. పశ్చాత్తాపం వలన, అది కూడా దొంగ పశ్చాత్తాపం లాభంలేదు, క్రుంగిపోవాలి పశ్చాత్తాపంతో. దాంతో వాడనుభవించినట్టేగా! అందుకనే మన వాళ్ళు ఏం చేస్తారంటే దరిద్రపుగొట్టు మొగుడు దొరికాడనుకోండి ఈ జన్మకి. ఈ సారికి ఇట్టా కానిచ్చేద్దాం, అనుకుంటారు. అది భారతీయతత్త్వం! తప్పిచ్చుకోవద్దు. ఇచ్చాడు కదా! ఈ సారికిదైపోతే అయిపోతుంది. బాగా మాస్టారుని నమ్ముకున్నవాడు మాస్టర్ గారికి ఒకసారి ఇలా చెప్పాడు. అన్నీ బరువులే ఇంట్లో. మాస్టర్ గారు ఒకసారి మా యింటికి రావాలి మీరు. ఏమిటో యివి, తెరలు తెరలుగా ఒకదాని మీద ఒకటి వచ్చి పడుతున్నాయి. ఎవడో వచ్చి మా నాన్నగారికి చెప్పాడు ఇంటికి వాస్తు బాగాలేదు, అని. మీరొకసారి చూసి వాస్తు లోపాలుంటే చెప్పండి మాష్టారు అని. పద వెళ్దాం అన్నారు. వెళ్ళాం. చూశారు. అంతా చూసి మౌనంగా ఉన్నారు. ఏం మాస్టారు, అంటే 'అక్కడేం లేదురా. మన దగ్గర చాలా ఉంది. అదంతా clear అవ్వాలి. ఈసారికింతే అనుకో. అనుభవించేసేయ్ అంతే, అన్నారు. దైవాన్ని నమ్ముకో. మునగకుండా వచ్చేస్తావు. లేదు నేను నడుస్తున్న మార్గాన్ని నమ్ముకో. నేను నీకు హామీ ఇస్తున్నాను, నీవు మునగవు అని. కానీ తప్పవు. తప్పించుకుంటే మళ్ళీ వడ్డీతో వస్తాయి. ఈ గోడ తీసి అక్కడ పెడితే, ఆ గోడ తీసి ఇక్కడ పెడితే ఏమీ అవదు. అయ్యేపని కాదు. ఆ కాస్తే ఉంటే నేనే

చెప్పేవాడిని. చాలా ఉంది. అందరికీ ఉంది ఇంట్లో. నీ మీదుగా వెళుతూ ఉంటుంది. నువ్వు మోసేసెయ్. నీవు మోస్తూ ఉండు. నేను నీకు స్ఫూర్తి ఇస్తాను. అంతవరకు చేసి పెట్టగలను. ఇంక ఇవన్నీ వద్దు. పోనీ మారుద్దాం అనుకో. ఉన్నాయా డబ్బులు మార్చటానికి' అని అడిగారట. 'లేవు మాస్టారు' అంటే. 'మరి ఈ ఆలోచన కూడా ఎందుకు? మళ్ళీ దీనికో అప్పు చేస్తే అదొక బరువు. వదిలేసేయ్. మనది కానిది మన దగ్గరకి రాదు. వచ్చింది అందుకుందాం, అంగీకరిద్దాం. అనుభవించేద్దాం. అంతటితో అయిపోతుంది' అని చెప్పారు. ఇది మన వాళ్ళ తత్త్వం. అందుకని బావుండకపోతే విడాకులు ఇచ్చే పరిస్థితులు లేవు.మళ్ళీ వస్తుంది. ఈ సారికి తప్పించుకుంటే అయిపోతుందా? వడ్డీతో సహా వస్తుందని లెక్క. ఇవి ఆయన ఆయుధాలు. ఎక్కడికీ దాటిపోలేవయ్య, అని చెప్తాడు. ప్రతీవాళ్ళ account ఉంది నా దగ్గర. Debitలు, Creditలు. ఒక credit కి ఒక debit ని nullify చెయ్యను అని చెప్తాడు. Net balance చూడడుట. మనం cash రోజూ Net balance చూస్తాం కదా! ఆయన చూడడు. Debits debits గా అందించేస్తాను. Credits creditsగా అందించేస్తాను. ఎట్లా చేశావో అట్లాగే అందించేస్తాడు. అదే అందులో రహస్యం. ఇన్ని రకములైన ఆయుధములు ఉన్నాయి. అందుకే సర్వప్రహరణాయుధ ఓన్నమ ఇతి. బాబోయ్ రక్షించు నాయనా అని. ఏదో తెలిసో తెలీకో చేస్తాం అంతే కదా. తెలీక చేస్తే ఒక మాదిరిగా ఉంటుంది. తెలిసి చేస్తే ఒక మాదిరిగా ఉంటుంది. అందుకని ఈ నామం దగ్గర మనకొక సాంప్రదాయం ఏర్పడింది. ఇది సహస్రనామాల్లో భాగం కాదు.

శ్రీ సర్వప్రహరణాయుధ ఓన్నమ యితి అంటాం. పాతవి చేసేశాం. వాటి గురించి ఆలోచించి లాభం లేదు. అయ్యిందేదో అయ్యింది. ఇప్పట్నించి చూసుకో. అది లెక్క. బుద్ధిమంతుడు చేయవలసినది యిప్పట్నించి. From today lets have a different chapter. అదెలాగండీ! పాత స్వభావం మనని అదే విధంగా చేయడానికి తోస్తుంది కదండీ అంటాం కదా! అంతే జరుగుతుంది. ప్రతివాళ్ళకీ వారి వారి స్వభావం వారు చేయకూడదన్నది చేయిస్తూనే ఉంటుంది. చేయకూడదని తెలుసు. చేస్తూనే ఉంటాం. దానికేమి చేయ్యాలయ్యా అంటే క్రొత్త బలిమి తెచ్చుకోవాలి. బలం అప్పు తెచ్చుకోవాలి.

బుద్ధి అప్పు తెచ్చుకోవాలి. దానికే ఇవన్నీ. సత్పురుషసాంగత్యము, సద్గంథపఠనము, స్తోత్రాదికములు, పారాయణ ఇవన్నీ ఇందుకోసమే! పాత పద్ధతులు ఇక మాని క్రొత్త పద్ధతులు నేను అందుకుంటాను అనే నిర్ణయానికి బలం చేకూర్చడం కోసం! అటువంటి బలం చేకూరిస్తే ముందు ముందు బాగుంటుంది. భావి బాగుంటుంది. పాతది వచ్చి మరి చేస్తూనే ఉంటుంది. అవే భక్తుల కథలన్నీ. మనం కంకర రోడ్డుమీద speedగా వెళ్ళే bus ఆపామనుకోండి. ఏం జరుగుతుంది? ఆ దుమ్మంతా బస్సులోకి వస్తుంది. బస్సాగంగానే మనం దిగామనుకోండి. ఆ దుమ్మంతా మొహం మీద పడుతుంది. బస్సు పోతూ ఉంటే దుమ్ములేస్తూ ఉంటుంది. ఏదో కాస్తో కూస్తో పడతాం. ఇంటికి రాంగానే ఇంటివాళ్ళు బస్సులో వచ్చారా, అని అడుగుతారు కదా! ఆ దుమ్ము వేరు. ఆ రకమైన ప్రయాణంలో అక్కడ ఆపడం వల్ల నీ మొహం మీద పడే దుమ్ము వేరు. భక్తుల జీవితాల్లో పాత దుమ్మంతా ఒక్కసారి పడిపోతుంది మీద. అందుకని అంత కష్టంగా నడుస్తున్నట్లుగా కన్పిస్తుంది. కానీ వాడు వదలడు దాన్ని. అందుకే చెప్తారు. పాతకర్మ అంతా నెమ్మదిగా శిథిలమౌతుంది. విష్ణుభక్తి పెరుగుతూ ఉంటుంది. అది పెరుగుతూ ఉంటే ఇది తగ్గుతూ ఉంటుంది. దానికంగీకరించి ఇదేదో పూర్తి చేసుకుందాం అనుకుంటాడు. అది భృక్తరహితం. 'భృక్తరహితం చేసుకుందాం' అనే సంకల్పం! అంటే ఇదే పెంటలో పోకుండా మార్గం మళ్ళిద్దామని అనుకునేవాళ్ళకి ఏం జరుగుతుందంటే పాతవన్నీ ఒక్కసారి వెళ్ళిపోతున్నారా సార్. మీ arrears అన్నీ ఇన్ని ఉన్నాయండి. మీరు loans ఇన్ని తీసుకున్నారు. ఇవన్నీ settle చేసి వెళ్ళిపోండి అంటాయి అంతేగా. నేనివ్వాళ నుండి resign చేస్తున్నాననుకోండి నిన్న car loan తీసుకుని ఇవ్వాళ resign అంటే provident fund రాదని చెప్తారు. ఉన్నామనుకోండి ఏదో పావల, అర్ధా అట్లా పుచ్చుకుంటూ ఉంటాడు వాడు. ఆపేస్తే ఏమయ్యింది? మొత్తం ఒక్కసారి మీద పడతాయి. మరి లౌకికజ్ఞానమే అంత ఉన్నప్పుడు సృష్టి జ్ఞానంలో ఉండదా అది? ఆ మొత్తం అంతా మీద పడుతుంది భక్తుడికి. అందుకని భక్తుల కథల్లో బాధలు ఎక్కువ కనిపిస్తాయి. కానీ వాటి రుచి వేరే ఉంటుంది. కర్తవ్యం మాత్రం నిర్వర్తిస్తూ క్రొత్త దారిలో నడుస్తుంటే పాతవి మీద పడుతూంటే ఒడి పడతాడు. కర్మతంత్రుడు అవుచూ, కమలాక్షు గొలుచుచూ,

ఉభయ నియత వృత్తి ఉండెనేని. కర్మతంత్రుడు అంటే నియతమైన కర్మ చేస్తూ ఉంటాడు. కమలాక్షుని కొలుస్తూ ఉంటాడు. అంటే భగవతత్త్వంలో ఎక్కువ ఇముడుతూ ఉంటాడు. 'చెడును కర్మమెల్ల శిథిలమై మెల్లన' అని ఒక పాదం వేస్తాడు. 'మెల్లన' ఇదెందుకు వేశాడు. ఇది లేకపోతే బాగుండేది అనుకునేవాణ్ణి మనసులో. అంటే ఒకసారి అయితే చచ్చిపోతావు అని, నువ్వు అందుకున్నంత ఇస్తాడు. కుయ్యో మొర్రో అన్నావనుకో. కాస్త ఆపుతాడు వాడు. కమ్మగానే వుంది అంటే ఆ ఇంకొంచెం పెట్టండి అంటాడు కదా! కాపడం పెట్టేవాడు కమ్మగా ఉందంటే పుండు మీద ఇంకొంచెం నొక్కుతాడు. అదే వాడు అమ్మో అంటే కాస్త తగ్గిస్తాడు. అట్లా జరుగుతూ ఉంటుందండి చికిత్స. మెల్లగా చేస్తాడు 'భ్రమరమగుచూ విష్ణుభక్తి చెడదు'. అందుకనే భగవద్గీతలో చెప్తాడు. ఒక్కసారి నా మార్గంలోకి రుచి చూసి ప్రవేశించిన వాడు ఇంక వదలడు. వాడికి రుచి కలగాలి. కలిగితే ఆ రుచి మరగడం వల్ల ఇవన్నీ భరిస్తాడు. ఆ విధంగా భృక్తం. అందుకనే రాజయోగుల దగ్గరకో, సిద్ధుల దగ్గరకో వెళ్ళి ఆశ్రయిస్తే వాళ్ళు నీకివన్నీ తీసేద్దామని చూస్తారు. తీస్తూ ఉంటారు కొద్ది కొద్దిగా. తీస్తూంటే మనకి కొద్దిగా భయం వేస్తూ ఉంటుంది. ఇదేమిటి ఈయన దగ్గరకి వెళ్తే ఒలుస్తున్నాడని. మన మంచికే ఒలుస్తారు వాళ్ళు. అట్లా ఒలిపించుకున్న భక్తుల కథలు ఉంటాయి మనకి ఈ భక్త విజయంలో. అట్లా ఒలిపించేసుకుంటారు. ఒక అళ్వారు ఇంట్లోకి దొంగలొచ్చారుట. (ఆయన తర్వాత ఆళ్వారు అయ్యాడు అటువంటి బుద్ధి ఉండటం చేత). నగలెత్తుకుపోతున్నారట. బాగా గాఢంగా నిద్రపోతున్నట్టు నటించాడట. కాబట్టి వాళ్ళు సులభంగా పట్టుకుపోతారు. తనది కాకపోతే తన దగ్గర ఉండదు కదా! ఆ ధైర్యం మనకుండదు లెండి. మన వరకు చెప్పకోవడానికి బాగా ఉంటుంది. అన్నీ అయిన తర్వాత దొంగ భార్య వంటి మీద నగలు కూడా చూశాడట. భార్య కూడా అటువంటిదే. ఇద్దరూ సై అంటే సై అన్నట్టుగా ఉన్నారు. దొంగ వలుచుకుంటున్నాడట ఆవిడ వంటి మీద నగలు. ఒక పక్క దుద్దులు ఒలిచాడట. ఆవిడ నిద్రలో అటు నుండి ఇటు తిరిగినట్టుగా ఈ చెవి బైట పెట్టింది. ఇది ఒలుచుకున్నాడట. నగలు తీసుకుంటున్నాడట. ఏదో ఒక నగ తీసుకుంటున్నప్పుడు వాడు తీసుకోవడానికి వీలుగా కదిలితే ఈవిడ లేస్తుందేమోనని ఇహ వాడు

పారిపోయాడట. వాడు పారిపోయిన తర్వాత. వాళ్ళిద్దరూ బాధ పడ్డారట ఈ నగ ఇవ్వలేకపోతిమేనని. మనం వాళ్ళ కాలిగోటికి సరిపోగలమా! మాస్టారు అంటూ ఉండేవారు పరమగురువుల కాలిగోటికి చాలదు. అలా స్ఫూర్తితో పనిచేసుకుంటారు. ఉండనీ అని. ఇట్లా ఉంటుంది వాళ్ళకి. ఎందుకయ్యా అంటే ఇచ్చిందల్లా దక్కిందని లెక్క వాళ్ళకి. వచ్చిందల్లా లేదా బొక్కిందల్లా దక్కిందనుకుంటాం మనం. ఇట్లా వాళ్ళు ఒలుస్తూ ఒలుస్తూ ఉంటే ఒలిపించుకుంటూ ఉంటాడు. స్వచ్ఛందంగా కొంతమంది ఒలిపించుకుంటూ ఉంటారు. ధర్మరాజు అట్లా 'ఒలిచేయ్' అన్నాడు రాజసూయం అయిన తర్వాత. కృష్ణుడికి అగ్రపూజ చేశాడంటే ఆ మర్నాటి నుండి మొదలవుతుంది. అగస్త్యుడుకి రాముడు దణ్ణం పెట్టుకున్న తర్వాత అసలు కార్యక్రమం మొదలయ్యింది. అంతవరకు అరణ్యంలో ఎక్కడున్నా పెళ్ళాం ఉంది, తమ్ముడు ఉన్నాడు. తమ్ముడు పాపం అన్నీ తెచ్చిపెడుతూ ఉంటాడు. మాట్లాడుకోవచ్చు. జరుగుతున్నాయి. మునుల ఆశ్రమాలకి వెళ్తున్నారు. ఏదో జ్ఞానబోధ జరుగుతోంది. బాగానే నడుస్తోంది. అందరూ భోజనాలు పెడ్తున్నారు. ఒక విధంగా అంతంత మాత్రంగా మరీ చక్రవర్తిలా లేకపోయినా ఆ బాధ్యతలు లేవుకదా! హాయిగానే ఉందనుకున్నాడు. ఇంకో సంవత్సరం ముందు ఉండగా అగస్త్యుడు దగ్గరకి వెళ్ళి 'ఇంకొక సంవత్సరమే ఉంది కదా! ఏదైనా ప్రశాంతమైన ప్రదేశం చెప్పండి. ఈ సంవత్సరం హాయిగా గడిపేస్తే అయిపోతుంది' అంటాడు రాముడు. తప్పకుండా చెప్తానంటాడు. ఈయన్ని ఎక్కడ పెడితే మొత్తం కథంతా కదులుతుందో అక్కడ పెడతాడు. అదీ చేసింది! అగస్త్యుణ్ణి చూసి వచ్చిన తర్వాతే రాముడికి అసలు అవతారభూమిక మొదలవుతుంది. అంతవరకు అక్కడ కైకేయి కొంత చేస్తుంది. ఆవిడది కూడా అగస్త్యుడి ఆశ్రమమే అయి ఉండాలి. ఇక్కడ ఈయన పూర్తిగా రాముణ్ణి ఎక్కడ పెడితే జనస్థానంలోకి వెళతాడో, ఈ రాక్షసుల్ని ఎదుర్కుంటాడో అక్కడికి పంపిస్తాడు. అంతే మొదలు అక్కడ్నుండి. అట్లా ఉంటుంది. శ్రేయస్సు కోరే కృష్ణుడికి అగ్రపూజ చేయంగానే ధర్మరాజుకి కూడా అంతే. రాజులందరూ వెళ్ళిపోతారు. ఎంతమంది వచ్చారో! ఋషులు వచ్చారు, మునులు వచ్చారు. భూగోళంలో ఉండే all VIPs; divine and material, spiritual and material అన్ని రకాలవాళ్ళూ వచ్చారు. అయిపోయింది. అందరూ

ఉన్నన్నాళ్ళు ఉన్నారు. వెళ్ళిపోయారు. పదహారు రోజుల పండగ మనకి ఇది వరకు ఉండేది కదా! ఇహ బంధువులు విసిగి పుట్టి పోవలసిందే. ఆయన పామ్మనడు. ఇట్లా అందరూ వెళ్ళిపోతూంటే కృష్ణుడు అట్లా ఉన్నాడట. ఎప్పుడు అట్లా ఉండడు ఎక్కడా. ఏదో మహత్తరమైన విషయం వుండకపోతే కృష్ణుడుండడు కదా అని వ్యాసుడుండి పోయాడట. అందరూ వెళ్ళిపోయారు. కృష్ణుడు, వ్యాసుడు మాత్రమే మిగిలారట. కృష్ణుడు ఎందుకున్నాడో తెలియక అది తెలుసుకోవాలని వ్యాసుడు ఉన్నాడు. వ్యాసుడున్నంత కాలం కృష్ణుడేమీ మాట్లాడలేదు. ఏదో కబుర్లు చెప్పకుంటూ కూర్చున్నారు. రోజూ కబుర్లు, షికార్లు. ఇంతే పని. చూశాడు చూశాడు వ్యాసుడికి అర్థం అయ్యింది. మనం ఉంటే గురువుగారు విప్పడు అనుకున్నాడు. వెళ్ళిపోయాడు. వెళ్ళిపోగానే ధర్మరాజుకి చెప్పాడు 'రాబోయే కాలమంతా శుభ్రమైంది కాదు. చాలా జన నష్టం ఉంది. కౌరవులు చాలా ఈర్ష్యతో వెళ్ళారు. వాళ్ళు సహించలేరు ఇదంతా. ఏదో మొదలు పెడతారు. ఈ మొత్తానికి నీవు కారణం కాకూడదు. నువ్వు నాకు కావల్సినవాడివి కాబట్టి అదొక్కటే నేను కోరుకునేది. గుర్తుపెట్టుకో' అని. అయితే ఏం చెయ్యమంటావ్ అంటే ఈ రోజు నుండి ఎవడు నీతో ఏది మాట్లాడుతున్నా, నేనే మాట్లాడుతున్నాననుకుని చేసేసెయ్ అన్నాడు. అంతేనంటావా అంటే అంతే ఎవరు వచ్చి ఏది నీతో మాట్లాడుతున్నా నేనే మాట్లాడుతున్నాననుకో. వాసుదేవోపాసన ఇచ్చాడన్నమాట. తప్పక! అన్నాడు. ఇలా వెళ్ళాడో లేదో రమ్మంటున్నారు జూదానికి అని కబురు వచ్చింది. వెళ్ళాడు. వాళ్ళే అక్కడ్నుండి ఒక్కొక్కడు suggest చేస్తూ వుంటాడు ఇది పణంపెట్టు, అది పెట్టుపణం. అది వుందికదా నీ దగ్గర, ఇది వుంది కదా నీ దగ్గర అని. మొత్తం అంతా అయ్యేవరకు చేస్తారు. అంతా అయిపోయిన తర్వాత అయితే నీకేం తమ్ముళ్ళున్నారు కదా! వాళ్ళని పెట్టు, నిన్నే పెట్టచ్చు కదా అంటూంటే పిచ్చాడా? అంత జ్ఞానే! ఏది అవతలవాడు చెప్తున్నా కృష్ణుడే! తన్ను పెట్టమంటారు. ఆ తర్వాత ద్రౌపదిని పెట్టమంటారు. ఆవిడ అడుగుతుంది. 'తన్నోడి నన్నోడేనా, నన్నోడి తన్నోడేనా' అని మెలికేస్తుంది. ఎవడూ వినడు. అంత భయంకరమైన కాలం ముందు ఉంది. వినకపోతే ధృతరాష్ట్రుడ్ని అడుగుతుంది. 'మీ ఆయన కన్నా ధర్మం ఎవరికి తెలుసునమ్మా! ఆయనే చేశాడు కదా! ఆయన్నే అడుగు' అంటాడు. ధర్మం తెలుసు.

'ఓడిపోయినవాడు బానిస అయిపోయిన తర్వాత ఇంకొక్కడ్ని పణం ఎలా పెడతాడు? పెట్టకూడదు'. ఆవిడ అది అడుగుతుంది. ఏం మాట్లాడడు. ఎందుకు మాట్లాడడు? ఇప్పుడు తన ఆచరించిన ధర్మం అంతకు ముందు రచించిన ధర్మాల్లో కాని, వేదాల్లో కాని, శాస్త్రాల్లో కాని, ఎక్కడా లేదు. ఆయన చెప్పాడు. చేస్తున్నాడు. ఏం మాట్లాడడు. అట్లా వుంటాడు. ఎంత కథ నడిచింది. మొత్తంలో ధర్మరాజు ఎక్కడా దెబ్బతినకుండా కాచుకుంటూ వస్తాడు. ఒక్కటే నీవల్ల యుద్ధం వచ్చిందని ఉండకూడదు. యుద్ధం రాకతప్పదు అని చెప్తాడు. అప్పుడే Astral Plane అంటామే ఆ లోకాల్లో నిర్ణయమైపోయింది. ఇహ ఊరికే అది భూమికి దిగుతుంది. మారదు. అప్పుడే అయిపోయింది. ఇంకా ఏదో 'ఆపాలి, ఆపాలి' అని వీళ్ళందరూ అంటూ వుంటే 'ఆపుదాం' అంటాడే తప్ప తెలుసు. అదే ద్రౌపదికి సమస్య. ఘర్షణ. అదేంటి తప్పదు. యుద్ధం వస్తుందంటావు. మళ్ళీ దూత అంటావు. రాయబారం అంటావు. అంటే అవునంటాడు. ఈ కక్ష్యలో చేయాల్సినవి ఈ కక్ష్యలో చేయటమే తప్ప అతనికి చాలా రూఢిగా తెలుసు. అయినప్పటికి రక్షించుకున్నాడు. అది ధర్మరాజు రక్షింపబడడానికి కారణం. అప్పుడే ఇవన్నీ ఒప్పుకోకపోతే అయిపోయింది కదా! మళ్ళీ ఆడమంటారు ఇంతా అయిన తర్వాత. ద్రౌపది చెప్పిన తర్వాత ఇదంతా అన్యాయమని ధృతరాష్ట్రుడు బాధపడిపోయి, ద్రౌపది కంటతడి పెట్టేసింది. ఇక మనం నాశనం అయిపోతాం. ఇటువంటి భయాలు వచ్చేస్తాయి. భయాలు వచ్చేసి ఎందుకైనా మంచిది, ఎందుకొచ్చిన గొడవలే అని అన్నీ ఇచ్చేస్తాడు. ఇచ్చేస్తే మళ్ళీ ఆడుదాం అంటారు. మళ్ళీ ఆడుతారు. అట్లా ఎవరన్నా ఆడతారాండీ! అసలు మామూలుగా ధర్మరాజు ఆడతాడా? మనకన్నా తక్కువ తెలివి వాడు అని అనుకోవడానికి ఏ మాత్రం వీలులేదు కదా! ఆడాడు. ఏమిటిది? అంటే మొత్తం ఆయన జ్ఞానం, ఆయన వివేకం, ఆయన బుద్ధి ఇవన్నీ మనం బేరీజు వేసుకుంటే ఇట్లా చేయగలడా? ఇట్లా చేస్తాడా అటువంటి వాడు? ఎందుకు చేసాట్ట? ఎవరన్నా మాస్టారులాంటి వాళ్ళు మనలోకి వచ్చినప్పుడు చెప్పాలి. మాస్టరుగారు చూపించారు. ఇట్లా వ్యాసుడున్నంతలో మాట్లాడకపోవడం. ఆ తర్వాత పాండవులంతా వీడ్కోలు చెప్తూంటే చిట్టచివరికి రథం ఎక్కేముందు ధర్మరాజుని పిలిచి ఒక్క వాక్యం చెప్పాట్ట. ఏం చెప్పాడో ఉండదు.

మైత్రేయుడికి ఏం చెప్పాడు కృష్ణుడు? ఎవరికీ తెలీదు. మళ్ళీ ఆ పరంపరకు సంబంధించిన వాళ్ళు వస్తే కదా మనకు తెలిసింది. ఏం ఉంటుంది భాగవతంలో? శరీరం వదిలేసినప్పుడు మైత్రేయుడు పక్కన ఉన్నాడు. ఇంకెవరూ లేరు. అంతవరకూ తెలుసు. మైత్రేయుడు ఏవో చాలా అడిగాడు. ఎందుకంటే శరీరత్యాగం చేస్తున్నాడు ఆయన. ఈయన ఇక్కడ ఉండేవాడు. అడిగాడు. అడిగితే అన్నిటికీ ఒకటే ఉంటుంది. మైత్రేయుడికి అడిగినవాటికన్నింటికీనూ 'శ్రీకృష్ణభగవానుడు బ్రహ్మజ్ఞానంబొసంగె' అంటాడు. బ్రహ్మజ్ఞానం అయితే మూడు గంటలు ఏం చెయ్యాలి? వాళ్ళిద్దరికీ జరిగిన సంభాషణ మళ్ళీ మనకందింది కదా! ఎటువంటి direction ఇచ్చాడు. Guidence ఇచ్చాడు. అంటే ధర్మరాజుకి కూడా అట్లా చెప్పాడు. అట్లా భక్తులు ఒడిపట్టి ఉంటారు భగవంతుణ్ణి నమ్మి. Complaints వుండవు. అంతే! అట్లా ఉండడం అన్నమాట. 'ఎందుకనంటే ఇదివరకు నువ్వు వేసిన బాణాలే ఇప్పుడు వస్తున్నాయి నీ దగ్గరకి. అందుకో. నేనున్నాను నీకు. నీవు సిద్ధంగాలేవో దెబ్బలు తింటావు. సిద్ధంగా వుండు దెబ్బలు తగలవు'. ఇది ఈ 'సర్వప్రహరణాయుధః' అనే నామంలోంచి ఏదో కొంత మనం అట్లా అట్లా సూదిలోంచి దారం లాగితే మనకొచ్చే అవగాహన. మనకి ఈ విష్ణుసహస్రనామాలు అనే సరికి మనలో లేశమాత్రమన్నా ధీరత్వం వస్తుందేమో అని సాధన. సాధకులకి ధీరత్వం కావాలి. మన బలం చాలదు. అందులో సందేహం లేదు. కానీ 'ఎవరి బలం సమస్తానికి బలమో వాడి బలంతో అనుసంధానం చెంది చేస్తున్నాం కాబట్టి మనం నశించము' అనే ఒక్క ధైర్యంతో ముందుకు వెళుతూ శార్ఙ్గి వుండాలి.

1034 వనమాలి

వనమాలీ గదీ శార్ఙ్గీ శంఖీ చక్రీ చ నందకీ.
శ్రీమాన్నారాయణో విష్ణుః వాసుదేవో అభిరక్షతు.

అనే ఈ శ్లోకం 108 శ్లోకాల పెట్టు. మరి అప్పుడు 108 శ్లోకాలు చదవగలిగితే చదువుకోవచ్చు. లేకపోతే ఈ ఒక్క శ్లోకం చదువుకుంటే ఏ రక్షణ, ఏ యోగక్షేమం మనం కోరుతున్నామో, ఏ అనుగ్రహం అయితే మనం కోరుతున్నామో అది సమస్తం మనకి ఈ ఒక్క శ్లోకం ద్వారా అందుతుంది. అటువంటి అమరిక ఈ శ్లోకంలో ఉన్నది. అందుకని ఈ శ్లోకంలో భీష్మాచార్యుల వారు శ్రీకృష్ణుని ఉద్దేశించి పరతత్వాన్ని, సృష్టిలో భగవత్తత్వాన్ని వేయి ఎనిమిది నామములుగా మనకు అందించడం జరిగింది. వాసుదేవుడు ఎప్పుడూ రక్షిస్తూ ఉండాలి అనే ఈ చివరి శ్లోకం మామూలుగా మంత్రంగా కూడా చదువుకోవచ్చు. ఇందులో వాసుదేవో అభిరక్షతు అనేది ఒక మహామంత్రం. ఆ మంత్రాన్ని నిత్యం పలిస్తూ ఉంటే, కష్టంలో ఉన్నప్పుడు పలిస్తూ ఉంటే, రోగం వచ్చినప్పుడు పలిస్తూ ఉంటే, భయం వేసిన వెంటనే పలిస్తూ ఉంటే, భగవత్సాన్నిధ్యం కోసం పలిస్తూ ఉంటే సహస్ర నామములు పలించిన బలము, స్ఫూర్తి, శక్తి వాసుదేవోభిరక్షతు కూడా, 'శ్రీమాన్నారాయణో విష్ణుః వాసుదేవో అభిరక్షతు' అని పలకగలిగితే ఇంకా మంచిది. ఎందుకనంటే భగవంతుని యొక్క విష్ణు తత్వము, వాసుదేవ తత్వము, నారాయణ తత్వము మూడూ కలిపి ఇచ్చిన శ్లోకపాదం. మొత్తం భాగవతంలో మనం నిర్ణయించి చూసుకున్నట్లయితే మొత్తం భాగవతతత్వం అంతా కూడా విష్ణు రూపంగానూ, వాసుదేవ రూపంగానూ, నారాయణతత్వంగానూ మనకి ఋషులు వివరించి ఇచ్చారు. కనబడుతున్న రూపం అంతా విష్ణువుగా భావన చేయమన్నారు. ఈ రూపములోంచి వైవిధ్యము గల ప్రవర్తనలు జరుగుతూ ఉన్నప్పుడు అది వాసుదేవతత్వంగా దర్శనం చేయమన్నారు. ఆ ప్రవర్తనకు వెనకాల ఇంతమంది జీవులకూ ఆధారభూతంగా ఉన్న తత్వాన్ని నారాయణతత్వంగా మనకు అందించారు అందుకని విష్ణు, వాసుదేవ, నారాయణ తత్వములు మూడూ కలిసి, సమస్త జగత్తునకు ఆధారముగా మనకి వైష్ణవ సాంప్రదాయములో చెప్పడం ఉన్నది.

అందుకని రూపములుగా గానీ, స్వభావములుగా గానీ, దాన్ని మించిన తత్వముగా గానీ వ్యాపించిన ఏ తత్వమైతే ఉన్నదో ఆ తత్వము నన్ను ఎప్పుడు రక్షిస్తూ ఉండాలి. అంటిపెట్టుకుని ఉండి రక్షించుతూ ఉండాలి అని చెప్పడానికి 'అభిరక్షణ' అంటారు. అంటే వెన్నంటి ఉండడం అంటాం చూశారా! అట్లా వెన్నంటి ఉండే తత్వంగా ఈ మూడిటి నామాలు కలిపి 'శ్రీమాన్నారాయణో విష్ణుః వాసుదేవో అభిరక్షతు'. అంటే మనకి విష్ణు గాయత్రిలో కూడా ఈ మూడే ఉంటాయి కదా! "నారాయణాయ విద్మహే వాసుదేవాయ ధీమహి తన్నో విష్ణుః ప్రచోదయాత్" కాబట్టి అటువంటి మంత్రమే. అక్కడ ప్రచోదనం కోరుతున్నాం ఇక్కడ రక్షణ కోరుతున్నాం. అందుకని ఇది చివరి శ్లోకంగా ఇచ్చాడు భీష్ముడు. చివరి శ్లోకంగా ఉద్దేశించినది పరతత్వాన్ని రూపు కట్టుకుని దిగివచ్చిన కృష్ణ తత్వాన్ని ఉద్దేశించి ఇచ్చాడు. దానికి మనం ఏ విధంగా భావన చేయా అనే విషయాన్ని కూడా మనకి ఎరుక పరచడం కోసం వనమాలీ, గదీ, శార్ఙీ, శంఖీ, చక్రీ చ, నందకీ ఇవన్నీ ధరించిన విష్ణు రూపం. మనం ఈ విష్ణు సహస్రనామం చేసుకున్నప్పుడల్లా కూడా విష్ణువుని ఆపాదమస్తకమూ అంగాంగములు, వాటి యొక్క వెలుగు, వాటి యొక్క అందము, వాటి యొక్క ప్రతిభ అనుభూతి చెందుతూ నామ ఉచ్చారణ చేస్తూ స్తోత్రము చేయవలెను అని చెప్పి, మళ్ళీ ఇక్కడ కూడా చిట్టచివరి శ్లోకంలో:-

వనమాలీ: వనములో పూచిన పుష్పములను మాలగా ధరించిన మూర్తి.

గదీ: గదను ధరించిన వాడు.

శార్ఙీ: శారంగీ అనే విల్లుని ధరించిన వాడు.

శంఖీ: శంఖమును ధరించినవాడు.

చక్రీ: చక్రమును ధరించిన వాడు.

నందకీ: నందకము అనే కత్తిని ధరించినవాడు.

ఇవన్నీ మనలో కూడా పెంపొందాలి. మనలో మాలికగా లోపల There is the garland of letters అని చెప్తారు. వర్ణమాల ఉన్నదని చెప్తారు. ఈ వర్ణమాల ఎలా ఉన్నదయ్యా అంటే సమస్త బీజాక్షరములు సంస్కృతంలో ఉన్నవన్నీ కూడా కూడికగా క నుండి హ వరకు. క ఖ గ ఘు ఙ,

చ ఛ జ ఝ ఞ, ట ఠ డ ఢ ణ, త థ ద ధ న, ప ఫ బ భ మ, య ర ల వ శ ష స హ ళ క్ష . ఇవన్నీ కూడా లోపల మనకు ఉండే ఆరు కేంద్రములలో ఉండే పద్మ దళముల మీద అక్షరములు గానూ, పద్మముల కేంద్రములో బిందుస్థానంగా బీజాక్షరములుగానూ, సమస్తము ఏర్పడి మనలో ఒక వర్ణమాల ఉన్నది. అది ధరించి ఉన్నాడు. మన యందు భగవత్తత్వము పృథ్వీతత్వముగానూ, జలతత్వముగానూ, అగ్ని తత్వముగానూ, వాయుతత్వముగానూ, ఆకాశతత్వముగానూ ఆ పైన మనోతత్వముగానూ, బుద్ధితత్వముగానూ లేక జీవుడుగానూ- దేవుడు గానూ ఏడు స్థితులలో ఏర్పడి ఉండడానికి మనలో ఏడు కేంద్రములు ఉన్నాయి. ఈ ఏడు కేంద్రముల యందూ ఈ ఏడు కేంద్రములకు సంబంధించిన పద్మములు ఉన్నాయి. ఆ పద్మముల యందు ఒక్కొక్క పద్మ దళమునందు అక్షరము ఉన్నది. ఇవన్నీ మనము ధరించి ఉన్నాము. అవి ఎవరికి వ్యక్తం అవుతాయో వారు కూడా ఈ రకమైన వనమాలని ధరించినట్లే. యోగులు ఇటువంటి వనమాలని ధరించి ఉంటారు. మనం భగవంతుని యొక్క వనమాలను దర్శించినప్పుడు దాన్ని వైజయంతి అంటాం కదా! ఆ మాల విజయము నీకు చేకూర్చి పెట్టేది. అంటే తనలో ఉండే సమస్త తత్వముల యందు దానికి స్వామిత్వం కలిగినప్పుడు తను విజయుడై ఉంటాడు. అంటే సమస్తముతో అనుభూతి చెంది ఉంటాడు. అన్ని స్థితులూ తనయందే ఉన్నట్లు దర్శనం చేస్తూ ఉంటాడు. ఆకాశ తత్వము నుండి పంచభూతములూ దర్శనమే కాక తాను, తన పుట్టుక చోటు అయిన దైవము. దైవము జీవము రూపంలో ఉన్నది. జీవుడు, అహంకారం /ప్రత్యేకముగా ఉన్నాడు. అతనికి మనస్సు ఉన్నది. ఇంద్రియములు ఉన్నాయి. శరీరము ఉన్నది. ఇవన్నీ ఏర్పరచుకున్న ఈ 'సూత్రే మణిగణాఇవ' అని మనకి భగవద్గీతలో ఏ విధంగా భగవంతుడు చెప్పాడో ఒకే దారమునకు ఎక్కించిన పూసల వలే. అందుకనే ఈ పూసల దండలు ధరించడం. ఎందుకంటే మనలో సమస్తమైన విషయములూ ఒకే ఒక తత్వమును అనుసంధానం చెంది ఉన్నాయి. అది లేకపోతే ఇవన్నీ వేటికి వాటికే విడివిడిగా పడిపోతాయి. ఏ విధంగా ఒక పూసల దండలో మధ్యలో ఉండే దారం తెగితే పూసలన్నీ విచ్చలవిడిగా పడిపోతాయో మనలో ఉండే ఆ తత్వం కనుక అదృశ్యమైనట్లయితే ఇవన్నీ విడిపోతాయి. పంచ భూతములు

పంచభూతాల్లోకి కలిసిపోతాయి. శరీరంలో ఉండే పంచభూతములు చోటులో ఉండే పంచభూతాల్లోకి కలిసిపోతాయి. కాబట్టి ఈ విధంగా మన్ని కూర్పు చేసి ఉంచాడు. ఈ కూర్పు ఈ కేంద్రముల ద్వారా మనకి ఏర్పడింది. వాటినే యోగములో సామాన్య మానవుడి యందు చక్రముల వలే పనిచేస్తూ ఉంటాయి. యోగుల యందు పద్మముల వలే పని చేస్తూ ఉంటాయి అని చెప్తారు. చక్రముల వలే పనిచేయడం అంటే అర్థం ఏమిటంటే గుండ్రంగా తిరుగుతుంటాయని. అంటే గానుగెద్దు లాగా తిరిగే ఒక తత్వం ఉంది. పద్మముల వలే తిరుగుతుంటాయి అంటే వికసిస్తాయని. వికాసం వేరు. అదే పగలు, అదే ఉదయం, అదే మధ్యాహ్నం, అదే రాత్రి, మళ్ళీ అదే పగలు. ఇట్లా ఎన్నాళ్ళు పోయినా బుద్ధి యందు ఎదుగూ బొదుగూ లేకుండా ఒక యాంత్రికమైన జీవితాన్ని జీవించే వాళ్ళ అందరి యందూ కూడా చక్రముల వలే పనిచేస్తూ ఉంటాయి. చక్రములు ఏం నిర్దేశిస్తాయి అంటే తిరిగిందే మళ్ళీ అట్లాగే తిరుగుతూ ఉంటాం. అదేవిధంగా తిరుగుతూ ఉంటాం. ఎదుగు ఉండదు. పెరుగుదల ఉండదు. వికాసం చెందడం అనేది జరిగినప్పుడు ఈ చక్రములే పద్మములుగా మారతాయి అని చెప్పి బోధ చేస్తారు. ఈ పద్మముల యొక్క మాలికలే ఆయన ధరిస్తున్నాడు. ఎందుకంటే గోపగోపీజనులు కోనేర్ల యందు ఉన్న ఈ పద్మములను ఏరి తెచ్చి ఒక మాలగా చేసి ఆయనకు వేయడం, ఆయన అది వేసుకు తిరుగుతూ ఉండడం ఇట్లా జరుగుతూ వచ్చింది చిన్నప్పటి నుండీ కూడా. అది కారణం చేత వనంలో దొరికిన ఈ పద్మముల యొక్క మాలను ధరించిన వాడిగా మనకి తెలియచెప్తారు. మన వరకు రహస్యార్థంగా గమనించవలసింది వనమాలలో, మనలో ఉండే ఈ పద్మముల యొక్క మాల అది సుషుమ్న అనే ప్రవాహము మనలో. సత్వమునకు సంబంధించినది. అది ఇడ, పింగళ అనే నాడులు. మొత్తం ఇవన్నీ కలిసి లోపల ఒక మాలగా తయారయింది. ఈ సుషుమ్న నాడి ఆధారంగా ఏర్పడిన ఈ చక్రములు పద్మములు అవడం, వాటిలో దళములు ఉండడం, వాటి దర్శనం చేయడం ఇవన్నీ కూడా 'షట్చక్ర నిరూపణము' అనే ఒక యోగ శాస్త్రము ఉన్నది. అందులో వీటి గురించిన సమస్త వివరణము ఉన్నది. మూలాధార కేంద్రంలో ఏ పద్మమున్నది, ఏమి రంగు ఉన్నది, ఎన్ని దళములు ఉన్నాయి, బీజాక్షరములు ఎన్ని ఉన్నవి, దళముల మీద ఏమి

ఉన్నది, కేంద్రమునందు ఏమి ఉన్నది, ఆ విధంగా దాని యొక్క తత్వం ఏమిటి, అక్కడ ఉండే దేవత ఏమిటి, దానికి ప్రత్యధి దేవత ఏమిటి, అధిదేవత ఏమిటి, ఇలా మనకి వివరణ ఉన్నది. ఇవన్నీ వాటి మీద మనం భావన చేయడం వల్ల ఏమవుతాయంటే మనలో అవి ప్రచోదనం చెందుతాయి. మనకేది తెలిస్తే దానియందు మనకి అది మనలో పనిచేస్తూ ఉంటుంది. మనలో ఉన్నవి మనం తెలుసుకోవడం వలన అవి పనిచేయడం జరుగుతుంది. కేవలం తెలియడం వలననే. తెలియక పోవడం వలన దానిని వాడుకోవడం ఉండదు. మన ఇంట్లో ఏదైనా వస్తువు ఉందనుకోండి. మనకి తెలియదనుకోండి దాని వాడుక ఉండదు. తెలియడం చేత వాడుక ఉంటుంది. అట్లాగే ఒంట్లో ఉండే శక్తులన్నీ తెలియడం వాటిని వాడుక. లలితా సహస్రనామం నందు కూడా వీటన్నిటినీ చక్కగా వివరించి ఇచ్చారు. ఏ ఏ కేంద్రములు మనం, ఢాకినీ ఉన్నది. రాకినీ ఉన్నది. లాకినీ ఉన్నది. కాకినీ ఉన్నది. హాకినీ ఉన్నది. సాకినీ ఉన్నది. ఇవన్నీ వరుసగా ఇవే క్రమంలో స్థూలం నుండి సూక్ష్మం వరకు ఉన్నవి. వీళ్ళందరికీ ఒక్కొక్కళ్ళకీ ఎన్నెన్ని తలకాయలున్నాయి చెప్తారు. ఏ ఏ రంగులున్నాయి అని చెప్తారు. 'అనాహతాబ్జ నిలయా శ్యామాభా వదనద్వయా' శ్యామ రంగు అంటే నీలమైన రంగులో ఉన్నావు. హాకినీ అంటారు. అంటే అక్కడ 'హకారం' బీజాక్షరం. ఇట్లా లలితా సహస్రం అంతా కూడా మంత్రపూతమైనది. ప్రత్యేకించి ఈ షట్చక్రములు, వాటి దేవతలు, వాటికుండే రంగులు, ఎన్ని ముఖములు కలిగి ఉన్నది, ఏ ఏ ఆహారము ఆయా చక్రములకు ప్రీతికరమో కూడా మనవాళ్ళు నిర్ణయం చేసి ఇచ్చారు. అంటే ఆహారము, వర్ణము, శబ్దము, దేవత ఇలా ఇచ్చుకుంటూ వచ్చారు. ఇది తెలియడం వలన మనయందు ప్రచోదనం కలగడానికి అవకాశం ఉంటుంది. అందుకని మనం చేసే దుర్గా పూజలు కూడా మూలాధారంతో మొదలుపెట్టి ఆజ్ఞ వరకూ ఒక్కొక్క చక్రానికి సంబంధించిన దేవతగా ఒక్కొక్క స్తోత్రం చేయడంగా మనం నిర్మాణం చేసుకున్నాం ఈ వనమాలని మనం మనలో అభివృద్ధి చేసుకోవడం కోసం. దీనినే వర్ణమాల అని కూడా అంటారు. ఎందుకంటే ఆ పద్మముల మీద ఈ అక్షరములు / వర్ణములు ఉన్నాయి. కాబట్టి మనలో ఉండే మనం ఇన్ని అక్షరాలు పలుకుతున్నాం కదా! ఈ పలికే అక్షరములన్నీ

కూడా లోపల ఆ పద్మములలో ఉన్నవే. వాటిని ప్రత్యేకంగా జ్ఞానముతో అంటే తెలిసి పలికినట్లయితే ఆ దళము మీద ఉండే ఆ అక్షరాన్ని ఆ విధంగా అనుసంధానం చెంది పలకడం చేత అది ప్రచోదనం చెందుతుంది. ఇవన్నీ మంత్ర శాస్త్రానికి సంబంధించిన రహస్యాలు. చాలా పవిత్రమైన దినచర్య ఉండే వాళ్ళు మాత్రమే చేసుకోగలిగినవి. మిగతా వాళ్ళకి వీలుపడేవి కాదు. అట్లా మనకి మూలాధారము నుండి శబ్దములు ఉన్నాయి. అన్ని కేంద్రములకీ ఉన్నాయి. అన్ని దళములకీ ఉన్నాయి. వాటిని ఏఏ దళము మీద ఏ ఏ అక్షరం ఉన్నది! కఠోపనిషత్తు అనే దాంట్లో మనకి క ఠ అనే రెండు అక్షరములు. కఠ ఉపనిషత్తు అంతే కదా! అది చక్కటి వివరణం శివానందమూర్తి గారు ఇచ్చారు. చదువుకోవాలి. ఏమని ఇచ్చారు, ఉన్నదే! తెలిసిన వాళ్ళకి కనిపిస్తుంది. తెలియని వాళ్ళకి కనిపించదు. కఠ అంటే ఏమిటి, కఠినంగా ఉంటుందనా. ఏమిటండీ అంటే అందులో యముడ్ని నచికేతుడు కలుస్తాడు. మరణం గురించి అడుగుతాడు. మరణం గురించి యముడు ముందు వద్దంటాడు. ఎందుకులే అని చెప్తాడు. చివరికి రహస్యం చెప్తానంటాడు. ఏం చెప్పాడో మనకి తెలియదు. కఠ అంటే క ఖ గ ఘు ఙ, చ ఛ జ ఝు ఞ, ట ఠ అంటే ఎన్ని అయినాయి అక్షరాలు, 12 అక్షరాలు అవుతాయి, 12 అక్షరముల పద్మము. అంటే 12 దళముల పద్మము హృదయంలో ఉందని చెప్పి మనకి యోగ శాస్త్రం చెప్తుంది. యోగ శాస్త్రంలో ఇవే అక్షరములు అక్కడ దళముల మీద ఉన్నట్లు చెప్తారు. కాబట్టి ఈ దళముల యొక్క అభివృద్ధి, పరిణామము, వికాసం చెందుట ఇవన్నీ కూడా అనాహత చక్రమునకు సంబంధించినవి. అనాహత చక్రం గనక మీకు వికసించినట్లయితే మనిషికి మృత్యువు ఉండదు. అంటే హృదయస్థుడైన భగవంతుని యొక్క సాన్నిధ్యం పొందినవాడు మరణాన్ని దాటినవాడు అవుతాడు అనేది అక్కడ మనకి ప్రతిపాదింపబడి ఉన్నది. హృదయమునందు నీ చైతన్యము పెరగాలంటే దానికి కొంత నియమములు ఉన్నాయి. ఏమిటా నియమములు అంటే మొట్టమొదట నియమము నాకొరకు అనేది, నాకేం కావాలి అనే దానికన్నా ఇతరులకు నేనేం చేయాలి ఈరోజు, ఈరోజు నన్ను నిద్ర లేపింది ఎవరికి ఏం చేసి పెట్టడానికి? అనే భావంతో లేవాలి. ఈరోజున మనం ఏం పొందాలి? అనుకునే వాళ్ళకి చక్రములే ఉంటాయి సుడిగుండాల్లాగా. ఈరోజు నిద్ర

మనం లేవలేదు. మన్ని లేపారు. లేపినందుకు జగత్ కళ్యాణంగా, దైవకార్యంగా, మన కర్తవ్యంగా, మనం ఎవరెవరికి ఏమి చేసి పెట్టాల్సి ఉందో దానికి విసుగు చెందకుండా, రొష్టుపడకుండా, కష్టపడకుండా, తిట్టుకోకుండా, కొంతమందికి తప్పనిసరి పరిస్థితిలో సేవ చేసేవి ఉంటాయి. కొంతమంది స్వచ్ఛందంగా చేస్తారు. తప్పనిసరిగా చేసుకొనడం కన్నా స్వచ్ఛందంగా దాన్ని మార్చుకోవచ్చు. భగవంతుడు అవకాశం ఇచ్చాడనుకుంటే స్వచ్ఛందం అవుతుంది. అందరికీ ఇవ్వడు అవకాశాలు. కొంతమందికి ఇస్తాడు. ఇచ్చినప్పుడు దాన్ని ఆనందంతో నిర్వర్తించుకున్నట్లయితే అందులోంచి మిగిలేది అనుభూతి. అలా కాకపోతే అదే చాకిరీగా ఉంటుంది. అక్కడ విషయం ఒకటే అయినప్పటికీ మహాత్ముడికి అది భగవదనుభూతిగా అవకాశాన్నిస్తుంది. మరొకరికి దుఃఖాన్ని, కష్టాన్ని, బరువుని, బాధ్యతలని వీటినే గుర్తు చేస్తున్నట్లుగా ఉంటుంది. అందుకని నిద్ర లేచిన దగ్గరనుంచీ మనం జీవుల శ్రేయస్సు కొరకే మనల్ని లేపాడు, మన శ్రేయస్సా? వాడు చూసుకుంటాడు. ఈ ధీరత్వం వచ్చినవాడే అనాహతంలో ప్రవేశించగలడు. అది లేనివాడు ప్రవేశించలేడు. మనకి మామూలుగా కూడా 'మన చుట్టూ ఉండే వాళ్ళకి మనం ఏం చేయగలం' అనే ఆ ఎరుక ఉండాలి. చేయడం కోసం ఆరాటపడిపోయి కాళ్ళూ వేళ్ళు పెట్టకూడదు అందరికీనూ. అడిగితే చేయాలి. ఆడగకపోతే వేచి ఉండాలి. చేసే స్ఫూర్తి ఉండాలి. అడిగితే అవకాశంగా తీసుకుని సేవ చేసుకోవాలి. ఎక్కడ అడుగుతారో అని తప్పించుకు తిరుగుతూ మనం స్తోత్రాలు చదువుకుంటూ ఉన్నాం అనుకోండి అదొక స్థితి. ఎక్కడా ఒక మనిషి కష్టపడుతుంటే మనం కనీసం ఒకవేలు కూడా పెట్టకుండా, అక్కడ ఏమి సాయం చేయకుండా పూజలు పునస్కారాలు మాత్రమే చేసుకుంటూ ఉన్నాం అనుకోండి, ఉంటారు మనకి. ఇది ముఖ్యంగానీ అది ముఖ్యం కాదా? ఏం రాదు. ఇవన్నీ దేనికి దారి తీయాలి అంటే హృదయము యొక్క ద్వారములు తెరువబడడానికి ఉపయోగపడాలి. ఒక్కళ్ళు కష్టపడుతుంటే పదిమంది ఏవో కబుర్లు చెప్పుకుంటూ ఉన్నారనుకోండీ, భగవంతుడు మెచ్చుకునే విషయం కాదు. కదా! శ్రేయస్సు కోసం పనిచేసే వాళ్ళకి తోడ్పాటు పడడంలో కూడా ఆనందం ఉన్నది. పదిమంది కోసం పనిచేసే వాళ్ళతో కలిసి పని చేయడంలో ఆనందం

ఉన్నది. ఆ.. వాడు చూసుకుంటాడులే మనకెందుకు, మన దారి మనం అనుకోవడంలో ఆనందం లేదు. కదా! అందుకని హృదయంలో నేను ఈ రోజున ఎవరికి ఏ విధమైన సేవ నిర్దేశించావో అది నిర్వర్తించుకోవడానికి నేను సంసిద్ధుడను అని చెప్పకుంటే మనం పాద్దున్నే చేసే చాలా గొడవ కన్నా పూజల పేరున ఇది చాలా ఉపయోగం. మనకెందుకంటే ఈ పూజాదికములు సరియైన ఫలములు ఇవ్వకపోవడానికి కారణం అవి వేటికి నిర్దేశింపబడ్డాయో ఆ ముఖ్యమైన ఉద్దేశాన్ని తలకిందులు చేయడం వల్ల మనకవన్నీ ఊరికే ఒక డాంబికంగా మాత్రమే మిగిలిపోతూ ఉంటుంది అందుకని దేన్ని నిర్దేశించాడో అవి చేస్తూ ఉంటూ ఉంటే దీనివలన ఇంకా దానికి కొంత రాణింపు వస్తుంది. అది లేకుండా ఇది చేస్తుంటే రాణింపు రాదు. వికటిస్తాయి. ప్రతిదీ ఎందుకు? అనిపిస్తూ ఉంటుంది. అందుకని ఈ భావం మనలో కలగాలి. కలగాలి అంటే ఈ వనమాల గుర్తుపెట్టుకోవాలి. ఎప్పుడూ మనకి పండే. 'ఎన్నడో మా కలలు పండుట ఎన్నడో సెలవీయుమా' ఉంది కదా పాట. 'జాలమేలరా సాకేత రామా' అని పాడుకుంటాం. అంటే 'జాలం నా దగ్గర లేదు రా, నీ దగ్గరే ఉంది' అంటాడు. నువ్వేం చెయ్యవు, నేను నీకు లోపల్నుండి కనబడాలని అనుకుంటావు, complaint లేకుండా చేయి. చేయడానికే ఇచ్చాడు శరీరం. దాచుకోడానికి కాదు. ఎంత చేస్తే అంత ఉన్నది. 'చేసుకున్న వారికి చేసుకున్నంత మహాదేవ' అంటారు కదా! ఒళ్ళు అలిసి పోయేంత ఇతరులకు ఏమన్నా చేయగలిగిందంటే సాయమే! నిన్నేం కొండలు ఎత్తమనడం లేదు కదా! పాలాలు దున్నమనడం లేదు, నారు పోయమనడం లేదు, పదిమందికి పనికి వచ్చే పనిలో మనం కూడా ఓ భాగంగా పనిచేయగలమా? చేస్తుంటే ఊరికే చోద్యం చూస్తూ ఉండి పోగలమా? పోనీ ఈ సహస్రనామం చెప్పకున్నాం అనుకోండి. ఆరు ఏళ్ళు ఇక్కడ పరదాలు పరిచిన వారికి, ఇవన్నీ ఈ mike arrange చేసిన వారికి, నలుగురికి అందాలనే తపనతో ఏవో tape లు చేసిన వాళ్ళకి, దీన్ని ఈ విధంగా రోజు రోజుకి చక్కగా అమరిక చేసిన వాళ్ళు అదృశ్యంగా ఉంటారు కదా! భగవంతుడి దృష్టిలో వాళ్ళకెక్కువ ఉంటుంది. వచ్చిన వాళ్ళకి ఉండదా అండీ అంటే, ఉంటుంది. కానీ వాళ్ళతో పోల్చి చూస్తే వీళ్ళకి తక్కువ ఉంటుంది. అదే మాస్టర్ గారు చెప్పారు గురుపూజల్లో మొగపెళ్ళి వాళ్ళు,

ఆడపెళ్ళి వాళ్ళు ఉంటారు అని. మగ పెళ్ళి వాళ్ళు అంటే అట్లా వచ్చి షోగ్గా మంచి మంచి బట్టలు వేసుకుని విని వెళ్ళిపోతుంటారు, తిని వెళ్ళిపోతుంటారు. వింటం తింటం. ఈ వింటానికే తింటానికే ఇక్కడ ఏర్పాట్లు ఎట్లా జరుగుతున్నాయి? ఇది ఎవరు చేస్తున్నారు? ఇందులో మనం ఏం చేయాలి? అనే వాళ్ళు కొంతమంది ఉంటారు. వాళ్ళకి ఇవి వికసిస్తాయి. మిగతా వాళ్ళకి ఊరికే దూరం నుండి అందంగా కనిపిస్తూ ఉంటాయి. అంటే ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ వెళ్ళాలి కదా! ఇలా ఉందని ఊరికే మీకు ఉదాహరణకి చెప్తున్నాను. ఇక్కడ పూలదండలు వేస్తారు. అగరొత్తులు వెలిగిస్తారు. దీపాలు పెడతారు. ఇవన్నీ ఎవరు చేస్తున్నారు? మనమెందుకు చెయ్యకూడదు? మనం కూడా అందులో పాలు ఎందుకు పంచుకోకూడదు? ఇటువంటి భావాలు ఎందుకు రావు? రావాలి. Class అయిపోతుంది కాబట్టి చెబుతున్నా. ఇంక ఇప్పుడేం చేసేది లేదు. ఇంకెప్పుడన్నా ఎక్కడన్నా అవకాశం ఉన్నప్పుడు అట్లా చేసుకోండి. అగరొత్తులు ఎవరు తెచ్చి పెడుతున్నారు? దీపాలు ఇక్కడ ఎవరు తెచ్చి పెడుతున్నారు? దండలు ఎవరు తెచ్చి పెడుతున్నారు? Cassets ఎవరు ఇక్కడ తెచ్చి పెడుతున్నారు? ఎవరూ అడగరు. ఎందుకంటే ఎవడికి వాడు ఇది ఒక అవకాశం అనుకుని చేసుకుంటూ ఉంటాడు. నువ్వు కూడా కలిస్తే కలుపుకుంటారు. అంతేగానీ కలవమని అడగరు. అది యజ్ఞం అంటే.యజ్ఞార్థం అంటే ఏమిటంటే అసలు ఎవరు ఏది చేస్తున్నారో తెలియకుండా, నేనొక్కడినే కనిపిస్తా ఇక్కడ ఏదో చేసే వాడిగా, ఏదో విష్ణు సహస్రనామం వివరణం చెప్పే వాడిగా. కానీ ఇది తెరమీద నాటకం. తెర వెనుక ఎంత మంది పనిచేస్తున్నారో. తెర వెనుక పనిచేసే వాళ్ళందరికీ కృతజ్ఞత, అభివందనములు అనేవి చెప్పాలి కదా! కానీ వాళ్ళు వాటికి కూడా ఎదురు చూడరు. ఎందుకనంటే అట్లా రహస్యంగా తమ సమయాన్ని ఏవో తమకున్న శక్తిలోనే, సామర్థ్యంలోనే కాస్తో కూస్తో దానికి సమర్పణ చేస్తూ జీవించే వాళ్ళుంటారు. వాళ్ళకి అవకాశం ఉంటుంది వికాసానికి. మిగతా వాళ్ళకి విన్నది కొంత వినియోగపడుతుంది. మరికొంతమందికి మర్చిపోతూ ఉంటుంది. మళ్ళీ కొత్తగా ఉంటుంది. మళ్ళీ ఇంకోటి మొదలు పెడితే మళ్ళీ దాంట్లో కూడా వింటూ ఉంటారు. అందుకని ఇది విచ్చుకోవాలంటే అసలు దైనందిన జీవితంలోనే సమర్పణ బుద్ధి, యజ్ఞార్థ

బుద్ధి, త్యాగబుద్ధి, మనం పొందే దానికన్నా మనం చేసేది ఎక్కువ ఉండాలి. ఎవరికైనా సరే. ఒక మనిషి దగ్గర నుండి ఏదైనా చేయించుకుంటుంటే అంతకుమించి ఆ మనిషికి చేయగలిగిన స్తోమత, సమర్థత, స్థితి నీకు ఉంటే ఆ మనిషి చేత చేయించుకోవచ్చు. లేతే చేయించుకోకూడదు. బాకీ పడిపోతావు. గుర్తుపెట్టుకో. ఇదంతా మొత్తం double entry book keeping system. Accountancy. చేయించుకుంటూ ఉంటే debits పడిపోతూ ఉంటాయి. ఋణం. రుణసంజ్ఞ. చేస్తూ ఉంటే credits పెరిగిపోతూ ఉంటాయి. ధనసంజ్ఞ. ధనసంజ్ఞ నిన్ను ఉత్తర ధ్రువంగా తీసుకు వెళుతుంది. ఋణసంజ్ఞ నిన్ను దక్షిణ ధ్రువంగా తీసుకు వెళుతుంది. అందుకని ఇన్ని కార్యక్రమాలకి వస్తూ, ఎప్పటికీ తెమలక కూరుకుపోయే వాళ్ళు ఉంటారు సందిగ్ధంలో పడిపోయి. ఇన్ని కార్యక్రమాల్లోనూ పాల్గొంటూ స్ఫూర్తి చెంది ముందుకెళ్తున్న వాళ్ళు కూడా ఉంటారు. ఏమిటి వాడికీ వీడికీ తేడా అంటే ఇద్దరూ వింటూనే ఉన్నారు. ఒకడు అటు పోయాడు. ఇంకోడు ఇటు పోయాడు. ఏమిటయ్యా అంటే ఒకడు పొందే వైపు వెళ్ళాడు. ఇంకోడేమో అందించే వైపు వెళ్ళాడు. ఈ వనమాల దర్శనం ఇవ్వాలంటే అందించే వైపుగా వెళ్ళాలి.

1035 గదీ

గది ఇప్పటికి మూడుసార్లు వచ్చింది. ఎందుకు ఇన్నిసార్లు ఈ గద గురించి బాధపడుతున్నాడు భీష్ముడు. ఒక్కొక్కసారి ఒక్కొక్క రకంగా చెప్పుకుంటున్నాం 'గద' వచ్చినప్పుడు. ఇవాళ గద అంటే ఇంకోటి చెప్తా. గదుడు అనే ధైత్యుడు. అంటే దితికి పుట్టినవాడు. కశ్యప ప్రజాపతికి అదితి నుండి ఆదిత్యులు, దితి నుండి దైత్యులు పుట్టారు. అందులో దితికి పుట్టిన గదుడు అనే వాడు మహా పరాక్రమవంతుడు, మహా బలవంతుడు, తేజోవంతుడు, యోగ సంపన్నుడు అయి, కొంత ధర్మవిరుద్ధంగా పనిచేస్తుంటే విష్ణుమూర్తి చేత సంహరింపబడవలసి వస్తుంది. ఒకపక్క ధర్మాత్ముడు అంటే జ్ఞానవంతుడు బాగా. యోగ దర్శనం చేసిన వాడు. పరిపూర్ణ యోగి అయివుండి కూడా ఇటువంటి పనులు చేయడం వలన అతన్ని సంహరిస్తున్న సందర్భంలో అతను వరం కోరాడు. నీ చేత సంహరింపబడడానికి నేను ఇవన్నీ చేశాను. (కొంతమంది అట్లా ఉంటారు. కొడితే వాడి చేత కొట్టించుకోవాలి అన్నట్లు.) కాబట్టి నువ్వు నన్ను వినియోగించుకో అని. వాడు గజాసురుడు చెప్పాడు చూడండి ముందేమో నా పొట్టలో ఉండమన్నాడు. తర్వాత బాగా పరిణితి చెందిన తర్వాత, కనీసం నన్ను దేనికైనా వాడుకో నువ్వు అని చెప్పాడు. అంటే ఆయన తలకాయ తీసుకెళ్ళి కొడుకుకు పెట్టి, ఆయన తోలు తీసుకుని ఈయనే కప్పుకున్నాడు బట్టలుగా. అట్లా ఈ గదుడు అనే వాడు కోరుకున్నాడట నన్ను నీవు శాశ్వతంగా నీ సాన్నిధ్యంలో ఉంచుకుని వినియోగించుకోమంటే, మంచి యోగ సంపత్తి కలవాడు కాబట్టి ఆయన cerebrospinal system నుండి ఒక గద తయారు చేసుకున్నాడట ఈయన. అది కథ. పురాణంలో విష్ణుమూర్తి గద కి అటువంటి కథ ఉన్నది. అది గద. ఇంకో కథ ఏమిటయ్యా అంటే అసలు గదుడు అగదుడు అనే ఇద్దరు అశ్వినీ దేవతలుగా ఉన్నారుట. అంటే మైత్రా వరుణులు లాగానే గద అగద. అందులో మిత్రతత్త్వం అంతా ఏమిటయ్యా అంటే దేన్నుంచి సమస్తమూ ఏర్పడుతుందో అది మిత్రతత్త్వం. ఈ ఏర్పడుతున్న దాన్ని పొంది ఉండే తత్త్వాన్ని వరుణతత్త్వం అంటారు. వరుణుడు పాత్ర. మిత్రుడు పాత్రలో ఉండే పదార్థం. అంటే మనం జీవుడుగా

వరుణుడు అయితే, అందులో ఉండే దేవుడిగా మిత్రుడు ఉంటాడు. దేహిగా వరుణ తత్త్వం ఉంటే దేహంలో ఉండే జీవుడుగా మిత్రతత్త్వం ఉంటుంది. The container and the contained అది. పాలుగా మిత్రుడు ఉంటే పాల గిన్నెగా వరుణుడు ఉంటాడు. ఏదన్నా ఒకటి ఉండాలంటే దాన్ని పట్టి ఉంచడానికి ఒక ఉపాధి ఉండాలి గదా. ఇట్లా అసలు తత్త్వమే తను ఉపాధిగా దిగిరావడానికి ఒక ప్రకృతిని తయారు చేసుకుంది. సంకల్పం ఆయన లోంచి రావడమే వరుణుడు. సంకల్పంలోకి ఆయన దిగడం మిత్రుడిగా దిగుతాడన్నమాట. అందుకని మిత్రా-వరుణులు, అశ్వనీ దేవతలు. మనకి అంతమంది దేవతలపైన వీళ్ళిద్దరినీ చెప్తారు. 8 మంది వసువులు, 11 మంది రుద్రులు, 12 మంది ఆదిత్యులు కూడితే 31. ఆపైన ఇద్దరు మిత్ర వరుణులు. 33. 33 దేవతలు అవి ఏడు లోకాల్లోనూ ఉంటాయి కాబట్టి 33 కోట్లు అయిపోతారు. ఏడు లోకాలకీ ఏడు సున్నాలు పెట్టేసుకోండి 33 పక్కన. 33 కోట్ల దేవతలు ఉన్నారు ఈ భారతీయులకి, పాపం పిచ్చివాళ్ళు, ఇంతమంది ఏమిటి confusion అనుకుంటారు. సంకేతము అంతానూ. Applied side బాగా తెలిసినపుడు తెలుస్తుంది. ఎవరో పల్లెటూరు నుండి మన ఇంటికి వచ్చారనుకోండి, ఏమీ తెలియదు, ఎన్నడూ విద్యుత్తు చూసినవాడు కాదు. ఈ ఊరు వచ్చాడనుకోండి, అదేమిటి ఆ వెలుగుతున్నది అంటాడు, మనం ఏమంటాం Electricity అంటాం. దేని చేత వెలుగుతుంది అంటే Electricity. ఆ తిరుగుతున్నదో అంటాడు, Electricity అంటాం. ఇట్లా మాట్లాడుతుంటే అందరికీ వినిపించేట్టుగా వస్తుందిగా అదేంటి అంటే, Electricity. అక్కడ కృష్ణుడి దగ్గర వెలుగుతున్నదో? Electricity. లోపలికి వెళ్ళి television చూసి ఇదేమిటి అంటే electricity. వంటింట్లోకి వెళితే అక్కడ mixie చూస్తే Electricity. Refrigerator చూస్తే Electricity. Air condition చూస్తే Electricity. వాడు అన్నాడట ఎంత పల్లెటూరి వాడినైనా నన్ను అంత మరీ బొత్తిగా తీసికట్టుగా పెట్టక. ఏంటి ప్రతిదానికీ Electricity అని చెప్తావు ఇన్ని ఉన్నాయి గదా అని. అవునురా ఇన్ని ఉన్నాయి. ఇన్నిట్లోనూ అదే ఉంది అంటే లేదు అది లేదు ఇదే ఉంది అన్నాడుట. ఇవే ఉన్నాయి నాకు ఇవే కనిపిస్తున్నాయి అది లేదు అన్నాడుట. లేదు అది ఉంది, అది ఉండడం వల్లే ఇవన్నీ ఇట్లా ఉన్నాయి అంటే , మరి దాన్ని

చూపించు అన్నాడట. నేను చూపించలేనురా అన్నాడట. ఎందుకు చూపించలేవు? అంటే అది కూడా దైవంలాగే కనబడనిదే అన్నాడట. మరి ఎట్లా అంటే, తెలియబడుతుంది అన్నాడట. ఎట్లా తెలుస్తుంది అన్నాడట, అక్కడ చూడు రెండు చిల్లులు ఉన్నాయి కదా అందులో ఒక చిల్లులో నువ్వు వేలు పెట్టు అన్నాడట, వేలు పెట్టేసరికి కొట్టింది. అంత దూరం పడ్డాడు. ఏమిట్రా పడిపోయావు, ఏమైంది? అంటే Electricity అన్నాడట. అట్లా మనకి ఒకటే Electricity కి ఇన్ని ఉన్నాయి కదా! ఇవన్నీ Applied technology అన్నమాట. Applied science of the pure science. అందుకని మన వాళ్ళు 33 అసలు తత్త్వాలు, ఇవి ఏడు లోకాల్లో ఉంటాయి కాబట్టి ఏడు సున్నాలు చేర్చేస్తే 33 కోట్లు అని సంకేతార్థంగా చెప్పారు. రకరకాలుగా చెప్పారు. 33 కోట్లు అన్నారు, మూడు కోట్ల 30 లక్షలన్నారు, లేదు 33 లక్షలే అన్నారు. ఓ శిష్యుడికి బాగా శోధన మొదలైంది. మొదలైతే అసలు గురువుగారూ నిజంగా చెప్పండి ఎంతమంది ఉన్నారు. మరీ ఇలా మమ్మల్ని మీరు పూలు పెట్టేసి చెవిలో 33 కోట్లు అంటే బాలేదు అంటే పోన్లేరా అంతమంది ఎక్కువ అనిపిస్తే నీకు మూడు కోట్ల 30 లక్షలు చేసుకో అన్నారట. అంతేనా ఇంకేమన్నా బేరం ఉందా అన్నాడట. అలా అనుకుంటే పోనీ 33 లక్షలనుకో అన్నారట. 33 లక్షలు ఖాయమేనా అంటే కాదు మూడు లక్షల 30 వేలు అన్నారట. నిజంగా చెప్పండి అంటే 33 వేలే అన్నారట. ఇలా నన్ను మరీ బాధ పెట్టకండి అసలు విషయం చెప్పండి అంటే 3 వేల 3 వందలు అన్నారట. ఆ తర్వాత 330 చేసేశారు. ఆ తర్వాత 33 చేశారు. 'నీ 33 బావుంది ఇంతటితో సరి ఇది నేను ఒప్పేసుకుంటాను అంటే కాదురా మూడే అన్నారుట. మూడు అయితే మరీ సులువుగా ఉంది హాయిగా ఉంది నేను reconcile అయిపోతానంటే కాదుగా అసలు ఒకటేగా అన్నారట. ఒకటే 3 అయి, మూడే 33 అయి, అది 33 కోట్లు అవుతుంది. ఎందుకు అవకూడదు? ఎన్ని కొబ్బరి చెట్లు అయినా ఒకే కొబ్బరి principle తో అవ్వడం లేదా? అవకూడదా? కాబట్టి ఈ విధంగా మనవాళ్ళు అందించారు. ఇలా అందించినప్పుడు వీటన్నిటికీ మనకి పరాకాష్ఠగా కనిపించేవి రెండే. పురుషుడు, ప్రకృతి. అవే మళ్ళీ astral లో తత్త్వం ప్రకారం పురుషుడు మిత్రుడు అయితే, ప్రకృతి వరుణుడు అవుతాడు. వీళ్ళిద్దరూ ముందు బయటికి వచ్చి ఒకదాన్ని ఒకటి

పొందుతూ ఉంటారు. ఒక్కొక్క మెట్టు దిగి వస్తున్నప్పుడల్లా పాత్ర స్థూలమవుతూ ఉంటుంది. పాత్రను బట్టి లోపల ఉండే తత్వం కూడా కొంత మందగిస్తూ వచ్చి గుండ్రాయి వరకు వచ్చేస్తుంది. గుండ్రాయిలో కూడా ఉంది. గుండ్రాయి నుండి బ్రహ్మం వరకు ఉన్నది. అందుకని ఇట్లా వీళ్ళు దిగి వస్తూ ఉంటారు. ఈ దిగి వచ్చిన వాళ్ళలో గద తత్వం అంటే మిత్రతత్వం, సృష్టిలో మిత్రతత్వం అంటే పురుషతత్వం. ఆగదుడు స్త్రీతత్వం. అందుకని మనకిప్పుడు మాస్టర్ CVV గారి మార్గం ఉందనుకోండి, ఆయన ఏం చెప్తారంటే పాత్ర సరిగా ఉంచుకుంటే పదార్థం బానే ఉంది అంటారు. పదార్థానికి చెడేం లేదు. జీవుడికేమి ఇబ్బంది లేదు. శరీరాలే అన్నీ డొక్కు models తయారు చేస్తున్నారు. అందుకని మీకు అనుభూతి దొరకట్లేదు. అందుకే నేను model నే మార్చడానికి వచ్చాను అని models మార్పుకి ఇచ్చిన యోగం సి.వి.వి గారు. అగస్త్యుడు వరుణ ప్రజ్ఞ. వశిష్ఠుడు మిత్ర ప్రజ్ఞ. అందుకని అప్పుడప్పుడు, మామూలుగా ఏంటంటే జీవప్రజ్ఞకి కావలసిన సాధన ఇస్తూ ఉంటారు. నువ్వెంత సాధన చేసినా ఎంత నువ్వు car driving బాగా నేర్చుకున్నా అసలు Car సొట్ట అనుకో ఏం చేస్తావ్? నువ్వెంత గింజుకున్నా అసలు నీకు ఇచ్చిన వాహనమే సొట్ట కదా! ఆ సొట్ట తీయకపోతే నువ్వెంత తన్నుకుంటే ఏం లాభం? అందుకనే లక్షకి ఒకడు వస్తున్నాడు, అట్లా కాదు ఇహ నుండి నేను వెయ్యికి ఒకడిని చేస్తాను అని చెప్పారు. CVV గారు ఆ సొట్ట తీయడానికి వచ్చారు. ఎట్లా చేస్తారు sir అంటే నీలో ఉండే pituitary కి మార్పు తీసుకొస్తాను. అదే New Model Pituitary Regulations అని ఇచ్చారు. వాటినే మనము ధనిష్ఠా ధ్యానము నాడు ఆవాహనం చేస్తే అందులో జీవించడానికి ప్రయత్నం చేస్తాం. భారతీయుల యొక్క దుస్థితి ఏంటంటే పృచ్ఛకుడు ఎప్పుడో చచ్చిపోయాడు భారతీయులకు ఏది ఎందుకు చేస్తున్నామో తెలుసుకునే ఉద్దేశం అసలు లేదు. ఏదో చేస్తే బానే ఉంటుంది, మనకెందుకు ఆయన రమ్మన్నాడు, వెళ్తూ ఉందాం. కొన్నాళ్ళు పోయాక ఆ.. ఏం వెళ్తాంలే చాలా వాటికి పిలుస్తూ ఉంటారు ఈయన అనుకుంటాం. మనకి ధనిష్ఠకి అసలు బొత్తిగా response ఉండదు ఎందుకంటే అసలు అదేమిటో తెలిస్తే దానికోసం రావడం అనేది ఉంటుంది. CVV గారి యోగములో ఉండే ప్రత్యేకత ఏమిటయ్యా అంటే 'నీ శరీరమును సరిదిద్దుతాను. నేను car

mechanic ని, అట్లా shed లో Park చేయి పొద్దున సాయంత్రం' అని చెప్పారు. 'మిగతా యోగాలన్నిటికి, వీటికి సంబంధం పెట్టుకోక, అవేంటో చేసుకుంటే చేసుకో, నాకు సంబంధం లేదు' అని చెప్పారు. 'నాకు ఒకటే సంబంధం ఏమిటయ్యా అంటే నీ బండి repair చేస్తా. నీ బండి repair చేసి అది ఎట్లా నడవాలో అట్లా నడవడానికి కొన్ని చెప్తాను', మనకి చూడండి Ambassador car పాపం వాడు ఇస్తాడు. కొత్త కారే. New model కదా! ఇచ్చిన తర్వాత దానికి ఎన్ని చేసుకుంటే రోడ్డుమీద నడపగలం మనం. దాదాపు 40 50 వేలు ఖర్చు పెట్టుకుంటే గానీ అది road మీద తిరిగేట్టు ఉండదు. ఏ ముక్కకి ఆ ముక్క ఊడిపోయేట్టుగా ఉంటుంది. ఇట్లా ఉన్నది మీ శరీరం అంటారు సి.వి.వి గారు. అసలు మిమ్మల్ని అని లాభం లేదు మనువుని అనాలి అంటారు ఆయన. అందుకని మనువుతో పని పెట్టుకున్నాడాయన. ఆయన ఒక triangular work పెట్టుకున్నాడు. వైవస్వతమనువు, తను, మరువు మహర్షి ముగ్గురూ కలిసి ఒక బృందం. అట్లాగే తను, సనత్కుమారుడు, దేవాపి ఒక త్రిభుజంగా తయారయ్యారు. తను, మైత్రేయుడు, విదురుడు. వీళ్ళ ముగ్గురితో ఒక త్రిభుజం ఏర్పరచుకున్నారు. ఎందుకింత తాపత్రయ పడుతున్నారంటే, ఏం లేదూ time వచ్చేసింది, మీరేమో ఇట్లాగే నాసిగానే ఉండిపోయారు, నాసిగా ఉన్నందుకు మిమ్మల్ని కోప్పడదల్చుకోలేదు, మీ శరీరాలు బాగాలేవు, వాటిని నేను బాగు చేసుకుంటాను. మీరు పొద్దున, సాయంత్రం నా శరీరాన్ని మీరు బాగు చేయండి అని నాకు సమర్పణ చేయండి అన్నారు. ఎంతసేపు అన్నీ కలిపేసుకుని, ఏదీ సరిగా అర్థం కాకుండా, ఏదో ఇది కూడా అటువంటిదే ఇంకోటి అనుకుంటూ, ఏదో పడుతున్నాం. మనకి clarity చాలా తక్కువ. పైగా తెలుసుకుందామనే ఉద్దేశం కూడా లేదు. ఇది ఏమిటయ్యా అంటే 'ప్రతి పొద్దున ప్రతి సాయంత్రం ఒక 15 నిమిషాలు car Shed లో పెట్టడం నువ్వు బయటికి వచ్చేసేయ్. నువ్వింకా అందులో కూర్చోక్కర్లా. నాకు అప్పచెప్పేయ్' అంటారాయన మనం కూర్చుంటే ఆయన repair చేయడం. మనం car కి owner మాదిరి car లో కూర్చుంటే, ఆ steering wheel దగ్గర, ఆ clutch plate దగ్గర, break దగ్గర, accelerator దగ్గర ఏం work చేయగలడాయన? 'అందుకని నాకు అప్పచెప్పేయరా 15 నిమిషాలు పొద్దున

15 నిమిషాలు సాయంత్రం. అప్ప చెప్పడమే. నేను నీకు దాన్ని repair చేస్తానని నమ్ము. చేసి పెడతా. నీలో అనాహత చక్రానికి అంటే నీ తలకీ మిగతా మొండానికీ ఒక వంతెన ఉన్నది, ఆ వంతెన దగ్గర repair చెయ్యాలి. అదే pituitary నిర్మాణం' అంటారాయన. ఇదంతా కూడా ఎందుకు చెప్తున్నానంటే వరుణతత్వం. అంటే పాత్రని, ఆయనంటారు dance బాగా లేదు dance బాగాలేదు, బాగా చేయట్లేదు dancer అని ఒక నాట్యగత్తెని కోపడుతుంటే ఏం లాభం అసలు stage stable గా లేకపోతే ఎట్లా. ఎక్కడ కాలు వేసినా పడిపోయేట్టుగా ఉందండీ stage. బాగా అందంగా కట్టాం. పైన పరదాలు వేసాం. కానీ అన్నీ పుచ్చిపోయిన బల్లలు ఉన్నాయి కింద. ఆవిడకి చెప్పాం అమ్మా కొంచెం చూసుకోండి, బల్లకి బల్లకి మధ్య పుచ్చు బల్ల ఉంది, దాని మీద కాలు వేయకుండా alternative బల్ల మీద కాలు వేస్తూ మీరు dance చేయండి అని చెప్పాం అనుకోండీ ఆవిడకి, ఆవిడ ఏం చేస్తుంది dance? ఎంతసేపూ ఎక్కడ కాలు వేస్తే పడిపోతామో, ఉన్నవి ఇరుక్కుపోతే? ఏమో అన్నట్టుగా, అందుకని ఆయన ఇచ్చిన వాక్యం ఏమిటంటే 'If the stage is stable the statue stands' అంటారాయన. అన్నీ స్టా స్టా స్టా అని పెట్టారాయన. మంత్రం అది. 'If the stage is stable the statue stands. How can there be dance if the stage is unstable.' అంటారు. అంతా English. అంత మాత్రం చేత సంస్కృతం రాదా? 84 పన్నాలు 18 ఏళ్ళకే నేర్చుకున్న తత్వం అది. ఈ పిచ్చి గోల వదిలేసి అసలు enquiring nature, మన ఋషులందరూ కూడా అంతవాళ్ళు అయ్యారు అంటే ఉపనిషత్తుల కాలంలో, వాళ్ళు ఎంత శోధన చేసేవాళ్ళో. ఊరికే అట్లా గుడ్డెద్దు మాలోకం అన్నట్టుగా ఉండేవాళ్ళు కాదు. ఆ విధంగా పాత్రత బావుండాలి. మీరెంత మంచిపాలు, గేదెపాలు అప్పటికప్పుడు పిండించుకున్నా చిలుం పట్టిన గిన్నెలో పోసుకుంటే తాగుతారా. ఏమిటోనండీ ఎప్పుడూ మా ఇంట్లో పాలు చిలుం పట్టేస్తాయి. ఎందుకు పడతాయి. పాత్ర బాలేదు. అందుకని జీవుడ్ని ఉద్ధరించాల్సింది ఏం లేదు. మనస్సు, ఇంద్రియములు శరీరంగా ఉన్నవి. వీటిలో రుగ్మతలున్నాయి. ఈ రుగ్మతలు బాగు చేయడానికి ఊర్ధ్వలోకాల నుండి ఆయనొక మహాప్రాణాన్ని అందుకున్నారు. 15 నిమిషములు నిలకడగా కూర్చుంటే దాన్ని మీకు

అందిస్తాను. ఈ ఉద్దేశంతో కూర్చోండి. ఇంక ఈ కాస్తలో మంత్రం చేద్దామా. ఈ కాస్తలో ఇంకోటి చేద్దామా. ఈ కాస్తలో ఏమన్నా శ్వాస చేసుకుందామా. ఇవి కాదు. ఆయన చెప్పిందొకటే. This is reparation to your equipment. Electricity కి ఏం problem లేదురా, నీ instrument బాగాలేదు అంటారాయన. కదా! Pole మీద ఉంది, లోపలికి వస్తోంది, మనింట్లో light లు వెలగవు, fan లు పనిచేయవు. దేన్ని repair చేస్తావు? Pole మీదా, Electricityకి repair కావాలా? ఏమక్కర్లా! Repair కావాల్సింది నీ instrument కి. యోగులయ్యారే, ఆత్మకి అనుసంధానం చేసుకున్నారే, అనుసంధానం చేసుకుని అనుభూతి పొందారే వాళ్ళందరూ చాలా కష్టపడి లక్షకి ఒకరు చొప్పున తయారవుతూ వచ్చారు. ఇంక నుండి number పెరుగుతుంది. ఎందుకంటే ఈ technology ఒకటి ఇస్తున్నాం కదా' అన్నారాయన. ఎందుకు ఇవన్నీ చెప్తున్నానూ? అగస్త్య ప్రజ్ఞ ఇది. ఈ అగస్త్య ప్రజ్ఞని Uranus అంటారు. Uranus Englishలో అదే సంస్కృతంలో వరుణుడవుతాడు. ఈ వరుణ తత్వం పాత్రత అయితే లేక అమ్మవారి తత్వం లేక ప్రకృతి. దీని యందు ఉండేది ఉన్నదే అది అయ్యవారి తత్వం లేక మిత్రతత్వం. అందుకని అగస్త్యునికి అవతల వశిష్ఠుడుంటాడు. వరుణుడికి మిత్రుడుంటాడు. ఇక్కడ Pluto అనే గ్రహం పనిచేస్తూ ఉంటే, అక్కడ Neptune అనే గ్రహం పనిచేస్తుంది. అంటే అటు ఇంద్రుడుంటే, ఇటు యముడూ వుంటాడు. అటు బృహస్పతి ఉంటే ఇటు శని ఉంటాడు. అందుకని నా పని శనితో అంటారాయన. ఇప్పుడు Jupiter గీపిటర్ ఏం మాట్లాడక, అవన్నీ బానే ఉంటాయి. ముందు అసలు discipline లేనివాడికి ఎన్ని మంచి విషయాలు అందిస్తే ఏం లాభం? మరి discipline ఇచ్చేవాడు శనే! ఇంకోడు ఇవ్వడు. ఇస్తే సరిగ్గా అందుకోలేని వాడికి ఏం ఇవ్వగలం? ఇట్లా రెండు చేతులూ చక్కగా శ్రద్ధగా పెట్టలేడు. అన్నీ కిందే పోసుకుంటాడు వాడికి ఇచ్చి ఏం ఉపయోగం? ఇవ్వట్లేదని complaint చేస్తాడు. అందుకని ఏమంటారంటే ముందు ఇది ఎట్లా పట్టుకోవాలో రెండు రకాల పద్ధతులు. అందుకని నీలగిరుల ఆశ్రమం అంతా కూడా ఇట్నుంచి పనిచేస్తుంది. కుండలినీ చైతన్యాన్ని ప్రచోదనం చేసి, శరీరాన్ని పూవువలే వికసించేట్లు చేస్తుంది. ఇంకేముంది జీవుడు హాయిగానే అనుభూతి చెందుతాడు. వాహిక

బావుంటే అందులో ఉండేవాడు, వాహనం బావుంటే అందులో ప్రయాణం చేసేవాడు ఆనందంగా ఉంటాడు కాబట్టి ఇది ఒక్కసారి పట్టుకొస్తున్నాం అన్నారు. అందుకనే సప్తర్షులంతా ఒక ఎత్తు అయితే అగస్త్యుడు ఒక్కడూ ఒక ఎత్తు అని చెప్తారు. సప్తర్షులందరూ మిత్రతత్వంతో పని చేస్తారు. మైత్రేయుడు, హిమాలయాల్లో ఉండే ఋషులందరూ కూడా ఈ మిత్ర తత్వంతో పని చేస్తూ ఉంటారు. అది అందిస్తూ ఉంటారు వాడికి. అది అందుకోవడానికి ముందు ఇది బాగుండాలి కదా! అందుకని ఎంత మీరు అది అందించినా ఇది బాగలేదు కదా, ఇది నేను చేస్తానులే. ఇది నేను చేస్తే మీ పని ఒక 60 నుండి 70% సులభం అవుతుంది. అందుకని వచ్చాను అని చెప్పారాయన. ఇట్లా అప్పుడప్పుడు వస్తూ ఉంటాడు అగస్త్యుడు. చాలా crisis అంటారు చూశారా అది కూడా పెద్ద పెద్ద crisis రావాలి. అప్పుడొస్తుంటాడు. ఏది? వింధ్య పర్వతం మేరు పర్వతం కన్నా పెరిగిపోయి సూర్యుడు గమనానికి అడ్డొస్తోంది అందుకని అటువంటి సమయం, లేకపోతే సముద్రం అంతా ఆపోశనం పడితే గాని అందులో ఉండే కాలకేయులనే రాక్షసులని సంహరించడానికి వీలు లేకపోయింది అటువంటి సన్నివేశం, వాతాపి, ఇల్వలుడు అనే వాళ్ళు చాలా బాధ పెట్టేస్తున్నారు అటువంటి సన్నివేశం అలాంటివి రావాలి. ఇంక ఎవరూ చేయలేని పని, పరిస్థితి వచ్చి వికటిస్తోందంటే వస్తాడు. అందుకని కైలాసంలో పార్వతీ పరమేశ్వరులకి మధ్య పెళ్ళి జరుగుతోందిట అంటే సప్తర్షులు వచ్చినప్పుడు, వాళ్ళందరూ అనుకున్నారట ఈయన ఎప్పుడూ కదిలిరాడుట అని, ఎక్కడున్నా ఒకటే ఆయన. శివుడు మీరందరూ వచ్చారు కదా ఋషులందరూ చాలా సంతోషం అంటే వాళ్ళు కొంచెం ఏదన్నా ఎక్కిద్దామని అగస్త్యుడు రాలేదు మీ పెళ్ళి అయినా, అని అంటే ఆయన రాకూడదు అని చెప్పాడు. అక్కడే ఉండి ఇదంతా చూడగలడాయన. వచ్చి చూడాల్సిన అవసరం లేదు ఒకటి, రెండోది ఆయన అక్కడి నుండి కదిలి వస్తే అసలు సృష్టి కుండే equilibrium తప్పుతుంది. ఎందుకంటే దక్షిణామూర్తి ఆయన అంటాడు. అంటే దక్షిణంలో ఉంటాడు. బొడ్డు కిందుంటాడు. మూలాధారంలో ఉంటాడు. బొడ్డు కిందుంటాడని చెప్పడానికే దక్షిణానికి దిగి వచ్చాడని చెప్తారు. వింధ్య అంటే పొట్ట, బొడ్డు. బొడ్డు దాటి కిందకు వచ్చాడు. ఎందుకయ్యా అంటే, లేకపోతే కింద భాగం

ఏర్పడదు. భూమికే కింద భాగం ఏర్పడక భూమధ్య రేఖ వరకూ ఉంది చూశారా ఆ పైడిప్ప, ఆ డిప్ప అట్లాగే వొంగుతోందిట, అట్లా పెరుగుతోంది తప్ప దానికి ఒక consolidation లేదు. లేకపోతే దాన్నట్లా వొంగదీసి కింద ఏర్పరచడానికి, పాత్రత కలిగించడానికి, గోళం ఏర్పరచడానికి దిగివచ్చిన కథ అగస్త్యుడు వింధ్య పర్వతం దాటి కిందకు రావడం అంటే. నేను తిరిగి వచ్చేంతవరకూ నువ్విట్లా వొంగి ఉండమని చెప్పడం ఉద్దేశం అది. అంటే వినాయకుడి పొట్ట చూడండి అట్లా పెరిగిపోయి పగిలిపోతే తాడేసి కట్టారే అట్లా అన్నమాట. అగస్త్యుడు కథలన్నీ కూడా చాలా సంకేతార్థాలు ఉన్న కథలు. ఇవి మనకి కొన్ని కొన్ని తాళం చెవులు వేదాంగములో ఉండేవి అందితే ఎన్ని కథలు అయినా వాటి రహస్యార్థాలు మనం బయటికి తీయచ్చు. అట్లా ఇక్కడ గదుడు యోగమునందు నిష్ణాతుడైన దైత్యుడు. అతడు మిత్రావరుణులలో మిత్రుడు మళ్ళీ. ఆ తత్వం ఈయన గదగా ఉందని చెప్తున్నారు.

1036 శార్ఙము

విల్లు. బ్రహ్మ శ్రీకృష్ణునికి ఇచ్చిన విల్లు శార్ఙము. శ్రీకృష్ణుడు శరీరం దాల్చిన సందర్భంలో బ్రహ్మకు కూడా కొన్ని సవరణలు చేశాడు. కాబట్టి ఆ సందర్భంలో ఆ రకమైన అనుభూతి కలిగించినప్పుడు బ్రహ్మదేవుడు కృష్ణుడికి ఒక విల్లు ఇచ్చాడు. ఇస్తే పట్టుకు తిరిగే type కాదు కృష్ణుడు. ఏదీ పట్టుకు తిరగడు ఆయన. ఉంటాయి. అవసరం అయితే వాడతాడు. సుదర్శన చక్రం దగ్గర నుండి అవసరం అయితే వాడడం, శంఖం ఇవన్నీ అవసరం అయితే వాడతాడు. అట్లా ఒక చేతిలో ఇది, ఒక చేతిలో అది పట్టుకుని ఇవన్నీ చూపించుకుంటూ తిరగడు కదా! ఇప్పుడు అర్జునుడు ఇటువంటి వాళ్ళయితే మోసుకునీ తిరుగుతుంటారు. ఈయనకి అవసరం అయితే వస్తాయి. పద్ధతి అది. అట్లాగే బ్రహ్మ ఇచ్చి వెళ్ళాడు ఈ శార్ఙము అనే విల్లు. అంటే ఏమిటి. బ్రహ్మవిద్య అని అర్థం. బ్రహ్మవిద్యయే బ్రహ్మవిల్లు. శివ తత్వమే శివుడివిల్లు. విష్ణు తత్వమే విష్ణువు విల్లు. శివుడి విల్లు రాముడు తుంచడం అన్నీ ఉన్నాయి కదా కథలు. అందుకని శార్ఙము అనే విల్లు ఎక్కడ నుండి వచ్చిందని మనం పురాణాలు తిరగేసుకుని చూసుకుంటే బ్రహ్మదేవుడు శ్రీకృష్ణుడికి ఇచ్చిన విల్లు అది. ఆ విధంగా మనకి శార్ఙము. వనమాలీ గదీ శార్ఙీ శంఖీ.

1037, 1038 శంఖ్, చక్రీ

శంఖము. పాంచజన్యము మనకి మూలం. ఈ పాంచజన్యము మన యందు ఉన్నది. బ్రహ్మవిద్య మనం పొందవలసినది. అంతవరకు లోపల ఉన్నది. అందకుండా ఉన్నది. పొందవలసినదే అది కూడా! మనకన్నీ పొందవలసినవే ఇవి. మన యొక్క goals ఏవైతే ఉంటాయో, లక్ష్యములు ఏవైతే ఉంటాయో, గమ్యం ఏదైతే ఉన్నదో అవన్నీ ఈ నామంలో ఎక్కువ ఇచ్చారు. వనమాలీ: వనమాల మనలో వుండే మనకి వ్యక్తమవ్వాలి. దర్శనం అవ్వాలి అనుభూ,తి అవ్వాలి. అంటే యోగసిద్ధి! యోగసిద్ధి ఎప్పుడు అయితే కలిగిందో లోపల ఉండే గద దర్శనం జరుగుతుంది. ఆ తరువాత బ్రహ్మవిద్య. బాగుపడుతుంది వ్యవస్థ. అక్కడ నుండి లోపలికి వెళ్ళిపోతే మిగతా విద్య నేర్చుకుంటాం. ఈ శ్లోకంలో వనమాలని దర్శనం చేసుకుంటూ లోపల, గదను తలకాయ మన యొక్క వెన్నుముక భాగంలో ఉండే మెదడు, సుషుమ్న కలిపి గదగా దర్శనం చేసుకుంటే, శార్ఙ్గమనే విల్లు మన భ్రూమధ్యం, ఈ భృకుటి ప్రాంతంలో, రెండు భృకుటులు మొత్తం భ్రూమధ్యము ఈ దివ్యతేజంగా, దాన్ని బ్రహ్మ యొక్క విల్లుగా, శార్ఙ్గముగా దర్శనం చేసుకుంటూ, ఓంకారమును ఆధారంగా, ఆ విల్లు ఆధారంగా ఊర్ధ్వముఖంగా ప్రయాణం చేయడానికి సంకేతముగా శంఖమును, శంఖము నాదమునకు సంకేతం కాబట్టి అదికారణంగా సుదర్శనము- చక్కని దర్శనము అంటే తమ యొక్క నిజస్థితిని తాము తెలుసుకొనుటయే సుదర్శనము. తామెవరో తమకు తెలియడం అనేది సుదర్శనంగా గోచరిస్తుంది

1039 నందకము

వీటన్నిటికీ మనకి ఆధారమైన సాధనా లక్షణ విశేషము. నందకము అంటే మనలో ఉండే విచక్షణ. బుద్ధి, వివేకము దానికి ఎంతో పదును ఉంటే ఇవన్నీ అట్లా మన యందు మనం సిద్ధి పొందడానికి అవకాశం ఉంటుంది. ఈ విచక్షణను 21 సంవత్సరం నుండి బాగా వాడవలసి ఉంటుంది. ఈ విచక్షణను 21 సంవత్సరం లోపల పొందవలసి ఉంది. 7 సంవత్సరముల నుండి 21 సంవత్సరముల లోపల మనిషి విచక్షణను వినియోగించుకోవడం అనేది బాగా నేర్చుకోవాలి. ఎవరు ఎట్లా చెప్పినా భగవద్గీతలో మొట్టమొదట చెప్పిన లక్షణం విచక్షణ. విదురుడు చెప్పే discrimination. ఇదీ నందకము అనే కత్తి. అంటే ఒక సన్నివేశంలో మనం ఏ విధంగా పనిచేయవలెను, ఏ విధంగా మాట్లాడవలెను, ఏ విధంగా మాట్లాడకుండా ఉండవలెను, ఏ పని చేయకుండా ఉండవలెను, పని తర్వాత చేయక్కర్లా. చేయకపోవడమే చేసిన దానికన్నా మంచిది. ఈ విచక్షణను నందకంగా మనకిచ్చారు. అందుకని ఈ విచక్షణ ఆధారంగానే సమస్తము జరగాలి, చెప్పినవన్నీ కూడా. దాన్ని కోల్పోరాదు ప్రతి విషయంలోనూ. అనుక్షణం అంటారు చూశారా! వివేకి అయినవారికి మాత్రమే ఈ మార్గం తప్ప అందరికీ ఈ మార్గం కాదు. ఇది మనకి తేలని విషయం కాబట్టి, అది తేల్చుకుంటే ముందు, అంటే Give an option which you prefer అని అడిగితే ఏది నిజస్థితికి దగ్గరగా ఉందో, ఏది ధర్మానికి దగ్గరగా ఉందో, ఏది కర్తవ్యానికి దగ్గరగా ఉందో, దానియందు మక్కువ కలిగి ఉండడం విచక్షణ. ఇదికాక వేరే ఏదైనా రకమైన మెరుపుల యందు ఆసక్తి కలిగి ఉండడం విచక్షణ లేదు. అందుకే నందకం అనేది చాలా ముఖ్యం. వీటి మూలాన వీటన్నిటికీ పునాదిరాయి. అందుకని నందకీ. ఇవి మనలో దర్శనం చేసుకుంటూ ఉండాలి. వనమాల, గద, బ్రహ్మవిల్లు, శంఖము, చక్రము, నందకము మనకి కనిపించాలనే ఉద్దేశంతోనే దీనికో బొమ్మ గీసి మనకిచ్చారు సుందరంగా. తరువాత మనం నాలుగు స్థితులలో ఉంటాం అని చెప్పడానికి నాలుగు చేతులు. పొందుట, చైతన్యవంతులగుట, ఆలోచించుట, పనిచేయుట ఇట్లా నాలుగు స్థితులున్నాయి. వాసుదేవ సంకర్షణ ప్రద్యుమ్న అనిరుద్ధ వ్యూహాలన్నా, పరా

పశ్యంతి మధ్యమా వైఖరి ఇటువంటి నాలుగు నాలుగు నాలుగు ఎన్నోసార్లు చెప్పకున్నాం. నాలుగ్గా ఉన్నావు నువ్వు సుమా అని తెలియడానికి నాలుగు చేతులు. నీ యందు వనమాల ఉన్నది సుమా దాన్ని నువ్వు గుర్తించడానికి ప్రయత్నం చేయి అని చెప్పడానికి వనమాల. నీయందు సుషుమ్న, ఇళ, పింగళ ఉంది అని చెప్పడానికి ఈ ఊర్ధ్వపుండ్రములు వైష్ణవ నామం. అలాగే నీవు చక్కని దర్శనము సహజముగా కలిగిన వాడివి. కాకపోతే ప్రస్తుతం గుడ్డివాడివి అని చెప్పడానికి ఈ చక్రం. అలాగే నీయందు అనాహత శబ్దం అనుస్యూతంగా జరుగుతూనే ఉన్నది, కాకపోతే కొంచెం చెవిటివాడివి అని చెప్పడానికి శంఖం. అలాగే కత్తి. మనలో ఉండే మొద్దుతనం, బండతనం ఉంటుంది కదా! సోంబేరితనం బాగా సానపెడితే గానీ పదును రాదు. ఎప్పటికప్పుడు పదునుగా ఉండు, చురుకుగా ఉండు, బుద్ధి కలిగి ఉండు అని చెప్పడానికి ఈ నందకం. ఇవి గుర్తు చేయడానికి చివరి నామంలో మళ్ళీ ఇవన్నీ ఒక్కసారి ఇచ్చారు. ఇవన్నీ ఇంతకుముందు వచ్చినవే. కానీ మళ్ళీ ప్రత్యేకంగా గుర్తు చేస్తున్నారంటే ఇవి నీలో నీకు దర్శనం కావాలి ఆ దర్శనం చేత అది నీ వల్ల ప్రచోదనం చెందాలి. అదికారణంగా నువ్వు సిద్ధుడవి అవ్వాలి. అది దీని అర్థం.

1040, 1041, 1042, 1043 శ్రీమన్నారాయణః, విష్ణుః, వాసుదేవః, అభిరక్షతు

మూడు స్థితులు భగవంతుడివి నువ్వు నాలుగో వాడివి. With you it is four. నువ్వు విష్ణువు ఆరాధన చేయి అంటే రూపము లేదా భగవంతుని ఆరాధన చేయి. అన్నీ ప్రాథమికమైనవే మనము చేయలేం కాబట్టి- వాళ్ళకి తెలుసు మనం చేయలేం అని- అందుకని మళ్ళీ మళ్ళీ గుర్తు చేస్తారు ఆశ కొద్దీ. True teaching అదే! నిజమైన ఉపాధ్యాయుడు ఏ విషయము యందు మనకి సులభంగా ఎరుక కలుగుతుందో వాటియందే ఎక్కువ గుర్తు చేసే పద్ధతి పెట్టుకుంటాడు. అందుకని ముందు రూపాలుగా ఉన్నదంతా వాడే అని దర్శనం చేయి, ఎవరి నుండి ఎటువంటి ప్రవర్తనం ఉన్నా అతడే అని దర్శనం చేయ్ వాడి వెనకాల ఉండేవాడు అప్పుడు కనిపిస్తాడు అని చెప్పడం కోసం విష్ణువు, వాసుదేవుడు, నారాయణుడు వచ్చేస్తాడు. మూడుగానే ఉన్నాడు ఇంతకన్నా ఏం లేదు అని చెప్పడానికి గుర్తు చేశాడు. అంతే కాకుండా అభిరక్షతు అనే నామాన్ని అనుస్యూతం అంటిపెట్టుకుని ఉండి రక్షించమని కోరడం. అంటే

విశ్వం విష్ణుర్వషట్కారో భూతభవ్య భవత్ప్రభుః
భూతకృద్భూతభృద్భావో భూతాత్మా భూతభావనః,
పూతాత్మా పరమాత్మా చ ముక్తానాం పరమా గతిః,
అవ్యయః పురుషః సాక్షీ క్షేత్రజ్ఞోఽక్షర ఏవ చ, వాసుదేవో అభిరక్షతు.

ఇట్లా చదవడం ఒక పద్ధతి ఉంది. చేయచ్చు చక్కగా మనం. ఎందుకంటే ఒకళ్ళు శ్లోకం చదివితే ఒకళ్ళు వాసుదేవోభిరక్షతు అని అంటారు. ఇంకా అది ఒక పద్ధతిగా విష్ణు సహస్రనామమంలో బాగా బృందంగా గానం చేస్తున్నప్పుడు అట్లా చేసుకుంటే అందులోంచి చాలా అనుభూతి వస్తూ ఉంటుంది ఇది ఒక సాంప్రదాయం లాగా. అప్పుడది ఒక మంత్రంగా పనిచేస్తుందిట. అలాగే ఇంకా కొంచెం ఓపిక ఉంటే వాసుదేవోభిరక్షతు ఏ అనకుండా శ్రీమన్నారాయణో విష్ణుః వాసుదేవోభిరక్షతు. ఇంకా కొంతమంది బాగా శ్రద్ధా భక్తులు కలిగిన వాళ్ళు ఓం విష్ణవే నమః అభిరక్షతు అంటారు. విష్ణవే నమః అభిరక్షతు లేకపోతే ఓం విష్ణవే నమః వాసుదేవో

అభిరక్షతు ఓం విష్ణవే నమః వాసుదేవో అభిరక్షతు ఓం వషట్కారాయ నమః వాసుదేవో అభిరక్షతు. ఒకళ్ళు ఇదంటే మిగతావాళ్ళు అదంటూ ఉంటారు. అంటే అప్పుడేమవుతుంది మనకి వంటబడుతుంది. ఇది వంటబడడం ముఖ్యం. ఇట్లా దులిపేసుకుంటే పోతుంది. పైపైన కాస్త అంటించుకుంటే అవదు. సత్సాధకులకి మాత్రమే అది కాస్త ఇంకుతుంది. మిగతా వాళ్ళందరికీ ఊరికే అట్లా పైన కారి ఉంటుంది ఆముదం లాగా. మాస్టర్ గారు చెప్పారు ఆముదం ఇంకదు రాయబోకండి, అని. అదెక్కడా ఇంకే విషయం కాదు ఆముదం రాయబోక మంచి నూనె రాసుకోండి, నిజమా అంటే తర్వాత తెలుస్తుంది నిజమే అని. ఏదో అట్లా పెడతారోయ్ ఆముదం, మంచి నూనె పెట్టుకోండి, అంటారు. అట్లా మనం ఇంకేట్లుగా ఉంటే ఈ సాధనకి ఫలితం. ఇంకకపోతే ఎన్నాళ్ళు పూసుకున్నా ఒకటే ఆముదం. అట్లా ఇంకడం కోసం ఇన్ని రకాలుగా వాళ్ళు ప్రయత్నం చేస్తారు. అది ఉత్త అభిరక్షతు. ఇంకొంచెం శ్రద్ధ ఉంటే వాసుదేవో అభిరక్షతు. ఇంకొంచెం శ్రద్ధ ఉంటే శ్రీమన్నారాయణో విష్ణుః వాసుదేవో అభిరక్షతు. ఇట్లా ప్రతి నామానికి చేస్తారట. ప్రతి శ్లోకానికి చేస్తారట. ఇంక నామ పరంగా చేసుకుంటే వెయ్యి నామాలకీ అంటారుట. శ్లోకం పరంగా చేసుకుంటే 108 సార్లు అంటారు. ఎందుకంటారండీ అంటే ఊరికే ఇట్లా మనం తిప్పి తిప్పి తిప్పి తిప్పి అట్లా మనకి చూడండి రైలు వెళుతుంటే ఒక చప్పుడు వస్తుంది ఒకటే చందస్సు. పట్టాల చందస్సు ఒకటి ఉంటుంది కదా! మనకి మామూలుగా ఈ 108 ఒక చందస్సుతో కొట్టేస్తాం. ఎన్ని నామాలు మనం అనుకుని, విన్నామో తెలియదు మనకి. మధ్య మధ్యలో వస్తూ పోతూ ఉంటాం. ఓహో ఇంత దూరం వచ్చాం కదా అనుకుంటాం, మళ్ళీ మనస్సు ఎటో తిరిగి వస్తూ ఉంటుంది ఊర కుక్కల్లే. మళ్ళీ వచ్చి చూసుకుంటూ ఉంటుంది ఆహా ఇప్పుడు ఇంతవరకు వచ్చామని. మధ్య మధ్యలో ఒకసారి ఈ నామం అయ్యిందా, అవలేదా అనిపిస్తుంది. ఆ శ్లోకం విన్నామా లేదా అనిపిస్తుంది.

శ్రీదః శ్రీశః శ్రీనివాసః ఇటువంటివి వచ్చినప్పుడు ఆ.. పర్లేదు ఏదో 60 వరకు వచ్చామని. కదా! బ్రహ్మణ్యో బ్రహ్మకృద్ బ్రహ్మా పర్లేదు 70 వరకు వచ్చాం అనిపిస్తుంది. ఈ లోపల అటూ ఇటూ పోయి వస్తూ ఉంటాం. అట్లా

పోయి రాకుండా ఉండడంగా ఇట్లా పెడతారు మళ్ళీ. వాళ్ళకి తెలుసు మన సంగతి. వాళ్ళూ ఇవన్నీ పడ్డవాళ్ళే కదా.

మహర్షులు ఏమంటారంటే మేమేదో పైనుండి ఊడి పడలేదు, మేము కూడా మీలాంటి వాళ్ళమే, ఎక్కి వెళ్ళాం కాబట్టి ప్రతిమెట్టు దగ్గరా ఎట్లా జారుడు ఉంటుందో మాకు తెలుసు. జారుడు మొదట్లోనే ఎక్కువ అబ్బాయ్. తర్వాత చాలా తక్కువ ఉంటుంది. ఎప్పుడూ Initial Breaks కష్టం. అందుకే ఇట్లా పెట్టాం. నీ వంతు శుద్ధి చేసుకో. ఆబకొద్దీ చేయక. ఆబకొద్దీ చేస్తే బరువెక్కి పోతుంది. నీలో ఓపిక, శ్రద్ధ పెరుగుతున్న కొద్దీ add చేసుకుంటూ వెళ్ళు. అట్లా మనం కలుపుకుంటూ పోతుంటే బరువెక్కదు. స్ఫూర్తి ఉన్నంతసేపు చేసే వాటిల్లో బరువుండదండీ. స్ఫూర్తి తగ్గిపోతే ప్రతీదీ బరువుగానే ఉంటుంది. శరీరమే బరువుగా ఉంటుంది. మరి ఇంకేంటి మిగతావన్నీ దానిమీద కదా! అందుకని ఇట్లా ఇచ్చారు.

ఆ విధంగా వాసుదేవుడు మనందర్నీ కూడా అనుస్యూతం రక్షించుకుంటూ, ఆయన మార్గంలో మన్ని ప్రవేశపెట్టి దైవానుభూతివైపు నడిపించు గాక అని మనం ఆశంసనము చేసుకుందాం.

శ్రీ రామ రామ రామేతి

శ్రీరామరామ రామేతి రమే రామే మనోరమే,
సహస్రనామ తత్తుల్యం రామనామ వరాననే'

పరమ శివుడు పార్వతీ దేవికి చెప్పిన విషయం కాబట్టి మనకు ప్రమాణం. సహస్రనామములు అన్నీ కూడా చదువుకోగలిగినపుడు చదువుకోవాలి. చదువుకోలేనపుడు, ఒక ౭ సార్లు రామనామం చెప్పుకుంటే, కోటిసార్లు రామనామం చెప్పినట్లు. అట్లా సంఖ్యాపరంగా ఒక అమరిక ఉన్నది.

శ్రీ రామ రామ రామ ఇతి అని, రమ యొక్క రాముడైన రమే రామే.

మనోరమే: మనస్సును రమింప చేసేవాడు, రంజింప చేసేవాడు.

సహస్రనామ తత్తుల్యం: వెయ్యి నామములకు సమానమైనది. వెయ్యిసార్లు భగవంతుడి

నామమును ఉచ్చరించడంతో సమానము.

శ్రీరామనామ వరాననే: వరాననం ఇక్కడ ముఖ్యమైన విషయం. ఎప్పుడూ నోట్లో ఆడుతూ ఉండాలి. ఆననము అంటే ముఖము అని అర్థం. ముఖము అంటే ప్రధానమైనది నోరు. అగ్నిదేవుడు ఉండేది అక్కడే, ముఖంలో. 'ముఖాత్ ఇంద్రశ్చ అగ్నిశ్చ' అంటాం కదా. ముఖము అంటే ఉద్దేశింపబడినది, మన నోరు. నోరు ఆ నామాన్ని వరించాలన్నమాట. వరాననం. అప్పుడు రామనామం చేత వరింపబడిన నోరు అయ్యి ఉండాలి.

అలా రామనామాన్ని నిరంతరం అభ్యాసం చేసినవారు, స్మరించినవారు, పవిత్రీకరింపబడిన వారు చాలామంది మనకు కనిపిస్తుంటారు. ప్రత్యేకించి భారతదేశంలో రామభక్తులు చాలా ఎక్కువ. అంటే కృష్ణభక్తులున్నారు, అమ్మవారి భక్తులున్నారు, వినాయకుడి భక్తులున్నారు, విష్ణుభక్తులున్నారు, బ్రహ్మవేత్తలు ఉన్నారు, ఇలా ఉండగా, సర్వసామాన్యంగా జనబాహుళ్యంలో మనిషిని పవిత్రీకరించి, దైవసన్నిధిలో ఇమడడానికి అత్యంతసులభమైన, అతిసామాన్యుడికి కూడా అందుబాటులో ఉండేటట్లుగా మనపెద్దలు ఈ రామనామాన్ని చాలా వ్యాప్తి గావించారు. ఆ నామం మనకి ఎప్పుడూ మెదులుతూ ఉన్నట్లయితే, సహస్రనామం

జరుగుతున్నట్లే లెక్క. శివుడు కూడా తను రామ నామం చేస్తుంటాను అని, చెప్పిన సందర్భాలున్నాయి. శివుడు రాముణ్ణి తలుస్తుంటే, రాముడు శివుడ్ని తలుస్తుంటాడు. ఎందుకంటే, ఒకరికొకరు ఆరాధ్యులు. రాముని హృదయమునందు శివుడు ఉంటాడు, శివుని హృదయమునందు రాముడు లేక విష్ణువు ఉంటాడు. అది వారిద్దరి మధ్య ఉండే అవినాభావ సంబంధం. ఒకరు తేజోమూర్తి అయితే మరొకరు మోహనమూర్తి. విష్ణువు యొక్క తేజస్సుగా శివుడుంటాడు, శివుని యొక్క మోహనత్వంగా విష్ణువుంటాడు. ఒకరు పురుషుడైతే ఇంకొకరు స్త్రీ. అందుకనే అమ్మవార్ని పూజించినా, విష్ణువుని పూజించినా ఒకటే. విష్ణు పూజలు చేయడమంటే అమ్మవారి పూజలు చేయటమే. లలిత పూజలు చేస్తున్నాం కదా, అంటే అర్థం ఏమిటంటే కృష్ణుడి పూజలు చేస్తున్నామని. 'లలిత స్కంధము, కృష్ణమూలము' అని చెప్తారు భాగవతంలో. అలాగే శ్యామల పూజలు చేసినా, రాముడి పూజలు చేసినా ఒకటే. 'శ్యామలాంగు రాముని చూడగన్' అంటే శ్యామల అంటే నీలం అనే ఒక భావం ఉండగా, శ్యామలయే రాముడు. లలితయే కృష్ణుడు. లలిత అంటే మూడు శక్తులు కూడగట్టుకున్న ఏకశక్తి. దాన్నే దుర్గ అని కూడా పిలుస్తాం. దక్షిణా పథంలో లలిత అనేది అగస్త్యుని ప్రసాదంగా మనకి లభించినది. అగస్త్యునకు హయగ్రీవుడిచ్చిన సహస్ర నామములు లలితా సహస్రనామములు. అందులో మనకి గోచరించేది ఏమిటంటే ఇచ్ఛాశక్తి, క్రియాశక్తి, జ్ఞానశక్తి, మూడు కలిపిన శక్తి ఏదైతే ఉన్నదో అదియే దుర్గ. లక్ష్మి, పార్వతి, సరస్వతి మూడుశక్తులు కలిస్తే దుర్గ అవుతుంది, లలిత అవుతుంది, కృష్ణుడు అవుతాడు. అలా మనకి అమ్మవారి పూజలన్నీ కూడా విష్ణువే. ఎందుకంటే, మోహనరూపం కాబట్టి. లోపల తేజస్సు శివునిది. కృష్ణుడు అటు శివతత్వమూ, ఇటు విష్ణుతత్వము అన్నితత్వములనూ తనయందు దర్శింపచేశాడు. అందుకని శ్రీకృష్ణుని పూజించినపుడు ఆ దేవాలయములో ఇంకొక దేవతా విగ్రహముండదు, ఇంకొక అమ్మవారి విగ్రహము కూడా ఉండదు. విష్ణువుకి లక్ష్మి, శివుని కి పార్వతి, ఇలా మనకి దేవాలయాల్లో కనిపిస్తాయి. కృష్ణుని విగ్రహము పెడితే, ఇక ఏమీ పెట్టరు. ఎందుకంటే అన్నీ ఆయనే. గురువతడే, శివుడూ అతడే, విష్ణువతడే, అమ్మవారూ అతడే, అన్నీ అతడే అయిన తత్వం. శివుడిని తల్చుకుంటూ రామేశ్వరంలో రాముడు

శివలింగం నిర్మించాడు. రాముడు నేను ఎప్పుడూ శివుడ్ని లోపల తల్చుకుంటూంటాను అని చెప్పాడు. అంతవరకూ ఎవరికీ తెలియదు. అదే శివుడ్ని అడిగితే నేను ఎప్పుడూ రాముడ్ని తలుచుకుంటూ ఉంటాను అని శివుడు చెప్తాడు. వాళ్ళిద్దరూ అంత అన్యోన్యంగా ఉంటే వారి పేరున కొట్టుకున్న చరిత్రలు మనకున్నాయి. మనం ఎంత వివేకవంతులమో దాన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు. శైవులమని, వైష్ణవులమని విభేదాలు సృష్టించుకుని జీవించినవాళ్ళు, దైవం పేరున అరాచకం సృష్టించినవారున్నారు. ఇది ఐదువేల సంవత్సరాల క్రిందటి విషయం విష్ణుసహస్రనామం అంటే. అప్పుడే శివుడే చెప్పాడు ఇది ప్రమాణంగా, అని చెప్పడంలో ఉద్దేశం. వారి యొక్క, అన్యోన్యత, అంటే వేరు కాని స్థితి, మనకి సమగ్రమైన సమన్వయమైన స్థితి ఇవ్వడానికి ఇచ్చినది. అందుకని విష్ణు సహస్రనామంలో ఇది శివుడు చెప్పినట్లుగా 'ఈశ్వర ఉవాచ' అని ఉంటుంది. రామనామం చాలా పవిత్రమైనది, అందరికీ తెలిసినదే. ముఖము నందు దీన్ని ఎప్పుడూ, చక్కగా స్మరిస్తూ ఉండే రామభక్తులకు తిరుగులేదు. హనుమంతుని బలము రాముని మంత్రమే! అది హనుమంతుడే చెప్పాడు, మనం ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా. హనుమంతుడు తన బలం, రాముని యొక్క బలమే తన బలం అన్నాడు. తను రామబాణంవలె, రామ దూతవలె కార్యములు సాధిస్తానని తనని తాను ఆ విధంగా రామునికి దాసునిగా సమర్పణ చెందినవాడు. రాముని భక్తులలో మనకి హనుమంతుడు అగ్రగణ్యుడిగా గోచరిస్తాడు; భక్తులందరిలోనూ అగ్రగణ్యుడిగా గోచరిస్తాడు. దాని వలన రామనామము యొక్క ప్రతిభ ఎంతో మనకి తెలుస్తుంది. మాస్టరు గారు ఒక మంచి కథ చెప్పారు. హనుమంతుడు లంకలో భీభత్సం సృష్టించి, చివరికి దహనం చేస్తున్న సమయంలో ఒక రాక్షస స్త్రీ హనుమంతుడ్ని వేడుకుందిట. ఎలాగూ మాకు కొన్ని కొన్ని prophecies ఉన్నాయి. భవిష్యత్ వాణి ఉన్నది లంక నాశనం అవుతుంది, రావణుడి కారణంగా అని. నాకు ఒక కొడుకున్నాడు, లేక లేక కలిగాడు. యుద్ధం జరగక తప్పదని తెలుస్తోంది మా అందరికీ. కాబట్టి ఈ పిల్లవాడు మరణిస్తే నేను బతకలేను కాబట్టి, నా పిల్లవాడికి ఏదన్నా రక్షగా మంత్రం ఇవ్వమని అడిగితే, రాముడి మంత్రం ఇస్తాడు. ఈ మంత్రం చేసుకో, నీకు ఏ భీతి, భయము, మరణభయం,

ఉండవు. పూర్ణమైన రక్షణ ఉంటుంది అని. అందుకనే మనం రక్షకి వచ్చేసరికి శ్రీరామరక్ష అంటాం కదా, ఇంకేదీ వాడం. 'శ్రీరామరక్ష సర్వజగద్రక్ష' అని ఈ ఒక్క రాముని విషయంలోనే వాడతాం. రక్షకు రాముడు పెట్టింది పేరు. ఇంతా అంతా రక్ష కాదు. ఎవరికైనా సరే. అందుకని హనుమంతుడు రాముని నామమును తనయందు పరిపూర్ణంగా అనుభూతి చెందినవాడు. తనకూ, రామునికి వేరు భావము లేని స్థితిలో తాదాత్మ్యము చెందినవాడు కాబట్టి ఈ నామము ఇస్తాడు. ఆ పిల్లవాడు అది చేసుకుంటూ ఉంటాడు. యుద్ధం వస్తుంది. యుద్ధంలో హనుమంతుడు అజేయుడు. అటువంటి హనుమంతునికి ఈ కుర్రావాడు ఎదురౌతాడు యుద్ధంలో. ఈ కుర్రవాడని ఎవరో హనుమంతుడికి తెలియదు. ఎన్ని రకాలుగా హనుమంతుడు యుద్ధం చేస్తున్నా, ఈయన ఎంత ప్రతాపం చూపించినా కూడా ఆ కుర్రవాడికి దెబ్బ తగలదు. ఆశ్చర్యపోతాడు. ఆయన ఎంతోమంది మహావీరులను సంహరిస్తాడు యుద్ధంలో. అలాంటిది హనుమంతుడుకి చాలా ఆశ్చర్యంగా ఉంటుంది. గొట్టికాయంత ఉంటాడు వీడు, సంహరింపబడడం లేదు, ఓడింపబడడం లేదు అలాగే ఉన్నాడు. అర్థం కాలేదు. ఆ రోజు సాయంత్రం యుద్ధం అయిన తరువాత వెళ్ళి 'ఏమిటిరా నువ్వు ఎవరు, ఏమిటి సంగతి?' అని అడుగుతాడు. అట్లా ఉండేవి యుద్ధాలు ఆరోజుల్లో. మనకి మహాభారతంలో కూడా ఆ రోజు సాయంత్రం సూర్యాస్తమయం అయ్యాక, వీళ్ళు వాళ్ళు కలుసుకోవడం, మాట్లాడుకోవడం, భీష్ముడి దగ్గరకి ధర్మరాజు వెళ్ళటం, ఇట్లా ఉంటాయి చాలా. అప్పుడు ఆ పిల్లవాడు గురువుగారూ అని దణ్ణం పెడతాడు. ఓరి నువ్వా అంటాడు. అంటే హనుమంతుడే జయించలేని స్థితికి ఆ పిల్లవాడు రామనామం సదా ఉచ్ఛరించడం వల్ల చేరుకున్నాడు. ఇటువంటి రామభక్తుల జీవితంలో ఎన్నో కథలు ఉంటాయి. మనకి అదొక ఉద్గ్రంథం, రామ భక్తవిజయం అనేది. అందుకని శివుడు చెప్పాడు, ఇన్ని నామాలు ఉన్నాయి కదా, వీటన్నిటిలో ఒక్కటే:

రామో విరామో విరజో మార్గో నేయో నయో నయః

అని ఒక చోట వస్తుంది, మొత్తం 108 శ్లోకాలలో, ఒక్కసారే రాము, విరాము. ఇప్పుడు ఈ నామంలో ఎన్ని వచ్చినాయి, శ్రీరాము, రాము, రాము, ఇతి రమే రామే మనోరమే..... రమే రామ, లో రమే లో కూడా ర, మ, శబ్దం

ఉంది. సహస్రనామ తత్తుల్యం, శ్రీ రామ నామ వరాననే ... ౭ సార్లు వస్తుంది. ౭ సార్లు రావడం వల్ల కోటి ఎట్లా ఔతుంది, తరువాత మళ్ళీ వస్తాను నేను. రామ అనే శబ్దంలో ఉండే రెండు అక్షరములు కూడా బీజాక్షరములే. రం అనేది అగ్నితత్త్వం. రాముడు అగ్నితత్త్వం. మేషరాశిలో పుట్టాడు. అధర్మాన్ని దహించడానికి వచ్చినవాడు. మనలో కూడా మలినములను హరింపగలిగిన బీజాక్షరము రం. ఆ రం అనేది కొంచెం దీర్ఘం చేసి రాం అని ఇచ్చారు. రాముడు పుట్టక ముందు నుండే ఉన్నది ఈ నామం. వాల్మీకి పునీతుడు అవటానికి నారదుడిచ్చిన నామం కదా ఇది. అప్పటికి రాముడే లేడు. కాబట్టి రాముడి కన్నా రామనామం, ఇంకా ప్రాచీనమైనదే కాక, రాముని కన్నా కూడా ప్రభావమైనది. అదీ అందులో విశేషం. అందుకని భక్తులు ఏమి చెప్తారు తెలుసా. రామ శబ్దం వింటూంటే చాలు, రామ రూపం దర్శించకపోయినా. రాముని రూపం మనకు తెలియదు గానీ, రాముని శబ్దం మనకి తెలుసు కదా, అని చెప్తారు. ఇది ఒక విచిత్రమైనది అంటే రహస్యమైనది, గూడార్థము కలిగినది. శ్రీభాష్యం అప్పలాచార్యుల వారంతటివారిని మీరు అడిగితే, ఆయన ఇదే చెప్తారు. తెలిసిన వాళ్ళు ఇట్లాగే చెప్తారు. నేను ఆయన నోటి నుండి ఇది విన్నప్పుడు, ఓహో, వీరికి కూడా ఈ విషయం తెలుసు. అంటే మనకి తెలుసు అని కాదు, మనం విన్నదే, ఆయన కూడా అన్నారు, అంటే ఇంకొక ప్రమాణం అన్నమాట. ఏమిటక్కడ. శబ్దం యొక్క వినికిడి కంటి యొక్క చూపు కన్నా లోతైనది అని చెప్పడానికి. తత్త్వానికి శబ్దము మొదటి తొడుగు. వెలుగు రెండవ తొడుగు. చీకట్లో రూపాన్ని చూడలేం, శబ్దాన్ని వినగలం. కాబట్టి చీకట్లో కంటికన్నా చెవియే ఎక్కువ పనిచేస్తుంది. కటిక చీకట్లో వెళ్తున్నామనుకోండి, ఏం కనపడదు, సరసరసరసర ఏదైనా పోతే చెవితో విని, పాము ఏమో అనుకుంటాం. చెవే లేకపోతే కష్టం. తత్త్వానికి మొదటి తొడుగు శబ్దము. అందుకే ప్రణవము ఆరాధనము, పరతత్త్వానికి అత్యంత సమీపమైన ఆరాధనంగా చెప్తారు. రామ శబ్దము రాముడు పుట్టక ముందు నుండే ఉన్నది కాబట్టి, వాల్మీకి, ఆటవికుడైన వాడిని మహర్షిగా మార్చిన నామం. దానికున్న పవిత్రత ఇంతా, అంతా కాదు. ఆ పవిత్రత దానికి ఎక్కడ నుండి వచ్చింది? రం అనే బీజాక్షరం నుండి వచ్చింది. అగ్నిబీజం. ధర్మాన్ని తప్ప, తదితరమైనది ఏదైనా

సరే దహించివేస్తుంది. కల్మషాలన్నీ హరింపచేస్తుంది. మనసులో ఉన్న అపవిత్రత పోవాలంటే, అగ్నిశిఖలను లోపల ఉద్భవింపచేసి, మనస్సుని పరిశుభ్రపరిచే నామంగా రామనామాన్ని చెప్తారు. ఎందుకంటే బీజాక్షరం కదా. Cosmic fire కి సంబంధించిన విద్యుత్ అగ్ని అంటారు దాన్ని. సమస్తాన్నీ పవిత్రకరిస్తుంది కాబట్టి, రం అనే బీజాక్షరంతో కూడినది కాబట్టి, దానినే మనం లలితా సహస్రనామంలో రాకినీ అంటాం. రం అనే బీజాక్షరంతో కూడిన తత్త్వం అని చెప్పటానికి. అవన్నీ బీజాక్షరములే హాకినీ హం, సాకినీ సం ఢాకినీ ఢం, యాకినీ యం ఇవన్నీ మన సప్త కేంద్రముల యందు ఉండే బీజాక్షరములు. రామ శబ్దంలో రం అనేది అగ్నికి సంబంధించిన బీజాక్షరం అయితే మ అనేది అమృతవర్షిణికి సంబంధించిన బీజాక్షరము. అంటే పవిత్రీకరింపచేసి, ఆ తర్వాత అమృతవర్షం కురిపింపచేసి, మనిషిని పరిపూర్ణంగా పునీతం చేసే నామం రామనామంగా పెద్దలు ఇచ్చారు, రామావతారానికి ముందే. ర అనే శబ్దము, మ అనే శబ్దము, రెండు తత్త్వములూ భగవత్తత్త్వములు కూడితే ఎట్లా ఉంటుందో దాని యొక్క personification అంటాం చూశారా, అది ఒక వ్యక్తిగా, ఒక పురుషునిగా జన్మిస్తే ఏమిటో, అదే రాముడు! అందుకని రామతత్త్వం చాలా సులభంగా మనిషిని పవిత్రీకరించి, ధర్మమునందు నిలబెడుతుంది. ధర్మాన్ని తప్పడానికి, మనస్సుకి అసక్తి కలగదు. Manipulations ఉండవు రామభక్తుడికి. అతడిని ఎవరైనా manipulate చేస్తే దెబ్బతింటారు. ఎందుకంటే సూటిగా ఉంటుంది విషయం, సూటిగా నడుస్తూ ఉంటుంది, పరిపూర్ణమైన రక్ష ఉంటుంది. ఆ రక్ష ఎటువంటి రక్ష అంటే, అద్భుతమైన రక్షగా ఉంటుంది. రామనామం చేసుకునేవారికి అసలు భీతి ఉండదు దేని మీదా కూడా. రాముడున్నాడు, ప్రతిదానికి రాముడున్నాడు అనేదే ప్రధానమైన భావం. సమస్తమూ రాముడే, తన లోపలా, తన బయటా రాముడే అనే భావం పరిపూర్ణంగా ఉండడం చేత, వాళ్ళకి నిర్భీతి ఉంటుంది. వాళ్ళు సహజముగా ధర్మమును ఆచరించే వాళ్ళుగా ఉంటారు. అధర్మమువైపు మొగ్గటానికి మనస్సుకి అవకాశముండదు. ఎందుకంటే అలా పవిత్రీకరిస్తుంది కాబట్టి. ఇటువంటి రోజుల్లో రక్షణ కావాలనుకుంటే, ఈ మంత్రం కన్నా మించిన మంత్రం లేదు. ఎటువంటి రక్షణ అది? నిన్ను పవిత్రీకరించి, నిన్ను ధర్మము నందు నిలబట్టేది.

నీ చుట్టూ కోట నిర్మాణం చేసేది. ఒక కవచాన్ని ఏర్పరిచేది. ఎటువంటి కవచం అంటే నిన్ను అధర్మము నందు ప్రవర్తింపనివ్వదు, నీయందు అధర్మం జరిగితే చేసినవారికి తీవ్రమైన పరిణామాలు ఉంటాయి. అటువంటి నామం రామనామం. ర అనే అక్షరానికి వర్ణము ఎరుపురంగు, మ అనే అక్షరానికి వర్ణము లేత ఆకుపచ్చ రంగు. ఈ రెండు రంగులూ మిళితమైతే పుట్టేది నీలం రంగు. మొత్తం మూడు రంగులు ఉన్నాయి. ఎఱుపు, పసుపు, నీలం. పసుపే కొంచెం ముదిరితే, లేత ఆకుపచ్చ ఔతుంది. ఈ రెండిటిలో, ఏ రెండు కలిపినా మూడవది వస్తుంది. మనకి కుంకుమ ఎలా తయారవుతోంది. పసుపు ఎలా తయారవుతోంది. అందుకని పసుపు, కుంకుమతో పూజ చేస్తూ ఉంటే ఆ రెండూ కలిపిన తత్త్వంగా నీలం వస్తుంది. అందుకని రాముడు నీలవర్ణము వాడు. ఎందుకని. ర, మ అనే రెండు శబ్దముల యొక్క తత్త్వముల యొక్క మిశ్రమ భావంగా ఉన్నాడు కాబట్టి. అది అలా ఉండగా అగ్ని తత్త్వపు రాశి కదా. అందుకని ముందు మండించి, ఎండబెట్టి ఆ తర్వాత చిగురింప చేస్తాడు. వేసవికాలం తర్వాత వర్షాకాలం లాగా అన్నమాట. అప్పుడే బాగా చిగురు వేస్తుంది. ఉన్న కల్మషాలన్నీ కూడా హరించి, ఆ తరువాత కొత్త చిగురు; కొత్త చిగురు ఎప్పుడూ కొత్త చిగురే! పాతవి అట్లా ఉండగా వాటి మీద చిగురించదు. చిగురు రాదు. కొత్త చిగురు కోసం మండింప చేస్తాడు. ఈ మండించడానికి ముందు ఎండింప చేస్తాడుట. ఎండడానికి వాయుబీజం ఉన్నది. అదే హనుమంతుడు. వాయు బీజాన్ని యం అంటారు. యం అనే బీజంతో సాధకుడిని ఎండపెడతాడుట. ఎండపెట్టడమంటే, ఏం లేదు, అక్కడా ఇక్కడా, ఇక్కడా అక్కడా అతుక్కుని ఉంటాయి కదా. మనస్సు, ఇంద్రియముల ద్వారా, బహిర్లోకములో చాలా రకాల అతుకులు. పీకితే ఏడుస్తారు. ఎండిపోతే ఊడిపోతుంది. అందుకని ముందు వాయువుతో పని చేయమంటాడు. ఆ వాయువు బాగా ఎండబెడితే, అప్పుడు అగ్ని దాన్ని కాల్చగలదట. పచ్చికట్టె కాలదుగా. ఎండు కట్టె అయితే భగభగభగ మండుతుంది. ఆ మండిపోవడంతో వీడు మరణిస్తాడట. అంతకుముందుండే భావములన్నీ మరణిస్తాయి. అదే వాడు మరణించటం అంటే. కొత్త చిగురుగా వాడిలోంచి మరొకడు పుడతాడు. వాడే ఈ సారి శుభ్రంగా వచ్చాడు ద్విజుడు, అదీ అమృతవర్షం, అది మ. అందుకని య వాయుబీజం తో

మొదలై, ఆ తర్వాత ర అనే అగ్ని బీజంతో కల్మషపూరితమైన భావములన్నీ కూడా హరింపబడి, ఆ తర్వాత కొత్త చిగురుకి మ. ఇలా సాధన ఉన్నది అని చెప్తారు. శ్రీవిద్య ఉపాసకులు ఈ మార్గాన్ని అవలంబిస్తారు. పచ్చిపచ్చిగా ఉంటే కాలదు. తపస్సు అంటే ఏమిటి, లోపల నుండి వేడి పుడుతుంది. తపస్సు బాగా కామతృష్ణ కలిగిన వాళ్ళకి జరగదు. తపస్సుకి ఎట్లా ఎండిపోతారో. మనం సినిమాల్లో కనీసం చూస్తాం కదా. ఆ చివరికి మళ్ళీ వాడికి అమృతవర్షం. అమృతవర్షిణి రాగం కూడా ఉంది. సరస్వతి వచ్చింది కదా, అప్పుడు అమృతం కురిస్తే ఇంత ఎండిపోయిన వాడూ అంతకుముందుకన్నా చాలా ధగధగధగ మెరుస్తూ, పూర్ణకళలతో వచ్చేస్తాడు. అందుకని ఆ ముందు వాడు వేరు. ఈ తర్వాత వాడు వేరు. వేరు అంటే ఏంటయ్యా అంటే, వాడి అసలు స్వరూపం వచ్చింది. వాడి చుట్టూ చేరుకున్న తుప్ప అంతా వదిలిపోయింది అన్నమాట. ఇది రామ శబ్దంలో ఉన్నది. తరువాత రాముడు ఎప్పుడూ, group living యే తప్ప, individual living కాదు. కృష్ణుడు ఒకడే! ఆయనలోనే అందరూ ఉన్నారు. రాముడు సీతా లక్ష్మణ హనుమత్సమేత కదా. శ్రీ రామచంద్ర పరబ్రహ్మణే నమః అంటాం. అక్కడ మనకి పూర్ణమైన set ఉందన్నమాట. ఏమిటంటే, ఒక పక్క తను పరతత్వం. ఒక పక్క కాలం. తన నుండి వ్యక్తం అయిన కాలము, తన నుండి వ్యక్తం అయిన ప్రకృతి. సీతమ్మవారు ప్రకృతి, లక్ష్మణుడు కాలపురుషుడు. హనుమంతుడు గురువు. ఈ గురువు ద్వారా, అటు కాలము, ఇటు ప్రకృతి యొక్క ఆశీర్వచనము అందుకుని, పరతత్వానికి చేరుకోవడానికి కావలసిన set అంతా అక్కడ ఉంది. రామ పట్టాభిషేకం అని అందరం పెట్టుకుంటూ ఉంటాము. మనకి పట్టాభిషేకం ఎప్పుడయ్యా అంటే, గురువనుగ్రహం చేత కాలము, ప్రకృతి యొక్క సహకారం చేత పరబ్రహ్మమును చేరుకోవడం. అందుకని రాముని ఆశీర్వచనం ఉంటే మీరు రాముని తలుచుకుంటూ ఉంటే లక్ష్మణుడు ప్రీతి చెందుతాడు. మీరు రాముని తలచుకుంటే అమ్మవారు ప్రీతి చెందుతుంది. మీరు రాముని తలచుకుంటే హనుమంతుడు ప్రీతి చెందుతాడు. ఇట్లా ఉన్నాయి అమరికలు. అంటే అక్కడ ఏమయ్యిందంటే అట్లా కలసి వచ్చేట్లుగా దిగివచ్చింది అవతారం. అందుకనే రామనామం ఉన్నంతకాలం ఈ భూమికేమీ భయం లేదని చెప్తుంటారు. రామనామం కోరి

చేసుకోమని చెప్పడానికి కూడా కారణం అదే! మనయందు కూడా ఈ రకమైన అనుగ్రహం కలుగుతుందని. రామ శబ్దానికి సంఖ్యాపరంగా తీసుకుంటే చాలా వివరణ ఉంది. కొంత వివరణ చేసుకోవడానికి ప్రయత్నం చేద్దాం. ప్రతి అక్షరమునకూ ఒక అంకె ఉన్నదిసంకేతంగా. ఎందుకంటే మొత్తం సృష్టిలో తెలుసుకోవాల్సినది జ్ఞానపరంగా ఏమిటంటే, తత్త్వము, numeric potency గానూ, sound vibration గానూ, colour velocity గానూ, shape consciousness గానూ ఉంటుంది. అంటే ఒక సంకేతముగా ఉంటుంది. మనకి కనిపించేవన్నీ సంకేతాలే. మనందరికీ కూడా, ఋషులు మన number ఏమిటో చెప్తారు. మన scan అంతా తీసి, ఇది నీ number అని ఇస్తారు. ఆ అంకెల యొక్క సమూహము, సమగ్రమైన స్వభావంగా మనం ఉంటాం అన్నమాట. ప్రతి బీజాక్షరమునకూ అక్షరం కన్నా ముందు దాని power ఉందే, potency, దాన్ని అంకె అంటారు. ఆ అంకెకి ఒక శబ్దతరంగం ఉంటుంది. ఆ శబ్దమునకు ఒక వర్ణము ఉంటుంది. వర్ణము అంటే రంగు అనీ, రూపము అని కూడా అర్థమున్నది. ర అనే అక్షరం ఉంది. ఈ అక్షరం లేకపోయినా ర ఉంది. దానిని బాగా ఉచ్ఛరిస్తూ ఉంటే, నీలో అగ్ని పుడుతుంది. అగ్నిని ఎఱుపుగా మనం చెప్తాం. అందుకని ఎఱుపు వర్ణం కలిగినది ర అనే శబ్దం. ర అనే అక్షరముగా కలిగినది. దీని అంకె 2 (రెండు). సంస్కృతములో ఇవ్వబడిన 52 అక్షరములున్నాయి. 52 అక్షరములకి వాటివాటి శక్తి వాటికి ఉన్నది. ఆ శక్తి అంకె పరంగా చెప్పారు. అంకె అంటే 1 నుండి 9 వరకు ఉండే వాటిని అంకెలు అనాలి. సంఖ్యలు అనకూడదు. 10 నుండి సంఖ్యలు అవుతాయి. ఎందుకంటే రెండు అంకెలు వాడతాం అక్కడ నుండిచి. అందుకని సంఖ్య ఎంత అంటే 7 అనకూడదు, 7 కనబడితే అంకె అనాలి. 17 కనబడితే సంఖ్య అనాలి. అది number consciousness. ముందు అది వస్తుంది. మనలో కపిలుడిగా ఉన్నాడు. సంఖ్యా జ్ఞానమే మన వెన్నెముకలో, సుషుమ్నలో కపిలుడిగా ఉన్నాడని శాస్త్రాలు చెప్తున్నాయి. కపిలుడు అంటే ఏదో ఓ ఋషి: గడ్డం, చొక్కా ఉండదు, పంచే కట్టుకుంటారు, అట్లా ఆలోచించుకుంటే తేలం. ఇట్లా ఋషులంటే మనకి ఒక idea ఉంది. సంఖ్యాజ్ఞానమే కపిలుడుగా ఉంది. అక్కడ నుండి శబ్దం మొదలవుతుంది. అందులో నుండి రంగులు, ఆ రంగుల్లోంచి

రూపాలు. ప్రతి రూపం వెనుక ఓ రంగు ఉన్నది, ప్రతి రంగు వెనకాల శబ్దతరంగాలు ఉన్నాయి. ప్రతి శబ్ద తరంగం వెనకాల అంకె యొక్క శక్తి యున్నది. దాని వెనకాల తత్త్వమున్నది. ఇది ఒక key-board అని చెప్పారు. ఈ రహస్య జ్ఞానములోనికి ప్రవేశం జరిగితే కానీ అంతర్దర్శనాలు జరగవు. రాముడు వరకు ఏం జరుగుతుందంటే ర అంటే 2 అంకె; జయ అన్న దానికి అంకెలు జ అంటే 8, య అంటే 1 అని. జయ అంటే 81; అట్నుంచిటు చదువుకుంటే 18. అందుకని భారతానికి జయము అని పేరు పెట్టుకున్నారు. మొదటి పేరు జయము, తర్వాత భారతము, ఆ తర్వాత మహాభారతము అయ్యింది. ఇట్లా 3 స్థితులలో, వ్యాసుడు చెప్పినపుడు జయమే. యజము చేసినవాడికి, జయము కలుగుతుంది. దానికి అంకె పరంగా 18 అని పెట్టాడు. అందుకని మహాభారతము 18 పర్వాలు. అందులో భగవద్గీత, 18 అధ్యాయాలు. యుద్ధం 18 అక్షౌహిణులు చేసుకున్నాయి, 18 రోజులు జరిగింది. ఇట్లా మనం చెప్పుకునేందుకు కారణం, అందులో రహస్యార్థం. అలాగే రామ. ర అంటే 2, మ అంటే 5, 'అంకానాం వామతో గతిః' అని మాస్టరుగారు మనకి చెప్పడం వల్ల తెలిసింది. లేకపోతే మనం సంస్కృతం చదువుకున్న వాళ్ళం కాదు కదా! ఎడం పక్క నుండి చదువుకో, ఇంకొన్ని రహస్యాలు వస్తాయి అని చెప్పారు. కుడి పక్క నుండి చదువుకుంటే, రామ అంటే 25, ఎడమ పక్క నుండి చదువుకుంటే 52. 25 అంటే ఏమిటో? 52 అంటే ఏమిటి? తెలుసుకోవాలి. అంతేకాదు, 5x2=10, 2x5=10; అంటే మూడు సంఖ్యల కథ ఉన్నదిక్కడ. ఒక సంఖ్య 25, ఇంకొక సంఖ్య 52, మరి ఒక సంఖ్య 10. ఈ 3 సంఖ్యల అవగాహన మీకు ఏర్పడితే, రాముడి విశ్వరూపం గోచరిస్తుంది. ఎంత నేను నరుడిని, నాకు ఇంకేం తెలియదు అన్నప్పటికీ, 14 భువనాలలో ఎవరూ చేయలేని పని చేసినవాడు, బయటకు కనిపించకుండా ఉన్నవాడు కదా రాముడు. రాముడు ఏమీ విశ్వరూపసందర్శనాలు చేయలేదు. చేయించలేదు. అందరూ వచ్చి నువ్వు అదే అంటే నాకదేం తెలియదు, నాకొకటే తెలుసు, నా పేరు రాముడు, మా నాన్న పేరు దశరథుడు. నేను దశరథుని కుమారుడైన రాముడననే నాకు తెలుసు. ఇంకేం తెలియదు. మీరు చెప్పేవన్నీ నాకు అస్సలు తెలియదు అంటాడు. అంటే మనం నిజంగా అనుసరించవలసినది రాముడ్ని.

స్తుతించుకోవచ్చు కృష్ణుడిని. కృష్ణుడివలె జీవించడం అనే ప్రశ్నే లేదు. అతిమానుషీ ప్రజ్ఞ. అది మానవావతారం కాదు కదా. మానవుడి లాగా ఉన్న తత్త్వం తప్ప మానవుడు కాదు. రాముడు పరిపూర్ణ మానవుడు. ఉత్తమ మానవుడు. మనవలె కష్టములు వచ్చినపుడు దుఃఖము చెందినవాడు. రాముడి విషయంలో హృదయం మనకు పొంగుతుంది, హృదయం కరుగుతుంది. కృష్ణుడి విషయంలో హృదయం పొంగడమే, కరగడమేముండదు. అసలు కరగదు. మనల్ని కరిగించడం తప్ప. రాముడి జీవితం చదువుకుంటూ ఉంటే, హృదయం కరుగుతుంది. రామాయణం శ్రద్ధగా చదివి, కంట తడి పెట్టనివాడు రాయే, సందేహం లేదు. చదువుకునే శ్రద్ధ బట్టి చూస్తే అట్లా ఉంటుంది. అటువంటి తత్త్వం ఇక్కడ. 25 అంటే ఏమిటయ్యా అంటే 24 తత్త్వములతో సృష్టి చేయబడి ఉన్నది. ఈ 24 తత్వములూ మించి ఉన్నది 25. అది పచ్చీస్ కున్న ప్రత్యేకత. 24 తత్త్వాలనీ మనం గాయత్రీ మంత్రంగా ఆరాధన చేస్తాం. దానికి ముందు ఓం అంటాం. ఆ ఓం ఏ 24 తత్త్వములుగా వచ్చింది. అవే 24 గంటలుగా వచ్చింది. అవే 12 అమావాస్యలుగా, 12 పూర్ణిమలుగా వచ్చింది. 24 కి చాలా పెద్ద చరిత్ర ఉన్నది. 8X3 = 24; 4X6 = 24; 2X12 = 24; 24 ని 2 తో భాగారిస్తే 12 వస్తుంది. 3 తో భాగారిస్తే 8 వస్తుంది. 4 తో భాగారిస్తే 6 వస్తుంది. ఇంక దేనితోనూ భాగారించలేము. దాంట్లోంచి పెద్ద పుస్తకం చెప్పచ్చు. అదీ 24. అదే గాయత్రి! దానికి మించినది అని చెప్పడానికి 25. అదే రామ. 52 ఏమిటో, 'అంకానాం వామతో గతిః' అన్నారు కదా, అట్నుండి లెక్క వేసుకుంటే 52 సంఖ్య వస్తుంది. మొత్తం సంస్కృత వాఙ్మయము అంతా 52 అక్షరములతో నిర్మాణము చేయబడిందే. సంస్కృతంలో అక్షరములు 52. 16 అచ్చులు ఉన్నాయి, 25 హల్లులు ఉన్నాయి, ఎంత అయ్యింది: 41. తరువాత మళ్ళీ 11 శాంతములు ఉన్నాయి: యరలవశషసహళక్షఱ. 16 అచ్చులు, 25 హల్లులు, 11 శాంతములు, అన్నిటినీ కలిపితే 52 అక్షరములు. ఈ 52 అక్షరములూ మొత్తం సృష్టి యొక్క సమస్త శక్తులకీ సంకేతములుగా దర్శించి ఇచ్చారు. అందుకని దేవభాష అది. సంస్కృతము దేవభాష ఎందుకైందంటే, ఏ శబ్దము చేత సృష్టిలో ఏ రకమైన వ్యుత్పత్తి జరుగుతున్నది చూసి, వ్యుత్పత్తికి ఆధారభూతమైన శబ్దమును అవగాహన చేసుకుని, ఆ శబ్దములన్నీ

పొందుపరిచారు. అ అంటే దానికి ఒక తత్త్వమున్నది, ఇ అంటే ఒక తత్త్వమున్నది, ఉ అంటే ఒక తత్త్వమున్నది, అన్నీ తత్త్వములే, దాని శక్తులు దానికున్నాయి. దాని రంగులు దానికున్నాయి, దాని రూపాలు దానికున్నాయి. ఇట్లా మొత్తం 52 ఉన్నాయి. ఈ 52 తత్త్వముల కూడిక, అని చెప్పడానికి, అటు నుండి ఇటు 52. అది రామ శబ్దం. అలాగే మనకి రామ అంటే 5x2= 10 కదా. కాబట్టి ఇప్పుడు 1 పక్కన 7 సున్నాలు చేర్చుకుంటే కోటి అయ్యింది అక్కడ. ఈ శ్లోకంలో: 10x 10x 10x 10x 10x 10x 10 చేసుకుపోండి, ఎంత వస్తుందో చూసుకోండి, 1 కోటి కదా. అదలా ఉండగా 10 అంటే? 10 సంఖ్య పూర్ణత్వానికి చిహ్నం. 25 పూర్ణత్వమే, 52 పూర్ణత్వమే, 10 పూర్ణత్వమే. మొత్తం ఋగ్వేదం అంతా కూడా పది అంకె మీద నిర్మాణం చేయబడ్డదే. దానికి ఋగ్వేదంలో, మండలము అన్నారు. ఈ మండలమునకు సంకేతము ఏమిచ్చారంటే కేంద్రము, పరిధి. అది ఒక మండలం. కేంద్రములో ఉండే బిందువు ఒకటి అయితే, దాని చుట్టూ ఏర్పడ్డ పరిధి సున్నా. అందుకని 10 అంకె మన జగద్గురుపీఠం కార్యక్రమములలో చాలా చోట్ల ఉంటుంది. ఒక పరిధిలో ఒక కేంద్రం ధ్యానం చేసుకో, అది నువ్వే అని చెప్తారు. అంటే నీవు పరిపూర్ణుడవే, నీవు ఉద్భవించిన చైతన్యపు బిందువువే అని తెలియచెప్పడానికి ఆ సంకేతం ఇచ్చారు. అది వేద సంకేతం- Vedic Symbol.

ఈ పది అంకెలో పూర్ణత్వం అంతా ఇమిడి ఉన్నది. ఎందుకంటే సృష్టి 4 స్థితులలోకి దిగి వస్తుంది. మన యందు కూడా మనం 4 స్థితులలో ఉన్నామని చెప్పకుంటూ ఉంటాం. 1. మనం ఉన్నాం, 2. మేల్కాంచాం, 3. మేల్కాంచడంచేత భావనలు జరుగుతున్నాయి, 4వ స్థితిలో - మాటల్లో, చేతల్లో ఉంటాం. అసలు ఉండకపోతే లేచేది లేదు. లేవకపోతే మనకు భావాలు రావు. భావాలే లేకపోతే మాటలూ లేవూ, చేతలూ లేవు. ఇవి మనలో 4 స్థితులు. దీన్నే వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధ వ్యూహాలని; అదే రామలక్ష్మణ భరత శత్రుఘ్నులని; అదే ధర్మరాజు, భీముడు, అర్జునుడు, కవలలు (నకులసహదేవులు) కలిపి ఒకటి, నాలుగు. ఈ పది చెప్పడానికే దశరథుడు. ఈ పది చెప్పడానికే దశావతారములు. ఈ 10 నిజానికి నాలుగే అంటారు. ఎట్లా నాలుగు? నీవు ఉన్నపుడు

చైతన్యవంతుడివి కాక, నీవుగా నీవు ఉన్నావు, ఇంకా చైతన్యవంతుడివి కాలేదు. అప్పుడు నీవు ఒకడివి. చైతన్యవంతుడివి అయ్యావు, ఒకటి రెండయ్యింది. అక్కడ నుండి భావములు వస్తున్నాయి అది మూడవ స్థితి. మనం మూడవ స్థితిలోనే ఉన్నాం ఎక్కువగా. రెండవ స్థితి కూడా తెలియదు. భావముల పుట్టుకలోకి వెళ్తే కానీ చైతన్యము అంటే ఏమిటో తెలియదు మనకి. ఎఱుక అంటే తెలియదు. తెలివి అంటే ఏమిటో తెలియదు. తెలివి వచ్చిన తరువాతే భావాలు వస్తాయి. తెలివి రాలేదు అంటూంటాం కదా. కాబట్టి 1,2,3,4 స్థితులు. 1+2+3+4 = 10 అదొక మహామంత్రం. గ్రీకు దేశంలో చాలా దీన్ని వినియోగించి, ఎన్నో రకములైన సిద్ధాంతాలు బయటకు తీశారు సోక్రటీస్, పైథాగరస్. 1+2+3+4, కలిపితే 10, అంటే పదియే నాలుగుగా అమరిక చెందిందని చెప్తారు. నువ్వు మాట్లాడుతున్నప్పుడు నాలుగు స్థితులూ నీలో పనిచేస్తున్నాయి, cumulative గా. నువ్వున్నావూ, నీవు చైతన్యవంతుడివై ఉన్నావూ, నీ యందు భావము ఉన్నది, నీవు మాట్లాడటమో, పని చేయడమో, జరుగుతుంది. నాలుగూ ఒక్కసారి జరుగుతున్నాయి. భావము ఉన్నది మూడు, చైతన్యము ఉన్నది రెండు, ఒకటి గా నీవు ఉన్నావు. అందుకని మన అసలు అంకె ఒకటి. పనిగా మాటగా నాలుగు గా నువ్వున్నావు. మనం 10 కూడా కాగలం. ఈ ఒకటి ఎక్కడ నుండి వచ్చింది? పూర్ణము నుండి వచ్చింది. అది సున్నా(0). అప్పుడిక ఏమీ అంకెలు లేవు. ఈ అంకెలన్నీ అందులో కలిసిపోతాయి, కనక సున్నాలోంచి నీవొకడివి వ్యక్తం అయ్యావు. అందుకే ఒక point పెడితే దానికి, మనకి vedic mathematics లో ఏమంటారంటే, it is not a Locational point, it is an emergence అని చెప్తారు. వ్యక్తం అవడమే ఒకటి అంటే. వ్యక్తం అయ్యాము కాబట్టే వ్యక్తి అంటున్నారు ప్రతివాడినీ. వ్యక్తీకరింపబడ్డాము. Individualised. కనుక ఒకటి, 10 గా వస్తుంది. అందుకనే యుగాలు కూడా కృత, త్రేతా, ద్వాపర, కలి. కలి అంటే 1, ద్వాపర అంటే 2, త్రేత అంటే 3, కృత అంటే 4, ఈ నాలుగూ కలిపితే ఒక మహాయుగం. అదొక చక్రం 10. మనలో కూడా 10 రాశులుగా ఉన్నవాళ్ళం 12 రాశులుగా అయ్యాం. జ్యోతిషశాస్త్రంలో ఇదొక రహస్యం. మనకి హిమాలయపు గ్రంథముల నుండి తీసి Madam Blavatsky

ఇచ్చారు, మాస్టరుగారు ఇచ్చారు. ఏమిటది? మనయందు, బొడ్డు, జననేంద్రియముల వేర్పాటు జరగడం అనేది 7వ సంవత్సరం నుండి నుండి 14 వ సంవత్సరంలోపు జరుగుతాయి. 7 సం॥ల ముందు స్త్రీ శిశువుకు, పురుష శిశువునకు తేడా ఏం లేదు. ఎందుకంటే వాళ్ళింకా బహిర్గతులు అవ్వట్లేదు. మనం చేస్తాం వాళ్ళని బహిర్గతులని. అంటే బాహ్య విషయములందు పట్టు, జిగురు, సంగము ఇటువంటివి ఇంకా ఏమీ ఉండవు పిల్లలకి. అందుకనే వారు దేవుడితో సమానం అంటారు. ఎందుకు దేవుడితో సమానం అంటే, బయట దేనికీ అతుక్కుపోలేదు, బల్లి లాగా. అప్పుడు మనకి ఉండేవి 10 రాశులే శరీరంలో. మానవ శరీరంలో 12 రాశుల తత్త్వములు ఉన్నాయి. 12 రాశుల సృష్టిని, imperfect creation అంటారు. పరిపూర్ణత లేని సృష్టి. 10 రాశుల తత్త్వం పరిపూర్ణ సృష్టి అంటారు. పరిపూర్ణ సృష్టి లోంచి, దాని మీద అజ్ఞాన ఆవరణంగా అపరిపూర్ణతలు కొన్ని పేరుకుని ఉన్నాయి, అద్దం మీద దుమ్ము పడ్డట్లుగా. 10 వరకే అసలు సత్యం. ఆ పైన పేరుకొన్నదంతా అసత్యం, అజ్ఞానం. దాన్నే పాపం అన్నారు. పాపం అంటే అజ్ఞానం, తెలియకపోవడం. తెలియకపోవడం ఎందుకు జరుగుతుందంటే మనం బయటికి బాగా బహిర్గతులమై, పంచేంద్రియముల చేత బాహ్యప్రపంచములోనికి బాగా విస్తరించుకుంటూ వెళ్ళిపోయి, అది కారణంచేత మనం ఎవరో మనం మర్చిపోగానే అజ్ఞానం ఆవరిస్తుంది. ఇది 7వ సంవత్సరం నుండి 14 సంవత్సరం లోపల మనిషికి ఒకరాశి విడిపోయి, మూడు రాశులు అవుతాయి. కన్య, వృశ్చికము కలిపి ఒక రాశిగా ఉంటుంది, తులారాశి లేనపుడు మొత్తం దశరాశులే ఉంటాయి. దశరాశుల సృష్టి నుండి కోరిక కారణంగా అంటే బహిర్గతమైన విషయములలో, ధర్మము కాని కోరిక నీకు కలిగినప్పుడు, నీ యందు 12 ఏర్పడతాయి అని చెప్పడం కోసమే ఆదాము, అవ్వ కథ. ఆదాము- అవ్వ పరిపూర్ణ సృష్టిలో ఉండేవారు. Kingdom of God upon earth, అదే Eden garden అంటారు. దైవ సామ్రాజ్యంలో జీవించేవాడికి బయట ప్రపంచంలో పొందవలసినదేమీ ఉండదు. అన్నీ లోపలే ఉన్నాయని తెలుసు వాడికి, ధర్మపరంగా బయటకి ఏదో తగుమాత్రంగా వెళ్ళి వచ్చేస్తాడు. ఈ బయటకి పరుచుకుపోయినవారందరూ ఇరుక్కుపోతారు. అక్కడ ఆదాము-అవ్వ

కథలో ఆ అవ్వకి కోరిక పుడుతుంది, ఏమిటి కోరిక? అక్కడేదో పండు కనిపిస్తే దాన్ని తినాలని, ఆకలి లేదు, అయినా తిందామని పీకింది. అది కోరిక. మనం అట్లా ఎన్నో చేస్తుంటాం లేండి, అందుకని ఆవిడనేమీ అనడానికి వీలు లేదు. అలాగే పరతత్వంతో చేరి ఉన్న అమ్మవారు, బంగారు జింక కనిపిస్తే ఏం చేసుకుందామని? చూసి ఆనందిస్తే బాగుండేది, పొందాలనుకుంది, అయిపోయింది. రామాయణం మనకొచ్చేసింది కదా. అవ్వ సరదాకి apple పండు కోరితే, చాలా పెద్ద కథ అయిపోయింది. అమ్మవారు బంగారు లేడిని చూసి ఆనందించి ఉంటే సరిపోయేది. కావాలనుకుంది. బావుందల్లా కావాలనుకుంటే ఏమౌతుంది? సృష్టిలో బోలెడు బావుంటాయి, అవన్నీ కావాలనుకొంటే అవుతాయా? పక్కవారి కారు బావుంటుంది, ఇంకో ఆయన మేడ బావుంటుంది, మరొకరి పిల్లలు బావుంటారు, కదా. ఆయనకి మంచి ఆరోగ్యం ఉంది, మనకి లేదు, ఇట్లా చాలా ఉంటాయి. ఇవన్నీ మనం కావాలి కావాలి అనుకుంటే ఏం జరుగుతుంది? అందుకనే the whole knowledge consists or depends upon how to desire, what to desire, when to desire, when not to desire, what not to desire, how not to desire. మనకసలు బొత్తిగా, లేడికి లేచిందే పరుగు అంటారు చూశారా, అట్లా, ఏది కనపడితే అది, రేసుకుక్కల్లే వెళ్ళి, అది తెచ్చుకొనేంతవరకూ నిద్రపోని మనస్తత్వాలుగా ఉంటాం. కలియుగం కదా! కాబట్టి ఏమవుతుందంటే, మనమే 10 నుండి 12 అంకెగా మారిపోతాం. 10 గా ఉన్నప్పుడు నువ్వు పూర్తుడవే. 12 ఎందుకు ఏర్పరచారు అంటే, సృష్టి ఏర్పరచిన తరువాత, సృష్టిలో మానవుడిని ఏర్పరిచిన తరువాత, మానవుడికి, సృష్టికి అనుసంధానం ఏర్పరచడం కోసం, తులా రాశిని పుట్టించారు. కడుపులో చాలా ఉన్నాయిరా నీకు అని అనమూ. కడుపులో అనే ఎందుకు అంటాం. తలలో అని ఎందుకు అనం. అక్కడే ఉంది జ్ఞానం. తెలియకపోయినా, ఈ జ్ఞానపరమైన మాటలు వచ్చేస్తుంటాయి. తుల ఆ విధంగా మనకి 7వ సంవత్సరము నుండి నెమ్మది మొదలవుతుందండీ. మనం నేర్పుతాం కదా, ఇట్లా చేయాలి, అట్లా చేయాలి, అది కోరుకోవాలి, ఇది కోరుకోవాలి, అని. First rank రావాలి అని మొదలు పెడతాం ముందు, వాడి First rank తో

వాడ్ని దింపుతాం బురదలో. చదువుకో, చదువుకున్నది అర్థం చేసుకో, ఆకళింపు చేసుకో, అని కాదు చెప్పేది. మార్కులు తెచ్చుకో. వాడికి ఎంత వచ్చిందో మనకి అక్కర్లేదు, మార్కులు వస్తున్నాయా లేదా కావాలి. ఇట్లా రకరకాలుగా తప్పుడుదారిలో నడుస్తుంది మనకి 7 నుండి. అలాగే పురుష స్త్రీ విభేదం కూడా అప్పటి నుండే ఏర్పడుతుంది. అంత వరకూ ఉండదు. స్త్రీకి అవయవముల యొక్క పెంపు కూడా అప్పుడే వస్తుంది 7వ సంవత్సరం నుండి. పురుషుడి గొంతు కూడా 7వ సంవత్సరం తరువాత 14వ సంవత్సరం లోపల మారుతుంది, అంతవరకూ ఇద్దరి గొంతూ ఒకలాగే ఉంటుంది. ఆడపిల్ల మాట్లాడుతోందా, మగపిల్లవాడు మాట్లాడుతున్నాడా, మీరు చెప్పలేరు, 7 ఏళ్ల పిల్లవాడు మాట్లాడుతుంటే. అబ్బాయో అమ్మాయో తెలియదు, గొంతులు కూడా మారవు, ఈ ఆడగొంతు, ఆ మగగొంతు ఎప్పుడయ్యింది, ఎప్పుడన్నా గమనించామా? ఈ సమయంలో ఈ మార్పులు మనలో రాగానే, మనలో కామం ఉద్భవిస్తుంది. ఉద్భవిస్తే దాన్ని ధర్మసమ్మతంగా వినియోగించుకోవడం అనేది, ఆ సమయంలోనే నేర్పాలి. ఆ విద్య నేర్పకపోవడం వల్లనే భూగోళం మీద ఇంత సంక్షోభం ఇప్పుడు. కాబట్టి 10, 12 అవుతోంది. అంటే మనకి మేష రాశి నుండి మీన రాశి వరకు 12 రాశులు ఉండగా అంతకుముందు అవి 10 రాశులే. ఎందుకంటే కన్యా రాశి, తులా రాశి, వృశ్చికరాశిగా, ఉన్న మూడు రాశులూ, అంతకుముందు, వృశ్చికరాశి, కన్యారాశి కలిపి ఒక రాశిగానూ, తులారాశి అనేది లేక /లేదు. అంటే ఏమిటి? స్త్రీ, పురుషుల యొక్క విభేదము జరుగలేదు. అటువంటి వారిని androgynous అంటారు. యోగులందరూ అటువంటివాళ్ళే. అంటే ఏమిటి, స్త్రీ అంటే, ప్రకృతి. పురుషుడు, తత్త్వము. ప్రకృతి, పురుషులు తనయందే తనకు దర్శనం ఇస్తున్నంత కాలం, బయట దేని గురించీ వ్యామోహం చెందడం ఉండదు. అది యోగి సహజ స్థితి. యోగులకు సమస్తమూ అంతర్ముఖముగానే దర్శనం ఇస్తూ ఉంటుంది, ఆనందిస్తూ ఉంటాడు, కోరదగినది ఏమీ ఉండదు. దేశాన్ని బట్టి, కాలాన్ని బట్టి, వారికి కావలసినది వారి దగ్గరకి వస్తూ ఉంటుంది, వారు అడగరు ఏమీను. అదీ యోగస్థితి. ఎందుకంటే వారి యందు ప్రకృతి, పురుషులు అనుసంధానం చెందియున్నారు. ఇంక బయట చూడ్డానికి ఏమీ లేదు. మీరు రమ్మంటే గుడికి

వస్తాడు తప్ప, గుడికి వెళ్ళాలని ఉండదు. మీరేమన్నా పూజ చేయమంటే చేస్తాడు తప్ప, పూజ చేసుకోవాలి బయట అని ఉండదు. లోపలే అంతా. అట్లా beach కి వెళ్దామా అంటే వస్తాడు తప్ప, అతనికి beach కి వెళ్లామని ఉండదు. అతడు పురుషుడా, స్త్రీ యా అంటే కనిపించడానికి రూపం పురుషుడు గానో, స్త్రీ గానో కనిపించవచ్చు గానీ, పురుషుడూ కాదు, స్త్రీ కాదు. బయట ఇంకొక స్త్రీ ఆవశ్యకత అతనికుండదు. స్త్రీ శరీరంలో ఉన్న యోగి అయితే, పురుషుడి యొక్క ఆవశ్యకత ఉండదు సహజంగా. అంటే బిగదీసుకోవడం కాదు. సన్యాసిట, ఆడవాళ్ళు కనపడితే చూస్తాడట, అంటే అది సన్యాసం కాదు. యోగి, మగ, ఆడ రెండూ తనే. లోపల లేనిది కదండీ బయట వెతుక్కుంటాం. మనం బయట ఇంత వెతుక్కుంటున్నాం అంటే, అంత లేదన్నమాట లోపల. అదంతా లోపలే ఉందని తెలిస్తే బయట వెతుక్కోంగా. బుద్ధుడు, ఏసు క్రీస్తు, కృష్ణుడు, జనకుడు, వశిష్ఠుడు వీరందరికీ బయట ఏమీ లేదు. Everything is inside. కోరవలసినది ఏమీ ఉండదు. ఎందుకంటే అసలు మొత్తం సృష్టి అంతా పురుషుడు, ప్రకృతి. వీరియొక్క సృష్టే కదా. రెండూ తనలోనే ఉన్నారు, అదీ అర్ధనారీశ్వరతత్త్వం. దాన్నే Male Female God అంటారు. దాన్నే androgynous అంటారు. అతడు పురుషాకారంలో కనిపించినా స్త్రీ అవసరం ఉండదు. స్త్రీ ఆకారంలో కనిపించినా పురుషుని అవసరం ఉండదు. ఎందుకంటే తనయందే రెండూ ఉండడం చేత, ఇంకొకరియందు చూసేది ఉండదు. రామునికి సీత, తనయందు ఉన్నది భాగముగా. అందుకని మరియొక స్త్రీ అవసరం లేదు. ఎంత అద్భుతమైన స్త్రీ వచ్చినప్పటికీ కూడా. అమ్మవారికి రాముడు పరిపూర్ణముగా తనయందు భాగముగా ఉన్నాడు. వియోగం లేదు. మనకోసం అది. వారిద్దరిదీ ఆదర్శ దాంపత్యం అని ఎందుకు చెప్పారంటే, రామునియందు సీత ఎప్పుడూ ఉంటుంది. కలిసి ఉన్నా, కలిసి లేకపోయినా. సీత యందు రాముడు ఎప్పుడూ ఉంటాడు. భౌతికంగా కలిసి ఉన్నా, కలిసి లేకపోయినా. మనం ఏదన్నా ఊరు వెళ్ళాం అనుకోండి, మీ ఆవిడ రాలేదా సార్ అంటే అవును రాలేదండీ అంటాం. నిజంగా హృదయంలో తన భార్య యందు ప్రేమ కలిగి ఉన్నవాడికి, హృదయము నందు భార్య ఉన్నది కాబట్టి ఇంకొక స్త్రీ అవసరం ఉండదు, సంస్కారవంతుడైన పురుషుడైతే. అలాగే స్త్రీ హృదయము నిండా

తన పురుషుడు నిండి ఉన్నప్పుడు, ఇంకొక పురుషుని అవసరం ఉండదు, సంస్కారవంతురాలైన స్త్రీ అయితే. ఇంకొక పురుషుడ్ని ఆశిస్తున్న స్త్రీ, ఇంకొక స్త్రీని ఆశిస్తున్న పురుషుడు, వాళ్ళ యొక్క గుండెకాయలో చాలా, vacuum ఉన్నదన్నమాట, ఖాళీ. నిండి లేదు. అందుకనే వీరిద్దర్నీ, వివాహమనే సంస్కారం ద్వారా కలపడం చేశారు. ఎందుకంటే ఇద్దరి యొక్క అనోన్యత పెరిగి, ఒకరి దగ్గర నుండి ఒకరు, తమ దగ్గర ఏది లేదో అది అవతల వారి దగ్గర నుండి అందుకుంటారు. అట్లా కలుపుతాడు భగవంతుడు. తన దగ్గర లేనివి తన భార్య దగ్గర ఉంటాయి. తన భార్య దగ్గర లేనివి తన దగ్గర ఉంటాయి. అదీ complementing aspect. ఇద్దరికీ ఒకే time లో కష్టాలొస్తే బావుండదు కదా. ఒకరికి కష్టాలొచ్చినపుడు ఒకరికి సుఖాలు రావచ్చు. కొన్నిట్లో కొంత బలహీనత పురుషుడికి ఉంటే, వాటిలో స్త్రీకి బలం ఉందనుకోండి, కొన్నింటిలో స్త్రీకి బలహీనత, దాంట్లో పురుషుడికి బలం ఉందనుకోండి, ఆ రెండూ కలిపితే ఎమయ్యింది- పూర్ణం అయ్యింది. ఆవిడ దగ్గర లేనివి ఈయన దగ్గరా లేక, ఆవిడ దగ్గరున్నవి ఈయన దగ్గర ఉంటే కొట్టుకోవడం ఉంటుంది అంతే. అది compatible కాదు. అందుకని ఈ సృష్టిలో ఈ జన్మ జన్మల సంస్కారాల్లో ఇట్లా రాపిడి. స్త్రీ, పురుషుల మధ్య జరిగే రాపిడిలో నుండి పొందవలసినవి పొంది వీడు పూర్ణుడవుతాడని ఈ వివాహసంస్థను ఏర్పరిచారు ఋషులు. స్త్రీ నుండి పురుషుడు నేర్చుకోవలసినవి చాలా ఉన్నాయి. పురుషుడి నుండి స్త్రీ నేర్చుకోవలసినవి చాలా ఉన్నాయి. స్త్రీలకుండే సంస్కారములు, పురుషుల్లో ఉండే సంస్కారములు ఒకే జీవిలో ఉన్నప్పుడు, ఇంక వాడికేమీ అక్కరలేదు. వాడూ ఏమీ అక్కర్లేని వాడు. వాడికి, అపరిగ్రహం అనేది సత్యం. వాడు పూర్ణపురుషుడు! వాడి అంకె 10. ఆ పది పరిపూర్ణ సృష్టికి సంకేతం. వాళ్ళకే దివ్యత్వం, దివ్య శరీర దర్శనములు, దివ్య శరీర నిర్మాణములు జరుగుతుంటాయి. ఇంకా బయట వెంపర్లాడుతున్న వాళ్ళకి ఏమీ జరగదు. అందుకని రాముడు అటువంటి పరిపూర్ణుడు అని చెప్పడానికి 2★5 =10. రామ శబ్దము అలాంటి పరిపూర్ణత కలిగినది. 12 కాదు 10. ఈ సృష్టి ముందు 10 రాశులు గా దిగివచ్చి, 12 అయ్యింది అని చెప్తారు. అందుకే పురుషసూక్తంలో కూడా 'అత్యతిష్ఠద్దశాంగుళం'. ఏదైతే సమస్తాన్నీ అధిష్ఠించి

ఉన్నదో, అది పది గా ఏర్పడింది. అందుకని పది అవతారములు ఇచ్చారు. అందుకని కాలాన్ని కూడా పది గా విభజించారు. నాలుగుగా కనిపిస్తుంది గానీ, అది పది. ఇలా పది పది పది పది గా మండలం ఇచ్చారు. అందుకని మన చక్రాలన్నీ కూడా మండలాకృతిలో ఉంటాయి. ఎందుకంటే మిగతా ఆకారములన్నీ కూడా మండలాకృతిలో ఇముడుతాయి. It is a perfect figure అంటారు. Globe is perfect figure. ఒక బంతి ఉందనుకోండి, polygons అన్నీ అందులో merge ఔతాయి. దాన్ని మీరెలా పెట్టినా, తలక్రిందులుగా ఉన్నట్లు కనిపించదు. బంతికి తలక్రిందులేమున్నది. మిగతా ఆకారాలకి తలక్రిందులు ఉండవచ్చు. అందుకని అంతటితో సమానంగా తలక్రిందులుగా కనపడనిది ఇంకొకటి ఉంది, దాన్ని cube అంటారు. అందుకని ఈ sphere అన్నా, ఆ cube అన్నా ఒకటే. రెండిటికీ ఉండే స్థితి ఒకటే. ప్రభావం, శక్తి, తరంగములూ ఒకటే. Sphere లోంచి cube వస్తూంటుంది. Cube లో sphere ఉంటుంది, ఇట్లా చెప్పుకుంటూ ఉంటారు. ఇదంతా పదికి సంబంధించిన కథ. వేదములు నాలుగు, కాలములు నాలుగు విధాలుగా ఉన్నాయి, వర్ణాశ్రమ ధర్మములు నాలుగు, జ్ఞానము నాలుగు రకములుగా తెలుసుకోవాల్సింది ఉన్నది. ఏమిటిది, భక్తి, జ్ఞాన, యోగ, వైరాగ్యములు. నాలుగు నాలుగు నాలుగు, ఈ నాలుగు ద్వారా 10 అనే పరిపూర్ణతను పొందే అవకాశం ఉన్నది. రామతత్త్వంలో ఈ పరిపూర్ణత ఉన్నది. మనకింత జ్ఞానం తెలియకపోయినా, దాన్ని అలా స్మరణ చేస్తుంటే, స్ఫూర్తికలిగి అందులోంచి మనకి ఒక్కొక్కటి ఒక్కొక్కటి, వికాసం కలగడం మొదలు పెట్టి, మనల్ని పరిపూర్ణతకు చేరుస్తుంది రామనామం. అటువంటి ఉత్తమమైన నామం కాబట్టి, ప్రత్యేకించి మానవులకు ఒక తారక మంత్రంగా ఇచ్చారు. ఒక్క రామ మంత్రాన్నే తారకమంత్రం అంటారు. మిగతా వాటికి తారకమంత్రం అని పేరు లేదు. తారక మంత్రం అంటే తరింప చేసేది, దాటించేది. దేని నుండి? సంసారసాగరం నుండి. సంసారసాగరం అంటే కోరికల సాగరం. 'సంతోషి కాకుండ సంసార హేతువు' అన్నారు కదా! 'కోరుకోరా, కోరుకోరా' అంటే బలిచక్రవర్తి, ఎందుకయ్యా కోరుకోమంటావు, కోరుకోవటమంటే జారిపోవడమే అని చెప్పాడు వామనుడు. నువ్వు కర్తవ్యం నిర్వరిస్తుంటే నీ దగ్గరికి అన్నీ వస్తూ ఉంటాయి.

నీవు పరిగెత్తడం మొదలుపెడితే, జారిపోతూ ఉంటావు. పరుగెత్తకు, ఉండు. పరుగెత్తకు ఉండు అని చెప్పటానికే మనకు అజగరుడి కథ ఇచ్చారు. ప్రహ్లాదుడంతటి వాడు వెళ్ళి చూసి వస్తాడు అరణ్యంలో. ఆయన ఎక్కడికీ వెళ్ళడుట, అన్నీ ఆయన దగ్గరికే వస్తాయిట. మంచి దిట్టంగా ఉన్నాడట. కావలసిన భోజనం వస్తోంది, కావలసిన వసతులన్నీ వస్తున్నాయి. యోగులు, ప్రయత్నించకుండానే, సమస్తమూ వారి దగ్గరకి వచ్చి ఉంటాయి. ఎందుకంటే లోపల అన్నీ ఉన్నాయి కాబట్టి, ఆ ఆకర్షణకి అన్నీ చేరతాయి. మనం నూనె రాసుకుని పుట్టెడు నువ్వులలో పొర్లినా ఒళ్లంతా అంటవు కదా! అంటిన నువ్వే అంటుతుందనే సామెత ఉన్నది. అందుకని ఊరికే కోరడం వలన రాదు, కర్తవ్యమునందు నిలబడడం వలన వస్తుంది. రాముడు అట్లా కర్తవ్యమునందు నిలబడినవాడు. ఇంక ఏమీ కోరనటువంటివాడు. కర్తవ్యమే! ఎక్కడికక్కడ కర్తవ్యం. నిష్పలాంటివాడు. ఎటువంటి కర్తవ్యము, తన భార్య యొక్క పాతివ్రత్యం సమస్త లోకానికీ తెలియాలి, లేకపోతే ఎవడో ఏదో ఒకటి కూస్తాడు అనే తన భార్య యందు తనకు ఉండే రక్షణ భావం అంత ఉండడం చేత, అగ్ని ప్రవేశం కోరతాడు. అంతే కానీ తను అనుమానించాడని కాదు. నీకు తెలిసినప్పటికీ, తాను రాజు కదా, రేపు చక్రవర్తిగా పరిపాలిస్తున్నప్పుడు, ఎవరన్నా ఏమన్నా అనవచ్చు కదా! ఎంత వాత్సల్యము తన భార్య మీద తనకి లేకపోతే ఆ పరీక్ష పెట్టాడు. అందరికీ కోపం వచ్చింది పరీక్ష పెట్టాడని, సీతాదేవికి కోపం రాలేదు. అది చూడండి. లక్ష్మణుడికి కోపం వచ్చింది. యుద్ధం అయిపోయింది, అంతా సంరంభంగా ఉన్నారు. సీతాదేవి వస్తోందిట, కోతులన్నీ చిందులు తొక్కుతున్నాయి, అందరూ చాలా ఆనందపడుతున్నారు, వస్తోంది, మరి ఎదురు వెళ్ళవా అని అడిగితే, అక్కడ చితి పేర్చండి, ఆ అగ్నిలోంచి నడచి రమ్మనండి ఆవిడని, అప్పుడు నేను చూస్తాను అంటాడు. అట్లా కర్తవ్యంలో నిలబడినవాడు, సామాన్యం కాదు.

రాముడు చేసిన పనులు చాలా అద్భుతమైనవి ఉన్నాయి. ఘట్టం, ఘట్టం తీసుకుని ఒలుచుకుంటే, మనకి తెలుస్తుంది ఆయన విశ్వరూపం. 'బోడి సుగ్రీవుడి కోసం' ఒక విధంగా(ఒక విధంగా సుగ్రీవుడు చాలా గొప్పవాడు, అంటే మన బోటి వాళ్ళు ఆయన కాలి గోటికి కూడా సరిపోము).

అదలా ఉండగా రాముడితో పోల్చి చూస్తే? 'ఎంతటి వాడీయన, ఇతడి స్నేహం కోరి వచ్చాడు' అని లక్ష్మణుడు అన్న మాటలు మీరు వింటే కళ్ళ వెంబడి నీళ్ళు వస్తాయి. ఎందుకంటే లక్ష్మణుడికి రాముడు ఎవరో తెలుసు, ఎంతటివాడో తెలుసు. ఎవరిని స్నేహం అర్థించడానికి వెళ్తున్నాడో, వాడు ఎటువంటివాడు, ఈయన ఎటువంటివాడు, ఆయన్ని ఈయన స్నేహం అర్థించడమేమిటి? కాలపురుషుడికే బాధ కలిగేట్టుగా ఉంటుంది. రాముడికేం లేదు. నీ సహాయం నేను కోరుతున్నాను, నీ స్నేహం నేను కోరుతున్నాను అన్నాడు. కోరగలమా, కోరలేం! ఏదో రాముడు దేవుడు, ఆహా ఓహో అని చదువుకోవడం కాదు. మిమ్మల్ని రాముడి పరిస్థితిలో పెట్టుకుని, అసలు రాముడంటే ఏమిటో ముందు అవగాహన చేసుకుని, అంతటి మనిషి ఇటువంటి పనుల్లో ఎన్నెన్ని అవమానాలు భరిస్తాడో. అవమానమని తెలియదు మనకి చదువుకుంటుంటే. లక్ష్మణుడంటే తన ప్రాణమే. లక్ష్మణుడికి ఏమన్నా జరిగితే, అందుకనే లక్ష్మణుడికి మూర్ఛ వచ్చినపుడు సీతాదేవి లేకపోతే నాకేం పోయే, ఒక పెళ్ళాం పోతే ఇంకొక పెళ్ళాం తెచ్చుకోవచ్చు, లక్ష్మణుడు పోతే ఇంకొక తమ్ముడు రాడుగా ఇటువంటివాడు అని చెప్తాడు. మనకి కోపం వస్తుంది ఏమిటి ఇట్లా మాట్లాడతాడని. కానీ బాగా నువ్వు రాముడి స్థితిలో నిన్ను పెట్టుకుని చూస్తే, రాముడి ప్రతి మాటలోనూ, చాలా అందని లోతులుంటాయి. లక్ష్మణుడికి తెలుసు రాముడి లోతులు. అందవు రాముడి లోతులు, లక్ష్మణుడికే అందవు. కాలపురుషుడికే అందనన్ని లోతులు ఉన్నాయి. సుగ్రీవుడు రాముడితో పని కాబట్టి రాముడ్ని గౌరవిస్తాడు లక్ష్మణుడ్ని గౌరవించడు. దానికి రాముడు ఎంత బాధపడతాడు తెలుసా లోపల? కానీ ఏమీ బయటపడడు. సాల వృక్షాన్ని కొట్టి సుగ్రీవుడు, రాముడికి ఒక ఆసనంగా ఏర్పరిచి కూర్చోమంటాడు. లక్ష్మణుడ్ని పట్టించుకోడు. అంతకుముందు హనుమంతుడు, రామలక్ష్మణులను కలిసినపుడు ఏ విధంగా ప్రవర్తించాడు, అదే రామలక్ష్మణులు కలిసినపుడు సుగ్రీవుడు ఏవిధంగా ప్రవర్తించాడో చూస్తే, హనమంతుడు పైన ఎక్కడో ఉంటే, సుగ్రీవుడు క్రింద ఎక్కడో పాతాళంలో ఉంటాడు జ్ఞానపరంగా. తెలిసినవాడు కాబట్టి హనుమంతుడు గభాలున మరొక చందనం వృక్షం కొట్టుకువచ్చి, కూర్చోపెడతాడు లక్ష్మణుడిని. మరి

ఇవన్నీ మనం విపులంగా, విశ్రాంతిగా, ప్రశాంతంగా చదువుకోవాలి. గబాగబా అయిపోవాలి కిష్కింధకాండ, అలా కాండలు అయిపోవాలని అనుకుంటే ఏమీ అవదు. అప్పుడు అంటాడు, లక్ష్మణుడు హనుమంతుడితో 'ఈయనా, ఆయన స్నేహంకోరడానికి వచ్చాడు?' అంటాడు. ఆ అనడంలో ఆ శ్లోకం ఎప్పుడన్నా మీరు చదివితే, గిర్రున తిరుగుతాయి కళ్ళవెంబడి నీళ్ళు, అర్థమైతే! అదృష్టం కొద్దీ సంస్కృతం మనకి అర్థం కాదు లెండి. అలాగే గుహుడి దగ్గరకి వెళ్ళినపుడు మొదటి రోజు పడుకునేటపుడు చక్రవర్తి కుమారుడు, ఎన్నడూ నేలమీద పడుకున్నవాడు కాదు, ఈ లక్ష్మణుడు, గుహుడు సంప్రదించుకుంటూ ఉంటారు. ఎటువంటి పక్క వేయాలి ఈయనకి, పడుకోవడానికి, నిద్రపట్టడానికి అని. వీళ్ళు మాట్లాడుకుంటూ ఉంటారు, ఆయన నిద్రపోతాడు హాయిగా ఆకుల మీద. ఆశ్చర్యంవేస్తుంది. ఎక్కడికక్కడ వాలి దగ్గర గానీ, తార దగ్గర గానీ, అంగదుడి దగ్గర గానీ, విభీషణుడు వచ్చినప్పుడు గానీ, సుగ్రీవునితో ప్రవర్తనము, భరతునితో ప్రవర్తనము, రాజ్యాభిషేకం కాదు అడవులకు వెళ్ళాలి అన్నప్పుడు ప్రవర్తనము, అంటే ఒక ఘర్షణ యందు, క్లిష్ట పరిస్థితియందు రాముడు చూపిన సమన్వయం, రాముడు పలికిన మాట, ఎన్ని లోతులున్నాయో! పరిపూర్ణత తెలియాలంటే, రామాయణం బాగా చదువుకోవాలి, చదువుకుంటే తెలుస్తుంది. ఇంత లోతులు ఎక్కడ్నుండి ఉన్నాయి, అంటే పూర్ణమానవుడు! కానీ ప్రపంచానికి తెలియకుండా ఉండడంలో పూర్ణత్వం ఇంకా పెరిగింది. నేనింతటివాడినని నేనింతటివాడినని, చెప్పకుంటే అవదు కదా! వాడెంతటి వాడో వెతుక్కున్నవాళ్ళకి కూడా పూర్తిగా తెలియలేదు. అటువంటి నామం అది! దాని లోతులు నువ్వు శోధించిన కొద్దీ దొరుకుతూ ఉంటాయి. అందుకనే రుచికి వ్రాసుకుంటారు ప్రతివారూ రామాయణం. ఎన్ని రామాయణాలున్నాయి మన దేశంలో! ఎందుకని? ఆ రామనామం మీద, రాముని మీద ఉండే రుచి కొద్దీ వ్రాసుకుంటారు. ఆ వ్రాసుకోవడంలోను, ఆ స్మరణలోను అటువంటి పవిత్రీకరణం జరుగుతుంది. ఒక విష్ణు సహస్రనామము చదివితే నీకెంత పవిత్రీకరణం జరుగుతుందో, అట్లా కేవలం రామనామం ఆ విధంగా, నీ నోట్లో ఎప్పుడూ మెదుల్తూంటే నీకు అటువంటి పరిపూర్ణత వస్తుంది. ఇది Aquarian dose అని చెప్పాడన్నమాట శివుడు.

అంటే మొత్తం మర్రిచెట్టు అంతా మింగలేం కాబట్టి, గింజ చేసి homoeo dose లాగా నోట్లో ఒక మాత్ర వేసుకో సరిపోతుందని ఇచ్చాడు. అంటే మనబోటి వారి కోసమే వాళ్ళు పడే తిప్పలన్నీ. ఎందుకంటే మనకి ఏదైనా పెద్దదిగా కనిపిస్తుంది. ఇది నోట్లో అనుకుంటూ ఉండు. పెదిమలు కదిల్చి ఊళ్ళో వాళ్ళకి తెలిసేట్టు చేయకు. అది వెకిలి. చాలా వెకిలిగా చేస్తుంటాం మనం. ఎంత సేపూ ఇంకొకరికి తెలియాలని తాపత్రయం తప్ప, అదేదో దాని యందు నీకు రుచి కలిగినదీ, నీకు చాలా అత్యంత ప్రీతికరమైన విషయం, నీకు ఎంతో రహస్యంగా ఉండాలి. 'ఎంత రహస్యంగా ఉండాలండీ?' అని ఒక శిష్యుడు అడిగాడు గురువు గారిని. నీకు నీ పెళ్ళానికీ మధ్య ఉండే సంబంధం అంత రహస్యంగా ఉండాలిరా అని చెప్పారు. అది బయట చెప్పకోవు కదా. అంతకన్నా సన్నిహితంరా ఇది. చెప్పకోకురా చేసే సాధన. మంత్రం అలా చేసుకోవాలి, ఎంత చేసుకోవాలంటే, నీకే తెలియాలి. నీవు ఆపినా ఆగకూడదు. అది అప్రయత్నంగా జరిగిపోతూ ఉండాలి. ఊరికే నాలుక ఆడిస్తే లాభం లేదు. పెదిమలు ఆడిస్తే లాభం లేదు. మనస్సు కాసేపు ఏదో చూసి, అట్లాగ విశ్రాంతిగా గమనిస్తే, అరె! జరుగుతోందే అనిపించాలిట. అదీ జపం. అజప స్థితి అంటారు. జరిగిపోతూ ఉంటుంది అంతే. పై పనులు పైన జరుగుతుంటే లోపల అది జరుగుతుంటుంది. భక్తరాజ్ మహరాజ్ గారు కూడా చెప్పేది అదే. అది లోపల అట్లా జరుగుతూ ఉండాలి. ఆగకూడదు. అది ఉంటే, మందిర నిర్మాణం పూర్తయిపోతుంది. మనకి ఒకాయన కథ ఉన్నది. చిత్తూరులో, ఒక ఆవిడ విపరీతంగా పూజలు, ఆరాధనలు, భజనలు, కీర్తనలు, పుణ్యక్షేత్ర దర్శనాలు, బాహాటంగా బహిర్గతంగా చాలా ఉంటుంది. ఆయనేమో శొంఠి కొమ్మల్లే కనిపిస్తాడు. ఏమీ చేస్తున్నట్లు కనిపించడు. కానీ ఆయన దగ్గరకి వచ్చి ఎవరన్నా ఏమన్నా అడిగితే ఆయన చెప్తే అయిపోతూ ఉంటాయి. ఆయన బలం ఏమిటో ఈవిడకి తెలియదు. ఎప్పటికీ తెలియలేదు. ఈమెకు అంతు పట్టేది కాదు. ఎన్నడూ దేవుడికి దణ్ణం పెట్టినట్లు కూడా కనిపించలేదు. ఒక రోజు చెప్పింది నాకు తెలిసింది మీ రహస్యం అని. ఎప్పటికీ, కాపురానికి వచ్చిన 50 ఏళ్లకి. Golden Jubilee కి తెలిసిందన్నమాట. ఏం తెల్సింది అంటే, నిన్న రాత్రి మీరు నిద్రపోతున్నప్పుడు, మీ శ్వాస దగ్గర నేను చెవి పెట్టి వింటే, మీరు రామనామం

చేసుకుంటున్నట్లుగా తెల్సింది అన్నది. ఆహా, నా సాధన నీకు తెల్సిందా అని చెప్పారట, మరుక్షణంలో శరీరం వదిలేశారట. అంటే సాధన బయటకు తెలిసిందని, అంత అపచారం జరిగిందని. The Mason builds his temple in pitch darkness, in utter silence అంటారు. నిజమైన సాధకుడు లోలోపల, లోలోపల ఏం నిర్మాణం చేసుకుంటున్నాడో ఇంకొకరికి సంబంధం లేదు. వాడికి, వాడి దైవానికి సంబంధించిన విషయం ఇంకొకళ్ళకి ఎందుకు తెలియాలి? అలా లోతుల్లో ఉంటారు రామ భక్తులు కూడా. మిగతా వాళ్ళలాగా అలా తేలిపోరు. అందుకని శివుడు 'నాకు రామనామం ఇష్టం' అన్నాడు. అతడే కదా రామ భక్తుడిగా వచ్చాడు. ఎవరు హనుమంతుడు? తనే దిగివచ్చిన వాడు. శివాంశ! రామనామం చేసి రాముడికి దాసునిగా ఉన్నాడు. కాబట్టి ఇటువంటి రామతత్త్వానికి సంబంధించినదే, ఇది మరచిపోకు సుమా అని మనకు చెప్పడానికి అట్లా వేదవ్యాసుల వారు మళ్ళీ ఒకసారి శివుడు పలికిన వాక్యాన్ని ఒక శ్లోకంగా మనకు అందించారు. అందుకని, విష్ణుసహస్రనామం చేసుకోలేకపోయామనుకోండి ఒకరోజున మనం రామనామం చేసుకోండి. అవకాశం ఉన్నప్పుడు విష్ణు సహస్రనామం చేసుకోండి. అవకాశం లేకపోతే కనీసం రామనామం చేసుకోండి. చేసుకుంటే జరిగినట్టు. దీనికి ప్రమాణం పరమశివుడే. పరమశివుడు చెప్పినట్టు ఏమిటి ప్రమాణం? వేదవ్యాసుడే ప్రమాణం. వేదవ్యాసునకు అబద్ధాలు చెప్పవలసిన అవసరం ఎంతమాత్రం లేదు. ఎందుకు లేదంటే వేదవ్యాసుని జీవితం మనం తరచి చూసినట్లయితే, ఆయన ఎంతటి వాడో తెలుస్తుంది. అంతటి వాడు మనకోసం అబద్ధాలు ఆడవలసిన అవసరం ఉండదు కాబట్టి, ఆయన ప్రమాణం మనకి. ఆ ప్రమాణం తీసుకుని, ఆ నామాన్ని అట్లా జపం చేసుకుంటూ ఉండండి. ఇవాళ్టి నుండి చేసుకుంటున్నాను సార్ అని ఎవరికీ చెప్పకండి. చేసుకోండి. రేపట్నుంచి మొదలు పెడదాం అనుకోక, ఇప్పుడే. ఏ నామమైనా అంతే, రామనామమే కాదు. ఊరికే పెదవులు కదిలిస్తుంటే వినుగ్గా ఉంటుంది, వెకిలిగానూ, దంబాచారంగాను. అది లోపలకి తీసుకెళ్లిపోయి లోపల నుండి చేసుకోండి. అద్భుతంగా ఉంటుంది. అగ్నితత్త్వపురాశి కాబట్టి శుభ్రంగా మాడ్చి పారేస్తుంది. కాల్చేయడమే. పక్కన హనుమంతుడు చేరతాడు, వాయువు.

ఎండబెట్టేసి, కాల్చేసి, శుభ్రంగా ఆవిడేమో వర్షం కురిపించేస్తుంది. కొత్త చిగురు వస్తుంది. ఇంక అప్పట్నించి మనం అద్భుతంగా జీవించవచ్చు. అలా రామభక్తులు ఆ జన్మలోనే దివ్యశరీరం ధరించి, రామ సాన్నిధ్యంలో అనుభూతి పొందుతూ శాశ్వతంగా ఉన్నవారున్నారు. అందులో ముఖ్యులు మరువు మహర్షి. ఆయన రాముని వంశం వారు. ఆ విధంగా మౌనంగా యుగముల తరబడి మానవజాతికి సేవ చేస్తున్నారు. ఆయన గురించి ఎవరికీ తెలియదు. మిగతా పరమగురువుల గురించి తెలిసినంతగా కూడా ఆయన గురించి తెలియదు. ఎందుకంటే మౌనం. మాట్లాడితే అగ్నియే. అందుకే ఆయన ఇచ్చిన యోగాన్ని కూడా 'అగ్ని యోగం' అంటారు. తక్కువ మాటలు, ఎక్కువ ప్రభావం ఉంటుంది.

నమోస్త్వనంతాయ సహస్రమూర్తయే

నమోస్త్వనంతాయ సహస్రమూర్తయే
సహస్ర పాదాక్షి శిరోరు బాహవే
సహస్రనామ్నే పురుషాయ శాశ్వతే
సహస్రకోటీయుగధారిణే నమః

ఈ శ్లోకానికి క్లుప్తంగా వివరణ చేసుకోవడంతో మన ఈ విష్ణు సహస్రనామ వివరణ మహా యజ్ఞం పరిపూర్తి అవుతుంది. ఆగస్టు 8, 1998 సంవత్సరంలో దివ్యసంకల్పం గానే ఇది మొదలైంది. మానవ సంకల్పం అయితే అంతరాయం లేకుండా పరిపూర్తి అవ్వడం వీలుకాదు. ఆ విధంగా మనం పారాయణ చేసే చివరి శ్లోకం వరకు కూడా భగవంతుడే మనల్ని నడిపించుకుని వచ్చాడు అని భావనతో ఈ శ్లోకానికి కూడా ఒక క్లుప్తమైన అర్థాన్ని వివరించుకుందాం. ఈ నామాలు అన్ని నా దృష్టిలో ఎటువంటివి అంటే ఒక్కొక్క నామం మీద మనం ధ్యాస ఉంచి, మనసు లగ్నం చేసి, భావన చేసుకుంటే అందులో నుండి ఎన్నెన్నో విషయాలు మనకు గోచరిస్తాయి. ఈ నామాల్లో బీజాక్షరాలు ఉన్నాయి, మంత్రములు ఉన్నాయి, సంఖ్యాపరమైన బలము లేక శక్తి ఉన్నది. ఈ నామములలో వివిధములైన వర్ణములు అంటే రంగులతో కూడిన కాంతి ఉన్నది, సమస్తమైన సృష్టి సౌందర్యము కూడా ఇమిడి ఉన్నది. అందుకని శ్రద్ధ, భక్తి ఈ రెండు ఆధారంగా చేసుకుని ఈ నామములను తదేకంగా హృదయంలో పఠించే వారికి చాలా రకములైన బంధముల నుండి విమోచన కలుగుతుంది. బంధ విమోచనానికి విష్ణు సహస్రనామం కన్నా మించినది ఇంకోటి లేదు. ఎందుకంటే అటువంటి అమరిక ఈ సహస్రనామంలో చేర్చి పెట్టారు. అందుకని కలియుగంలో ఉన్న మానవులం మనకి బంధాలకి లోటు లేదు కాబట్టి, బంధ విమోచనము కలగాలంటే ప్రతి దినం మనం విష్ణు సహస్రనామం పారాయణ చేసుకుంటూ ఉండాలి. అయిపోయింది అనుకోవద్దు, మొదలైంది అనుకుందాం. మన లోపల స్ఫూర్తి విష్ణువే కలిగించి, హృదయం నందు నిరంతరం మనం విష్ణుసహస్రనామ పారాయణం చేసుకుంటూ ఉన్నాం. భగవంతుడు ఈ

బృందం ఏదైతే ఉందో, తనే ఎన్నుకొని, వీళ్ళందరిని ఈ నామాలకి వివరణకి వచ్చేటట్టుగా, అంతరంగంలో సంకల్పించి పట్టుకు వచ్చాడు. ఇలా జరిగింది కాబట్టి ఈ బృందం ఇదే విధంగా దానికి ఎన్.వి.ఎస్.మూర్తి గారు విష్ణు సహస్రనామ అధ్యయన సంఘం అన్నారు. మంచి పేరు వచ్చింది. కాబట్టి మనం కలిసి విష్ణుపరంగా ఏదైనా మంచి కార్యాలు కూడా చేసుకుంటూ ఉండవచ్చు. పుణ్యక్షేత్రాలు కలిసి వెళ్ళవచ్చు, పుణ్యమైన కార్యములు చేయవచ్చు. ధర్మమైన కార్యములు చేయవచ్చు. ఎన్ని చేసినా తరగని కార్యములు చాలా ఉన్నాయి, ప్రత్యేకించి భారతదేశంలో. స్ఫూర్తి తగ్గించుకోవద్దు, పెంచుకుంటూ ఉందాం. సహస్రమైన పనులు చేయవచ్చు, అనంతమైన పనులు చేయవచ్చు. 'నమో స్త్వనంతాయ సహస్ర మూర్తయే'!

ఈ శ్లోకం ఒక మంత్రం. ఇక్కడ సహస్ర అనేది అత్యద్భుతమైన మంత్రము అని సహస్రనామములలో ఈ నామం వచ్చినప్పుడు చెప్పకోవడం జరిగింది. ఇప్పుడు సహస్ర అనే ఈ మంత్రము ఈ శ్లోకంలో నాలుగు సార్లు వచ్చినది. అంటే అర్థం బాగా హృదయంలో వాటి అంతట అదే అప్రయత్నంగా జరిగిపోయినట్టుగా చదవవలసిన శ్లోకములలో ఇది ఒకటి. అలాగే:

శ్రీరామ రామ రామేతి రమే రామే మనోరమే
సహస్రనామ తత్తుల్యం రామ నామవరాననే.

అనే శ్లోకంలో ఏడుసార్లు ర, మ అనే బీజాక్షముల యొక్క ఉచ్ఛారణ ఉన్నది. కాబట్టి శివుడు పలికినట్టుగా రామ మంత్రాలలోకి అది ఉత్తమమైన మంత్రముగా చెప్పకోవచ్చు. అట్లాగే ఇక్కడ సహస్ర అనే మంత్రము దీనికి మించిన శక్తివంతమైన మంత్రము లేదు, అని వేదములలో చెప్తారు. దేనికి అదే ఒక ప్రత్యేకత. అంతా ఒక తత్త్వం గురించి ఈ విధంగా చెప్పి ఉంచారు. రకరకాలుగా చెప్పారు. అలాగే రుద్రం అంతా చేయడానికి మనకి ఓపిక లేదు అనుకోండి, మూల మంత్రము మాటిమాటికి రుద్ర రుద్ర రుద్ర అనేది వచ్చేది చేయాలి.

యో రుద్రో అగ్నౌ యో అప్సు య ఓషధీషు యో రుద్రో
విశ్వా భువనా వివేశ తస్మై రుద్రాయ నమో అస్తు

మూడుసార్లు రుద్ర వస్తుంది. మూడుసార్లు రుద్ర అని వచ్చే మంత్రం కాబట్టి రుద్ర మంత్రములలో కెల్ల అత్యంత పటిష్టమైనది, బలమైనది.

సూక్ష్మంలో మోక్షం అంటారు చూడండి, బీజప్రాయంగా మొత్తం రుద్ర సారాన్ని అంతా కూడా, మనకి అందించేటట్టుగా ఋషులు పొందుపరచిన మంత్రాలు. మనకి ఇట్లా మామూలు వాడుకలో వాడే మంత్రాలలో ఈ మూడు కనిపిస్తాయి. అట్లాగే నాలుగవది ఒకటి ఉంది. అక్కడ కూడా సహస్రయే.

సహస్ర శీర్ష్వా పురుషః సహస్రాక్ష సహస్రపాత్
సభూమిం విశ్వతో వృత్వా అత్యతిష్ఠ ద్దశాంగులం

అక్కడ సహస్ర మూడు సార్లు వచ్చింది. ఈ శ్లోకంలో సహస్ర నాలుగు సార్లు వచ్చినది. ఒక శ్లోకంలో ఒక మహత్తరమైన మంత్రము ఎన్నిసార్లు ఎక్కువగా వస్తే ఆ మంత్రము, ఆ శ్లోకం ద్వారా ఎక్కువగా మన యందు ప్రతిధ్వనించి, దాని తరంగములు ఉద్భవించి, మన యొక్క సమస్తమైన జీవతత్త్వమును పవిత్రీకరిస్తాయి. అందుకని మనం ఉత్తర భాగంలో విష్ణు సహస్రనామం అయిన తర్వాత ఫలశ్రుతిలో ప్రత్యేకించి ఈ రెండు ఏరుకున్నాం. బీజాక్షరంతో కూడిన మంత్ర పూతమైన నామములు ఒకటికన్నా ఎక్కువసార్లు చెప్పబడిన శ్లోకాలు ఇవి. అందులో సహస్ర అనేది నాలుగు సార్లుగా వచ్చినది. అది విశిష్టత. అది అలా ఉండగా సహస్ర అంటే 1000. సహస్రనామములు అంటే వెయ్యి నామములు అని అర్థం. బహునామా, చాలా నామములు అని చెప్పడానికి కూడా సహస్ర వాడుతారు. 1000 సార్లు చెప్పాను నేను, నువ్వు వినలేదు అంటారు కదా. నిజానికి 1000 సార్లు చెప్పామా. చాలాసార్లు చెప్పాం అని చెప్పడానికి సహస్ర వాడుతారు. ఎన్నిసార్లో లెక్కలేదు అనడానికి కూడా సహస్ర వాడతాం. అందుకని భగవంతునికి వెయ్యి నామములు, వెయ్యి రూపములు, వేయ్యి కన్నులే, వెయ్యి పాదములే, వెయ్యి హస్తములే అని అనుకోక్కర్లేదు. చాలా అని చెప్పడానికి చెప్తున్నాం అనే ఒక అవగాహన. (అంకె అంటే ఒకటి నుండి తొమ్మిది వరకు. సంఖ్య అంటే అంకెల గుంపు అని అర్థం. అది పది నుండి ఉంటుంది). 1000 అనే సంఖ్యలో ఒకటి, మూడు సున్నాలు ఉన్నాయి, అంటే మూడు లోకములకి అవతల నిలబడిన ప్రజ్ఞ అని చెప్తాం. సృష్టిని మూడుగా విభాగం చేస్తే మూడు లోకాలు. పదార్థమయము, శక్తిమయము, ప్రజ్ఞామయము దాటిన తత్త్వము. ప్రజ్ఞ కూడా సత్యమును గ్రహించినదే.

చైతన్య వంతులం అవడం అనేది, అది ఉండడంవల్ల అని చెప్పుకుంటాం కదా. ఉన్నది ప్రజ్ఞావంతులమై, అందులోంచి శక్తి పుట్టి, అందులో నుండి పదార్థమైన లోకాలు పుడతాయి. ఇక్కడ స్థూలంగా మూడు లోకాలు. అలాగే ఐదు లోకాలకి చెప్పుకుంటారు. పంచీకరణమని చెప్తారు. అలాగే ఏడు లోకాలు చెప్పుకుంటే కోటి అవుతుంది. అందుకని మనకి వెయ్యి, లక్ష, కోటి అని లెక్కలు చెప్తారు. కాబట్టి ఇక్కడ 'నమోస్తు అనంత రూపాయ సహస్రమూర్తయే' అని చెప్పడంలో అనంతమైన వాడు, ఎన్నో రకములైన మూర్తులు కలిగినవాడని, మనం కీర్తించినవే కాదు అంతకుమించి ఇంకా కోటానుకోట్ల మూర్తులు ఉన్నాయి.

'సహస్రపాద అక్షి శిరోరు బాహవే' పాదములు, కన్నులు, శిరస్సులు, ఊరువులు, బాహువులు.

'సహస్రనామ్నే పురుషాయ శాశ్వతే' ఎన్నో నామములు కలిగిన ఒకే ఒక పురుషుడవు నువ్వు. శాశ్వతమైన వాడివి.

'సహస్ర కోటి యుగధారిణే నమః' అంతులేని కోట్ల యుగములను ధరించిన వాడివి.

అంటే ఇంక ఏం చెప్పలేము అనేదానికి ఇట్లా చెప్పారు. ఇంత అంతా అని చెప్పలేం. ఎన్నెన్ని చెప్పను అని చెప్పడానికి ఇది ఒక స్థూలమైన అర్థం. నమోస్తు అనంతాయ, అనంత నామం వచ్చింది, సహస్ర నామం వచ్చింది. మూర్తయే అంటే రూపములు. సహస్ర పాదములు, సహస్ర హస్తములు, సహస్ర పాదాక్షి, శిర, ఊరువులు, (తొడలు) బాహువులు (చేతులు). శిరస్సులు, కాళ్ళు, చేతులు.

సహస్రనామ్నే పురుషాయ శాశ్వతే, సహస్రకోటి యుగధారిణే నమః

ఈ పాటికి అందరికీ మనం వింటున్న దానికి కాస్తో కూస్తో సంస్కృత పరిజ్ఞానం వచ్చేటట్టుగా తయారయింది. ఇందులో 1000 అంటే 3 లోకాలూ దాటి పైన ఉన్నవాడు అని ఒక అర్థం. అది అలా ఉండగా సహస్ర అనే నామానికి మంత్రానికి అర్థం చెప్పుకోవాలి. స అనేది పురుషుని శబ్దం. హ అనేది ప్రకృతి యొక్క శబ్దం. సహ అంటే వీళ్ళిద్దరూ కలియడం అన్నమాట. మాస్టర్ గారు పురుష సూక్తము స అనే శబ్దంతో మొదలవుతుంది, సహస్ర శీర్షా పురుషః. శ్రీ సూక్తం హతో, హిరణ్య వర్ణాం హరిణిం మొదలవుతుంది

అని చెప్పారు. అమ్మవారి బీజాక్షరము హ. అయ్యవారి బీజాక్షరము స. సహ. సహ అంటే ఇద్దరమని, కూడా అని అర్థం. కలిసి ఉండడాన్ని సహ పంక్తి, సహవాసము అని ఉన్నాయి. ఇట్లా సహ పురుషుడు ప్రకృతి అని అర్థం. స్ర అంటే ర అనే శబ్దము అగ్నిబీజం. సహ అంటే పురుషుడు, ప్రకృతి లోనుండి దిగివచ్చిన మరియొక పురుషుడు అగ్ని తత్త్వంతో కూడిన వాడు. పరతత్త్వము, ప్రకృతి తత్త్వము రెండిటి యెక్క అనుసంధానం చేత ఏర్పడిన మొట్టమొదటి వెలుగు లేక అగ్ని. ఇది మనకు ఈ నామంలో ఉంది. సృష్టికి అతీతమైన భగవత్ తత్త్వం. దాన్ని తత్ అంటాం. పర అని చెప్తుంటాము కదా. అందులోంచి వచ్చిన సంకల్పము. ఆ సంకల్పమే ఆయన హృదయం నుండి వచ్చింది అంటాం. బొడ్డు నుండి రాలేదు. హృదయం నుండి సంకల్పం వస్తే చివరికి బొడ్డులో నుండి ఒకాయన బయటకు వచ్చాడు. అందుకని అమ్మవారిని హృదయం దగ్గర చూపిస్తారు తప్ప బొడ్డు దగ్గర చూపించరు. బొడ్డు నుండి వచ్చిన ఆయన ఇంకొక ఆయన. హృదయం నుండి ఆమె ఉద్భవిస్తే, ఆయన ఉద్భవించడం చేత, ఆమెకి ఆయనకి మధ్య ఏర్పడిన ఆకర్షణ కారణంగా, ఆయనలో నుండి ఆమె అగ్నిని ప్రజ్వలింప చేస్తుంది. అన్ని ఆయనలో ఉన్నాయి. ఆయనలో నుండి మొత్తం సరుకు అంతా బయటకు తీసే ఆవిడ ముందు బయటకు వచ్చింది. ముందు ఆమె సంకల్పంగా బయటికి వచ్చింది. వచ్చిన తర్వాత ఆయనలో నుండి శక్తిని తనలోకి అందుకుంటుంది. శక్తిని ఉద్భవింపజేస్తుంది. అగ్ని. ఆ అగ్నియే మొట్టమొదట పుట్టిన దేవత అని చెప్తారు.'అగ్నె నియతి ఇతి అగ్నిః'. మొదట పుట్టిన అగ్ని. The Father the Holy Spirit and the Son క్రైస్తవ మతస్తులు అంటారు. పరతత్వము ప్రకృతి తత్త్వము ఈ రెండు ఆధారంగా ఏర్పడిన మొదటి సృష్టిలో భగవంతుడు అని మనం చెప్తాం. పురుషుడు. పురుషుడు అంటే ప్రవేశించిన వాడు అని అర్థం. ఆయన నుండి ఆమె లోకి ప్రవేశించి, ఆమె నుండి వ్యక్తమైన వాడు. పదార్థం లేకపోతే వెలుగు లేదు. ప్రతిబింబించడానికి పదార్థం ఉండాలి. ఈయన నుండి వచ్చే కాంతి ఆమె యందు ప్రతిబింబించి వెలుగు వస్తుంది. అందుకని ఆమెని ప్రధానమంటారు. ఆ ప్రధానము ఆధారంగా భగవత్తత్వం నుండి, వచ్చే శక్తి ఆ ప్రధానం మీద పడడం చేత అదితి అనే వెలుగు వస్తుంది అని మనకు వేదంలో చెప్తారు. ఆ వెలుగే అగ్ని. అందులో నుండేన్నీ పుట్టుకొస్తాయి.

'చిదగ్నికుండ సంభూతా దేవకార్య సముద్యతా' అన్నప్పుడు ఏం చెప్తున్నాము అంటే అందులో నుండి పుట్టుకు వచ్చిన అమ్మవారు ఇంకొక ఆమె అంటాం. వీళ్ళందరూ ఇట్లా నిచ్చెనలు వేసుకొని దిగి వచ్చినట్టుగా, ఇంతమంది అమ్మవార్లు, ఒకే అమ్మవారు నుండి దిగివచ్చినా, వారి యొక్క సోపానము ఒకటి ఉన్నది. అయ్యవార్లకు, అమ్మవార్లకు సోపానము ఉన్నది. 21 మంది ప్రజాపతులు ఉన్నారు. ఏడు లోకములలో ముగ్గురు ముగ్గురు గా 21 మంది ఉంటారు. ఇది గాక ముగ్గురు ప్రధానంగా ఉంటారు. ఈ మూడు, ఆ ఏడు కలిసి 10 అవుతారు. అలాగే ఇక్కడ కూడా 'సహస్ర' అని నామం చెప్పకోడంలో, సృష్టికి అవతల ఉన్న భగవత్ తత్త్వము, అందులో నుండి వ్యక్తమైన మొదటి సంకల్పము. వ్యక్తమైన సంకల్పములో నుండి మొట్టమొదటిగా మళ్లీ సృష్టిలోని భగవంతుడిగా దిగివచ్చినవాడు. సృష్టిలోని భగవంతుడితోనే మనకు పని. జీవులకు సృష్టి అవతల భగవంతుడితో అంత ఎక్కువ పని ఉండదు. ఆయన అందరి యందు ఉంటాడు. ఈయన అందరి యందు మేల్కాంచి ఉంటాడు. మన ప్రార్థనలు అన్నీ కూడా చైతన్యవంతులము అవడం కోసమే. ఇహ ఆ పైన అందులోకి వెళ్ళిపోవడం జరిగినప్పుడు, సృష్టిని మించి ఉండడం, సృష్టికి అతీతంగా ఉండడం ఒకటి. సృష్టి యందు దివ్య అనుభూతి, దైవీ విభూతి, అమితంగా ఆనందిస్తూ ఉండడం ఇలా ఉంటుంది. అందుకని సహస్ర మంత్రము మనం చేసుకుంటే అక్కడి నుండి ఇక్కడి వరకు, అంటే From father to son through mother. తండ్రి, తల్లి, వాళ్ళిద్దరినీ పుణికి పుచ్చుకొని వచ్చిన తత్త్వము. అది కదా కుమారుడు అంటే. తండ్రి తత్త్వము తల్లి తత్త్వము రెండు ఉంటుంది. ఈ రెండు మిళితమై ఇంకొక కొత్త వన్నె వస్తుంటుంది. ఆ విధంగా మనకు సృష్టిలోని భగవంతుడు, సృష్టికి ఆవల భగవంతుడు ఇద్దరినీ అనుసంధానం చేసుకుంటూ ప్రకృతి. ముగ్గురిని కలిపి ఇక్కడ చెప్పకుంటున్నాం సహస్రా అని. ఇది బీజాక్షరాలను, వాటి వాటి తత్త్వాలని పోగేసుకుంటే మనకు వచ్చే అవగాహన. అందుకని రహస్యమయిన స్థావరములలో, పుణ్యప్రదేశములలో అంటే హిమాలయముల వంటి గుహలలో ఈ మంత్రాన్ని అట్లా తదేకంగా జపించి అత్యంత శక్తిమంతులైన వాళ్ళుంటారు. వారికి ఈ నామం ప్రాణం కన్నా మిన్న! దాన్ని అట్లా స్మరిస్తూ ఉండడం చేత తమలో

ఉండే ఉన్న స్థితి లేక సత్య స్థితి, తమలో ఉండే ప్రకృతి తత్త్వము, రెండూ సమభావము పొంది పూర్ణమైన వికాసము, చైతన్యముగా వారు తీర్చిదిద్దబడతారు కాబట్టి ఈ నామమును ఒక దీక్షగా ఒక సిద్ధుడి దగ్గర నుండి అందుకుని దీనిని తపస్సు చేసుకుంటూ ఉంటారు. ఎన్నాళ్లంటే వెలుగు ముద్దలు అయ్యేంతవరకు కూడా. అది ఈ 'సహస్రా' అనేది. అందుకనే పురుష సూక్తం అంతా చదవ లేకపోతే ఆ మొదటి శ్లోకం ఒకటి చదువుకుంటే దాని ఫలితం వస్తుంది. 'సహస్ర శీర్షా పురుషః సహస్రాక్ష సహస్రపాత్'. ఆ హ అనేది బాగా పలకాలి. ఎంత చెప్పిన విధంగా పలకగలిగితే అంత చక్కగా దాని యొక్క ప్రభావం మన మీద ఉంటుంది. 'సభూమిం విశ్వతో వృత్వా అత్యతిష్ఠద్దశాంగులం' అదొక్కటే చదువుకుంటూ ఉంటే చాలు. అట్లా. అదొక మంత్రం. మొట్టమొదటే మంత్రం ఇచ్చేసి తరువాత దానికి ఇంకొంచెం. అంటే మొట్టమొదట తినేదే బాగా బలమైన ముద్ద తిన్నామనుకోండి ఇక మిగతావన్నీ ఆకలి తీరడానికి ఉపయోగపడుతాయి. అసలు బలం అదొక్కటే కదా! తల్లి అన్నం పెట్టేటప్పుడు వీడేం తిన్నా ఏం తినకపోయినా బ్రాహ్మాలయితే పప్పు, అన్నం తినేటట్లు చూస్తారు. పెట్టే దాంట్లో అత్యంత బలమిచ్చే ఆహారమేదయితే ఉందో అది బాగా తినేట్లుగా చూస్తారు కదా. ఋషుల యొక్క ఆసక్తి కూడా అదే! ప్రేమ కూడా అదే! ఆదుర్దా కూడా అదే! అందుకని మనం ఎప్పుడో చివరన పెట్టామనుకోండి మనం పలచబడిపోతామేమోనని, మధ్యలో ఎక్కడో ఉంటే ఏమవుతుందంటే మనమట్లా తిరగొచ్చేస్తూ ఉంటాం. మనమెప్పుడు బాగా attentive గా ఉంటామంటే ఉంటే మొట్టమొదటిలో ఉంటాం లేదా చివర్లో ఉంటాం కదా. అయిపోతోందన్నప్పుడు కొంచెం ఉత్సాహంగా కదా. లలితాసహస్రనామంలో 182 శ్లోకాలు చదివినప్పుడు మధ్యలో ఎన్ని చోట్లకి వెళ్లి వచ్చేస్తూ ఉంటామో పాడ్డున పూట. చివరకు వస్తోందంటే 'శ్రీ చక్రరాజ నిలయా శ్రీమత్ త్రిపుర సుందరీ' దగ్గర అందరూ చాలా ఉత్సాహంగా ఉంటారు, అక్కడే ఉంటారు, పలుకుతూ ఉంటారు. ఇంకొకసారి చెప్పినా అనడానికి అభ్యంతరం ఉండదు. మధ్యలో ఏదైనా మూడు సార్లు మాటిమాటికే చెప్తున్నామనుకోండీ, తిట్టుకుంటారు. కదా. ఈయన కానివ్వడేదీనూ. మధ్యలో ఒక నామాన్ని పట్టుకుని 'ఓడ్యాణపీఠ నిలయా' అనేది మూడుసార్లు చదువుతారు కొంతమంది. ఇట్లా మధ్య

మధ్యలో మంత్రపూతం బాగా అంటారు. అన్నీ శక్తివంతమైనవే అయినప్పటికీ అందులో కొన్ని ఎక్కువ శక్తివంతమైన శ్లోకాలున్న చోట నొక్కి నొక్కి చదువుతూ ఉంటారు. నమస్సోమాయచ దగ్గర చూడండి, 'నమశ్శివాయచ శివతరాయచ, నమశ్శివాయచ శివతరాయచ' అంటూ ఉంటాం కదా. అట్లా అనేవి చాలా ఉంటాయి. కానీ మనకు ఓపికో. అసలే కలియుగం. అంతంత మాత్రమే అందరి ఆరోగ్యం. అందుకని ఏం చేస్తారంటే ఇచ్చేదేదో ముందు లేకపోతే చివరి ముద్ద. అందుకని విష్ణు సహస్రనామంలో చివరకు అది ఉంది, పురుష సూక్తం లో ముందుంది ఈ సహస్ర అనేది. ఎందుకు ఇట్లా పెట్టారని వాళ్ళ అమరిక గమనించి, కొంచెం ఆలోచించుకుంటే ఇలా గోచరిస్తాయి. మన తత్త్వాన్ని అర్థం చేసుకుని, ఎప్పుడైతే మనకు సరిగ్గా దాని యందు మనసు లగ్నమవుతుందో అప్పుడు దానికి బాగా ప్రాధాన్యమిస్తారు. ఆ విధంగా మనకు పురుష సూక్తంలో కూడా ఇది ఉన్నది, దీనిని ఎంత తలచుకుంటే అంత శక్తివంతులమవుతాము. భగవంతుని యొక్క సుదర్శన చక్రానికి కూడా ఇదే మంత్రం అని చెప్తారు. ఎందుకంటే అది All powerful. సుదర్శనము సృష్టి చక్రమే. వేరే చక్రం కాదు. కాలచక్రమే. కాలానికి లోబడే అన్నీ ఉంటాయి కాబట్టి మరి దీనిని అందుకున్న వాడికి సమస్తమూ సహకరిస్తాయి. దానిని లోబరుచుకుందాము అంటే దెబ్బ తింటాము. యోగుల మార్గంలో గాని, భక్తి మార్గంలో గాని దమించే మార్గం లేదు. రాజసికమైన మార్గంలోనే దమించాలని ఉంటుంది. సత్త్వ మార్గంలో జయించాలి, దమించాలి, సాధించాలి అలా ఉండదు. సత్త్వంలో దానిని మన యందు అనుభూతి పొందాలి, దానియందు మనముండడం చేత అది మన యందు వుండాలి. మనము ఎవరి యందు ఎక్కువ భక్తి, శ్రద్ధ చూపిస్తుంటామో వారు మనకు కూడా అట్లా ఉన్ముఖంగా ఉంటారు కదా. అదీ భక్తి మార్గం. భగవంతుని యందు ఉన్ముఖత పెంచుకోవడం వలన భగవంతుడు మన యందు ఉంటాడు. మనం ఆయన యందు ఉండడానికి చేసే ప్రయత్నంలో ఆయన మన యందు ఉంటాడు. ఆయనను సాధించాలి, ఆయనను జేబులో పెట్టుకోవాలి, ఆయనను పాట్టలో పెట్టుకోవాలి ఇది దమించే మార్గం. ఈ సుదర్శనం దమించడమేమీ లేదు. ఉంటుందంతే. ఉత్తమమైన శక్తులు దమించడానికి ఉండదు. గరుత్మంతుడు ఉంటాడు

సహకరిస్తూ. విష్ణువంతటివాడు మనిద్దరం కలిసి పని చేద్దామా అని అడిగాడు. అలాగే అన్నాడు. నీకు రెండు వరాలు నేనిస్తాను అంటే నేనూ నీకు రెండు వరాలిస్తాను అన్నాడు గరుత్మంతుడు. అంటే ఏమిటి అర్థం. ఒకరికొకరు ఆ విధంగా పరస్పరంగా అన్యోన్యత్వం చూపించి, వారి సహకారం వలన జగత్ కళ్యాణమైన కార్యములు చేస్తారు. నా కింద నువ్వు పడుంటావా అని అడగలేదు. ఒక్కోసారి కింద పడుండేవాడు, పైనున్నవాడి కంటే గొప్పవాడై ఉండవచ్చు కూడా. శివుడే హనుమంతుడై రాముడికి సేవ చేయలేదా. కిందా పైన, ఎవరు గొప్ప అనుకునే వాళ్ళు చేయగలరా, చెయ్యలేరు. ఈ సుదర్శన చక్రం కూడా అటువంటిదే. ఇది అత్యుత్తమమైన శక్తి కలిగిన మంత్రంగా పెద్దలు చెబుతారు. ఈ సహస్ర అనే మంత్రం ఇందులో నాలుగు సార్లు వచ్చింది. అందులో ఒక రహస్యం ఉన్నది. అందుకనే ప్రత్యేకంగా దీనికి ఈ రోజు తరగతి పెట్టుకోవడానికి కారణం. శబ్దపరంగా అర్థం చేసుకోవాలి, సంఖ్యాపరంగా అర్థం చేసుకోవాలి. నాలుగు సార్లు మూడు సున్నాల చొప్పున 12 సున్నాలున్నాయి అక్కడ. ఒక సహస్రకి మూడు సున్నాలు. నాలుగు సహస్రలకు 12 సున్నాలు. అది మన జ్యోతిష్చక్రం. అందుకనే అది అంత powerful శక్తివంతమైనది. జ్యోతిష్చక్రంలో మనకు 12 రాశులున్నాయి. ఈ 12 రాశులు నిజానికి నాలుగు తత్త్వములు ఒక్కొక్కటి మూడు, మూడు, మూడుగా రావడం వలన 12 అయినాయి. 4x3 is 12. అదొక పెద్ద విజ్ఞానం. త్రిగుణాత్మకమైన ప్రకృతి నాలుగు రకములుగా స్థితిబేధం చెందుతుంది అని చెప్పొచ్చు. లేకపోతే నాలుగు స్థితులు కలిగిన ప్రజ్ఞ మూడు రకాలుగా విడిపోయి పన్నెండవుతుందని చెప్పుకోవచ్చు. నాలుగు, మూడు కలిపితే ఏడు, నాలుగుని మూడుతో హెచ్చవేస్తే పన్నెండు. ఇదొక జ్ఞానం. 3x4 is 12, 3+4 is 7 అని ఒక పరమ గురువు వాళ్ల శిష్య బృందానికి ఈ రెండు మాటలే మాట్లాడుతాడు. ఏమని? మూడు నాలుగుల 12, మూడు+ నాలుగు= ఏడు అని చెప్పి వెళ్ళిపోతాడంతే. ఇక దానిమీద వాళ్ళు అట్లా ధ్యానం చేస్తారు. ధ్యానం చేస్తే, మనం ఒక పది పన్నెండు volumes వ్రాసుకునేంత వస్తుంది వాళ్ళ అవగాహన. ఎందుకంటే మూడు అంటే ఏమిటి, నాలుగు అంటే ఏమిటి, మనం చెప్పుకున్నాం, నాలుగు స్థితుల గురించి చెప్పుకున్నాం, మూడు త్రిగుణాత్మకంగా ఉన్నవి చెప్పుకున్నాం.

వెయ్యిలో మూడు సున్నాలు ఉన్నాయి. అంటే త్రిగుణాత్మకమైన తత్త్వము ఏదైతే ఉన్నదో అది ఒకటే అని కూడా చెప్పుకోవచ్చు. ఒకటే మూడు తత్త్వాలుగా విడిపోతుంది. సత్త్వము, రజస్సు, తమస్సు అనేవి. అది సత్త్వము, రజస్సు, తమస్సు అవడానికి ముందు ఒకటి ఉండాలిగా. అదేగా మూడయ్యింది. ఒకటి లేకపోతే మూడెక్కడవుతాయి. ఈ మూడూ ఒకటి లో ఉన్నాయి. అవి మూడైనప్పుడు ఆ మూడింటిలోనూ ఒకటి ఉన్నది. One in three, three in one అంటారు. మనం లేకపోతే రజస్సు పని చేసేది లేదు, మనం లేకపోతే సత్త్వం పని చేసేది లేదు, మనం లేకపోతే తమస్సు పని చేసేది లేదు. మూడు గుణములు మనం ఉండడం చేత ఉన్నాయి. అట్లాగే ఈ మూడు తత్త్వములు ఆధ్యాత్మికము, అధిదైవికము, అధిభౌతికము. అష్టమ అధ్యాయానికి వెళ్ళాలి. అర్జునుడు అడుగుతాడు ఏమిటి ఆధ్యాత్మము అంటే ఏమిటి, అధిదైవికము అంటే ఏమిటి, అధి భౌతికము అంటే ఏమిటి? అది చెప్పుకుంటే మళ్ళీ ఇక్కడి నుండి మళ్ళీ మనకు ఒక ఐదు ఆరు క్లాసులు అవుతాయి. అది మాస్టర్ గారు చక్కగా ఇచ్చారు. ఎందులో? మంద్రగీతలో. శంఖారావం కాదు మంద్రగీత. మాస్టర్ గారిది ఒక తమాషా ఉంది. శంఖారావం లో చెప్పినవి మంద్రగీతలో లేవు, మంద్రగీతలో చెప్పినవి శంఖారావంలో లేవు. అందుకని మాస్టర్ గారు ఇచ్చిన Mandra scripture, మంద్రగీతల, శంఖారావం మూడూ చదువుకుంటే ఆయన ఇచ్చిన వివరణము మనకు పూర్తిగా అవగాహన అవుతుంది. ఈ ఆధ్యాత్మము, అధి దైవికము, అధి భౌతికము అనేవి మూడు మంద్ర గీత లో వివరణ ఇచ్చారు. ఒక్కసారి తీసి చదువుకుంటే సరిపోతుంది మనమిప్పుడు చెప్పుకోనక్కర్లేదు. అదీ మూడు సున్నాలు. పురుషుడు నాలుగు రకాలుగా దిగి వస్తాడని కనీసం వంద సార్లు చెప్పుకుని ఉంటాం మనం. పరా, పశ్యంతి, మధ్యమ, వైఖరి. ఉండడం, చైతన్యవంతులమవడం, ఆలోచించడం, పనిచేయడం ఇలా నాలుగు, నాలుగు. వాసుదేవ సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధ వ్యూహాలు. దశరథుడికి నలుగురు కుమారులు. ఇంకా ఇదే. ఎందుకంటే బాగా ఎక్కాలని. అదే + (ప్లస్) గుర్తు కూడా. అదే మనం ప్రతి చోటా ఇట్లా ప్లస్ గుర్తు చుట్టూ సున్నా పెట్టుకోవడం. ఒకటే నాలుగయ్యింది అని చెప్పటానికి దాని చుట్టూ సున్నా. ఆ సున్నా తీసేస్తే నాలుగూ

విడిపోతాయి, కలియుగం వచ్చేస్తుంది. అందుకనే వాళ్లు పెట్టుకున్న Cross లో unity is lacking. అది Vedic symbol, వేదపరమైన సంకేతము. వేదంలో దాని చుట్టూ నాలుగు భుజాలు ఒకే పొడుగులో ఉంటాయి. వీళ్లు కింద భుజాన్ని బాగా సాగదీశారు. అంటే బాగా కూరుకు పోయారు పదార్థంలోకి అని తెలుస్తుంది. క్రైస్తవ మతం వాళ్లు వాడే Cross కి కింద భుజం బాగా పొడుగ్గా ఉంటుంది. అది నాలుగువ స్థితి. అది అంత పొడుగ్గా ఉంటే అర్థమేమిటంటే మిగతా మూడు అందనంత పైన ఉంటాయన్నమాట. అంటే సరిగ్గా వాళ్ళ చేతన యొక్క స్థితిని బట్టి వాళ్ళు ఆ సంకేతాన్ని అట్లా సాగదీసుకున్నారు. అంతకుముందు ఇదే Greek cross గా (Goethic cross అంటారు) ఉన్నప్పుడు నాలుగు భుజాలు సమానంగా ఉండేవి. అంతకుముందు ఆర్యావర్తంలో వేదపరమైన జ్ఞానం ఉన్న రోజుల్లో ఈ cross చుట్టూ వృత్తం ఉంటుంది. అది మనకు ఇచ్చారు. అర్థం ఏమిటయ్యా అంటే ఇది ఒకటే నాలుగుగా భాసిస్తోంది అని తెలియడానికి దాని చుట్టూ ఆ చక్రం. కాబట్టి నాలుగు స్థితులలో దిగివచ్చే పురుషుడు మూడు గుణాలను పట్టుకుని దిగివస్తాడు. ఇదీ పన్నెండు కథ. ఇప్పుడు జ్యోతిష్చక్రం మనం తీసుకున్నట్లయితే 12 రాశులు ఉన్నాయి. 12 రాశులునిజానికి నాలుగే (4x3 రాశులు).

1. తత్త్వములుగా చూస్తే మేషము, సింహము, ధనస్సు... అంటే చైత్రమాసం, శ్రావణమాసం, మార్గశీర్ష మాసం... ఈ మూడు అగ్నితత్త్వపు రాశులు. అంటే ఒకే అగ్నితత్త్వం మూడు తత్త్వాలుగా ఈ మూడు మాసాల్లో మనకు గోచరిస్తుంది. అదొక సహస్రం. మేషరాశిలో ఉండే అగ్నినేమో 'విద్యుదాగ్ని' అంటారు, Electric fire. సింహరాశిలో ఉండే అగ్నినేమో 'జ్వాలాగ్ని' అంటారు, అంటే మనకు ఒక candle వెలిగించినప్పుడు జ్యోతిగా కనిపిస్తుంది కదా. విద్యుదాగ్ని అదృశ్యంగా ఉంటుంది. జ్వాలాగ్ని గోచరంగా ఉంటుంది. ధనూరాశిలో ఉండే అగ్ని పదార్థము నందు నిహితమైన అగ్ని. ఈ జ్యోతిగా వచ్చే, జ్వాలగా వస్తున్న అగ్ని candle లోంచి వస్తోంది. ఇందులో లేకపోతే రాదు కదా. సమిధ వేసినప్పుడు జ్వాల వస్తోంది కదా. సమిధలో అగ్ని దాగి ఉండడం వలన అది వ్యక్తం అవుతోంది. అంటే సమిధలో ఉండే అగ్ని కనపడదు, ఆకాశంలో నిబిడీకృతమైన విద్యుదాగ్ని కనబడదు, ఈ రెండింటిని అనుసంధానం చేస్తే నీకు జ్యోతిగా గోచరిస్తుంది. బయట

చోటులో ప్రాణవాయువు ఉంది, కట్టెలో అగ్ని ఉన్నది, ఈ రెండు కలవడమే జ్యోతి గా వెలగడం. ఒకటి spirit రెండు matter, రెండిటి యొక్క కలయిక వలన consciousness. ఒకటి తండ్రి, ఒకటి తల్లి. రెండు కలవడం వలన కుమారుడు, వాళ్ళిద్దరి యొక్క సమగ్ర రూపం, సమన్వయమైన రూపం. అంటే ఆ జ్వాలయందు ఈ సమిధ యొక్క తత్త్వము ఉన్నది, వాతావరణం లో ఉన్న విద్యుదాగ్ని యొక్క తత్త్వము ఉన్నది. ఇప్పుడు దాని మీద గాలి రాకుండా మూకుడు వేసేసారనుకోండి, జ్యోతి రాదు. అలా అని సమిధే లేకపోతే జ్యోతి రాదు. సమిధ లేని జ్యోతి లేదు, చోటులో ఉండే అగ్ని లేకపోతే జ్యోతి లేదు. ఆ రెండింటి కలయికే మనకు దీపం. మనం దీపం వెలిగించుకోవడంలో ఉద్దేశం అది. 'నాలోని పరతత్త్వము, నాలోని పదార్థము రెండింటి యొక్క కూడికగా నేను ఉన్నాను, నేను ఈ జ్యోతి స్వరూపుడను' అని తెలియాలి. అది తెలియాలంటే ఏం చేయాలి? పదార్థంలో ఉండే అగ్నిని బాగా ప్రజ్వలింప చేయాలి. దానికి మథనమే సాధన! నిప్పు రావాలంటే ఏం చేసేవాళ్ళు యజ్ఞంలో ఇదివరకు? అరణిలో పెట్టి అంటే ఒక కట్టె పడుకోబెట్టి ఒక కట్టె నిలువుగా పెట్టి దానిలో దీన్ని పెట్టి చిలికే వాళ్ళు. ఆ చిలుకుడు లోంచి అగ్ని పుట్టుకొస్తుంది. ఇది కూడా అంతే. కింద పడుకోబెట్టిన కట్టె పదార్థము. Horizontal/సమాంతరంగా ఉండే దానిని 'పదార్థం' అంటారు. నిట్ట నిలువుగా ఉండే దానిని 'ప్రజ్ఞ' అంటారు. ఈ రెండింటినీ ఒకదానితో ఒకటి రాపిడి చేస్తూ ఉంటాం అన్నమాట. అదే చిలుక్కోవడం! చల్ల చిలుకుడులోంచి వెన్న పుట్టిందన్నా, క్షీరసాగర మథనంలోంచి అమృతం పుట్టిందన్నా, సాధనలోంచి ఆత్మతత్త్వం జనించి జ్యోతి స్వరూపంగా తనను తాను తెలిశాడు అని అన్నా, ఆ మూడింటికి సంబంధించినవి కూడా మేష రాశి, సింహ రాశి, ధనుర్ రాశి. మూడు రాశులుగా ఉన్నాయి. అందుకని ఈ మూడు రాశులు సాధనాపరంగా అత్యుత్తమమైనవి. అంటే మనలో మార్పు రావాలంటే, గుర్తుపెట్టుకోండి... మీ జన్మ కుండలిని/ జన్మ చక్రం/ రాశి చక్రం లో అగ్నితత్త్వపు రాశులలో మీకు గనక గ్రహములు గాని, ప్రత్యేకించి సూర్యచంద్రులు గాని, మీ యొక్క లగ్నముగానీ ఉన్నట్లయితే మార్పుకు చాలా ఎక్కువ అవకాశం ఉంటుంది. ఎందుకని? అగ్ని మార్చినట్లుగా ఏదీ మార్చదు. ఇక మిగతా తత్త్వాలు మార్చేవేవీ ఉండవు. వాయువు మహా

అయితే ఎండబెడుతుంది. నీరు ప్రవహిస్తూ ఉంటుంది, మహా అయితే కుళ్ళబెడుతుంది. పదార్థానికి మార్పు రావాలన్నా, నీటికి మార్పు రావాలన్నా, వాయువులో మార్పు రావాలన్నా దేంట్లో మార్పు రావాలన్నా, స్థూలము సూక్ష్మమవ్వాలన్నా, సూక్ష్మము స్థూలమవ్వాలన్నా మొత్తము అగ్ని చేతిలో ఉంది. అందుకే సృష్టి మొత్తము అగ్నికార్యమే. ఆ అగ్నిని మనము ప్రజ్వలింప చేసుకోవాలంటే ప్రాణాయామం చేయాలి, సాధన చేయాలి, తీవ్రమైన అంటే ఏకాగ్రతతో కూడిన సంకల్పంతో, అంతరాయములు లేక పట్టిన దీక్ష వదలకుండా, అదే విధంగా చేస్తూ పోతూ ఉండాలి అందుకు వున్న నియమము ప్రకారము. కలిన దీక్ష! అదీ మార్పు తీసుకువస్తుంది. దానిని 'తపస్సు' అన్నారు. తపస్సు అంటే ఏమీ లేదు తపన/ తాపము/ వేడి. ఎండాకాలంలో అబ్బా చాలా తాపంగా ఉంది అంటాం కదా. అట్లా తనను తాను తెలుసుకోవాలనే తపన కారణంగా తనకివ్వబడిన సాధనను అట్లా నిర్వర్తించుకోవడం. దానికి మూడు రాశులు. ధనుర్మాసంలో మొదలుపెడితే మేష రాశికి చేరుకుంటామన్నమాట. మధ్యలో సింహరాశిలో పూర్ణపురుషుడిగా ఉంటాం. అందుకని అన్నీ సింహరాశి వెలుగులే. ఇంక ముందు కూడా ఎక్కువ సింహరాశి వెలుగులుంటాయి. అమ్మవారిని కూడా 'సింహాసనేశ్వరి' అంటాం. The lion among men అంటాం. రాజులు అధిష్ఠించి ఉండేది సింహాసనము. అంటే ఉత్తమ మానవుడని చెప్పడానికి. శ్రేష్ఠుడు ఉండేది సింహాసనం మీద. అది హృదయంలో ఉంది. సింహరాశి హృదయానికి సంబంధించినది.

౭. అలాగే మీరు వాయువు తీసుకున్నారనుకోండి, మూడు రకాల వాయువులుగా ఉంది జ్యోతిష్చక్రంలో. ఏమిటి మూడు రకాల వాయువులు మనకు. ఒక వాయువేమో కుంభరాశిలో మాఘ మాసంలో ఉంది. అది అధ్యాత్మికము. ఇంకొక వాయువు మిథున రాశిలో ఉంది, జేష్ఠ మాసం. ఇంకొక వాయువు తులా రాశిలో ఉంది. ఇది అధి భౌతికము. అధ్యాత్మికమైన వాయువు మనకు కుంభరాశిలో ఉంది. Aquarius. అందుకని మాఘమాసానికి అంత ప్రత్యేకత. చైత్రమాసానికి, శ్రావణ మాసానికి, ధనుర్మాసానికి మనకు ఎటువంటి పండగలిచ్చారో సాధనాపరంగా కనబడుతోంది. అలాగే వాయు తత్త్వం తీసుకుంటే మాఘ మాసం ముందు.

అధి దైవికము అంటే ఈ పదార్థానికి, ఆ ప్రజ్ఞకు రెండింటికి అనుసంధానము చేసే వాయువుగా మనకు జ్యేష్ఠ మాసం లో ఉంది. జ్యేష్ఠ మాసంలో ఉండే వాయువు అటు ఉదానవాయువు (కంఠంలో ఉంటుంది), అపాన వాయువు (మూలాధారం ప్రాంతంలో ఉంటుంది) రెండింటిని అనుసంధానం చేసేటట్లుగా మనలో ఉచ్ఛ్వాస నిశ్వాసలుగా పని చేసే వాయువున్నదే అదే జెమిని లేదా జ్యేష్ఠ లేదా మిథునము. మిథునము అంటే రెండు కదా. మగ, ఆడ కదా. ఉచ్ఛ్వాస, నిశ్వాసలు. ఉచ్ఛ్వాసనిశ్వాసల యందు బాగా కృషి జరిపితే అపానంలో ఉన్న వాళ్యం ఉదానం చేరుకోవడానికి వీలవుతుంది,. మూలాధారంలో ఉండే ప్రజ్ఞ కంఠం చేరుతుంది. కంఠం చేరితే ఆకాశం చేరినట్లే! దానికి సంబంధించిన తాళం చెవి ఈ రెండింటిని అనుసంధానం చేసే జ్యేష్ఠ మాసంలో ఉంది ఆ ప్రజ్ఞ. అందుకని జ్యేష్ఠ మాసం ప్రాణాయామానికి బాగా వినియోగించుకోవాలి. అలాగే చంద్రుడు జ్యేష్ఠ నక్షత్రం లో ఉన్నప్పుడు కూడా ఆ పనికి వాడుకుంటూ ఉండాలి. జ్యేష్ఠ పౌర్ణమి ఈ కార్యక్రమానికి పరాకాష్ట. అట్లా ఉన్నాయి రహస్యాలు. అందుకని వాయుతత్త్వపు రాశులు చెప్పేవి చాలా ఉన్నాయి. Libra తులారాశి. బొడ్డు దాని క్రింద ఉండే భాగం లో తిరిగే వాయువు అంతా కూడా అపాన వాయువు. శరీరమంతా వ్యాపించి ఉండే వాయువు వ్యానము. లోపలికి పీల్చే వాయువు ప్రాణము. హృదయములో ఉండే వాయువు సమానము, కంఠములో ఉండే వాయువు ఉదానము. ఈ వాయువులన్నీ ఏకమై హృదయములో ప్రాణము, అపానము, వ్యానము పోగేసుకుని సమానములోకి చేరి, సమాన వాయువుని అట్లా ఊర్ధ్వగతి చెంది ఉదానానికి వెళ్తే, కంఠం దగ్గరకు వచ్చేసరికి భూమికి పైన ఉన్న స్థితిలో ఉంటాడు. అంటే భూమి మీద వాయువులో గమనం చేసే స్థితి వస్తుంది. అది ఒక యోగ స్థితి. వాయుగమనం అప్పుడు సాధ్యపడుతుంది. పురుషమేధంలో జ్వాలాకూలుడు జైమినిని ఆకాశగమనం చేయిస్తాడు. కదా. మహర్షులు అట్లా ఆ విధంగా ఉదానవాయువు వరకు వచ్చి ఆకాశగమనం చేస్తారు. ఉదానంలోకి వస్తే తప్ప భూమి యొక్క బంధం పోదు. మరి ఇక్కడ ఒకటే తత్త్వం మూడు విధాలుగా అగ్నితత్త్వం, వాయుతత్త్వం, జలతత్త్వంగా ఉన్నది.

3. జలతత్త్వంలో ఆకాశంలో ఉండే నీరు మనకు ఫాల్గుణమాసము లేదా మీనరాశిలో ఉంటుంది. సముద్రంలో ఆటుపోట్లుగా ఉండే నీరుగా (ఆకాశంలో ఉండే నీరు సముద్రంలోంచి ఆకాశంలోకి, మళ్లీ సముద్రంలోనికి అట్లా చక్రం తిరుగుతూ ఉంటుంది కదా) మనకు కర్కాటక రాశిలో లేక ఆషాడమాసం లో ఉంటుంది. అందుకని ఆషాడమాసంలో గ్రహములు గాని, లగ్నములు గాని, సూర్యచంద్రులు గాని ఉంటే మనిషిలో ఆవేశం ఎక్కువగా ఉంటుంది. ఎందుకని? ఆ జలం ఆవేశపూరితమైన జలం. సముద్ర జలం లో ఒక్కొక్కసారి విపరీతమైన అలలు వస్తూ ఉంటాయి కదా. High Tide, low tide. ఆకాశంలో ఉండే జలం నిర్మలంగా ఉంటుంది. అసలు ఉన్నట్లుగా కూడా తెలియదు. అందుకనే మనకు అట్లా చూస్తే ఏమీ లేనట్లుగా transparency (పారదర్శకత) స్పష్టత బాగా కలిగి ఉంటుంది. అటువంటి స్పష్టత కలిగి ఉన్నది మీనరాశి. అందుకనే అమ్మవారు మీనాక్షి అయ్యారు. అక్కడ అమ్మవారు మీనాక్షి. కర్కాటక మాసంలో వర్షాలు మొదలవుతాయి. కర్కాటకం రాంగానే దక్షిణాయనం వస్తుంది. దక్షిణాయనం రాంగానే భూమి ఇలా తిరుగుతూ మళ్లీ ఒక tilt వస్తుంది. రాంగానే మేఘములేర్పడడం, వర్షాలు పడడం, బురద నీళ్ళాను. నదులన్నీ బురద నీళ్లతో ఉంటాయి. వర్షఋతువులో నదిలో ఎవ్వరూ స్నానాలు చేయరు. శరదృతువు వరకు ఆగుతారు. ఎందుకంటే ఈ బురదంతా పోయి నిర్మలమైన నీళ్లు మళ్లీ శరదృతువు. అందుకనే కార్తీకమాసం వచ్చేసరికి నదీ స్నానాలు చేస్తారు/వస్తాయి. మార్గశీర్ష మాసంలోనూ, మాఘమాసంలోనూ. అక్కడికి వచ్చేసరికి బాగా నిర్మలమైన నీరు వస్తుంది, మీనం వచ్చేసరికి పూర్తిగా నిర్మలం. నీటి యొక్క చక్రభ్రమణం లో కర్కాటక మాసంలో బురదగా ఉంటుంది. అందుకని ఆకాశంలోకి సముద్రంలో ఉండే నీళ్ళు వెళ్తాయి. ఆకాశం లోపలి నీరు సముద్రంలోకి వస్తాయి. ఈ చక్రభ్రమణానికి కర్కాటక రాశి. మూడవ జలతత్త్వపురాశి వృశ్చికరాశి. భూమి లోతుల్లో ఉండే నీరు, అంటే భూమి లోపల ఉండే నీరు, చీకటిలో ఉండే నీరు. అందుకని చీకట్లో, లోతుల్లో, కన్నాల్లో ఉండే జంతువులన్నిటికీ కార్తీకమాసం. వృశ్చికం. వృశ్చికం అంటే ఏమిటి తేలే. తేలు కన్నంలో ఉంటుంది ఇట్లా హాయిగా బయట తిరగదు. తిరిగితే కొట్టేస్తారు. పాములు, తేళ్లు, మురుగునీళ్లు. వృశ్చిక రాశి

ఎంత పవిత్రమైన రాశో, అంత భయంకరమైన రాశి కూడా. ఎందుకంటే చాలా రహస్యమైన రాశి అది. అత్యంత పవిత్రమైన విషయములు అతి రహస్యంగా ఉంటాయి, అత్యంత దరిద్రములైన విషయములు కూడా అక్కడ ఉంటాయి. అదే వృశ్చికరాశి. జీవుడు వాడి యొక్క సంస్కారాన్ని బట్టి ఇందులోనో, అందులోనో ఉంటాడు. వృశ్చిక రాశి వాడు average గా ఉండడు. ఉంటే ఇటు బాగా international rogue అవ్వగలడు, లేదా enlightening being అవ్వగలడు. మధ్యలో ఉండడు. అయితే గరుత్మంతుడై ఆకాశంలో ఎగిరిపోతాడుట లేకపోతే పామయిపోయి కలుగుల్లోకి వెళ్ళిపోతాడు. పామో, గరుత్మంతుడో అవుతాడుట తప్ప ఊరికే అట్లా సామాన్యంగా ఉండలేరుట వాళ్ళు. వాళ్ళ దగ్గర దాపరికం ఎక్కువ. మంచి విషయమూ దాచగలడు, పరమ దరిద్రమైన విషయమూ దాచగలడు. ఎవరికీ తెలియదు. ఇటువంటి నీళ్లు వాడిలో ఉంటాయి అంటే ఈ నీళ్లు ఎక్కడ నీళ్లయ్యా అంటే మనకు ఈ బొడ్డు కింద ఉండే నీరు. నిర్మలమైన నీరు కాదిది. ఆకాశగంగ కాదిది, పాతాళ గంగ. ఎంతసేపూ ఈ గంగ అధోముఖంగా ప్రవహించడానికి ప్రయత్నం జరుగుతూ ఉంటుంది. అందుకని వృశ్చిక రాశిలో ఉండే వాళ్ళు సంస్కారవంతులు కాకపోతే కాముకులు అవుతారు. తీవ్రమైన సంకల్పబలం కలిగిన వాళ్ళు కాబట్టి అది ఎటు వాడితే అటు పనిచేస్తుంది. అది వృశ్చికరాశితత్త్వం! అక్కడ ఉన్నది వాడికి చాలా పెద్ద యుద్ధం. పెద్ద కురుక్షేత్ర యుద్ధమంత ఉంటుంది వృశ్చిక రాశిలో. Trial and Triumph అని ఇస్తారు జ్వాలాకూల మహర్షి. ఆ trial లో తను ఓడిపోతే వెళ్ళిపోతాడు. గెలిస్తే ఆకాశంలోకి వెళ్తాడు. అందుకని మురుగునీరు, లోతైన బావుల్లో నీరు, రహస్య స్థావరములో ఉండే నీరు, సూర్యరశ్మి సోకని నీరు ఇట్లా ఉంటుంది వృశ్చికరాశి నీరు. అంటే impure water. ఆ రాశిలో ఒక భాగం అట్లా ఉంటుంది, మరియొక భాగం మరొకరకంగా ఉంటుంది. రెండూ రెండు extremes అక్కడ కలిసి ఉంటాయన్నమాట. ఒకే జలతత్త్వం మూడు తత్త్వాలుగా అక్కడ ఏర్పడ్డాయి. అంటే ఒకటే తత్త్వం మూడుగా ఏర్పడితే వెయ్యి అయ్యింది కదా.

4. అలాగే పృథ్వీతత్త్వం మూడు ఉన్నాయి. అందులో ఆధ్యాత్మికమైన పృథ్వీతత్త్వం వైపు ఉత్తరాయణ సంక్రమణం నుంచి వచ్చే పుష్యమాసానికి

సంబంధించినది. అందుకనే Capricorn is the hour of the dawn అంటారు. రక్షకుడు పుట్టే మాసం అని చెప్తారు. ప్రతి సంవత్సరం ఉత్తరాయణ పుణ్యకాలం అంటామే అది భూమికి రక్షకుడు పుట్టే కాలంగా అంటే అప్పుడు వచ్చే సూర్యుడి యొక్క కిరణములు మనలో ఉండే తేజస్సును ఊర్ధ్వగతి చెందింపజేస్తాయి. అందుకని ఆ మాసానికి ఒక ప్రత్యేకత ఉన్నది. ముక్కోటి ఏకాదశి చేసుకుంటాం. ఆ ఏకాదశికి అంత ప్రాముఖ్యత. మకరము ఆధ్యాత్మికమైన పదార్థము అంటే the spiritual matter in you. ఆధ్యాత్మిక మైన పదార్థము. అధి దైవికమైన పదార్థము కన్యారాశిలో ఉంటుంది. కన్య అంటే పవిత్రముగా ఉన్నది. ఇంతవరకు ఏ విధమైన భావముల యొక్క ముద్రణ లేనిది, అద్దము వంటిది, ప్రతిబింబించే అద్దం వంటిది అని అర్థం. ఇంకా బొమ్మ పడని వెండితెర లాంటిదాన్ని కన్య అంటారు. అంటే ఒక పురుషుని గురించి ఇంకా ఏ భావన లేదు ఆమె మనసులో. అది సామాన్యంగా స్థూలంగా మనం చెప్పుకునే కన్యకు అర్థం. ఒక మనిషి మనస్సు భావములతో నిండి ఉండక కేవలము వెలుగులు విరజిమ్ముతున్నట్లుగా ప్రతిబింబించేట్లుగా ఉన్నదనుకోండి, అంటే ఆయన ఊరికే ఉంటే అట్లా ఆత్మ యొక్క వెలుగు మనస్సు మీద పడి అది పౌర్ణమి వలె ప్రతిబింబిస్తూ ఉంటుందన్నమాట. పౌర్ణమి కి ఏమి జరుగుతుంది? సూర్యుని యొక్క వెలుగు చంద్రుడు మీద పడి ప్రతిబింబిస్తోంది. చంద్రునికి ప్రత్యేకమైన వెలుగేమీ లేదు. అలాగే మనస్సుకు కూడా ప్రత్యేకమైన వెలుగు లేదు కానీ ఆత్మతో ఉన్ముఖం చెందడం వలన ఆ ఆ మనస్సు ఎప్పుడూ వెలుగునే ప్రతిబింబింప చేస్తూ ఉంటుంది. వేరే విషయంలో ఆ మనస్సు మీద ముద్ర పడవు. కర్తవ్యాన్ని అనుసరించి కొన్ని ముద్రలు మనస్సు మీద పడుతుంటే వాటిని నిర్వర్తించి, మళ్ళీ వెలుగుకు ఉన్ముఖమై ఉంటుంది. అది కన్యారాశి అంటే. కన్యకు పుట్టాడు యేసు అంటే అర్థం అదే. ఆమె అంత పవిత్రమైనదని. ఆయన అంత పవిత్రుడని. మనలో మనస్సు కూడా పదార్థలోకాలకు సంబంధించినదే. చంద్రుడు తత్త్వము. దానికి పవిత్రత ఎలా ఉండాలంటే ఏదైనా మనకు బయట పనులు ఉన్నప్పుడు వాటికి సంబంధించిన భావపరంపర మనస్సులో ఉండాలి. పనులు లేనప్పుడూ ఒకటే భావం. వెలుగుకు ఉన్ముఖమై ఉండాలి. అందుకే కమలాలు ఆ విధంగా వెలుగు ఎలా తిరుగుతూ ఉంటే దాని ప్రకారం

అట్లా తిరుగుతాయి. సూర్యుడు వెళ్తుంటే ఉత్తరం పక్క చూస్తూ ఉంటాయి. అట్లా తిరిగిపోతాయి పశ్చిమానికి. వాలిపోతాయి. మళ్లీ పొద్దున్నే సూర్యుడు వస్తే మళ్లీ అటువైపు తిరుగుతాయి. పని ఉంటే పని, పని లేకపోతే దివ్యత్వం వైపు ఉన్ముఖం చెందిన సహజమైన స్థితి ఎవరికి ఉంటుందో వారి యొక్క పదార్థము (శరీరం యొక్క పదార్థము) అత్యంత పవిత్రమైన పదార్థంగా చెప్తారు. అదే వారిలో దివ్య శరీరము పొందడానికి కావలసిన అర్హత. కన్యాత్వము చెందాలి అంటారు. అంటే మనకు ఉండే భావముల నుండి మనకు విమోచనము కలగాలి. ఎలా కలుగుతుంది. అనుస్యూతం ఆ దైవం యొక్క స్మరణ జరుగుతూ ఉండడం చేత, దానియందు అనురక్తి పెరగడం చేత! రక్తి వేరు, అనురక్తి వేరు. రక్తి అంటే కాసేపు ఉంటుంది, పోతుంది. ఈ 'అను' అనే శబ్దం చాలా important. అను అని పిలుస్తాం చూశారా మనం. అను అంటే అనుస్యూతము అని. అనుస్యూతము అట్లా రక్తి కలిగి ఉండడం. పని ఉంటే పని, అవ్వగానే ఠక్కున మళ్ళీ అక్కడికి వచ్చేస్తుంది. మనకు దేనియందు ఎక్కువ రక్తి ఉన్నదో పని అవ్వగానే మనస్సు మళ్ళీ దాని మీదకు వచ్చేస్తుంది కదా. డబ్బు సంపాదించే వాడికి దాని మీదకు వెళ్ళిపోతూ ఉంటుంది వద్దన్నా. గిల్లికజ్జాలు పెట్టే వాడికి దాని మీదకు పోతూ ఉంటుంది. ఇష్టం లేని వాడి మీదకు ఎక్కువ పోతూ ఉంటుంది కదా. అదే రక్తి. దేని యందు మనకు రంధి ఉన్నదంటామో, ఎందుకురా అంత రంధి అంటామే అది. Cricket match వచ్చిందనుకోండి, ఆట యందు బాగా రంధి ఉండేవాళ్లు పనులు కూడా మానేసుకుని చూస్తారు కదా. తరువాత ఏడుస్తాడు, పనిచేసుకుంటే బాగుండేదని. కానీ ఆ సమయంలో అదే. ఇట్లా ప్రతి దాని మీద ఒక రంధి ఉంటుంది కదా. మనస్సు అనుస్యూతము అటే పోతూ ఉంటుంది. వదిలేస్తే అక్కడకు పోతుంది. మన మనస్సుని మామూలుగా వదిలేస్తే ఎక్కడికి పోతుందో చూడండి. అదీ మన స్థితి! కట్టి ఉంచినప్పుడు ఉన్నది సహజ స్థితి కాదు కదా. వదిలేస్తే మామూలుగా ఎట్లా ఉంది? పందైతే మురికి గుంటలోకి వెళుతుంది. దాని సహజ స్వభావం అంటామే అట్లా సహజముగా వెలుగు యందు అనురక్తి కలిగి ఉన్న తత్త్వము వలన ఎప్పుడూ అట్లా సూర్యుని యొక్క వెలుగు, పదార్థము మీద పడుతూ ఉంటే ఏమవుతుంది ఆ పదార్థం. It gets radiated.

కాంతివంతమవుతుంది. It gets magnetised అంటే అయస్కాంతీకరణము చెంది ఉంటుంది. అటువంటి పదార్థము తో కూడిన శరీరము నీకుంటే నువ్వు చూసినా, నువ్వు నవ్వినా, నువ్వు మాట్లాడినా, నువ్వు ముట్టుకున్నా ఎదుటివాడికి ఉపశమనం కలుగుతుంది. కొంతమంది వస్తున్నారంటేనే తేళ్లు జర్రులు పాకినట్లు ఉంటుంది. ఇంక ముట్టుకోక్కర్లేదు, మాట్లాడక్కర్లేదు. కొంతమంది వస్తున్నారంటే అట్లా ఎదురుతిన్నులు చూసే పరిస్థితి ఉంటుంది కదా. ఎప్పుడొస్తారా, ఎప్పుడు వస్తారా అని చూడమూ. ఇవన్నీ ఏమిటి తేడా, వారిలో ఉండే ఈ కన్యాత్వమే! ఇది అధిదైవికమైన పదార్థం. అధ్యాత్మికమైన పదార్థము మనకు పుష్యమాసము లేక మకర రాశి అంటాము. అధిదైవికము కన్యారాశి లేదా భద్రపథము. భాద్రపద మాసము అని ఎందుకన్నాము, అక్కడికి చేరుకుంటేట ఇంకా పథము అంతా కూడా అంటే మార్గం అంతా కూడా భద్రమే. ఇంక నీకేమీ చిక్కులు లేవు. భద్రపథం! సుభద్ర. అక్కడ నుండి అధిభౌతికమైన పదార్థం ఉంది. అది మనకు వృషభరాశిలో ఉంటుంది. వృషభం అంటేనే తెలిసిపోతోంది కదా. ఎద్దు. ఎందుకు పెద్ద మర్యాద ఏమీ ఉండదు కదా. అందుకే మరీ బండ వెధవ అయి ఉంటే మరీ ఎద్దండీ అంటాం. మరీ బండగా ఉంటే అచ్చేసిన ఆంబోతు అంటాము. అర్థమేమిటంటే ఏ చేనులో అయినా పడి తినేస్తుంది అది. ఇది మన చేను, మన చేను కాదు అనేమీ ఉండదు. అన్నింటినీ మట్టేస్తుంది, అన్నీ తొక్కేస్తూ ఉంటుంది, అడ్డం వస్తే పాడిచేస్తూ ఉంటుంది. కొందరైతే బండ బండగా ఉంటారు, తన్నుకుంటూ పోతూ ఉంటారు. కదా. దానిపనే దానికి ముఖ్యం తప్ప పక్క వాళ్ళకు దీనివల్ల ఇబ్బంది కలుగుతుందనేం ఉండదు. వృషభం అన్నమాట. ఎద్దు! అంటే స్థూలమైన పదార్థం అన్నమాట. మనిషే బండ. మన వల్ల పక్క వాడికి ఇబ్బంది కలుగుతుందేమో అన్న భావన ఉండదు. మన పద్ధతే మనది. మనకు ఇష్టం వచ్చినప్పుడు లేస్తాం, మనకు ఇష్టం వచ్చినప్పుడు తింటాం, ఎవరింటికైనా వెళ్ళినప్పుడు కూడా అట్లాగే ఉంటాం. అదీ తమాషా. అంటే మిగతా వాళ్ళు సంస్కారవంతులు చూస్తే ఓహో ఎద్దొచ్చింది, దానికి అర్థం కాదు, కానీ అట్లా ఉండని అని అనుకోవాలి. అంతే తప్ప మనం కోప్పడి లాభం లేదు. ఎద్దుతో పోట్లాడి లాభం లేదు. తెలియదు కదా. అట్లా ఎద్దులు తిరుగుతూ ఉంటాయి కొన్ని కొన్ని. మన

మధ్యలోనే. తేలు తిరుగుతూ ఉంటాయి, పాములు తిరుగుతూ ఉంటాయి, కుడుతూ ఉంటాయి, కాటేస్తూ ఉంటాయి. అవన్నీ వృశ్చికం. ఇది ఎద్దులు. ఈ ఎద్దుకు, ఆ వృశ్చికానికి మంచి పోటీ ఉంటుందంట ఎప్పుడూనూ. అదేమో మట్టేస్తూ ఉంటే ఇదేమో కుట్టేస్తూ ఉంటుంది. ఇదీ వీళ్ళిద్దరి మధ్య ఆట. అందుకనే జ్యోతిష్యపరంగా కూడా వృశ్చిక రాశికి, వృషభ రాశికి ఒక రకమైన పోటీ చెప్తారు. ఈ కుట్టేసేది, ఆ మట్టేసేది ఈ రెండూ పోట్లాడుకుంటే రెండింటికే కాస్త... అంటే గజేంద్రుడు, మకరము పోట్లాట ఉంది చూడండి అట్లా ఉంటుందన్నమాట. ఏం జరిగింది? ఏనుగు ఎద్దుల్లే ప్రవర్తిస్తుంది, అడ్డగోలగా ప్రవర్తిస్తుంది. నీళ్లలో మునిగి మరీ అంత భయంకరంగా చెరువు అంతా కూడా disturb చేస్తోందని చెప్పి అది వచ్చి పట్టింది. పడితే దీని ధాటికి అది ఆగలేక పోయింది. ఎంత ఎద్దు లాంటి ఏనుగు? 1000 మంది భార్యలండీ. 1000 ఏంటి దశలక్షకోటి కరణీనాథుడు. మనవాళ్లు అంకెలు చెప్పడంలో మరి సందేహించరు. దశ లక్ష కోట్ల ఆడ ఏనుగులకి ఈయన ఒక్కడే మగాడు అని చెప్పారు. అంటే ఉద్దేశం ఏమిటంటే చాలా బలవంతుడని. ఇంతా, అంతా బలం కాదు. దారిలో అన్ని చెట్లూ విరుచుకుంటూ వచ్చేశాడు. అట్లా పోతూ ఉంటుంది ఎద్దు. అక్కడ తినేసి, ఇక్కడ చేసి ఎక్కడో తగులుతుంది దానికి. ఈ వృశ్చిక రాశిలో ఈ నీళ్ళల్లో ఉంది కదా లోతుల్లో. దానికి అంతరాయం కలిగితే వచ్చి పట్టేసింది అంతే. ఇంత ఏనుగూ పీనుగు అయిపోయింది. Taurus, scorpio... పెద్ద కథ. కాబట్టి ఇక్కడ వృషభంలో ఈ రకమైన అధ్యాత్మికమైన పదార్థం ఉంది, అధిదైవికమైన పదార్థం ఉంది, అధిభౌతికమైన పదార్థం ఉంది. ఇట్లా మనకి మూడు, మూడు, మూడు గా నాలుగు తత్త్వములు... వాయుతత్త్వము, అగ్నితత్త్వము, జలతత్త్వము, పదార్థ తత్త్వము. ఇవి పన్నెండు. ఈ 12 ని మూడు, మూడు, మూడు గా జ్యోతిష్చక్రంలో చెప్తారు, లేకపోతే నాలుగు, నాలుగు, నాలుగు గా నాలుగు cross/ శిలువలుగా చెప్తారు. స్థిర రాశి, చరరాశి, ద్విస్వభావరాశి. Fixed cross, Cardinal cross, Mutable cross. అందుకని నాలుగు గా దిగివచ్చినవి వాయువు, అగ్ని, జలము, పదార్థము. ఎక్కడి నుండి వచ్చినాయి? ఆకాశంలోంచి. అందుకని ఇక్కడ మనకు మూడు సున్నాలు, నాలుగు సార్లు వస్తాయండీ. నాలుగు తత్వాలు

మూడు మూడు మూడుగా ఉండడం వలన ద్వాదశాదిత్యులు, ద్వాదశాత్మకమైన జ్యోతిష్చక్రము, ద్వాదశ స్వభావములతో కూడిన వాసుదేవ రూపంగా ఒక సంవత్సర చక్రాన్ని చెప్తారు. దానికి దండం పెట్టుకోమన్నారు. అందుకనే ప్రతీ మాసానికి దాని ప్రత్యేకత గమనించుకుని దానితో అనుసంధానం చెంది జీవిస్తూ ఉంటే సంవత్సరపురుషుడి యొక్క దర్శనం జరుగుతుంది. అదే వాసుదేవ దర్శనం. సంవత్సర పురుషుడి యొక్క తత్త్వము, లక్షణములు అవగాహనై, దానితో అనుసంధానం చెంది నువ్వు జీవిస్తూ ఉంటే 'వాసుదేవో అభిరక్షతు'. 'శ్రీమన్నారాయణో విష్ణుః వాసుదేవోభిరక్షతు'. ఈ వాసుదేవుడు, 'ఓం నమో భగవతే వాసుదేవాయ' అనే 12 అక్షరములతో ఈ 12 రాశులను ఆవరించి ఉన్నాడు, ఈ 12 రాశులలో ఉండే తత్త్వమును అవగాహన చేసుకుని దానికి అనుసంధానంగా జీవిస్తూ ఉండాలి. ఆశ్వీయుజ మాసంలో దేవి పూజలు చేసుకునే వాళ్ళు ఒక రకమైన చీకటిలోంచి తరింపబడతారు. లేకపోతే వెళ్లిపోతారట్లా. బిలం లోకి వెళ్లి పోయినట్లుగా వెళ్ళిపోతారు. అంత చీకటి ఉంది. ఇదే బిలంలో కటిక చీకట్లోకి వెళ్లిపోయే వాళ్లకి ఈవిడని పట్టుకోవడంతో వెన్నెల్లోకి వెళ్ళిపోతారు. ఇట్లా ఋషులు అమర్చారు. ప్రతి మాసానికి దాని తత్త్వం ఎరగాలి. ఆ మాసపు లక్షణం తెలియాలి. రెండు మాసాలు ఒక ఋతువుగా ఆరు ఋతువులు ఉన్నాయి. ఒక్కొక్క ఋతువు యొక్క లక్షణం తెలియాలి, దాని స్వభావం తెలియాలి. దానితో మనం ఎట్లా అనుసంధానం చేసుకోవాలో తెలియాలి. దాని ప్రకారం జీవించాలి. అలా జీవిస్తే జ్యోతిష్చక్రం దర్శనమిస్తుంది. అది జ్యోతిష్చక్రం అనడంలో ఉద్దేశం ఏమిటంటే 'వెలుగు చక్రం' అని చెప్పడం. జ్యోతి అంటే ఏమిటి? వెలుగు కదా! కాబట్టి జ్యోతి యొక్క చక్రము, అది 12 రకాలుగా నిన్ను సమీపిస్తుంది కాలం రూపంలో. దానితో నువ్వు ఎంత అనుసంధానం చెందితే నువ్వంత తరిస్తావు. ఏం లేదు అవగాహన చేసుకుని దానితో tune up అవ్వడమే! అది ఎట్లా తిరుగుతుందో మనం కూడా దానితో పాటు తిరిగితే సరిపోతుంది. మనం ఇంకొక రకంగా తిరుగుతాం అంటే వీలుపడదు. ప్రవాహంతో పాటు వెళ్లేవాడు సుఖపడతాడు. ఎదురీదే వాడు శ్రమ పడతాడు కానీ పట్టుకుపోతూనే ఉంటుందట్లా. అందుకని కాల ప్రవాహ రూపంలో ఉండే

జ్యోతిర్మయుడైన భగవంతుని యొక్క 12 తత్త్వములు నాలుగు స్థితులుగా దిగి వస్తున్నాడు. ఏమిటి? అగ్నిగా దిగి వస్తున్నాడు, వాయువుగా దిగి వస్తున్నాడు, జలముగా దిగి వస్తున్నాడు, పృథ్వీగా దిగి వస్తున్నాడు. అసలు ఉండేది ఆకాశమే! ఈ నాలుగుగా దిగివచ్చే వాడు మళ్ళీ మూడుగా వస్తున్నాడు. ఒక్కొక్క స్థితిలోనూ మళ్ళీ మూడున్నాయి. వాయువుగా మూడు స్థితులున్నాయి, అగ్నిగా మూడు స్థితులున్నాయి, జలముగా మూడు స్థితులున్నాయి. మనలో కూడా ఉన్నాయవన్నీ. మనలో అధ్యాత్మికమైన జలము మీనరాశి అంటే శిరస్సు, పాదాలలో కూడా ఉన్నది. అలాగే విద్యుత్తు. మన భ్రూమధ్యం పైన మూడో కన్నులో ఉంది. విద్యుదాగ్ని. ఆధ్యాత్మికమైన అగ్ని. ఆధ్యాత్మికమైన వాయువు మీకు స్పందనంగా/శ్వాస గా భృకుటి యందు ఉన్నది. అధి దైవికము, ఇంకా కిందకి వెళ్ళిపోతే అధి భౌతికము. మన భృకుటి నుండి శివుడి మూడవ కన్ను వరకు అంటే వైష్ణవులు పెట్టుకుంటారు చూడండి... ఊర్ధ్వరేఖ... ఆ దారి అంతా కూడా ఆ వాయువు కు సంబంధించినది. అక్కడ తిరిగే వాళ్ళుంటారు. మార్కండేయుడు, నచికేతుడు, హనుమంతుడు. మరణం దాటి తిరిగే వాళ్లంతా ఇక్కడ తిరుగుతుంటారు. ఆధ్యాత్మికమైన వాయువు, ఆధ్యాత్మికమైన అగ్ని, ఆధ్యాత్మికమైన జలము, ఆధ్యాత్మికమైన పదార్థము... హృదయానికి, కంఠానికి మధ్యలో దాని తత్త్వం ఉన్నది. The higher aspect of matter. అక్కడి నుండి వాడికి ఏర్పడుతుంది. ఇలా మనకు నాలుగు భూతాల యొక్క అధ్యాత్మిక, అధిదైవిక, అధిభౌతికమైన స్థితులు మన శరీరం అంతా వ్యాపించి ఉన్నాయి. వాటి యందు మనకు చేతన కలగడానికి ఆయా మాసములలో అక్కడ దాని యొక్క ఎరుక కలిగి ధ్యానం చేసుకోమని చెప్తారు. ఇదే 'న్యాసవిద్య' అని ఇస్తారు. ఉదాహరణకు మేష మాసంలో ఏ గ్రహములు ఉన్నాయి చూసుకుని వాటిని భ్రూ మధ్యం పైన ధ్యానం చేసుకోవాలి. కన్నుల దగ్గర నుండి, చుబుకం వరకు ఉండే ప్రాంతం వృషభ రాశి. అందులో, దాన్ని వృషభ రాశి గాను, దాని తత్త్వం గానూ, అందులో గ్రహాలు ఉంటాయి. ఆ గ్రహాలను ధారణ చేసుకోవాలి. ఆ తరువాత మిథునం. గొంతు, భుజాలు. ఇట్లా పన్నెండు భాగాల్లోనూ, పన్నెండు రాశులను భావన చేయడం. పన్నెండు భాగాల్లోనూ పన్నెండు రాశుల్లో చరిస్తున్న గ్రహములను భావన చేయడం.

పన్నెండు రాశుల్లోనూ మనకు జన్మతః ఏ ఏ గ్రహం ఏ ఏ రాశిలో ఉందో దాన్ని ధ్యానం చేయడం. ఇట్లా మనకి రకరకములైన న్యాసవిద్యలు ఇచ్చి మొత్తం universe/ప్రపంచం అంతా ఇక్కడే ఉంది. ఇక్కడే గ్రహముల దర్శనం చేసుకోవచ్చు. ఆయన నోరు తెరిస్తే కనపడ్డాయి కదా ఆవిడకి. మనం నోరు మూసుకుని లోపల చూసుకుంటే కనపడతాయన్నమాట. ఇవన్నీ ఇట్లా న్యాసం చేసుకోమని, మాస్టరుగారు చాలా చక్కగా Master CVV అనే పుస్తకంలో ఇచ్చారు. Lessons on Yoga of Patanjali లో ఇచ్చారు. చేసుకుంటున్నవాళ్ళు ఉన్నారు. చేసుకుంటే ఏమవుతుందంటే, అవి ప్రచోదనం చెందుతాయి మనలో. అసలు శ్వాస గురించే మనం పట్టించుకోవట్లేదు. పట్టించుకుంటే అది ఇంకా విజృంభిస్తుంది. ఓ కుక్క ఉంది. దాన్ని పట్టించుకోకపోతే ఏముండదు. పట్టించుకుంటే తోకాడించుకుంటూ వచ్చేస్తుంది. అట్లా దేనియందు మనం ఎరుక కలుగుతామో అది మనయందు ఎక్కువ ప్రచోదనం చెందుతూ ఉంటుంది. అందుకని ఈ శ్లోకంలో మనకి ద్వాదశ భావములు అందిస్తున్నారా అన్న ఒక భావన మీకు నేను ఇక్కడ ప్రస్తుతి చేస్తున్నాను. అది కారణంగా మనకి వేదాంగాలలో ఈ జ్యోతిషం చాలా ప్రధానం ఔతుంది. అంటే మనకి పెళ్ళిళ్ళు అవుతాయా, ఉద్యోగాలొస్తాయా, డబ్బులెప్పుడు వస్తాయి, ఏలినాటి శని ఎప్పుడు, ఇవి కాదు. ఇవి కాకుండా ఇంకొక పద్ధతి ఉంది. జ్యోతిర్మార్గమును మనం అనుసరించడానికి, చక్రంలో అట్లా గిరగిరగిర కళ్ళు తిరిగేటట్టు తిరిగిపోకుండా. మూడుసార్లు త్రాహిమాం కృపయా దేవీ అని తిరిగితే తరువాత కళ్ళు తిరుగుతాయి మనకి. ఒక క్షణం నిలబడితే కానీ, లేకపోతే పడిపోతాం. అందులో BP ఉండేవాళ్ళు తప్పకుండా, కాసేపు నిలబడాలి. వెంటనే ఏదో చేద్దాం అనుకోకూడదు. అటువంటిదది. చక్రం ఎట్లా తిప్పుతోంది, తల తిరిగేంత తిప్పుతోంది. ఇందులో జ్యోతి ఉందంటున్నాడు. అది జ్యోతిశ్చక్రం అంటున్నాడు. ఉత్త బండి చక్రం అనడంలేదు. కాబట్టి దాన్ని పొందాలంటే వాళ్లేమన్నారంటే, మనిషికి కన్ను ఎంత ఉపయోగమో, ఆధ్యాత్మిక మార్గంలో జ్యోతిషం అంత ఉపయోగం అని చెప్పారు. ఆధ్యాత్మికంగా నువ్వు ముందుకు వెళ్లాలనుకుంటే, నీకు కాలం యొక్క స్వరూప స్వభావములు తెలియాలి కదా. కాబట్టి అట్లా ఆ స్వరూపం మనం

తెలుసుకోవడానికి కూడా ప్రయత్నం చేయాలి. మన ఉత్సాహం పెరుగుతున్న కొద్దీ తెలుసుకోవాలనిపిస్తుందండీ! తెలుసుకున్న కొద్దీ మామూలుగా, చిల్లర సరుకు భావాల్లో ఉండేవాళ్ళం, వెలుగు భావాల్లోకి పెరుగుతాం. అందుకూ ఇదంతా! విజ్ఞానమంతా దేనికయ్యా అంటే, వెలుగు లోకాల్లో కాసేపు జీవించడం కోసం. మనం మాట్లాడుకున్నంత సేపు ఏవో పిచ్చి మాటలు ఉండవు కదా. వాడి గురించి, వీడి గురించి చెప్పకోం కదా. ఒకళ్ళనొకళ్ళు చూస్తుంటే లోపల నుండి అట్లా ఊహల ఊటలు రావు కదా. ఈ ఊటలో ఉంటాం. కాబట్టి అంతసేపూ అట్లా మనకి ప్రశాంతంగా ఉంటుంది. మనకి బాగా గందరగోళంగా ఉండే ప్రజ్ఞ, కాసేపు అట్లా ప్రశాంతంగా ఉంటుంది. దాని continuation ఏమిటి? గ్రంథ పఠనం. రోజూ గ్రంథం పఠించడం, స్తోత్రాలు చేయడం, ఇటువంటివి వినటం, ఇటువంటివి తెలిసిన వారి దగ్గర చేరడం, ఇట్లా ఇది ఒక లోకంగా మనకి ఏర్పడడం, మనలోకం మనది. ఏమొస్తుందడీ? అంటే వాడికి అట్లాగే ఉంటుంది. వాడు అందులో ఉంటాడు. ఎందుకు వస్తారు, ఎందుకు వింటారు, ఇట్లా ఎందుకు తిరుగుతారు ఆరాటంగా అంటే, ఆ లోకంలో కి వెళ్ళడానికి ప్రయత్నం. ఆ లోకం ఏమిటి? మనోమయ లోకం కన్నా ఒక మెట్టు పైన ఉన్న లోకం. విజ్ఞానమయ లోకం. అంటే వెలుగు దగ్గరకి వచ్చాం. వెలుగు దగ్గరకి వస్తే, ఎక్కడ నుండి వెలుగు వస్తోందో, అది కనిపిస్తుంది. ఎండలోకి వెళ్తే సూర్యుడు కనపడడూ, కనిపిస్తాడా? నీడలో ఉంటే కనపడడు. ఉన్న స్థితి నుండి మెరుగైన స్థితికి రావడం కోసం మనం ఈ నామాలు చెప్పకున్నాం. ఏదో గంట సేపు అన్నా మన సహజ స్థితి నుండి బయటపడ్డాం. గంటో గంటన్నరో ఇది చెప్పకున్నంతసేపు మనకు ఏం జరుగుతుంది అంటే, మనకు ఒక వెనుకటి గుణం ఉన్నది కదా, అది మన వెనకాలే ఉంటుంది ఎప్పుడు, class అవగానే ముందుకు వస్తుంది. వెనకటి గుణమేల మానును, కదరా సుమతి అన్నారు కదా! ఏదో అందులో నుండి ఒక గంటన్నర ప్రతిసారి ఇట్లా బయటకు వస్తూ ఉంటాం. ఇది నెమ్మదిగా అందులో నుండి ఒక రుచి వచ్చింది అనుకోండి ఏదో ఇంకోటి చదువుతాం ఇంకోటి చదువుతాం, ఇంకోటి చెప్పకుంటాం. ఇట్లా జీవిస్తుంటే ఇది పెరగడం వల్ల అది తరిగి, ఇందులోకి తెలియకుండానే మనం ఒక మెట్టు ఎక్కినవాళ్లమౌతాము. అందుకని ఈ జిజ్ఞాస!

జ్ఞానమునందు జిజ్ఞాస ఒక అదృష్టం, ఒక పూర్వజన్మ సుకృతం. దాన్ని పెంచుకుంటూ పోతూ ఉంటే, మిగతా విషయం నందు రుచి పోతుంది. పోవడం చేత ఇందులో ఇముడుతాం. ఇమిడితే ఏమవుతుంది అంటే ఇది ఒక మహా ప్రపంచం. విజ్ఞాన లోకం అంతులేనిది. ఇంక ఎటూ పోలేం. ఒక దాంట్లో నుండి ఒకదాంట్లో, ఒక దాంట్లో నుండి ఒక దాంట్లో అట్లా తెలుసుకుందాం తెలుసుకుందామని, నిన్ను ఆ ఉత్తమమైన వెలుగుకు సంబంధించిన భావాలలో కట్టిపడేస్తాయి. ఇంక అక్కడ నుండి మెట్లు దొరుకుతాయి. సోపానాలు దొరుకుతాయి. ముందు అసలు ఈ బురదలో నుండి బయటకు రావాలి. మీ అందరి సహకారంగా ఈ కార్యక్రమము ఇలా జరిగింది. ఈ విధంగా ఈ సహస్రనామానికి కూడా చివరి శ్లోకానికి నాలుగు రకాలుగా ఉండడం వల్ల ఉత్తమం. సహస్ర అనే నామము ఒక మహా మంత్రం. సహస్ర అంకె 1000, అంటే ఒకటి మూడు గా దిగి రావడం. అటువంటిది నాలుగు సార్లుగా రావడం వల్ల ద్వాదశ భావము చెప్పకోవాలేమో అని, ద్వాదశ భావములు, ద్వాదశ రాశులు, అవి నిజానికి నాలుగు స్థితులలో మూడుగా ఉన్నాయి అని మనం వివరించుకోవడం జరిగింది.

ఇక్కడితో మనకి ఈ కార్యక్రమము అయినది. రేపు విష్ణు సహస్రనామం చదువుకుంటూ ఉంటే బాగుంటుంది అని మళ్ళీ ఒక్కసారి మనం గుర్తు చేసుకోవాలి. అంటే ఫల శ్రుతి అన్నమాట. రేపు అంతరంగ సభ. ఎల్లుండి బహిరంగ సభ. రేపు గుట్టు, ఎల్లుండి రట్టు. రట్టు చేసేసి విష్ణు సహస్రనామం మాత్రం మర్చిపోకుండా continue చేసుకోవాలి. అది వదిలేయవద్దు. సభ మర్చిపోవాలి. విష్ణువు గుర్తుండి పోవాలి, విష్ణువు మిగిలిపోవాలి. ఈ విష్ణు సహస్రనామం విన్న వాళ్ళందరూ ఇందులో నుండి మనం తయారు చేయకుండా ఏర్పడిన బృందం ఒకటి ఉంది. తయారు చేస్తే మగవాడు వండినట్లే ఉంటుంది. అదే వండబడింది కాబట్టి, కొన్ని కొన్ని ఏమన్నా మనం బృందంగా చేద్దామనుకున్నవి, అందులో నుండి మనం చేసుకునేటట్టుగా ఉదాహరణకి నెలకు ఒకసారో, మూడు నెలలకు ఒకసారో, ఆరు నెలలకు ఒకసారో, లేదా సంవత్సరానికి ఒకసారో అందరం కలిసి సింహాచలం వెళ్దాం, అక్కడ విష్ణు సహస్రనామం చదువుకోవడం. ఇట్లాంటివి చేస్తూ ఉండడం. విష్ణువు పేరున ఏదన్నా కొన్ని మంచి పనులు

చేయడం. చేయడానికి ఏముంది అంటే బోలెడు ఉంటాయి. ఎందుకు చేయాలి? ఇందులో ఉండడం కోసం. ఇంక వేరే ఉద్దేశం లేదు. ఎందుకంటే మనకు తెలుసు కదా మన సహజ లక్షణాలు కొన్ని ఉన్నాయి కాబట్టి అవి మీద పడకుండా ఉండడం కోసం, ఏవో కొన్ని కొన్ని అప్పుడప్పుడు కొద్ది కొద్దిగా గుర్తు తెచ్చుకోవడానికి పనికొస్తాయి. అందుకని అట్లా చేస్తాం.

ఫలశ్రుతి

విష్ణు సహస్రనామ పారాయణము, వివరణము, ఈ రెండూ మనకు భగవదనుగ్రహంగా, మనము నమ్మిన గురుపరంపర ఆశీర్వచనముగా పరిపూర్తి అయినాయి. కొన్ని మూలమైన సూత్రాలను మళ్లీ గుర్తు చేసుకుందాం. అయిపోయింది కాబట్టి వదిలేయడమని కాకుండా ఉండడం కోసం. విష్ణు సహస్రనామ పారాయణ ఒక ధ్యానం వంటిది. ఇది ఒక తంత్రం. తంత్రం యెందుకు అయ్యిందంటే ఇందులో యంత్రముగా మనకు చతుర్భుజుడు అయిన, మనోహరమైన, వెలుగులు విరజిమ్ముతున్న విష్ణువు యొక్క రూపమే ఇక్కడ యంత్రం. వెనక ఆదిశేషుడు ఒక గొడుగు వలె ఛత్రము వలె ఏర్పడి, మణిమయ కాంతులను విరజిమ్ముతున్న కిరీటము కలిగి ఉండి, అర్ధ చంద్రాకారముగా ఫాలభాగముండి, దానియందు ఒక ఊర్ధ్వముఖమైన నామము/ తిరుచూర్ణము వుండి, విశాలమైన కనులు కలిగి, కిరీటము నుండి బయటకు వచ్చే ముంగురులు గాలికి కదలాడుతున్నట్లుగా, అవి చెంపల మీద నాట్యం చేస్తున్నట్లుగా భావన చేసుకుంటూ ఈ విశాల నేత్రములు బాగా తెరవబడి ఉండడం చేత పద్మముల వలె వికసించి ఉన్నట్లుగాను, మందహాసమును, కాంతిని, అనుగ్రహమును, ప్రేమను వెదజల్లుతున్నట్లుగా భావన చేసుకోవడం, అందమైన నాసికను భావన చేయడం, చెక్కిళ్ళను భావన చేయడం, కపోలములను భావన చేయడం, చెవులను భావన చేయడం, వాటికి ఉన్న కుండలములను భావన చేయడం, పెదవులను భావన చేయడం, చిరుదరహాసము కలిగిన మూర్తిగా భావన చేయడం, అలా భావన చేస్తున్నప్పుడు ఆయన యొక్క పలువరుస లోంచి కాంతులు వెదజల్లబడుతున్నట్లుగా భావన చేయడం, ఆ తరువాత మెడను భావన చేయడం, భుజములను భావన చేయడం, భుజములకు ఉన్న ఆభరణములను భావన చేయడం ఒక్కొక్క బాహువును భావన చేయడం, సుకుమారమైన వేళ్ళను భావన చేయడం, ఆ హస్తములు పట్టుకున్న ఆయుధములైన శంఖమును భావన చేయడం, చక్రమును భావన చేయడం, గదను భావన చేయడం, కమలమును భావన చేయడం ఆ తర్వాత

కంఠమును భావన చేసి, కంఠము నుండి కిందగా దిగి వచ్చినప్పుడు కంఠ హారములను భావన చేసి, అంతకన్నా దిగువగా ఛాతి మీద ఉన్న శ్రీవత్సమనే పుట్టుమచ్చను భావన చేసి, కౌస్తుభమణిని భావనచేసి, మెడలోన ధరించిన వనమాలను భావన చేసి, కుక్షిని భావన చేసి, ఉదరమును భావన చేసి, నాభిని భావన చేసి, దాని చుట్టూ ఏర్పడి ఉన్న వెలుగులతో కూడిన వడ్డాణమును భావన చేసి, అంతకన్నా దిగువకు వచ్చినప్పుడు పీతాంబరమును ధరించినట్లుగా భావన చేసి, కటి ప్రదేశమును భావన చేసి, ఊరువులు భావన చేసి, మోకాళ్లను భావన చేసి, పిక్కలను భావన చేసి, చీలమండలను భావన చేసి, పాదములు భావన చేసి, ఆ పాదములకు ఉన్న వ్రేళ్ళను భావన చేసి, వ్రేళ్ళ యొక్క గోర్ల నుండి వెదజల్లబడుతున్న కాంతి నీ ముఖమును కాంతివంతముగా చేస్తున్నట్లుగా భావన చేస్తూ.. ఇట్లా శిరస్సు నుండి పాదము వరకు, పాదముల నుండి శిరస్సు వరకు సమస్తమును దర్శనం చేస్తూ ఉండడం ఈ తంత్రంలో ఒక భాగం. నామములు ఉచ్ఛారణ చేసేటప్పుడు ఒక్కొక్క నామమును వినాలి, ఉచ్ఛారణ స్పష్టముగా ఉండాలి. ఒత్తులు బాగా పలకాలి, అక్షరములను పూర్తిగా పలకాలి, ఉన్న దీర్ఘములను మరువకూడదు అక్కరలేని దీర్ఘములను తీయకూడదు. మనం, తెలుగు వాళ్ళం అన్నిచోట్లా దీర్ఘాలు పెడతాము. ఎందుకంటే మన తెలుగు భాష అజంత భాష. అంటే అ తో అంతమయ్యే భాష. రామ్ అంటే రామా అంటాం. కృష్ణ్ అంటే కృష్ణా అంటాం. అంతవరకు ఫరవాలేదు. అట్లానే ప్రతి దానికి మనం దీర్ఘాలు చేరుస్తూ ఉంటాం. కొన్ని కొన్నిచోట్ల చేర్చడం వల్ల అర్థం మారిపోతుంది. అందుకని అక్షరము ఏమి ఉన్నదో ఆ అక్షరమును ఉన్నది ఉన్నట్లుగా స్పష్టముగా పలుకుతూ ఉన్నప్పుడే దాని ప్రభావం తెలుస్తుంది. అందుకని ఈ నామములను ఉచ్ఛారణ చేసేటప్పుడు స్పష్టత ఒకటి ఉండాలి, వినడం ఒకటి ఉండాలి, శ్రద్ధ ఒకటి ఉండాలి. ఇవి విధానమునకు సంబంధించినవి. విష్ణు సహస్రనామానికి యంత్రము విష్ణు రూపమే! అలాగే విధానము స్పష్టమైన ఉచ్ఛారణము. ఉచ్ఛారణము చేసిన నామమును వీలున్నంతవరకు తప్పక వినడానికి ప్రయత్నం చేయడం, మూడవది భక్తిశ్రద్ధలతో చేయడం. కాకతాళీయంగా చేయకూడదు. ఈ భాగాన్ని తంత్రం అంటారు. విధానమును తంత్రం అంటారు. మంత్రం నామమే! కాబట్టి

మంత్రము, తంత్రము, యంత్రము, ఈ మూడూ ఎవరి యందు బాగా భాసిస్తాయో వారు భగవంతుని యందు ఉండడానికి అర్హతను క్రమశః పొందుతాడు. ఇది ముఖ్యమైన విషయం. గుర్తుపెట్టుకోవలసినదీను. విష్ణు సహస్రనామం పారాయణ చేసే వాళ్లకు ఒక దీక్ష ఉన్నది. ఏమిటి ఆ దీక్ష అంటే తాను ఆ విష్ణు రూపమునందు పునఃప్రతిష్ఠుడై, పునఃప్రతిష్ఠుడై అని ఎందుకు చెప్తున్నానంటే అసలు ఉన్నదే ఆయనలో మనం. మనం ఏదో ఉన్నామని, వేరుగా ఉన్నామని మనం అనుకుంటున్నాం. ఆయనలో వున్న వాళ్ళమే, ఆయనలో వున్నామనే భావన ఉండడమనేది ఒక దీక్ష. మనం ఎక్కడికి వెళ్తున్నా, ఆయనలో ఉండి వెళ్తున్నాం. అంటే మన చుట్టూ ఆయన యొక్క రూపము ఆవరించి ఉన్నది అని గుర్తు ఉంటే రక్ష ఉంటుంది. ఒకటి. మనలో ఆయన ఉన్నాడు అనే భావన. ఇదే రాజ విద్య. ఆయనలో మనం ఉండడం చేత మనలో ఆయన ఉంటాడు. దీనినే చాలాసార్లు చెప్పుకున్నాం. అల సముద్రంలో ఉండడం చేత సముద్రం అలలో వుంది. ఉన్నది సముద్రమే, అలగా వ్యక్తమవుతుంది. వ్యక్తమైన అలలో కూడా సముద్రం ఉన్నది కాబట్టి ఆ అల సముద్రంలోనే ఉన్నది. అలాగ మనం ఆయనలోనే ఉన్నాము అనే భావన మనకు ఒక దీక్షగా గుర్తు వుండాలి, ఎక్కడకు వెళ్లినా. అప్పుడు మనకు భయం వుండదు. అప్పుడు రక్షణ ఉంటుంది. ఆపత్సమయములో కూడా అనుకోకుండా సహాయం లభిస్తుంది. మనము ఊహించని రీతిలో మనకు రక్షణ, సహకారము, సన్నివేశాలలో అటువంటి దీక్షలో వున్నప్పుడు లభిస్తుంది. అంతేకాదు ఆ వెలుగుల కాంతి మన యందు క్రమశః మనలో ఉన్న మలినములను రూపు బాపుతుంది. అందుకే మనము ఇది ఒక ధ్యానముగా చేసుకోవాలి. 20 నిమిషముల సేపు ఒక ధ్యానముగా విష్ణు సహస్రనామ పారాయణం చేయాలి. ఏదో గోక్కుంటూ, దిక్కులు చూసుకుంటూ, చప్పళ్ళు వస్తూ ఉంటే అటు తిరిగి, ఇటు తిరిగి... నువ్వు కళ్ళు ఒక్కసారి మూసుకుని విష్ణు సహస్రనామం చేస్తూ ఉంటే ఎంతసేపు ఆ రూప దర్శనం చేసుకుంటూ, నామములను వింటూ కూర్చోవాలి తప్ప... అటు చూసి, ఇటు చూసి, ఇక్కడ గోక్కుని, అక్కడ గోక్కుని, కళ్ళు తెరచి వాళ్ళేం చేస్తున్నారు, వీళ్ళేం చేస్తున్నారని చూసి, మధ్యలో లేచిపోయి ఇదంతా ఒక రకమైన అశ్రద్ధగా గోచరిస్తుంది. అందుకనే సహస్రనామాలు పారాయణ

చేద్దామనుకునేవాళ్ళు సగంలో లేచి వెళ్లిపోకూడదు. చెయ్యకపోవడం మంచిది అంతకన్నా. సగంలో లేచి వెళ్లిపోవడం, లేకపోతే సగంలో వచ్చి మళ్ళీ మొదలు పెట్టడం కాస్త అట్లా అట్లా వెళ్లి తిరిగి వచ్చి మళ్ళీ కూర్చోవడం, లలితా సహస్రనామం చూడండి తిరిగి వస్తూ ఉంటారు గాలి కోసం. ఇంకెందుకది చెయ్యడం? వంట సగంలో పాయ్యి ఆర్పినట్లు అయిపోతుంది. ఏమి జరుగుతుంది దాని వలన? జరుగవలసినది జరగదు, కాలము, శక్తి రెండూ వృథా అయిపోతాయి. చేస్తే చెయ్యి. అంతది చేయలేకపోతే చిన్నది తీసుకో. అష్టోత్తరం తీసుకుని చేసుకో. ఏ స్తోత్రం అయినా సగంలో లేవకూడదు. అది అపచారం. శ్రద్ధ లేక అట్లా చేస్తారు. మనకు అన్నీ ఒకటే. అదొక నిర్లక్ష్య భావన చేత ఆ విధంగా మనం ప్రవర్తిస్తూ ఉంటాం. ఒక గేదె లేచినట్లు మధ్యలో లేచి వెళ్ళిపోతూ ఉంటారు. ఒక బృందంగా మనము విష్ణు సహస్రనామం చేస్తున్నప్పుడు అందులో ఒకరు లేచి వెళ్లిపోయినా దాని వలన తేడా పడుతుంది. అలా ఉంటుంది. చేరనే కూడదు కాని ఆధ్యాత్మిక కార్యక్రమాలలో, చేరిన తర్వాత సగం లో వెళ్ళడం వలన నిన్ను నువ్వు ఎలాగూ భ్రష్టు పట్టించుకుంటావు, కాస్తో కూస్తో దాని యొక్క తేడా ఆ గుంపు పైన కాస్త ప్రభావం చూపుతుంది. అందుకనే ఉపన్యాసాలకు వచ్చేవాళ్లను కూడా ఏడు తర్వాత వస్తే బృందంలో చేరకుండా ఎక్కడో మూలగా కూర్చోమని చెప్పడం. మనుషుల మీద ద్వేషం కాదు, వారు వచ్చి ఈ మేసేవాడిని, ఏదీ నామాన్ని, (అంటే చెప్పేవాడిని) మీరు కూతలతో పాడు చేస్తారు. మనకుండే ఏకాగ్రతే అంతంతమాత్రం. ఇటు నుండి పిల్లి వెళితే మొత్తం అందరూ పిల్లినే చూస్తారు తప్ప, చెప్పేది వినరు. ఒక్కసారి చెప్పేవాడి స్ఫూర్తి హృదయం నుండి మోకాళ్ళ కిందకు వెళ్ళిపోతుంది. ఎందుకంటే శ్రద్ధ మనకు చాలా తక్కువ. ఇవి చాలా అత్యంత పవిత్రమైన విషయాలు. సాహసించి పెద్దలు మనకు అందించారు. మనము నిజంగా దీనిలో జీవించాలంటే ఈ శ్రద్ధ ఉండాలి. సహస్రనామాలు భక్తితో చేసుకోలేకపోతే అష్టోత్తరం చేసుకో. అష్టోత్తరం చేసుకోలేకపోతే ఏదో 16 నామాలు చేసుకో. కేశవ నామాలు ఉన్నాయి కదా. అవైనా శ్రద్ధగా చెయ్యి. లేకపోతే దానివల్ల ఏమీ ఫలితం ఉండదు. అందుకని ఇది ఒక మంత్రపూతమైన స్తోత్రరాజమిది. మూడే ఉన్నాయి మనకు. విష్ణు సహస్రనామము, శివ సహస్రనామము,

లలితా సహస్రనామము. ఈ మూడింటిలో లలితా సహస్రనామము, అందరూ చేయకూడదని పెద్దలు చెప్పి వున్నారు. మాస్టర్ గారు కూడా విష్ణు సహస్రనామం ఉపోద్ఘాతంలో చెప్పారు. దానికి చాలా శ్రద్ధాభక్తులు కావాలి. ఐహికమునకు సంబంధించిన వాంఛలు తీవ్రంగా ఉండే వాళ్ళు లలితాసహస్రనామం చేస్తే జీవితం చివరి భాగం లో అష్టకష్టాలు పాలవుతారు అని వ్రాశారు మాస్టర్ గారు. అది లలితా సహస్రనామంలో. అది నువ్వు చేయగలిగితే దేనికి చేయవలసి ఉంటుంది అంటే దైవం సాన్నిధ్యం కొరకు ఆ సాన్నిధ్యంలోకి ఎదుగుతూ ఉంటే, లోక శ్రేయస్సుకు నిన్ను నువ్వు సమర్పణ చేసుకోవడానికి సంసిద్ధుడవైతే, లలిత రోజూ పారాయణ చేసుకో తప్ప, ఊరికే అల్లాటప్పాగా పారాయణ చేయకూడదు. విష్ణు సహస్రనామం అంత పరుషమైనది కాదు. సరళమైనది. అందుకని చేసుకోవాలి. కానీ చేసుకుంటే ఏదైనా చేస్తే దాని ఫలితం ఉండాలి కదా. ఒక బత్తాయి పండు పెట్టారు, ఒలుచుకుని తినకపోతే ఏమిటి ఆ దుస్థితి. అందుకని అంత శ్రద్ధగా చేయాలి. శ్రద్ధ లేనిదే ఏమీ దక్కదు. ఇది కూడా అంతే. ఈ శ్రద్ధతో విష్ణు రూపం ఈపాటికి మనం ఆరేళ్ల నుండి చదువుకుంటున్నప్పుడు కనులు మూసుకుని చేసుకుంటే మరి కనులు తెరవడానికి వీలుపడకూడదు. అలా అయితే చేసుకుందాం. అలా కాకపోతే వద్దు. కోరే దీక్ష శ్రద్ధ, భక్తి! కాకతాళీయంగా ఏ పని చేయకూడదు జీవితంలో. చేసే వాళ్లకు ఏమీ అబ్బదు. ఇక్కడ కూడా అంతే. ఆ పాదముల యొక్క కాంతి అట్లా మన మీద పడుతూ ఉండాలండీ. ఆయన పాదములు మన హృదయం దగ్గర ఉండాలి. అక్కడ నుండి ఆయన పైకి అలా శిరస్సు, ఆ పైన చేతులిటు పక్క. అటు, ఇటు చూస్తే కళ్ళు మూసుకున్నప్పుడు కుడి వైపు చక్రం కనిపించాలి, ఎడమవైపు శంఖం కనిపించాలి. అంటే మీరు కాదు, ఆయన మీ దగ్గర ఉన్నాడని అర్థం. మనకు వచ్చేసినయి అనుకుంటే కష్టం, శంఖు చక్రాలు. ఆయనే నడుస్తున్నాడు. ఆయనే నడిపిస్తున్నాడు, మనం నడుస్తున్నాము. ఇది కావాలి. ఈ భావన పరిపూర్ణంగా ఉండాలి. హృదయమునందు ఆయన నిలబడి ఉన్నాడు కాబట్టి ఆ పాదముల నుంచి వ్యక్తమైన కాంతులు మన బొడ్డు ప్రదేశం వరకు కూడా ప్రసరించాలనే భావన చెయ్యాలి. మనకంతా బొడ్డు దగ్గరే. మానవ చేతన ఎక్కువ బొడ్డులో ఉంటుంది. పుట్టెడు కోరికలు కదా. కష్టాలు మనకు

బోలెడన్ని. సామాన్యమేమిటి? కలియుగంలో జీవించడం అంటే అంత సులభం కాదు. మనకు ఉండే బాధలు మనకున్నాయి కాబట్టి అక్కడ వరకు ప్రసరిస్తున్నట్లుగా భావన చేసుకోమని చెప్తారు. ఈ రహస్యం ధ్రువోపాఖ్యానంలో ఉన్నది. నారదుడు ప్రత్యేకించి ధ్రువునికి చెప్తాడు. నీలో చతుర్భుజుడైన విష్ణుమూర్తిని (ఇందాక మీకు చెప్పిన వర్ణన అంతా కూడా నాలుగైదు సార్లు వస్తుంది భాగవతంలో) అలా భావన చేసుకో, చేసుకున్నంత సేపు. అప్పుడు మనస్సు అట్లా ఊరకుక్క వలె పోదు అటు ఇటు. దీని మీదే ఉంటుంది. ఆ విధంగా భావన చేసుకుంటూ ఉంటే కాంతులు పెరుగుతాయి. కాంతులు పెరిగితే మలినములు తగ్గుతాయి. మలినములు తగ్గడమే బంధ విమోచనము. మన మలినాలు కారణంగానే మనకు బంధములేర్పడుతూ ఉంటాయి. అందుకని బంధమోచన విద్యగా విష్ణు సహస్రనామం చెప్తుంది. రోగార్తులకు రోగాలు పోతాయి, అలాగే ధనం కావలసిన వాళ్ళకు ధనం వస్తుంది, విజయం కావాల్సిన వాళ్ళకు విజయం వస్తుంది, జ్ఞానం కావలసిన వాళ్ళకు జ్ఞానం వస్తుంది, పిల్లలు కావలసిన వాళ్లకు పిల్లలు పుడతారు ఇవన్నీ అందులో అబద్ధాలు వ్రాయలేదు. మన చేత చదివించాలని వేదవ్యాసుడు అబద్ధాలు వ్రాయవలసిన అవసరం లేదు. చేయవలసిన విధానంగా చేస్తే వస్తుంది. లేకపోతే రాదు. అవన్నీ మనకు ఇచ్చారు. ఇవన్నీ మొత్తం సమగ్రంగా చూసుకుంటే మనకు ఐహికంగా ఉండే సమస్యలు పరిష్కారమై, బంధము నుండి విమోచనం చెంది, భగవంతునియందు జీవిస్తూ, సృష్టి విభూతిని అనుభవించే అర్హత కలుగుతుందని ఉద్దేశం. అందుకని ఇవ్వబడింది ఈ సహస్రనామం. అందుకని మనం చేసుకుంటూ ఉండాలి. ఆ చేసుకోవడంలో వీలుంటే ప్రాతః సమయం మంచిది. అలాగే వారములలో బుధవారం మంచిది. ఎందుకంటే మనకు మనోలోకాల్లోంచి విజ్ఞానమయ (లోకంలోకి) కోశంలోకి ప్రవేశించడానికి, మనలో బుద్ధి ప్రచోదనం జరగడానికి, బంధనములు తగ్గడానికి బుధవారం నాడు విష్ణు సహస్రనామం చేసుకోమని చెప్తారు. బుధవారానికి అధిదేవతగా (అధిష్ఠించిన దేవతగా) విష్ణువుని చెప్తారు. సోమవారం మనకు శివుడిని చెప్పినట్టుగా, మంగళవారానికి ఆంజనేయుడుని చెప్పినట్లుగా, బుధవారం విష్ణువు, గురువారం గురుడు, శుక్రవారం అమ్మవారు, శనివారం

వెంకటేశ్వర స్వామి లేకపోతే శనైశ్చరుడు, ఆదివారం సూర్యుడు ఇట్లా ఉన్నాయి. అందుకని బుధవారం ప్రత్యేకించి చేసుకోవాలి. అంటే ఎక్కువ శ్రద్ధగా చేసుకోవాలి ఆ రోజు కొంచెం విశిష్టంగా ఉంటుంది. అలాగే వారంలో బుధవారం, రోజులో ప్రాతఃసమయం, పక్షంలో ఏకాదశి, మాసంలో మార్గశీర్షము, పుష్యమాసం కూడా చాలా ముఖ్యమైనవి. అలాగని మిగతా రోజులు ఎగ్గొట్టక్కర్లేదు. ఎందుకంటే రోజూ కూడా ఉంది కాబట్టి. అప్పుడు విశేషించి చేసుకోవాలి. అప్పుడప్పుడు మీ స్ఫూర్తిని బట్టి పారాయణ చేసిన తరువాత అన్నదానం చేసుకోవచ్చు. ఒక 12 మందికి. అప్పుడప్పుడు. ఎందుకంటే అన్నీ ఒకేసారి పెట్టుకుంటే ముందు ఇబ్బంది వస్తుంది. ఒకటి గుర్తుపెట్టుకోండి, ఏ కార్యక్రమమైనా మనకు దానము వలన ఫలితం లభిస్తుందని చెప్తారు. అందుకని యజ్ఞం యాగాదులు చేసినప్పుడు కూడా చివరి అంశముగా దానం కార్యక్రమం ఉంటుంది. దక్షిణ. కదా!అందరికీ కానుకలు ఇచ్చుకోవడంగా ఉంటుంది. ఎంత మన ఆయుష్షు, మన ఆరోగ్యం కోసం చేసుకుంటున్నా విష్ణు సహస్రనామం, ఏదో కొన్ని రోజులు ప్రత్యేకంగా, శుక్ల ఏకాదశి ప్రతినెలా ఒక 12 మందికి భోజనం పెడతాను. కడుపునిండా దిట్టంగా తినే వాళ్లకు కాదు. ఆకలి తీరని వాళ్ళుంటారు, అన్నం దొరకని వాళ్ళు ఉంటారు. వారి యందు శ్రద్ధ, భక్తులతో ఇంత పెరుగన్నం, ఇంత సాంబార్ అన్నం. చాలు. సంతోషిస్తారు. ఇంకా నీకు ఓపిక ఉంటే అందరూ పెట్టే చోటు పెట్టడం కాదు, ఎవరూ పెట్టని చోట వెళ్ళి పెట్టాలి. లేకపోతే వాళ్ళు కూడా ఉన్ముఖులై ఉండరు, అందుకోవడానికి. ప్రతి వాళ్లు గురువు సాంప్రదాయంలో గురువారాన్ని బాగా ఆశ్రయించి, అందరూ గురువారమే పెడుతూ ఉంటే ఆ బిచ్చగాళ్ళ సంఘం వాళ్ళు ఒక మాట చెప్పారు. మీరు, మీరు సంప్రదించుకుని అన్ని వారాలు distribute చేయండి, వారానికి ఒక్క గురువారమే తిని మిగతా వారాలు తినకుండా బ్రతుకలేము ఒకటి, రెండవది ఎంతమంది పెడితే తింటాము గురువారం మేము మాత్రం? మాదీ పొట్టే కదా అని. అంటే నీకు నీ గురువారం, గురుతత్త్వం, నీకు నీ గురువు నిన్ను అనుగ్రహించాలన్న తపనే తప్ప ఆ జీవుడు సుఖపడాలనే తత్త్వం నీలో లేదు కదా. అందుకని వాడిలోంచి నారాయణుడు అట్లా పలికాడన్నమాట. We are already booked, we are engaged. మాకిప్పుడు ఖాళీ లేదు, మళ్లీ పెట్టండి

అంటున్నారన్నమాట. ఇంతకుముందు బిచ్చగాళ్ళు వస్తే ఇప్పుడు చెయ్యి ఖాళీ లేదు మళ్ళీ రా అనేవాళ్ళు, అట్లా ఇప్పుడు అట్నుంచి ఇటు అంటారు. అందుకని చూసుకుని ఏ రోజులో ఇది తక్కువగా జరుగుతుందో ఆరోజు పెట్టుకోండి. వీలున్నంతవరకు లేనివారికి అన్నదానము, వస్త్ర దానము. పారాయణ సామూహికంగా చేసుకుంటే మంచిది. వీలు పడితే. కుదరకపోతే ఏదో కుటుంబంలో ఉన్న నలుగురు చేసుకోవచ్చు. అది కూడా వీలుపడకపోతే ఒక్కళ్ళూ చేసుకోవచ్చు. ఈ విధంగా చేస్తూ ఉంటే చక్కటి మార్పులు మనలో కలుగుతాయి.. ఈ రోజుల్ని బాగా గుర్తుపెట్టుకోవాలి. గుర్తుపెట్టుకుని ఆరోజు బాగా చేయాలి. ఏకాదశి ప్రత్యేకముగా విష్ణుప్రీతి. బుధవారం ఆ విధంగా మళ్ళీ విష్ణుప్రీతి. మార్గశీర్షము, పుష్యము ఆ విధంగా విష్ణుప్రీతి. వసంత నవరాత్రులు విష్ణుప్రీతి. అట్లా చూసుకుని చేసుకోవాలి. ఏది ఏమైనప్పటికీ ఇక్కడి నుండి మొదలవ్వాలి అసలు మనకు విష్ణుసహస్రనామ అధ్యయనం. ఇంతవరకు పరిచయమయ్యింది అనుకుని, ఇప్పటి నుండి అధ్యయనం చేసుకుందాం. అంటే ఇప్పుడు ... మొన్న మా తమ్ముడు ఒకాయన అన్నాడు వాళ్లంతా విన్నారు కదా అన్నయ్యా, ఇప్పుడు నువ్వు quiz పెట్టకూడదా, అని. వద్దురా, అన్నాను. ఎందుకు? అన్నాడు. పెడితే నాకు నిరాశ, నిస్పృహ వచ్చేస్తుంది , అటువంటి తెలివి తక్కువ పని నేను చెయ్యను అని, చెప్పాను. అందుకని చెప్పడం కూడా ఏమిటో అది దైవసంకల్పంగా అయ్యింది. బాగా జరిగింది అంతవరకు. అంటే మనము ఉత్సవము చేసుకోబోతున్నాం కదా, మనం మిగతా వాళ్ళ కన్నా చాలా ప్రత్యేకమైన స్థితిలో ఉన్నామనే ఒక మోహంలో పడతామేమో అని, నేను ముందే బాగా కుండలు కుండలుగా చన్నీళ్లు పోసేస్తున్నాను. ఎందుకంటే విష్ణు సహస్రనామం చదువుతుంటే మరి కళ్ళు తెరుస్తున్నాం కదా, దిక్కులు చూస్తున్నాం కదా, మధ్యలో లేచి వెళ్ళిపోతున్నాం కదా, అధ్యయనం ఇంకా అవ్వలేదు. కాకపోతే ఏదో ఒక ప్రీతి లోపల దీని యందు ఉండడం చేత, అది పూర్వ సంస్కారం అవ్వడం చేత, కాలమును, ధనమును దీనికోసం వ్యయం చేయడం అనేది ప్రతి జీవి చేశాడు. నేనేముంది. ఇంట్లో ఉండి చెప్పినవాడిని. మీరంతా ఎక్కడెక్కడి నుండో వచ్చి విన్నవాళ్ళు కదా. రావడం అంటే ఒక్కొక్కళ్ళకి అది ఎంత ఖర్చుతో కూడిన పనో తెలిసిన వాడిని నేను. కాలము, ధనము రెండూ

వ్యయమయ్యింది. ఎందుకు చేసుకున్నారు. అంటే దాని మీద రుచి వున్నది. అది మంచి విషయం. ఆ రుచి అంటే వెలుగు. రుచి ఉండడం అంటే వెలుగు మీద ఆసక్తి ఉన్నదని ఇక్కడ అర్థం. దానిని పెంచుకోవాలి తప్ప గర్వపడి వున్నది ఆర్పుకోకూడదు. తృప్తి పడకూడదు. సాధకుడు ఎప్పుడూ పూర్ణ పరిణితి చెందే అంతవరకు తృప్తి పడకూడదు. తృప్తిపడ్డాడో ఇంక మరి తపస్సు ఉండదు. అందుకని విష్ణు దర్శనం అయ్యేంతవరకు తృప్తి పడకూడదండీ. ధ్రువుడు ఎట్లా చేశాడు తపస్సు. తపస్సంటే ధ్రువుడే చెప్పుకోవాలి. హిరణ్యకశిపుడు, రావణుడు... ఆ తపస్సులు మనకు వద్దు. అద్భుతమైన తపస్సు చేశాడు చిన్న పిల్లవాడిగా. ఏ విధమైన ధ్యానం చేశాడు? ఇందాక మీకు చెప్పినటువంటిదే. అది నారదుడు అతనికి ఉపదేశం చేశాడు. అంటే మనందరకీ ఉపదేశం చేశాడు. ధ్రువుడే మనందరికీ ఆధారం. ఉత్తర ధ్రువం. అక్కడి నుండే అన్నీ శింశుమార చక్రము, దాంట్లో మన సప్తర్షి మండలము, దానికన్నా దిగువుగా మరల ఉత్తర ధ్రువము, మన భూగోళము ఇవన్నీ మనకు ఉన్నాయి. ఆయనయే ఈ విధంగా నిర్వర్తించి ధ్రువ పథం చెందాడు కాబట్టి, ధ్రువము అంటే స్థిరము అని కూడా అర్థం ఉంది. మనలో కూడా అట్టి పరిపూర్ణమైన నిశ్చలత్వం కలిగేంత వరకు ఈ పారాయణ జరగాలి ఒకటి, విష్ణువు పేరున సందడి లేకుండా కొంత సేవ జరగాలి రెండు. ఒక్కొక్క నామం మళ్లీ తీసుకుని ఈ నామం గురించి మనం ఏం విన్నాం, అని దాని మీద కొంత భావన చేయాలి మూడు. ఇప్పుడు ఏదో ఒక నామం అడిగాం అనుకోండి, నాకు గుర్తు ఉండకపోవచ్చు. కదా. ఎందుకే నామాలు? ఈ నామాలు మనకిందులో యోగపరమైన దర్శనాలిచ్చినాయి, జ్ఞానపరమైన దర్శనాలిచ్చినాయి, భక్తిని కలిగించేట్లుగా కొన్ని ఉన్నాయి. స్ఫూర్తిని కలిగించేట్లుగా కొన్ని ఉన్నాయి. వైరాగ్యం కలిగించే నామాలు వచ్చినాయి. నామములు ఆధారంగా భగవత్ కథలు బోలెడు మనం ఇందులో చెప్పుకోవడం జరిగింది. భగవద్భక్తుల కథలు చెప్పుకోవడం జరిగింది. అందులోంచి సాధనాంశములను మనం మళ్లీ ప్రత్యేకంగా బయటకు తీసుకుని గుర్తు చేసుకోవడం జరిగినది. అందుకని మధ్య మధ్యలో ఇవి మనం గుర్తు చేసుకుంటూ ఉండాలి కదా. అధ్యయనం లేకపోతే గుర్తుండదు. కదా. ఇట్లా దీనిని తెలుగులో... కొనసాగించడం అంటారు. ఇప్పుడు కొన కొచ్చింది

కదా. ఆ కొన సాగిస్తూ ఉండాలి తప్ప ఇక ఇది అయిపోయింది కదా, ఇక next ఏమిటి, next ఏమిటి అంటే దీనితో పాటుగా ఉంటుంది తప్ప, ఇది వదిలేసి అది కాదు. అలా చేస్తే పెట్టిన ఇటుక తీసి మళ్లీ ఇటుక పెట్టినట్లు ఉంటుంది. ఇక భవన నిర్మాణం కాదు. ఇటుక మీద ఇటుక పేర్చుకోవాలి కదా! అందుకే దీంట్లో మీరు బాగా బలంగా తయారవ్వాలి. ఇందులో బలంగా తయారైతే అంతా ఇందులోనే ఉంది. విష్ణు సహస్రనామం ఒక పరిపూర్ణమైన స్తోత్రం. స్తవరాజం అన్నారు. అందుకని దీంట్లో గట్టి పరుచుకుంటూ ఉండాలి. మనకేంటంటే కొంత వైవిధ్యము, కొంత కొత్త రుచులు కావాలి కాబట్టి ఇంకేవైనా చెప్పకుంటే చెప్పకుంటాం. అంతమాత్రం చేత దీనిలో మనం పలచబడకూడదు. ఇన్నాళ్ళూ దీని గురించి బాగా శ్రద్ధగా వచ్చిన వాళ్ళందరికీ జ్ఞాపిక ఇద్దామనుకుంటున్నారు. ఆ జ్ఞాపిక మనం చెప్పకున్నవన్నీ గుర్తుచేయాలని నా ఉద్దేశ్యం. ఊరికే show-case లో పెట్టుకుని, వచ్చినవారందరికీ 6 సంవత్సరాలు నేను వెళ్ళాను అని చెప్పకోవడానికి కాదు. It should remind you that you should continue to study and gain the necessary steps. ఈ నామాల యొక్క లోతులన్నీ పూర్తిగా మనకు ఆకళింపు కావాలి. దానికి సంబంధించిన అనుభూతులు కూడా మనకు కలగాలి కదా. విష్ణుపరమైన అనుభూతులు కలగాలి. ఆ రుచులు లోపల పెరగాలి కదా. ఇన్నాళ్లు వచ్చారంటే లోపల రుచి ఉన్నది. లేకపోతే రారు. ఒక గట్టి ఇటుక ఉన్నది. ఇంక ఆ ఇటుకతోనే ఆగిపోకూడదు, ఇల్లు అవ్వాలి కదా. శంకుస్థాపన చేసి శంఖుస్థాపనకి ఒక ఇటిక పెడతాం అక్కడ. అంతేనా? అలా దానిని పెంపొందించుకోవాలి. మీరైనా, నేనైనా, ఎవరైనా. ఆ భావనలో జీవిస్తూ ఉండాలి. దానిని మధ్య మధ్యలో తరచి చూసుకుంటూ ఉండాలి. భక్తి కలిగిన వాళ్ళు అందుకోవచ్చు. ఏదేమైనప్పటికీ ఆ తత్త్వంలోంచి బయటపడకండి. నా చుట్టూ తిరగనక్కరలేదు. అందరం విష్ణువు చుట్టూ తిరుగుదాం. అక్కడే కలుద్దాం. అలా మనం దీనిని విస్తరింపచేసుకుందాం. బయట కాదు. లోపల! లోపల విష్ణువు విస్తారంగా పెరగాలండీ. ఎక్కడో మనం కూడా ఆయనతోపాటు ఒక నలుసల్లే ఉండాలి. అప్పుడూ మనకు ఈ పూర్ణమైన ఫలశృతి. ఇంక ఈ లోపల మనకు ఏవో చాలా వస్తూ ఉంటాయి కదా.

నష్టాలు, కష్టాలు, సమస్యలు. వాటన్నింటికీ కూడా అది ఒక్కటే మాత్ర. For anything and everything ఇదొక్కటే మాత్ర. సర్వ రోగములకు,అంటే ఏవి? భవ రోగములకు అన్నింటికీ పుట్టినందుకు, శరీరానికి వచ్చే జబ్బులకు, సంఘములో మనకు వచ్చే సమస్యలకు, ఆర్థికంగా వచ్చే సమస్యలకు, కుటుంబ పరంగా వచ్చే సమస్యలకు అన్నింటికీ ఒకటే మందు. ఇంకొక రహస్యం... మాస్టర్ గారు 1977లో విష్ణు సహస్రనామం చెబుదామని దాని వివరణ చెబుదామని ఉద్యుక్తుడవుతూ ఉంటే వాసుదేవుడు భాగవతం చెప్పించడం మొదలుపెట్టాడు. అదే సమయంలో ఇంకొకాయన వచ్చి భాగవతం చెప్పండి మాస్టర్ గారు అని, అన్నారు. అందుకని విష్ణు సహస్రనామం మాస్టర్ గారు ప్రసంగములుగా చెప్పలేదు. ఒక్కొక్క నామానికీ ఒక మూడు, నాలుగు పంక్తులుగా తెల్లవారుజామున 4:30 నుంచి 5:30 లోపల NBKV Prasad అనే ఒక సోదరుడికి ఆయన అప్పటికప్పుడు ఆ నామానికి ఒక నాలుగు పంక్తులు చెప్పేవారు. మళ్లీ ప్రార్థన, హోమియో మందులు. ఇట్లా అంతా జరుగుతూ ఉంటే మనకు సూక్ష్మంగా మాస్టర్ గారి యొక్క వివరణ ఒకటి ఏర్పడింది. ఆ ఏర్పడినది కూడా ఆ ప్రతి మాస్టర్ గారు ఉండగా అదృశ్యమయిపోయింది. అదృశ్యమయిపోయింది అంటే ఏదో మహత్యంగా అయిపోయిందనుకోకండి. మన బోటి శిష్యులు చుట్టూ ఉంటే ఏం చేస్తామంటే ఎక్కడో పెట్టి మర్చిపోతాం. ఆయన అడుగుతూ ఉంటారు, మనం వెతుకుతూ ఉంటాం. ఇట్లా జరిగింది, తర్వాత దొరికింది. దానిని మనం ముద్రణ వేసుకున్నాం. అలా అప్పుడు ప్రసంగములు జరగలేదు. మళ్లీ మాస్టర్ గారి యొక్క సంకల్పమేనేమో, మనమంతా చెప్పకున్నామని నేను అనుకుంటూ ఉంటాను. 92లో అంటే 15 ఏళ్లు సరిగ్గా. 77లో అనుకున్నది 92లో మాస్టర్ గారి కార్యమే యిది నా దృష్టిలో. అందుకని మీకు చెప్పిన విషయాలన్నింటికీ కూడా మాస్టర్ గారిని తలుచుకుని ఆయన నుంచి నాకు కలిగిన స్ఫూర్తి కారణంగా చెప్పినవే. ఎందుకంటే మాస్టరుగారప్పుడు ఎలాగూ మనం ప్రసంగాలు చెప్తాం, వివరంగా చెప్పవచ్చు అని కొన్ని కొన్ని వివరణలు ఇవ్వలేదు. అంతకుముందే చెప్పాం, అంతకుముందే చెప్పాం, అని already explained అన్నట్లుగా ఉంటాయి. అందుకని ఆయనకు పూర్తిగా నచ్చుబాటు కాక బహుశా మళ్లీ చెప్పించుకుని ఉండి ఉండవచ్చు. కానీ నా

వరకు ఆయన యొక్క స్ఫూర్తితోనే అంటే ఆయనను స్మరణ చేసుకునే మీకు చెప్పాను. అందుకని దీనిని చక్కగా అందుకుని మీరు, నేను అందరము కూడా దానిని అంతర్ముఖంగా ఇంకొంచెం విస్తరింప చేసుకుందాం. అలా చేసుకుంటే అందులో చెప్పిన ఫలశ్రుతి సత్యమవుతుంది. అలా కాకపోతే మనం యేవో చాలా చేస్తున్నాము, అందులో ఇది ఒకటవుతుంది. మనం చేసేవన్నీ కూడా ఇంతటివే. ఏ ఒక్కటీ దానియందు పూర్ణమైన ఏకాగ్రతతో చేసి తీసుకున్నట్లయితే విస్తారం జరుగుతూ ఉంటుంది. అందుకని బయటకు విస్తరించడం కన్నా, లోతుల్లోకి వెళ్ళడం యెక్కువ వినియోగపడుతుంది కాబట్టి ఈ నామం వరకు అట్లా చేద్దాం, అప్పుడప్పుడు బృందములుగా కలిసి కూడా చేసుకుంటూ ఉందాం. మీ అందరి యొక్క సహకారం వలననే ఇది ఇంత బాగా పూర్తి అయ్యింది. దీని కొన్ని బరువులు, బాధ్యతలు వహించిన వాళ్ళున్నారు. వారందరికీ మాస్టర్ గారి యొక్క ఆశీర్వచనం చాలా ఎక్కువగా ఉంటుంది. సందేహం లేదు. ఎందుకంటే ఏదైనా ఒక కార్యక్రమంలో బరువుని అందుకునే వాడి యందు భగవంతుడు ఎక్కువ మొగ్గు చూపిస్తాడు. మిగతా వాళ్ల మీద చూపించడా అండీ అంటే వారి మీద చూపిస్తాడు, వీళ్ళ యందు ఎక్కువ చూపిస్తాడు. ఎందుకంటే బాధ్యత పడ్డాడని. కాబట్టి అందరికీ ఈ రకమైన స్ఫూర్తి లోపల ఉంది కాబట్టి, ఆ స్ఫూర్తి భగవంతుని యొక్క అనుగ్రహము గానే భావన చేసి, ఆ స్ఫూర్తిని ఇంకా అంతర్ముఖంగా విస్తరింపచేసుకుందాం. ఇది మనం బాగా నిర్ధారణ చేసుకోవలసిన విషయం. దీక్ష యేమో మనం ఎక్కడ తిరుగుతున్నా ఆయనలోనే తిరుగుతున్నాం. We live in Him, we move in Him, we have our being in Him అని ఒక వాక్యం ఉన్నది. మనం ఆయన యందే తిరుగుతున్నాం, ఆయన యందే జీవిస్తున్నాం, అసలు మనం ఉండడం అంటే ఆయన ఉండడమే. అది గుర్తు ఉంటే దీక్ష బాగా ఉంటుంది. ఆ దీక్షలో ఉంటూ ఉంటే మడిగా ఉన్నట్లు. భగవంతుని యందు నేను ఉన్నాను అనే భావన ఉన్నంతసేపూ మడేనండీ. మన యందు భగవంతుడు ఉన్నాడు అనేటటువంటప్పుడు కూడా మడే. ఆ భావన లేనప్పుడు మడి లేదు, మైలే! అందుకని అన్నమాచార్యుల వారు కూడా భావము లోన, బాహ్యము నందున అన్నారు. అట్లా మనం ప్రయత్నం చేయడానికి ఒక సంకల్పం చేద్దాం.

అవుతుందో అవ్వదో మన శ్రద్ధాభక్తుల బట్టి ఉంటుంది. కాస్తో కూస్తో ఉండబట్టే ఇలా సుదీర్ఘమైన ఒక కార్యక్రమం జరగడం జరిగింది. దాన్ని బాగా పెంపొందించుకుందాం.ఆవిధంగాచేసుకుందాం.

★★★ శ్రీమన్నారాయణో విష్ణుర్వాసుదేవోఽభిరక్షతు ★★★

విష్ణు సహస్త్రనామ పారాయణ ప్రాశస్త్యము

మానవుడు తన్ను తాను పవిత్రీకరించుకుని భగవత్ అనుభూతిని పొందుటకు 'భగవంతుని యొక్క నామములను సర్వదా కొనియాడుచుండుట' అను ఒక సులభమైన మార్గమును, మనకి భగవంతుడైన శ్రీకృష్ణుడు భీష్ముని ద్వారా ఇచ్చుట జరిగినది. కలియుగములో అతి సులభమైన పద్ధతిలో భగవంతుని అనుభూతి పొందుటకు అవకాశము ఎక్కువగా వున్నదని తెలియుచున్నది. ధ్యానములు, యోగములు, తంత్రములు, మంత్రములు - ఇవన్నీ చేయగలిగిన శక్తి సామర్థ్యములు కలియుగములో మానవునికి ఉండకపోవడమే కాక, కొంత అలసత్వం, కొంత మంద బుద్ధి దానికి తోడవుట వలన, స్తోత్రాదుల తో భగవంతుని యొక్క నామములను ఎక్కువగా స్మరణము చేసుకొనుట ద్వారా, సులభముగా తన్ను తాను పవిత్రీకరించుకుని, భగవంతుని యందు నిలబడుటకు అవకాశము ఏర్పడగలదని శ్రీకృష్ణుడు ఉద్ధవునకు చెప్పుట జరిగినది.

ఆ మార్గములోనే మనకి వేదవ్యాస మహర్షి, శంకరాచార్యులవారు, ఇతర ఋషులు, రకరకములైన స్తోత్రములు యిచ్చి వున్నారు. అవి ఎంత చేసుకుంటూ ఉంటే, అంత మనయందు, మన పరిసరముల యందు వాతావరణము పరిశుద్ధి చెందుట జరుగుతుంది. ఎంత ఎక్కువగా వీలుంటే అంత ఎక్కువగా, సామూహికముగా భగవంతుని నామ పారాయణము చేసుకొనుట ఆయన మనకి ఇచ్చిన అతి ముఖ్యమైన సందేశములలో ఒకటి. దాన్ని అనుసరించి విష్ణు సహస్రనామములను కొనియాడుతూ, అవగాహన చేసుకొనుచూ, ఆ మార్గాన భగవంతుని యందు జీవించుటకు భక్తి శ్రద్ధలతో ప్రయత్నము చేయవలెను. భగవంతుని ఈ మార్గములో అనుభూతి చెందుటకు శ్రద్ధ, ఓర్పు బాగా అవసరము. ఓర్పు కలిగినకొద్దీ శ్రద్ధ పెరుగుతూ ఉండుట జరుగును. శ్రద్ధ పెరిగినకొద్ది ఓర్పు పెరుగుతూ వుండును. ఒకదానిని ఒకటి ఇలా పెంచుకొనుచూ మనము మనని పవిత్రీకరించుకొనుచూ, కాలము యొక్క ఇబ్బందులకు గురి కాకుండా భగవంతుని యొక్క రక్షణలో జీవించుటకు అవకాశము కల్పించుకోవడము అవసరము.

-కంభంపాటి పార్వతీ కుమార్